తొలినాటి తెలుగు నాటక విమర్శ

పురాణం సూరిశాస్త్రి గారి

# "నాట్యాంబుజము" & "నాట్య అశోకము"

(సంస్కరణ ప్రతి)

సంపాదకులు

ఆచార్య మొదలి నాగభూషణశర్మ

కళాతపస్వి క్రియేషన్స్



పురాణం సూరిశాస్త్రిగారు

(1888 - 1941)



శ్రీ పురాణం సూరిశాస్త్రి



సూరిశాస్త్రిగారి భార్య శ్రీమతి కనకమ్మ,
కుమారుడు శివప్రసాద్



కుమార్తె శ్రీమతి వెంకటరమణమ్మ



సువిశాలమైన విద్యానిలయ ప్రాంగణం - బందరు

తొలినాటి తెలుగు నాటక విమర్శ

## పురాణం సూరిశాస్త్రిగారి

# నాట్యాంబుజము
&
# నాట్య అశోకము

(సంస్కరణ ప్రతి)


సంపాదకులు

**ఆచార్య మొదలి నాగభూషణ శర్మ**



**కళాతపస్వి క్రియేషన్స్**

లలితా మహల్, 10/7ఎ,

అన్నై సత్యనగర్ మెయిన్ రోడ్, రామాపురం, చెన్నై - 600 089.

ఫోన్ : 044-22491939.

- పురాణం సూరిశాస్త్రిగారి **నాట్యాంబుజము & నాట్య అశోకము**
(***Nātyāmbujam*** and ***Nātya Asōkam*** : a compilation of
Sri Puranam Suri Sastry's critical works on early Telugu theatre,
edited with notes and introduction by Prof. M. Nagabhushana Sarma)

- **ప్రచురణ :** మే 2011

**ప్రతులు :** 1000

- **మూల్యం :**

**రూ. 200/-**

**U.S. $** (abroad) **20**



- **సంపాదకుని చిరునామా :**

**ఆచార్య మొదలి నాగభూషణ శర్మ**
1-8-702/32/39, పద్మ కాలనీ,
నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్ : 040-27624765, మొబైల్ : 9246103316
E-mail : modalisarma@rediffmail.com



- **డి.టి.పి. :** కె. ప్రసాద్

- **పుస్తక రూపకల్పన :**

**క్రియేటివ్ లింక్స్**
1-8-725/ఎ/1, 103 సి, బాలాజి భాగ్యనగర్ అపార్ట్‌మెంట్స్,
నల్లకుంట, హైదరాబాద్-500 044.
ఫోన్స్ : 98485 06964, 98480 65658.

- **ప్రతులకు :**

**కళాతపస్వి క్రియేషన్స్,** చెన్నై
**క్రియేటివ్ లింక్స్**
**విశాలాంధ్ర**
**ఆంధ్ర బాలానంద సంఘం,** బర్కిట్ రోడ్, టి.నగర్, చెన్నై-17
మరియు అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు

# పితృఋణం



**ఆ**దాయంపట్ల ప్రధానమైన దృష్టిలేకుండా ఒక ఆదర్శంకోసం అవతరించినది 'కళాతపస్వి క్రియేషన్స్' ప్రచురణల విభాగము. కడుపు బాధ తీరిన జీవితం గడుపుతున్న నాకు మనస్సు నిండా తృప్తినిచ్చే పని చెయ్యాలన్న ఆర్తికి కార్యరూపమే ఈ ప్రచురణలు. మాది తెనాలి. నాటక రంగాన్ని పరిపుష్టం చేసిన పెద్దలెందరో పుట్టిన పుణ్యభూమి. తెనాలిని తలుచుకోకుండా తెలుగుదేశంలో ఏ చరిత్రా సమగ్రం కాదు. కాగా, మా నాన్నగారు – మల్లాది దేవేంద్రుడుగారు స్వతహాగా నటులు. హరికథకులు. కళలో ఏమాత్రం ఔచిత్య దోషం ఉన్నా సహించని ఉగ్రావతారులు. ఆయన పుణ్యమే మమ్మల్ని ఇంత దూరం నడిపించింది, ఈ మాత్రపు కళా సౌరభాన్ని మా జీవితాల్లో నిలిపింది.

తెలుగుదేశాన్ని ప్రభావితం చేసిన మహామహులు– ఆ రోజుల్లో ముగ్గురని పెద్దలు చెప్తారు. బందరులో బ్రహ్మశ్రీ పురాణం సూరిశాస్త్రిగారు, పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రిగారు, రాజమండ్రిలో శ్రీపాద కామేశ్వరరావుగారు. వీరు ఆనాడే నాటకరంగానికి సంబంధించిన విమర్శనాత్మక రచనలు చేసినవారు. నాటకం సృష్టి. విమర్శ తుష్టి. సంపన్న కుటుంబం నుంచి వచ్చిన సూరిశాస్త్రిగారు– ఇహానికీ పరానికీ చక్కని సంస్కారయుతమైన నిచ్చెన ఏర్పాటుచేసుకున్న పుణ్య పురుషులు. ఎప్పుడో గత శతాబ్దపు రెండో దశకంలో వారు రచించిన 'నాట్యాంబుజము', 'నాట్య అశోకము' గ్రంథాలను మళ్లీ ఈ తరం నాటక ప్రియుల చేతికి అందించాలన్న ప్రయత్నమే ఈ ప్రచురణ.


దాదాపు 9 దశాబ్దాల కిందటి ఈ విమర్శన గ్రంథాన్ని కేవలం పునర్ముద్రణ చేయడమే కాక – అప్పటి వైభవాన్నీ, నాటక చరిత్రలో ఈ గ్రంథాల ప్రాధాన్యాన్నీ వివరిస్తూ ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారు సాధికారికమైన పీఠికను, అథోసూచికల ద్వారా వివరణలను రూపొందించారు. ఇది ఉద్యానవనంలో

పూలబాటలాంటిది. ఇన్నాళ్ల తర్వాత ఇలాంటి విలువైన సమాచారాన్ని పాఠకులకు అందించే అవకాశాన్ని పెద్దలు, గ్రంథకర్త పురాణం సూరిశాస్త్రిగారి మనుమలు, బ్రహ్మశ్రీ మల్లాది రామకృష్ణ శాస్త్రిగారి తనయులు అయిన నరసింహశాస్త్రిగారు మాకు ఇచ్చినందుకు వారికి మా కృతజ్ఞతలు. వారు తీర్చుకుంటున్నది పితృఋణం. నేను తీర్చుకుంటున్నదీ అదే.

సంస్కృతి, సంస్కారం నిరంతర స్రోతస్విని. తొంభై సంవత్సరాల కిందటి ఈ గ్రంథాల సమాచారం ఏ ఒక్క గ్రంథాలయంలోనైనా ఇప్పటినుండి ఒక నూరేళ్లపాటు నిలవగలిగితే– మా కృషికి చిరంజీవత్వం లభిస్తుంది. ఇదీ మా ప్రలోభం. ప్రచురణలో చక్కని విలువలను సాధించే క్రియేటివ్ లింక్స్ మాటూరి సూరిబాబు, తాళ్ల శ్రీకాంత్‌ల అండదండలు దొరకడం ఈ పుస్తకం చేసుకున్న మరొక అదృష్టం.

**4-5-2011** **మల్లాది సచ్చిదానందమూర్తి**

# శివప్రసాదం



**పు**రాణం సూరిశాస్త్రిగారు మా మాతామహులు. ఆయన అల్లుడు మల్లాది రామకృష్ణశాస్త్రిగారు మా తండ్రిగారు. సూరిశాస్త్రిగారికి ఇద్దరు పిల్లలు. పెద్దది మా అమ్మగారు – వెంకట రమణమ్మగారు. రెండవ సంతానం శివప్రసాద్. తన మూడవఏటనే పరమపదించిన ఆ చిన్నవాడి వరప్రసాదంగానే మా తాతగారు తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించారు. అందుకే ఈ సంక్షిప్త 'జ్ఞాపకమాలిక'కు 'శివప్రసాదం' అన్న పేరు.

అదివో అల్లదివో
ఆనాటి పర్ణశాల

విజయవాడ నుంచి బస్సులో వెడుతూ వుంటే బందరు సమీపంలో కనువిందుగా కనిపించే ప్రదేశం. విరబూసి అంతటా అలుముకొన్న కొండ తంగేడు పువ్వులతో ఆనాటి వైభవం చెదురుమదురైనా ఇప్పటికీ రామయ్యతండ్రి గుడి, తటాకం అలాగే కళకళలాడుతున్నాయి. పొలం పనులకు పోయేవారిని క్షేమంగా పోయిరండని ఆ సీతాపతి దీవించి పంపిస్తాడు. దప్పిగొన్న మూగజీవుల దప్పికను తీర్చి తల్లిలాగా లాలన చేస్తుంది ఆ తటాకం. ఒకప్పుడు ఈ పర్ణశాల ఆంధ్రదేశంలో ఒక ప్రధాన సంస్కృతి, విద్యా, కళాకేంద్రంగా విలసిల్లిన గురుకులం.

ఆచార్యులుగా 18 ఏళ్లు అక్కడ గడిపిన కళాప్రపూర్ణ దువ్వూరి వెంకటరమణ శాస్త్రిగారి అనుభవాలు వారి స్వీయచరిత్రలో చదువుతూంటే – నిజమే సుమా! నా చిన్నతనంలో చూశాను, కల కాదు అనిపిస్తుంటుంది.

వారి మాటల్లో –

"చిట్టిగూడూరు కాలేజీలో నేనున్న 18 ఏళ్లు ఎక్కువ కాలం తాటాకు పాకలే కాలేజీ భవనాలు, తాటాకు చాపలే ఆసనాలు. బందరు నుంచి, ఇతర స్థలాల నుంచి కొంతమంది పెద్దలు కాలేజీ చూడడానికి వస్తూవుండేవారు. నియమబద్ధంగా శ్రద్ధాసక్తులతో జరుగుతున్న చదువుసంధ్యల తీరు చూసి సంతోషించి

వెళ్లేవారు. ఎవరు వచ్చినా పాకలో పాఠాలన్న చిన్నతనం మాకుండేది కాదు చిన్నచూపు వారికుండేది కాదు.

కాలేజీ ఆరంభించిన కొంతకాలానికి చిట్టిగూడూరుకు రమారమి రెండు మైళ్ల దూరంలో 'పర్ణశాల' అన్న పేరుతో పొలాల్లో వినోదంగా కట్టిన చిన్న చిన్న భవనాలు, బందరు వాస్తవ్యులు పురాణం సూరిశాస్త్రిగారు కాలేజికి దానం చేశారు. కోరి వారు ఇచ్చినదీ ఇష్టపడి మనం పుచ్చుకున్నదీ గనక వాటిని ఉపయోగించు కోవడం ఉచితమనే దృష్టితో అక్కడ క్లాసులు నడిపించాము. ప్రతి రోజూ పండితులకు రెండు మైళ్ల నడక శ్రమగా వుంటుందని మా అందరికీ కొత్త సైకిళ్లు తెప్పించి యిచ్చారు.

కాలేజీకి 'పర్ణశాల' భవనాలు ఇచ్చిన పురాణం సూరిశాస్త్రిగారి మకాం బందరులో. వారిది చాలా సంపన్న కుటుంబం. ఆయనతో మా కాలేజీ వారందరికీ చాలా సన్నిహితమైన స్నేహం వుండేది. ఆయన తండ్రిగారు చాలా ఆస్తి సంపాదించారు. కొడుక్కి అప్పగించారు. ఈ సూరిశాస్త్రిగారు బి.ఏ. పాసయి అంతటితో చదువు ఆపేసి తండ్రిగారిచ్చిన ఆస్తి అనుభవిస్తూ రకరకాల ఖర్చులు పెడుతూ దిల్కుషీగా జీవితం గడిపిన వ్యక్తి. సాహిత్యాభిరుచి కూడా ఉండేది. 'నాట్యాంబుజము' అనీ 'నాట్యోత్పలం' అనీ యింకా ఏవేవో కొన్ని పుస్తకాలు కూడా వ్రాశారు. ఏమయినా ఆటపాటలన్నా, నాటకాలన్నా ఎక్కువ అభిరుచి. ఆయన తరుచూ 'పర్ణశాల'కు వస్తూవుండేవారు. వచ్చి మా అందరితో ఏవో ప్రసంగాలు చర్చలూ చేస్తుండేవారు."

ఆయన జీవితంలో అద్భుతమైన, మానవాతీతమైన మలుపులు, దీక్ష, త్యాగ నిబద్ధతలు వున్నాయి. ఆయన బుద్ధపూర్ణిమనాడు పుట్టారు. బుద్ధుడు ఆయన నేస్తం. రాముడు ఆయన దైవం. హారతి కర్పూరంలా వెలుగుతూ పరులకు దారి చూపడమే ఆయన జీవితలక్ష్యం. వారికి చిన్నతనంలోనే మనస్సుకి రెండు 'పిచ్చ'లు పట్టుకున్నవి. ఎప్పుడూ రాముడి తలపే. రేపు చస్తానేమో? మనం చేయవలసిన పనులు పూర్తి కావేమో? అనే ఆలోచనే. ఇది పుట్టిన తరవాత అపరిమితంగా బలం కలిగింది. ఎన్ని గంటలు పనిచేసినా విసుగుండదు. ఎప్పుడూ చదవడం, చూడటం, వ్రాయడం.

అంతేకాదు. మనిషికి పెద్దలు విధించిన మూడు ఋణాలు – పితృరుణం, దేవరుణం, మానవరుణం తీర్చుకొని సుఖంగా చనిపోవాలనేదే ఆయన కోరిక. తీర్థయాత్రలు చేసి పితృరుణం, రామమందిరం కట్టించి దేవరుణం, విద్యాదానంతో

ఋషిరుణం తీర్చుకున్నారు. విద్యానిలయం – ఆనాటి సరస్వతీ దేవి ఆవాసంగా లలితకళలకు అంకితం చేసిన ఆంధ్ర సేవకుడు. ఈ ఆంధ్రభోజుడు మా మాతామహుడు. ఇంటిపేరే పురాణం అయినా, చూపులకు వామనుడుగా కన్పించినా ఆయన పూర్ణ పురుషుడు, దానకర్ణుడు.

మా తాతగారు బ్రహ్మశ్రీ వేదమూర్తులయిన పురాణం సూరిశాస్త్రిగారిని గురించి ఆత్మీయుడు పాతూరి శ్రీరామశాస్త్రి విజ్ఞానసర్వస్వంలో సవివరంగా, సుదీర్ఘమైన రచన చేశాడు. ఆయన గొప్పతనాన్ని క్రోడీకరిస్తూ శ్రీరామశాస్త్రిగారు అన్న మాటలు యివి : "సూరిశాస్త్రిగారు మేధావి, రచయిత, విద్యాకళాపోషకుడు, విమర్శకుడు, భక్తుడు, త్యాగి మాత్రమేకాక జీవితమాధుర్యాన్ని, రసానుభూతిని అన్ని కోణాలనుంచి అనుభవించిన భోగి."

సూరిశాస్త్రిగారు రసాయనశాస్త్రంలో పట్టభద్రులు. అయినా కాశీనాథుని నాగేశ్వరరావుగారి సంపాదకత్వంలో వెలువడిన విజ్ఞానసర్వస్వంలో "అంగారక గ్రహం" మీద ఉత్తమ వ్యాసాన్ని వెలువరించారు. తెలుగునాటక విమర్శకు పునాదులు వేశారు. నాటకవిమర్శతో పాటు కావ్యవిమర్శను ఆ రెంటితోపాటు విమర్శక సూత్రాలను నిర్వచిస్తూ విమర్శకపారిజాతాన్ని వ్రాశారు.

ఆయన కట్టించుకున్న ఇంటిపేరు "విద్యానిలయం". అందులో కళలు, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రాలలో ఎంపిక చేసిన పుస్తకాలతో ఒక విశిష్ట గ్రంథాలయం ఉండేది. తెలుగు కవులు పింగళి లక్ష్మీకాంతం, అబ్బూరి రామకృష్ణరావు ; ఇంగ్లీషు కవులు వి.యన్.భూషణ్, సోమనాథ్ వెల్లటూర్ ; నటులు నెల్లూరు నాగరాజరావు, ముంజులూరి కృష్ణారావు; సంగీత విద్వాంసులు హరినాగభూషణం, గరికపర్తి కోటయ్యదేవర, వీరందరితో పాటు మధుర భావుకుడు, కవి, కథారచయిత, ఆయన అల్లుడు అయిన మల్లాది రామకృష్ణశాస్త్రి మొదలైనవారు ఆ యింటిలో జరిగే కవి పండిత గోష్ఠులలో పాల్గొంటూ "విద్యానిలయం" – అన్న పేరును సార్థకం చేశారు.

1920లో ఒక సంవత్సరం పాటు సకుటుంబంగా కాశ్మీరునుంచి కన్యాకుమారి మీదుగా సింహళం వరకు అఖిలభారత పర్యటన చేసి శ్రీరామ నవమికి యిల్లు చేరి రాములవారికి కల్యాణం జరిపించారు. ప్రఖ్యాత సంస్కృత విద్వాంసులు శ్రీ యస్.జి.టి.వరదాచార్యులుగారిని ప్రోత్సహించి చిట్టిగూడూరులో సంస్కృత కళాశాల ప్రారంభానికి కారకులైనారు. బందరుకు ఆరు మైళ్ల దూరంలో విజయవాడ రోడ్డును ఆనుకొని వున్న తరకటూరులో పర్ణశాల స్థాపించిన సంగతి

చెప్పానుగా! ఆ విద్యాకేంద్రంలో ఒక తటాకం, దానికి ఒక ప్రక్క రామాలయం, మరొక ప్రక్క శివాలయం కట్టించారు. పర్ణశాలలో పరమపదించిన తన కుమారుని పేర సంస్కృతవిద్యాలయంగా శివప్రసాద్ పాఠశాలను స్థాపించారు. సూరిశాస్త్రిగారి ఇంటికెదురు వరుసల్లో అర్థాష్టభుజిముఖంలో తెలుగువారికి భక్తి మార్గాన్ని బోధించిన త్రిమూర్తులు, బమ్మెర పోతరాజు, కంచెర్ల గోపరాజు, కాకర్ల త్యాగరాజుగార్ల పేర్లను చెక్కించి 'తులసి' అనే భవనాన్ని చెక్కించారు. ఆ 'తులసి' గృహప్రవేశ సందర్భంగా వేదాలలోని సారాన్ని పామరులకు కూడా తెలియచెప్పడానికి ప్రఖ్యాత వేద పండితులు ఉప్పులూరి గణపతి శాస్త్రిగారిని పిలిపించి మూడు నెలలపాటు వేదాలమీద ఉపన్యాసాలు చెప్పించారు. (ఈ విషయాలు పాతూరి శ్రీరామశాస్త్రి గారు తమ వ్యాసంలో ఉటంకించారు.) అటువంటివాడు మా తాతగారు.

పర్ణశాలలో ఆ సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాములను దర్శించుకుంటూ, విద్యానిలయంలో చదువు సంధ్యలతో, ఆటపాటలతో ఆనందమయంగా గడచిపోవడం, వొంటిమీదికి 88 ఏళ్లు వచ్చినా ఫలానివారి మనవడివా, మల్లాది రామకృష్ణశాస్త్రిగారి కుమారుడివా' అనిపించుకోవడం నా అదృష్టం.

ఆ దివ్యాత్మలు మామా అల్లుళ్లకు వారు దివ్యకళామయంగా వెలిగించిన శివజ్యోతిని కళ్లకు అద్దుకుంటూ, యజ్ఞకర్తగా బాధ్యత వహించిన సహృదయ సోదరులు మల్లాది సచ్చిదానంద మూర్తిగారికి, సూత్రధారుడుగా మా బావ మొదలి నాగభూషణశర్మకు ప్రేక్షకపాత్రలో నా అభినందనలు, ఆశీస్సులు అందజేస్తున్నాను.

నా కల నిజమైంది. రూపురేఖలు దిద్దుకొని పుస్తకపాణి సరస్వతీదేవిని ఈ విధంగా దర్శించే భాగ్యం కలిగింది. ఈ నాటకానికి పరబ్రహ్మ పరమేశ్వర పాడి ఆసాంతం సుఖప్రదంగా మంగళం పాడిన ఆత్మీయులు మాటూరి సూరిబాబు, శ్రీకాంత్‌లకు ముమ్ముందు వీరు చేపట్టే ప్రతి ప్రచురణా కార్యక్రమంలోనూ యితరులకు మార్గదర్శకత్వం వహించే ప్రతిభాపాటవం కలగాలని ఆ వాగ్దేవిని అర్థిస్తూ 'నానాటిబ్రతుకు నాటకము' అన్న అన్నమయ్యకు, ఆ పరమార్థాన్ని మా మాతామహుల యీ గ్రంథంలో చూడబోతున్న పాఠకమహాశయులకు...

ఆ వేంకటపతి ఆశీస్సులు.

విధేయుడు

**మల్లాది నరసింహశాస్త్రి**

# తొలి తెలుగు నాటకరంగ విమర్శకుడు
# శ్రీ పురాణం సూరిశాస్త్రి

### ఆచార్య మొదలి నాగభూషణశర్మ

**నా**టకాన్ని 'సర్వకళా సమ్మేళనం' అనీ, 'సమాహారకళ' అనీ అంటారు. అన్ని లలితకళలు, ప్రదర్శక కళలు నాటకంలో అంతర్లీనమై వుంటాయని దాని భావం. ఈ కళలన్నింటినీ అందమైన ముత్యాలపేరులా కలిపి వుంచడానికి పాఠ్యం (సాహిత్యం) అనే జలతారుదారం ఉంటుంది. ఇన్నికళల అర్థవంతమైన మేళవింపు జరిగితేనేగాని రాసినవాడికి, వేసినవాడికి, చూసినవాడికి ఆనందాన్నిచ్చే ప్రక్రియకాలేదు నాటకం. మిగిలిన ఏ సాహితీమాధ్యమానికి లేని రెండు ప్రత్యేకతలున్నాయి నాటకానికి. ఒకటి, ఇది 'నిత్యవర్తమానం'లోనే రాయబడడం. కథ ఎప్పటిదయినా, ఎక్కడ జరిగినా – ఇప్పుడు, ఇక్కడ జరుగుతున్నట్లుగా ప్రదర్శించడం. రెండోది – ఇది 'ప్రాణవంతమైన మాధ్యమం' (live medium) కావడం. మనలాంటి వ్యక్తులే మనముందుకు వచ్చి ఒకకథను దృశ్యమానం చేయడం, వేసేవాళ్లు నేరుగా చూసేవాళ్లముందు ఒక పాఠ్యాన్ని ప్రదర్శించడం–ఈ ప్రత్యక్ష అనుభవం నాటకానికి, దానిని ప్రదర్శించడానికి కూడా ఒక విశిష్టతను ఆపాదించింది. ఈ కారణాలవల్ల నాటకాన్ని వివేచించడం, విమర్శించడం సంక్లిష్టమైన శాస్త్రచర్చ అయింది. తెలుగులో ఆ నాటక శాస్త్రచర్చకు లక్ష్య, ప్రమాణాలను అందించే రచనలు చేసిన వ్యక్తి పురాణం సూరిశాస్త్రిగారు.

తెలుగు నాటక విమర్శ శైశవదశ దాటి యౌవన ప్రాదుర్భావాలు సంతరించుకున్నది సూరిశాస్త్రిగారి విమర్శనగ్రంథాల ద్వారానే. ప్రాచ్య, పాశ్చాత్య విమర్శన చరిత్రలను, వాటితోపాటు ప్రపంచ నాటక చరిత్ర రీతులను ఆకళింపుచేసుకొన్న తరువాతనే సూరిశాస్త్రిగారు తమ విమర్శనాప్రస్థానాన్ని ప్రారంభించారు. తాను 'చూసిన' నాటకాలను గురించి, 'చూసిన' నటులను గురించి మాత్రమే రాస్తున్నానని చెప్పిన ధీశాలి ఆయన. నాటకానికి రచనా ప్రమాణాలెంత ముఖ్యమో, ప్రదర్శనా ప్రమాణాలు అంతే ముఖ్యమని నమ్మి రచన, ప్రదర్శనలు నాటక విమర్శకు రెండుకళ్లని భావించిన నిజమైన నాటకరంగ అధ్యయనశీలి ఆయన. అంతవరకు వేరువేరుగా నాటకరచనను గురించి విమర్శలు,

నాటకప్రదర్శనల సమీక్షలు వస్తున్న నేపథ్యంలో నటన, రచన, ప్రదర్శనయోగ్యతల సంయోజనమే నాటకం గొప్పతనాన్ని తెలియచేయగలదని చాటి చెప్పి తెలుగులో నాటక విమర్శకు పితామహుడనదగిన స్థాయికి ఎదిగాడు. ఆయన రచనల్లో భావసౌష్టవం ఉన్నతం గొప్పగా భాషాసౌకుమార్యం ఉండదన్నది ఏ చదువరికయినా యిట్టే తెలిసిపోతుంది. తెలుగుభాషలో ఉన్న అందాల్ని, సౌకుమార్యాన్ని, మార్దవాన్ని - ఒక్కమాటలో చెప్పాలంటే, అసలు సిసలైన తెలుగుదనాన్ని - తన ప్రతి వాక్యంలోను పొదిగిన భావ భాషా శిల్పి మల్లాది రామకృష్ణశాస్త్రిగారికి-వాక్యం నడకని, పదాలపొంకాన్ని అంతగా పట్టించుకోని కేవల భావైక రచయిత మామగారు కావడం తెలుగు సాహిత్యంలో చాలా అరుదైన ఐరనీ!

నిజానికి ఆధునిక తెలుగు నాటక విమర్శ 1875వ సంవత్సరం సెప్టెంబరు 21న ప్రారంభమైనదని చెప్పవచ్చు. "జూలియస్ సీజర్" నాటకాన్ని "సీజరు చరిత్రము" అనే పేరుతో ఆసాంతమూ తేటగీతులలో రచించి దానికొక పీఠికను రాశారు వావిలాల వాసుదేవశాస్త్రిగారు - 1875 సెప్టెంబరు 21వ తేదీన. అందులో తాను అనువాదంలో అవలంభించిన పద్ధతుల్ని గురించి వివరించాడాయన. ఈవిధంగా తమతమ నాటక రచనా విధానాలను తమ గ్రంథాలకు పీఠికలుగా వెలయించడం తెలుగు నాటక విమర్శలో మొదటిదశగా గుర్తించవచ్చు. ఈ పీఠికా రచనలకు సమాంతరంగా వెలసిన "సమీక్షలు" నాటక విమర్శకు రెండో పార్శ్వంగా చెప్పుకోవచ్చు. "సీజరు చరిత్రము"ను తమ 'వివేకవర్ధిని' పత్రికలో పత్రికాధిపతులు (బహుశా కందుకూరి వీరేశలింగంగారే అయివుండవచ్చు) చేసిన సమీక్ష సద్విమర్శనా పద్ధతికి గొప్ప ఉదాహరణగా చెప్పుకోవచ్చు. (వివేకవర్ధని: రెండవ సంపుటం, అయిదవ సంచిక).

ఈవిధంగా స్వీయరచనావిధానం, నాటక రచనల సమీక్ష రెండు పార్శ్వాలుగా దాదాపు ముప్ఫయి సంవత్సరాలు కొనసాగింది. తమ నాటకగ్రంథాలకు అర్థవంతమైన పీఠికలు వెలువరించిన వారిలో ధర్మవరం రామకృష్ణమాచార్యులు, గురజాడ అప్పారావు (1897, 1909 ప్రతులకు రెండింటికీ), ఆచంట వేంకటరాయ సాంఖ్యాయనశర్మ, కోలాచలం శ్రీనివాసరావు, నాదెళ్ళ పురుషోత్తమశాస్త్రిగార్లను పేర్కొనవచ్చు. ఆయా రచయితలు తాము ఏ నాటక సమాజాలకోసం ఈ నాటకాలు రాశారో, ఆ సమాజాలను గురించి ఉటంకించడం వలన ఈ పీఠికలు రంగస్థల మర్యాదను సంతరించుకున్నాయి.

అలాగే, నాటక సమీక్షలను ప్రోత్సహించిన ఆనాటి పత్రికలలో పూండ్ల రామకృష్ణయ్యగారి "అముద్రితగ్రంథ చింతామణి" (1887), న్యాయపతి సుబ్బారావుగారి "చింతామణి" (1891), పనప్పాకం అనంతాచార్యులుగారి "వైజయంతి" (1894) ముఖ్యమైనవి. మొదటి పత్రికలో పూండ్లవారు, చింతామణిలో ఆచంట సుందరరామయ్యగారు, వైజయంతిలో పనప్పాకం శ్రీనివాసాచార్యులుగారు (సి.యస్.చార్యులు అన్న పేరుతో) విలువైన సమీక్షలను ప్రచురించారు. వీరిలో పనప్పాకంవారు నాటక సమీక్షలో ప్రదర్శనా సౌలభ్యాన్ని కూడా పరిశీలించవలసిన అగత్యాన్ని గుర్తించారు.

1895-1900 సంవత్సరాలకు ఆంధ్రదేశంలోని అన్ని పట్టణాలలోను నాటక సమాజాలు వెలిశాయి. నాటక ప్రదర్శనలను గురించి, నాటక ప్రయోగ పద్ధతులను గురించి 1900 నుంచి ఆలోచించడం ప్రారంభించారు తెలుగు నాటక విమర్శకులు. కొండిపర్తి సూర్యనారాయణరావుగారు రాసిన 'ఆంధ్రనాటక సంఘ మార్గదర్శిని' అన్న చిన్న పుస్తకం (1910) నాటక ప్రదర్శలను దృష్టిలో వుంచుకొని రాసిన మొదటి గ్రంథం అనవచ్చు. అలాగే 'సాక్షి'లో పానుగంటివారు "సారంగధర నాటక ప్రదర్శనము" (1913), "నాటక ప్రదర్శనము" (1913) అనే పేర్లతో ప్రచురించిన రెండు సాక్షి వ్యాసాలు తెలుగు నాటక ప్రదర్శనలలో చోటు చేసుకుంటున్న అనౌచిత్యాలమీద చేసిన వ్యంగ్య విమర్శ.

1913నాటికి తెలుగు నాటక విమర్శనా చరిత్రలో రెండో దశ ప్రారంభమైనదని చెప్పవచ్చు. తల్లాప్రగడ సూర్యనారాయణ రావుగారు ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలోను, పురాణం సూరిశాస్త్రిగారు "గ్రంథాలయ సర్వస్వము"లోను అదే సంవత్సరం "ఆంధ్ర రంగస్థలములు" "ఆంధ్ర నాటకములు" అన్న పేర్లతో వేరు వేరు విమర్శనా వ్యాసాలు వెలువరించారు. ఈ రెండింటిలోను వ్యాఖ్యానాత్మక విమర్శకు శ్రీకారం చుట్టారు ఆ యిద్దరూ. నాటక విమర్శకు మార్గదర్శక సూత్రాలను ఒకరు నిర్వచిస్తే ఆ సూత్రాలను తమ కాలంనాటి నాటకాలకు అన్వయింపచేసి వింగడించారు మరొకరు. వీరితోపాటు టేకుమళ్ల అచ్యుతరావు, తణికెళ్ల వీరభద్రుడు, శ్రీపాద కామేశ్వరరావు వంటి విద్యావేత్తలు నాటకాంతర్గత అంశాలయిన ఇతివృత్త నిర్వహణ, పాత్రచిత్రణ వంటి వాటిని ఆధారం చేసుకుని నాటకాలను విమర్శించారు.

ఈదశలో సమగ్రమయిన, లక్షణ సమన్వితమైన సంయోజనాత్మకమయిన

విమర్శ చేసినవాడు పురాణం సూరిశాస్త్రిగారు. ఆయన తాను అధ్యయనం చేసిన ప్రాచ్య పాశ్చాత్య నాటక సాహిత్యాలు ఆలంబనంగా, నాటకరచనారీతులను అధ్యయనం చేశారు. అలానే నటనా విధానాలకు కొన్ని ప్రాథమిక సూత్రాలను నిర్వచించి అవి ఎంతమేరకు ఏఏ నటులలో చూడవచ్చునో వివరించారు. తెలుగులో ఆనాటి ప్రఖ్యాత నటుల నటనా విధానాలమీద అనూహ్యమైన రీతిలో సుదీర్ఘమైన విమర్శలు వెలయించిన ప్రప్రథమ విమర్శకుడాయన.

శాస్త్రిగారికి సమకాలికులైన గొల్లపూడి శ్రీరామశాస్త్రి, పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి గారల రచనలు కూడా తెలుగు నాటక విమర్శను పరిపుష్టం చేసినవే! ఇదే సమయంలో విశ్వనాథ కవిరాజుగారు ప్రారంభించిన నటసభను గురించి, ఆయన చేపట్టిన "నాటకకళ" (1923) పత్రికను గురించి ఆయన తెలుగు నాటకానికి చేసిన బహుముఖ సేవను గురించి చెప్పుకోవాలి.

తరువాతి తరంలో రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి "నాటకోపన్యాసములు" (1935), వేదం వేంకటరాయశాస్త్రిగారి "భారతాభారత రూపకమర్యాదలు" (1941) తెలుగు నాటక విమర్శలో మరో కొత్త కోణాన్ని స్పృశించాయి. దువ్వూరి రామిరెడ్డిగారి "నాటక కళాసంస్కరణము" (1935) ఆనాటి నాటకాలను గురించి లోతైన వివేచన.

1943 నుంచి ప్రారంభమైన ఆధునిక తెలుగు నాటకరంగంలో నాటక విమర్శనా నిపుణులుగా పేర్కొనవలసినవారిలో శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కె.వి.గోపాలస్వామి, శ్రీనివాస చక్రవర్తి ముఖ్యులు. నాటక చరిత్రలను రాసిన మొదటితరం సాహిత్యవేత్తలలో పేర్కొనవలసిన వారు డాక్టర్ పి.యస్.ఆర్. అప్పారావుగారు, ఆ తరువాత శిష్టా రామకృష్ణశాస్త్రి ప్రభృతులు.

నాటక విమర్శలో పైన చెప్పిన పార్శ్వాలేకాక, యింకా అనేక పార్శ్వాలున్నాయి. కొందరు తమ పట్టణాలలో ఉన్న నాటక చరిత్రలను గ్రంథస్థం చేశారు. అప్పారావు, జమ్మలమడక మాధవరాయశర్మ గారి వంటి పండితులు భారతీయ నాట్యశాస్త్ర వైభవాన్ని తెలుగు వారికి చాటి చెప్పారు. ఇదే పద్ధతిలో నాటకశాస్త్ర గ్రంథాలు చాలా అనువదించబడ్డాయి. ప్రత్యేక సంచికలు వెలువడ్డాయి. వెలువడుతున్నాయి. మొదటిదానికి "పరిశోధన" పత్రిక ధర్మవరం గురజాడలమీద ప్రచురించిన ప్రత్యేకసంచికలు, రెండవదానికి ఆంధ్రనాటక కళా పరిషత్తు రజతోత్సవ సంచిక గొప్ప ఉదాహరణలు. 20 సంవత్సరాలపాటు నాట్యకళ పత్రిక తెలుగు

నాటకానికి విలువైన సేవ చేసింది. అలాగే విశ్వవిద్యాలయాలలో నాటక పరిశోధన విస్తృతంగా జరుగుతున్నది. అందులో కొన్ని ముద్రణ భాగ్యాన్ని పొందుతున్నాయి. ఆధునికులలో అనేకులు నాటక విమర్శ, సమీక్షలలో గణనీయమైన సేవచేస్తూ ఉన్నారు. ఈవిధంగా బహుముఖాలుగా విస్తరిస్తున్న తెలుగు నాటకవిమర్శకు తొలిరోజుల్లో దిశానిర్దేశం చేసిన, నాటకవిమర్శకు అవసరమైన అన్ని అంశాల సమన్వయంతో గ్రంథాలు రచించిన పురాణం సూరిశాస్త్రిగారు తరతరాల నాటక విద్యార్థులకు 'నిరంతర మార్గదర్శి'.

తెలుగునాటక విమర్శనా చరిత్రలో పురాణం సూరిశాస్త్రిగారికి ఒక విశిష్టమైన స్థానం ఉంది. ఒక సంయోజక విమర్శనా మార్గానికి (Composite theatre criticism) ఆయన ఆద్యుడు; మార్గదర్శి. ఇరవయ్యో శతాబ్దం తొలిరోజుల్లో వికసిస్తున్న ఒక సాంస్కృతిక, మేధో పునరుత్థానంలో భాగస్వామిగా, నిరంతన చింతనతో తాను నేర్చుకున్న కొత్త వైజ్ఞానికాంశాలను తన పాఠకులతో పంచుకోవాలని ఉత్సహించిన సునిశిత భావుకుడు. నిత్య అధ్యయనశీలి. తనకొక విషయం మనసుకు పడితే దానిని తోటివారితో పంచుకోవాలని తహతహలాడిన సన్మనస్వి.

ఆగర్భ శ్రీమంతుల కుటుంబంలో పుట్టి, రసాయనశాస్త్రంలో పట్టభద్రుడై, తన జీవితాన్నంతా సాహిత్యానికి, శాస్త్రచర్చకు అంకితం చేశారు సూరిశాస్త్రిగారు. ఆనాటి అవిభక్త కృష్ణాజిల్లా (అంటే ఈనాటి పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలన్నీ కలిసివున్న ప్రదేశం) అంతటిలో ఆయనే ప్రప్రథమ పట్టభద్రులట! 1888లో జన్మించారు. తన 53వ సంవత్సరంలో అంటే 1941 లో మరణించారు. ఎన్ని రాష్ట్రాలు, ప్రదేశాలు తిరిగినా బందరునే తమ కార్యస్థానంగా ఎన్నుకున్నారు. అక్కడ కళానిలయమని పేరుగాంచిన "విద్యా నిలయా"న్ని నెలకొల్పి కవి పండితగోష్టులకు దానిని కేంద్రంగా మార్చారు. ఆరోజుల్లో ఆంధ్రదేశంలో కవులు, పండితులు, శాస్త్రజ్ఞులు పురాణం వారి ఆతిథ్యం తీసుకోవడానికే బందరు వచ్చేవారని, ఆయన ఇంట్లో జరిగే నిరంతర సాహిత్యచర్చలు ఆంధ్రదేశంలోని రాజాస్థానాలలో జరిగే సాహితీగోష్ఠులకు తీసిపోయేవి కావని వినికిడి. అయితే ఆయన నాటక పక్షపాతి. సాహిత్యప్రక్రియల్లో కవిత్వం ప్రథమస్థానం వహిస్తున్న ఆరోజుల్లో – ముఖ్యంగా ఆంగ్లసాహిత్య వాసన నెరిగిన విద్యాబృందంలో నాటక చర్చకు తన కాలాన్ని వెచ్చించిన విమర్శకాగ్రేసరుడు సూరిశాస్త్రిగారు.

అంతేకాదు, ఆయన బందరు దగ్గరలోని తరకటూరులో "పర్ణశాల" అనే పేరుతో ఒక విద్యాకేంద్రాన్ని స్థాపించారు. అక్కడ చుట్టూ పర్ణశాలలను కట్టించి, ఆ ప్రక్కనే క్రీడలకు ('ఈత'ను ఒక క్రీడగా గుర్తించిన వ్యక్తి ఆయన) ఒక తటాకాన్ని నిర్మించారు. ఉపాధ్యాయులకు విద్యార్థులతోపాటే ఇళ్లు కట్టించి అక్కడే వుండే ఏర్పాట్లు చేశారు. ఒక ఆరుబయలు నాటకశాలను నిర్మించారు. ఇంత పరిపుష్టమైన రెసిడెన్షియల్ విద్యాలయాన్ని ఆనాడే రూపొందించడం ఆయన సర్వతోముఖమైన భావనకు, భావిదర్శనానికి నిదర్శనం.

ఆ రోజుల్లో ప్రజాజీవితంతో పెనవేసుకునిపోయిన అన్ని సంక్షేమ కార్యక్రమాలతోను ఆయనకు సన్నిహితమైన ప్రమేయం ఉన్నది. గ్రంథాలయోద్యమంలో ఉత్సాహంగా పాల్గొని కృష్ణాజిల్లా గ్రంథాలయోద్యమానికి అండగా ఉన్నారు. రైతు సంఘాల కార్యక్రమాలలో పాల్గొన్నారు. జాతీయోద్యమంలో పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహంలో సత్యాగ్రహులకు తన యింట్లో ఆశ్రయం యిచ్చినందుకు అరెస్టయి ఆరునెలలపాటు జైలు జీవితం అనుభవించారు.

పాశ్చాత్య సాహిత్యాన్ని, ముఖ్యంగా ఆంగ్ల సాహిత్యాన్ని ఆ సాహిత్య సిద్ధాంతాలను ఆకళింపు చేసుకున్నారు. తంజావూరులోని సరస్వతీమహల్ లైబ్రరీలో రెండునెలల కాలం వెచ్చించి అందులో ఉన్న తెలుగు గ్రంథాల వివరాలను సవిమర్శకంగా తెలుగువారికి అందించిన ప్రథముడాయన. చదువుకునేరోజులనుంచీ మదరాసులో ప్రదర్శించే నాటకాలన్నింటినీ చూశారు. దక్షిణదేశమంతా తిరిగి తమిళ, మళయాళ, కన్నడ, శ్రీలంకలలోని నాటక వ్యాసంగాలను కూలంకషంగా పరిశీలించారు.

ఆయనకు చిత్రలేఖనం అంటే ప్రాణమని చెప్పుకొన్నారు. చిత్రాలను గీయడం చేతకాదుకాని దానిని గురించిన వివేచన చేయడం, ఆనందించడం నేర్చుకున్నానని వ్రాసుకున్నారు.

స్వయంగా చూసి, కూలంకషంగా అధ్యయనంచేసి, తాను చూసిన చదివిన విషయాలను ఆకళింపు చేసుకొని ఆ విషయాలను తన తరంవారికి చెప్పాలన్న తహతహతో గ్రంథరచనకు పూనుకున్నారు. సాహిత్యంలో, నాటకంలో, చిత్రలేఖనంలో తనకున్న అనుభవాన్ని తనకు చేతనైన విమర్శనా మాధ్యమంలో తన తరంవాళ్లకు తరువాత తరాలవారికి తెలియచెప్పాలన్న తపన ఆయన అన్ని

రచనలకు ప్రేరణ. బహుముఖీనమైన కళాసంస్కృతుల మేళనమయిన నాటకాన్ని గురించి అంతే బహుముఖీనమైన సాంస్కృతిక మేధోసంపత్తి కలిగిన సూరిశాస్త్రిగారు ఏ రకమైన మొహమాటం లేకుండా చేసిన విమర్శలు సాంస్కృతిక పునరుత్థాన కాల సంస్కృతికి, నిజాయితీగా అద్దం పడతాయి. విస్తృత సాంస్కృతిక కళాప్రాభవం, సాహిత్యశాస్త్ర అధ్యయనం, నాటకసాహిత్యం, నాటకాప్రదర్శనల యెడ అభిరుచితో కూడిన వివేచన - ఇవీ సూరిశాస్త్రిగారి విస్తృత సాహితీ, నాటక విమర్శనా గ్రంథాలకు మూలకందం; ఆయన రచనలకు ప్రేరణ.

సూరిశాస్త్రిగారి విమర్శనా వ్యాసంగం పది పన్నెండేళ్లిలా సాగింది (1916–1927). ఆ తరువాత ఆయన దృష్టి జీవితోద్యమాలవైపు మళ్ళింది. కాని ఈ 12 సంవత్సరాలలో ఆయన ఆరుగ్రంథాలు రాశారు. "ఆంధ్రనాటక నామావళి" (1916), ''నాట్యాంబుజము'' (1923), ''నాట్యోత్పలము'' (1924), "నాట్యాశోకము" (1925–27), "విమర్శక పారిజాతము" (1925), "ఆంధ్రనాటక సంస్కరణము" (1925). ఇవికాక ఆయన నాటక వ్యాసంగం పలుముఖాల విజృంభించి, నాటకోత్సాహకులకు ప్రేరకశక్తిగా నిలిచింది. 1915–17 సంవత్సరాల మధ్యకాలంలో ఆంధ్రనాటక పరిషత్తు ప్రారంభకులలో ఒకరై, దానికి కార్యదర్శిగా ఉండి 1900–1915 మధ్యకాలంలో వచ్చిన తెలుగు నాటకాల జాబితాను తయారుచేయడమేకాక దానిని అనేక కోణాలనుంచి వింగడించి, విశ్లేషించి అప్పటివరకు వచ్చిన నాటకసాహిత్యాన్ని పట్టికల సాయంతో శాస్త్రీయంగా అధ్యయనం చేయడం ఎలాగో తరువాతి తరాలవారికి చూపించారు.

## నాట్యాంబుజము

1916 నుంచి 1922 వరకు దేశాటనం చేస్తూ, తాను చూసిన నాటకాలను నటులను అధ్యయనం చేసి తన అధ్యయనం ఆధారంగా నాటకకర్తల, నటుల, నాటక సమాజాల సేవను గురించి ఎప్పటికప్పుడు కృష్ణాపత్రికలోను, గ్రంథాలయ సర్వస్వములోను అవిచ్ఛిన్నంగా వ్యాసాలను ప్రచురిస్తూనే వచ్చారు. ఆ వ్యాసాల సంకలనమే సూరిశాస్త్రిగారి "నాట్యాంబుజం." తాను చూచిన నాటకాలను గురించి ఆ నాటకాల బాగోగులను గురించి ఎంత విస్పష్టంగా, ఎంత నిర్మొహమాటంగా రాశారో చూడనివాటిని గురించి రాయడానికి అంత నిర్మొహమాటంగాను నిరాకరించారు. ఇది ఆయన నిష్పాక్షికదృష్టికి ప్రత్యక్ష నిదర్శనం.

"నాట్యాంబుజము కళయందభిమానముచే గూర్చబడిన వ్యాసమాలికగాని నాట్యశాస్త్రపు నిగ్గుతేల్చు 'నాట్యశాసనము' కాదు" అని చెబుతూనే యీ వ్యాసమాలికలో తాను అనుసరించిన పద్ధతిని ఇలా వివరించారు :

> "ఆంధ్రనాటక సమాజములలో కొన్నిటిని మాత్రమే నేను చూచియున్నాను. నేను చూడని నటులు, నాటకము లెన్నేని కలవు. నా యనుభవము ననుసరించి యీపొత్తము కూర్చబడినది. ఈ పద్ధతిలో నాంధ్రదేశపు నలుదెసలనుండి నాలుగైదు పుస్తకములిట్టివి వెలువడినగాని ఆంధ్ర నాట్యరంగము సంపూర్ణముగ తెలియనేరదు. ఇందులో జేర్చబడని పెద్దనటులందఱి పరిచయానుభవములు లేనందున విడచితినని మన్నింపవలెను."
>
> ("నాట్యాంబుజము", అవతారిక, పే. 2).

"నాట్యాంబుజం'లో 'ఎనిమిది దళాలు' ఉన్నాయి. ఇవి అన్నీ నాటకకళను గురించి "ఇంతదనుక తెలుగు పత్రికలలో ప్రచురించిన వ్యాసములు, విమర్శనములు, కొన్నితావులనిచ్చిన యుపన్యాసములు, సంభాషణలలో వెలిబుచ్చిన అభిప్రాయములు" అని చెప్పారు సూరిశాస్త్రిగారు.

ఈ ఎనిమిదిదళాలలో విషయపరంపరను చూస్తే యీ సంకలన గ్రంథం విశేషస్వానుభవ సంపన్నమని యిట్టే తెలుస్తుంది.

| | | |
|---|---|---|
| మొదటి దళము | : | నాటకానుభవము |
| రెండవ దళము | : | ఆంధ్రనాటకములు (పూర్వరూపము) |
| మూడవ దళము | : | నాటక సమాజములు |
| నాల్గవ దళము | : | ప్రసిద్ధ నటులు |
| ఐదవ దళము | : | ప్రదర్శన విమర్శనములు |
| ఆరవ దళము | : | ఆంధ్ర నాటక విమర్శనములు |
| ఏడవ దళము | : | నాటక సమస్యలు |
| అష్టమ దళము | : | నాటక విమర్శనము |

ఈ విషయసూచికను గమనిస్తే నాటకాలను అన్ని కోణాలనుంచి పరిశీలించిన ఒక దిగ్దర్శనం కనిపిస్తుంది. మొదటి అధ్యాయంలో తనకున్న

నాటక విలోకనానుభవాన్ని గురించి, ఆంధ్రనాటక పరిషత్తుకు కార్యదర్శిగా ఉండడం, ఆ పదవిలో తాను ప్రచురించిన "ఆంధ్రనాటక నామావళి" అన్న సూచికాగ్రంథాన్ని గురించి వివరించి, తన నేతృత్వంలో జరిపించిన మూడు నాటక పోటీలను గురించి చెప్పి తాను యీ నాటకరంగ విశ్లేషణ చేయడానికి ఏవిధంగా అర్హులో అన్యాపదేశంగా చెప్పారు సూరిశాస్త్రిగారు.

మొదటి అధ్యాయం నాందీప్రాయం అయితే, రెండవ అధ్యాయం ఈ పుస్తకానికి ప్రస్తావన వంటిది. అది పూర్వరంగం. ఆధునిక తెలుగు నాటకానికి పూర్వరూపాలయిన యక్షగాన, వీధి నాటకాలను గురించి వివరిస్తూ 1906-1915 మధ్యకాలంలో ఎటువంటి నాటకలు ప్రచురింపబడ్డాయో, కథావస్తువు దృష్ట్యా పాతకొత్త నాటకాల రచన ఎలా సాగిందో పట్టికల రూపంలో వివరించారు. 1920 వరకు వచ్చిన నాటకాల సంఖ్యను వివరిస్తూ సూరిశాస్త్రిగారు సరికొత్త సూచన చేశారు.

> తెలుగుదేశమున ఎన్ని నాటకసమాజము లున్నదియు అవి యేనాటకము లాడునది తెలిసిన యెడల ఆంధ్రుల నాటకాభిరుచుల దెలుపు మ్యాపులనే గీయవచ్చును. ఇట్టి మ్యాపులను మా సంఘమువారు ప్రచురించి క్యాటలాగులతో బాటు వెలిబుచ్చనుద్దేశించియున్నాము. ఇండస్ట్రియల్ మ్యాపును జూచినచో నేదేశమున కేవిధమైన వస్తువులు కావలసియుండునో తెలియును. అటులనే ఆంధ్ర దేశమందలి నానాప్రాంతములలోని నాటకకంపెనీలు, ఆడే ఆటలు, వాని ప్రదర్శనాక్రమములు దెలిపెడి మ్యాపు లుండినచో మనము సులభముగ నచ్చటి ప్రజల రుచులను గుర్తెరిగి పనిచేయగలుగుదుము.

ప్రేక్షకుల దృష్టితో నాటకాల్ని చూచి, వారి అభిరుచులను బేరీజు వేయవలసిన అగత్యాన్ని 1916లోనే గుర్తించారు సూరిశాస్త్రిగారు. అటువంటి వివేచన యీనాటివరకు జరగకపోవడం; సూరిశాస్త్రిగారి నిష్క్రమణతో ఆంధ్రనాటక పరిషత్తు కూడా యీ పనికి పూనుకోకపోవడం, తెలుగువారికి నాటక విమర్శ అంటే ఉన్న నిరాదరణకు ఉదాహరణ.

మూడవ అధ్యాయం "నాటక సమాజములు". ఈ అధ్యాయంలో ఆనాటి నాటకరంగ సమగ్ర స్వరూపాన్ని మనకు అందచేస్తారనుకొన్న వారికి కొంత నిరుత్సాహం తప్పదు. కేవలం చెన్నపురిలోని సుగుణవిలాస సభ, బళ్లారి, మైలవరం, రాజమండ్రి కంపెనీలను గురించి క్లుప్తంగా చర్చించారు. నిజానికి ఒక భాషలోని నాటకరంగ చరిత్ర ఆయా భాషాప్రాంతాల్లో వర్ధిల్లిన నాటక సమాజాలచరిత్రే! అటువంటి నాటకరంగ చరిత్రకు ఎంత సంక్షిప్తంగా రాసినా – మార్గదర్శకులు సూరిశాస్త్రిగారు.

ఈ గ్రంథంలో అతి విశిష్టమైన అధ్యాయం నాల్గవది – ప్రసిద్ధ నటులను గురించినది. 1900–1920 మధ్యకాలంలో ఎందరో మహామహులైన నటులు ఆంధ్రనాటకరంగాన్ని సుసంపన్నం చేశారు. ఈవెన లక్షణస్వామిగారితో ప్రారంభమైన ఈ నటుల నటనావిధాన విశ్లేషణలో సూరిశాస్త్రిగారు నెల్లూరు నాగరాజారావు, మాగంటి సుబ్బారావు, మంజులూరి కృష్ణారావు, హరి ప్రసాదరావు, మల్లాది గోవిందశాస్త్రి, ముప్పిడి జగ్గరాజు, పారుపల్లి సుబ్బారావు వంటి నటమూర్ధన్యుల నటనను గురించి శాస్త్రచర్చ చేశారు. ఈ మహామహులంతా ఏదో ఒక నాటక సమాజంలో ప్రధాన భూమికలు ధరించేవారు కావడంవల్ల ఒకరకంగా ఆయా సమాజాలను గురించి పరోక్షంగా వివరించానని సూరిశాస్త్రిగారు భావించి వుండడంవల్ల నాటక సమాజాలను గురించిన విస్తృత చర్చ చేయలేదమోననిపిస్తుంది.

ఈ నటచర్చ జరిపే సందర్భంలోనే సూరిశాస్త్రిగారు ఒక మూలభూతమైన శాస్త్రనిర్వచనం చేశారు. నటులను స్థూలంగా రెండువర్గాలుగా విభజిస్తూ ఒక మౌలికమైన సూత్రాన్ని ప్రతిపాదించారాయన. పింగళి లక్ష్మీకాంతంగారి ధర్మరాజు వేషాన్ని విశ్లేషిస్తూ – "...... లక్ష్మీకాంతము తన నిత్యజీవనపద్ధతుల కనుకూలమైన పాత్రలనే యెక్కువ సామర్థ్యముతో నిర్వహించగలడుగాని లక్ష్మణస్వామి ఘుమేరుసింగు భీభత్సమును, నాగరాజారావు పఠాను మతిభ్రమణమును, రాఘవాచారి రామదాసు భక్తి నిశ్చేష్టతను, సంబంధం మొదలియారయాగో కౌటిల్యమును, గోపాలరప్ప శకారశ్యాలకత్వమును ప్రకటించునట్లు నిజస్వభావమునకు సంపూర్ణ విరుద్ధముగ నుండు నాటకపాత్రలతో గుణరూప సాదృశ్యమొంది యభినయించలేదు" అన్నారు.

ఈ విశ్లేషణవల్ల మంచినటులలో కూడా రెండు వర్గాలవారుంటారని – ఒకరు తమ నిజగుణరూపాదులను అతిక్రమించి తమ లక్షణాలకు విరుద్ధంగా ఉన్న పాత్రలను కూడా ధరించి మెప్పించగలరని, మరికొందరు తమ నిజస్వరూప స్వభావాలకు సరిపోయిన పాత్రలలో రాణించగలరని సూరిశాస్త్రిగారు నిర్ణయించారు. ఈవెన లక్ష్మణస్వామి, నెల్లూరు నాగరాజారావు, బళ్లారి రాఘవ మొదటివర్గానికి చెందిన మహోన్నత నటులని శ్లాఘించారు.

తరువాతి అధ్యాయంలో కొన్ని నాటక ప్రదర్శనల విమర్శలు చేశారు సూరిశాస్త్రిగారు. ఇందులో రాఘవాచారిగారి బెంగుళూరు ఆమెచ్యూర్ డ్రమాటిక్ అసోసియేషన్ వారి "రామదాసు", "రామరాజ్య వినాశము'ల విమర్శ, డి.వి.సుబ్బారావుగారి "చంద్రహాస", బందరు రాయల్ డ్రమాటిక్ కంపెనీవారి "ముద్రారాక్షస" నాటక ప్రదర్శనలను గురించిన విశ్లేషణలున్నాయి. వీటితోపాటు 1920 ప్రాంతాల ప్రఖ్యాతిగాంచిన "పఠాన్–రుస్తుం" నాటకాన్ని గురించిన తీవ్రమైన విమర్శకూడా వుంది. తాను స్వయంగా శ్రీరామభక్తుడు కావడంవల్ల "రామదాసు" నాటకంలోని కథను, ప్రధాన ఘట్టాల ప్రాముఖ్యతను చాలా విపులంగా సమీక్షించారు ఈ అధ్యాయంలో. ఈ అధ్యాయంతోనే శాస్త్రిగారు నాటకరచన, నటన, ప్రదర్శనలను సమిష్టిగా చూడవలసిన అవసరాన్ని నొక్కి చెబుతూ, అటువంటి సంయోజనాత్మక నాటక విమర్శకు నాంది పలికారు.

ఆరు, ఏడు అధ్యాయాలు సూరిశాస్త్రిగారు తమ సమకాలీన నాటకరంగం లోని ప్రధాన సమస్యలను గురించి పలువురు నాటక నిష్ణాతులు చర్చించిన, లేదా ప్రచురించిన వ్యాసాలను కూడా యిందులో పొందుపరిచారు. ఈ విమర్శకులలో ప్రఖ్యాత రచయితలు, విమర్శకులు – ముఖ్యంగా కోలాచలం శ్రీనివాసరావు, పానుగంటి లక్ష్మీనరసింహారావు, వింజమూరి రంగాచారి, ముత్తరాజు సుబ్బారావులు నాటక ప్రదర్శనలను గురించి, చేసిన నాటక పరీక్షలను గురించి, పోటీ నాటకాలలో అనుసరించవలసిన యోగ్యతా నిర్ణయ పరీక్షలను గురించి, నాటకాలలో పద్యరచనను గురించి చర్చలున్నాయి. ఈ అభిప్రాయాల తరువాత సూరిశాస్త్రిగారు పై సమస్యలమీద తమ అభిప్రాయాలను గురించి కూడా చర్చించారు. నాటక పరికరాలు, రంగము, దృశ్యరచనావిధానాలు, దుస్తులు, పద్యముల ఉపయోగము – మొదలైన విషయాలమీద ఆనాటి సమాజాలు అనుసరిస్తున్న పద్ధతులమీద పలువురి వ్యాసాల సారాంశాన్ని వెలువరిస్తూ తమ అభిప్రాయాలను క్రోడీకరించారు.

(ఆరవ అధ్యాయంలోని విషయాలు ఇదివరకే ఆయా రచయితల గ్రంథాలలో ప్రచురింపబడి వుండడంచేత, ఈనాడు ఆ సమస్యలకు ప్రాముఖ్యం లేకపోవడంవల్ల ఆ అధ్యాయాన్ని ("ఆరవ దళము"ను) ఈ సంక్షిప్తీకరించిన 'నాట్యాంబుజం' గ్రంథంలో పొందుపరచడం జరగలేదు – సం॥)

ఇక చివరి అధ్యాయం "నాటక విమర్శనము". దీనిని నాటక రచనారీతుల అధ్యయనం అనవచ్చు. తెలుగు నాటకాలలో శ్రీకృష్ణ, కర్ణపాత్రల చిత్రణ, "ముద్రారాక్షస" నాయకుని గూర్చిన చర్చ, "చింతామణి" నాటకంలో వేశ్యపాత్ర చిత్రణ, నాటకాలలో కల్యాణాంత విషాదాంత నాటకాలు మొదలైన విషయాలను ఈ అధ్యాయంలో చర్చించారు. వీనితోపాటు "అవి తర్కిత దైవికములు" అనే శీర్షిక క్రింద "దేవతలు నాటకాంతమున వచ్చుటకు కారణములు" అన్న విషయాన్ని చర్చించడం, దానికి సమాంతరంగా ఇతర దేశాల నాటక పద్ధతులను ఉటంకించడం చూస్తే సూరిశాస్త్రిగారి నాటక పరిజ్ఞానం ఎంత విస్తృతమైనదో అవగతమవుతుంది. 'సారంగధర' నాటకంలో నాటకాంతాన సిద్ధుడు వచ్చి "సారంగధరునికి తిరిగి కాలుసేతుల నతికించుట–" ఇటువంటి వాటిలో ఒకటి. 'గయోపాఖ్యానం'లో శివుడడ్డపడి నరనారాయణుల సమరసంరంభ సన్నాహమపనయించుచున్నాడ"న్నది వేరొకటి. ఈ ఉదాహరణలు ఆధారంగా "ఈవిధముగా మనదేశములోని నాటకాలనేకములందు పాత్రలు నిజస్వభావ పరిణామానురూపములగు సుఖదుః ఖముల పతనౌన్నత్యముల మంచిచెడ్డలనుభవింపక తుదికెద్దియో యొక యసంభావిత, యచింతిత దైవికముచే సత్ఫలమొందుచున్నారు" అనే సత్యాన్ని ఉల్లేఖించారు. పాశ్చాత్య నాటక విమర్శ రీతులెరిగి, గ్రీకు నాటకాలలో కనిపించే divine machine యిటువంటిదేనని నిరూపించారు. ఇది విస్తృతమైన నాటకరంగ పరిశీలన ఉంటేకాని స్ఫురించే విషయం కాదు. ఇటువంటి అనేక నాటకరంగ విషయాల సమగ్ర వివేచన ఈ గ్రంథంలో కనిపిస్తుంది.

నాటక విమర్శకునికి అవసరమైన సంయోజనాస్ఫూర్తికల కళావైశద్యం ఈ గ్రంథవిమర్శలో మనకు అడుగడుగునా అవగతమవుతుంది. అలాగే నాటకానికి నాటకరచన ఎంతముఖ్యమో, నాటక ప్రదర్శనకూడా అంతే ముఖ్యమని, ప్రదర్శనలోని నటీనటబృందం అంతా కలిసి నాటక విజయానికి సమిష్టి కృషి చేయడం అవసరం అన్న విషయాలను మనకు మరోసారి జ్ఞాపకం చేశారాయన.

తెలుగు సమగ్ర నాటకవిమర్శకు "నాట్యాంబుజం" ఒక శాస్త్రబద్ధమైన దిశానిర్దేశం చేసిందని చెప్పవచ్చు.

## నాట్యోత్పలము (1924)

కోలాచలం శ్రీనివాసరావుగారు *The Dramatic History of the World, (1908)* అనే ప్రపంచ నాటక చరిత్రను ఆంగ్లభాషలో రాసి భారతదేశంలోనే అటువంటి ప్రయత్నం చేసిన ప్రథమ చరిత్రకారుడైనాడు. కేవలం తెలుగు పాఠకులనే దృష్టిలో ఉంచుకుని సూరిశాస్త్రిగారు ప్రపంచ నాటక చరిత్రను "నాట్యోత్పలము" అన్న పేరుతో తెలుగున వెలువరించారు. ఈ గ్రంథం ముఖ్యంగా పాశ్చాత్య ప్రపంచ నాటక చరిత్రే అయినా చివరి అధ్యాయంలో ఆంధ్రేతర భారతీయ భాషా నాటకాలను ఆసియా దేశాల నాటకాలను గురించి కూడా సంక్షిప్తంగా పేర్కొనడం వలన దీనిని "ప్రపంచ నాటక చరిత్ర" అనవచ్చు.

ఈ గ్రంథంలోని అధ్యాయాలకు విచిత్రమైన పేర్లు పెట్టారు శాస్త్రిగారు : "నెలపొడుపు" అన్నది నాటక ఆవిర్భావాన్ని గురించిన అధ్యాయం. "ఆటమొలకలు" అన్నది నాట్య ప్రారంభ విశేషాలను గురించినది. నాటక స్వర్ణయుగాన్ని "ఆటవిరుల విప్పుటందములు"లో వివరించారు. నవ్యయుగారంభ నాటక విశేషాలను "తెల్లతెలుపుల తీగెయల్లికలు" అనే అధ్యాయంలో వివరించారు. పాశ్చాత్య రూపకకవుల జీవితములను గురించిన అధ్యాయం "ఆటకైతల పూలసరము." ఇందులో గ్రీకు నాటకకర్త తీసీఫీజు (థెస్పిస్) నుంచి ఆధునికులైన (ఆనాటికి) ఇబ్సెన్, మాటర్‌లింక్, బెర్నార్డ్‌షా, సింగ్‌ల వరకు అన్ని పాశ్చాత్యదేశాలలోని ముఖ్యమైన నాటకకర్తల జీవితాలను, రచనలను గురించిన సంక్షిప్త వివరణలున్నాయి. ఆరవ అధ్యాయం "ఆటకొలను"–వివిధ ప్రఖ్యాతనటుల అభినయ మర్యాదలను గురించినది. ఏడవది "ఆటరెక్కలు" – ప్రఖ్యాత నటులను, నటనను గురించిన సమీక్షలు. ఎనిమిదవ అధ్యాయం – "ఆటతోటల కమ్మతెమ్మెరలు" – నాటక విమర్శలను గురించి. అందులో సమకాలీన నాటకరంగంలో ప్రఖ్యాత నాటకకర్త ఇబ్సెన్‌ను గురించి ఆర్డర్ జోన్స్ రాసిన వ్యాసానువాదం, ఆయనదే "నవ్యనాటక ధర్మము" అన్న ఉపన్యాసానికి అనువాదం ఉన్నాయి. తరువాతిది "ఆటనెలవులు" నాటకశాలలను గురించినది. తొమ్మిదవ అధ్యాయం "ఆటతెరవులు" – ప్రాచ్యదేశ నాట్య పద్ధతులను గురించి. చివరి అధ్యాయం "తుదిచూపు."

ఇందులో ఆంధ్రులు సంస్కృత నాటకానువాదాలను చేసినంత ఎక్కువగా పాశ్చాత్య నాటకాలను అనువదించలేదని చెబుతూ, పాశ్చాత్య భారతీయ భాషా నాటకాలలో ఆంధ్రానువాదానికి అర్హమైనవన్న దృష్టితో ఒక పెద్ద పట్టికను యిచ్చారు. పాశ్చాత్యుల నాటకరంగం అభివృద్ధి చెందడానికి ముఖ్యకారణము "వారిలో ఇది ప్రాచీనమనియు, ఇది నవీనమనియు, ఇది గొప్ప ఇది తక్కువ, ఇది ప్రమాణ లక్షణ నిబద్ధము, ఇది స్వతంత్ర భావ వికాసము అనెడి తారతమ్యము లేదు. 'గుణాః పూజాస్థానం గుణిషునచ లింగం నచవయః', 'బాలాదపి సుభాషితం' మున్నగు వాక్యములు మనదేశములో పుట్టినను, వీనియాచరణ మాత్రము పాశ్చాత్య విజ్ఞాన సాధకులదే అయియున్నది" అని నిర్ద్వంద్వంగా పేర్కొన్నారు. భావవికాసమే లక్ష్యంగా మనం ప్రపంచంలోని ప్రఖ్యాత నాటకాలను తెలుగులోకి తీసుకొని రావాలని ఆకాంక్షించారు.

"నాట్యోత్పలం" లోని అధ్యాయాలకు వింతపేర్లు పెట్టి "ఆట" (play) అన్న పేరుతో పదబంధాలను కూర్చినట్లుగానే రచనలో కూడా పాశ్చాత్య భావజాలాన్ని, ఆంగ్ల రచనావిధానాన్ని శాస్త్రిగారు అనుసరించినట్లు స్పష్టమవుతున్నది. అయితే తెలుగులో ప్రపంచ నాటక చరిత్రను గురించి రాసిన ప్రప్రథమ గ్రంథంగా "నాట్యోత్పలా"నికి ఎంతో చారిత్రక ప్రాముఖ్యం ఉందనేది నిర్వివాదం. ఆ పుస్తకం ఈనాటి చదువరులు చదవడానికి వీలైన వ్యావహారికంలో వస్తే ఇప్పటికీ దాని ప్రాముఖ్యత ఉంటుందని నిర్ద్వందంగా చెప్పవచ్చు.

## విమర్శక పారిజాతము (1925)

ముద్రణ పొందిన శాస్త్రిగారి తరువాతి గ్రంథం "విమర్శక పారిజాతము". ఈ గ్రంథములో కూడా మిగిలిన తమ గ్రంథాలలో మాదిరిగానే ఎనిమిది అధ్యాయాలున్నాయి. "ప్రవేశము". "యూరపు చరిత్రము", "విమర్శకమహర్షులు," "విమర్శన తత్వము" "వాఙ్మయ స్వరూపము", "కావ్యప్రశంస", "కళారహస్యము", "సమన్వయము" – అన్నవి ఈ ఎనిమిది అధ్యాయాలు.

శాస్త్రిగారి "విమర్శ పంచకము"లో దీనిని "మొదటి ద్రుమము" అన్నారు. దీనిని గురించి రచయిత అభిప్రాయం ఇలా ఉంది :

> విమర్శక పారిజాతము, సురుచితరముగ, మనోహరముగ
> నుండు పొత్తముకాదు. విమర్శకతత్వమును సూత్రీకరించి,

> చదువరులకు కొన్ని నిర్ణీతార్థముల నొసంగదు. పూర్వపక్ష సిద్ధాంతము నొనర్చి, సంశయ ముపనయించి, నిరూఢముగ విప్పిచెప్పదు. కాని, చదువరులను జిజ్ఞాసులుగ జేసి, చింతాప్రవృత్తిలో ప్రవేశపెట్టి, కావ్యరసాత్మకంబగు విచారణకు దింపును. ఇది యొసంగెడి భావోపహారముకన్న, జదువరి యుల్లమున నిందలి వాక్యములు జెలరేపు భావము లుపయోగకారులగును. (విమర్శకపారిజాతము, పే. 284)

ఈ ధ్యేయంతో ప్రారంభమైన ఈ గ్రంథం పాశ్చాత్య సాహిత్య విమర్శను గురించిన వ్యాఖ్యానాత్మక చరిత్ర. విమర్శన గ్రంథాలు రాయడంలో మూడు పద్ధతులున్నాయని, అందులో మొదటిది "ఆత్మీయానుభవ నిరూపకంబగు స్వతంత్ర గ్రంథములు" (ఉదా: కట్టమంచి వారి "కవిత్వతత్త్వ విచారణ"), రెండవది ప్రామాణిక లాక్షణిక గ్రంథములు ఆధారముగా చేసే విమర్శ (గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారి గ్రంథాలు!), మూడవది ప్రామాణిక లాక్షణిక సిద్ధాంతాలేకాక, రసిక విమర్శకుల భావాలనుకూడా సంతరించి గ్రంథస్థం చేయటం (తన గ్రంథం మూడవపద్ధతికి చెందిందని శాస్త్రిగారు పేర్కొన్నారు.)

మిగిలిన గ్రంథాల రచనా ప్రణాళిక మాదిరిగానే ఇందులోకూడా శాస్త్రిగారు తాము విమర్శించ తలపెట్టిన విషయానికి సాంఘిక, సాంస్కృతిక నేపథ్యాన్ని ఇచ్చారు. సరికొత్త విషయం కనుక దీనికి చారిత్రక, భౌగోళిక విశేషాలను జోడించి ఆయా చరిత్రాంశాలు, భౌగోళికనేపథ్య ప్రభావాలు ఆయాదేశ విమర్శనాపద్ధతులమీద, సంప్రదాయాలమీద ఉండే ఆస్కారాన్ని సూచించారు. ఆ తరువాత అధ్యాయంలో కొందరు "విమర్శక మహర్షు"లను గురించి వారి విమర్శనా పద్ధతులను గురించి వివరించారు. హోమరు దగ్గరనుంచి 19వ శతాబ్దం చివరి విమర్శకులయిన మాథ్యూ ఆర్నాల్డ్ వరకు ఉన్న ప్రముఖ విమర్శకుల ముఖ్యమైన సిద్ధాంతాలను ఉటంకించారు.

నాలుగు, అయిదు అధ్యాయాలు ఈ గ్రంథానికి నికషోపమానం. "విమర్శక తత్త్వము" 'వాఙ్మయ స్వరూపము' అనే ఈ రెండు అధ్యాయాలలోను సూరిశాస్త్రిగారు దాదాపు అరవైమంది పాశ్చాత్య విమర్శకుల భావాలను క్రోడీకరించి ఆయా విషయాలను గురించిన తమ అభిప్రాయాలను కూడా జత చేశారు. "విమర్శనతత్త్వము" అన్న అధ్యాయం చివర శాస్త్రిగారు మూడురకాలు విమర్శకులను

పేర్కొన్నారు. "సారస్వత విమర్శకులు" కొన్ని సూత్రాలు ప్రమాణంగా కార్యార్థ నిరూపణం చేస్తారని "నైతిక విమర్శకులు" సదాచారాల నేపథ్యంలో కళావిషయాలను పరిశీలిస్తారని; "పరిశోధక విమర్శకులు" సాంఘిక సందర్భాలు, రసాంశాలు ఆధారాలుగా కావ్యాలకు అవి జనించిన పరిస్థితులకు గల సంబంధాన్ని నిర్వచిస్తారని చెప్పారు. ఈవిధంగా చూస్తే పురాణం సూరిశాస్త్రిగారిని ''పరిశోధన విమర్శకులు"గానే మనం పేర్కొనవలసి వుంటుంది.

ఆరవ అధ్యాయం "కావ్యప్రశంస." ఈ గ్రంథంలోని అధ్యాయాలన్నింటిలోను పెద్దది. ఇది కొంత చారిత్రక వివేచన, మరికొంత తాత్త్విక వివేచన కలిపి చేసిన పాశ్చాత్య "కావ్యతత్వ వివేచన"గా చెప్పుకోవచ్చు. వాఙ్మయ స్వరూపాన్ని నిర్వచించి, అందులోని ప్రధాన ప్రక్రియ అయిన కావ్యాన్ని గురించిన ఉత్పత్తి వికాసాలను, కావ్యంలో ఉండే అంతర్గత అంశాలు (కథాంశాలు, పాత్రలు మొ॥), అలంకారాలు, భాషా సౌందర్యం వంటి అనేక విషయాలతోపాటు ముఖ్యమైన పాశ్చాత్యభాషా సాహిత్యాలలో కనిపించే కావ్యవిమర్శనా సిద్ధాంతాలను కూడా పొందుపరిచారు ఈ అధ్యాయంలో. కావ్యవివేచన తరువాత "కళారహస్యము" అన్న అధ్యాయంలో కళల స్వరూప స్వభావాలను గురించి సతార్కికమైన చర్చ చేశారు శాస్త్రిగారు. ఇక చివరి అధ్యాయం "సమన్వయము"లో విమర్శ లక్షణాలను నిర్వచించి వాఙ్మయ, కావ్య, కళారంగాలలోని విమర్శలు ఎలా వుండాలో నన్న అంశంమీద తమ అభిప్రాయాలను చెబుతూ భారతీయ, పాశ్చాత్య సిద్ధాంతాలను సమన్వయించే ప్రయత్నం చేశారు శాస్త్రిగారు. తెలుగు విమర్శనా చరిత్రను అధ్యయనం చేసేవారికి యీ గ్రంథం "కరదీపిక" వంటిదని చెప్పవచ్చు.

## నాట్య అశోకము (1925-27)

సూరిశాస్త్రిగారి ప్రధాన విమర్శనాగ్రంథాలలో చివరిది "నాట్యాశోకము". మొదటి, రెండవ అధ్యాయాలు ప్రస్తావనప్రాయాలు. "తాటాకులలో పచార్లు" సూరిశాస్త్రిగారు తంజావూరు సరస్వతీమహల్ లైబ్రరీలో చూచిన తెలుగు యక్షగానాలను గురించి సవిమర్శక సమీక్ష. రెండవ మూడవ అధ్యాయాలు "చెట్లక్రింది ముచ్చటలు" సంభాషణాత్మకమై ఆత్మకథా సదృశమైన రచన. ఇద్దరు స్నేహితులు సూరిశాస్త్రిగారితో ముచ్చటించిన అనేక నాటకసంబంధమైన విషయాలు యాదాలాపంగా ఇందులో ఉటంకించబడ్డాయి. ఆంధ్రనాటక పరిషత్తు చేపట్టిన ''నటసభ''ను గురించి, సూరిశాస్త్రిగారి విమర్శనా పద్ధతులను గురించి,

‘‘నాట్యాంబుజము’’ నట సమ్మేళనాలలో కలిగిస్తున్న అలజడిని గురించి రాసుకున్నారు. నిజానికి ఆనాటి కొందరి విమర్శకు ఇది పురాణంవారి సమాధానం. 1925–27 మధ్యకాలంలో బందరులో పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారు తాము తమ “నటప్రకాశిక” గ్రంథరచనకోసం ఆడించిన నాటకాలు; దానిమీద వచ్చిన విమర్శలు – ఈ “చెట్టుక్రింది ముచ్చటలు” అన్న రెండు, మూడు అధ్యాయాలలో చోటు చేసుకున్నాయి. సూరిశాస్త్రిగారి విమర్శనాగ్రంథాల పరిధి, పరిమితుల కూలంకషమైన అవగాహనను యీ అధ్యాయాలు తెలియచేస్తాయి. విమర్శలు ఆధారంగా నాటక సమాజాధికారులు నట ప్రాశస్త్యాన్ని నిర్ణయించరని, డబ్బు రాబడిని బట్టి దానిని నిర్ణయిస్తారని నిర్మొహమాటంగా చెపుతారాయన. పెద్ద వేషాలు వేసి, ప్రఖ్యాతులయిన బళ్లారి రాఘవ, నాగరాజారావు, వెదురుమూడి శేషగిరిరావు గార్లతోపాటు చిన్నవేషాలు వేసినవారిని గురించి కూడా వివేచన చేయడం పురాణంవారి సూక్ష్మపరిశీలనకు నిదర్శనం.

కాని ఈ మొదటి మూడు అధ్యాయాలలోని విషయాలు కేవలం ఉబుసుపోకకు చెప్పుకొన్న విషయాలుగాను ప్రాసంగికాలుగాను కనిపిస్తాయి. ఒకరకంగా ఆనాడు సూరిశాస్త్రిగారి “నాట్యాంబుజం” మీద వచ్చిన సమకాలీన విమర్శలకు ఇవి సమాధానం. (అందువల్లనే యీ మూడింటిని యీ సంపుటిలో వదలి వేయడం జరిగింది.) తరువాతి అధ్యాయాలలో “శ్రీరామ నాట్యలేఖలు” అనే శీర్షికక్రింద వేరు వేరు నాటకాల రచనా, ప్రయోగ విషయాలను గురించి వివేచన ఉంది.

ఈ పుస్తకానికి ప్రాణభూతమైన వ్యాసాలు “శ్రీరామనాట్యలేఖలు”. తన ఇష్టదైవమైన శ్రీరామచంద్రునికి నేరుగా తన నాటకానుభవాలను నివేదించే లేఖారూపంలో రాయబడ్డ యీ వ్యాసాలు “నాట్యాంబుజం’లో తాను ఏర్పరచుకున్న విమర్శక పద్ధతుల సమన్వయరూపంగా కనిపిస్తాయి. ఆ పుస్తకంలో నాటకరచన, నటన, ప్రదర్శన అన్న వేరువేరు అంశాలు ప్రాతిపదికగా రచన సాగితే యీ పుస్తకంలో ఒక నాటకం ఆధారంగా దాని రచన, ప్రదర్శన అందులోని ప్రధాన పాత్రధారుల నటనావిధానం, ఇదే నాటక ప్రదర్శనలో మరో సమాజనటుల నటనతో పోల్చిచూపే తారతమ్య వివేచన, చివరగా దానిని ఆయా విమర్శక, ప్రదర్శక సూత్రాలు ఆధారంగా తాను వేసే బేరీజు కనిపిస్తాయి. అంటే – సమగ్ర నాటక ప్రదర్శనాంశాలన్నీ యిందులో కూలంకషంగా చర్చించబడడంవల్ల వీటిని శాస్త్రిగారి నాటక విమర్శలో మూలసూత్రాలుగా పరిగణించవచ్చు.

ఈ వ్యాసాలలో మొదటిది "మహాత్మా కబీరు" నాటకం. గుబ్బి చెన్న బసవేశ్వర నాటక సమాజం కన్నడంలో ప్రదర్శించిన నాటకం. (అందువల్ల ఈ భాగాన్నికూడా పునర్ముద్రణలో పరిహరించడం జరిగింది.) కాని పాత్రల మనస్తత్వాలను నిర్వచించడంలోను, అవి సంఘర్షణలకు దారితీసినపుడు ఆయా నటుల నటనా విధానాన్ని వెలువరించడంలోను శాస్త్రిగారు ఈ నాటక వివేచనలో కృతకృత్యులైనారు. తరువాతి "లేఖలు" వరుసగా "రామదాసు", "హరిశ్చంద్ర", నటప్రవేశిక శాస్త్రిగారు (పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారు) వేయించిన నాటకాలు, ఆంజనేయు నటేశం వేసిన నాటకాలు, ''కన్యాశుల్కం'', "ప్రతాపరుద్రీయం", "షోరబు-రుస్తుం" నాటకాలను గురించిన సవిస్తరమైన చర్చ వుంది. తరువాతి రెండు అధ్యాయాలలోను నెల్లూరుకు చెందిన దొరస్వామిగారిని గురించి, కొందరు గంజాం నటులను గురించి చర్చించారు శాస్త్రిగారు. 'నాట్యలేఖలు' లో అంతర్భాగమే, తరువాతి అధ్యాయం - "చంద్రహాస-నటలోక సంచారం" అన్నది. తరువాత వచ్చే ప్రసూనాలు (మృచ్ఛకటిక, రాధాకృష్ణ నాటకాలను గురించిన వివరణాత్మక చర్చ) అదే అధ్యాయం క్రిందికి వస్తుంది - ఆ మూడు నాటక మీమాంసలతో కూడిన ప్రదర్శనల విమర్శనలు కనుక మొదటి వ్యాసాలు ప్రదర్శన ప్రధానాలు; రెండవభాగంలోనివి నటప్రధానాలు; మూడవ భాగంలోనివి నాటకకర్తల రచనావిధాన ప్రధానాలుగా పేర్కొనవచ్చు. ప్రతి వ్యాసం నాటకరచన, అభినయ విధానాల సమాహారంగా రూపొందింది కనుక, ప్రతి వ్యాసమూ శాస్త్రిగారి సశాస్త్రీయ వివేచనకు అద్వితీయమైన లక్ష్యచర్చగా రూపొందింది. "రామదాసు" నాటకాన్ని గురించిన సర్వాంగీణమైన విమర్శ సూరిశాస్త్రిగారి విమర్శన వ్యాసాలలో తలమానికమైనదని చెప్పవచ్చు. కథ తనకిష్టదైవమైన రాములవారి దాసుడైన కంచెర్ల గోపన్నను గురించినది; నటీనటులు - ప్రజ్ఞాపాటవాలను ఇంతకుపూర్వమే నిరూపించుకున్న నటులు. తాను చూసిన మూడు రామదాసు నాటకాలను - బెంగుళూరు అమెచూర్ కంపెనీవారిది, మోతేవారిది, అల్లూరు కృష్ణవిలాస సభవారిది - వీటి బాగోగులను బేరీజు వేస్తూ ప్రతి ప్రదర్శనాంశంలోని బాగోగులను చర్చిస్తూ చివరకు "బళ్లారి రాఘవాచారిగారి వ్యాఖ్యానమే ప్రమాణంగా తోస్తుంది" అని తీర్మానించారు, ప్రదర్శనను గురించిన ఏ వ్యాఖ్యకూడా సార్వకాలికం కాదని సూచిస్తూ. అలాగే కబీరుగా అల్లూరు రామచంద్రారెడ్డిగారు, తానీషాగా కొచ్చెర్లకోట రంగారావుగారు

నిర్దుష్టమైన నటనను చూపారని శాస్త్రిగారు అభిప్రాయపడ్డారు. అలాగే హరిశ్చంద్ర పాత్రధారులలో రామాయణం సర్వేశ్వరశాస్త్రిగారి వినూత్న వ్యాఖ్యానాన్ని ఎంతగానో కొనియాడారు.

తరువాతి అధ్యాయం "నటప్రకాశిక నాటకాలు" అనే పేరుగలది. "ఆంధ్ర నట ప్రకాశిక" గ్రంథకర్తలైన పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రిగారు తాము నటుల, సమాజాల చరిత్ర రాయడానికి వీలుగా అయిదు నాటకాలను బందరుకు రావించారు. ఆ ప్రయత్నం ఆరోజుల్లో బందరులో ఎన్ని తర్కవితర్కాలకు లోనైందో శాస్త్రిగారి "చెట్టుక్రింది ముచ్చట్లు"లో చూడవచ్చు. ముఖ్యంగా నాటకాలు ఒక సమాజం ఎక్కడ వేస్తున్నదో అక్కడకు పోయి చూడాలిగాని, అందులో ముఖ్యమైనవారిని పలు ప్రదేశాల నుంచి బందరుకు రప్పించి, స్థానిక నటులతో కలిపి ఆడించడం సమంజసం కాదు - అన్న విమర్శ శాస్త్రిగారి మౌలిక నాటకసూత్రాలకు సంబంధించినది. ఆ విషయంలో సూరిశాస్త్రిగారు తమ భావాలను సూటిగా, స్పష్టంగా వెల్లడించారు.

"శాస్త్రుల్లుగారు" ఆడించిన నాటకాలు అయిదు. సారంగధర, రామదాసు, హరిశ్చంద్ర, కృష్ణలీల. లంకాదహనము. అన్ని నాటకాలలోను ప్రధాన నటులు బయటినుంచి వచ్చారు. చిన్నవేషాలను బందరు సమాజాలలోని సభ్యులు వేశారు. శాస్త్రిగారు అటువంటి కూర్పు నాటకానికెంత నష్టం కలిగించవచ్చునో "సారంగధర" నాటకం ఆధారంగా వివరించి చూపారు.

> ఆనాటి సారంగధర ప్రదర్శనంలో మూడుపాఠాలు పోటీపడి తంజావూరు దగ్గర రైలుబళ్ళవలె పరుగులిడినవి. కొందరు నటులు బళ్లారి పాఠం చదివారు. కొందరు పానుగంటివారి శిష్యులు. మరికొందరు విష్ణుబొట్ల సుబ్రహ్మణ్యంగారిని అభిమానించారు. ఇక చిల్లరవేషాలు దాసీకమల మొదలయిన వాళ్ళు స్వతంత్ర వాచాలప్రభావమున విజృంభించారు. ఎట్లా వుండాలో అట్లా వుంది. సాయంత్రమైదుగంటలదాకా ఆటపడేది, ఆగేది తేలలేదు. పదకొండు గంటలకు తెర యెత్తాము. దుస్తులు లేవు. అన్నిటికి వెతుక్కోవడమే. కూర్మనాథ కవిగారు నిరుత్సాహులైనారు. (నాట్యాశోకము, పే. 139-140).

ఈ వర్ణనచూస్తే ఈ నాటక ప్రదర్శనలతోనే తెలుగు నాటకరంగంలో "కాంట్రాక్టు నాటకాల యుగం" ఆరంభమైనట్లు కనిపిస్తుంది.

కాని ఇంతటి విపర్యయ పరిస్థితులలో కూడా పాత్రానుగతమైన నటన తటస్థపడ్డప్పుడు సూరిశాస్త్రిగారి లేఖిని భావనావీధిలో విహరిస్తుంది. "సారంగధర"లో చిత్రాంగి వేషంవేసిన బి.వెంకటకృష్ణయ్యనాయుడు, 'లంకాదహనం'లో ఆంజనేయ వేషధారి పింగళి వీరయ్య, 'కృష్ణలీల'లో కంసుడు వేషం వేసిన నాగరాజారావుల పాత్రచిత్రణ, వ్యాఖ్యాన పద్ధతులను గురించి సహేతుక విమర్శను, సవిమర్శక హర్షాతిరేకాలను వెలిబుచ్చారు శాస్త్రిగారు.

సి.యస్.నటేశం ఆంజనేయపాత్రను గురించి, దొరస్వామి దుష్యంత పాత్రను గురించి శాస్త్రిగారు చాలా విపులంగానే వివరించారు. కాని కాళిదాసు "శాకుంతలం" నాటకం ప్రదర్శనయోగ్యంకాదని, "నాట్యరంగాన ప్రదర్శించినగాని నాటకాల నాట్యయోగ్యత తేటపడదు" అనే మౌలికమైన సత్యాన్ని కూడా ఇదే సందర్భంలో వెలువరించారు.

> వ్యంగ్యార్థము, భాషా సౌకర్యము, చదువుటకునూ, వినుటకునూ,అందగించినట్లుగా ఆడుట కుపయోగించదు. రంగస్థలాన మెప్పొందే ఆటలందు రసముకన్న భావమెక్కువగను, సూచనకన్న అభినయార్థము నెక్కువగాను, అధికారిక ప్రాసంగిక వృత్తము లనేకములు చేరియు, నాయక ప్రతినాయకుల విరోధ ప్రచారములతో, గలవరించియు పెక్కుపాత్రల ప్రవేశబెట్టియు, అవస్థానేకమును స్వభావానేకమును విస్తరించియు నుండవలెను. ఇది శాకుంతలలో లేదు. (నాట్యాశోకము, పే.218–219).

సాహితీపరులు అంగీకరించని విషయం; నాటక దర్శకులు అనుభవించిన విషయం ఇది. ప్రపంచంలోనే గొప్ప నాటకకర్తగా పేరు పొందిన కాళిదాసును గురించి ఈ విమర్శ చేయడంలో సూరిశాస్త్రిగారు నాటక రచనావిధానంకన్నా, ప్రదర్శనా సౌలభ్యానికి ఎంత ప్రాముఖ్యత యిస్తారో వెల్లడవుతున్నది. అందువల్లనే సూరిశాస్త్రిగారు తెలుగ నాటక విమర్శకులలో మొట్టమొదటి "నాటకరంగ విమర్శకులు"గా పేరు తెచ్చుకున్నారు.

ఇటువంటి రంగస్థల సంప్రదాయాల, అభినయ చమత్కారాల ఆధిక్యాన్నిబట్టి కన్యాశుల్కం తెలుగులో వచ్చిన గొప్ప సాంఘిక నాటకంగా పేర్కొన్నాడాయన.

> అప్పారావుగారు యెట్లాంటి నాటకరత్నాన్ని కల్పించాడని మనవి చేయను! చూడడానికి పెద్ద నవలవలె వుంటుంది కాని ఆట వచ్చేసరికి కన్యాశుల్కంలో కనుపించే పోకడలు, స్వభావాలు, ప్రత్యేక వికాసాలు, తళుకు సొబగులు, మరెక్కడా కనపడవు. (నాట్యాశోకము, పే.160)

పాత్రల స్వరూప స్వభావాలను వివేచించడంలోను, పాత్రధారుల చేష్టను పాత్ర స్వభావాలకు జతచేయడంలోను సూరిశాస్త్రిగారు నాటకరచనా ప్రదర్శనల విషయంలో రామవిలాససభవారి "కన్యాశుల్కం" నాటకానికి ప్రథమతాంబూలం ఇచ్చినట్లు కనబడుతుంది.

కాని "ప్రతాపరుద్రీయం" విషయంలో మాత్రం శాస్త్రిగారు కొన్ని ఘాటైన విమర్శలు చేశారు. యుగంధరమంత్రి పిచ్చివాడుగా నటించిన రంగాలన్నీ వ్యర్థమైన పొడిగింపులని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే పేరిగాడి సారాశెంబుసీను కూడా. ఇవి ఏవిధంగానూ కథాసంవిధానానికి తోడ్పడవనీ, "నిష్ప్రయోజకాలనీ, నీచప్రసంగభరితములని" తీవ్రమైన పదజాలాన్నే వాడారు. అయితే నాటకంలో ఉండే జాతీయత, యుగంధర (పిచ్చివాని పాత్రకాదు) పాత్రనిర్వహణాదులు సూరిశాస్త్రిగారి మెప్పును పొందాయి. అలాగే "చంద్రహాస" నాటకంలో దుష్టబుద్ధి పాత్రలో డి.వి.సుబ్బారావు అనూహ్యమైన నటనావైదుష్యాన్ని ప్రకటించినా, నాటకంగా అది పరిహరింపవలసిన నాటకం అంటారాయన.

మిగిలిన నాటకాలలో మాదిరిగా కాకుండా ప్రతాపరుద్రీయంలో ఒక్కొక్కపాత్ర కనిపించే రంగాల వివరణ, ఆయారంగాలలో నటించిన నటుల నటనా వైదుష్యం, తాను చూచిన ముగ్గురు నలుగురు పాత్రధారులలో ఏరంగంలో ఏ నటుడు మిగిలినవారిని అధిగమించి నటించాడు, అందుకు కారణాలేమిటి? – అనే సవిస్తరమైన వివేచన చేసి రంగస్థల విమర్శ అంటే యిలా వుండాలి అని నిరూపించారు శాస్త్రిగారు. ఈ నాటక విమర్శలలో శాస్త్రిగారి విశ్లేషణా సామర్థ్యం, పాత్ర లక్షణాల నటలక్షణాల సమన్వయం చాలా తర్కబద్ధంగా ఉండి నాటకప్రదర్శనను, అందులోని నటుల అభినయ కౌశలాన్ని దృశ్యమానం చేస్తాయి.

అసలు సిసలైన నాటకరంగ విమర్శకుల ప్రధాన లక్షణం యిదే! వారి పరిపక్వతకు గీటురాయి కూడా యిదే!

నాటకరంగంమీద సూరిశాస్త్రిగారు వెలువరించిన చివరి గ్రంథం "ఆంధ్రనాటక సంస్కరణము" (1925). ఇది మూడు విషయాలమీద సూరిశాస్త్రిగారి నాటకానుభవాల సంకలనం. మొదటిది 1924వ సం॥లో బందరులో జరిగిన ఆంధ్ర నట సభలను గురించిన సవివరమయిన సమీక్ష. ఇందులో ఆ నటసభలలో పాల్గొన్నవారి అభిప్రాయాలను, కొన్ని చోట్ల వారి వ్యాసాలను పూర్తిగాను, కొన్నింటిని పాక్షికంగాను పొందుపరిచారు. ఆ సభల నిర్వహణలో భాగస్వామి కావడంవల్ల ఇది ఏరోజుకారోజు శాస్త్రిగారు రాసుకున్న డైరీలాగా కనిపిస్తుంది. ఆరోజుల్లో నాటకం అన్నా నాటకప్రదర్శన అన్నా ప్రజల్లో, రచయితలలో, నటులలో ఉండే ఉత్సుకతకు అద్దంపడుతుంది ఈ సమీక్ష.

ఈ పుస్తకంలో పొందుపరచబడిన రెండవభాగం 1924-25లలో వివిధ పత్రికలలో నాటక విషయంలో వచ్చిన పత్రికావ్యాసాల సారాంశం. ఇది ఒకరకంగా విమర్శనా సమీక్షే! ఇందులో భాగంగానే కాశీ కృష్ణాచార్యులు, చెళ్లపిళ్ళ వెంకటశాస్త్రి, పసుమర్తి యజ్ఞానారాయణశాస్త్రి మొదలైనవారితో శాస్త్రిగారు జరిపిన సంభాషణల సారాంశం కూడా ఉంది. సమకాలీన నాటక రంగంలోని వివిధాంశాలను గురించి విజ్ఞులేమనుకుంటున్నారో అన్న అంశాలను క్రోడీకరించడంలో శాస్త్రిగారు సఫలీకృతులైనారు. అటువంటి వార్షిక సమీక్షా వ్యాసాలకు ఆద్యులు శాస్త్రిగారు. చివరివారుకూడా వారే కావడం విచారకరం. ఇందులోని మూడవ అంశం "నటనామ ప్రకాశిక" - బరంపురంనుంచి మద్రాసుదాకా ఉన్న వివిధ నగరాలలో ఉన్న నటీనటుల పట్టిక.

సాహిత్యంలోని వివిధ ప్రక్రియలమీద (ఇంగ్లీషులో year book లో వచ్చినట్లు) తెలుగులో వచ్చివుంటే తెలుగు సాహిత్య విమర్శ సుసంపన్నం అయివుండేది. కథాసాహిత్యంమీద మాత్రమే అటువంటి సమీక్షలు వెలువడుతున్నాయి. కొంతకాలం (1970 ప్రాంతాల) శ్రీవాత్సవగారు "సాహిత్య సింహావలోకనం" చేసేవారు. ఇప్పుడెక్కడా అటువంటి అత్యవసర కార్యక్రమాలు జరుగుతున్నట్లు లేదు. ఇదివరకు ఎవ్వరూ చేయని, తన తరువాత కూడా ఎవ్వరూ చేయ సాహసించని నాటక కార్యక్రమాలు ప్రారంభించి నిర్వహించిన ఏకైక నాటక విమర్శకుడు, సమీక్షకుడు, నిర్వాహకుడు పురాణం సూరిశాస్త్రిగారు.

సూరిశాస్త్రిగారు ప్రచురించినవి ఈ ఆరుగ్రంథాలే అయినా ఆయన కనీసం మరో ఆరు పుస్తకాలకు సమగ్రమైన ప్రణాళికను సిద్ధంచేసుకొని వున్నారు. ఆయన దృష్టి కవిత్వంమీదకు, కవిత్వతత్వ విచారణమీదకు, రూపక స్వరూప స్వభావ నిర్ణయ వివేచన మీదకు – అంటే క్రమక్రమంగా లక్ష్యభాగాన్ని వదలి, మౌలికమైన సూత్ర నిర్వచనలవైపుకు, ఆ సూత్రాలను వివరించే చరిత్రలవైపుకు మళ్లిందని అర్థం అవుతుంది.

సూరిశాస్త్రిగారు రాయదలుచుకున్న గ్రంథాలలో ప్రణాళికలుకూడా సిద్ధపరుచుకొన్న గ్రంథాలు యివి.

1. కావ్య సంతానము (320 పుటల క్రౌనుసైజు పుస్తకము)

"ఇందు నానాభాషల కావ్యవైఖరులు, దేశకాలావస్థలబట్టియు, జాతీయతననుసరించియు పొందిన మార్పులు, సర్వదేశకాలావస్థలకు సామాన్యమగు కావ్యరీతులు, కవిజీవితములు, కావ్యోద్యమములు విస్తరింపబడును" అని రాసుకున్నారు. ఆధునిక విమర్శనాపద్ధతులకు శాస్త్రిగారి ఈ ప్రణాళిక ఎంత మార్గదర్శకమో చెప్పనక్కరలేదు. ప్రతికావ్య సంప్రదాయానికి దేశకాలావస్థలను అనుసరించిన లక్షణాలు కొన్ని, వీటికి అతీతంగా సార్వకాలికమైన సూత్రాలు కొన్ని వుంటాయి – అన్న విషయాలు ఆధారంగా ఈ రచనను సాగించాలన్నది శాస్త్రిగారి ఆకాంక్ష అని అర్థం అవుతున్నది.

2. రూపక రసాలము (480 పుటల క్రౌనుసైజు గ్రంథం) :

"ఇది నటులకు, నాటక కవులకు, విమర్శకులకు, నుపయోగమైనట్లు రచింపబడినది" అంటూ శాస్త్రిగారు ఇందులో పాశ్చాత్య నాటకరీతులను గురించి, భారతీయ నాట్యశాస్త్ర పద్ధతులను గురించి కూలంకషంగా చర్చించదలచినట్లు కనిపిస్తుంది. ఆయన ముద్రించిన రచనా ప్రణాళికను చూస్తే పై రెండు గ్రంథాలు ముద్రణ అయినట్లుగా అనుమానించవలసి వస్తున్నది. కాని అవేవీ ప్రచురింపబడలేదు..

ఇవికాక –

3. కావ్యాభినందనం – ప్రాచీన, నవీనాంధ్రకవుల కవితా వ్యాసంగంమీద వివేచన

4. కావ్యాంబుజం - తెలుగువారి గ్రామసారస్వతం (అంటే, జానపద సాహిత్యాన్ని) గురించి రాయాలన్నది వారి ప్రణాళిక.

5. మానసకల్పవల్లి - సైకాలజీ మీద రాయాలనుకున్న గ్రంథం.

6. కావ్య, లలితకళా రహస్యాలను తెలిపే పరిభాషా గ్రంథానికికూడా శాస్త్రిగారు ఒక ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు.

ఇవికాక, శాస్త్రిగారు అనేక సమకాలీన పత్రికలలో ప్రచురించిన వ్యాసాలుకూడా అనేకం ఉన్నాయి. ముఖ్యంగా "కృష్ణాపత్రిక"లో వచ్చిన వ్యాసాలు, "గ్రంథాలయ సర్వస్వం"లో ఆధునిక కవులను గురించిన వ్యాసపరంపర "నవీనాంధ్రకవులు" అన్న శీర్షికతో - ప్రచురించబడ్డాయి. ఈ వ్యాసాలు 1925వ సంవత్సరం ఏప్రిల్ సంచికతో ప్రారంభం అయ్యాయి. మొదటివ్యాసం "తిరుపతి వేంకటకవుల"మీద. ఇటువంటి ముద్రిత వ్యాసాలేకాక అసంఖ్యాకమైన అముద్రిత వ్యాసాలున్నాయి. ఈ అముద్రిత వ్యాసాలలో నూటికి తొంభైపాళ్లు రసాయన, భౌతిక శాస్త్రాలమీద ఉన్నాయి. ఇవి నిజంగా శాస్త్రిగారి జీవితకాలంలో ఆయన ప్రచురించి వుంటే ఆయనను ఒక "ఆధునికవిజ్ఞానసర్వస్వం"గా పేర్కొనవచ్చు. దురదృష్టవశాత్తూ ఆయన ఈ ప్రణాళికలను వదిలి స్వాతంత్ర్యోద్యమంవైపు తన దృష్టిని మళ్లించారు. ఆరోజుల ప్రభావం అటువంటిది. ఈ ప్రయత్నాలన్నింటిలోను మకుటాయమానమైనది ఆయన నాటకవిమర్శ.

సూరిశాస్త్రిగారు తాను నాటకాలను గురించి చేసిన మౌలికమైన విమర్శనాంశాలలో ముఖ్యమైన వాటిని సమీక్షించుకుంటే ఆయన తెలుగునాటక విమర్శకు చేసిన యోగదానం ఏమిటో యిట్టే అవగతమవుతుంది. "నాట్యాంబుజం"లో నాటకానికి అవసరమైన విభిన్నాంశాలను వేరువేరుగా అయినా సమగ్రంగా - నిర్వచించుకున్నాడాయన. "నాట్యోత్పలం"లో పాశ్చాత్యవిమర్శకుల నాటక విమర్శనాపద్ధతులను అవలోకనం చేశారు. "విమర్శక పారిజాతం"లో కళా రహస్యాలను (నాటకకళ కూడా అందులో ఒక భాగం) వాఙ్మయానికి, సాంఘిక మర్యాదలకు, నైతిక విలువలకు ఉండే పరస్పర సంబంధాలను అవగతం చేసుకున్నారు. ఈ విమర్శనా మాధ్యమాలనన్నింటినీ సమన్వయం చేసుకొని ఒక సంయోజనాత్మకమైన, సమన్వయపూర్వకమైన నాటకవిమర్శనా పద్ధతిని రూపొందించుకున్నారు. ఒక నాటకాన్ని విమర్శించేటప్పుడు నాటకరచన, నటన,

ప్రయోగం వీటన్నింటి సుసంగతమైన సంయోజనమే నాటక విమర్శ అని నిర్ణయించుకుని తదనుగుణంగా "నాట్యాశోకం"లో నాటకాలను, నాటక ప్రదర్శనలను విశ్లేషించాడాయన. ఈ నాలుగు గ్రంథాలను అధ్యయనం చేస్తే నాటక విమర్శకుడుగా సూరిశాస్త్రిగారు తెలుగు విమర్శకలోకాల్లో ఎందుకింత విశిష్టమైన వ్యక్తిత్వం కలవారో అవగతమవుతుంది.

సూరిశాస్త్రిగారు తెలుగువారికి అందించిన నాటక విజ్ఞాన గ్రంథాలలో ప్రతిపాదించిన అనేక మౌలికమైన ప్రతిపాదనలను విమర్శక సూత్రాలను క్రోడీకరించుకుందాం:

1. నాటకాన్ని ఒక సమిష్టికళగా గుర్తించి, ఆ గుర్తింపు ఆధారంగానే విమర్శలు చేయడం.

   నాటకాన్ని "కళా మకుటం" అన్నారాయన. నాటకాంగాలైన కవిత్వం, కల్పితగాథ, రంగప్రసాదనం, సంగీతం, అభినయం – ఇవి అన్నీ వేటికవి వేరువేరు కళలే. కాని "ఇన్ని కళల సమావేశమున నుత్పన్నమై మెరయు కళా మకుటము నాటకము' అన్నారు.

2. నాటకానికి లక్ష్యం అవసరమని, అది ప్రేక్షకోపదేశికంగా లేదా రససాధనంగా ఉండాలన్నది శాస్త్రిగారి దృఢమైన నమ్మకం. అందువల్లనే "నీతిభ్రంశవమే నాటకఫలం" – అనిపించే చింతామణికి కాని, ఉదారస్వభావుడు కాని, నైతిక నియమాలులేని పఠానుపాత్రకు కాని శ్రీరామ హరిశ్చంద్రాదుల కుండే భావసంక్షోభాన్ని కల్పించడం సహేతుకం కాదంటారు.

3. నాటకకర్తలలో గాథాకల్పనం ఎంతగా ఉంటుందో, ప్రయోగానుకూలంగా రాసేనేర్పు కూడా వుండాలని చెప్పడంవల్ల నాటకం అటు సాహిత్య ప్రక్రియగాను, యిటు దృశ్యకళామాధ్యమంగాను ఉండవలసిన ఆవశ్యకతను నొక్కి వక్కాణించారు.

4. "నిష్పక్షపాత దృష్టి" విమర్శకులకు ఉండవలసిన ముఖ్యమైన లక్షణం అని నమ్మారాయన. తాను బళ్లారి రాఘవాచార్యులను మొదటి తరగతిలో చేర్చదగిన, నటుడంటూనే ఆయన వంటి "బుద్ధిమంతులు" కూడా పఠానువంటి పాత్రను ధరించడం న్యాయం కాదంటారు. అలాగే వేదంవారి

ప్రతాపరుద్రీయంలో ఉండే జాతీయతను మెచ్చుకుంటూనే అందులో కొన్ని అనవసరమైన రంగాలే (పిచ్చివాడి రంగాలు నాటక కార్యానికి ఏవిధంగాను దోహదం చేయవన్నారు.) నాటక ప్రయోజనాలను దెబ్బతీస్తున్నాయన్నారు.

5. తన కాలంనాటి నటులలో ఉండే తరతమ భేదాలను గుర్తించి అలా గుర్తించడానికి కొన్ని లక్షణాలను సమకూర్చారు. రసాభినయనేతలు, యథారూప భావప్రకాశక నటులనీ – నటులను రెండు తరగతులవారిగా వింగడించారు.

6. తెలుగులో నటుల అభినయ పద్ధతులకు కొన్ని ప్రాథమిక సూత్రాలను స్థిరీకరించారు సూరిశాస్త్రిగారు.

7. తనకాలంనాటి నటుల అభినయ విధానాలను గురించిన మూల్యాంకనం చేసిన మొదటి విమర్శకుడు సూరిశాస్త్రిగారే!

8. ప్రాచ్య పాశ్చాత్య నాటక విమర్శనా పద్ధతులను కూలంకషంగా అవగతం చేసుకొని వాటిని యథాతథంగా అనుకరించక తనదైన విమర్శనా పద్ధతిని రూపొందించుకున్నాడాయన.

9. ప్రతి విమర్శనా గ్రంథంలోను మౌలికమైన లక్ష్యలక్షణాల సమన్వయం ఎలా సాధించాలో చూపించాడు శాస్త్రిగారు.

10. తన రచనలకొక ప్రణాళికను రూపొందించుకొని సామాన్య ప్రేక్షకులకు, పాఠకులకు అర్థమయ్యేవిధంగా తమ రచనలను రూపొందించారు.

ఇంతటి సమగ్రమైన, లక్ష్యలక్షణ సమన్వితమైన నాటకవిమర్శను రాయడం ద్వారా తరువాతి తరాల నాటక విమర్శకులకు మార్గదర్శకుడు, తెలుగు నాటక విమర్శకు పితామహుడు అయినాడు పురాణం సూరిశాస్త్రిగారు.

# నాట్యాంబుజము

## విషయసూచిక


మొదటి దళము*

**నాటకానుభవములు** ......... 41

రెండవ దళము :

**ఆంధ్ర నాటకములు** ......... 54

మూడవ దళము*

**నాటక సమాజములు** ........ 63

నాల్గవదళము

**ప్రసిద్ధ నటులు** ............... 69

ఐదవ దళము

**ప్రదర్శన విమర్శనములు** .. 145

ఏడవ దళము**

**నాటక సమస్యలు** .......... 185

ఎనిమిదవ దళము

**నాటక విమర్శనము** ....... 200


* *మూలగ్రంథంలో సూరిశాస్త్రిగారు కర్ణాటక, అరవ నాటకాలను గురించి, సింహళదేశం నాటకాలను గురించి, బొంబాయి కలకత్తాలలోని నాట్యశాలలు, నాటకములను గూర్చి, బయస్కోపు మూకాభినయమును గురించి కూడా ఈ మూడవదళములో పేర్కొన్నారు. అది ఇప్పటి కాలానికి అనవసరమని తలంచి ఆ భాగాలను పరిహరించడమైనది.*


** *ఆరవ అధ్యాయంలోని విషయాలు ఇదివరకే ఆయా రచయితల గ్రంథాలలో ప్రచురింపబడి వుండడంచేత, ఈనాడు ఆ సమస్యలకు ప్రాముఖ్యం లేకపోవడంవల్ల ఆ అధ్యాయాన్ని ("ఆరవ దళము"ను) ఈ సంక్షిప్తీకరించిన 'నాట్యాంబుజం' గ్రంథంలో పొందుపరచడం జరగలేదు.*

# నాట్య అశోకము

పేజి 220 నుండి 326 వరకు




'నాట్యాంబుజము' పుస్తక తొలి ప్రచురణ ముఖచిత్రము (1923)



విద్యానిలయము కుసుమాంజలి 1

# నాట్యాంబుజము

పురాణం సూరిశాస్త్రి

విద్యానిలయము

బందరు

బెజవాడ ఆంధ్ర గ్రంథాలయ ప్రెస్ (లిమిటెడ్) యందు
క. కోదండరామయ్యచే ముద్రింపబడినది.

1923

సర్వస్వామ్యము
స్వీకరింపబడినవి

మేలుప్రతి వెల 1—8—0.
సాదాప్రతి ,, 1—0—0.

'నాట్యాంబుజము' లోపలి ముఖపత్రం

# నాట్యాంబుజము

## మొదటి దళము

## నాటకానుభవములు

చిన్నతనములో నాటకములను పాటకచేరీలను దర్శించు వీలు కలుగకుండెను. నా యుపనయనసందర్భమున కూచిపూడి భాగవతులచే నాడింపబడిన ప్రహ్లాదనాటకము, రామ నాటకము నా ప్రథమానుభవముల నేర్పరచెను. బాల్యనైజమున వీని జిరకాల మనుకరించుచుంటిమి. సుమారు పదేండ్ల ఈడున వలందపాలెముకంపెనీవారి స్టేజినాటకము "శశిరేఖా పరిణయము" చూడగలిగితిని. కూచిపూడి భాగవతులు బాడిద చెక్క నగలను, కిరీటభుజకీర్తులను, మొగలాయితరహాదుస్తులను, హరితాళవర్ణమును విరివిగా నుపయోగించుచుండిరి. నాటకము ముగిసిన తెల్లవారి రంగమంతయు నద్దపుపెంకులతో నిండియుండెను. హంగులోని జనమంతయు పాత్రసంభాషణము, కీర్తనలు అందుకొని గందరగోళముగ బాడుచుండిరి. హాస్యగాడు ఎవ్వియో వర్ణించిన వాక్యములతో కొందర నానందింపజేయుచుండెను. స్త్రీ వేషము ప్రవేశించునపుడు తెరయొకటిపట్టి కాగడాలమీద గుగ్గిలము జిలికించి భామను తళుక్కున బ్రకటించుచుండిరి. ఈ భాగవతములో మిక్కిలి వికృతముగ నాకు తోచినపట్టు రాజుచేసిన ప్రతిచేష్టను, అభినయమును మంత్రి నిరర్థకముగ ననుకరించుచుండుటయే. వీధి భాగవతములందలి యంగవిన్యాసము, అభినయరీతులు నేనెప్పు డెరుగకుంటిని. మా నాయన నాటకపు మధ్యాహ్నముల నటులకు పద్యములను, దరువులను, జదువవలసిన రాగముల నిర్ణయించుచుండెను. అప్పుడు వారు తలచుచుండిన రాగములు చాలవరకు కర్నాటక సంగీత రీతులవేయని మాత్రము జ్ఞాపకమున్నది. శ్రీరాగము ప్రధానముగానుండెను. నరసింహమూర్తి వేసినవాడు ఆ దినము

ఉపవాసముండెను. ఆ కాలములో గ్రామములోని పెద్దమనుష్యులనేకులు భాగవతమందలి రసాభినయముల నెక్కువ ప్రోత్సహించుచుండిరి.

వలందపాలెపు కంపెనీ చెమ్మనగిరిపేటలో నొకపందిరిలో నుండెను. ఎదుట తెల్లని సైనుతెరలోపల చిత్రములు లేని గుడ్డపీలికల రంగపక్షములు, వికృతముగ భీకరముగ డాబురంగులతో జిత్రింపబడిన తెరలు యీపందిరిలో నమర్చబడి యుండెను. అప్పటికి బందరులో రామానాయుడుపేట హిందూథియేటర్, గొడుగుపేటలోని ఛత్రపూర్ జగన్మోహన్‌థియేటర్ ప్రసిద్ధములై హైందవపురాణ గాథలను గద్యములలో నాడుచుండిరి. కాని వీరి గద్యావస్థ నేను చూచి యుండలేదు. వలందపాలెపువారి శశిరేఖాపరిణయము ఆనాటి నాట్యవైఖరుల సామాన్యలక్షణములు ప్రతిబింబించునని నమ్ముచున్నాను. ముందు గజాననదర్శనము, సరస్వతీ ప్రసన్నము, సూత్రధారునకు కలిగెను. తాంబురాశృతితో తెలుగు కీర్తనలు, అప్పుడప్పుడు హిందూస్థానికీర్తనలు పాడబడుచుండెను. రాక్షసపాత్రములు చినాలిరంగు పూసుకొని, జెడలు వ్రేలాడ, వలవల కేకలిడుచు, నాపేటలోని నిద్రాయత్తులెల్ల రులికిపడునట్లుగా బొబ్బలిడుచుండిరి. గద్యము పట్టిపట్టి ప్రత్యేక రంగోచ్చరణఫణితులతో నుపన్యసింపబడెను. ఈ నాటకములో హాస్యగాడు వేపమండ నొకదాని నెత్తికి తగిలించుకొని యసందర్భపు వాక్యములతో నార్యుల నవ్వింప జూచుచుండెను. వైర్‌వర్కు విశేషము వాడబడెను.

1898లో గడ్డిపూడిభాగవతులు మావాకిట దాష్టీక పంతులు నాటకమును, రెడ్డికథను ప్రదర్శించిరి. వీరిలో కొందరప్పుడప్పుడు యాచనార్థము బందరువచ్చి మా యింటివారికి జాతీయములు చెప్పిపోవుచుండిరి. కూచిపూడి భాగవతులు, అభినయ సమయసంకేతముల ప్రకటించుటకు, తమ ముఖనేత్రహస్తముల, నేవిధి కష్టించి యలవరచిరో, అటులనే పగటిభాగవతులు, ఈ ప్రాంతముల మొగలాయీకాలపు ప్రభుత్వవర్గమును, జనసామాన్యమును యథారూపముగ ననుకరించుటలో బాటుపడిరి. తరువాతి స్టేజినాటకముల హాస్యాభినేతలు జాతీయములు జెప్పయత్నించినను, వీరి హాస్యసందర్భములు కాలోచితముగ నున్నను, హాస్యవాక్యములందెక్కువ స్వాతంత్ర్య సమయస్ఫూర్తులుండినను,

జాతీయాను కరణమందు నవీనహాస్యగాండ్రకు ప్రత్యేక శిక్షలేదు. పగటి భాగవతులు ప్రదర్శించినపట్లు, అధునాతన సంఘ పరిస్థితులకు సంబంధించినవి కాకపోయినను, ఆయా జాతి మానవులకు నాయా వృత్తులలో నుండువారికి నైజమైనవనియే చెప్పవచ్చును. డెల్టా సీమలలో పగటిభాగవతుల జాతీయానుకరణ మీనాడు కాలదోష మనుభవించినను, తెలుగుదేశపు మెట్టజిల్లాలలోను హైదరాబాదు ప్రాంతములోనునిప్పటికిని వర్తించు ప్రజాజీవనమున కివి యథారూపచిత్రములని భావింపదగును. పగటిభాగవతుల దుస్తులను, పాత్రౌచిత్యమును, స్వరాభ్యాసమును, ఈనాటి స్టేజిజాతీయములు సమీపించలేకున్నవి. ఈ పగటిభాగవతములు పూర్వము బ్రాహ్మణనటులచే నభినయింపబడెను. మానాయన చిన్నతనములో నిందు తాడేపల్లి విస్సయ్య మిక్కిలి పేరొందియుండి బందరులోని పెద్ద అధికారుల ప్రాపకమనుభవించుచుండెను. నేను చూచిన మేళము కూడ బ్రాహ్మణులదే. ఇటీవల బ్రాహ్మణులు జాతీయనాటకాభినయ శిక్షాభ్యాసములను వదలినట్లు కనుపించుచున్నది. ఈనాడు పగటిభాగవతము గొల్లలు, మాలలు, మున్నగు మేధాదరిద్రుల యాధీనమున జేరి ప్రతిభాసంపత్తి చెడియున్నది. ఇరువదియేండ్ల క్రిందటి వరకు అభినయ శాస్త్రసంకేతముల నభ్యసించి, భావరాగతాళముల యలంకారపరిజ్ఞానముతో, కూచిపూడి భాగవతులీప్రాంతమున నుత్తమరసాభినయముల జేయుచుండిరి. పగటి భాగవతులు ప్రత్యేక శిక్షనొంది సాంఘిక జాతీయస్వరూపమును బ్రదర్శించుచుండిరి.

ఆ కాలములో తోలుబొమ్మలు, దొమ్మరవాండ్రు, విప్రవినోదులు, భట్రాజులు, విశేషముగ వచ్చుచుండిరి. బయస్కోపులు తోలుబొమ్మలను చంపినవి. దొమ్మరవాండ్రు సర్కసుకంపెనీల దేరాడ్రెన్సు డౌలులకీల్గినవి. విప్రవినోదుల స్థానమును నవీనమాజిక్కు, మెస్మరిజములు, ఆక్రమించినవి. ఆ కాములో పల్లెటూళ్లయందు, సామాన్యపట్టణములందును జంగముకథలు చెప్పు తందనాలవాండ్రు అన్ని కులముల పెద్దలచే గౌరవింపబడుచు, మిక్కిలి యుత్సాహముతో, నభినయ కౌశలముతో, సమయస్ఫూర్తితో, వేషసౌష్ఠముతో నాంధ్ర మరాటీగాథలను జెప్పి మెప్పించుచుండిరి. వీరి కథాప్రసంగము చాలవరకు బాణముల పోలిక నడచుచుండెను. ఆంధ్రుల నాటకాంకురము లిట్టి

జంగముకథాబీజములనుండి యుత్పన్నమైనవనుటకు సందేహము లేదు. బుంజలవాండ్రు, సుద్దులవాండ్రు, కొన్ని కులపురాణములను, తెలుగు సీమల గ్రామదేవతల కథలను, రసపుష్టిగల చిక్కని తెలుగుపలుకులతో, ముచ్చటగ జీవకళ లుట్టిపడ జెప్పుచుండిరి. వీరందరు క్రమముగ పెద్దలగు రసజ్ఞుల యాదరణబాసి, కష్టజీవులగు సామరుల నిద్రావిలుంఠి తనిశావినోదముల కుపచరించి హీనదశయందున్నారు. 25 యేండ్ల క్రింద, బందరులో కవితాప్రదర్శనములు తరచుగ లేకుండెను. పంతులవారివేడలో తిరుపతి వేంకటేశ్వరుల శతావధానమునకు నేను పోయియుంటినిగాని పెనసళ్లు పంచిపెట్టుట, శాలువలు కప్పిన పండిత విగ్రహములు సభాస్తారులై గూర్చుండుటయు మాత్రమే నేనప్పటికి తెలిసికొనగలిగిన విషయము. పెండ్లిండ్లకాలములో మాత్రము భట్రాజులనేకులు గ్రామమునకు వచ్చుచుండిరి. వీరు వసుచరిత్రలోని పద్యములను, రాయన బాస్కరుని త్యాగసంకీర్తనము, తలలు మార్చిన స్తుతిపద్యములను, చక్కని శ్రీరాగశోభితమగు పల్లెటి తెలుగుపురాణశైలిలో పద్దెములు జదివి, దానకుతూహల మేర్పరచుచుండిరి. భట్రాజులిప్పుడు వినోదమునకైన గానరాకున్నారు. బాలకవులు, ఆశుకవులు, అవధానచతురులు, జంటకవుల గీతమాలికలు, దేశమునం దమేయపరిఢవంబుల నల్లికొన, తెలుగు దేశపు నైజకవితాభినయములు వింతలై రూపుమాసినవి.

ధార్వాడ కంపెనీ బందరుకు రావడము నేనెరుగను. వీరి ఆదర్శనమున బందరులో మూడు నాలుగు కంపెనీలు వెలసినవట. వీని తొల్లిటిరూపముల నేనెరుగను. నాదెళ్ల పురుషోత్తముగారు, మల్లాది అచ్యుతరామశాస్త్రులుగారు మొదలైన తెలుగుకవులు గద్యకీర్తన శ్లోకమయముగ, నాటకములువ్రాసి ఆడించుచుండిరి. ఈనాటకముల గద్యవైఖరి నిటీవల చూచినాను. అప్పటి ప్రోజునాటకములు అభినయమునకు యెక్కువ అవకాశమిచ్చుకుండెననుటకు సంశయము లేదు. బందరులో నాటకసమాజములచే యువకులకు గలిగిన నష్టములు నా కొక సంభాషణవలన తెలిసినవి. ఒకనాడు మానాయన పెందలకడ రాత్రిభోజనము చేయుచు, బండికట్టించుమని యాజ్ఞాపించెను. మాతాత "యెక్కడకు పోయెద"వని అడిగిరి. "నాటకమునకు"అనగా "ఊళ్ళోవాళ్ళ పిల్లలు

చదువుసంధ్యమాని నగానట్రా యెత్తుక వచ్చినాటకాలాడడము! వాళ్ళవాళ్ళ ఘోరించడము! మీవంటి ఉద్యోగస్థులు ఆనాటకాలు చూచిమెచ్చుకొనడంవల్ల, వాళ్ళు చేసేపని మంచిది అన్నట్టే అర్థమవుతుందిగదా! కాదా?" అని మా తాతగా రాక్షేపించిరి. అప్పటికే బందరులో ప్రధానపౌరుడుగనుండిన మా తండ్రి మిన్నక తలవాల్చి "బండి అక్కరలే"దని చెప్పుమనెను.

1899-1900లో గుంటూరు ఫస్టుకంపెనీ బందరువచ్చి ప్రదర్శించిన నాటకములలో వడ్డాది సుబ్బారాయుడుగారి వేణీసంహారము, వీరేశలింగముగారి శకుంతల, కృష్ణమాచార్యులుగారి సారంగధర, చిత్రనళీయములు, జనరంజకములై బరగి యిచ్చటి నాటకపుకంపెనీలకు పద్య మట్టు సమన్వితమైన నూతనాభినయరీతు లలవరిచినవి. వీరి నాటకము నొకదాని నేను చూడగలిగితిని. దినవహి కృష్ణమూర్తియను నాతడు రాజమందిరమునుండి వచ్చి గొడుగుపేట కంపెనీవారికి వేణీసంహారము నేర్పుచుండెను. గుంటూరు కంపెనీవారిలో వియ్యన్న, హాస్యమునకు గోపాలరావు, శాస్త్రులు, ప్రసాదరావు మిక్కిలి పేరొందియుండిరి. గుంటూరువారు హిందూస్థాని తోడి, ఫీలు, కాపీ, మొదలయిన రాగములను, హార్మనీపెట్టెను, మట్లను, బందరులో ప్రవేశపెట్టిరి. చట్రములు కట్టిన సీనరీ, వీరిని జూచియు వీరి తరువాత బందరువచ్చిన పార్శీకంపెనీల వలన యిచ్చటివా రవలంభించిరి. మాగంటి సుబ్బారావు హరిశ్చంద్రపాత్రమును నభినయింప నొక మారును, యెడ్వర్డు పట్టాభిషేక సమయములో బుట్టయ్య పేటవారి శకుంతలను, లక్ష్మణస్వామిగారి షుమేరుసింగు నొకమారును, లింగమూర్తికి విద్యార్థులు పతకమొసంగిన చిత్రనళీయము మాత్రమే మెట్రిక్యులేషను ప్యాసగుసరికి నేను చూచిన నాటకములు.

మదరాసులో నుండగా ఒకటి రెండు పార్శీనాటకములను బి.యే. పరీక్ష దాటులోపల జూచియుంటిని. బి.యే. దాటినవెనుక బందరులో రికామిగా నుండిన సమయములో యిచ్చట నాటకములను చాలా చూచియు, గుంటూరులో సెకండుకంపెనీ షేకు కనకరత్నంగారిదానితో విశేషసాంగత్య ముండియు, నాటకకళాభినయముల సందర్భములను తెలుసుకొన గలిగితిని. అప్పటికి దేశములో జాతీయభావము లంకురించి, చిలకమర్తి లక్ష్మీనరసింహము, తిరుపతి

వెంకటేశ్వరులు రచించిన భారతభాగవతగాథల పద్యనాటకములు అభివృద్ధిలోనికి వచ్చెను. వీనికితోడు ఈవన లక్ష్మణస్వామి గారు బందరులో ప్రతాపరుద్రీయము, రణప్రతాప మొదలగు నాటకముల నభినయించుచుండిరి. చరిత్రనాటకములలో అత్తపోరు బిడ్డమీద తీర్చినట్లుగా మహమ్మదీయులపై ద్వేషమూనుట నాకు దొల్లిటినుండియు నసహ్యముగనే దోచుచుండెను. గుంటూరు సెకండుకంపెనీలో ప్రసిద్ధనటులై యుండిన పెద్ద చిన్న లక్ష్మీకాంతములు, మల్లాది గోవిందశాస్త్రి, యెనమండ్ర శీనయ్య, యడవల్లి సూర్యనారాయణ, బందరులో దేవరకొండ సుబ్బారావు, పామర్తి సంజీవరావు మొదలగు నటుల స్నేహ మా కాలములో నేర్పడి, నాటకము లందెక్కువ యభిరుచియు, విమర్శకశక్తియు నేర్పరచినవి. ఈ కాలమందే తెలుగు సారస్వతమం దభిరుచియు, తెలుగులో శాస్త్రవిషయముల గూర్చి పుస్తకములు వ్రాయుటయు నారంభించితిని.

1911-1915 చెన్నపురిలో రసాయనశాస్త్ర మభ్యసించుచు నాంధ్రసారస్వత ప్రయత్నములలో బాల్గొనుచుండిన, కాలములో తమిళ, కర్ణాటక, పారశీక నాటకములను, బళ్లారి, రాజమండ్రి మున్నగు ప్రదేశముల ప్రసిద్ధాంధ్ర నాటక సమాజములవారియాటలను, బయస్కోపులో జూపబడిన జగద్విఖ్యాత నటుల అభినయములను, కొన్ని ఆంగ్ల నాటకములను, అన్ని కత్తులసంగీతరీతులను అనుభవించియుంటిని. ఇటీవల బందరులో నెద్దియో యొకనాటక సమాజమున కెల్లప్పుడు సంబంధినై యుంటయేగాక హిందూదేశమం దెల్లెడ గల వివిధ భాషల నాటక ప్రదర్శనములు చూడగలిగితిని.

నేను నటుడను కాను. కవిని గాను. సంగీతమందావంత యేనియు నాలాపించలేను. నాట్యరంగముల జిత్రించు నేర్పరినికాను. కాని కావ్యసంగీతాభినయముల రసస్వరూపమును, సరసముగ ననుభవించు విమర్శక విచక్షణ మొదటి నుండియు నాకెట్టులో అలవడినది. నవలలు, నాటకములు, పద్యకావ్యములు విశేషముగ జదివియు చిత్రప్రపంచమందలి భావప్రకటనము మనసార గ్రోలియు, నుత్తమనాట్యసంగీత విద్యాప్రదర్శనంబు లనేకముల జూచియు, నాటకములందలి మంచి చెడ్డలు గుర్తించు వివేక మొప్పుచుంటిని. రసలక్ష్యములచే కన్న, గ్రంథావలోకనముచే కన్న, ప్రపంచమును నవరసభరితమైన

ఆవస్థలలో జక్కగ బరికించి చూచుటవలన నాకు కావ్యనాటక కళాలక్షణములు విస్పష్టముగ బోధపడినవి. కళలన్నిటియందును సమానమైన ఆదరణాభిమానములు వానిలోని యందచందములారయు విజ్ఞానానుభవములు నా విద్యాభ్యాసకాలాంతమునకు జక్కగ కుదిరినవి. "నీవు యింత చక్కని విమర్శక సూత్రము లెక్కడ చదువుకొన్నావు?" అని చెన్నపురిలో నుండగా నిప్పటి తెలుగు కవులలో వన్నెగాంచిన కొంద రడిగిరి. "అన్ని రకాల మనుష్యుల జీవితాంశములను లక్ష్యముతో, సానుభూతితో విచారించుట వలనను ప్రకృతిని కనులు తెరచుకొనిచూచి అందలి రసభావములను లోతుగ ననుభవించుటచేతను కళారహస్యముల గుర్తింపగలిగితిని. ప్రకృతియే నేనుపయోగించెడి యలంకార లక్షణము."

కాలేజీలలో గావ్యనాటక విమర్శనమునకు ఉత్తమ గణ్యత నొందుచు, నుపాధ్యాయుల మెప్పు వడయుచుంటిని. బి.యే. లో నుండగా సంస్కృత నాటకములందలి స్వభావాదర్శ గుణముల గూర్చి వ్రాసిన ఆంగ్లవ్యాసము (The Real & Ideal in Sanskrit Drama) పండిత మాల్సూరు రంగాచార్లగారిచే మిక్కిలి ప్రశంసింపబడినది. సారస్వత శిల్పములం దెట్లో అటులనే నాటక విమర్శనమందు లభ్యమైన మహావిమర్శకుల నెల్లర జదువుచుంటిని. తరువాత సందర్భవశమున వ్రాయబడిన రూపకాభినయవిమర్శనములలో గొన్నిటి నిందు బొందుపరచియున్నాను.

1915 డిశంబరులో బందరుపురమందు కానుకొలను వెంకట్రామయ్యగారిచే నెలకొల్పబడిన ఆంధ్రనాటక ప్రోత్సాహక సంఘపు పోటీపరీక్షలు జరిగినవి. ఆ వెనుక నీ సంఘమునకు నేను కార్యదర్శినై రెండు సంవత్సరములు దీని వ్యవహారములు నాటకపరిషత్తను[1] పేరుతో జరుపుచుంటిని.

---

**1. నాటక పరిషత్తు :** ఈ సంస్థ పూర్తిపేరు ఆంధ్రనాటక పరిషత్తు. 1915లో బందరులో కలవకొలను వెంకటరామయ్యగారి చేత ప్రారంభించబడింది. నాటకాలకు చర్చావేదికగాను, నాటక పోటీలను జరపడంలోను ఈ సంస్థ ప్రసిద్ధి కెక్కింది. 1915-17 మధ్యకాలంలో పురాణం సూరిశాస్త్రిగారు ఈ సంస్థకు కార్యదర్శిగా ఉండి రసాయనిక శాస్త్రం నుంచి తన దృష్టిని నాటక విమర్శవైపుకు మళ్లించారు.

గుంటూరు, నెల్లూరు, విశాఖపట్టణము మొదలైన తావులనేకములందు నాటక పరీక్షల గురించియు నాటక సంస్కరణమును గూర్చియు నుపన్యాసముల నిచ్చుచుంటిని. నాటకాభిలాషులనేకులచే నాటకాభినయముల గూర్చి విమర్శలు తెప్పించి కృష్ణాపత్రికలో ప్రచురింపజేసితిమి. మరియు నాటక సాహిత్య విషయముల జర్చించు నుపన్యాసములను, సభలను, బందరులోను, యితర తావులను జరిపించి వీనిలో ప్రముఖులగువారల గొందర గౌరవించుచుంటిమి. నా యాజమాన్యమున బందరులో, నెల్లూరులో పోటీ పరీక్షలు రెండు మూడు జరిగినవి. కాని పోటీపరీక్షల వలన మాత్సర్యమున కవకాశము లొడముచుండెను. నాటక సమాజముల పెద్దలెంత వివేకౌన్నత్యములుగల వారయ్యును, సామాజికులలో పెక్కురు సామాన్య సంస్కారులగుటచేతను, పరీక్షా సమయమున కొందరు నటులు అదివరకెవ్వరు జూచి తలచియుండని ప్రతిభావిర్భావమున విస్తరించుటచేతను, పరీక్షాధికారులు వేషభాషాభినయ సంగీతముల కేర్పరచిన గణనపద్ధతులలో నన్నిటియందు సమాన సౌకర్యముగల సామాన్యనటునకు మొత్తము మీద యేదో ఒక దానియందు విశేషలక్షణముండి మిగిలినవానిలో జంకుచుండిన నటనాయకులకన్న యెక్కువ ఫలితము వచ్చుటచేతను, పర్యవసానము అపజితుల కాశాభంగముగ నుండుటచేతను పోటీపరీక్షలు విరోధముల కాకరమై పరిణమించెను. చిరకాలము నాయనుంగుమిత్రులగు కొందరతో నీకారణమున నౌదాసీన్యమేర్పడెను. ఈ పని బాగుండలేదని నాసంబంధము 1918లో వదలుకొంటిని. నాటకపరిషత్తు కార్యదర్శినై యున్నకాలములో "ఆంధ్ర నాటక నామావళి[2]" అను చిన్నపొత్తమున నప్పటికచ్చులోనున్న నాటకాదులను విభజించి ప్రాంత రసేతివృత్తముల భేదమును సహేతుకముగ నేర్పరచియుంటిని. మరియు ననేక పెద్దల రావించి యుపన్యాస పరంపరలతో నాంధ్రనాటక సాహిత్య సందర్భముల బందరుపౌరుల కందించుచుంటిని.

---

**2. ఆంధ్రనాటక నామావళి :** 1916లో ఆంధ్రనాటక పరిషత్తు పక్షాన సూరిశాస్త్రిగారు కూర్చిన నాటక సూచికాగ్రంథం. 1901 నుంచి 1916 వరకు వచ్చిన నాటకాల పట్టికతో పాటు ఏ రకం నాటకాలు ఎన్నెన్ని వచ్చాయో సంవత్సరాలతో సహా యిచ్చిన సతార్కికమైన క్రోడీకరణ. ఈ నాటకాలను పాత్ర- ఇతివృత్త-రస భేదాలు ఆధారంగా కూడా వివరించడం జరిగింది.

నేను సభ్యుడనైయుండిన "చిత్రకళాభివర్ధనీ" సంఘము సామాన్య నాటక సమాజములకన్న కొత్తదారులు త్రొక్కనేరక కాలధర్మమొందినది. దినవహి కృష్ణమూర్తి వచ్చిన కాలములో నయ్యంకి శ్రీరాములను యువకునితో కూడ నాటకములందు అభినయింప నిచ్చగించితిని. కాని సంగీతము లేమిచే నాటకాభినయమున కుపయోగింపక చదువులలో బాగుపడగలిగితిని. 1901లో నేను, న్యాపతి మాధవరావుగారు, వేమూరి చిన్నయారావుగారు మొదలగు బాలుర మొక ఆంగ్ల నాటకాభినయ సమాజ మేర్పరచితిమి. ఇందులో గొడుగుపేటలోని మిత్రులనేకులు చేరి చంద్రహాస, మృచ్ఛకటిక మొదలైన నాటకములభినయించుచు వచ్చిరి. ఈ సమాజమే క్రమముగా చిత్రకళాభివర్ధనియైనది. ఇది కార్యజడత్వమును పొంది యావల ముత్తరాజు సుబ్బరాయుని పేర మొలకెత్తి[3] ముద్రారాక్షసాది నాటకముల బ్రదర్శించినది.

కూచిపూడి భాగవతములు 1900–1915లో అడుగంటి జనాదరణలేక క్రుంగుచుండెను. ఈ వెనుక విద్యాధికుల కభినయ సాంప్రదాయములందు అభిమానమెక్కువ వికసించినది. స్టేజి నాటకములు కొంతకాలము పద్యములతోను, మట్లతోను, హోరున హార్మోనీ మ్రోతలిడ, తపలా ప్రబోధమున వీనులు తల్లడిల్ల తమ కాలమనుభవించినవి. 1900–1908లో కృష్ణమాచార్యులగారి[4] నాటకములు అమలులో నుండెను. 1909–1916 వరకు భారత నాటకములు, రసపుత్రగాథలు వాడుకలో ప్రబలియుండెను. ఇంతవరకు తెలుగుజిల్లాలలోని నాటక సమాజములు ఆయా గ్రామములందలి యువకుల యుత్సాహ సహాయములచే చిన్నవిగా

---

**3. ముత్తరాజు సుబ్బారావు :** "శ్రీకృష్ణ తులాభారం" నాటక రచయిత. స్వస్థలం బందరు. కొంతకాలం నెల్లూరు కళాశాలలో చరిత్రోధ్యాపకులుగా ఉన్నారు. ఆ సమయంలో నెల్లూరు ఆంధ్రసభకు ఉపాధ్యక్షులుగా ఉన్నారు.

**4. కృష్ణమాచార్యులు :** ధర్మవరం రామకృష్ణమాచార్యులు. ప్రఖ్యాత నాటక రచయిత. బళ్లారిలో ప్లీడరు. "సరస వినోదిని సభ" అనే ప్రఖ్యాత నాటక సంస్థను స్థాపించి, ఈ సంస్థ కోసం 28 నాటకాలను రాసి దర్శకత్వం వహించి దిగ్విజయంగా ప్రదర్శించిన ఘనుడు. 'ఆంధ్రనాటక పితామహుడు' అన్న సార్థక నామధేయుడు.

బయలుదేరి క్రమముగ కొంచెము ధనార్జనము సేయుచు శాశ్వతభవనములను రంగపరికరములను సంపాదించుకొనుచుండెను. కొన్ని తావుల నాటకములతో సంబంధములేని ధనికులు నాటకశాలలను వేయించి యద్దెలకిచ్చుచుండిరి. స్వకీయభవనములుగల సమాజముల శాలలను ఊరిలోని తక్కుడుకంపెనీ లద్దెకుతీసుకొని ఆడుచుండిరి. నాటక సమాజములలో తొలుదొల్త సభ్యులర్థప్రతిఫల మపేక్షింపక తమసొత్తునే వ్యయపరచి నడిపించుచుండిరి. బళ్లారి కంపెనీలు ప్రప్రథమమున జీతగాండ్రగు వేషధారుల నుపయోగించుపద్ధతి యేర్పరచినవి. 1912 ప్రాంతముల రాజమహేంద్రవరములో గున్నేశ్వరరావు, నాగేశ్వరరావు గార్ల నాటక సమాజము[5] వర్తక వ్యవహారలక్షణములతో నారంభించినది. విశాలమైన నాటక భవనము, ప్రకృతి నతిశయించు రంగస్థలము, దివ్యమైన దుస్తులు, నానా ప్రాంతములనుండి మంచి వేతనములిచ్చి తెప్పించిన నటవర్గము, పార్శీపద్ధతులలో బొంబాయి, కలకత్తా పురములందలి యార్థిక నాట్యశాలల ననుసరించు శిక్షాపద్ధతులు గున్నేశ్వరరావుగారిచే నాంధ్రదేశమున ప్రవేశపెట్టబడినవి. వీరిమార్గ మవలంబించి మైలవరం, మోతే కంపెనీలు బెజవాడలోను, దుగ్గిరాల, తెనాలి, అల్లూరు మొదలగు తావులందును పెద్ద నాటక వ్యాపారములు మొలచినవి. ఈ సంస్థ లుత్తర సర్కారులలోని మంచినటుల నందర నాకర్షించుచు, స్వతంత్ర నాటక సమాజములకు, పాత్ర దారిద్ర్యమేర్పరచినవి. కృష్ణా, గుంటూరు, గోదావరిజిల్లాలు జలవాహినీ సౌకర్యమున పంటల కుదురులై, సుభిక్షముగనుంటచే నిచ్చటి జనులన్న సమృద్ధిగలిగి బాలురకు విద్యాసంస్కారమీయ గలిగి యున్నారు. అందుచేత బళ్లారి, ఉడిపిసీమలలో వలె నాటక కంపెనీలకు బాల పాత్ర వేషగాండ్రు దొరుకుట దుర్లభమగుచున్నది. దొరికిన కొద్దిమందిని నాటక వ్యాపారసంస్థ లీడ్చుకొని పోవుచున్నవి. ఇట్టి పెద్ద కంపెనీల శిక్షలవలనగాని యాంధ్ర నాటక పద్ధతులు కళాపరిణామ మొందనేరవని యెడవల్లి

---

**5. గున్నేశ్వరరావు, నాగేశ్వరరావుల నాటక సమాజము :** రాజమండ్రిలో సత్యవోలు గున్నేశ్వరరావు, కృత్తివెంటి నాగేశ్వరరావులు ఆధిపత్యం వహించిన 'హిందూ నాటక సమాజం'. ఇది మొదటి ప్రధానమైన వృత్తి నాటక సంస్థగా గుర్తింపు పొందింది.

సూర్యనారాయణ[6] మొదలగు ప్రసిద్ధనటులు చెప్పుచున్నారు. నిజమే! ఏదో యితర వ్యాపారములందు దినమంతయు పొట్టకూటికై బాటు పడుచు కళాభిలాషచే నొకింతకాలము అభినయాభ్యాసమునకు వినియోగించెడి నాటకాభిమానులచేతిలో తెలుగునాటకములు పదునుదేరజాలవు. వ్యాపార నాటకము లొసంగు నిరంతర శిక్షావిధానమునగాని నటు లారితేరరు. కాని ఈ వ్యాపార నాటకసంస్థలందు వేలకొలది మూలధనము వెచ్చింపబడి సమాజపోషణమునకు విశేషద్రవ్య మవసరమగుటచే ప్రజారంజకమగురీతి నాటకములనాడి జనసామాన్యమును మెప్పించి ద్రవ్యమార్జించవలసిన యగత్యమేర్పడినది. ఈ నాటక సంస్థాపకులు వ్యాపారధీరత నొప్పియు, నాటకాభినయ కళాకోవిదులు గానివారగుటచే, వీరి నాటకాదర్శములు బొంబాయి, కలకత్తా పురముల నాటక వ్యాపారరీతుల ననుసరించి జనించుటచే రంగుటింగుల జనసమూహమును మెప్పించవలయుటచే, నీ పెద్దకంపెనీలు నటులకు నిత్య ప్రత్యేకశిక్ష నొసంగుచున్నను, మంచి నటుల నొకచో గూర్చినను, విజాతీయ సంగీతపద్ధతుల కాంధ్రభాషను లోబరచి నాటకసాహితీ వినాశన మొనర్చియున్నారు. తెలుగుపలుకుల తేటపదునులు నైజసంగీతలావణ్య మొప్పుచు భక్తి శృంగార కరుణారసవాహక సామర్థ్యమున ప్రపంచములోని బాసలన్నింటి మించి యున్నవి. ఇట్టి సుకుమారాంధ్రపద సౌష్ఠవము, వ్యాపార నాటక సమాజముల తపలాదరువులకు, బెదిరి బొప్పెకట్టి యున్నది. తెలుగుబాస పాపట్ల కాంతయ్యగారి[7] లయప్రస్తరణోత్సాహదంభత్వమున

---

**6. యె(య)డవల్లి సూర్యనారాయణ :** స్వస్థలం గుంటూరు. అక్కడ చిన్నతనం నుంచీ నాటకాలు వేస్తూ ముందు మైలవరం కంపెనీలోను, ఆ తరువాత మోతే వారి కంపెనీలోను ఆనాటి ప్రధాన నాటకాలలోని అన్ని ప్రధాన భూమికలను ధరించి పేరెన్నికగన్న వ్యక్తి. హరిశ్చంద్ర, నల-బాహుక, పఠాన్, దుర్యోధనుడు, దుష్యంతుడు వంటి వైవిధ్య భరితమైన పాత్రలను నిర్వహించి ప్రసిద్ధిపొందిన నటుడు.

**7. పాపట్ల కాంతయ్య :** జగ్గయ్యపేటకు చెందిన నాటక సంగీత నిపుణుడు. ఆంధ్ర దేశాన్ని కొంతకాలం పాటు ఉర్రూతలూగించిన ఆయన పర్యవేక్షణలో వచ్చిన పార్శీమెట్ల సంగీతం వల్ల పేరు పొందినవాడు. ముందు రాజమండ్రి హిందూ నాటక సమాజంలోను, ఆ తరువాత మైలవరం కంపెనీలోని అన్ని నాటకాలకు సంగీత సారథ్యం వహించి పాటలు రాసి, మట్లు కూర్చి పేరు ప్రఖ్యాతలు సంపాదించిన వ్యక్తి.

సొంపుపెంపుల వదలి జిక్కియున్నది. సీనరి సొగసు, నటుల సామర్థ్యము, రంగరచనా కౌశల్యము, హంగుబలము, మొదలగు నంగసమృద్ధిచే తళుకులాడెడి వ్యాపార నాటకము లీప్రాంతముల ప్రేక్షకుల మాననమాకర్షించి జనసామాన్యమునకు వ్యాపార నాటకరీతులే యభినయాదర్శములను భ్రాంతి కలిగించినవి. 1914–1922లో మనప్రాంతముల నాటకములన్నియు, పైవాని పద్ధతుల నవలంబించుకొనుచుండెను. పోటీపరీక్ష లెల్లెడల వ్యాపించి, నాటక విమర్శనము పరిఢవిల్లిన, 1915–18లో నాటకాభినయ లక్షణములు కొంతవరకూహింపబడినవి. సంగీత మభినయమున కవకాశమొసంగదనియు, నాటకములలో సంగీతమును, హార్మనీ మున్నగు దుష్కరోపవాద్యములను తగ్గించి పార్శీమట్ల యొత్తిడిచే తెలుగుబాస నలుగకుండ కాపాడవలెననియు, పండిత జనాభిప్రాయము ప్రబలుచుండెను. కాని నాటకముల ఆదరణ రసజ్ఞులును, కళాపరిణామ విజ్ఞాతలును అగు విద్యాధికులవలన గలుగక, టింగురంగుల నాలకించెడి యసంస్కారుల ప్రోత్సాహమున జరుగుచున్నది. నాటకమనగానే డబ్బుతో పని; ద్రవ్య సంపాదన ముండినగాని, నాటక సమాజములు నిలువనేరవు. విద్యాధికులు, ఉద్యోగిజనములు నాటకకళను బోషింపని వ్యవస్థలో, నాటక సమాజములు జీవనాధారమునకు పామర జనానందకరముగ వర్తించు టొక తప్పు కానేరదు.

గుంటూరు, బందరు మొదలగు పురములలో సంగీత సాహిత్యములందు శిక్షపడసిన స్వతంత్రజీవనోపాధుల నొప్పు పెద్ద మనుష్యులనేకులభినయకుతూహుల మేర్పడ నాదర్శ పరిణామమున నభినయింప నుద్దేశించి నాటక సమాజముల నెలకొల్పిరి. కాని వీనిలో బాల స్త్రీ వేషధారులు లభించకుండుట చేతను, ఈ పాత్రములు లేనిది నాటకములు జనరంజకములు గాకపోవుట చేతను, సామాజికులు స్వకీయవృత్తులందు నిరతులై తమ నాట్యవిధుల సక్రమముగా నెరవేర్పనందునను, యుద్యోగభరితమైన నాటక ప్రయత్నములు క్రమముగా

జచ్చుచున్నవి. బళ్లారి కంపెనీలు[8], చెన్నపురి సుగుణవిలాససభ[9], తెనాలి కంపెనీలు[10], కొంతవరకు వ్యవహారిక పద్ధతుల మీద నడుపబడి, ప్రధాన పాత్రములు రసజ్ఞులగు స్వతంత్ర విద్యాధికులచే నడుపబడుచున్నవి. ఎట్లయినను, మొదటి నుండియు, పెద్ద వర్తక శాఖా నిర్మాణమందుగాని, రాజ్యధూర్వహణమందుగాని, చిరకాలము నుండి తరిఫీదు లేకుండిన, ఆంధ్రులు పారశీక మహారాష్ట్రుల వలె విపుల సంస్థాపనల నిర్వహింపజాలకున్నారు. ఆంధ్రదేశమంతకును ఆదర్శప్రాయమైన విద్యా సంస్థాపనముకాని, గ్రంథ భాండారముగాని, నాటకశాలగాని నిర్మింప నవకాశములు గన్పట్టవు. స్వకీయ సామర్థ్యముచే నేర్పడు నల్ప సంస్థల సమాదర్శ ప్రవర్తనముచే, నాంధ్రులు తమ సంకల్పముల నీడేర్చుకొనవచ్చును. సమస్త విషయములలో నిట్టి స్థితియే గోచరించుచున్నది. పై వ్యాసములలో స్వానుభవమున దెలిపెడి నానా రాష్ట్ర నాటక లక్షణముల వలన నాంధ్రులే నాటకకళ యందు ఆదర్శసామీప్యమును జేరియున్నారని విశదపడును. ఆంధ్రనాటకరంగమున వలయు మార్పులను ముందు సూచించెదము.

❁

---

**8. బళ్లారి కంపెనీలు :** ఆ రోజులలో పరస్పరం ప్రత్యర్థులుగా నిలిచి నాటకసేవ చేసిన ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి సరసవినోదిని సభ, కోలాచలం శ్రీనివాసరావుగారి సుమనోరమ సభ- ఈ రెండు బళ్లారి కంపెనీలకు ఖ్యాతి ఉండేది.

**9. చెన్నపురి సుగుణ విలాస సభ :** చెన్నపురిలో ప్రఖ్యాత తమిళ రచయిత - దర్శకుడు సంబంధం మొదలియారు, ప్రఖ్యాత రచయిత, న్యాయవాది భవానందం పిళ్లై, రత్న సభాపతి ప్రభృతుల సహాయంతో ప్రారంభించి ఇంగ్లీషులోను, తమిళ, తెలుగు, కన్నడ భాషలలోను నాటకాలాడడానికి వేరు వేరు విభాగాలను రూపొందించుకొన్న సంస్థ.

**10. తెనాలి కంపెనీలు :** ఆ రోజులలో తెనాలిలో రెండు కంపెనీలు బహుళ ప్రచారాన్ని పొందాయి. ఒకటి, శ్రీకృష్ణ విలాససభ, రెండవది శ్రీరామ విలాససభ.

రెండవ దళము

# ఆంధ్ర నాటకములు*

మనుష్యునకు స్మృతియను జ్ఞాపకశక్తి యేనాడు కలిగెనో, ఆనాడే నాటకములారంభమైనవి అని చెప్పవచ్చును. స్మృతివలన వెనుక జరిగిన సంగతులు మనోగతములై వలయునపుడెల్ల గోచరించును. దీనివలననే మనుష్యుడు తన ప్రస్తుతావస్థలచే కలుగనోపని రాగద్వేషములను బుద్ధిపూర్వకముగ దెచ్చిపెట్టుకొని, వాని ఫలితమనుభవింపకయే అనుభవించెడివానిపగిది కనుపడుచుండును. కోపము లేకయే కోపముండిన వానివలె నగుపడుట, భయము, శోకము, హాస్యము, తృప్తి, ప్రేమ మున్నగు మనోచేష్టలను ఆవేశించి యభినయించుటయే నాట్యము. "అవస్థానుకృతిః నాట్యం." తేలు కుట్టినప్పుడేడ్చుట నాట్యము కాదు. కుట్టనప్పుడు కుట్టినవానివలె నాచరించుటయే నాటకారంభము. మనుష్యుని యవస్థలననుకరించుటయే గాక జంతుచేష్టల నభినయించుటయు వాని కూతల ననుకరించుట కూడ నాట్యమనబడుచున్నది.

ఇట్టి యల్పోత్పత్తిగల నాట్యము మనుష్యుని మనోవిన్యాసము ననుసరించి యనేకరూపముల దాల్చినది. మన ఆంధ్రదేశములో గొల్లగంతులు, చెంచు ఆటలు, జంగము కథలు, పంబల సుద్దులు, తోలుబొమ్మలు, పగటి భాగవతములు, జాతీయములు, నృత్యనృత్తమయమగు భాగవత కలాపములు, సురుచిర భావపూరితములయి మానవవృత్తుల దలుకుటద్దములవలె ప్రతిఫలింపజేయు నాటకములు మున్నగు పరిణామముల జెందియున్నది. ఇందులో ఏది ముందు?

---

* 1916లో 'గ్రంథాలయ సర్వస్వము'లో మొదటిసారి ప్రచురితం. అది 'నాట్యాంబుజము'లో ఇక్కడ పునర్ముద్రింపబడ్డది.

ఏది వెనుక? నవరసములతో గూడి మనుష్యుని మనోవ్యాపారములను, గూఢాలోచనలను, సుఖదుఃఖములను, ప్రజ్ఞావిజయములను, విధి బలిమియు ననేక కథా సందర్భములలో నతి చమత్కారముగను, సంతోషదాయకముగను జూపట్టు నాటకరాజము లేతెరవున తొల్లిటి కోతిగంతుల నుండి పరిణమించినవి? ఈ పరిణామము, ఈ నాటక విన్యాసము మనయాంధ్రమున నాత్మ ప్రేరణచే కలిగినదా? లేక సంస్కృతాంగ్లేయ పారసీకాది వాఙ్మయముల సంపర్కమున నుదయించినదా?

ఆంధ్రదేశమునకు గంజాము జిల్లాలోని శ్రీకాకులము వద్దనున్న నాగావళీ నదిని యుత్తర సరిహద్దుగ నంగీకరింపవచ్చును. దక్షిణమున నాంధ్రము కాంచీపురము పాలారు నదుల వరకు ఆక్రమించియున్నది. చెన్నపురి నుండి బళ్లారి వరకును బోవు సరళరేఖయు నాయెడ నుండి హైదరాబాదు మీదుగా జయపురము వరకు జనునదియు పశ్చిమ సరిహద్దులు. ఇట్టి యాంధ్రదేశములో తెలుగు నాటకముల పూర్వరూపము సమానముగ వ్యాపించి యుండెను. కృష్ణా గోదావరి తుంగభద్ర పెన్నానదుల పల్లపుసీమలు తొల్లిటి నుండియు ఫలవంతములై విద్వాంసులకునికిపట్టులై యుండెను. ఈ ప్రాంతముల యందు భరతశాస్త్రా లంకృతములయిన రూపకములు ఆడబడుచుండెను. ఇచ్చటి వారలే బొబ్బిలి మొదలు కాళహస్తి పర్యంతము వ్యాపించు ఆంధ్ర రాజ్యస్థానములకరిగి భరతశాస్త్ర విలాసముల జూపుచుండిరి.

తురకలు, ఆంగ్లేయులును మునుముందు నదీతీరముల గల ముఖ్యపట్టణములనే స్వాధీనపరచికొని యాయాతావుల తమ రాజ్యముల స్థాపించుచు వచ్చిరి. అందుచే బందరు, రాజమండ్రి, బళ్లారి, నెల్లూరులలోని ప్రజలును ఆయూరుల సమీప దేశమందలివారును ఎక్కువ నాగరికులై నూతన మార్గముల నవలంబించగల చలాకితో కూడియున్నారని శంకరన్నాయరు[11]గారొక తావున జెప్పిరి.

---

**11. శంకరన్నాయరు :** 20వ శతాబ్దం తొలి దశకాలలో మద్రాసులో ఉన్న ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు.

1870లో మొదలిడి, 1890 నుండి గడచిన యిరువది యయిదు సంవత్సరములలో మిక్కుటముగ వ్యాపించి ఆంధ్రదేశమును నాగరికపరచిన విద్యావ్యాప్తియు, దేశాభివృద్ధియు పూర్వవిద్వత్ స్థానములను రాజ్యసీమలను ఇవి మిక్కిలిగ బాగుచేసినవి. రోడ్లు, కాలువలు, రైళ్ళు, పోస్టు తెలుగుసీమల జుట్టివైచి రాకపోకల కెంతయు వీలు కలిగించినను – విద్యాభివృద్ధియు విద్యాలయ ప్రతిష్ఠాపనమును నదీతీరములను పూర్వవిద్వత్ స్థానములందును ఎక్కువగ జరుగుచున్నవి. విద్యావ్యాప్తి ననుసరించియే ముద్రణాయంత్రములు వెలయుచున్నవి. ముద్రణాయంత్ర విస్తరణము ననుసరించియే గ్రంథ ప్రచుర(ణ)ము జరుగుచున్నది. అభివృద్ధి యాంధ్రదేశ మంతట నున్నది. కాని కొన్ని తావులయందు మిక్కుటముగను మరి కొన్నిట నల్పముగను జరుగుచున్నది. పోస్టాఫీసు పని చేయుచున్నదేకాని యొక తావున ప్రచురించు పుస్తకములు మరి యొక తావున రుచించుచున్నట్లు గోచరించదు. విద్యావ్యాప్తి యచ్చటచ్చటి ప్రచురముల వలననే జరుగునుగాని యన్యమైనవానిచే జరుగదు.

కడచిన 25 సంవత్సరములలో నాంధ్రదేశమునకు గలిగిన విద్యాసంస్కారమును, అందుచే నాటకరచనకు గలిగిన మార్పులను భావభేదములను విమర్శించినచో నీ పాతిక సంవత్సరములను మూడు కాలములుగ విభజింపవచ్చును.

మొదటి 10 సంవత్సరముల ప్రథమ కాలమునందు (అనగా 1891–1901) ఆంధ్రులకు ఆంధ్రమునందభిమానము లేకయుండెను. మన ప్రబంధములు బూతులనియు, మన శాస్త్రములు కల్లలనియు, మన యాచారము లమానుషేయములనియు నేర్చుకొనవలసినది, ప్రేమింపవలసినదెల్ల యాంగ్లేయమే యను నభిప్రాయము జనసామాన్యమున వ్యాపించి యుండెను. ఈ కాలములో వ్రాయబడిన నాటకములు చాలభాగము దేశవాళీ ఫక్కి ననుసరించి పూర్వరూపకములుగ నుండెను. నూతన పద్ధతుల ననుసరించినవి సంస్కృత నాటకములకు భాషాంతరీకరణములుగ నుండెను. సంఘములోని యాచారములను నిరాఘాటముగ నిర్దయతో దెగడు ఫార్సులు వెలువడుచుండెను.

ఆంగ్లేయ నాటకముల ననుసరించి కొందరు వ్రాయుచుండిరి. నిజముగ నాంధ్రమైనది ఎక్కడను గానరాకుండెను[12].

విక్టోరియారాజ్ఞి మృతినొందె. ఆమెతో నాంగ్లేయ ప్రభుత్వపు శాంతరుచులు అస్తమించెను. 1901 మొదలు 1906 వరకు జరిగిన 5 సం॥ముల ద్వితీయకాలములో హిందూదేశమందొకవిధమైన శంక సమస్త విషయములందు కలిగెను. మనకేవిధమైన నాగరికత, శాస్త్రములు, మర్యాదలు, శిల్పాదికళలు ఉన్నవి? మనము మనుష్యులమేనా? పశువులమా? మన ప్రభువులు మనకన్న ఎక్కువ కాదా? మన యైశ్వర్యమే వారి యానంద మనుమాట నిజమా? మన అభివృద్ధి మన యాధీనముననే యున్నదా? అను శంకలు కలుగసాగెను. ఈ కాలములో బంగాళా మహారాష్ట్ర భాషలను గొందరు ఆంధ్రులభ్యసించిరి. అచ్చటి విద్వాంసులు హిందూ విద్యలను గరచి యందలి భావగాంభీర్యమును రసపుష్టిని వెల్లడింపసాగిరి. ఈ కాలములో కొన్ని చరిత్రనాటకములును కొన్ని ప్రబంధాత్మకములయిన గాథలు నాటకములుగను ప్రచురింపబడుచుండెను.

1906తో మూడవకాలము ప్రారంభమగుచున్నది. మన మంచిచెడ్డలు మనచేతిలోనె యున్నవనియు మన సంఘమభివృద్ధిలోనికి రాదలంచినయెడల సంఘసంస్కరణముకన్న సంఘములోని పూర్వచరిత్రలను విద్యలను ఆచారములను మరల బ్రతికించి వాని వెలుగున నూతన మార్గముల నరయ వలయుననియు ప్రజలకు దోచినది. చక్కని ప్రబంధములన్నియు నాటకములుగ మార్చబడినవి. వీరరసమును బుట్టించు భారతకథలు మిక్కుటముగ నాటకములలో జేరినవి. దేశచరిత్రల ననుసరించియు బంగాలీ మరాటీ హిందీ భాషలలోని నవలల ననుసరించియు చరిత్రాత్మకములయిన నాటకములనేకములు బయలు వెడలినవి. దేశములో జరుగు వృత్తాంతములు నాటకములుగ వ్రాయబడుచున్నవి. ఈ పది

**12.** సూరిశాస్త్రిగారు 1923 నాటికి కన్యాశుల్కం నాటక ప్రదర్శనను చూసినట్లు లేదు. 1925లో ప్రచురించిన 'నాట్యాశోకము'లో కన్యాశుల్క నాటకాన్ని గురించి, రామవిలాససభ ప్రదర్శనను గురించి వివరంగా ముచ్చటించారు. 1924లో రామ విలాసభ వారి కన్యాశుల్కం ప్రదర్శన మీద వ్యాసాన్ని నాట్యాశోకంలో చూడవచ్చు.

సంవత్సరములలో నూతన పద్ధతులు వచ్చినవిగదాయని పూర్వగాథలు పూర్వపు వీధి భాగవతపుఫణితిలో నాటకములు మానలేదు. ఈ దిగువ పట్టీ వలన నేజాతి నాటకములెన్ని బయలువెడలినది తెలియగలదు.

**(1906 – 1915)**[13]

| **ఇతివృత్తము** | **క్రొత్తరకపు స్టేజి నాటకములు** | **ప్రాతరకపు వీధిభాగవతములు** | **మొత్తము మొత్తము** |
|---|---|---|---|
| పురాణగాథలు | 48 | 3 | 51 |
| భారత కథలు | 38 | 2 | 40 |
| రామాయణకథలు | 32 | 5 | 37 |
| కృష్ణకథలు | 20 | 3 | 23 |
| హరిశ్చంద్రలు | 15 | 5 | 20 |
| శాకుంతలములు | 8 | 5 | 13 |
| భోజప్రబంధములు | 5 | 0 | 5 |
| తెలుగు ప్రబంధముల ననుసరించినవి | 14 | 1 | 15 |
| సంస్కృతములోనివి | 20 | 0 | 20 |
| ఇంగ్లీషులోనివి | 14 | 0 | 14 |
| పార్శీలోనివి | 8 | 0 | 8 |
| ప్రజారంజకములు | 53 | 13 | 66 |
| ప్రహసనములు | 16 | 0 | 16 |
| చరిత్రలు | 38 | 0 | 38 |
| సాంఘిక విషయములు | 54 | 0 | 54 |
| ఎందులోను చేరనివి | 5 | 5 | 10 |
| మొత్తము | 388 | 42 | 430 |

**13. 1906-1915 నాటకముల పట్టిక :** "ఆంధ్రనాటక నామావాళి" పేరుతో వచ్చిన చిన్న పుస్తకంలో ఈ నాటక వివరాలు యివ్వబడ్డాయి.

ప్రాత నాటకములనునని చాలభాగము మదరాసులో బ్రచురించబడి చాకలిపేట తిరువట్టూరు మొదలగు తావుల నివసించుచు పంగనామాలు పెట్టి రేఖలాబండ్లపై పరుగిడు "వీటుకారు"లచే నుపయోగింపబడుచున్నవి. ఇందులో కొన్ని చిత్తూరు, కార్వేటినగరం, కాళహస్తి, అమ్మనబ్రోలు మొదలయిన తావులగూడ వాడబడుచున్నవి. ఈ ప్రాతనాటకములన్నియు పురాణగాథలు, ప్రజారంజకములగు కథలు కల్గియున్నవి. నాటక విషయములలో చెన్నపురిది మిక్కిలి యనాథస్థితి.

నూతన నాటకములలో కర్నూలు, అనంతపురము నుంచి 3 నాటకములు ప్రచురింపబడినవి. కడప జిల్లాలో ఏమీ కనుపించవు. కృష్ణా గోదావరి విశాఖపట్ణం జిల్లాలతో బాటు బళ్లారి కూడ సర్వవిషయములందు నాటకాభివృద్ధిని జేసియున్నది. ఫార్సులు చాలభాగము పల్లెటూళ్ళలో పోరాడికాని, రాగద్వేషములు ప్రబలిన మీద కాని వ్రాయునవై యున్నవి. సాంఘికవిషయమైన నాటకములు చాలభాగము మన సంఘములోని దురాచారముల గూర్చియు సంఘసంస్కరణ ప్రయత్నములను గూర్చియు వ్రాయబడినవి. పురాణగాథలలో ప్రహ్లాద వామన చరిత్రలు, పౌరాణిక వివాహములు, అవతారకథలు చేరియున్నవి. రామాయణ కథలలో తరుచుగ సీతాకళ్యాణము, పాదుకా పట్టాభిషేకము వచ్చును. వీని వెనుక ఉత్తర రామాయణకథలు, అరుదుగ రామప్రవాసము, యుద్ధము, సంపూర్ణ రామాయణము, భారత నాటకములలో విరాటపర్వము, సుభద్రావిజయము, శశిరేఖా పరిణయము ఎక్కువ వాడుకలో నున్నవి. కృష్ణగాథలలో రుక్మిణీకళ్యాణము సర్వసాధారణము. దీని వెనుక శ్యమంతకమణి కథ, పారిజాతాపహరణము, కుచేలోపాఖ్యానము యథాక్రమముగ ప్రజారంజకములని తోచుచున్నవి. ప్రజారంజకములగు నాటకములు సామాన్యముగ శృంగారరసముతో గూడి యేకారణముచేతనో విషాదభావమును కలిగింపునవిగ నున్నవి. ఇందు సారంగధర, తారాశశాంక విజయము, బిల్హణీయము, ఉషాపరిణయము, సావిత్రికథలు, చంద్రమతి కథలు, దమయంతి, చంద్రకాంత, చంద్రహాస, స్త్రీ సాహసము మున్నగునవి యథాక్రమముగా గారవింపబడుచున్నవి. తెలుగు ప్రబంధములలో నాటకముగ రచియింపబడి పేరొందినది మనుచరిత్ర. దీని వెనుక హరిశ్చంద్ర, శాకుంతల, వైజయంతీవిలాసము, పారిజాతాపహరణము, కళాపూర్ణోదయము,

ప్రభావతీప్రద్యుమ్నములు వచ్చుచున్నవి. ప్రజారంజకములగు గాథలలో చాలభాగము ప్రబంధముల ననుసరించినవేగాని, వాని జనరంజకము మనుచరిత్రవలె కవియందలి గౌరవమువలన నేర్పడినది కాదు. ఆ కథలు దేశములో ప్రాకి ప్రబంధకర్తలచే గైకొనబడినట్లే నాటకకవులచేగూడ స్వీకరింపబడినవి.

1905వ సంవత్సరములో మొత్తము మీద 10 నాటకములు ప్రచురించబడెను. 1891–1905 లోపల నూరు నాటకములకన్న నెక్కువ వెలువడలేదు. ఇందులో 70 నాటకములకు పైగా ప్రాతఫణితివే. దీనిచే గడచిన 10 సంవత్సరములలో ఆ వెనుకటి 15 సంవత్సరములోకన్న నాల్గురెట్లు గ్రంథములు వెలువడినవనియు, ప్రాత నాటకముల సంఖ్య 11 వీసముల నుండి 1½ వీసమునకు పడిపోయినదనియు తేలుచున్నది. ఇట్లు పడిపోవుటచే అభినవ నాటకములు మదరాసు, దక్షిణ నెల్లూరు, పల్నాడు, పాకనాడు, తిరుపతిసీమల జొచ్చినవని యెంతమాత్రము దలపకూడదు.

హైదరాబాదులోను మరికొన్ని తావులను కులపెద్దలకథలను డ్రామాగా వ్రాయు వాడుక కలదు. చిక్కయ్య, లక్ష్మీనరసింహసోమయాజులు, శివరామబ్రహ్మం, రామమోహనరాయి మొదలగువారి జీవితములు రూపకములుగ జేయబడినవి. వాని రుచి నేనెరుగను.

**కడచిన పది సంవత్సరములలో –**

| | |
|---|---|
| 1906లో–20 | 1907 – 20 |
| 1908 – 29 | 1909 – 44 |
| 1910 – 42 | 1911 – 59 |
| 1912 – 49 | 1913 – 60 |
| 1914 – 56 | 1915 – 49 |

నాటకములు ప్రచురింపబడినవి. నాటక ప్రచురములకును సంవత్సర సంఖ్యకును సంబంధము లేదు. కాని ఆంధ్రదేశములోని ముద్రణాయంత్రముల సంఖ్యగాని నాటక సమాజముల సంఖ్యగాని దొరికిన యెడల, ఆ సంఖ్యలకును నాటకప్రచురములకును గణితనిబద్ధమైన సంబంధము గోచరింపవచ్చును.

తెలుగుదేశమున ఎన్ని నాటకసమాజములున్నదియు అవి యే నాటకము లాడునది తెలిసిన యెడల ఆంధ్రుల నాటకాభిరుచుల దెలుపు మ్యాపులనే గీయవచ్చును. ఇట్టి మ్యాపులను మాసంఘమువారు ప్రచురించు క్యాటలాగులతో బాటు వెలిబుచ్చనుద్దేశించియున్నాము. ఇండస్ట్రియల్ మ్యాపును జూచినచో నేదేశమున కేవిధమైన వస్తువులు కావలసియుండునో తెలియును. అటులనే ఆంధ్రదేశమందలి నానా ప్రాంతములలోని నాటకకంపెనీలు, ఆడే ఆటలు, వాని ప్రదర్శనాక్రమణములు దెలిపెడి మ్యాపులుండినచో మనము సులభముగ నచ్చటి ప్రజల రుచులను గుర్తెరిగి పని చేయగలుగుదుము.

ఆంధ్రదేశములోని కృష్ణా గుంటూరు గోదావరిజిల్లాలలో నభినవ ప్రదర్శనారీతుల దెచ్చిపెట్టినది ధార్వాడ కంపెనీ[14]. ఇది షుమారు 25 సంవత్సరముల క్రింద నీదేశము వచ్చి యప్పటివారి నేత్రముల భ్రమింపజేసెను. ఇది వెడలగనే ఊరూర కంపెనీలు వెలసెను. పెద్దమనుష్యుల పిల్లలు యిండ్లలో నుండి నగలెత్తుకుపోయి తమ విద్యావ్యాసంగములవీడి నాటకములపాలైరి. అప్పటి నాటకములలో సీనులు తక్కువ. తీగెపనులు ఎక్కువ. సూత్రధారుల సంస్కృతపు శ్లోకములు, గజానన్ దర్శన్, రాక్షసులు "వలవలవలా" అని గొంతుక చినిగిపోవునట్లు కేకలు వేయుట, హాస్యగాడు లోకోక్తుల గ్రుమ్మరించుటయు అప్పటి వికారములు. నాటకములు సామాన్యముగ వచనములో నుండెను. ఆ వెనుక వచనము కీర్తనలు కలిసియుండెను.

ఇంతలో బళ్లారి కంపెనీవారు[15] పార్సీ నాటకముల వలన ప్రదర్శనారీతుల గరచి చెన్నపురికరిగియు నితర పట్టణముల కేగియు తమ నాటకముల విరివిగ నాడసాగిరి. వీరి నాటకములలో పద్యములు, కీర్తనలు విస్తారముగ నుండి నాట్యనృత్యములతో ధగధగలాడుచుండెను. వీరి పద్ధతి

---

**14. ధార్వాడ కంపెనీ :** 1880వ సంవత్సరంలో ధార్వాడ నుంచి ఆంధ్ర దేశానికి వచ్చి పలు పట్టణాలలో హిందీ నాటకాల ప్రదర్శనలివ్వడం ద్వారా ఆంధ్రదేశంలో నాటకాభిమానాన్ని ఉద్బుద్ధం చేసిన సంస్థ. ఇది రెండు సార్లు 1880లోను, 1885లోను ఆంధ్ర దేశంలో పర్యటించి నాటకాలను ప్రదర్శించింది.

**15. బళ్లారి కంపెనీవారు :** సూరిశాస్త్రిగారు యిక్కడ పేర్కొన్న నాటక సంస్థ ధర్మవరం వారి సరస వినోదినీ సభ.

తెలుగుదేశమంతటా వ్యాపింపసాగెను. ఎక్కడ చూచిన నాటకములు వ్రాయువారే! పార్సీమట్లు, పద్యాలు నిండిపోయినవి. ఈవిధముగ కొంతకాలము సాగినది. నాటకములలో చేరినవారు చాలమంది యవనీతులుగ నుండి ఇండ్లను, ఒళ్ళును గుల్లచేసియుండుటచే నాటకపు కంపెనీల కొకవిధమగు కళంకమేర్పడినది. పూర్వము రంభా నృత్యము చేసినవారు యిప్పుడు ముదుసలులయినారు. ఇప్పుడు వారి తావునకు జేరువారు కానరాకున్నారు. దేశము సుభిక్షముగ నుండుటచే మన జిల్లాలలో నాడువేషము ధరించువారును బాలురును దొరకకున్నారు. దొరికినవారు ఒకచో నిలువక ఇచ్చ వచ్చినరీతి సంచరించుచున్నారు. ఇందుచే నాటకకంపెనీలు దుర్దశ జెందియున్నవి.

కొన్ని తావులలో విద్యాధికులు నాటక సమాజముల నిలిపి యందు సాంప్రదాయపరులగు బాలురనే చేర్చి, వారి నీతినియమముల కాపాడుచు, నాటక ప్రదర్శకుల కొకనూతన గౌరవమును దెచ్చుచున్నారు. ఇట్టి ప్రయత్నములు ప్రముఖముగా నెల్లూరు, రాజమండ్రి, బళ్లారి, బందరు పురములలో జరుగుచున్నవి.

విద్యాధికులు నాటకములందు పాత్రములు గైకొనుటచే నవి రసయుక్తమగును, అర్థదోషములు లేకుండెను. ప్రదర్శింపబడుటయేకాక వారి ప్రదర్శనములు పాత్రౌచిత్యముల గూర్చిన యుపన్యాసములని చెప్పనోపును. వీరలు పిల్లవాండ్రు దొరకని కారణముననను, చెడుదురను భయముననను స్త్రీ పార్టు పిల్లల పార్టు యెక్కువగ లేని నాటకము నభిలషించుచున్నారు. విద్వాంసులేర్పఱచిన కంపెనీలలో అనేక హేతువులచే చరిత్రాత్మకమైన నాటకములు, సాంఘిక ప్రహసనములు ఆదరింపబడకున్నవి. ఇట్టివే మిగుల దేశోపకారకములైన నాటకములు. ఆంధ్రమున నాటక విమర్శనము లేదు. అందుకు తగిన పరిభాష యేర్పడలేదు. విమర్శములు వ్రాయువారు పాశ్చాత్య విమర్శకుల సిద్ధాంతము లవలంబించిరి. హిందూదేశపు ప్రత్యేక భావమును మన ప్రాచీన సంస్కారములను, రుచులను గుర్తెఱుగక నాటకములను దెగడుచున్నారు. ఆంధ్రకవులకు ప్రాచ్య పాశ్చాత్య నాటక లక్షణముల పరిజ్ఞాన మేర్పడి జాతీయ సాంప్రదాయములను గుర్తించి ఆధునిక జీవితార్థములతో సమన్వయపరచగల శక్తి యేర్పడినగాని మన నాటకములు బాగుపడనేరవు. విమర్శకులు కూడ నిటులనే యుభయ సాంప్రదాయాభిజ్ఞులై నాటక సంస్కరణమునకు దారి చూపుచుండవలయును. ☸

### మూడవ దళము

# నాటక సమాజములు

## చెన్నపురి సుగుణవిలాససభ

చెన్నపురి సాంఘిక జీవనములో పెద్దపాయాల నభిలషించువారు, కాస్మోపోలిటన్ క్లబ్బులో చేరి తమ యాశల సిద్ధి జేసికొనుచుందురు. ఆటలలో రుచిగలవారు యునైటెడ్ క్లబ్బు, యస్.ఐ.ఎ., యం.సి.సి. మొదలైనవానిలో జేరుచుందురు. సంగీతమందు ఆసక్తికలవారు మైలాపూరు, తిరువళిక్కేణి, ముత్యాలపేటలలో గాయకసంఘములను యేర్పరచుకొని యున్నారు. హరికథలు జరిపించు సంఘములు కొన్ని కలవు. సుగుణ విలాససభలో, యిన్ని లక్షణములు చేరియున్నవి. చెన్నపురిలోని రసజ్ఞులగు విద్వాంసులు, కళాపోషకులగు ధనికులు కూడి, కలసి పనిచేయునది సుగుణ విలాససభయే.

సుగుణవిలాస సభలో తెలుగు, ఇంగ్లీషు, అరవము, కొన్ని సమయములలో సంస్కృతము – ఈ భాషలలో నాటకముల నడిపించు ప్రత్యేక శాఖలున్నవి. ఈ సభవారి నాటకములు, ప్రధానముగా సభాసభ్యుల వినోదము కొరకేర్పడి పై సంపాదనకంత ప్రాముఖ్యత లేదు. నాటక ప్రచారము షేక్సుపియరు ఉత్సవములవారములోను, దేవీనవరాత్రములు, శ్రీరామనవమి, కృష్ణాష్టమి, గణపతిపూజ, క్రిష్టమసు శలవులలో జరుగుచు నాయాపట్ల ఖర్చంతయు కొందరు ధనికులచే భరింపబడును. అందుచేత సుగుణవిలాస సభవారి నాటక ప్రయత్నములకు ద్రవ్యాటంకములు గలుగక, సరళముగ నడుచుచుండెను. సభ్యులు వారివారి పాయా యెట్టిదైనను, సభా కార్యనిర్వహణమందు హెచ్చుతగ్గులెంచక అందరు పూనికతో, కట్టుతో కలిసి యే పనినైనను జేయ సంసిద్ధులై యుందురు.

నటులు కూడ యివ్విధమైన సమభావమునే అన్ని పాత్రముల యెడ జూపుచుందురు. నటులలో కొద్దిమంది జీతగాండ్రున్నను, చాలమంది వేతనము కన్న సభాసభ్యత వలన గలుగు నుద్యోగాభివృద్ధినే గమనించి ఊరకే పని చేయుచుందురు. సుగుణవిలాససభ స్వతంత్ర జీవనముగల పెద్ద మనుష్యుల నాటక సమాజమైనను, యిందలి కట్టుదిట్టములు, శిక్షాక్రమము, వ్యాపార నాటక సమాజముల పద్ధతులను మించియున్నవి.

బళ్ళారిసీమలో గానకుతూహలమెుప్పు గాలిపాటకులు సరసవినోదినీసభవారి పార్శీఖత్తు, తెలుగుమట్లను పాడుకొనుచుందురు. మన జిల్లాలలో రాత్రివేళ నొంటరిగా దిరుగు తెరువరులు 'ఖలులై నాడు', 'అల్లుడారమ్మని', 'జాగయ్యననుకొట్టునోగురుండని', కొండలయండ, చింతామణిలోని పద్యాలు, కొన్ని మైలవరం కీర్తనలు పాడుకొనుచు నిశాసంచారభీతిని పోగొట్టుకొనుచుందురు. అనగా తెలుగుజిల్లాలలోని సంగీతాభిలాషుల ప్రథమ సాధనభరతలక్షణ మొప్పని నాటక సారస్వతములో దేలుచుండును. మధుర, తంజావూరు మొదలైన అరవ జిల్లాల పిల్లవాండ్రు సంగీతవిన్యాస మెక్కువగనున్న ఉత్తమగీతములను, కృతులను, రాగములను, పల్లవులను పాటకచేరీలలో తాము విన్నవాటిని అనుకరింప యత్నించుచుందురు. దక్షిణాది జనసామాన్యపు గానాదర్శములు తెలుగువారికన్న యిటీవలవరకు చాల విశుద్ధమగు నుత్తమ గానలక్షణములతో నుండెననుట సామాన్యానుభవము. దక్షిణాది దేవాలయముల నాశ్రయించి సంగీత కళాపరిశోధనమొనర్చు మహాగాయకుల ఆదర్శములే అచ్చటి జనసామాన్యము నూరించుచున్నవి. అందుచేత విశుద్ధమైన దక్షిణాది స్మార్తవైష్ణవకులజులతో నిండియున్న సుగుణవిలాససభ వారి సంగీతాదర్శములు తెలుగునటుల గాన సాంప్రదాయములకన్న యెన్నో రెట్లు సరసముగను, శ్రావ్యముగను, లక్షణసమన్వితముగను యేర్పడియున్నవి.

దక్షిణజిల్లాలలో సంచరించువారొక విశేషమనుభవింతురు. పాఠశాల వదలి గుంపులుగా వీటికేగు బాలురలో పెక్కుమంది లలితకోమల సుందరాకారములనొప్పుచు, బొద్దుగను, అందమగు స్త్రీరూపమునను, కనుపడుచుందురు. ఇది నేను చూచినంతలో దక్షిణాది బ్రాహ్మణబాలుర సామాన్య

లక్షణమై యున్నది. అదే యీడుగల తెలుగు బాలురు సన్నగా పొడుగుగా, స్వతంత్రపురుష లక్షణములతో నగుపడుచుందురు. పెద్ద యెదిగిన తరువాత కూడ దాక్షిణాత్యుల శరీర మెక్కువ కోమల సౌందర్య తేజస్సులను జూపుచు, తెలుగువారి దేహములు బలవీర్యపాటవంబున పరిమాణగాంభీర్యమును కలిగియుండును. ఇది సామాన్య లక్షణము. ఈ హేతువుచేత దక్షిణాదినాటక సమాజములకు తెలుగువారికేర్పడని స్త్రీ వేష సౌకర్యము గలిగియున్నది. సుగుణవిలాససభవారి ఆంగ్లాంధ్ర తమిళ నాటకముల నాయికా స్వరూప లావణ్యముల నందికొనజాలు స్త్రీ వేషధారులాంధ్రదేశములో లేరనియే చెప్పవచ్చును.

ఈ సభవారి నానాశాఖల సూత్రధారులు ధనికులై, విద్యాధికులై, చెన్నపురియు, భారతభూమియు, నొసంగగల నాటకకళా ప్రసిద్ధ స్వరూపములను జూచి విమర్శింపగల యవకాశములొప్పియున్నారు. సంబంధ మొదలియారు[16], భవానందం పిళ్లై[17] మొదలగువారు సామాన్యులుకారు. సంగీత పరిజ్ఞానము, నాట్యలక్షణానుభవము, కావ్యాలంకార పరిచయము, విమర్శక జ్ఞానము కల వీరలు తమకు ఆజ్ఞానువర్తులగు నైచ్ఛిక నటవర్గముతో, విపులమగు ధనసహాయముతో జనసామాన్యమును రంజింపజేసి డబ్బు సంపాదించుటకుగాక కులవిద్యాధికార ధన సంస్కారము లొప్పు తమ సభ్యుల వినోదము కొరకు రచించి యభ్యసించిన నాట్యవైఖరులు మన రాజధాని కెల్ల నాదర్శప్రాయముగ నుండుటకు సందేహము లేదు.

సుగుణవిలాససభ వారి సీనరీ కర్ణాటక సమాజముల సీనరీనిగాని, బొంబాయి యింపీరియల్ నాటకమండలి వారి దానినిగాని, కలకత్తా ఆల్ ఫ్రెడ్డు కరింతియను రంగవైభవములగాని, సిలోను కంపెనీల యంత్ర సమృద్ధినిగాని

---

**16. సంబంధం మొదలియారు :** పి.సంబంధం మొదలియారు. చెన్నపురి సుగుణ విలాససభ ప్రారంభకుడు. నాటకకర్త, నటుడు. ఆంగ్ల, తమిళ నాటకాలలో ప్రముఖ పాత్రలు ధరించాడు. హామ్లెట్ పాత్రకు పేరు పొందాడు. సుగుణ విలాససభను ధర్మవరం వారి ప్రేరణతో ప్రారంభించానని సంబంధం మొదలియారుగారు చెప్పుకున్నారు.

**17. భవానందం పిళ్లై :** సుగుణ విలాససభలో ముఖ్య సభ్యుడు. నాటక రచయిత.

యొప్పుకున్నది. సుగుణవిలాససభ నాటకాభినయములందెట్టి సాధుసంస్కార మగుపడుచుండునో, అట్టి లలితరామణీయకమే వీరి సీనరీయందగుపడును. వెట్టిరంగుల వింత తళుకు లీరంగమున గానరావు. దుస్తులు పాత్రోచితమగు రీతులలో సవిమర్శగ చక్కని సంస్కార మేర్పడినట్లు గూర్పబడినవి. ఈ నాటకములో హార్మ నీ కేవలము శృతి కొరకే సన్నని సరసస్రోతల నూదుచు,, నటులపాటలతో ఫిడేలు నినాదము మిళితమైయుండును. ఫిడేలే ప్రధానానుకరణమని చెప్పవచ్చును. కథాసందర్భములో సంగీతము అభినయమునకును రసప్రకటనముకును ఉచితమైనంతవరకు సన్నని లేతపాకములో నుపయోగింపబడుచున్నది. మధ్యమధ్య హాస్యపు పట్లలోను, నారదుడు మొదలగు గాయకమూర్తు లేతెంచినపుడును, సుగుణవిలాససభవారి ప్రధాన గాయకులు తమ గానవిద్యా నైపుణ్యమును విస్తరించి జూపుదురు. ఈ విషయములో కర్ణాటకులు కూడ నిటులనే ప్రవర్తించుచున్నారు. కథా సందర్భమును బట్టి శ్రుతి, గానవైఖరి, సీనరీ, దుస్తులు, నటప్రవర్తనము, అభినయ విశేషము గూర్పబడి అన్నియు నారంగములోని ప్రధానరసభావముల నుద్దీపించు మేళవింపులో కలిసి కరిగి యొక్కటై, మిక్కిలి ప్రశాంతముగను, రమ్యముగను, రసవాహకముగను ఉండును.

సుగుణవిలాససభవారి షేక్సుపియరు నాటకము లైదారు చూచియున్నాను. లీలావతీసులోచనై, అల్లీఅర్జున అను తమిళ నాటకములను, స్వారోచిష మనుసంభవము[18], రామరాజ్య వినాశనము[19], చిత్రనళీయము[20] తెలుగునను

---

**18. "స్వారోచిష మనుసంభవము" :** మనుచరిత్ర ఆధారంగా బేతపూడి భగవంతరావుగారు 1919లో రాసిన నాటకం.

**19. "రామరాజ్యవినాశనము" :** కోలాచలం శ్రీనివాసరావుగారి రచన. "ఫాల్ ఆఫ్ విజయనగర్" అన్న పేరుతో ఆంధ్రనాటకరంగంలో మూడు దశాబ్దాలపాటు విజయవంతంగా ప్రదర్శింపబడిన నాటకం. ఇందులోని పఠాన్ పాత్ర ధరించినవారిలో ఈవెన లక్ష్మణస్వామి, బళ్లారి రాఘవ, నెల్లూరు నాగరాజారావు, డి.వి.సుబ్బారావు ప్రఖ్యాతి పొందారు.

**20. "చిత్రనళీయము" :** ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1887లో రచించి, ప్రదర్శించిన నాటకం. ఈ నాటక ప్రదర్శనలో ధర్మవరం అనుసరించిన రాగయుక్తమైన - పద్యనాటక పఠనంతో తెలుగులో పద్యనాటక యుగం ప్రారంభమైంది.

జూచియున్నాను. అన్నిటిలో అభినయము ప్రధానాంశమై, సరసప్రశాంత రామణీయక మెంచదగిన విషయమై, పాత్రౌచిత్య మెన్నదగినదై యున్నది. అందరు పాత్రధారులు, తమతమ భాగములను కూడికతో నిర్వహించినందునను, వేషభాష గీతాభినయములకుచితమైన సరసావకాశనియమము లేర్పడుటచేతను, శాంతరుచుల సీనరీ, యౌచిత్యమొప్పు దుస్తులు గల్పించినందునను, శిక్షాక్రమము లోనివి యన్నియు చక్కగ మేళవించి, యొక సుందరాకార చిత్ర ప్రదర్శనము, చక్కని కాంబినేషనుతో గూర్చునందునను సుగుణవిలాససభ వారి నాటకములాదర్శ ప్రాయములై యున్నవి. ఈ సభలోగాని, మైలవరం, గున్నేశ్వరరావు, మోతే, రామవిలాస్, బళ్ళారి నాటకసమాజములలో గాని, మన చింపిరి బందరు నాటకాలలో నగుపడునట్టి స్వకీయాభినయ ప్రభావముగల నటులు, గాయక శిఖామణులు కనుపడరు. కాని వారిలోని సర్వాంగ సౌష్ఠవము, మేళవింపు మనయందగుపడమిచే నీ నాటకములు వికృతముగ, భీభత్సముగ, నసహ్యముగ నున్నవి.

చెన్నపురి నాటకము లభివర్ణించుటలో అచ్చటి ప్రజాదర్శములు బేసరసమని చెప్పియుంటిని. ఇది నిజమే. జనసామాన్యపు నాట్యాదర్శములట్టివే. సుగుణవిలాససభ చెన్నపురి ప్రజావర్గపు నాటకసమాజము కాదు. అవి వేరే యున్నవి. ఇది చెన్నపురిలోని రసిక విద్వాంసులమండలియై ప్రజాజీవితము నేవిధముననైనను మార్పజాలకున్నది.

### బళ్ళారి, మైలవరం[21], రాజమండ్రీ[22] నాటక సమాజములు

వీరందరు తెలుగుపలుకుల నైజసత్త్వ మెఱుంగక పార్సీమట్ల వింతవిరుపుల నాంధ్ర భాషకు జేర్చి, పార్సీనటుల లైములైటుల పోజుల నాశ్రయించి

**21. మైలవరం కంపెనీ :** దీని పేరు "బాల భారతి నాటక సమాజం". కృష్ణాజిల్లాలోని మైలవరం ఎస్టేటు చిన్నరాజాగారు ప్రారంభించిన నాటక సమాజం కావడంవల్ల దీనికి మైలవరం కంపెనీ అనే పేరు స్థిరపడి పోయింది.

**22. రాజమండ్రి నాటక సమాజము :** సూరిశాస్త్రిగారు ఇక్కడ పేర్కొన్న నాటక సమాజం - గున్నేశ్వరరావు - నాగేశ్వరరావుల హిందూ నాటక సమాజం.

తెలుగుదేశములో పార్శీనాటకముల రీతులేర్పరచినవారలు. జనసామాన్యమును మెప్పించుకొరకిట్టి పద్ధతుల నవలంబించితిమని వారనుకొనవచ్చును. కాని మనమేది జనులకు నేర్పెదమో అదియే వారియభిరుచుల గూర్చుచుండును. జనులు విశ్రాంతికొరకు, వినోదముకొరకు నాటకములకేగుచుందురు. నటులెట్టిరీతులలవరుచుకొందురో వానిలోనే జనులు సంతసించుచుందురు. పార్శీనాటక పద్ధతులు, మును, మొదలు బళ్లారి నాటకములలో బింబించి యావల రాజమందిరము. బెజవాడ సంస్థలలో వికృతవైపరీత్యమును పొందినవి. కీర్తనలతో గూడిన గద్యనాటకముల స్థానమును గద్యపద్య గీతమయమగు పార్శీతరహా బళ్ళారి నాటకము లొకప్రక్కను, కేవల పద్యమయమైన డెల్టాకవుల భారతనాటకము లొకప్రక్కను ఆశ్రయించినవి. తరువాత, వింతపట్టుల తుంపుమట్లలో, తపలామ్రోత ధముక్కు ధముక్కులలో, హార్మనీ ప్రేలుడుతో, నిరంతరము వీనుల శ్రమపెట్టు మైలవరం, రాజమండ్రి నాటక వైఖరులేర్పడినవి. ఇవియే ఇప్పటికిని, యసంస్కారి ప్రేక్షకుల పరమాదర్శమై యున్నవి. పండిత విమర్శక జనంబులీవిధమగు నాటకముల నభినందింపకున్నారు. పద్యము, గీతము, సంగీతము తగ్గించి, అభినయమున కెక్కువ యవకాశమిచ్చు నాటకములు, నటులు యీనాడు గౌరవస్థాన మాక్రమించుచున్నారు. బళ్లారి, రాజమండ్రి, మైలవరం కంపెనీల నాట్యలక్షణ ప్రభావమస్తమించినదని చెప్పవచ్చును. వీరి నాటకములనేకములు చూచియున్నాను.

## నాలుగవ దళము

# ప్రసిద్ధ నటులు

### ఈవెన లక్ష్మణస్వామి గారు[23]

నవీనాంధ్ర నాటకరంగమున భావప్రకటనమందు ఈవెన లక్ష్మణస్వామిగారిని మించినవారు లేరు. రసపుత్ర గాంభీర్యమును దెలుపు రాచకళలొప్పు విశాల గాత్రము – భావతరంగప్రవాహమున పవనసంచలితమైన సాగరముఖ మేరీతి నాడుచు దుముకుచు నుండునో, అటులనే పలు వికాసముల జూపగల ముఖారవిందము – క్రోధాగ్నికణముల నగ్నిపర్వతములవలె రాల్చి తరువాతి వాక్యాభినయములో శరచ్చంద్రికలబోలు చల్లని కరుణా కటాక్ష దీపికల నులికించు నేత్రయుగ్మము – ఔదార్యవీరరసముల నైజవాహకమనదగు హిందీభాష యందసమానవాగ్ధోరణి – నాటక పాత్రముల దేశాభిమానభరితోపన్యాసముల నాట్యయోగమున రసవంతముగ బ్రకటించు నాట్యకౌశలమే గాక భారతాభ్యుదయ మెల్లవేళల నుపాసించు దేశారాధన జీవనపత్రము – రంగవిరచనమందును, భూమికా నిర్ణయమందును, నాటకాభినయమర్యాదలందును నానాదేశ నాటక నియమముల బరికించిన విద్యాధికుల కందరాని నైజమనీషయు – పలువుర నాదర్శోత్సాహపూరితుల జేయగల దీక్షాపరత్వమును – వీరి గుణ శతకములోని

---

**23.** ఈవెన లక్ష్మణస్వామి : బందరులోని నేషనల్ థియేటర్‌లో ప్రధాన నటులు. ఆంధ్రదేశంలోని తొలితరం నటులలో ఉత్తమ తరగతికి చెందిన నటులుగా పేరు పొందారు. తొలుత హిందీ నాటకాలలో మాత్రమే నటించినా ఆ తరువాత తెలుగు నాటకాలలో కూడా నటించి ప్రఖ్యాతి పొందారు. భావ ప్రకటనలోను, సాత్త్వికాభినయ ప్రదర్శనలోను దిట్ట. పఠాన్, షమేర్‌సింగ్, దుర్గాదాసు పాత్రలకు ప్రసిద్ధి.

ముఖ్యాంశములై యొప్ప లక్ష్మణస్వామిగారు బందరులోని నాటకాభినయమునకే కాక జాతీయజీవనమునకు కూడ వన్నె వెట్టిరని చెప్పుటొక వింత కానేరదు. లక్ష్మణస్వామి గారికి సంగీతములో ప్రవేశములేనందున, పద్యగీతములున్న నాటకములందు భక్తి శృంగారరసము లొప్పుపట్లను వీరవలంభించకుండిరి. విక్రమార్కునితో నొకకాంత, పంతమూని గెలిచిన నాటకములో రాజవేషము ధరించి గద్యములో శృంగారాభినయముజేసిరి[24]. ఈ వేషము రాచఠీవులలో రాజమర్యాదానువర్తనములో బెంగుళూరిలోని నాగేశ్వరరావు[25] కొక్కనికే పోల్పదగినదని చెప్పవచ్చును. లక్ష్మణస్వామిగారు గద్య నాటకముల తొల్లిటియుపాసకులలో నొకడు. భావికాలపు భావాభినయముల సూత్రధారుడు. నాటకాభినయ సూత్రములలో వీరి కలవడిన నైజప్రబోధములు పరాసు, ఇటాలియా నటుల దీర్ఘశిక్షను సమీపించుచుండెను. పద్యములు, మట్లు వీరికలవిగాకున్నను సభ్యులెల్లరు వీరి హిందీ ప్రవచనంబుల నాకర్ణింపువేడుకతో వీరి సంగీతలోపమును బాటింపకుండిరి.

షమేరుసింగు నిజోద్యోగధర్మనిర్వహణమున రఘునాథరావు దస్కతుతో నానందీభాయి యందిచ్చిన శాసన మనుసరించి, పీష్వానారాయణరావును వధించెను. షమేరుసింగు రసపుత్రుడు. "హర!హర! మహాదేవు" అనుమంత్ర మహర్నిశములుపాలించు శివభక్తుడు. దయాళువు. మొగలాయి సామ్రాజ్య సంక్షోభమును జల్లార్చి, యాసేతుహిమాచలము హైందవ రాజ్యలక్ష్మీ స్వరూపమును ముద్రించిన మహారాష్ట్ర పౌరుషమునకుప్పొంగు ధీరుడు. నారాయణరావు

---

**24. విక్రమార్కునితో నొక కాంత పంతమూని గెలిచిన నాటకము :** నాదెళ్ల పురుషోత్తమ శాస్త్రిగారు రాసిన హిందీ నాటకం "కళావతీ పరిణయము"(?). ఇందులో లక్ష్మణస్వామి గారిది ప్రధాన భూమిక.

**25. బెంగుళూరులోని నాగేశ్వరరావు :** జి.నాగేశ్వరరావు. ముందు ఆర్.నాగేంద్రరావుగారి చాముండేశ్వరి కర్ణాటక నాటక సభలోను, ఆ తరువాత మహమ్మద్ పీర్ స్థాపించిన చంద్రకళా నాటక మండలిలోను ప్రధాన నటుడు. వరదాచారి బాణీలో నటించి పేరెన్నికగన్నవాడు. వత్సరాజు, రత్నాకరుడు వంటి పౌరాణికపాత్రలకు ప్రసిద్ధి.

సద్గుణసౌశీల్య సౌకుమార్యముల దలపోసి, రాగల మహోన్నతిని దివాస్వప్నముల నవలోకించి సంతసించు దేశభక్తుడు. నారాయణరావు వధ వలన మహారాష్ట్ర శిబిరములో గలుగనోపెడి పోరాటములను వానిచే భరతవర్షమున కేర్పడగల విపత్పరంపరలను గుర్తించు నీతివివేకి. తన శక్తి కొలది యానందీభాయిని నివారింపజూచెను. కాని రాచకొలువుకు మనోదేహముల నర్పించిన సేవకుడవశ్యము ప్రభుచిత్త మనుసరింపవలయునను సేవాధర్మధూర్వహుడగుటచే నారాయణరావును వధింప నియ్యకొనెను. వధానంతరము నిర్దోషియు, గుణరాశియు, బాలకుడును, మీదుమిక్కిలి మహారాష్ట్ర సామ్రాజ్యమకుటమును నగు నారాయణరావును, విష్ణుతుల్యుడగు ప్రభుని వధించిన పాపానల మాతనిమానస ముడికించసాగెను. దేశమునకు, తన కులమునకు, తన యుత్తరగతులకు, తానొనగూర్చిన ఘోర విపత్తునకు బలుతెరంగుల బలవరించుచు జేయునదిలేక యాత్మహత్య గావించుకొనెను. నారాయణరావు వధ నవీన చారిత్రాంశముగాక పురాణగాథయైనచో నేశివుడో, యేసిద్ధుడో వీరిరువుర కడ్డుపడి బ్రతికించి యానందీబాయికి తగు ప్రాయశ్చిత్త మొనర్చియుండును. కాని యిది నవీన విషాద నాటకము. ఈ నాటకములో కరుణ, ప్రభు భక్తి, దైవచింత, రోషావేశము, ధీరత్వము, కోపము, భీభత్సము, భయానకము కుప్పతిప్పలుగ మందులకొట్లు తగులబడినట్లు, తోకచుక్కలు రాలినట్లు, సుడిగాలి త్రిప్పులకు తాటియాకులురేగినట్లు, నిమిషమునకొకయూహగా అడుగున కొక భావముతో నుదయించి, ప్రజ్వలించి, జల్లారి నటమానసమును, ప్రేక్షకప్రవృత్తులను, రసభావవిపరీత పరివర్తనములతో నూగించుచు జెండాడుచు కలవరించుచు తల్లడించుచు, ముంచుచు దేల్చుచు బరిపరివిధంబుల నాయాస పెట్టుచుండును. ఈ భావపరంపరను, విపరీత రసోద్రేకమును, మాటల బలిమిచేగాక యభినయ కౌశలముచే ముఖలక్షణంబుల ముద్రించి నయనప్రచారమున బ్రకటించి నట సార్వభౌమసత్కీర్తి గణియించి యభినయించిన లక్ష్మణస్వామిగారి నాట్యకౌశలము భారతనటులెవ్వరును పొందలేరు. ఫ్రెంచిగవర్నమెంటు వారాడించిన విక్టరుహ్యూగో మహాకవికృతమైన “దురదృష్టవంతుల”లో కథానాయక పాత్ర మభినయించిన

"యిటాలియను" మహానటుడొకడు[26] మాత్రము లక్ష్మణస్వామిగారి యభినయరీతి నతిక్రమించియున్నాడని చెప్పవచ్చును. చెన్నపురి సుగుణవిలాససభలో పి. సంబంధంమొదలియారు[27] అయాగోపాత్రపు నీచవృత్తుల నింతటి సౌకర్యమున ముఖముద్రలచే జూపగలిగెను. కాని సంబంధ మొదలియారు ఉత్తమగుణ వివేచనమందిట్టి సౌకర్య మనుభవింపకున్నారు.

లక్ష్మణస్వామిగారు తామభినయించు నాటకకథల, నుచితరీతుల బరిష్కరించి కథారసభావముల యౌచితి చెడకుండ మానస నైజమనుసరించి యాడించుచుండెను. దుస్తుల నమర్చుటయందును, రంగప్రవర్తనము లెస్సగ నేర్పించుటయందును వీరు నాటక విమర్శకులనందర మెప్పించుచుండిరి. పఠాను వేషమునకు భావభంగమేర్పడకుండ లక్ష్మణస్వామిగారవలంబించిన కథాక్రమము "ముగ్గురు పఠాను"లను వ్యాసములో విశదీకరించియున్నాను. దివానురామశాస్త్రి వేషమును స్వీకరించి వీరు చూపిన కొలువునడతలు మైసూరు, బరోడా మున్నగు రాజసంస్థానముల మర్యాద లలవడిన నటులకే సాధ్యమగురీతుల నుండెను. లక్ష్మణస్వామిగారు పెద్ద చదువులదారులెరుగకపోయినను, నిజప్రతిభచే నుత్తమ నాట్యకళా లక్షణంబుల నెరింగిన మేటి మనీషి. గద్య నాటకముల చివర నటులలోని వాడయ్యును రాగల రంగరీతులనూహింపగల నాట్యయోగి, బందరు కావ్యకళాచతురులగు మహామేధావులచే నలంకరింపబడి, నిఖిలాంధ్రావనీనాయక మణియై వెలింగిన కాలములో, ఈవెన లక్ష్మణస్వామిగారు ఆంధ్రులదేగాక భారతీయుల యొక్క నాట్యసామర్థ్యమును ప్రకటించు కళాపతాకమై దేలుచుండెను.

---

**26.** ఈ కథ "పీష్వా నారాయణరావు వధ'' అన్న నాటకానికి సంబంధించినది. ఈ హిందీ నాటకం ఆంధ్రదేశంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇదే పేరుతో వచ్చిన తెలుగు నాటకం కూడా ప్రసిద్ధి చెందినదే!

**27. విక్టర్ హ్యూగో : 18**వ శతాబ్దికి చెందిన ప్రఖ్యాత నవలాకారుడు, నాటకకర్త. కాల్పనిక నాటక (రొమాంటిక్ డ్రామా) రూపకర్తగా ఈయనను పేర్కొంటారు. 'హెర్నానీ' నాటకం కాల్పనిక పద్ధతిలో రాయబడిన తొలి నాటకం. ఈయన రాసిన 'లే మిజరబ్లే' (బీదలపాట్లు) నవల నాటకీకరింపబడి బహుళప్రచారాన్ని పొందింది. ఇందులో నటించిన ప్రఖ్యాత ఇటాలియన్ నటుడు సినోర్ సమార్కో. ఈయనను గురించి సూరిశాస్త్రిగారు నాట్యోత్పలము **(పేజి 165)**లో కూడా పేర్కొన్నారు.

# నెల్లూరు నాగరాజరావు గారు[28]

1916వ సంవత్సరపు గ్రంథాలయ మహాసభ నెల్లూరులో గూడెను. అప్పుడు నాకీ మహానటుని ప్రథమ పరిచయమేర్పడినది. ఆనాడీతడెట్టి ముఖవిలాసహాసముల నొప్పుచుండెనో ఈనాటి కవియే వారిముఖమున గోచరించుచున్నవి. నటులలో ముఖ కవళికను, ఆరోగ్యమును చిరకాలము నిలుపుకొనగలవా రరుదు. ఈ సందర్భములో యెడవల్లి సూర్యనారాయణగారిని, నాగరాజరావుగారిని ప్రశంసింపక తప్పదు. పాదుకా పట్టాభిషేకమందు దశరథ వేషమును, చిత్రనళీయములో నలపాత్రమును ధరియింపజూచితిని. ఆవల ఆంధ్రనాటక పరిషత్తువారి నెల్లూరి పరీక్షలలో నీతడే నలాభినయమునకు మెప్పుపడసెను. 1923లో ముత్తరాజు సుబ్బరాయనిధి గూర్చుట కాడబడిన నాటకములలో వీరు "పఠాను" గను, దశరథుడుగను, ఆవల హిరణ్యకశిపుడుగను నటించి బందరు రసజ్ఞుల కమితానంద మొసంగుటయేగాక, బందరులో కనీవినని ద్రవ్య సంపాదనకు కారణమైరి.

కొంచెము బొజ్జయున్నను చామనచాయ, చిన్ని కన్నులు, ముఖసౌందర్య మొకింత కొరవెట్టినను నాగరాజరావుగారి విగ్రహమందమైనదనియే చెప్పవచ్చును. పఠాను ప్రవేశమైన వెనుక నిద్దరు చివరతరగతి ప్రేక్షకుల సంభాషణ మాకర్ణించితిని. "ఆయనకు సంగీతమే కొరతగాని అదికూడా ఉంటే ఈ జిల్లాలో కాదు, ఈ దేశములో యిటువంటి కారెక్టరు లేదు." ఇది బందరు పామరుల యభిప్రాయము. విద్యాధికులు వీని నామోదించక మానరు. వేషము వేయువరకు నాగరాజరావు ఆనాడు నాటకమున్న సంభ్రమముగాని దానిలో ప్రధానభారము వహింపవలసిన భావాందోళనముగాని, పార్టు చింతనము జేయు పరీక్షాభిముఖ బాల్యలక్షణముగాని, యావంత యేనియు జూపక మందహాసములతో, మాటముచ్చటలతో కలకలలాడుచుందురు. వీరి సామాన్య ప్రవర్తనము యెడవల్లి సూర్యనారాయణ

---

**28. నెల్లూరు నాగరాజారావు :** నెల్లూరు ఆంధ్ర సభద్వారా ప్రఖ్యాతిగన్న నటులు. ఆ తరువాత ఆంధ్రదేశంలోని అనేక సమాజాల వారితో కలిసి నాటకాలాడి కీర్తి ప్రతిష్ఠల నార్జించారు. యుగంధరుడు, నలుడు, పఠాన్, హిరణ్యకశిపుడు వంటి పాత్రలలో రాణించిన నటుడు.

వంటి యాత్మగౌరవ మొప్పుచు దంభరహితముగ తనకున్నదానిలో సంపూర్ణముగ సంతసించునుదారమార్గము లంటియుండును. పాత్రభూమికా లక్షణమును సంపూర్ణముగ నెరింగి, సత్వరముగ ధరించి, మిన్న కొకమూల గూర్చుండి పాత్ర స్వభావమును తనలో తాను చింతించుకొనుచుండును. వీరభినయించవలసిన నాటక స్వరూపమును, అందలి రసభావ కథాప్రసంగమును జిరకాలమూహించి గద్దెనెక్కెడి యలవాటు కలవారు. నాటకము జరుగునపుడొకరితో సంభాషణాదుల జిత్తవిభ్రమ మేర్పరచుకొనక విశ్రాంతి సమయములలో పైపట్టు రసావేశ మనుభవించుచుందురు. వేష వ్యవహార మంత మొందినంతనే చివాలున నాట్యయోగ ముపసంహరించి సామాన్యలలితహాసములతో మిత్రుల నెదుర్కొనుచుందురు. పతానుభీకర భీభత్స మభినయించిన యుగ్రావస్థ యొక నిమేషములో సామాన్య వైఖరి దాల్చుచుండును. లక్ష్మణస్వామిగారిని 'వేషావేశకాలమందు మిమ్ముల నెదుర్కొనిన మీరెట్లు వర్తింతు'రని నేను ప్రశ్నింపగా నాసమయములో నెవరినైన పొడిచివైతునని జవాబిడిరి. లక్ష్మణస్వామి నాటక రసభావముల తన్మయత్వ మొందుచుండెను. నాగరాజరావు రసభావముల శాసించు నాట్యయోగి. పాత్రముల ప్రత్యేకగుణ మర్యాదల నెరింగి వాని నభినయించుటలో సర్వాంగసౌందర్య మొప్పుదారుల నడువగలప్రోఢ. ముఖమునందలి కండగుంపులన్నియు వశ్యలై భావతరంగముల జిత్రించుచుండ నవయవములు వయోరసానుకూలమగు భంగములవ్రాల మెల్లగ, నవిచారితముగ, నైజముగ, స్వతంత్రముగ పాత్ర మర్యాదల గమనించి నాటక కథా వ్యాఖ్యాన వైఖరుల విస్తరించుచున్నవి.

నాగరాజరావుగారికి సంగీత పరిజ్ఞానమున్నది కాని గాత్ర మాధురి క్రీగంట నాదరించని లోపమొక్కటే వీరి నాట్యసామ్రాజ్యమూర్ధాభిషేకము నడ్డగించుచున్నది. వారి నెల్లూరియాస యిచ్చటి జనుల కొకింత వింతగా దోచకమానదు. కాని నాటకములందు రసాభినయమే, పాత్రౌచిత్యమే ప్రధానంశముగ నెంచు సభ్యులకును, నానాప్రాంతముల ఆంధ్రభాషోచ్చరణ వికారముల గుర్తెరిగినవారికిని, ఈ లోపములు పరిగణింపదగినవిగ నగుపడవు.

నలనాటకపు[29] మొదటిభాగము కొన్ని చిక్కులతో గూడి యున్నను దమయంతీస్వయంవరపు కళ్యాణధీధితులాపట్ల సంతోషపూరితముగ జేయుచున్నవి. రెండవ భాగము శుభాంతమైనను బాహుక శోకపటలితో మలినమైయున్నది. ''ఈ పురవైభవమెన్న నద్భుతము'' అనుచు నలుడు ప్రవేశించుపట్టున, ప్రసాదరావుగారి[30] యడుగులపోకడ నాగరాజున కందలేదు. సూర్యనారాయణ[31] రాచపోకడలు వీరియందగుపడవు. శృంగార రసము వెకిలిచూపుల, వంకరనగవుల, రాజవేషపు కోరమీసముల సాధనచే సులభముగ ప్రకటింపదగినది కాదు. శృంగారాభినయము సులభమని, కన్నుకొట్టి కాంతను దొంగిలింపవచ్చునని, భీభత్సరస మన్నిటిలో కష్టమని కొందరభిప్రాయపడుచున్నారు. వీరి శృంగారచేష్టలు, ప్రణయభావ ప్రకటనము ఉత్తమ పాత్రముల కర్హమైనదిగాక, శకారుని నైజరీతుల ననుసరించును. దుష్యంతుడు – సమస్తాశాంతరాజ్యరమానాథుడు – వలచునది శాపానుగ్రహశక్తియుక్తుడగు కణ్వ మహర్షి పుత్రిక. నలసార్వభౌముడు "నిర్మలనిజకథానిమిషకల్లోలినీ, క్షాలితా ఖలజగత్కల్మషుండు; వితత నవద్వయ ద్వీపనానాజయ శ్రీవధూటీసమాశ్లిష్టభుజుడు." దమయంతి శుద్ధాంతకాంత! ఇట్టివారలకు గలుగు ప్రణయ సంభాషణము ప్రథమ సమావేశమున వ్యంగ్యమర్యాదల ననుసరించి జాగరూకతతో నడువవలసియున్నది. మాటలనుచ్చరించు కాకుధ్వనులచే నేత్ర వికాసముకన్న, నేత్రోన్మీలనముచే భావప్రకటనముచేకన్న భావగోప్యముచే నాయికా నాయకుల ప్రణయానుభవము సూచింపదగును. "ఆడు కలకల నవ్వాడు, కన్నెత్తి చూచాడు" అనే యాలపాట

---

**29. 'నల నాటకము' :** "చిత్రనళీయము''ను "నలనాటకం'' అని పిలిచేవారు.

**30. ప్రసాదరావుగారు :** హరి ప్రసాదరావుగారు. గుంటూరు ఫస్టు కంపెనీలో నాయక పాత్రధారి. వాచిక సాత్త్వికాభినయాలకు పెట్టింది పేరు. బళ్లారి నటుల పద్యగాన పద్ధతిని ఆంధ్రదేశంలో ప్రచారం చేసిన నటుడు. ఆనాడు ప్రచలితంగా వున్న అన్ని నాటకాలలోను ప్రధానపాత్రలను ధరించి రాణించిన "ఆంధ్ర నట పితామహుడు''.

**31. సూర్యనారాయణ :** యడవల్లి సూర్యనారాయణ. నాటకాలలో రాజు వేషాలకు ఎనలేని కీర్తి నార్జించిన నటుడు. మైలవరం, మోతే కంపెనీలలో ప్రధానపాత్రలలో రాణించారు. హరిశ్చంద్ర, దుష్యంతుడు, దుర్యోధనుడు పాత్రలకు ప్రసిద్ధి. సినిమాలలో కూడా నటించారు.

విలసనములుత్తమనాయకుల శృంగారానుభవ నివేదనమందుపయోగింప గూడదు. నాయికానాయకులెంతవరకు తమ భావముల దాచి యెదుటివారి యభిప్రాయముల గుర్తింపనెంచుదురు. నాగరాజరావుగారు నలసార్వభౌముని యుదారమహీధవ గుణజాలమును లెస్సగ బ్రకటించినను చిరునగవు తళుకు లాననమున ప్రణయదీప్తుల బరచుచుండినను శృంగారరసోపన్యాసముల గూఢ వైఖరులందు వీరు ప్రసాదరావునకు సూర్యనారాయణకు వెనుకటివారేయని చెప్పవచ్చును. సింగారమున ముద్దులొలుకు తేటతెలుగులో శృంగారరసాభినయ మవలీల జేయగల యాధునిక నటులలో ప్రసాదరావు, సూర్యనారాయణ, "శెట్టి మాస్టరు[32]," రాఘవాచారి[33] మిన్నలని చెప్పవచ్చును. నాగరాజరావు బాహుక భాగమును, అందులో సుదేవుడరుదెంచునపుడుదయించు చిత్త విభ్రాంతిని, యసమాన నైపుణ్యమున జూపుచున్నాడు.

ముగ్గురు పఠానులను వ్యాసములో రాఘవాచారి, లక్ష్మణస్వామి, దేవరకొండ సుబ్బారావు పఠాను పాత్ర మభినయించిన తెరవుల విమర్శించి యున్నాను. అప్పటికి నాగరాజరావుగారి పఠానుప్రయోగ వైదుష్య మెరుగకుంటిని. మధ్వబ్రాహ్మణుని చల్లని చూపులొక అరగడియ కాలములో హిమాలయ ప్రాంతముల నివసించు పఠాను తైక్ష్ణమును జెందినవి. విద్యానగర రాజవీధులలో

---

**32. శెట్టి మాస్టరు :** సెట్టి లక్ష్మీనరసింహంగారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు. చాలా సంవత్సరాలు విశాఖపట్నం జిల్లాలో అనేక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుడుగా పని చేశారు. మారేపల్లి రామచంద్రశాస్త్రిగారితో కలిసి కలాభిలాషక నాటక సమాజాన్ని స్థాపించి అందులో ప్రధాన భూమికలను ధరించారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రలకు ప్రసిద్ధి.

**33. రాఘవాచారి :** బళ్లారి రాఘవగా ప్రసిద్ధుడైన తాడిపత్రి రాఘవాచార్యులు. ధర్మవరంవారి మేనల్లుడు. కోలాచలం శ్రీనివాసరావుగారి సుమనోరమ సభలో ప్రధాన నటులు. ఉత్తమ సాత్త్వికాభినయ నిపుణులు. సాంప్రదాయిక పాత్రలకు నూతనవ్యాఖ్యానాలు చేసి ఆ పాత్రలను సరికొత్త కోణం నుంచి ఆవిష్కరించిన దార్శనికుడు. తాను సాంప్రదాయిక నాటకాలలో నటిస్తూనే నాటక రంగాన్ని ఆధునికతవైపుకు మళ్లించిన నాయకుడు. "తప్పెవరిది?" అన్న రాజమన్నారుగారి నాటకం ద్వారా వాస్తవిక నాటకాన్ని తెలుగు రంగస్థలం మీద ఆవిష్కరించిన మనీషి.. జీవితంలో గొప్ప సంస్కరణవాది. నాటకరంగ పునరుద్ధరణకు ఎనలేని కృషి చేసిన మహానుభావుడు. మేధావి. కార్యాచరణ శీలి. ఆధునిక తెలుగు నాటక నిర్మాతలలో ఒకరు.

బిచ్చగాండ్రు రామరాజప్రతాపము నుగ్గడింప వినునప్పుడీతని భావ వికాసము అపూర్వముగ నుండెను. మొదట కొంతదూరము నడచివచ్చి విశ్రాంతికై విశ్రమించిన పాంథునివలె దిక్కులు చూచుచు, నిర్వ్యాపారమానస విశ్రాంతి నభినయించెను. ఆవల, క్రమముగా కథ వినుచున్న పౌరులతో గలసి హిందూ ప్రతాపము నాలకించి ఈర్ష్యానుభూతి నొందెను. ఈపట్టున సుబ్బారావు గారు అదివరకెన్నడో విజయనగరము వచ్చి అచ్చటివారినెవరినో ద్వేషించి వెదుకుచున్న చందమున నొకమారు సర్పచాలనక్రమమున రంగస్థల మవతరించిరి. లక్ష్మణస్వామిగారు యింగువసాహేబురీతి నగుపడెను. రాఘవాచారి నడత కొంతవరకు నాగరాజరావు అభినయమందు గోచరించుచుండెను. ఆషాబీకి సభాపరాభవము జరిగినప్పుడు నాగరాజరావు స్త్రీవంచన మెదుర్కొనజాలక యోరమోమిడ పఠాను రక్తముప్పొంగి నైజస్వభావమును వెల్లడించినట్లుగా సంకల్పరహితముగ నాతనికరము కరవాలమున వ్రాలి యొకింత దూసి మరల పరిస్థితుల వెలుగునంది వొరలో నాకత్తిని త్రోసివైచెను. ఈపట్టున నాగరాజరావుగారు ప్రకటించిన యవ్యక్తమానస నిస్సంకల్పవ్యాపారములు రసజ్ఞుల నెంతయు మెప్పించినవి. ఆషాబీతో నుద్యానమున జరిగిన సమర వివాహసమయములను, అప్పుడుదయించు భావపరివర్తనములను ముఖావలోకనముల సత్వరవిపర్యయములతో జక్కగ బ్రకటించియుండిరి. రాఘవాచారి శాంత శృంగారరసముల మేటినటుడు. రామదాసు భూమికను ధరించి యభినయించునపుడు రాఘవాచారిపొందిన పాత్ర స్వభావ సారూప్యము పఠానుభూమికలో నగుపడలేదు. సుగుణవిలాససభవారి సరసాలంకృత రంగపరిసరంబుల రామచంద్రుని సుకుమార సౌందర్యమూర్తి కెదురుగా శృంగారభినయ మొనర్చునపుడు రాఘవాచారి మిక్కిలి చక్కగ్గా దోచెగాని యాతని బ్రాహ్మణవర్చస్సు పఠానుభూమికలో మరుగనపడియుండలేదు. రామరాజ్య వినాశనము తొల్లిటి నుండియు ఘోర సంకల్పములతో నీర్ష్యలతో మాయా ప్రవృత్తులతో నిండియుండిన కథాంశము. విషాదము, వైరము, సమరము, సాహసము జూపు చారిత్ర నాటకము. వేణీసంహారమందు శిబిరవ్రాతములనుండి సమరభేరీ శంఖారవము లాకాశమాక్రమింప మదాంధుడగు దుర్యోధనుడు భానుమతీ సదనమందొనర్చిన ముద్దుచేత లెంత పరిహసింపబడినవో రామరాజ్య

వినాశనపు విషాదగాథాగర్భమున నొకజంట సరససల్లాపము లాడుకొనుటయు నంత లక్షణవిహీనముగనే యున్నది. మాలినీ పరిసరాశ్రమంబుల ప్రశాంతోద్యానికుంజములందు శకుంతలాదుష్యంతుల కొప్పునట్టి సింగారంపు తలపులు విద్యానగర శిబిరాంగణంబున మొలకెత్తనేరవు. రాఘవాచారి వసంత సుమాలంకృతమైన పరిస్థితులలో కాంతను వరించిన రీతి నభినయించెను. లక్ష్మణస్వామి ఈ పట్టున మహమ్మదీయ శుద్ధాంతమొందిన పరాభవ మాషాబీతో ముచ్చటించి సమరదీక్షను బలపరచుకొనెను. నాగరాజరావు విజయనగరము ప్రవేశించినది మొదలు పఠానునకేర్పడిన హిందూరాజ్య వినాశ సంకల్పము కాంతాసమాగమమున విడువలేదు. రామరాజు తన తండ్రియనుమాట నప్పటి కెరుగకుండినను తిన్నయింటివాసముల లెక్కించు నైచ్యము మహమ్మదీయ మతాభిమానముతో మార్కొనుచు శక్తిలేమికి చేష్టారాహిత్య మేర్పరచి యొకవిధమగు పరాకు నేర్పరచినది. ఈ పరాకును నాటకమంతయు వ్యాపించియున్న విషాదతత్వమును మరువక నీ ప్రధానరసములచాటున మబ్బుకమ్మిన దీపకళికలవలె, తెరచాటు బొమ్మలాటవలె, స్వప్న వ్యాపారములవలె నాషాబీతోడి శృంగార మెంతయో నయంబుగ నభినయించెను. నాగరాజరావుగారి నాటకకథానుభవము, ఔచితీపరిజ్ఞానము నవీన నటులందరిలో ప్రసిద్ధమని జూపరులభిప్రాయపడుటలో వింతలేదు. పఠానుని వీరభీభత్సముల నభినయించుటలో వీరు లక్ష్మణస్వామికి తీసిపోలేదు. కండ్లు చిన్నవైన నుగ్రావలోకనజ్వాలలంకురింపజేయుచు ముఖముద్రలెంతయు రసావహమై దోచుచుండెను. తలలేని తండ్రి మొండె మాతని భావోన్మత్తమానస వీథియందమరినపుడు శ్రీనివాసరావుగారు,

> "Is this a dagger that I see before me?
> Come, let me clutch thee, I see thee not
> A dagger of the mind, a false creation,"
> "Out you bloody spots!"[34]

---

34. **"Is this a dagger...." :** ఇది షేక్స్పియర్ రాసిన "మ్యాక్బెత్" నాటకంలోనిది. *Macbeth*, II, i, 33-35.

అను షేక్సుపియరు వాక్యముల ననువదింపబూనినపుడు జూపరుల కదృశ్యమై పఠాను మతిభ్రమణమొనర్చు రామరాజ పిశాచము నాగరాజరావుగారి పిశాచవైఖరులందు స్పష్టమగుచుండెను. లక్ష్మణస్వామిగారు ధీరోదారగుణముల తప్ప నీచస్వార్థమును ప్రకటింపలేకుండిరి. రాఘవాచారి యాత్మవధా సంకల్పమును లెస్సగ నందుకొనినను వీరు భీభత్సముల బాగుగ ప్రదర్శింపలేదు. నాగరాజరావు పఠాను వేషము కథాపరిమితులలో జక్కగ నిర్వహింపబడినదనియే చెప్పవచ్చును.

కృష్ణమాచార్యులుగారి[35] పాదుకాపట్టాభిషేకమును నెల్లూరులో గ్రంథాలయసభ జరిగినపుడు నాగరాజరావు మున్నగువారభినయించిరి. ఈమధ్య బందరులో నద్దాని మరల జూచితిని. కొన్ని సందర్భములనుకూలింపమిచే బందరు ప్రదర్శనమందు నాగరాజరావుగారి యభినయ సౌష్ఠవము నెల్లూరులో ఒప్పించిన రసభావమును వహింపకుండెను. అసలు ఈ నాటకము ప్రదర్శనార్హమైనదికాదు. రాముని పితృవాక్యానువర్తనమందు ఆనాటి సాకేతవాసులకుగాని ఈనాటి ప్రేక్షకులకుగాని యెట్టి సందేహములేదు. రాముడు తన మాట నంగీకరించునని దశరథుడెరుగును. రాముడు తిరుగబడి పితృశాసనముల్లంఘించి కోసల రాజ్యాధిపత్యమాక్రమించునను భీతి మంథరకుగాని, కైకకుగాని యెన్నడు కలిగియుండలేదు. దశరథుడు పెద్దకొడుకు మీది మోహమున వార్ధక్య దౌర్బల్యమున తానిచ్చిన వరములుపసంహరించడని కైక యెరుంగును. నాటకమందలి ప్రధాన పాత్రములు యేవిధమైన భావపరివర్తనముగాని యాదర్శ సంక్షోభముగాని పొందలేదు. కథలో యేవిధమైన భంగపాటు, భావచేష్టా వైపరీత్యము, అచింతిత్రప్రవర్తనము జూపలేదు. అందుచేత సీతారామ దశరథులలోనేరును నాటకనాయకులు కానేరరు. వలపులకుప్పయగు చక్కదనాలచిక్కమగు కైకకు దుశ్చింతలేర్పడుట దశరథునకెట్టులో ప్రేక్షకులకు కొందరి కట్టులే యచింతిత భావప్రకాశముగ నగుపడవచ్చును. కాని స్త్రీ బుద్ధి యందలి యాశాక్రౌర్యముల

---

**35. 'పాదుకాపట్టాభిషేకము' :** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి ప్రఖ్యాత నాటకం. ఇందులోని దశరథ పాత్రలో ఆంధ్రదేశంలోని ప్రధాన నటులందరు నటించడానికి ఉత్సుకత చూపేవారు. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి "పాదుక" వచ్చాక ధర్మవరం వారి నాటకాన్ని బళ్లారి సభలే ప్రదర్శించేవి.

నెరుగనివారు లేరు. సవతితల్లి, యీడేరిన కొడుకుగలది, వలపులచే మగని యొప్పింతునను నమ్మకము గలది కైక యిట్లు ప్రవర్తించుటయందెట్టి యలౌకిక సందర్భము కనుపడదు. అట్లు చేయకుండుటయే సామాన్య స్త్రీ స్వభావమునకు విరుద్ధమగును. విషచింతగల కైక గర్భమున నుదారభావభరితుడగు భరతుడుదయించుటయు హస్తగతమైన రాజ్యలక్ష్మిని భ్రాతృవాత్సల్యమున విడనాడి రామపాదుక పూజానిబద్ధమానసుడై, జడదారియై రాముని పేర రాజ్యమేలుటయు నీనాటకములోని రెండవ యచింతితాంశముగ నెంచవచ్చును. భరతుని ప్రవర్తన మలౌకికమనుట నిజమే. కాని భరతుడు కైకయందు జనించినను యిక్ష్వాకు వంశములోని నిర్మలోదారగుణముల వారసుడై యున్నాడు. "యమవతామవతాంచ ధురిస్థితః" అని పేరొందిన దశరథేశుని పుత్రుడు. పుత్రకామేష్ఠియాగ ప్రసాదాంశమున రామునివలెనే జనించినవాడు. ఇట్టి జనన సాంప్రదాయము లొప్పు భరతుడు యింకొకవిధముగా ప్రవర్తించుటయే నైజ స్వభావ విరుద్ధముగ నుండును. మంథర కుబ్జ. దాసీ. తన యజమాని యక్కరకువస్తే తానుకూడ బాగుపడుదునని యాశపెట్టుకొనినది. అదికాక యాడుది. మంథరకు భరతునిపై మోహముండినట్లు కథలో సూచింపబడినది. స్త్రీ చిత్తమగాధమైనను మోహవల్లరి యుభయుల చేష్టాపరంపరలచే నల్లన వికసించునదై యొకరియందెక్కువగ నుండినను రెండవ పక్షపు మనోవాక్కర్మల పోషణపై నాధారపడియుండును. భరతుడు మంథర కిట్టి మోహభావ మంకురింపజేయు నాశాబంధముల గల్పించెనని నమ్మజాలము. మరియు కైక దాసియై చిన్ననాటినుండియు భరతుని యాదరించుచుండిన మంథర కాతనిపై మాతృభావమునకు బదులు మోహావేశమేర్పడుట దుస్సహముగను విపరీతముగను దోచక మానదు. ఇందుచేత నీనాటకములోని యందరు నిజగుణానుకూలముగ కథాక్రమమున భావవిపర్యయ మేదియు నొందక ప్రవర్తించిరి. దశరథుడు కైకకు వరమిచ్చుటలో నేర్పడిన నాటకబీజము రాముని వనవాసదీక్షావలంబనములో ఫలసిద్ధినొందెను. ఆవలికథ యంతయు వ్యర్థము. గంటలో నాడదగిన కథాంశమున నైదుగంటల గ్రంథ విస్తరణ మొసంగుటయే కృష్ణమాచార్యులుగారీపట్టున నొనర్చిన పెద్ద తప్పు. అనుచిత కావ్యవిస్తారమునను, భావవిపర్యయము లేనందునను

అచింతితావస్థలేర్పడియు నీనాటకము లక్షణవిరుద్ధమై ప్రదర్శనానర్హమై యున్నది. కలికాలపు మూఢమానసులే వయసు చెల్లిన వెనుక చిన్నపెండ్లాము జేర్చుకొనుటకు సందేహించుచుండ త్రేతాయుగధర్మప్రవర్తకుడు, 'వార్తకేమానివృత్తీనాం'' సంతతిలోనివాడు దశరథుడు చిన్న పెండ్లాము నొకదాని గ్రహించునన నమ్మజాలము. భార్యలు ముగ్గురు దశరథుని చిన్నతనములో స్వీకరింపబడినవారలే. వీరి పాణిగ్రహణకాలములలో ముందువెనుకలుండినను రాముని జననకాలమునకు అరువదివేల యేండ్ల దశరథ జాతకము నడచినట్లగుపడుచున్నది. "షష్ఠివర్ష సహస్రాంతేజాతోయం మమకౌశిక దుఃఖేనోత్పాదితశ్చాహంనరామం నేతుమర్హసి." వర్షమనగా దినమని ప్రొఫెసరు రంగాచారిగారి నిర్వచనమంగీకరించినను రామావతారోదయమునకు 170 సంవత్సరములయీడు దశరథునకు జెల్లియుండును. ఇట్టి వయసులో చిన్న పెండ్లాముండుట యసంభవము. "అనిన మాటను దప్పుటనుచితం బనిగదా దశరథేశుడు కాలధర్మమొందె" నను వాక్యమే నిజముగ కనుపించుచున్నది.

నాగరాజరావు పఠాను వేషమును ధరించినపుడు వయోరుచుల నీనెడు తరుణయువకుడై గనుపించెను. దశరథభూమికను దాల్చినపుడీతని ముఖాంగములు తురీయావస్థకు నైజమగు శైథిల్యమొందియుండెను. అంగవార్ధక్యమునకు సహజపరిణామమగు మతిభ్రంశము, దీక్షాదౌర్బల్యము, చీదర, ఉపాయశూన్యత, ప్రేమాతిశయము, తొందర మొదలగు మానసిక లక్షణములన్నియు నాగరాజరావుగారి యభినయములో పొలుపొందియుండెను. వయోవృద్ధుని యంగశైథిల్యమేగాక చింతాక్రాంత ముఖలక్షణములేగాక మానసిక గుణ వినాశము కూడ వీరియభినయములో జక్కగ ముద్రింపబడియుండెను. రామునిపై ప్రేమ, వియోగమందలి కష్టము, వాగ్దానపరిపాలనాపేక్ష కలవరపెట్టుచుండుట, దారిగానని వృద్ధాలాపములు నాగరాజరావు గారిచే నైజరీతుల నభినయింపబడినవి. రాముడు వెళ్ళిన వెనుక దశరథుడొందిన మనస్తాపము, శోకభారము, దుఃఖతరంగ పరంపరలలో నాతని శేషజీవము మెల్లగ మునిగి కొట్టుకొని మత్తుమందు పీల్చుచున్న శస్త్రరోగివలె క్రమముగ వాక్యశూన్యుడై, చేష్టారహితుడై, నిర్జీవుడై చల్లపడుటయు పుత్రోదయమునకెట్లు పరితపించెనో పుత్రవియోగమున నట్టులే

పలవరించి యసువుల నూదివైచుటయు నిరుపమానముగ నభినయింపబడినది. పాదుకాపట్టాభిషేకమందు నాట్యవైఖరుల కవకాశమెక్కువ లేకున్నను, హరికథకుపయోగించు విషయము రూపకరూపమున దుర్వ్యాప్తినొందినను బలశీల సమన్వితుడగు దశరథుడు ముక్కాళ్లముదిమిలో అనుభవించిన రసభావవిప్లవము జక్కగ జూపించి పాత్రస్వభావముతో నైక్యమొంది, నాగరాజరావు కొంత రసవైభవ మీనాటకమున కేర్పరచియున్నారు.

ప్రహ్లాద[36] చరిత్ర భారతీయుల భక్తిగాథలలో నెల్ల ప్రసిద్ధమై భారతజాతీయధర్మమగు నహింసావ్రతమును "పొడచినదిట్టిన కొట్టిన, పడుచుందురు పరమభాగవతులు... తా రొడబడరుమారుసేయగ" నను సాధనక్రమమును భౌతిక పారమార్థిక విభూతుల భేదమును జూపు నుత్తమకావ్యమై యున్నది. ప్రహ్లాదుడు హరిపూజానిబద్ధమానుడై "లభ్యంబైన సురాధిరాజపదమున్ లక్షింపడశ్రాంతమున్." నిఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున బరగువాడు, విష్ణుసేవాదోషమును వారించ దండ్రి దుర్భరశిక్షలనుభవింపజేయ "పారడు లేచి దిక్కులకు, బాహువు లొడ్డడు, బంధురాజిలో దూరడు, ఘోరకృత్యమనిదూరడు తండ్రిని, మిత్రవర్గముంజీరడు.... కావరే యనడు, భయకంపసమేతుడు కాడు." ఇట్టి నిశ్చల నారాయణపాద భక్తినుద్దీపించు మానసమాప్రహ్లాదునిది.

హిరణ్యకశిపుదు వేల్పుపెద్దను కొలుచునపుడు "అదిరెన్ కుంభిని సాద్రియై, కలిగె వేడంభోనిధుల్." తపః ఫలితముగ "లోకములన్నియున్ క్షణములోన జయించినవాడు." ఇంద్రియ నిగ్రహము, బలపరాక్రమములు కలవాడు. విపులమైన త్రిలోక సామ్రాజ్యమును సంపాదించి ద్వంద్వ భావములతో గదలుచుండెను. ప్రహ్లాదజనకుడు చక్కని సంస్కారి. విద్వాంసుడు. ఐశ్వర్యవంతుడు. తన తెలివితేటలతో జగమునంతను నింపగల మహాసమర్థుడు. ఇట్టి రాచపట్టికి నైజముగ లలితసద్గుణములమరియుండును. రాజులకు, అందులో నిజరీతిప్రభావమున భువనైక చక్రవర్తులగువారికి, నవరసములు

---

**36. "ప్రహ్లాద" :** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి నాటకం. అంతకుముందే కందుకూరి వీరేశలింగంగారు ప్రహ్లాద నాటకం రాసినా అది రంగస్థలం మీద రాణించలేదు.

సంస్కారసాధుత్వముతో నొప్పియుండును. చక్రవర్తులు కోపగించు, శోకించు, ప్రేమించు, ముద్దాడు దారులు నీతిమర్యాదలనంటి వీరప్రభు లక్షణంబుల జాటుచు సామాన్యమానవుల చర్యలకు భేదముగా నుండును. అహంకారమప్పుడప్పు డుప్పొంగినను రాచపోకడలు వ్యంగ్యముగను లలితభావాలంకృతముగను కనుపించును. సామాన్యముగా హిరణ్యకశిపుని గుణాభినయ మవలంబించువారు వీని నొక క్రూరరక్కసిగ నెంచుచుందురు. ప్రహ్లాదచరిత్ర కంసుని వంటి దుర్మార్గుని పాపరిణామమును తెలుపు నాటకముగ నెంచదగదు. ఇవి లౌకికవైభవములు, పరమార్థచింతకు విరుద్ధములనియు, భౌతికైశ్వర్యవిభూతి పరతత్వజిజ్ఞాసకు సరిరాదనియు, శీలమర్యాదలు భక్తికి తోడుగావనియు, యెన్ని శక్తులున్నను పరమేశ్వరునియాన దాటి నడుపనేరవనియు, ధర్మస్వరూపమగు కాలచక్రమును లక్షింపక నహంకారప్రమత్తుడై దిరుగువాడధోగతి జెందుననియు బోధించు నాటకము కాని బొబ్బలిడు జడలరక్కసులు, పద్మలోచనుబోరాడు సమరవర్ణనముకాదు. నాటకములో లౌకిక బలైశ్వర్యశీల మర్యాదలకును, భక్తి జ్ఞాన వైరాగ్యములకును పొసగు పోరాటముద్దేశింపబడినది. హిరణ్యకశిపుడు మర్యాదలెరింగిన చక్రవర్తిగా నాగరాజరావు గుర్తించి యభినయించి యున్నాడు. వీరి గాథా వ్యాఖ్యానము నేను చూచినవాటిలోనెల్ల ముద్దుగ నున్నది. భాగవతములో హిరణ్యకశిపుడు 'లీలోద్యానలతా నివాసములలో లీలావతీయుక్తుడై హాలాపానవివర్ధమాన మదరోషాయత్త తామ్రాక్షుడై కేళిందేలె"నని నారదుడు చెప్పుకొనినను హిరణ్యకశిపుడు సంస్కారిగృహస్థ పద్ధతుల నడచువాడనియే మా నమ్మకము. ఇట్టి రాచనడవడి నాగరాజునందు మూర్తీభవించి యుండెను. ప్రహ్లాదుని జేరదీయునపుడు నోటిమాట లెట్టివైనను లోని మక్కువ తెలియునటులను ప్రేమ సూచకంబులగు తండ్రి చేతలు సంకల్ప శూన్యముగ, నైజముగ, వచ్చినట్లును చిత్రముగ నభినయించి యున్నాడు. నాగరాజరావు గారు హిరణ్యకశిపునొక బలమదమత్తదుష్టదైత్యునిగ నెంచక పుత్రునితో నభిప్రాయభేదము గలిగి ప్రేమించుచు వారింపబూనెడి సామాన్యమానవునిగ జిత్రించి ప్రహ్లాదగాథను దేవదానవ విరోధ కాలమునుండి కలికాలపు నిత్యజీవనములోనికి దింపియున్నాడు. బహుమంది నటులు హిరణ్యకశిపుని దొల్లిటినుండియు ద్వేషపూరితునిగ నూహింతురు. కాని రక్కసి మేటియు నరులవలెనే ఆశాబంధములతో 'యేమో

యేనాటికైనా బాగుపడకపోతాడా? వాడికేం తెలుసులే, చిన్నపాడెగట్టు! ఆ స్నేహాలు! స్నేహాల వల్ల చెడిపోతాడు” అని ఊహించు తండ్రిగా సంకల్పరహితముగ పుత్రగాత్రపరిష్వంగ సుఖంబులందుచు తప్పనిసరిగ పుత్రుని మేలుకోరి బైరాగివృత్తిని మాన్పించి శూరాధిరాజపదవీసమర్థునిగ జేయువేడుకతో మెలంగినట్లును, పుత్రునిదుర్నివార్యవాసుదేవానురక్తి కలిగినట్లును, పుత్రద్వేషము క్రమముగా విషతుల్యమైనను పుత్రవాత్సల్యభావప్రబోధము లామానసము వీడనట్లును చక్కగా నిర్దుష్టముగ భావగర్భితముగ నభినయించిరి. తుదకు స్తంభనిర్భేదసమయమున హిరణ్యకశిపుడు మహోగ్రప్రతాపమున బరిఢవిల్లినట్లు నాగరాజరావభినయింప లేదని కొందరాక్షేపించిరి. కాని శిక్షలన్నియు నిష్ఫలములై తన త్రిలోకాకారి శాసననములళక్కియై ప్రహ్లాదభక్తియే విజయమొందినపుడు “మంచితి వార్ధులన్….. ధిక్కరించితి, శపించితి, ఘోరదవాగ్నులందు ద్రోయించితి, పెక్కుపాట్ల నలయించితి జావడిదేమి చిత్రమో” అను శంక హిరణ్యకశిపునిడెందమాక్రమించి నిస్పృహ గలిగించు చుండెను. రక్కసిరాజెంతటి విష్ణువిరోధియయ్యును లౌక్యుడు. నీతికోవిదుడు. స్వబలపరబలవిజ్ఞాత. తన ప్రయత్నములన్నియు నిష్ఫలమై విరోధి సంకల్పమభ్యుదయమొంద నీవిపరీతస్థితికి గల కారణమరయు వివేకి. స్వకీయ మేథాబలైశ్వర్యమాయాప్రభావమున నహంకార మాయఖల్లము నెల్ల వశపరచుకొనియుండెను. ఇవియన్నియు భక్తిప్రభావమున కోడి నిష్ఫలమని తోచినంతనే హిరణ్యకశిపుని యహంకార మంతరించెనని చెప్పవచ్చును. అహంకారపటలము శంకాతరంగముల తాకిడికి జిక్కి చెదరినపుడు ఆత్మప్రబోధములు మానసవీథి నుద్దీపింపదొడగును. ఇప్పట్టున హిరణ్యకశిపునకు పూర్వదేవతా సంస్మరణ మంకురించెను. అట్టి సందర్భములలో నటుడు నిర్విణ్ణుడై నిస్సహాయుడై భావసంక్షోభమున ముగ్ధుడై యహంకారరాహిత్యమున చేష్టారహితుడై నిలచుటయే నైజమగు అవస్థ. దీనినిక్కవెరింగి నాగరాజరావు సందర్భానుకూలమగురీతి నభినయించెను. మరియు నృసింహావతారఘట్టమునందు భౌతిక శక్తులన్నియు పరశక్తిచే నిర్మూలింపబడినవి. పరతత్వ ప్రభావమును భౌతికైశ్వర్యదౌర్బల్యమును చాటు సందర్భమొక విశ్వవిలయముగా నుండనోపును. జగద్విలయములు కలుగబోవునపుడు కొన్ని విద్యుచ్ఛక్తులుద్భవించి జనుల మూర్ఛిల్లజేయుననియు గ్రహసంఘట్టనాది మహావిలయ సంక్షోభమును

భూజనులనుభవింపనేరరనియు నొకమారు ప్రకృతి శాస్త్రముల యాధారమున జెప్పియుంటిని. నృసింహావతార సందర్భములో విశ్వరూప ప్రదర్శనము జరిగినప్పుడెల్లను మహాతపస్సులగువారు తక్క తక్కిన జపంబు లావిలయ మెరుగకుండిరని భారతాదులలో నున్నది. ప్రహ్లాదుడు మూర్తి నారాధించెను. హిరణ్యకశిపుడు మూర్ఛనొంది మడిసెను. భక్తి సాధనకు భౌతికాహంకారము లోబడి మృగ్యమైనది. ఇచ్చట నాగరాజరావు ఉచితముగ నభినయించెను. వీరి వేషములన్నిటిలో గాథాసంప్రదాయములు, సందర్భములు నిర్దుష్టముగ బరికించి మానసవ్యాపార వైఖరుల గుర్తించి పాత్ర సారూప్యమొంది రసవిచక్షణతో, నాత్మనిగ్రహముతో, ముద్రానైపుణ్యముతో నభినయించెడి నటరాజరీతులేర్పడి యున్నవి. సంగీతమొకటి లేకున్న మన్నింపవచ్చును. "ఏకోమిదోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః."

## మాగంటి సుబ్బారావు గారు[37]

వీరు బందరు గొడుగుపేట కంపెనీలో[38] నాగలింగము గారితో కూడ నభినయించుచుండిరి. వీరిని నేను స్వయముగా నెరుగను. ఒకమారు హరిశ్చంద్ర పాత్రమును ధరియింపజూచితిని. వీరు సరసులనియు, సంగీతనాట్యకళా నిపుణులనియు కైతలల్ల నేర్చిరనియు, "పాణిగృహీత" విఖ్యాతి గాంచిన నగరాజకుమారికకు[39] యొజ్జలనియు వినుచుంటిని. నా జ్ఞాపకమును బట్టి వీరి

**37. మాగంటి సుబ్బారావు :** బందరు గొడుగుపేట కంపెనీలో తొలి తరం నటుడు. హరిశ్చంద్ర పాత్రకు ప్రసిద్ధి.

**38. గొడుగుపేట కంపెనీ :** దీని పూర్తి పేరు ఛత్రపూర్ జగన్మోహిని కంపెనీ. బందరులో ప్రముఖ సమాజం. గొడుగుపేలో ఉండడంవల్ల దీనికాపేరు వచ్చింది.

**నాగలింగము :** కారుపర్తి నాగలింగం. తొలిదశలో బందరు గొడుగుపేట కంపెనీలో మాగంటి సుబ్బారావుగారితో నటించిన స్త్రీ వేషధారి. పురుషపాత్రలు కూడా ధరించేవారు. చంద్రమతి పాత్రకు ప్రసిద్ధి.

**39. నగరాజకుమారి :** ప్రఖ్యాత హరికథకురాలు. 1931-32లలో ఆమె యిచ్చిన గ్రామఫోను రికార్డులకు ఎనలేని గిరాకీ. తిరుపతి వేంకటకవుల 'పాణిగ్రహీత' పద్య కావ్యానికి ఈవిడే నాయిక అని ప్రసిద్ధి.

ముఖబింబము మైసూరు వరదాచారిని[40] బోలియున్నది. అభినయ సంగీతములు కూడ సరసముగ నటులనే యుండెనని నా తలంపు.

## బందరు హాస్యగాంధ్రు

చివుకుల కృష్ణయ్య పంతులుగారి[41] శిల్ప నైపుణ్యము మా నాయనగారి భవనమందింగితమై నిలచి యున్నదిగాని వీరు బందరు పౌరులను ప్రక్కలుద్ద నవ్వించిన హాస్య ప్రసంగములనే నెరుగను. దేశీయ నాటక సమాజములో పేరిగాని 'సాకలి తెలియి' విచిత్రముగ నభినయించుచు నీచపాత్రములనేకముల స్వరరూప యాదార్థ్యమున బ్రకటించుచుండిన భావరాజు నారాయణ మూర్తిగారి[42]యొప్పిద మెంతయు నభినందించుచుంటిని. పల్లె వేషములో "అరి అరీ నారాయణా ఆదినారాయుడా కరుణించి మమ్మేలో కమలలోశనుడా" అని పాడు పల్లె వైఖరి మిక్కిలి నైజముగ నుండెను. వంగలదీక్షితులు[43] తురకషోకిల్లా వేషములో "అయితానగరంకాడ... రమ్మన్నదీ మాకీ రమ్మన్నదీ" అనే పాటను భద్రాచలయాత్రిక వేషములో "వ్రెందుకైతే శీంచీనావు, భ్రంధికానాలో" అను రామదాసు కీర్తనను పాడునప్పుడును జాతీయ మొలికించుచుండెను. కంభంపాటి విజయరామయ్య[44]

---

**40. మైసూరు వరదాచారి :** 20వ శతాబ్దం మొదటి మూడు దశాబ్దాలలోను కన్నడ నాటకరంగాన్ని ఏలిన ప్రఖ్యాత నటుడు. ప్రహ్లాద, రత్నావళి, శాకుంతల, నిరుపమాన, రామవర్మ-లీలావతి వంటి దాదాపు అరవై నాటకాలలో ప్రధాన భూమికలను ధరించిన నట ప్రముఖుడు.

**41. చివుకుల కృష్ణయ్యపంతులు :** బందరులోని దేశీయ నాటక సమాజంలో తొలితరం హాస్యపాత్రధారులలో ప్రముఖులు.

**42. భావరాజు నారాయణమూర్తి :** దేశీయనాటక సమాజంలో చెకుముకి శాస్త్రి, పేరిగాడు పాత్రలను ధరించి పేరెన్నికగన్న నటుడు.

**43. వంగల దీక్షితులు :** వంగల బుచ్చన్న దీక్షితులు. ఉయ్యూరులోని హిందూ నాటక సమాజంలో హాస్య పాత్రధారి. ఆయన బందరులోని గొడుగుపేట కంపెనీలో కూడా హాస్యపాత్రలను ధరించాడు.

**44. కంభంపాటి విజయరామయ్య :** బందరు గొడుగుపేట కంపెనీలో హాస్య పాత్రలకు ప్రసిద్ధి చెందిన నటుడు.

జగ్గయ్యపేట కోమట్ల స్వరూపమును చక్కగా చిత్రించుచుండెను. కాని గొడుగుపేట ఫార్సులు చాలవరకు సుల్తానగరం బైరాగులతోను, సామీలుగారి పీడేరు గుమాస్తాలుతోను నిండిన పల్లెటిజనుల తెలివితక్కువను ఆక్షేపించు నీచహాస్యముగ నుండెను. హాస్యము మనుష్యుల విద్యాబలనీలిరూపముల దారిద్ర్యమును వెక్కిరించునవిగా నుండకూడదు. లోపముల చెప్పినను మానవ మనోవృత్తుల భంగపాటులను చిత్రించినను కరుణరసమేర్పడునట్లు సానుభూతితో జనసమష్టికుండు సామాన్యలోపములనే జూపవలెను. వెక్కిరింపబడినవాడు కూడ వినువారితో జేరి పకపక నవ్వలయును. ఇట్టి హాస్యమే మాననీయమైనదికాని వ్యక్తుల బ్రత్యేకించి నిర్దయగా వెక్కిరించు ప్రహసనరీతులెంతమాత్రము మంచివి కావు. కృత్తివెంటి సుబ్బారావు[45] బొబ్బిలికథకులను నీచపాత్రములును జక్కగ నిరూపించుచున్నాడు. డ్రామెటిక్ కంపెనీలోని పాలకుర్తి సత్యనారాయణ[46] రసపుత్రవిజయమందు గులాంపాత్రమును మిక్కిలి యందముగ జూపగలడు. సుబ్బారావాలీబాబాకు తలువనితలపుగా ధనరాసులబ్బినపుడు చూపెడి వింత చేష్ట లెంతయు నవ్వుబుట్టించుచున్నవి. రామమోహన కంపెనీలో[47] సుబ్బిశెట్టి

---

**45. కృత్తివెంటి సుబ్బారావు :** బందరులో చాలా సమాజాలలో హాస్యపాత్రలను ధరించారు. "ఆలీబాబా నలభై దొంగలు" నాటకంలో ఆలీబాబా పాత్రకు ప్రసిద్ధి. చివరి రోజులలో మోతే కంపెనీలో చేరి "మృచ్ఛకటిక"లో శర్విలకుని పాత్రను ప్రతిభావంతంగా నిర్వహించిన నటుడు.

**46. డ్రామెటిక్ కంపెనీ :** దీని పేరు ఇండియన్ డ్రామెటిక్ కంపెనీ. బందరులో ప్రఖ్యాతి చెందిన నాటక సమాజం. ఇందులోనే డి.వి.సుబ్బారావుగారు ప్రధాన భూమికలు ధరిస్తూ దాని యాజమాన్యాన్ని నిర్వహించేవారు. క్రమశిక్షణతో నడిచిన నాటక సమాజాలలో దీనికి ప్రథమస్థానం యిచ్చేవారు.

**పాలకుర్తి సత్యనారాయణ :** బందరు రామమోహన్ కంపెనీలో హాస్యపాత్రలు ధరించేవారు.

**సుబ్బారావు :** పాతూరి సుబ్బారావు. బందరు బుట్టయ్య పేట కంపెనీలో 'చింతామణి'లో సుబ్బిశెట్టి పాత్రకు ప్రసిద్ధి.

**47. రామమోహన్ కంపెనీ :** బందరులో 20వ శతాబ్దం రెండవ దశకంలో ప్రసిద్ధిలోనికి వచ్చిన నాటక సమాజం. గురజనాయుడుగారుగా ప్రసిద్ధికి వచ్చిన గూడపాటి నరసింహారావు నాయుడుగారు తొలుత ఈ సమాజంలోని నటులే!

వర్ణనాతీతపాత్ర సౌలభ్యమందియున్నాడు. పిత్తుపాగా, బనారసురుమాలు, అయిదువ్రేళ్లకుంగరములు పైగుండీ క్రిందికి పెట్టుకొని చింతామణి వద్ద జేబులోని నాణెముల గణాయించునపుడెంతటి య్చకోమటి సింగారమెలికించెనో, పుణుకులపళ్లిక నెత్తిన బెట్టుకొని మేహవ్రణములకట్లతో, మురికికొల్లాయితో, "యేడేడి పెసరట్లు, కమ్మనినేరట్లు, కానికి మూడట్లు" అని యరచుచు వచ్చునపుడంతటి దశాపాతిత్యమునే యథారూపముగ చిత్రించెను. చింతామణి యెవరిడబ్బు వారికిచ్చినదని భవానీశంకరుడు చెప్పినపుడు అట్లమ్ముచున్న సుబ్బిశెట్టి సిగ్గులేక "మల్లీ ఒక యెలుగెలిగిస్తాగా" నన్నపట్టు నీ నటుడు రమ్యముగ నభినయించెను. ఇట్టి దుర్నివార్య దుశ్చింతాపరత్వము, ఆంధ్రనాటకములో నెల్ల సుబ్బిశెట్టియు, మధురవాణి తిరస్కరించినపుడు "Damn it కథ అడ్డంగా తిరిగింది" అని నూతన దుష్కార్యాచరణ సంకల్పముతో భంగపాటున కదరిపడక నిష్క్రమించిన గిరీశము మాత్రమే చూపుచున్నారు.

## ఇతర హసకులు

పార్శీనాటకములలో హాస్యగాండ్రననేకుల జూచియున్నాను. గున్నేశ్వరరావు కంపెనీలోని రామ్[48] అను చిత్రకారుడు పార్శీతరహాలో హాస్య ప్రదర్శనము గావించుచుండెను. పార్శీ నాటకములలో మొదటినుండి తుదివరకు హాస్యరంగములు వచ్చుచుండును. ఇందు సామాన్యముగా నొక బుడ్డామియ్యాకు చెంబేడి పెండ్లాము దొరుకుటయు నాయువతీలలామ బలువిటుల జేర్చి బుడ్డామీయ్యను మోసగించుటయును జూపబడుచుండును. స్త్రీ వేషధారులలో మిక్కిలి చమకుతళుకులు చేయగల సమర్థుడీ చెంబేడీపాత్రమును ధరించి హాస్యగాండ్రు కూడ చక్కని పాటగాండ్రై వింతదరువుల పోకిరీ కీర్తనలు పాడుచు జనసామాన్యమును మెప్పించుచుందురు. మార్వాడీలోభియు నౌత్తరాయణుల హాస్యరంగముల దరుచుగ గోచరించుచుండును. తెలుగుదేశములోని హాస్యగాండ్రిదివరకు గానవైఖరులెరుంగని జాతీయాభినేతలుగ నుండిరి. పార్శీ,

---

**48. రామ్ :** ఎ.ఎస్.రామ్. చిత్రకారుడు. రాజమండ్రిలో హిందూ నాటక సమాజానికి అత్యద్భుతంగా తెరలు తయారు చేసి ఆంధ్రదేశంలో నాటక దృశ్యాలకు ప్రచారం తెచ్చిన వ్యక్తి. ఈయన నాటకం మధ్యలో హాస్య ప్రసంగాలు చేయడంలో నిష్ణాతుడుగా పేరు పొందాడు.

బంగాలీ, గుజరాతీ, కర్ణాటక, సింహళ నాటకములందు హాస్యగాండ్రు మంచి గాయకులై గానవైఖరులలో వింతలగు వెఱ్ఱిపోకడల రాగతాళములు తప్పకుండ బాడుచు, ముక్కు, కళ్లు, చెవులు కదలించుచు పల్లవి ప్రకారముల నభినయించుచుందురు. నెల్లూరు సుగుణవిలాససభలోని[49] హాస్యకుడీ ఫణతి నవలంబించి యున్నాడు. వల్లూరి జగన్నాథరావుగారు[50] తెలుగుజాతీయ ముట్టిపడ పల్లెటి పాటలను పాడినరీతి గ్రామొఫోను రికార్డులలో వినగలిగితినేకాని వీరి హాస్య ప్రదర్శనముల నవలోకించి వారిపై నాకున్న విశ్వాసగౌరవములు ప్రకటించు సందర్భమిప్పటికి నేర్పడలేదు. తమిళనటులలో శామన్న[51] హాస్య ప్రబంధముల నద్భుతముగా జూపు నేర్పరి. దొంగవేషము హాస్యసంబంధమైనదయ్యును నటరాజాచారి[52], కల్లనుపార్టునొక లయప్రస్తరణ కౌశల్య పరీక్షగ నొనర్చి దొంగలకందరాని గాత్రసంచార పద్ధతుల నతిశయించి హాస్యేతరముగ జేసియున్నారు. నాటకహాస్యమేగాక నోటితో జాతీయములు చెప్పుచు శ్వానభైరవీ మొదలగు రాగముల హాస్యపద్ధతులలో పాడగలవారిని చూచి యున్నాను.

గుంటూరు కంపెనీలో పూర్వముండిన యివటూరి వియ్యన్న[53] కొన్ని వేషములను, జాతీయములను చక్కగా నొప్పించుచుండెను. మొత్తము మీద తెలుగునాటకములలో హాస్యపద్ధతులు చక్కగా పరిణమించి యుండలేదు. ఆంగ్ల కంపెనీల హాస్యములు బూతుపాటల వికృతాభినయముతో జాతీయత నొప్పించుచు నున్నవి.

---

**49. నెల్లూరు సుగుణ విలాససభలోని హాస్యకుడు :** కందాడై శ్రీనివాసన్ స్థాపించిన నెల్లూరు సుగుణ విలాససభలో హాస్యపాత్రలను ధరించిన సుందరరాజ అయ్యంగార్. ఈయన నారదపాత్రకు ప్రసిద్ధి.

**50. వల్లూరి జగన్నాథరావు :** కాకినాడ శ్రీకృష్ణవిలాససభలో నటుడు. హాస్యపాత్రలు ధరించడంలో పేరు పొందారు. గొప్ప పాటగాడు. తెలుగులో ప్రప్రథమంగా గ్రామఫోను రికార్డు యిచ్చిన వ్యక్తిగా ప్రసిద్ధుడు.

**51. శామన్న :** శామన్నగా ప్రసిద్ధుడైన సి.శ్యామన్న అయ్యర్ తంజావూరుకు చెందిన పలునాటక సంస్థలలో హాస్య పాత్రలు ధరించేవాడు.

**52. నటరాజాచారి :** చెన్నపట్నంలోని సుగుణ విలాససభలో హాస్య పాత్రధారి.

**53. ఇవటూరి వియ్యన్న :** గుంటూరు ఫస్టు కంపెనీలో హాస్య పాత్రధారి.

# పెడన రామయ్య[54]

విప్పగు నక్షముమీద రోమరాజులందమై గ్రమ్మమెడలోని రుద్రాక్షమాలిక శివపూజాపరత్వమును సూచింప కరవాల మాడించుచు నభయహస్తమిడుచు "మీకు భయ కారణమేమి? పరుగిడబోకు కర్ణ, కృతవర్మడ ధైర్యము చక్కిబట్టుమీ" యని యుత్సహించుచు కురుక్షేత్ర సంగ్రామరంగమును జేరునప్పుడీతని వైఖరి మార్షల్వాను హిండెనుబర్గు మహాసేనానియొక్క సమర ప్రాచురము వలె దోచుచుండును. వీరి యశ్వత్థామాభినయము ప్రశంసనీయమేకాని విపులదేహ మా పాత్రలక్షణము సూచింపకున్నది. శోకరసము రామయ్యకన్న ముంజులూరి కృష్ణరావెక్కువ యొప్పిదముగ నభినయించి యున్నాడు. వీరిరువురు అశ్వద్ధామ నతిరథునిగ, వీరప్రతాపోజ్జ్వల బ్రహ్మతేజంబుగ నుద్దేశించి యభినయించిరి. వేణీసంహారము సమరావకాశమనుట నిశ్చయమే. రణరంగమున కౌరవచమూనిర్మూలనోత్సవమున రంగ ప్రవేశమొనర్చు గురు కుమారుడు బాహుబలదర్పమొప్పెడి భీకరసేనానిగా వర్తించుట సంభావ్యమే. కాని అశ్వద్ధామయందు రెండు లక్షణములున్నవి. ఈతడు నిరంతర శివధ్యానయోగమున మునిగియుండెడి బ్రహ్మచారి. రాబోవు మన్వంతరమున వేదజాలము రచియింప చిరంజీవియై నివసించు యోగివిభుడు. ఈతని మానసవ్యాపారములు అవస్థానుకూలముగ బహిర్గతమై వ్యవహరించినను లోనితలపు లెల్లవేళల పంచాక్షరీమంత్ర చింతనమందాయత్తమై నిలచియుండును. ఇట్టి యోగివరుని యభనయించుటయందప్పుడప్పుడు మాటల మధ్యమున చేష్ట నడుమ లోనిచూపుల యోగమార్గము నభినయింపవలసి యుండును. నారదునకు గానలోలత, హరిచింతారతి నిత్యవర్తనమై వెలయునట్లు ద్రోణపుత్రుడనవతరము శివధ్యానైకదీక్షతో నుండును. ఇదియే వీని స్థాయీ భావము. మిగిలిన మనోవాక్కర్మములన్నియు దీనికి ప్రక్కగా యోగభ్రంశమేర్పరచకుండ నడచు క్షణికావస్థలు. ఈ సంగతి నెరింగి గుంటూరులోని పత్రి సీతాపతి[55] అశ్వద్ధామపాత్ర

**54.** పెడన రామయ్య : బందరు దేశీయ నాటక సమాజం వారి 'వేణీ సంహారం'లో అశ్వత్థామ పాత్రకు ప్రసిద్ధుడు.

**55.** పత్రి సీతాపతి : గుంటూరు సెకండు కంపెనీలో నటుడు. అశ్వత్థామ పాత్రను సమర్థవంతంగా నిర్వహించేవాడు.

నిర్వహణమందు వీని యోగి లక్షణముల, మైమరచు భక్తిని, లౌకిక గుణములోత పాటు జూపించెను. తరువాత అశ్వద్ధామరణసామర్థ్య మంతయు "బ్రహ్మతేజోబలం బలం" అను శక్తి వలన అస్త్ర ప్రయోగ నైపుణ్యమున నేర్పడినదేకాని కండక్రొవ్వున గిరిడీల తరిఫీదులో కలిగినది కాదు. ఈ యస్త్ర ప్రయోగ వైదుష్యమును, మంత్ర విజ్ఞానమును, యోగిసత్వమును సూచించు పలుచని లోనిచూడ్కుల పసిడిమేని నొప్పుచు సీతాపతి యశ్వద్ధామపాత్రమున కెంతయు నొప్పిదమై యుండెను. రామయ్య, కృష్ణారావు, అభినయ కౌశలమందీతనికి వెనుదీయకున్నను పాత్ర సారూప్య మొందకయు యోగిసత్వమెరుంగకయు సీతాపతికి వెనుకవారగుచున్నారు.

## ముంజులూరి కృష్ణారావు[56]

ఈ నటుడు రసపుత్రవిజయు పరీక్షలో దుర్గాదాసునకొసంగిన స్వర్ణపతకమును వేణీసంహారములో నశ్వద్ధామకేర్పరచినదియు గెలుపొందియుండెను. కృష్ణారావు దుర్గాదాసు పాత్ర మతినైపుణ్యముగ నభినయించెను. కాని యాసందర్భములు మరపుతగిలినవి. నిజముగా వైకుంఠయోగివలె యోగిస్వరూపమొంది తురుష్క దౌర్జన్యమును వెక్కసమందు భారతమాతృ శోకమును ఆలించి దేశాభిమానపూరితుడై రసపుత్ర వీరప్రభావమును వెదజల్లుచు హిందూరాజ్యముల కైకమత్యమొనగూర్చు నీతిచాతుర్య మొప్పించుచు నిజముగా దుర్గాదాసే యభినయించునను భ్రాంతి గల్పించుచుండెను. ముంజులూరి కృష్ణారావు తిరుపతి వేంకటేశ్వరుల భారత నాటకములను[57]

---

**56. ముంజులూరి కృష్ణారావు :** అతి ప్రతిభావంతుడైన నటునిగా గుర్తింపు పొందినవాడు. బందరులోని రాయల్ థియేటర్ వ్యవస్థాపకుడు. తిరుపతి వేంకటకవుల పాండవోద్యోగ విజయాలకు ప్రాచుర్యం తెచ్చి ఆ నాటకాలలో శ్రీకృష్ణపాత్రను ధరించి మెప్పుపొందిన నటుడు. 1925 తరువాత బెజవాడలో మోతేవారి కంపెనీలో చేరి వారి మృచ్ఛకటిక నాటకంలో శర్విలకుడు పాత్రను ధరించాడు.

**57. తిరుపతి వేంకటేశ్వరుల భారత నాటకములు :** తిరుపతి వేంకట కవులు భారత కథ ఆధారంగా ఆరు నాటకాలు రాశారు. వాటిని పాండవనాటకాలుగా పేర్కొంటారు. ఆ ఆరు నాటకాలు : పాండవజననము, పాండవప్రవాసము, పాండవరాజసూయము, పాండవోద్యోగము, పాండవవిజయము, పాండవాశ్వమేధము.

ప్రదర్శింపజేయుటలో విఖ్యాతుడై యుండెను. అందు శ్రీకృష్ణ రాయబారమున కృష్ణ వేషము ధరించి కొన్ని పట్టు లతినైపుణ్యముగ నభినయించెను. "జెండాపై కపిరాజు" అను పద్యములో "మూకన్ జెండుచున్నప్పుడొక్కండు" అను పట్టును కర్ణునితో భేదోపాయ మాలోచించునపుడు రహస్యముగ చెవిలో "నిన్నాయమ పెండ్లియాడగల దారవభర్తగ సూర్యనందనా!" అను ఆశ లతికించునపుడును భీష్మ ప్రతాప మెదుర్కొనుటకు సమర సమయముల్లంఘించి, "నురికిన నోర్వక నుదరంబులో నున్న జగముల వ్రేగున జగతిగదల, చక్రంబు చేపట్టి చనుదెంచు రయమున బైనున్న పచ్చని పటముజార.... కరికి లంఘించు సింహంబు కరణిమెరసి, నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు, విడువు మర్జునయనుచు....." చనుదెంచుపట్టునను కృష్ణరాయని శ్రీకృష్ణ గుణవ్యాఖ్యానమెవ్వరు అతిశయించి యుండలేదు.

అశ్వద్ధామ పాత్రాభినయములో నీతని మంచిచెడ్డ లిదివరకే వర్ణించియున్నాము. కృష్ణారావు బందరు నటులలో సాహిత్య పరిజ్ఞానముండి నాటకములను ప్రదర్శనానుకూలముగా మార్చు విన్నాణమొప్పుచుండెను. ఈతని సామర్థ్యము నటవర్గమును జేరదీసి సత్వరముగనాడించు కట్టడియైయున్నది. ఇతనిచే నడిపింపబడిన 'రాయలు హిందూ థియేటరు[58]' నాట్యసాహిత్యములందు పేరొందియున్న పింగళిసోదరులు, నిరాఘాటగాంధర్వగీతికా గాత్ర సామ్రాజ్యమున వీనుల నుప్పొంగజేయు రాఘవాచార్యులు, శ్రీపతి పట్టాభిరామయ్య, రామారావు

---

**58. రాయల్ థియేటర్ :** ముంజులూరి కృష్ణారావుగారి ఆధ్వర్యంలో బందరులో ప్రారంభమైన నాటక సమాజం. పాండవనాటకాలు ప్రదర్శించడంలో ప్రసిద్ధి చెందింది.

**పింగళి సోదరులు :** రాయల్ థియేటర్ సభ్యులు - పింగళి వెంకట నర్సయ్య భీమ పాత్రకు, పింగళి లక్ష్మీకాంతం ధర్మరాజు పాత్రకు పేరు పొందారు.

**బుర్రా రాఘవాచారి :** అర్జున పాత్రకు ప్రసిద్ధి. గొప్ప గాయకుడు.

**శ్రీపతి పట్టాభిరామయ్య :** రాయల్ థియేటర్ సభ్యులు. క్రూరసేనుడు వంటి పాత్రలకు ప్రసిద్ధి.

**రామారావు :** ఈయన వివరాలు తెలియడం లేదు.

యింకెందరో ప్రసిద్ధనటులు చేరియుండిరి. వీరరస ప్రధానమైన భారత నాటకములను బందరులో నిండు హంగున గూర్పగల సమర్థుడితడొక్కడే.

ఇతనికి సంగీత మొకింత కొరవడి యభినయరీతులందు కొన్ని వెకిలితనములుండెను కాని నాటకార్థమును గ్రహించి, భావగర్భితముగ నభినయించుచు, బందరులో కొంతకాల మెన్నికలో నుండెను.

పింగళి వెంకటనరసయ్యగారు సామాన్యముగ భీమవేషమును దాల్చుచుందురు. వీరు గోవిందరావునాయుడు వలెనే భీముని వినయలక్షణములను, సాధుత్వమును, దయాసౌశీల్యములను, గండుతనమును, గుర్తించి పెద్దపులి చిలిపియాటలతో మ్రొగ్గలిడక, పాండురాజతనూజునకుండదగు నుత్తమ రాజమర్యాదలతో దర్పవిక్రమమొప్ప నభినయించుచుందురు. వీరి భీమ పాత్ర గుణవ్యాఖ్యానము గోవిందరావు నాయుడూహించిన దారులలో మెరుగారి యుండును. నరసయ్యగారి వేషములలో నాకు పరమానంద మొసంగినది పాండవవిజయములో కృష్ణునెదుర్కొను సందర్భమైయున్నది. భీష్ముడు భారత సౌశీల్యసద్గుణంబుల పరిణామమూర్తి, మహాభక్తుడు, వీరాగ్రేసరుడు. రాయబార సందర్భమున కచ్చియమాన్ప యత్నించెను. శాంతముగ భగవన్నామంబు చేసికొనుచు "బ్రతికెదమూర్వి" అని కోరువాడు. దుర్యోధనుని దుర్మదాహవ సంకల్పమున కిష్టపడనివాడు. అయినను, కౌరవులు యుద్ధసంకల్పమే నిశ్చయించు కొనినపుడు తన ప్రభు పక్షమున శత్రుభీషణముగ పదిదినములాహవము జరిపిన మేటివీరుడు. యుద్ధ మధర్మమని యెరిగియు తాను "సంయమివరుడీదుచుండె సంసారమునన్" అనినపగిది ధర్మనిరూపణమందును, భగవదారాధనమందును కాలము గడుపుచుండినను ప్రధానముగ క్షత్రియ జన్మమెత్తినవీరు కులవృత్తి యందు మేటియై మెరసి కృష్ణుని ప్రతిజ్ఞాభంగ మొనర్చునంతటి రణప్రతాపమును విజృంభించినందుననే భీష్ముని శాంతిపర్వధర్మోపదేశమునకును, చక్రిని వేయిపేర్లనుతించినందులకును శాశ్వతమైన గౌరమేర్పడినది. భీష్ముడుధర్మముల ప్రోవు; భక్తి సాధనలకుదురు; కాని వీనికన్నను ద్వాపరరాజన్యమునకేగాక పరశురామునకుగూడ నలవిగాని క్షాత్రవిద్యాసంపన్నుడు. "దుర్లభం క్షత్రియాః పార్థలభంతే యుద్ధమీదృశం" అని భగవంతునిచే నుతింపబడిన కురుక్షేత్ర

పోరాటమునందు భీష్ముని భీష్మప్రతాపము వెలుగకుండినచో వాని క్షత్రియుజన్మమెందులకు? ఇంటివద్ద నెట్టియోగముద్రలో, ''చిత్తము గోవిందపదాయత్తము గావించి మౌనియై తనలోనే తత్తరములేక'' యసువులవిడువదలచెనో అట్టి మరణావస్థయే రణరంగమున చక్రిచే తనకు గలుగనాయెను. దుర్జయుడై లోకభీకరముగ సంగ్రామరంగమున నిలచి పోరాడి వాసుదేవుని ప్రతిజ్ఞాభంగమేర్పరచెను. చక్రిచే మడియు వైభోగమేర్పడెను. తన క్షత్రియ సామర్థ్యమునకు సంతసము; భగవద్ధ్యానంబునగాక భగవత్సాన్నిధ్యమున చత్తునని సంతోషము కఫవాతపైత్యములకుళ్లు రోగముచేగాక సుదర్శనజ్వాలల నంతమొందు నలౌకిక మరణసిద్ధి భీష్ముని యూరించుచుండ "నేడు భీష్ముని జంపుదు నిన్నుగాతు" నని మీదికి దుముకు కృష్ణుని సమరాగమమునకు భీతినొందక "దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు" అని కృష్ణునకు స్వాగతంబిచ్చి సుదర్శన ప్రయోగమును సంతోషముతో తన జీవితపు చరమవిజయముగ నభిలషించు భీష్ముని రూపభావముల వెంకటనరసయ్యగారు సంపూర్ణగుణాభిజ్ఞతతో నభినయించిరి. జరలేని ముసలితినము క్రౌర్యమెరుగని క్షాత్రప్రతాపము, కౌటిల్యకళంక మొదవని రాజనీతి, శత్రుసాధన జేయు భక్తితాత్పర్యము, చల్లగా చచ్చు వైరాగ్యము, జీవితాదర్శములు సంపూర్ణ ఫలసిద్ధినొందిన సంతోషము – యివి యన్నియు నరసయ్యగారి భీష్మాభినయమందు గోచరించుచుండెను. కండబలమున జెలరేగు పడుచువేషము లెన్నియోదాల్చ నీనటుని జూచియుంటినికాని భీష్ముని భక్తిప్రతాపసాంకర్య రసమును అభినయించినపుడే పింగళి వెంకటనరసయ్యగారి నాట్యకౌశలమునాకనుభవమైనది.

## గూడపాటి నరసింహారావునాయుడు[59]

బందరులో నాడబడిన రసపుత్రచరిత్ర గాథలలో రాణప్రతాప్ మొదటిదని చెప్పవచ్చును. దీనినే చిత్తూరుముట్టడి యందురు. రాజపుత్రస్థానమందలి వీరులు కొందరు మొగలాయిచక్రవర్తులతో వియ్యమొందుచుండిరి. రాజా ప్రతాపసింగు

**59. గూడపాటి నరసింహారావు నాయుడు :** గురజనాయుడుగా ప్రసిద్ధుడు. మొదట రామమోహన్ కంపెనీలోను ఆ తరువాత మైలవరం కంపెనీలోను ఉద్ధత పాత్రలు ధరించడంలో పేరు పొందారు. సతీ సావిత్రిలో యముడుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

హిందూ మహమ్మదీయ రక్తసాంకర్యమున కియ్యకొనలేదు. అక్బరు చక్రవర్తి సామ్రాజ్య మంగీకరింపని స్వాతంత్ర్యవీరుడు. ఈతని వశపరచుకొననెంచి ప్రతాపసింగు నివాసమగు చిత్తూరు దుర్గమును ముట్టడింప తన ప్రధాన సేనానియగు రాజా మానసింహుని దాడి వెడలించెను. ప్రతాపసింగు అక్బరు సైన్యముల వేడిమి నోర్వజాలక నడవులబట్టెను. మానసింగు రణవిజయ మొందియు చిత్తూరు పతనమునకు చింతిల్లి రసపుత్రకులాభిమానముల్లమున దేజరిల్ల ప్రభుకార్య నిర్వహణదీక్షాసంకల్పమునకును స్వదేశాభిమానమునకును విరోధభావము లేర్పడ విజయమొందియు చిత్తూరునగరమును స్వాధీనపరచుకొనకయే మొగలాయి సైన్యమును మరలించి గొనిపోయెను. గురజనాయుడు రాజా మానసింగు పాత్రమును రసపుత్ర వీర్యతేజంబు లొప్పునట్లు రూపసాదృశ్యమొంది చక్కగా నభినయించెను. ఎన్నోయేళ్ళు గతించిన నిప్పటికిని వీరానాడు రామమోహన్ కంపెనీలో ప్రదర్శించిన భావసంక్షోభము, సేవాధర్మదేశాభిమానముల మానసిక విరోధములు కన్నులగట్టినట్లుగా దోచుచున్నవి.

నాయుడుగారు మైలవరం కంపెనీలో[60] ధరించి నిర్వహించిన పాత్రము లెన్నియోకలవు. వీనిలో ద్రౌపదీ వస్త్రాపహరణ మందు భీమునిగను, సంపూర్ణ రామాయణమందు దశరథునిగను, సావిత్రలో సమవర్తిగను నాయుడుగారి యాటపోకడల జూడగలిగితిని. భీముని గుణవిశేషములు వీరు గుర్తించియున్నను వీరి యభినయమందు తొల్లిటి వ్యాఖ్యానవైఖరులే, వీరశీలమే ప్రధాన లక్షణముగ నగుపడుచుండును. లక్ష్మణస్వామిగారివలె నీతడు మూకాభినయ మెక్కువగా జేయుచు నితర పాత్రముల సంభాషణ మాలకించుచు కథావ్యాపారమున తానొందు చిత్తవృత్తుల బ్రకటించువాడుక గలవాడు. ద్యూతసభలో పుట్టములొలుచుపట్టున నీత డాభారతకథాపరిణామ ముద్దీపించు మూకాభినయ మొనర్చెను.

దశరథుని ముసలివలపుల బ్రకటించుటలో నీతడు నగరాజరావుగారి చెంత జేరనేరడు. ఫలితకేశజాల మాపడుచుమొగపు కండపటిమను దాచకుండెను.

యముడు సత్యవంతుని యసువులగొనిపోవ నరుదెంచు వైఖరి కాలభీకరమహోగ్రమూర్తితో "నంత్యకాలదహన జ్వాలాప్రచండుడు"గ నుండెను.

**60. మైలవరం కంపెనీ :** చూ. వివరణ 21.

కాని "వీని గ్రచ్చర గొనిపోవగాజనుదెంచితి"నని చెప్పినను యముడు ధర్మమూర్తియై, త్రికాలజ్ఞుడై, రాబోవు సంధ్భమెరుంగనివాడు కాడు. నీవెవరవని సావిత్రి ప్రశ్నించినపుడు "విద్ధి మాంత్వం శుభే యమం," అని తన్ను దాదెలుపుకొనిన భారతవాక్యమందలి శుభేయనుపదము సుమంగలి కర్థమై పాతివ్రత్యపరిణామ విజయమును సూచింపుచు యమునినిజోద్దేశము సత్యవంతుని యమలోకమునకు జేర్చుటకన్న సావిత్రీ పతిభక్తి శిక్షించి పరీక్షించుటయే ప్రధానముగ దోచుచున్నది. మనుష్యుల మనోవాక్కర్మసంకల్పముల సర్వసాక్షియగు ధర్ముడీయబలయొక్క నిర్మల పతిభక్తి నెరుగకుండెననుట యసంభవము. కాన సమవర్తి సత్యవంతునకు మృత్యుప్రాయమైయగుపడిన యుగ్రభంగి యాతనిరూపములో జూపదగినను కార్యపరిణామ మొకప్రక్క జూపరులకగుపడుచునే యుండవలెను. ఈ స్థితి నాయుడుగారెరింగి యనుకూలముగ తమయుగ్రావలోకన జ్వాలలక్రింద నొకప్రసన్న సుస్మితమభినయించి చూపించిరి. ఆవల సావిత్రి సత్యవతి యముని వెన్నంటి దుర్గమకర్కశాలయముల ద్రొక్కుచు,

"శ్రమఃకుతో భర్తృసమీపతోహిమే ।
యతోహిభర్తామమ సాగతిర్ధ్రువా ॥"

అని చెప్పుచు నడచునపుడు యముడాయమను వెనుకదిరిగి వారింపబూన నుచితముగనుతించి మెప్పించుచుండ యముని తొల్లిటిసంకల్పము కూడ మధ్యాహ్నరవిధీధితుల తాకున నీ హారశలాకములు నీరై కరిగినట్లు క్రమముగా పలుచపడి వరాంజలుల నర్పించి తుద కాపాతివ్రత్యప్రభావమున కతులితానంద మొంది మగనినర్పించి ఆయురారోగ్యసంపద్వరంబుల నిచ్చెను. ఈపట్టుల పారేపల్లి సుబ్బారావు[61] నిజముగ సత్యవతియై పతివ్రత లక్షణము లొప్పుచు తన పాతివ్రత్యప్రతాప మెరుంగని యబలా సుశీలమును మాత్రమే కనుపరచుచు మగనిపోకను వారింపజాలని దౌర్బల్యమును, కాలు నెదుర్కొనజాలని స్త్రీ

---

**61. పారేపల్లి సుబ్బారావు :** మొదట బందరు బాలభరత సంఘంలోను, ఆ తరువాత మైలవరం కంపెనీలోను స్త్రీ పాత్రలకు ప్రసిద్ధి చెందారు. పామగంటివారి 'రాధాకృష్ణ' నాటకంలో రాధ పాత్రకు ఎనలేని కీర్తి నార్జించారు.

స్వభావమును వెల్లడించుచు నెంతవరకు పెనిమిటి ననుసరించుటయే సతి ధర్మముగ నెంచు మనస్థితియు జూపుచు వెన్నంటినడుచునపుడు నాయుడుగారి దయాసోపానతలావరోహణము సత్యవంతుని బ్రతికించు వరకు సలక్షణముగ జరిగెను. సావిత్రి తాను పతివ్రతయనియు తన ప్రణయమహిమచే కాలునిసంకల్ప ముడిగించి మగని బ్రతికింతునను నమ్మకముండియు నాయమపురయాత్ర నారంభించలేదు. పతితో నడచుటయే పరమార్థమని భావించి వానితోకూడ యమపురావాసమును జేరుటకుద్యమించి నడచినదేకాని, తనకును తనబందుగులకును సౌభాగ్యసిద్ధి కలుగునని యూహించి యట్టియాశతో యముని వెన్నంటలేదు. యవనపురాణములలో "హెర్కులీసు" అను మహాబలుడు తన సతిని గొనిపోవ నేతించిన కాలుని కుస్తీపట్లనోడించి భార్యను బ్రతికించుకొనెను. బాబిలోనియాగాథలలో పాతాళమున భూతకాంతల భోగసంతుష్టికొరకు చెరపట్టబడిన 'తమూజ్'ను రక్షించి తెచ్చుటకు యిష్టారు అను పతివ్రత కావలివాండ్ర లంచముల దనియించి లోనికిజొచ్చెను. వీరిరువురు తమ తోడులను భూలోకమునకుదెచ్చి వారితో సుఖించుటయే పరమావధిగ నెంచినారు. మార్కండేయుడు మృత్యుభీతిచే శివలింగమును కౌగిలించి స్తోత్రాష్టకమున శివుని యమునిపై బురికొల్పిన చిరాయుసంపాదనమొనర్చెను. సావిత్రి భూమిపై జీవింపనెంచలేదు. మగడున్నతావున పతిననుసరించి యుండుటయే యామె యుద్దేశ్యము. భౌతికజీవనము, ఆ సముద్ర సామ్రాజ్యము, మిగిలిన సంపత్తులన్నియు యముడు తనంతట తానే సావిత్రి పాతివ్రత్యమున కచ్చెరువంది యొసంగిన వరవిభూతులు. నిస్సంకల్పకమగు భర్తృపాదానుగమనమును, స్త్రీజననైజమైన దౌర్బల్య ప్రణయతత్వమును పారేపల్లి సుబ్బారావు అసమాన నైపుణ్యముతో చిత్రించియున్నాడు. ఈతని లీలావతి వేష నిర్వహణము చూచియుంటిని. ఇందు రసములు ముఖముద్రలందు తీక్ష్ణముగ జిత్రింపబడియున్నను నీవేషమును పలువురు మెచ్చుకొనినను, పారేపల్లి సుబ్బారావు సాధుపాతివ్రత్యనిరూపణ మొక్కటియే యసమాన వైఖరుల జూపగలడని నా నమ్మకము.

## దేవరకొండ వెంకట సుబ్బారావు[62]

బందరులో నాటకపోషణము ప్రస్తుతకాలమందు జనసామాన్యముచే నడుపబడుచున్నది. పూర్వము ఉద్యోగస్థులు, విద్యార్థులు కొలదిమంది సంగీతసాహిత్యముల బోషించుచు నాటకముల నుత్సాహపరచుచుండిరి. ఇప్పటికి అట్టి పోషకులు కొందరున్నను నాటకములు అల్పవిద్యాసంస్కారముగల ధనవంతులయొక్కయు సోడాషాపులు, కాఫీహోటలులు, జటకాలు మొదలగు స్వతంత్రజీవనముగల పౌరుల యొక్క అభిమానమున ధనార్జనము చేయుచున్నవి. బందరు పౌరుల నటరాజు దేవరకొండ సుబ్బారావని చెప్పవచ్చును. ఇతని యభినయ విశేషములు పలుతావుల ముచ్చటించియున్నాను. దుష్టబుద్ధి, పఠానువేషముల గూర్చి ప్రత్యేకవిమర్శనలిచ్చియుండుటవలన వాని నీయెడ విస్తరించను.

సుబ్బారావు బందరువాడు. బందరులో పుట్టిపెరిగి యిటనే చాలవరకు నైజమనీషచే నాట్యకళాభ్యాస మొనరించినవాడు. ఈతని కీర్తి తెలుగుదేశపు దిగంతముల వ్యాపించి బళ్లారి, విజయనగరము, చెన్నపురి, రంగూను మొదలగుతావులకు పెద్దజీతముల యాశలతో పిలువబడినను తానున్న హంగుతక్కువ కంపెనీని నమ్ముకొని బందరుపురమును వదలివెళ్ళని నిలుకడగలవాడు. ప్రసిద్ధనటులలో నిట్టికుదురు అరుదు. సుబ్బారావు యెలిమెంటరీ చదువును దాటినవాడు కాకపోయినను తానభినయించు పాత్రముల గద్యపద్యములు అర్థజ్ఞానముతో నుచితరీతుల జదువగల సరసుడు. ఇతడు స్త్రీ వేషములను ధరియించుచుండును. కాని వానిలో యశోదపాత్రమునొక్కటే నేను చూచియుంటిని. కృష్ణలీలను నేను విమర్శింపబూనను. సుబ్బారావు గాత్రమాధురియెంచదగినది. బుర్రా రాఘవాచారి[63]యొక్క వియత్సంచరణగాన

---

**62. దేవరకొండ వెంకట సుబ్బారావు :** బందరు ఇండియన్ డ్రామెటిక్ కంపెనీ వారి నాటకాలన్నింటిలోను ప్రధాన భూమికలను ధరించటమేకాక ఆ నాటక సంస్థను అత్యుత్తమ క్రమశిక్షణతో నిర్వహించిన వ్యక్తి. హరిశ్చంద్రుడు, నలుడు, పఠాన్, దుర్యోధనుడు, దుష్టబుద్ధి వంటి పాత్రలను సమర్థవంతంగా నిర్వహించారు.

**63. బుర్రా రాఘవాచారి :** చూ. వివరణ 58.

వైఖరులు సుబ్బారావున కబ్బలేదు. యడవల్లి సూర్యనారాయణ నానాదేశములు తిరిగి ప్రశస్తభారతగాయకులగాత్ర ప్రాచరములరీతు లెరింగి యలవరచిన శిక్షాశుద్ధి సుబ్బారావుకేర్పడలేదు. రాఘవాచారి శబ్దార్థజ్ఞానశూన్యుడు. తానభినయించెడి పట్టుల గుణాభిజ్ఞతగాని అర్థముగాని యెరుంగక "టీజనితేన్సురేష నుపదిష్టమహీయగవాయి గానవిద్యాజిత పీరుసాబు." సూర్యనారాయణ సిద్ధగాత్రులయాదర్శ మనుకరించియు, గీర్వాణాంధ్ర నాటక సంప్రదాయముల గుర్తించియు, పాడు నటసిద్ధుడు. సుబ్బారావు వీరిరువురి గాత్ర మాధురికించిదూనముగ నొప్పుచు తన బుద్ధి కొలది కొంచెమర్థయుక్తముగను, కొంచెము రసవాహకముగను, యెక్కువ సుఖముగను, పాడి జనసామాన్యమును సంతోషపరచగల సామాన్యధీయుతుడు. సుబ్బారావు నాట్యకీర్తి యంతయు నాతని గాత్రమాధురియందే నిలచియున్నది. చుక్కపొడిచెడి వేకువవేళ కమ్మతెమ్మెరల మూపున దేలు పికకూజితము నిద్రాలసులకెట్టి యవ్యక్త సుఖలీలలిచ్చునో, అట్టి ప్రశాంత నిరార్భాట గానసౌలభ్యము "యిండియన్ డ్రామెటిక్కు" వారి ప్రధాన నాయకునందగుపడును. గాత్రము శారీరకమై వయోభేదమున దెగుచుండును. సుబ్బారావు గాత్రము మానవ నైజమగు విపర్యయమొందుచు, క్రమముగా సుఖస్పర్శ గలిగింపకున్నది. సంగీత శిక్ష పొసగిన నారాయణదాసు[64], కర్రా పాపయ్యశాస్త్రి[65] మొదలగు పాటగాండ్రు పికస్వరలాలిత్యమును గోలుపోయినను, తానతరంగసంపదలచే తమ ముదుసలివణకుల ముదురు గొంతుక నలంకరింపగలిగి యున్నారు. కేవల నాట్యరంగముల గాత్రవైఖరులలవడిన మన సుబ్బారావు వంటివారెంతకాలము జనాభీష్టముల నిలుపుకొనెదరో సందియమైన విషయము.

---

**64. నారాయణ దాసు :** ఆదిభట్ల నారాయణదాసు. సంస్కృత, ఆంగ్ల, ఆంధ్ర భాషలలో పండితుడు. హరికథాపితామహుడు. విజయనగరం సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పని చేశారు.

**65. కర్రా పాపయ్యశాస్త్రి :** విజయనగరం రాజా ఆనంద గజపతి మహారాజుగారు స్థాపించిన సంస్కృత నాటక సమాజానికి సూత్రధారి. ఉభయ భాషా కోవిదుడు. నాటక నిర్వహణలో నిపుణుడని ప్రసిద్ధి.

సుబ్బారావొకప్పుడు స్త్రీ పురుష వేషముల రెంటిని సమాన పాత్రౌచిత్యముతో నిర్వహింపగలిగి యుండెను. ఇప్పుడాతని శరీర మొక్క వయసుజరిగిన తరుణరూపములకు మాత్రమే యనుకూలముగ నున్నది. ఇది కొంత దురదృష్టమని చెప్పవచ్చును. పది సంవత్సరముక్రింద సుబ్బారావు ఏ వేషమును ధరించినను వలపులొలికించు నంగసౌభాగ్యమొప్పియుండెను. అర్జునుని భూమికలో నీతడు గోపీమనోహరుని ముద్దుల మరదిగా నగుపడునంతటి సౌకుమార్యమున నుండెను. హరిశ్చంద్ర పాత్రాభినయమందు ఆ మహామహుని మహూదార సత్యశీతల సుబ్బారావునందగుపడుచుండెను. కాలవైపరీత్యమున నీముఖ లక్షణము లస్తమించినవి. ముఖము గడుసుబారి భావాభినయముల ముద్రింపజాలకున్నది. పఠాను, దుష్టబుద్ధి పాత్రముల రంగవ్యాఖ్యాన మొనర్చునపుడు సుబ్బారావు ఊహలెట్లున్నను ముఖాంగము లాయూహల బ్రకటింపజాలకున్నవి.

పూర్వము సుబ్బారావు తనకర్థమైనంతలో నిరాడంబరముగ సహజప్రబోధముల నందికొని పాత్రముల వేషభావములను రసవంతముగ జిత్రించుచుండెను. ఈతని స్వభావము కుదురుగల దయావివేకము లొప్పు శాంతతత్వము, అర్జునుడు, నలుడు, హరిశ్చంద్రుడు మున్నగు శాంతసద్గుణపుంగవుల నిజప్రవృత్తులభినయించుట కనుకూలమైన మానసమీతనిది. ఇట్టివాడిటీవల వీరభీభత్సకౌటిల్యవృత్తు లభినయించవలసిన వేషముల ధరియించి, నైజమనీషి ననుసరింపక నెక్కడనో యెరువుదెచ్చిన ఎవరో నిర్ణయించిన రీతుల నభినయించుచున్నాడు. ఇప్పుడే కాదు, నిండుయందముల పిన్నవయసునందైనను సుబ్బారావు వీర విషాద భావాభినయముల కనుకూలమైన యంగవిన్యాస మొప్పినవాడు కాడు. మనోవృత్తులకును, శరీర పరికరములకును బొత్తుగా పనికిరాని వేషముల ధరించి నూతనముగ నతిగించిన నాట్యవైఖరులతో విస్తరింపదలంచుచు సుబ్బారావు తన నైజపరిమితుల నెరుంగక నభినయించుచున్నాడని చెప్పవచ్చును. లక్ష్మణస్వామి పఠానురూపసాదృశ్య మభినయింపగా జూచిన బందరు పౌరులు పార్థపాత్రానుకూలుడగు సుబ్బారావాకరుకుతురక వేషములో నటింప జూచిమెచ్చెదరా?

సుబ్బారావు నమ్మినవారి విడనాడనివాడు, స్వతంత్రాపేక్షకలవాడు. ఇమిటేషనురాళ్ల నడుమ రాజిల్లు మేలిపచ్చవలె నీతడా చిననాటి సాంగత్యమును విడువజాలక దొరకినహంగుతో బందరుహాలుల చింపిరితెరలలో సమాన నటసహకారసౌలభ్యమెుందక గాలయాపన మెునర్చుచున్నాడు. ఈతని రంగసంపాదకుడు తనవృత్తిలో బందరుకెల్ల[66] మేటి. అయినను సుబ్బారావితర పరిస్థితులలో నిప్పటికన్నా నెక్కువ విఖ్యాతి గలిగియుండునని సంశయింపము.

పిన్ననాటి గాత్రమాధుర్యము వయసుజెల్లిన ముదురుశృతుల కెడమిచ్చినది. సుకుమారముఖాంగవిస్ఫూర్తి సత్వజరాజీర్ణతను పొందుచున్నది. లలిత నైజాభినయరీతుల బదులు బలవంతపు నాట్యపుపట్లు నిష్కారణముగ నావేశించినవి. అననుకూలపాత్ర స్వీకరణము అనుచిత నటసహకారము, ఇన్ని విపర్యములొదవిన సుబ్బారావీనాడు కూడ బందురులోని జనసామాన్యమునకు నాట్యమూర్తియై వెలుగుచున్నాడు. నేను చిత్రించిన నటశిథిల యెుకానొకప్పుడు మహనీయనటవర్గమున బేరుపెంపుల కర్హమగు రూపగాత్రాభినయముల మూర్తియై యుండెను. సుబ్బారావుగారి కీర్తి యనర్హమైనది కాదు. కాని వయోవిపర్యయమునను, గాత్రా భేదమునను, ఆనాటి కీర్తిబీజముల నంటియే ప్రస్తుత జనాభీష్ట మెునగూడినది కాని ఇప్పటి సుబ్బారావు వెనుకటి యందచందము లెంతమాత్రము చూపకున్నాడు.

దేవరకొండ సుబ్బారావు ధరించిన వేషములన్నిటిలో పదియేండ్ల క్రింద నిండు జవ్వమున నభినయించిన గయోపాఖ్యాన మందలి యర్జున పాత్రమునందు "గజ్జలందియలు గల్లుగల్లని మ్రోయ" ననుపద్దెమును, "కడచునె యెన్నడైన" నను నదియు బాగుగ నిర్వహింపబడెను. "హరిశ్చంద్ర"లో "దేవబ్రాహ్మణ మాన్యముల్ విడచి" రాజ్యమెల్లను కౌశికునకు ధారవోసిన సందర్భములో విశ్వప్రతిఘాతయగు కౌశికుని "కరంబుక్రిందగుట, మీదై నాకరంబుంట మేల్గాదే

**66. రంగ సంపాదకుడు :** స్టేజ్ మానేజర్ పదానికి తెలుగు. ఆ రోజుల్లో నాటక సమాజాలకు రంగాధిపతులుగా వున్న వారికి చాలా బాధ్యతలు, ప్రాముఖ్యం ఉండేది. ఈ ఇండియన్ డ్రామెటిక్ కంపెనీకి రంగ సంపాదకుడు ప్రఖ్యాత నాటక రచయిత, ఆ తరువాత చలన చిత్ర రచయిత పింగళి నాగేంద్రరావు.

రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే” అను భావమును వెల్లడించి దాతకు సత్పాత్రములభించిన యానందమును ప్రకటించెను. మరల కాశీపురాభివర్ణనమును, “జవదాటి యెరుగ దీ యువతీలలామం” బను పట్టును మనోహరముగ నాడుచుండిరి. రసపుత్ర విజయములో నీతడు రాజసింహపాత్రమును గైకొనిన యుక్తముగ నుండెడిది. దాని నితరులకిచ్చి తన కనుచితమగు దుర్గాదాసభూమికను దాల్చియుండుటచే నాంధ్రనాటక పరిషత్తువారి పోటీపరీక్షలో జగన్నాటకసూత్రధారి గుణాభినేతయగు ముంజులూరి కృష్ణారావు వైకుంఠ యోగివైఖరులకు జాలకుండెను. పరీక్షాఫలితము లెట్లున్నను సుబ్బారావు బందరు పౌరుల కనవరతము నాట్యకళాప్రదర్శనానంద మొనగూర్చువాడై పలుమారు నా విమర్శనాభినందములొంది యున్నాడు.

## ద్వైత గోపాలము[67]

నేను చూచిన భారతనాటకములన్నిటిలో విదురునొక వృద్ధ తపస్విగ తెల్లనిగడ్డముతో చుట్టకుదురు మురికి తలపాగతో చెప్పులోకాళ్ళిడి కాలునిపిలుపు కెదురుచూచువానివలె ప్రదర్శించుచుండిరి. దుర్బలుడగు ముదుసలి యొకమూలనుండి ‘‘కవ్వడితోడిపోరితము కర్ణున కిష్టము’’ అనుచు గొణుగుచుండెను. ఇదియే నాటక సమాజముల సామాన్యాభిప్రాయము. మైలవరమువారి ద్రౌపదీవస్త్రాపహరణములో[68] ద్వైత గోపాలము విదుర స్వరూపమును సలక్షణముగ దొల్లి జిత్రించి యున్నాడు. విదురుడు కౌరవసామ్రాజ్యమునకు కర్ణధారి. అమాత్యశేఖరుడు. నీతికోవిదుడు. ధర్మప్రవక్త. అన్నిటికన్న విష్ణుచింతాపరుడు. రాజ్యతంత్రముల యలసటలో హరిసేవా

---

**67. ద్వైత గోపాలము :** మైలవరం కంపెనీలో నటుడు. గొప్ప పాటగాడు. సంగీత దర్శకుడు. ‘ద్రౌపదీ వస్త్రాపహరణం’లో విదురుని పాత్రను శ్లాఘనీయంగా పోషించాడని ప్రతీతి. ‘సతీ సక్కుబాయి’ నాటకాన్ని చేపట్టి, దర్శకత్వం వహించి అందులో యోగి పాత్రను ధరించి ఆ నాటక విజయానికి సారధ్యం వహించిన వ్యక్తి.

**68. మైలవరం వారి “ద్రౌపదీ వస్త్రాపహరణము” :** మైలవరం వారు ప్రదర్శించిన ప్రఖ్యాత నాటకాలలో ఒకటి. రచయిత మల్లాది అచ్యుతరామశాస్త్రి.

నియతియలవడిన సమవర్తి. దాసీపుత్రుడయ్యును అశ్వత్థామాదుల కందరాని గౌరవముతో హస్తిపురరాజ్యభారమును వహించుచుండిన వేటి. ఈ లక్షణములన్నియు గోపాలముగారి యభినయములో ద్యోతకమగుచుండెను. గోపాలము చక్కని పాటగాడు. శాంతస్వభావుడు. "ఈ జగదీశుమాయలను వర్ణింపగలనెవ్వారికి తరంబగును" అను భక్తి నిర్వేదరసభరిత కీర్తనను గోపాలము పాడునపుడు జూపరులకేర్పడు భక్తివినమ్రభావములు రామకృష్ణయ్య[69] నారదవేషములోగాని, రాధాకృష్ణయ్య[70] కబీరు గీతములందుగాని గానరాకున్నవి. గోపాలముపాడిన "జగదీశుమాయల" గానవైఖరి పారేపల్లి సుబ్బారావుచ్చరించిన "పోవుచున్నాడే నా విభుని ప్రాణములు గొని" అనుదానితో సమానమర్యాద నొంది నాటకగానాభిలాషుల సాధనాదర్శమై కొంతకాల మీప్రాంతముల నేలినది.

## ఉప్పులూరి సంజీవరావు[71]

దేవరకొండ సుబ్బారావుతో బాటు సంజీవరావు కూడ మునుమొదలు బందరులో నాట్యాభినయ మలవడినవాడు. ఇద్దరు ఒకకాలముననే 15 ఏండ్లక్రింద నామిత్రవర్గమున జేరిరి. సంజీవరావు మోహిని, చిత్రాంగి మొదలగు శృంగారయువతీ పాత్రముల కర్హుడైనవాడు. ఈతని నడవడి యాడువారిచేష్టలతో సాదృశ్యమొందుచున్నది. కోటంరాజు లక్ష్మీకాంతము[72] చూపు తళుకులితనియందు లేవు. కాని అతనికంటె నెక్కువ స్త్రీ స్వభావోచితరీతులలవడినవాడు. నెల్లూరి

---

**69. రామకృష్ణయ్య :** నేతనూతల రామకృష్ణయ్య. నెల్లూరు ఆంధ్రసభలో ప్రముఖ పాత్రలు ధరించారు. నారదుడు, భరతుడు పాత్రలకు ప్రసిద్ధి.

**70. రాధాకృష్ణయ్య :** ఘంటసాల రాధాకృష్ణయ్య. నెల్లూరు సుగుణ విలాస సభ వారి 'రామదాసు' నాటకంలో కబీరు పాత్రధారి.

**71. ఉప్పులూరి సంజీవరావు :** తొలుత బందరులో డి.వి.సుబ్బారావుగారితో స్త్రీ వేషాలు ధరించారు. తరువాత మైలవరం కంపెనీలో చేరి ఆ సంస్థ ప్రదర్శించిన అన్ని నాటకాలలోను ప్రధాన స్త్రీ భూమికలను ధరించి పేరు పొందారు.

**72. కోటంరాజు లక్ష్మీకాంతము :** గుంటూరు సెకండ్ కంపెనీలో మల్లాది గోవిందశాస్త్రిగారితో స్త్రీవేషాలను ధరించిన నటుడు.

శ్రీనివాసాచారి[73] యంతటి పాటగాడు కాడు – అతనిది పాటకచేరీకి తగినంత దీర్ఘవిస్తారమున నుండును. సంజీవరావుపాట కిన్నరమేళవింపులతో లలితమనోహరంబుగనుండును. రుక్మాంగదలో[74] "మాలతీలతా" కీర్తనను పాడునపుడీతనిగాత్ర మత్యంతరామణీయక మొప్పుచున్నది. దమయంతి, చంద్రమతి, సావిత్రి మొదలగు పతివ్రతా స్త్రీ వేషములలో నీతడు జగ్గరాజుకు[75], పారేపల్లి సుబ్బారావుకు నొప్పిదమగు నుదారలక్షణము లొదవకున్నాడు. శోకరసమున సుబ్బారావుకన్న బాగుగ నభినయించును. శృంగారప్రాగల్భ్యమున నసమానుడు. కాని చల్లని యుబలోచితపవిత్ర స్త్రీ గుణంబు లీతని యభినయమందంతగా నగుపడవని పలువురభిప్రాయపడుచున్నారు.

## పింగళి లక్ష్మీకాంతము[76]

తిరుపతి వేంకటేశ కవియుగ్మములోని చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారు[77] బందరులో తెలుగుకైతల నేలుకాలములో పలువురాంధ్రకవిత్వరచయితలు బయలుదేరిరి. వారిలో కావ్యసిద్ధియొనగూడి నేటివరకును క్రొత్తదారుల తెలుగు

---

**73. నెల్లూరి శ్రీనివాసాచారి :** కె.శ్రీనివాసాచార్యులు. నెల్లూరు సుగుణ విలాస సభలో స్త్రీ పాత్రధారి.

**74. "రుక్మాంగద" :** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి "రుక్మాంగద" రాసిన తరువాత కోలాచలం శ్రీనివాసరావుగారు మరో "రుక్మాంగద"ను రచించారు. ఈ రెంటికన్న బహుళ ప్రచారం పొందిన నాటకం బేతపూడి భగవంతరావుగారిది.

**75. జగ్గరాజు :** ముప్పిడి జగ్గరాజు. మైలవరం కంపెనీలో ప్రసిద్ధ స్త్రీవేషధారి.

**76. పింగళి లక్ష్మీకాంతము :** తరువాతి రోజులలో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ఆచార్యులుగా ప్రఖ్యాతిగాంచిన పింగళివారు తొలుత బందరులో ఉపాధ్యాయవృత్తిలో ఉంటూ రాయల్ థియేటర్‌లో ముఖ్యమైన పాత్రలు ధరించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి ప్రధాన శిష్యులలో ఒకరు. పాండవనాటకాలలో ధర్మరాజు పాత్రకు ప్రసిద్ధులు.

**77. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు :** 'తిరుపతి వెంకటకవులు'గా ప్రసిద్ధిగాంచిన జంట కవులలో ఒకరు. కింకవీంద్రఘటాపంచానన బిరుదాంకితులు. తొలి ఆంధ్ర ఆస్థానకవి. వీరి పాండవ నాటకాలు ఆంధ్ర నాటకరంగాన్ని ఒక అర్ధశతాబ్దం పాటు ఏలాయి. ఈ జంటకవులలో మొదటివారు దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు.

కైతలల్లు పింగళి లక్ష్మీకాంతము, కాటూరి వెంకటేశ్వరరావు, విశ్వనాథ సత్యనారాయణ ముఖ్యులై యున్నారు. లక్ష్మీకాంతము వెంకటశాస్త్రిగారి ప్రియశిష్యుడై వారి శుశ్రూష నెక్కువగజేసి భారతములోని గుట్టుమట్టులనేకముల తెలిసికొనెను. మరియు తెలుగు ప్రబంధముల జక్కగ జదివి లోకజ్ఞానముతో, సూక్ష్మవిమర్శకశక్తితో వాని మానసికతత్త్వమును గ్రహించియున్నాడు. సరసుడు, అనుభవశాలి, లౌకికుడు, కరుణాసమత్వములతో మానసికవ్యాపారముల విమర్శించు తత్వజ్ఞుడు. భావకవితారీతులలవడిన కావ్యశిల్పి. ఈతడు రాయల్ హిందూ థియేటరులో భారతనాటకాభినయమందు అనేక వేషముల ధరియించుచుండెను. ఆవల నాంధ్రసభలోను ముత్తరాజు సుబ్బారాయ మెమోరియల్ సంఘములోను[78] మంత్రి రాక్షసుని పాత్ర మభినయించెను. మంత్రి రాక్షసుని గూర్చియు లక్ష్మీకాంతముగారి యభినయ కౌశలము నుద్దేశించియు నొక ప్రత్యేక విమర్శనమల్లియున్నాను. వీరు బాహుకవేషమును, అశ్వద్ధామ భూమికను మిక్కిలి సామర్థ్యముతో నభినయించినట్లు వింటినిగాని వానిని నేజూచి యుండలేదు. నేను చూచినవానిలో భారత నాటకములందు ధర్మరాజు వేషమును, రసపుత్ర విజయమునందు రాజసింహుని భాగమును మిక్కిలి చతురతతో నెరవేర్చిరి. లక్ష్మీకాంతముగారు గొప్ప పాటకుడుగాదు. కాని పద్యమునకు రసపుష్టినొసంగు గానకౌశల్యమేర్పడియున్నది. వెంకటశాస్త్రిగారి తరువాత నీయూరిలో పద్యముల నర్థవాహకవైశద్యముతో, స్పష్టముగ రసభావయుక్తముగ నుచితమగు సంగీతముతో శ్రవణానందముగ జదువనేర్చినవాడీ లక్ష్మీకాంతమే. ఈతడభినయించునపుడు కావ్యసౌందర్య మెరిగినవారందరు వీరిలోలేని సంగీతమున కెదురుజూడక, గానలోపము నధిక్షేపించక, శ్రద్ధతో హాయిగ తెలుగు పద్దెముల రసభావములనుభవించుచుందురు. నాటకాభినయమున కెంతసంగీత మవసరమని రసజ్ఞులెంచుదురో, నాట్యతత్త్వమెరింగిన గానవిద్యాధిపులెంత సంగీతమును నాటకాభినయమందు వనియోగింతురో, అంత పరిజ్ఞానము లక్ష్మీకాంతముగారి

**78. ముత్తరాజు సుబ్బారాయ మెమోరియల్ సంఘము :** శ్రీకృష్ణ తులాభార రచయిత ముత్తరాజు సుబ్బారావుగారు మరణించిన తరువాత బందరులో యీ సంఘం స్థాపించబడింది. ఆయన జ్ఞాపకార్థమై ఆంధ్రదేశంలోని ప్రముఖ సంస్థలను బందరుకు ఆహ్వానించి నాటకాలను ప్రదర్శింపచేసిన సంస్థ.

కమరియుండుటచే నీతడభినయించునపుడు గానప్రావీణ్యలోపమేరును యెంచియుండలేదు. వీరు ఆంగ్ల విద్యయందు నాటకవిమర్శన మెరింగిన యనూనావకాశము కలవారగుటయేగాక చక్కని లౌకికజ్ఞానము, మానసవ్యాపార విమర్శనశక్తియు కలిగి తామభినయించు పాత్రముల సంప్రదాయమును పురాణేతిహాసముల నుండి గ్రహించి విమర్శించి పాత్రస్వభావమును వివిధములగుపట్టులలో మనుష్యులకుండు గుణములను లెస్సగ బరికించి యభినయింతురు. విగ్రహముకూడ అనేక వేషముల కొప్పిదముగ నుండును. వీరి వేషము మొత్తము మీద స్వభావ సహజముగనుండి ముఖముద్రలందు రసభావములు జక్కగ ముద్రితమై యగుపడును. హస్తవిక్షేపణము కొన్ని యలవాటులకు బానిసయై తర్కవాగ్వాదము లొనర్చువారని బల్లగుద్దువాదింపులను జూపుచున్నదని కొందరభిప్రాయపడుచున్నారు. లక్ష్మీకాంతము రసోద్వేగమున మైమరచి భావసాంకర్యమును విపరీతచేష్టలను చూపగల నటుడు కాడు. తెలివి, శాంతము, విమర్శకశక్తి, కరుణాప్రవృత్తులు, ప్రధానలక్షణములై యితర రసములక్షణికావేశములను జెందు మేధాసంపన్నుల గుణవిశేషముల చక్కగ నభినయింపగలడు. అనగా తన నిత్యజీవన పద్ధతుల కనుకూలమైన పాత్రములనే యెక్కువ సామర్థ్యముతో నిర్వహింపగలడుకాని, లక్ష్మణస్వామి షుమేరుసింగుభీభత్సమును, నాగరాజరావు పఠాను మతిభ్రమణమును, రాఘవాచారి రామదాస భక్తి నిశ్చేష్టతను, సంబంధ మొదలియారీ యాగో కౌటిల్యమును, గోపాలర్సు[79] శకారశ్యాలకత్వమును ప్రకటించునట్లు నిజస్వభావమునకు సంపూర్ణ విరుద్ధముగ నుండు నాటకపాత్రలతో గుణరూపసాదృశ్యమొంది యభినయించలేదు.

లక్ష్మీకాంతము ధర్మరాజునందలి నిజసత్వమును చక్కగా గ్రహించియున్నాడు. భారతవీరులలో భీముడు అంతరంగమున మంచివాడై లోకములో దుడుకుతనమునకు ఖండవాదమునకు నపకీర్తిగొనినవాడు. ధర్మరాజు సామాన్యముగ ధర్మవర్తనుడయ్యును పెద్దలయెడ భక్తివిశ్వాసముల జూపి వినయాదిసద్గుణములకు బేరొందియున్నను “వలసినచో నబద్ధములు బల్కగవచ్చు”

**79. గోపాలర్సు :** సుగుణ విలాస సభలో ముఖ్యనటుడు. శకారుని పాత్రకు ప్రసిద్ధి.

నను లోతులౌక్యుడు. ధర్మరాజంత గూఢాలోచనవాడు భారతములో లేడు. ఈ సంగతి నెరింగి రాజసూయాధ్వరమూర్ధాభిషిక్తుడై రాజన్యమాన్యత లందికొనిన పాండవాగ్రజుని రాచపోకడ లనుసరించుచు "మాట తేనెతేట మనసు విషము" అను లోని నిజమెరింగి ధర్మరాజ గుణానుకూలముగ నభినయించెను. అదివరకు నాటకరంగములలో ధర్మరాజు పట్టుబట్టల మడికట్టి శ్రాద్ధయోగ్యముగా నగపడుచు విరాగిచూడ్కులతో చేతకాని శాంతముతో నిర్వీర్యముగ క్షత్రియజన్మవాసనలకన్న పురోహితలక్షణము లెక్కువేర్పరచుచు గుంటలో పాడినట్లు రాజనీతి నెరుంగని దైన్యముతో కనుపడుచుండెను. మరికొందరు నటులు చమ్కీదుస్తుల పూసతళుకులలో ధర్మరాజు సౌశీల్యమును మరుగువెట్టి సామాన్యరాచవిగ్రహమువలె చూపుచుండిరి. ధర్మరాజు నిత్యవ్యవహారములలో దయాసత్యశీలము లొప్పుచు నవసరమైనప్పుడు దుర్భేద్యమగు రాజనీతిని సమరస్థిర ధీరత్వమును ప్రకటింపగల సర్వసమర్థుడు. ఈ సత్యమును లక్ష్మీకాంతము భారతావలోకనమున జక్కగా గుర్తించి ధర్మరాజు నొక "తర్పణములు నీకు తండ్రి" అని చచ్చువైదికునిగ జూపక కథావకాశముల ననుసరించి యే గుణములు ద్యోతకార్హములో వాని నుచితరీతుల బ్రదర్శించి ధర్మరాజ పాత్ర నిర్వహణమున కమూల్యమైన వ్యాఖ్యాన మొనర్చియున్నాడు. ఏ పట్టునకెట్టి ముఖ వైఖరులు, కాకుస్వరములు అవసరమో భారతసామ్రాజ్యధూర్వహుడగు నీతివిత్తముడెట్టి రసావేశముల జెందగలడో వానినెల్ల యదార్థముగ జూపియున్నాడు. అర్జునుడు కర్ణుని దాకజాలక "మాధవా మనరథంబిక మరలనిమ్ము" అని ధర్మజుశిబిరమున దూరినపుడు తమ్మునిపై నలిగి వీరోత్సాహదీపకంబుగ నభినయించిన తెరంగెన్నటికిని మరువనేరము. ధర్మరాజగుణాభినయములో లక్ష్మీకాంతమును మించిన నటుడు లేడు.

రసపుత్ర విజయములో[80] రాజసింహుని వీరరసపుత్రగుణములను యధోచితముగ బ్రదర్శించి పరిషత్తువారి స్వర్ణపతకమును గెలుపొందియున్నాడు. శాంత స్వభావముగల ధీరనాయకుల వీరావేశము లెస్సగ నభినయించును.

---

**80. 'రసపుత్ర విజయము' :** ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణరావుగారి రచన. విశాఖపట్నంలోని సమాజాలు ఈ నాటకానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలను సంపాదించి పెట్టాయి. 1915-30 మధ్య కాలంలో ఆంధ్రదేశంలోని అనేక సమాజాలు ఈ నాటకాన్ని ప్రదర్శించేవి.

మంత్రిరాక్షసుని స్వభావమంతయు, వాని ఆర్యావర్తభూభరణసామర్థ్యము లక్ష్మీకాంతముచే జక్కగా బ్రదర్శింపబడినది. నాగరాజరావువలె అంతకన్న నెక్కువ యైతిహాసిక పరిచయముతో పాత్రగుణములను, కథాసందర్భమును విమర్శించి తానేపాత్రాభినయమున కనుకూలుడో దానినే గైకొని పాత్ర సాదృశ్యమొంది నేర్పేర్పడ నభినయించుచుండును.

## హరిప్రసాదరావు గారు[81]

ఆనాటి విఖ్యాతపురుషులీనాడు సామాన్యులగుచున్నారు. దేశకాలపరిస్థితులు కాలతరంగకల్లోలములో మునుగుచు, దేలుచు, నూతనాదర్శములను నవ్యభావములను క్రొత్తరుచులను యేర్పరచుచున్నవి. కావ్యములు యిట్టి కాలవిపర్యయమున కీర్తిలాభమునొందుచు ప్రజాదృష్టిలో గౌరవహైన్యమున క్రుంగుచు చక్రనేమిక్రమంబున నీచోచ్చదశల నొందుచుండినను శిలాగతమైన శిల్పవైఖరులు గ్రంథలిఖితమైన కావ్యసంపదలు దశాపరివర్తన మనుభవించునేకాని చప్పున చావనేరవు. ఒక కాలములో నవి తగ్గువడినను మరియొక కాలములో సంపూర్ణ ప్రజాభీష్టమును వడయుచుండును. నాట్యకళ మనుష్యుని స్వకీయరూపమనోబలముల నాశ్రయించి సులభముగ కాలవిపర్యయ మొందుచున్నది. బయస్కోపులు మహానటుల గుణవ్యాఖ్యానమునకును రసోపన్యాసములకును శాశ్వతస్థితి గల్పించుచున్నవి. విమర్శకులు కొంతవరకు నటవైఖరుల బుడమిపై నిలుపగలిగియున్నారు. యెవరెంతచేసినను నాట్యప్రతిష్ఠ నటుని జీవితకాలములోనే బాల్యప్రౌఢ వార్ధక్యముల భిన్న గౌరవములొంది వానితో యంతరించుచున్నది.

హరిప్రసాదరావు కొందరచే నాంధ్రనటపితామహుడని గౌరవింపబడెను. ఈతనియందు కొంత భాగవత సాంప్రదాయమున్నది. గుంటూరులో పుట్టి పెరిగి అచ్చటి ఫస్టు కంపెనీలో ప్రధాన నాయకపాత్రధారియై చిరకాల మాంధ్రనాటక రంగమునకు నాట్యాదర్శముల నాదేశించు నటరాజుగా వెలిగెను. గుంటూరులో గద్యనాటకములు, హిందీనాటకములు తొలుదొల్త నుండినదియు లేనిదియు

**81.** హరిప్రసాదరావుగారు : చూ. వివరణ 30

నేనెరుగను. బందరులో కన్న గుంటూరులో ఆ కాలమున వీధిభాగవతములకును సంగీతమునకును యెక్కువ జనామోదముండెననుట నిర్వివాదాంశము. బందరు నాటకములలో కన్న గుంటూరువానిలో మొదటి నుండియు సంగీతమున కెక్కువ అవకాశములుండెనని యూహించుట మాత్రము యథార్థమునకు దూరముగ నుండనేరదు. 1896 ఆ ప్రాంతములకే గుంటూరు ఫస్టు కంపెనీ వడ్డాది సుబ్బారాయుడుగారి పద్యమయ వేణీసంహారమును, వీరేశలింగముగారి శకుంతల హరిశ్చంద్రలను, కృష్ణమాచార్యులుగారి పద్యమట్ల నాటకములను అప్పటికి గొప్పగా నెంచబడిన సీనరీతో మంచి దుస్తులతో బ్రదర్శించుచుండిరి. అప్పటికే హరిప్రసాదరావు గారు సారంగధర, దుర్యోధన, నల, చంద్రహాస పాత్రముల గైకొనుచు నీవైపునకెల్ల జక్కనివాడనియు గానాభినయ సర్వాంగసౌకర్యము లేర్పడిన నటశేఖరుడనియు బేరొందియుండెను. ఆవల దుష్యంత, హరిశ్చంద్ర, సుదేవ పాత్రములకూడ అభినయించుచుండెను. ప్రసాదరావుగా రానాడనుభవించిన కీర్తి వైభవము నాటక సమాజములు తామరతంపరలై వ్యాపార పద్ధతులమీద నడుపబడు నీకాలములో నేరును పొందనట్టి మహావ్యాప్తితో నుండెను. ప్రసాదరావుగారి చూపులు, పోకడలు, నడవడి, హస్తములు, గాత్రవైఖరులు అభినయ విశేషములు మాత్రమేకాక వారి గానాభినయరీతులందలి లోపములు కూడ నాట్యాదర్శములుగ నెంచబడి బలువురచే ననుకరింపబడెను. వీరి నటాధిపత్యకాలములో వీరియభినయకౌశలమంతగా జూచుభాగ్యము నాకు గలుగలేదు. కాని రాజకుమారుల వేషములందుకన్న కొంతవయసు చెల్లిన దుష్యంత హరిశ్చంద్రాదిపాత్రములకే వీరియంగగాంభీర్య మొప్పెనని యభిప్రాయపడితిని. సారంగధరలో "అటవీస్థలముల కరగుదుమా వటపత్రంబుల గోయుదమా," "పావురము బడయుదము, భళిభళి తడయక నేగుదము," మొదలైన కీర్తనల పాడుచు తోడిబాలురతో విహారవినోదములదేలు సారంగధరపాత్రము నెంతటి చకచకతో కౌమారనైజముగ నభినయించినను దుష్యంతభూమికలో "వాసనచూడనట్టి ప్రసవంబు"గ శకుంతల నూహించినపుడుద్దీపించిన ప్రౌఢ శృంగార రసాభినయమందలి నేర్పు కనుపడకుండెను. ప్రసాదరావుగారి మేనివిప్పు చక్రవర్తుల కుచితమైన విశాలగాత్ర గాంభీర్యమున నేర్పడి తొల్లిటినుండియు రాజకుమార పాత్రముల కనర్హముగ నుండెను. పెద్దవేషములలో

బాలివాలాయొకడుతప్ప[82] భరతఖండమున ప్రసాదరావుగారితో పోల్చదగిన రాజపురుషుడు లేడనియే చెప్పవచ్చును. బెంగుళూరి నాగేశ్వరరావు ప్రకృతపు సామ్రాజ్య సైనికవర్గములోని రసపుత్ర భూపాలకుల మేనిచందము లొప్పుచుండును గాని ప్రసాదరావు కేర్పడు చక్రవర్తి లక్షణము లీతనియందు కనుపడవు. హరిశ్చంద్రలో చివరిభాగమున లోహితాస్యుని మృత కళేబరము వీక్షించి "తతహంసతూలికాతల్పంబునను జేర్చు మృదుతర దేహమా యిది కుమార! కమ్మసంపెగనూనె కడు రాచిపెంచిన ముంగురులా యివి ముద్దుకుఱ్ఱ" మొదలైన పట్లను, శోకరసప్రధానముగ నభినయించుదెరపు లిప్పటికిని యతిశయింప బడలేదు. సారంగధరలో శిక్షావిధానమేర్పడుపట్టున "ఎంతటి క్రూరుండేనియు, నెంతటినాస్తికుడుగాని యేమరక మరిన్ వంతలు చిందెడువేళల జింతించిన బాధతొలగు" నను పద్యమందలి భక్తిరసమును నిక్కముగా గురిపింప గలిగెను. ప్రసాదరావు ధీరోదాత్తనాయకుల శృంగారశోకరసముల ముద్రించుటలో చతురుడు. కాని వీరభీభత్సముల బ్రదర్శింపజాలడు.

రుచులు మారినవి. ఆంధ్ర నాటకరంగముల శిక్షాక్రమము గానమందును, అభినయ సౌష్ఠవమందును కాలోద్వేగమున విపరీతగతుల విస్తరించుచున్నది. రాజకీయ రంగములందెటులనో, నాట్యకళాభ్యాసకులందు కూడ నటులనే "సుకృతిర్గతాయుః" అని చెప్పవలసి యున్నది. తెలుగు నాటకముల సింగమై, యసమాన నటవిఖ్యాతి ననుభవించి నవ్యనటశేఖరుల కాదిశిక్ష నొసంగి నాట్యాదర్శముల నాదేశించియుండిన ప్రసాదరావు క్రొత్తకాలపురుచుల నందికొనలేక "బ్రతికియున్నాడ జీవచ్ఛవంబనగుచు," నను పెద్దన వాక్యమును జపియించుచు, కాలయాపన మొనర్చుచున్నాడు. వీరి నాట్యవైఖరు లీనాటిప్రజాపండితజనంబుల నాటకాదర్శముల కందకుండినను వీరికీర్తియు, మార్గదర్శకప్రభావము, నిరుపమగాత్ర గాంభీర్యము నేటికిని ఆంధ్రుల గౌరవాస్పదమై వెలుగుచున్నవి.

---

**82. బాలీవాలా కంపెనీ :** మద్రాసు రాష్ట్రంలో పలుమార్లు ప్రదర్శనలిచ్చిన పార్శీ కంపెనీ. దీని పేరు విక్టోరియా థియాట్రికల్ కంపెనీ. బాలీవాలా ఈ కంపెనీలో మందు నటుడుగా ప్రవేశించి, ఆ తరువాత దర్శకుడై, ఆ కంపెనీకి యజమానై దేశవిదేశాలలో పేరు గడించాడు. బర్మా, మలేషియా, ఇంగ్లండు వంటి దేశాలలో పర్యటించడమేకాక భారతదేశం అంతటా ప్రదర్శనలిచ్చిన వ్యాపార నాటక సంస్థ ఇది.

## యడవల్లి సూర్యనారాయణ[83]

బందరుపట్టల తాటితోపులదాటి డెల్టాచేలచప్పిడి సీనరీ జూచి చిన్నరైలు కుంటినడకకు విసిగి యల్లన బెజవాడకూడలి జేరి సంధ్యారాగశోభితమై గిరినగరసమ్మేళనచిత్రమై వెలుగొంది భావసంచలన సౌభాగ్య ముదయింపజేయు సుందరరంగమవలోకించి సంతసించుచు యాత్రికుల దుడుకునడకల దాడి నోర్చుచు నిష్క్రమణద్వారాభిముఖులమై నడచునపుడుత్తమ తరగతి నివేశనాగారము యెదుట – నొకరాజన్మూర్తి యంటుపోగుల చవుకళింపులు చూపుతళుకుల కచ్చెరువొందుచుండ లేతయూదాపట్టుకుచ్చు మకుటమై ముఖసీమ నలంకరింప కాంతులీనెడి చామనచాయ నెమ్మొగము రాచబింకముల చెక్కుడు బొమ్మవలె నుదారగంభీరవిలసనముతో రాజిల్ల డంబుమై గూర్చుండి యోరచూపుల పాంథుల నవలోకించు రాచపోకడలపుట్టయగు నొకవిగ్రహ మగుపడును. పాంథులు సామాన్యముగ శకటాభిగమన మపేక్షించి విశ్రమించు జమీందారునిగ బలుమాఱు తలంచెడి ఈ విగ్రహమే సుప్రసిద్ధ దుష్యంతభూమికాధారుడగు యడవల్లి సూర్యనారాయణ!

తెలుగు నాటకముల నవ్యవైఖరులకు తొల్లిటికుదురైన గుంటూరుపుర మీతని నివాసస్థానము. ప్రసాదరావు పెద లక్ష్మీకాంతము నాటకములలో సంగీతమును విరివిగ వాడుచుండ బాల్యమునజూచి వారి నతిక్రమించు నుత్సాహమేర్పడినవాడు. నటుల నాట్యరంగగీతికాక్రమములతో సంతసించి వానినే పరమావధిగ దలంచి యనుకరింప భరతవర్షములోని ప్రసిద్ధగాయకుల గానసభలన్నిటిని వ్యయప్రయాసలనోర్చి విని వచ్చిన గానరసాభిరతుడు. నైజమగు కళాసక్తికి సిరిసంపదలు తోడై తీరని రసావేశము నవ్యవైఖరీ సమాలోకనమునకు ప్రోత్సహింప నిరంతరము గానవిద్యారహస్య జిజ్ఞాసతో మెలంగెడి రసిక కళాభిలాషునకెట్టి నవ్యవైఖరీ సంస్కార ఫలితములుండగలవో, యవియన్నియు సూర్యనారాయణగారి చేత జిక్కినవి. వీరికి పరమేశ్వరుడొసంగిన గాత్రమాధుర్యము, గానవైఖరీ సంచార నైపుణ్యము తెలుగుసీమల నలుదెసల నభినందింపబడు సంపద

**83. యడవల్లి సూర్యనారాయణ :** చూ. వివరణ 6 & 31

లొప్పుచున్నవి. వీనికితోడు విసుగు విరామములు లేక తన సర్వస్వమును ధారపోసి గానప్రసిద్ధుల పాటకచేరీలను నటశేఖరుల నాట్యసిద్ధిని చూచివచ్చిన సంస్కారము సూర్యనారాయణగారి నాట్యగీతికారీతులందు రాజిల్లుచున్నది. ఇట్టి ప్రయత్నపూర్వకమైన నిజప్రతిభా సంపోషణము మనవైపు తెలుగునటులలో మరేరికిని కలుగలేదు.

సూర్యనారాయణ పండితవంశములోని వాడు. తెలుగు ప్రబంధములను, సంస్కృత నాటకములను, అలంకార లక్షణములను చక్కగా గరచియున్నాడు. సంగీతమందెట్లో కావ్య నాటకముల రసావస్థలందును, అలంకారములందును అటులనే పెద్దల యభిప్రాయములను, సిద్ధుల ప్రయోగవైఖరులను ప్రీతిమై నెరుగవేడెడివాడు. సూర్యనారాయణ పైచూపు లెంతటి రాచబింకముల గురిపించుచున్నను మానసము విజ్ఞుల యెడ వినయవిధేయతల నొప్పుచు నిరంతర రసాస్వాదన కుతూహలంబున నవ్యార్థ జిజ్ఞాస పరత్వమున జ్ఞానసంపాదనాన్వేషియై మెలగుచుండును. మన తెలుగునాటకరంగములలో ప్రజామోద మనుభవించెడి ప్రసిద్ధ నటబాహుళ్యము తమకు సహజముగ నేర్పడిన గానకౌశల్యమును యితర నటుల లక్షణవిహీనగీతికాక్రమములతో సానపెట్టి హార్మోనీవాని శిక్షాదేశముల ననుసరించి పెంచుకొందురేకాని సూర్యనారాయణవలె నుత్తమనటగాయక వర్గముల కళాసిద్ధి నరయబోవరు. ఇటులనే తమ కొద్ది చదువుల అన్వయజ్ఞానమును రంగశిక్షకుల రసవ్యాఖ్యానముతో మెరుగుపెట్టి యాంధ్రావనీవిదితమగు నర్థజ్ఞానదారిద్ర్యముతో తమ పాత్ర సంభాషణము నెట్టుచుందురేకాని సూర్యనారాయణవలె నుత్తమశిక్షను పొందదలచరు. సూర్యనారాయణ తానభినయించు నాటకముల అర్థమును సంప్రదాయమును పనివడి నేర్చుకొనుటయేకాక నాటకాంశమును తెలుపు కావ్యములను, నాటకములను వేల్పువిద్దెలో, తెలుగుబాసలో గూలంకషముగ నభ్యసించెడి రసికుడు.

రాచపోకడల చెక్కుడుబొమ్మయై విలసిల్లు సుందరమూర్తికి రాచమర్యాదల తెఱ వలవరచియున్నాడు. నిసర్గమాధుర్య మూరెడి గాత్ర సౌకర్యమునకు సకలదిగ్దేశగాయకాదర్శముల గానరీతు లలవరచియున్నాడు. పండిత

సంప్రదాయానుగతమగు కావ్య ప్రసక్తికి పలుయొజ్జల రసభావ విజ్ఞానసంపదల నతికించియున్నాడు. పనివడి పలుమాఱు లభినయమభ్యసించిన ప్రయోగదక్షత వలన నభినయుములో సహజముగ నేర్పడని కౌశల్యదారిద్ర్యమును మరుగుపరచియున్నాడు. భరతఖండములోని నానారాష్ట్రముల ఉత్తమనాట్యరంగముల జూచియు నటవర్తన మవలోకించియు నాట్యమర్యాదల జక్కగ గుర్తించి నడకసొంపులచే పోకడ బింకములచే మొత్తముమీద మెప్పించి నాటకాభిమానుల గౌరవమందికొనిన నేర్పరి. సూర్యనారాయణ ఆంధ్రనాటకరంగస్థలమందు పొందుచున్న పెనుపేరు యిన్నిటి సమావేశమున గలుగుచున్నది. నాగరాజరావుగారి వలె మరికొందరు పెద్దనటులవలె నీతడు ప్రయత్నించి నటవృత్తికి గౌరవము సంపాదించిన మహాభిమాని. సామాన్యముగ తెలుగుకంపెనీలలో ప్రధానాపాత్రముల నభినయించు ధీమంతులు తమకన్న తక్కువవారి నలువురతో గూడి పేరు పెంపులజాడ లరయక నటులన్న సంఘములో తక్కువచూపు దెచ్చుకొని మారుమూలల బడియుండ సూర్యనారాయణ నిత్యవర్తనము స్వాభిమానపూరితమై యాత్మ గౌరవసంరక్షణోద్దిష్టమగు పోకడలతో నందమై చెలగుచుండును. వీరు లక్ష్మణస్వామి, నాగరాజరావు మున్నగు భావాభినేతల ముఖ విన్యాస సౌకర్యము లొప్పకున్నను నటనైజము వీరి యందగుపడకున్నను తెలుగునటులందరిలో ప్రయత్నపూర్వకమగు కావ్యసంగీత శిక్షను కలిగి తమ నైజస్వభావమునకును నిత్యవర్తనమునకు అనువగు రాజవేషముల ధరించుటలో ప్రోడలై మొత్తముమీద సర్వతోముఖ సంస్కార సౌందర్య సంపదలతో నంగసౌష్ఠవమునకు వన్నెవెట్టి యుచిత విఖ్యాతి కొల్లగొనియున్నారు.

సూర్యనారాయణగారిని నేను 1910లో గుంటూరు పురమున నొక చిన్ని నాటకసమాజములో పాడుచుండగ జూచియుంటిని. అప్పటికి వీరు నాటకములలో విరివిగా నభినయింప మొదలిడలేదు. కాని, భావసిద్ధి యెంతయు నానాటి గానస్వాతంత్ర్యమందగుపడుచుండెను. తరువాత వీరు చెన్నపురి కరుదెంచినపుడు వీరిచే పాటకచ్చేరీ జరిపించి స్వర్ణపతక మొకదానిని బహూకరించిన మిత్రవర్గములో నేనొకడను. అవల ననేక వత్సరములు వీరి దినప్రవర్ధమానవిఖ్యాతి వినుచు బెజవాడలో కలిసికొనుచు నుంటిని. వీరి సత్యవంత

పాత్రాభినయము, దుర్యోధనభూమికాధారణము మైలవరంకంపెనీలో చూచియుంటిని. కాని వీనిలో గలిగిన యానందమునకు పదిరెట్లు నిరుడు వీరు మా యింట నతిథులై యుండి ఒకనాడు పూర్వాహ్నము మొదలు సాయంతనము వరకు గాత్రపోషణముతో జరిపిన కావ్యనాటక రసప్రసంగవేం, యుదాహరణపూర్వకమగు నాటకరసభావోపన్యాసవే నన్ను మిక్కిలి సంతసింపజేసినది. సూర్యనారాయణగారి గాత్రమాధుర్యము తపలాహార్మనీల యనుకరణ సహాయ మపేక్షించునది కాదు. ఆనాటి ప్రసంగము కట్టా పాపయ్య శాస్త్రులు మున్నగువారి ఫణితిలో నంతకన్న మిక్కుటమగు సంగీతరసజ్ఞతతో విజయనగర కావ్యపాఠుని నాట్యరసానుభవమును ప్రమింగివైచుచు నుల్లము తల్లడిల్ల నందమై శ్రావ్యమై మనోహరమై యనిర్వచనీయ శోభావిరాజితమై వెలుగుచుండెను. సూర్యనారాయణగారు ఆంధ్రగాయకశిరోమణులలో నొకరని నేను చెప్పను. కావ్యాలంకారకోవిదులలో నొకరని మన్నించను. నాట్యకళారసజ్ఞులలో మొదటితావుల వీరి నుంచను. ఆంధ్రభావాభినేతల మొదటి తరగతిలో వీరిని జేర్చనుద్యమించను. కాని కావ్యనాటక సంప్రదాయములను బహువిధ గానవైఖరులను నాట్యరంగమర్యాదలను యెంచదగిన సిద్ధిసమష్టితో ప్రయోగ వైదుష్యముతో నన్నిట సమానముగ మెఱపించుచు నిర్దుష్టముగ నభినయించెడి ప్రోఢ, నాట్యసర్వాధికారి సూర్యనారాయణ యనియే చెప్పవచ్చును. వీరిని మించి రంగములో గానతరంగముల నూగించి ప్రజాసంతుష్టి గలిగించిన నటులెందరో కలరు. కాని వారి గానవైఖరులు దోషపూరితములై సంగీత పరిజ్ఞాన శూన్యములై రసభావానుకూల్యత నెరుంగక ఆర్యావర్తదాక్షిణాత్య గీతికాక్రమముల ప్రత్యేకోపయోగ్యత గమనింపక జెలువొందకున్నవి. పద్యముల నర్థయుక్తముగ జదివెడి నటులెందరో కలరు; కాని పాత్రలక్షణముల కావ్యసంప్రదాయ మెరింగినవారు పెక్కులు లేరు. రాచదుస్తుల డంబుమీరెడి నాయక వేషధారులెందరో ఒడ్డుపొడుగుల సుందరమూర్తులున్నారు. కాని నిత్యజీవనాభ్యాసమున, నైజముగ దోచెడి రాచపోకడల డౌలుబింకముల నొప్పించెడివారు లేరు. ఇందులో నేవో ఒకటి రెండు లక్షణములున్నవారే తెలుగునటులలో ప్రధానులై వెలుగుచున్నారు. అభినయమందు ప్రత్యేకసిద్ధి నొందిన లక్ష్మణస్వామి, నాగరాజరావు మున్నగు

నటశేఖరులు సంగీతాదులందు మెప్పువడయుచున్నారు. రూపములో సూర్యనారాయణ ప్రసాదరావునకు చాలడు. అభినయసంప్రదాయాభిజ్ఞతలో నాగరాజరావు పొంత జేరనేరడు. గాత్ర విస్తరణమాధురీప్రభావములో రాఘవాచారి నిరాఘాట సంచార మొప్పనేరడు. ఆంధ్రగీర్వాణపద్యార్థముల గీతికావ్యాఖ్యానములో పాపయ్యశాస్త్రియడుగుల నడువనేరడు. జగ్గరాజు, గోవిందశాస్త్రి, లక్ష్మీకాంతముల రంగోచితగాత్రోచ్చరణ సమన్వయమెరుంగడు. కాని యిన్నిలక్షణములు నొక్కచోట నేకీభవించి మెరిపించి సొంపులొలికించు విపరీత అపూర్వ నటలక్షణ సముచ్ఛయము సూర్యనారాయణకు నొప్పియున్నది. సూర్యనారాయణ రంగప్రవేశము చొక్కంపుచూపులతో తియ్యని పాటపొంగులతో నిర్దుష్టమగు నర్థజ్ఞానముతో రాచనడకల నిండు మర్యాదలతో గుణానేకసంలబ్ధగౌరవముతో మెరియుచు నిట్టిదని నిర్వచింపజాలని మహావైభవముతో భాసిల్లుచుండును. ఆంధ్రనటులలో సూర్యనారాయణ పొందినన్ని రాజసన్మానము లందికొనినవారు లేరు.

యడవల్లి సూర్యనారాయణ శాకుంతలములోని దుష్యంత పాత్రాభినయమునకు పేరొందియున్నారు. వీరీపాత్ర మభినయింపగ జూచెడి యదృష్టము నాకింకను లభించలేదు. కాని యీ నడుమ చెన్నపురిలో సీతారామాంజనేయ నాటక సమాజమువారి శకుంతల ప్రదర్శనము నభినందించుచు నాంధ్ర పత్రికలో బ్రచురింపబడిన విమర్శనము[84] సహేతుకముగ నగుపడినందున దాని నీ యెడ నుదాహరించుచున్నాను.

**శ్లో॥ కావ్యేషు నాటకారమ్యాః నాటకేషు శకుంతలా**
**తత్రాపిచ చతుర్థోంకః తస్మిన్ శ్లోక చతుష్టయమ్.**

కావ్యమణిమండలమునందు శాకుంతల నాటకము దివ్యానురాగ విలసితమైన మహామణి యని సుప్రసిద్ధులైన కావ్య మీమాంసకుల పొగడ్తలను

---

**84.** ఆంధ్ర పత్రికలో **(శాకుంతలముమీద)** ప్రచురింపబడిన విమర్శనము : 27-2-1923వ తేదీన సీతారామాంజనేయ నాటక సమాజం మదరాసులో ప్రదర్శించిన నాటక ప్రదర్శనమీద ఆంధ్రపత్రిక 2-3-1923 నాడు ప్రచురించిన వ్యాసం.

బడసినది. శాకుంతల రామణీయకతను ప్రాచ్యపండితులె కాక గెయిటి మున్నగు పాశ్చాత్య పండితులు సైతము కొనియాడిరి. దివ్యానురాగవిలసితమైన మహాకవి కాళిదాసుని శాకుంతలమును ప్రదర్శించుటకు ప్రదర్శకుల కసామాన్యమైన ప్రజ్ఞావిశేషములు గావలసియున్నవి. శాకుంతలమునందు మాలతీమాధవమునందు గల చిత్రకథలు లేవు. ప్రేమరంగము తరులతా గుచ్ఛములతోను మృగశాబకములతోను తాపసజనముతోను శోభాయమానమైన కణ్వాశ్రమము. నాయిక వనమునందు పుట్టి పెరిగిన ముగ్ధాంగన. వల్కలము కుసుమ పల్లవములు భూషణాలంకారములు. హృదయము నవకోమలానురాగభరితము. శృంగారమూర్తియైన శకుంతల మనోహరంబులైన కోమలపల్లవ ప్రసూనములందును, హరిణపోతముల లాలనంబులందును విశుద్ధమైన ప్రేమ రసాస్వాదనమును జేసి అవ్యాజమైన రసానందముననుభవించినది. శాకుంతల రసానందమునకు విశ్వమును బంధించెడి ప్రేమ సూత్రము మూలము గాని నాయికానాయకులను జేరదీసెడి కామసూత్రము మూలముగాదు. శాకుంతల మేనకావిశ్వామిత్రుల కామసూత్రమునకు సత్ఫలమై తపోధనుడైన కణ్వ మహామునికి కూతురై సాత్విక జీవనము నవలంబించుచు తాపసోత్తముల నడుమను సతీధర్మములను గ్రహించినది. ఉదయాస్తమయములను ప్రకృతిపరిసరంబులందు జీవించుచు ప్రేమరసమును సహజముగ ననుభవించినది.

నాయకుడు పూరువంశప్రదీపకుడై మహావైభవముల ననుభవించుచున్న దుష్యంతుడు. తాపసుల క్షేమసంరక్షణతత్పరుడైన మహారాజు, ధీరోదాత్తుడు. విశుద్ధచరిత్రుడు. వీరి యన్యోన్య సందర్శనమాత్రముననె విశ్వకారణమైన ప్రేమ సూత్రబంధనము గలిగినది. విశుద్ధానురాగశోభితములైన హృదయములు కామసూత్రబద్ధములై భరతోదయముగలిగినది. ఈ దివ్యానురాగపరిణయమును మహాకవి కాళిదాసు శాకుంతలమునందు మనోహరముగ నాచంద్రార్కస్థాయిగ వర్ణించెను.

విశుద్ధచరితుడైన కణ్వ మహర్షి ఈ శుద్ధానురాగపరిణయమున కానందించి యాశీర్వదించెను. సంసార వ్యామోహమును విసర్జించిన కణ్వమహర్షియును శకుంతలావియోగ దుఃఖమును బొందెను. కణ్వాశ్రమమే

శకుంతల వియోగదుఃఖమును వ్యక్తము చేసినది. ఈ వియోగదుఃఖమును హృదయము కరగునటులు నాల్గవయంకమునందు కవి వర్ణించెను. ఈ కారుణ్య రసమే శాకుంతల నాటకమునకు హృదయము. బాల్యము నుండియును దుఃఖము నెరుంగని శాకుంతలకు కణ్వాశ్రమ వియోగమును దుష్యంతుని తిరస్కారమును గలుగజేసిన పరమసంతాపము మహాకవి హృదయము మాత్రమె గ్రహింపగలదు. ప్రేమ రస ప్రవాహము నందు భర్తృ సంయోగవియోగావస్థ లందును స్వవాసస్థలమిత్రబంధు సంయోగవియోగావస్థల యందును గలుగు సుఖదుఃఖములు శాకుంతల నాటకమునందు గోచరంబగుచుండును. శ్రీ సీతారామాంజనేయ నాటక సమాజమువారు ఆ మహానాటకమును ప్రదర్శించి చెన్నపురి పౌరులకు పరమానందమును గలుగజేసిరి.

నాటక ప్రదర్శనమునకు రసానందము ఫలము. రసోదయమునకు ప్రత్యేక పాత్రల నైపుణ్యమును సమష్టి ప్రదర్శనమును మూలములుగ నుండును. కణ్వాశ్రమమునందు శకుంతలయును ప్రియంవదానసూయలును ముగ్ధాంగనలకు సహజమైన శృంగార విలాసములతోను మిత్రసల్లాపములతోను నాశ్రమమునందలి తరులతావితానములకు జలసేచనమును జేయుట మనోహరముగ బ్రదర్శింపబడినది. నారచీరెలను గట్టుకొని కుసుమాలంకృతులైన వీరి ముగ్ధ విహారములు శుద్ధ శృంగార స్వరూపమును బ్రత్యక్షము చేసినవి. శకుంతలాపాత్రను ధరించిన ఉప్పులూరి సంజీవరావుగారు శృంగారవిలాసమును జక్కగ బ్రదర్శించిరి. రంగమునందు దుష్యంతుని ప్రవేశము శృంగారవిలాసమును సార్థకము చేసినది. రూపవయోవిలాసశీలములందొండురులకు దగియున్న శకుంతలాదుష్యంతుల సమావేశము శృంగారరసానుభవమున కవకాశము నొసంగినది. యడవల్లి సూర్యనారాయణరావుగారి దుష్యంత పాత్రధారణము ప్రేక్షకుల యాదరణమును బడసినది. సూర్యనారాయణరావుగారి వేషము, భాష, గానము, భావప్రదర్శనము ధీరలక్షణములను ప్రత్యక్షము చేసినవి. శకుంతలాదుష్యంతుల ప్రేమయోగమును కాముకయోగముగ బ్రదర్శించునపుడా సంయోగము వికారచేష్టలు లేకయు నార్యసాంప్రదాయముల కనురూపముగను ప్రదర్శింపబడినది. కామయోగమునకు వెంటనే గలిగిన వియోగమును బ్రదర్శించుటయందవకాశములు తగ్గింపబడినవి. ఈ వియోగ ప్రదర్శనము విస్తరణమును గోరుచున్నది.

శాకుంతల నాటకమునకు హృదయము చతుర్థాంకము. కాళిదాసు దానియందు గంభీరముగ రసస్థాయిని చిత్రించెను. ప్రేమరసాతీతమైన కారుణ్యరసము భక్తిరసమునందు మేళవించుచున్నది. కారుణ్యరసమునందు త్యాగము గోచరించునటులు భోగము గోచరింపదు. శకుంతల తన్ను బెంచిపోషించిన కణ్వాదులను తాను బెంచి పోషించిన యాశ్రమపరిసరములను విడిచి పోవునపుడు కణ్వాశ్రమమంతయును కారుణ్యరసమయమై యొప్పినది. కణ్వుని పాత్రను గైకొనిన అద్దంకి శ్రీరాములు[85] గారు కరుణరసమును జక్కగ గనుపరచిరి. శ్రీరాములుగారి గాత్రము, వేషభాషావిలాసములు చతుర్థాంక హృదయమును దెలుపుటకు దగియున్నను రసోదయమునకు స్థాయీభావ ముచ్చశ్రుతిని బొందవలసియున్నది. శకుంతలకు పితృవియోగము సఖీ వియోగము ఆశ్రమవియోగము దుర్భరమై శకుంతలను శోకసాగరమునందు ముంచినవి. సంజీవరావుగారప్పగింతల సమయమునందు శోకరసోదయమును స్ఫుటము చేసినను శృంగార రస సమ్మోహము వెంబడించినది. ఈ రస వికలత్వమునకు ప్రేక్షకులు మూలకారకులని యూహింపదగియున్నది. ప్రేక్షకుల లక్ష్యము కవి హృదయ సందర్శనమునందు కాక పాటలందును పదములందును తళుకుబెళుకులందును శృంగార విలాసములందును లగ్నమైనపుడు ప్రదర్శకుల లక్ష్యమును మధ్యమశ్రుతియందు సమ్మేళనము బొందుచున్నది.

శకుంతల పుట్టెడాశతో దుష్యంతునిమందిరము చేరినది. దుఃఖము నెరుగని కోమల హృదయము దుఃఖ సముద్రమునందు మునిగినది. నూతన పరిసరములు, నమ్మి ప్రేమించిన పతి తిరస్కారము, కణ్వశిష్యుల నిందారోపణములు, శకుంతల హృదయమును భగ్నము చేసినవి. దుర్భరమైన యవస్థాభేదములను జూపుటకు సంజీవరావుగారు ప్రయత్నించిరి. శృంగారకారుణ్యశోకకోపరసములను వెనువెంటను బ్రదర్శించుట కష్టతమము. ప్రదర్శనములందనుభవముగల సంజీవరావుగారీభిన్న రసములను ప్రదర్శించినను

**85. అద్దంకి శ్రీరాములు :** అద్దంకి శ్రీరామమూర్తి. చిన్నతనంలో బాలమిత్రమండలిలో బాలపాత్రల ద్వారా పేరు పొందారు. ఆ తరువాత మైలవరం కంపెనీలో చేరి హరిశ్చంద్రలో హరిశ్చంద్ర పాత్రకు ప్రసిద్ధి పొందారు. పాండవ నాటకాలలో ధర్మరాజుగా ప్రఖ్యాతినందారు.

శోకరసముచ్ఛ్రుతిని బొందవలసి యున్నది. దుష్యంతుని పాత్రను ధరించిన సూర్యనారాయణరావుగారి భావ ప్రదర్శనము గంభీరముగ నున్నది. తాను చేపట్టిన శకుంతలను నిరాకరించునపుడు సూర్యనారాయణరావుగారు చూపిన భావచేష్టలు సమయోచితముగ నున్నవి. నందనవనమునందు భరతసమావేశము, శకుంతలా సంయోగము కాలాతీతము వలన నంత ప్రముఖతను గాంచియుండలేదు. ఇది ప్రేమ ప్రదర్శనమునకు మూలకందము. ఇది నాటక ప్రదర్శనములందు విలంబమువలనను గలుగుచున్న లోపముగ నున్నది. కాలాతీతమువలన చివరకు మూలపట్టులను సయితము విడిచివేయుట సంప్రాప్తమగుచున్నది.”

మాయింట జరిపిన కాలక్షేపములో దుష్యంతుని పద్యములను, పట్టులను కొంతవరకు అనుభవించి యానందించిన నాకు పై విమర్శనము సూర్యనారాయణగారి దుష్యంత సారూప్యసంపాదనాభివర్ణమందు నిజమునే వెల్లడించినదని నమ్ముచున్నాను.

మైలవరంవారి నాటకశాలలో సూర్యనారాయణ సత్యవంత పాత్రమును ధరింపగా జూచియుంటిని. ఆ నాటకము ప్రధానముగ సావిత్రికి యమునకు జెందియున్నది. సత్యవంతునకు దీనిలో నెక్కుడు అభినయావకాశములు కుదరవు. సూర్యనారాయణగారి సామర్థ్యము యీ నాటకమునందు ఎక్కువ వెలుగలేదు. దీనిని గూర్చి యాంధ్రపత్రికలో నగుపడిన విమర్శన ముదాహరించుచున్నాను:[86]

“సత్యవంతుని పాత్రను ధరించిన యడవల్లి సూర్యనారాయణరావు గారి అభినయ విశేషమును, గాన నైపుణిని, ధీరోదాత్తనాయకానుకూల వేషభాషాదులను యెన్నిసార్లు వర్ణించినను పునరుక్తిదోషముండనేరదు. సత్యవంతుడు ద్యుమత్సేన మహారాజపుత్రుడయ్యును, బాల్యంబునుండియు వనవాసమును తాపస స్నేహమును అలవడియుండుటచే సావిత్రిని వరించునపుడును, ఆయమతో అడవికి కట్టెలు కొట్టబోవునపుడును, తాపసునివలెగాక రాజనందనునివలె వర్తించుచు నాగరకుడగు రాజు వనవిహారము బోవునటుల నుండెను. తాపసచర్య, వేషభాషణంబుల మాత్రమే గన్పట్టెగాని అభినయంబున లేదేమి యని శంకింప గారణంబగుచున్నది.”

---

**86. సూర్యనారాయణ సత్యవంతుని పాత్ర విమర్శనము :** ఈ విమర్శనము ఆంధ్ర పత్రికలో 2-8-1923 నాడు ప్రచురింపబడ్డది.

ఈవల నీనాటకములో సమవర్తియైం మెప్పించినటుల గూడ దెలియుచున్నది.

ముత్తరాజు సుబ్బారావుగారు రచించిన శ్రీకృష్ణతులాభారములో సూర్యనారాయణగారి నాట్యసిద్ధి యీ గతి వర్ణింపబడియున్నది:[87]

"కృష్ణ పాత్రమును యడవల్లి సూర్యనారాయణరావు గారు ధరించి, సర్వజగన్నాధత్వమును, బహుభార్యాప్రియత్వమును, మహామునుల యెడ భక్తియు వివరముగ జూపిరి. భగవంతునకు గల విశేషణంబులన్నియును ఆ పాత్రధారణమున వెల్లివిరిసెనని జెప్పిన నతిశయోక్తి గానేరదు."

మల్లాది అచ్యుతరామశాస్త్రిగారు[88] రచించిన ద్రౌపదీ వస్త్రాపహరణము[89]నందు యడవల్లి సూర్యనారాయణగారు దుర్యోధనవేషమును ధరింపగ జూచి యా నాటకములో వీరి సామర్థ్య వైదుష్యముల సంపూర్ణముగ ననుభవించితిని. భారతకథలో యితర కవుల నాటకములలో, అచ్యుతరామశాస్త్రి గారి మూలములో, దుర్యోధనుడు తొల్లిటి నుండియు పుట్టుక వలన దుర్గుణభూయిష్టుడై, వంశవినాశక దుర్లక్షణముల ప్రోగుగ చిత్రింపబడియుండెను. ఈతనికి పాండవులయెడ గలిగిన అసూయామాత్సర్యములు నైజముగ నెంచబడి యితర పాత్రముల సంభాషణములలో విష్కంభరూపమున వెల్లడింపబడుచుండెను. నాటకములలో ప్రధానపాత్రముల స్వభావపరిణామము గుణాభివర్ణనమువలన నిరూపింపకూడదు. కథాంశములో నేర్పడు నవస్థల ననుసరించి ప్రధాన పాత్రముల గుణపోషణ మేర్పడవలయును. ఈ విషయమును గుర్తించి సూర్యనారాయణగారు దుర్యోధనుని మానవ మసూయాతరంగముల నూగులాడెడి చందమంతయు, పార్థ ద్వేషపోషణమంతయు చూపు గద్య సంభాషణము లిఖించి నాటకములో నద్దాని

87. **శ్రీకృష్ణతులాభారము : సూర్యనారాయణగారి నాట్యసిద్ధి :** ఆంధ్రపత్రిక, ఆగస్టు 23, 1923

88. **మల్లాది అచ్యుతరామశాస్త్రి :** చూ. వివరణ 68.

89. **ద్రౌపదీ వస్త్రాపహరణము :** చూ. వివరణ 68.

నభినయించి యున్నారు. వీరి నడతలు రాజరాజునకుచితముగ నుండెను. ఎంతటి దుష్టనైజము గలవాడైనను వీని పుట్టుకకు భూతజాల మేవిధి తల్లడిల్లినను, వ్యాసుని మన్మడై, గాంధారిపుత్రుడై, బలరాముని శిష్యుడై, భారతవంశదీపనుడై గురు భీష్మాశ్వద్ధామ కృపాదుల నిత్యమర్యాదల నందుకొను రాజరాజు సామాన్యమానవుల మదాహంకారముల నెన్నడు చూపనేరడు. సూర్యనారాయణ భారతసామ్రాజ్య ధూర్వహుని రసావేశ మెట్లుండునో వాని మానసమున నసూయాబీజము లేగతి మొలకెత్తి మొగ్గదొడగునో లెస్సగ గుర్తించి యభినయించి యున్నాడు. ఈ భాగములో సూర్యనారాయణ వాచికము, అభినయము, నాట్యవైఖరి, నాగరాజరావు, గోవిందశాస్త్రి మొదలగువారి కళానైపుణ్యమును జాటుచున్నది. అసూయాజనన మందున జేర్పవలదని కొంత యాటంకము కలిగించిరట! కాని, ఆ నాటకములో మిక్కిలి రమ్యమగు పట్టు ఒకవిధమగు మూర్ఛాసమ్మోహమును కలిగించునది. దైత గోపాలము విదురుడై పాడెడి “జగదీశుమాయలు” అను కీర్తనవచ్చు భాగమైయున్నది. ఆ నాటకమునకు ప్రాణతేజం బొసంగి నాటకలక్షణ మేర్పరచినది సూర్యనారాయణగారి అసూయోదయమే. ఈ భాగము ద్రౌపదీవస్త్రాపహరణమునకు ప్రసాదింపగల రసపుష్టి నెరింగి యీ రమ్యావస్థనందున జేర్పనూహించిన నాట్యపరిజ్ఞాన మెంతయు ప్రశంసనీయమై యున్నది.

తెలుగు నాటకములు అభివృద్ధిలోనికి వచ్చుటకు నాటక సమాజములు వ్యాపారపద్ధతుల మీద నడుపింపబడవలయుననియు, పాత్రధారులకు కఠినమగు అభ్యాసశిక్ష, కావ్యసంగీత పరిచయము కలిగించవలెననియు సూర్యనారాయణగారి యభిప్రాయము. నాటకములలో కొన్ని తావులతప్ప మిగిలిన కథాంశమందు గద్యమే ప్రధానముగ నుండి గద్య మొసంగెడి యభినయావకాశములు ఎక్కువ గలుగవలెనని వీరియాదర్శము. పద్యములను చౌకబాపతు నాటకకవులవి యుపయోగించుటకు మారు ప్రాచీనమహాకవి కల్పితములైనవానిని యనవసరమైన తావుల నుపయోగించి వీలగునప్పుడెల్ల సంస్కృత శ్లోకములను తెలుగు నాటకములలో వాడి ఆ కథాంశమునకు సంబంధించిన రమ్యోత్తమసారస్వతమును ప్రేక్షకులకు అందించుటయు, జన సామాన్య మెరుంగజాలని మహాకవి కల్పనల నిరుపమమాధుర్యమును జనుల కందజేయుటయు వీరి యుద్దేశ్యమై యున్నది.

పార్శీమట్ల వెకిలిమ్రోతలు వీరి నానందింపకున్నవి. సంగీతము రసయుక్తముగ నౌచితీవిచక్షణతో, నియమసంస్కారముతో నాటకమునకు అచ్చటచ్చట మెరుపింపవలెననియు హిందూస్థానీ కర్ణాటక గానఫణుతులలో నెయ్యది ఏతావున నుపయుక్తమగునో దాని నాయెడ వాడుచు నుభయసంగీత సంప్రదాయముల కళ లొప్పించుచు రసపోషణ మమర్చవలెనని వీరి యభిప్రాయము. మొత్తముమీద సూర్యనారాయణగారు యీనాటి విమర్శకాదర్శమగు గద్యనాటకము లందభిమానము గలవారు.

సూర్యనారాయణ ఆంధ్రనాటకరంగమున నిదివరకెవ్వరు అనుభవించని గౌరవప్రభావ మొందియున్నాడు. ఒక్కొక్క విషయములో నీతని మించని వారనేకులున్నను నటరాజునకు వలయు గుణసహస్రముల మూటయై ఆత్మగౌరవమున కాలవాలమై పండితపామరుల నొక్కరీతిగ మెప్పించుచు మన్నన లందికొనుచున్నాడు. ఈతని వైభవ పురోవృద్ధి బులుసు పాపయ్యశాస్త్రిగారిది[90] వంటిది. ఈతని పరిజ్ఞానము మాడభూషి వెంకటాచారిగారిది[91] వంటిది. ఈతని దశ క్రోడి రామమూర్తిగారిది[92] వంటిది. పుట్టుక వెంటనే ధనమున్నను లేకున్నఁ, పాండిత్య మొదవినను జేకూరకున్నను, కళాప్రయోగదక్షత సిద్ధించినను లేకున్నను, సుఖమున్నను దుఃఖమేర్పడినను, జమీందారుల నిండుబింకములతో మహావిద్వాంసుల విజ్ఞానసమృద్ధితో, నటశేఖరుల కళావైదుష్యముతో, నిత్యానందమందహాసములతో జెలగుచు తా నధివసించు పరిసరంబుల నిజప్రతిభా ప్రకాశమున నెలిగించజాలెడి బలు విద్దియల పోకిరీనడతల నేర్పరి, జీవితపు

**90. బులుసు పాపయ్యశాస్త్రి :** అపరవిద్యారణ్యులుగా ప్రసిద్ధులు. ఇంగ్లీషు, తెలుగు, సంస్కృత భాషలలో గొప్ప పండితులు. అన్ని భాషల నుంచి అనువాదాలు చేశారు. జగన్నాథ పండితరాయల సంస్కృత మూలం ఆధారంగా 'భామినీ విలాస'మనే గ్రంథం అనువాదం చేశారు.

**91. మాడభూషి వెంకటాచారి :** ఆంధ్ర పండితరాయ బిరుదాంకితులు. వేదాంత దేశికులు. అసాధారణ ప్రతిభాశాలి. ఏకసంథాగ్రాహి నూజవీడు సంస్థాన ఆస్థానంలో ఉన్న విద్వత్కవి.

**92. కోడి రామమూర్తి :** వ్యాయామ, బలప్రదర్శనంలో దేశ విదేశాలలో ఖ్యాతి గడించిన వస్తాదు. అనేక అపూర్వ ప్రదర్శనల ద్వారా ఆంధ్రుల బలశక్తిని దేశానికి చాటిన వ్యక్తి.

ప్రత్యేక విలక్షణమూర్తి మన యడవల్లి సూర్యనారాయణ! ఈతని జీవితవైఖరులు మించు నరననిత్యానందజీవి మన తెలుగువారిలో నాంధ్రరత్న గోపాలకృష్ణుడొకనినే[93] స్మరియింపగలము.

## మల్లాది గోవిందశాస్త్రి[94]

శ్రీకృష్ణుడు కపటనాటక సూత్రధారి.

**"జననంబందుటలేని యీశ్వరుడు దా జన్మించుటెల్లన్ విరో**
**ధినిరాసార్థము వీతకర్ముడగు నద్దేవుండు గర్మప్రవ**
**ర్తను దౌటెల్ల జరాచరప్రకట భూతశ్రేణులన్ గర్మవ**
**ర్తనులన్ జేయదలంచి కాక, కలవే దైత్యారికిన్ గర్మముల్!"**

భూభారమడంప నుదయించిన వాసుదేవుడు తామరాకులోని జలబిందువును పోలి సంసారసాగరమున నీదుచు, లీలాశృంగారముల నారీజనంబుల దనియించుచు విరోధ మెరుగని గావరమున ధర్మవిరోధుల దండించుచు, ప్రేమలేని వలపుతో నుచితవర్తనుల నాదరించుచు మునియై, సన్యాసియై, నిస్సంగుడై, త్రికాలజ్ఞుడగు యోగీంద్రుడై, ద్వాపరాంతపు భారతచరిత్రను నడుపించు మేటినటుడై యుండెను. ఈతని ప్రవర్తనమం దౌదాసీన్యము, అన్ని రసముల బాహ్యాన్వభావములగువరచినను నిస్సంగసాక్షీభావము ప్రధానాంశములైయున్నవి. రుక్మిణీ కల్యాణసందర్భములో కృష్ణుడు వలపులప్రోగుగా కథానుకూల రసపారవశ్యమున నగుపడవచ్చును. శిశుపాల వధా కాలమున వీరరసోద్రేక మభినయించవచ్చును. నరకాసురవధలో కూడ నిట్టి వీరక్రోధములనే ప్రకటింపవచ్చును. కృష్ణలీలావిహారములందు గోపికలతో నొకక్కతె కొక్కొకవిధమగు

---

**93. 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాల కృష్ణుడు :** పండితుడు. కవి. రాజకీయ నాయకుడు. గాయకుడు. మహావక్త. ఎండింబరో విశ్వవిద్యాలయంలో ఎమ్.ఏ. చదివి అనేక పట్టణాలలో అధ్యాపక వృత్తి చేపట్టి, చివరకు గాంధీగారి సత్యాగ్రహోద్యమంలో చేరాడు. చీరాల - పేరాల సమస్య కోసం భారత ప్రభుత్వంతో పోట్లాడడానికి 'రామదండు'ను స్థాపించాడు. గొప్ప హాస్యశీలి. ఆయన చాటువులు ఈనాటికీ ప్రఖ్యాతాలు.

**94. మల్లాది గోవిందశాస్త్రి :** తొలుత గుంటూరు సెంకండు కంపెనీలోను ఆ తరువాత తెనాలి శ్రీకృష్ణ విలాససభలోను నాయక పాత్రలను ప్రతిభావంతంగా నటించారు.

శృంగార విలాసమును నేర్పుచు పలుమాటల ప్రోడయై, చేతల పోకిరియై కనుపడవచ్చును. కాని కృష్ణుడు ప్రణయశిక్ష నొసంగుటలో నిజముగ జగత్ప్రణయతత్త్వము నుపదేశించుచు మోక్షసాధన మేర్పరచుచు, వేదాంత వైరాగ్యముల నలవరచుచున్నాడేగాని భౌతిక శారీరక మోహప్రచారముల నుద్బోధించుట లేదు. కృష్ణుని శృంగారమంతయు భక్తి సూత్రము, వేదాంతతత్త్వము, కాని పూవింటివిద్దెలపాత్రక్రమములు కావు. ఇతని ప్రణయాభినయములో నెంతవరకు నంతర్గతమైన వేదాంతవైరాగ్యములు, లీలాకపటరసానుభవములు ప్రకటముగ స్ఫురించుచుండవలెను. అందుచేతనే బెంగుళూరుకంపెనీల ఉడిపీ బాలకులు, కామవికారమొందని పిన్నవాండ్రు, కృష్ణలీలలో కాపరితాపమెరుగని వలపుచేతల నభినయించు పట్టులలో కృష్ణుని నిత్యనిర్మల బాల్యోచిత లీలాశృంగారములు యథారూపముగ, సలక్షణముగ గోచరించుచున్నవి. శెట్టి లక్ష్మీనరసింహము రుక్మిణీకళ్యాణములో నభినయించెడి ముదురు వలపులు కృష్ణున కాపాదింపదగినవి కావు. కృష్ణుని ప్రణయమేవిధి వైరాగ్యసూచకమో అటులనే కృష్ణుని క్రోధవిరోధములు కూడ లోకానుగ్రహకాంక్షతో సర్వసమత్వముతో ద్వంద్వ స్వభావమెరుంగక "ఎవ్వని కరుణింప నిచ్చగింతును వాని యఖిలవిత్తంబు నేనపహరింతు" అను వాక్యమున కనుకూలముగ విరోధిపరాక్రమమం దమితవాత్సల్య మేర్పడునట్లు ప్రకటింపవలసియున్నది. కావున కృష్ణపాత్రమును యెట్టి సందర్భమున అభినయించినను కృష్ణుని నిత్యసత్త్వమును క్షణికావేశములను జూపుజంటనడత నటున కేర్పడవలెను. అందులో ముఖ్యముగ భారతకథాసందర్భమంతయు నిట్టి నిస్పృహతో, నిస్సంగతతో, సాక్షీభావముతో, సమత్వముతో, నౌదాసీన్యముతో నడుపవలసియున్నది.

మల్లాది గోవిందశాస్త్రి గుంటూరు సెకండు కంపెనీలో[95] పాండవ

---

**95. గుంటూరు సెకండు కంపెనీ :** గుంటూరులో ప్రారంభమైన మొదటి నాటక సమాజం హిందూ నాటక సమాజం. దాని తరువాత బయలుదేరింది విభుద రంజనీ శృంగార నాటక సమాజం. ప్రేక్షకులు తేలికగా మాట్లాడుకోవడానికి వీలుగా మొదటి దానిని ఫస్టు కంపెనీ అనీ, రెండవ దానిని సెకండు కంపెనీ అని పిలిచేవారు. ఇదే పద్ధతి తెనాలి, విజయవాడ నాటక సమాజలలో కూడా మొదలైంది. తుదకు సురభి నాటక సమాజాలలో కూడా ఫస్టు కంపెనీ, సెకండు కంపెనీలనే వివరణలు వచ్చాయి. గుంటూరు సెకండు కంపెనీ అధిపతి చేగు కనకరత్నంగారు.

నాటకములందు శ్రీకృష్ణవేషమును వహించుచుండును. రాయబారములో నీతని యనురూపరూపము, కృష్ణస్వభావ పరిజ్ఞానము మిక్కిలి ప్రశంసనీయముగ నుండెను. భారత యుద్ధ సమయమున కృష్ణునకెట్టి వయసుండునని మన మూహించగలమో, అట్టి తారుణ్యమొప్పెడి రూపముతో నీలమేఘశ్యామమగు సుందరాననముతో, క్షాత్రధర్మోచితమైన గాంభీర్యమును, కోమల సౌకుమార్యమును జూపునొడలితో, పద్మదళములబోలు విశాలనేత్రములతో కృష్ణుని లీలానిజసత్వములు రెంటిని ప్రకటింపగల ముఖలక్షణములతో గోవిందశాస్త్రి కృష్ణరాయబారములో సాక్షాత్తుగా శ్రీకృష్ణుడే యననోపుచుండెను. గోవిందశాస్త్రి నైజమనీషచే కృష్ణస్వభావమును, లీలామానుషవ్యవహారములను గుర్తించి కృష్ణపాత్రమభినయించెనో లేక పురాణేతిహాసపరిచయమున నట్టి యసమాననటసిద్ధి సంపాదించెనో మేమెరుగము. కాని రాయబారములో నీతని నడతలన్నియు కృష్ణుని యౌదాసీన్యమును జూపించుచు రాచకూటముల రాయబారముల జరుపు మంత్రిసత్తముల దౌత్యసామర్థ్యమంతయు జూపుచుండెను. గోవిందశాస్త్రి రూపవేషాభినయములు, పాత్రానుకూలముగ నుండుటయేగాక చతురోపాయముల వచించుపట్ల నాయాసందర్భముల కనుకూలమగు కంఠస్వరము, రాచమర్యాదలెరింగిన సంభాషణానైపుణ్యము మెరసి యాసందర్భమును నాట్యరంగమునుండి తప్పించి నిజముగా కౌరవుల నిండోలగమాయను భ్రాంతి గలిగించుచుండెను. గోవిందశాస్త్రి మంచి పాటగాడు. నవరసములను నిండుపొంకమున జూపగలసమర్థుడు. ఇతర వేషములలో నీతని రసావేశప్రవృత్తులను చూచినందుననే కృష్ణపాత్రాభినయమందలి యాత్మనిగ్రహము, కపటనట లక్షణము సంకల్పావలంబితముగనెంచి యింతతరి పొగడవలసి వచ్చినది. అపశబ్దదోషముగాని గ్రామ్యపాతిత్యముగాని పొందక గద్యపద్య సంభాషణములను నాటకవైఖరులు లేకుండ సహజ సంభాషణాక్రమమున నుచ్చరించుచుండెను. "మామా! సత్యవతీపౌత్ర! నీకొలువుకూటము క్రమముగా రణకూటమగుచున్నది. పలువురుండగనే నేను చెప్పబూనినదెద్దియో చెప్పిపోయెదను." అను వాక్యాదిగాగల పద్యోపన్యాసమును జేయునప్పుడును "జెండాపై కపిరాజు" పద్దెములో దండోపాయము సూచించునపుడును కృష్ణ

స్వభావమును చక్కగా ప్రకటించెను. మొదటి యంకములో పాండవుల రెచ్చవెట్టి భీమోరగవాలతాడనవెునర్చి పాండవుల యుద్ధసన్నద్ధుల జేసివచ్చిన సమరక్రియారంభమును భూభార నిర్వ్యాపణసంకల్పమును మరచినవానివలె నిజోద్దేశ్యములనెల్ల గప్పిపుచ్చి కేవల దౌత్యస్వభావనిస్వాతంత్ర్య మవలంబించి "తమ్మునికొడుకులు సగపాలిమ్మనిరి.... మనువుమువారిన్" అనుపద్యముతో నుపక్రమించి ధృతరాష్ట్రునివంగడమభినుతించి "కీర్తి నిల్పుకొనవయ్యా పాండురాజాగ్రజా" అనునట్టి వాక్యములతో పాండవులయెడ నౌదాసీన్యమును, కౌరవుల నుద్ధరింపవచ్చినవాని పోలికను, కులనాశ బంధునాశ విముఖతను, సంధి కుదురుటయందలి యభినివేశమును వెలిబుచ్చుచు మాయలమారిగ కృష్ణుడభినయించిన రీతియంతయూ గోవిందశాస్త్రి చక్కగ ప్రదర్శించెను. వ్యంగ్యముగ మాటలనందించుచు కౌరవసేనానివర్గములో భేదోపాయమును ప్రవర్తింపజేసినపుడు కర్ణదుర్యోధనుల కీర్ష్యజనియింపజేయు చూపులను విదురాశ్వత్థామలను గైవశము జేసికొను ప్రసన్నతను మొత్తపు కొలువుమొత్తమునకు ఉదాసీనదౌత్యమును ఒక్కమారుగ ప్రకటించు కపటనాటక సంచలనమెంతయో విచిత్రముగ నభినయించెను. ముంజులూరి కృష్ణారావు మొదటి యంకములో జూపిన పాండవపక్షపాతమును రాయబారములో సంపూర్ణముగ దాపజాలకుండెను. గోవిందశాస్త్రి యౌదాసీన్యమున వర్తించి యేమియు నెరుగనివానివలె కథాసందర్భమునుసరించి రసావేశమొందక దౌత్యన్యాయమును పరిణామనాట్యసిద్ధితో నభినయించెను. కర్ణాశ్వత్థామల వాగ్వాదముల కంతరంగమున సంతసించుచు దుర్యోధనుని దుడుకుమాటల సందున గురుపుత్రునకు సమరసంకల్ప రాహిత్య మొనర్చుటకు సంధి చెడుటకును చెప్పిన "సేవాధర్మము సూతధర్మమును రాశీభూతమై యొప్ప వాచావాత్సల్యము జూపె కర్ణుడిటు; మాత్సర్యంబు మీకేల? రాజేవేళన్ మిముపిల్చునో, అనికినాడేపొందు! . . . లేదా వర్జింపుడు, కర్ణుచావువరకే నత్యంతమౌ యుద్ధమున్" అను పద్యమును చదువునపుడు గోవిందశాస్త్రి ప్రకటించిన యభినయచాతుర్యము వర్ణనాతీతకృష్ణ సాదృశ్యము నొందియున్నది. అర్జునుడు, దుర్యోధనుడు కృష్ణసహాయమపేక్షించి వచ్చినపుడు అర్జునుని ముందుగ పలుకరించి, యావలకన్నెత్తి తలవద్దనున్న

దుర్యోధను నాదరించుపట్టున ముంజలూరి కృష్ణారావు గోవిందశాస్త్రికన్న నెక్కువచమక్‌తో నభినయించెను. కర్ణుని విడదీయనెంచు సందర్భమున "ఎల్లి సూర్యోదయంబున నేగువాడట, యిట వసించెద విదురునియింటమాపు" మొదలైన పద్యములలో కృష్ణారావు కర్ణునిదీక్షాపరత్వ మెరింగినట్లును తన కౌటిల్య మగుపడునట్లు ధూర్తసాంగత్యసూచనలందించెను. గోవిందశాస్త్రి, యీమాయను కప్పిపుచ్చి నిజముగ కర్ణునకు భారతసామ్రాజ్యపట్టాభిషేక మొనరింపదలచిన కర్ణశ్రేయోభిలాషివలె నటించెను. యుద్ధరంగములో నభిమన్యువధానంతరము అర్జునుని వందిమాగధులు "కైవారంబు చేయకున్నారిదేల చక్రధరనేడు" మొదలగు శోకపరితాప సమయమున గోవిందశాస్త్రి మేనల్లుచావునకు యోగిజనసహజమగు నౌదాసీన్యమును ఆంతర్యమున వహించియు సైంధవవధాసంకల్పమర్జునునకేర్పడు నట్టి వీర విషాదభావములను రమ్యముగ జూపించెను. గోవిందశాస్త్రి గద్యప్రవచనమందు సహజ సంభాషణక్రమ మవలంబించెనని చెప్పియుంటిని. చక్కగా పాడనేర్చినను నాటకాభినయమందు ఉచితమగునంత గానవైదుష్యమే ప్రయోగించుచు రంగప్రవర్తనమందును, సంగీతప్రయోగమందును, సహజసంభాషణరీతులందును, మైసూరు వరదాచారిని[96], జగ్గరాజును తలపుకు తెచ్చుచున్నాడు. జగ్గరాజొకనియందు దక్క అప్పటి తెలుగునటులలో గోవిందశాస్త్రి భాష యొకటే రంగోచ్చరణవికారముల నొందకుండెను. వీరేశలింగము[97] బందరు గొడుగుపేట కంపెనీలో సుందరకుని దీర్ఘ సమాస సంకీర్ణ సమరాభివర్ణనమందు నైజమగు కాకుస్వరములతో గద్యముచ్చరింపగలిగి యుండెను. కృష్ణ స్వభావాభినేతృత్వమున దైవప్రసాదితమగు రూపసాదృశ్యమునకుతోడు కృష్ణస్వభావ పరిజ్ఞానమును జతపరచి భారతసూత్రధారి నిజస్వరూపమును మాయామానుష లక్షణములను తిరుపతి వేంకటేశకవిధీరుల డెందముప్పొంగ నభినయించి మెప్పొందియున్నావాడీ గోవిందశాస్త్రి.

---

**96. మైసూరు వరదాచారి :** చూ. వివరణ 40

**97. వీరేశలింగము :** దామరాజు వీరేశలింగం. బందరు గొడుగుపేట సమాజంలోని తొలి తరం నటులలో ఒకరు. హరిశ్చంద్ర పాత్రకు ప్రసిద్ధి.

షేకు కనకరత్నముగారి సమాజములో[98] గోవిందశాస్త్రితో పాటు అనేక నటసత్తము లభినయించుచు భారతనాటకములకు వలయు పాత్రసామగ్రిని నిర్దుష్టముగ గూర్చుచుండిరి. ఇందు చిన లక్ష్మీకాంతము, గోవిందరావునాయుడు, సీతాపతి ప్రశంసింపబడియున్నారు. అభినవ కర్ణుడోయన కర్ణసాదృశ్యమొంది యభినయించిన యెనమంద్ర శీనయ్య కొక ప్రత్యేక విమర్శనాంజలి నర్పించుచున్నాను.

## యనమంద్ర శీనయ్య[99]

గుంటూరులో శీనయ్య విగ్రహసౌందర్యమును, నటసామర్థ్యమును, పాటపెంపులను, విచిత్రజీవితచరిత్రను యెరుగనివారు లేరు. శీనయ్య వస్తాదు. ఆజానుబాహుడు. చక్కని ముఖలక్షణము లొప్పువాడు. కడు విప్పగు వక్షమువాడు. మంచి మర్యాదలను, మెత్తని మనస్సును, ఉదారగాంభీర్యలక్షణములను కలవాడు. నాటకపుపోజులలో మేటి. ఈతడు కర్ణపాత్రమును నిజమగు కర్ణుడోయన రూపగాంభీర్యగుణసాదృశ్యములొంది కర్ణుని యౌదార్యము, ధైర్యసాహసములు, ఆత్మవిశ్వాసము, చెలిమిపెంపు, గొప్పతలపులు యేర్పడునట్లు అభినయించుచుండెను. అదివరకు నేను చూచిన తెలుగుకంపెనీలనేకములలో కర్ణుని వేషము నెవరో యొకరు బక్కచిక్కిన సన్యాసి వేయుచుండెను. అప్పటికి నిప్పటికి శీనయ్యను పోలు కర్ణవేషధారి యాంధ్రలోకమున లేడు. కర్ణుని యమాయకత్వము, అచ్చపు మనఃశుద్ధి, పౌరుషము వ్యవహారవశంబున సూతుడై హీనమాన్యత నొందుచుండియు నిర్మలక్షాత్రగుణ తేజంబుల రవివీర్యదీప్తులతో వెలిగ్రక్కు నుదారచేష్టాసంపత్తియు శీనయ్య చక్కగా గుర్తించి యనుకూలమగు రీతుల నభినయించుచుండెను.

---

**98. షేకు కనక రత్నంగారి కంపెనీ :** గుంటూరు సెకండు కంపెనీ. దీని అధిపతి 'షేక్' (చేగు) కనకరత్నంగారు.

**99. యనమంద్ర శీనయ్య :** గుంటూరు సెకండు కంపెనీలో ప్రముఖ నటుడు. కర్ణుని పాత్రకు ప్రసిద్ధి. నలవేషంలో కూడా ప్రతిభ కనపరచిన నటుడు.

శీనయ్య నలవేషమును వేయ జూచితిని. అందునకూడ నీతని రూపలావణ్యములు, తెలివితేటలు, వందనీయములై యుండెను. ఈతని యకాలమరణమున నాంధ్రనాటకరంగమునకు మితిలేని లోపమేర్పడినది.

## నటలోక సంచారము

ఆంధ్రనాటక పరిషత్తువారి పోటీపరీక్షల[100] నాటకప్రదర్శనములలో ననేకనటుల పరిచయమేర్పడినది.

అంకరాజు రామారావు[101] చిత్రనళీయములో నల వేషమభినయించి కొన్ని క్రొత్తవైఖరుల జూపియున్నాడు. దమయంతిని విడిచిపోవునపుడీతడు పక్షులను పట్టుకొనుటకు తన మీది వస్త్రమును వేయుటయు, నది పోయినందున దమయంతి తొడవును కొంత జీల్చికొనిపోవుటయు, కొంత వింతగా జెప్పుకొనబడెను. రామారావు నోటి పళ్లెత్తుగ నుండుటచే, నేరసమభినయించినను నవ్వినట్లుగా దోచుచుండెను.

ఆ సందర్భమున, అంతకుముందు, తరువాత ముప్పిడి జగ్గరాజు స్త్రీవేషమును చూచితిని. జగ్గరాజు పారేపల్లి సుబ్బారావంత చక్కనివాడు కాడు. చెన్నపురి సుగుణవిలాససభలోని స్త్రీ వేషధారుల సౌకుమార్య మీతనికి లేదు. కాని పలుచని పద్మినీజాతికోమలిరూపమున రంగస్థలము నింపగల రూపసి యనుటకు సందేహము లేదు. ఇప్పటి మనవైపు స్త్రీ వేషధారులలో స్థానం నరసింహారావే[102] చక్కదనములకుప్పయని చెప్పవచ్చును. జగ్గరాజునకు సంగీత మెంతవచ్చునో తెలియదు కాని రానిలోపము కనుపడనట్టి మృదుసారళ్యముతో నాటకాభినయమున కుచితమగునంతటి సంగీతమును వాడి సభ్యుల

---

**100. ఆంధ్ర నాటక పరిషత్తు :** చూ. వివరణ 1.

**101. అంకరాజు రామారావు :** 'రాజమండ్రి అమెచూర్స్' సమాజంలో శ్రీపాద కామేశ్వరరావుగారి నేతృత్వంలో ప్రధాన భూమికలు ధరించారు. నలవేష ధారణకు ప్రసిద్ధి.

**102. స్థానం నరసింహారావు :** ఆంధ్రదేశం గర్వించదగినంత పేరు ప్రఖ్యాతులు సంపాదించిన స్త్రీ వేషధారి. తొలుత బాపట్లలోను ఆ తరువాత తెనాలి శ్రీకృష్ణ విలాససభలోను తుదకు తెనాలి రామ విలాససభలోను ఎన్నో వైవిధ్యభరితమైన పాత్రలలో రాణించారు. మధురవాణి, శకుంతల, రోషనారా వంటి పాత్రలకు ప్రాణం పోసిన నటుడు. 'పద్మశ్రీ' బిరుదాంకితుడు.

నానందింపజేయుచుండును. నటుల బరాటాలతో నిరంతర గానఘోషముతో హార్మనీ తపలాల మ్రోత విసుగుతో చెవి తుప్పురాలుచుండిన నవీన నాటకాభినయ పద్ధతులలో, జగ్గరాజు మృదుసంగీత ప్రయోగ మార్గములు చల్లని మలయమారుతమువలె సుఖావహములై యున్నవి. జగ్గరాజు సాధువనితల సద్వర్తనములను, మహాపతివ్రతల చర్యలను, ఉత్తమ నారీగుణంబులను, వానిలో వివిధ రసములొందు రూపమర్యాదలను చక్కగ గుర్తించియున్నాడు. స్త్రీ స్వభావసాదృశ్యము సంజీవరావుతో సమముగ నొప్పుచు, అంతకన్న సుకుమారముగ నగుపడుచుండును. జగ్గరాజు అభినయమందు ఉత్తమ పతివ్రతాలక్షణములేర్పడి, సుకుమార రసభావమర్యాదలతో అగుపడుటయేకాక, భావములన్నియు ముఖముద్రలందు చిత్రితమై యగుపడును.

నెల్లూరులో కందాడై శ్రీనివాసయ్యంగారి[103]-పేరు దుష్యంత పాత్రాభినయమునకు ప్రసిద్ధమై యుండెను. కాని వీరి దుష్యంత వేషము నిప్పటికి నేను చూడగల భాగ్యమేర్పడలేదు. ఈమధ్య బందరుకు వచ్చినపుడు తానీషా వేష మభినయింపజూచితిని. శ్రీనివాసంగారికి వెంకటరాయశాస్త్రిగారిపై గల గౌరవాభిమానములు వారి భాషోచ్చరణమందు దీపించుచున్నవి.

రాయప్రోలు సుబ్రహ్మణ్యం[104] హిరణ్యకశిపుని వేషమభినయింప జూచితిని. ఈయన ఆ పాత్రమును పూర్వమర్యాదలతో నభినయించెను, కాని

---

**103. కందాడై శ్రీనివాసయ్యగారు :** దొరస్వామి అనే పేరుతో కూడా పిలవబడిన కందాడై శ్రీనివాసన్ విద్యార్థి దశనుంచే వేదం వెంకట రాయశాస్త్రిగారి ఆధ్వర్యంలో నాటకాలు వేయడం ప్రారంభించారు. వేదంవారు నెల్లూరులో ప్రారంభించిన ఆంధ్రభాషాభిమాని సమాజంలో ఎన్నో నాటకాలలో ప్రధాన భూమికలు ధరించారు. తరువాతి రోజుల్లో నెల్లూరు సుగుణ విలాససభ అనే పేరుతో నాటక సమాజాన్ని నడిపారు. సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషలలో నిష్ణాతుడు. చివరి రోజుల్లో స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకుపోయి ఆరోగ్యం చెడిపోవడం వల్ల ఆ తరువాత కొద్దిరోజులకు మరణించారు. యుగంధరుడు, దుష్యంతుడు, వెంగళరాయుడు, శ్రీనివాసుడు పాత్రలలో రాణించారు.

**104. రాయప్రోలు సుబ్రహ్మణ్యం :** మొదట నెల్లూరు ఆంధ్రసభలో వేషాలు వేసేవారు. కొన్నాళ్లు బాళ్లారిలో సరస వినోదినీ సభలో నటనలో మెళుకువలు నేర్చుకొని తరువాత చిత్తూరు రామ విలాససభకు కండక్టరుగా ఉండి ఎన్నో నాటకాలలో ప్రధాన భూమికలు ధరించారు.

నాగరాజరావగుపరచిన నవీన భావసమ్మత వ్యాఖ్యాన వైఖరుల విస్తరించి యుండలేదు. రామకృష్ణయ్య[105] నారదుడు, భరతుడు వేషముల దాల్చజూచితిని. ఈతని గాత్రము, నారదస్వభావ నిరూపణము, ప్రశంసనీయములే. "తలపరెజనులు హిరణ్యకశిపుని దైవముగాగ" అని యమరారి నుతించుచు వెంటనే "గోవింద దామోదరా" అనుపట్టు నందుకొనుటలో బళ్లారి సరసవినోదినీ[106] సభలలోని నారదునకు తుల్యముగ వ్యవహరించెను. బందరు బాలభారతపు బాలకవి[107] తన వేషమును దూదేకుల సాహెబువలె నసహ్యముగ నమర్చని యెడల, గానమందు రామకృష్ణయ్యతో దులదూగునని చెప్పవచ్చును. కాని రామకృష్ణయ్య తెలివితేటలు, చకచక, బాలకవియందగుపడవు. నెల్లూరు స్త్రీ వేషములలో శ్రీనివాసాచారి ప్రస్తుతము మిన్నయై యున్నాడు. ఇతని నాటకసంగీతము పాటకచ్చేరీల గాత్రవిస్తారమున దాక్షిణాత్యరంగ మర్యాదల కనుకూలముగ విప్పొందుచున్నను నిజతత్వమున మిక్కిలి హాయినిచ్చుచు సహ్యముగను సుఖావహముగను ఉన్నది. శ్రీనివాసాచారి రూపాభినయముల విమర్శింప నవసరము లేదు. ప్రస్తుతము చెన్నపురీ సుగుణవిలాససభలో స్త్రీ వేషమును దాల్చుచు, నీమధ్య బందరుకువచ్చిన రామచంద్రయ్య[108] విగ్రహ సౌందర్యమునకును, స్మేరసుమాలంకృత కోమలాననమునకును, బాలికాచేష్టలకును ప్రకృతాంధ్రనటులలో నెంచదగినవాడు. ఇతనికి సంగీత మెక్కువరాదుగాని, మాటలలో నొకింత ముద్దపలుకు అడ్డగించునుగాని తనకున్న సంగీతమును సరసముగ ముద్దులొలికెడి నగుమోముతో గూర్చి జూపరుల మెప్పించుచుండును.

---

**105. రామకృష్ణయ్య :** నేలనూతల రామకృష్ణయ్య. నెల్లూరు ఆంధ్రసభలో ప్రధానపాత్రధారి. నారదుడు, భరతుడు పాత్రలకు ప్రసిద్ధి.

**106. బళ్లారి సరసవినోదినీ సభలోని నారదుడు :** బళ్లారి సరసవినోదిని సభలో నారదుడి వేషానికి ప్రసిద్ధికెక్కిన నటుడు గిరి ఆచార్యులు. గొప్పగాత్రమని ప్రసిద్ధి.

**107. బాల భారతపు బాలకవి :** బందరు బాలభారత సమాజంలో నారద పాత్రకు ప్రసిద్ధికెక్కిన బాలకవి బిరుదాంకితుడైన పంచాంగం రామానుజాచార్యులు.

**108. రామచంద్రయ్య :** జి.రామచంద్రయ్య. నెల్లూరు సుగుణ విలాససభ సభ్యుడు. ఆషాబి పాత్రకు ప్రసిద్ధి.

## గోవిందరాజుల సుబ్బారావుగారు[109]

బందరులో ముత్తరాజు సుబ్బరాయ నాటకసమాజము వారు ఆడించిన పాదుకాపట్టాభిషేకములో సుబ్బారావుగారు లక్ష్మణభూమికను ధరించిరి. లక్ష్మణుడు కొంత తొందర స్వభావముగల యుదారపురుషుడు. అన్నకును తండ్రికిని యనువర్తుడై సంచరించువాడు. ఈతడొకతావున కొంత కోపోద్దీపనము వెలువరించినను స్వభావము కథాక్రమములో మారదు. కావున నిందు సుబ్బారావుగారి యభినయచాతుర్యము విశేషముగ నగుపడలేదు. రాము డడవుల కేగ సమ్మతించినపుడు అగ్రజుని యాజ్ఞానిబద్ధవైరినిర్మథనపారంగతుడగు భీమసేనునిపగిది లోని యూహల దిగమ్రింగుచు కోపకంపితుడై మిన్నకుండిన రసావస్థనొక్కటిమాత్రము సుబ్బారావుగారి యభినయ కౌశలమున కెడమిచ్చినది.

వీరు అభినవయుగంధరులను పేరు వడసియున్నారు. యుగంధరుడు తెలుగునాటకములలో మిక్కిలి చాతుర్యమున గల్పింపబడిన విపరీత పాత్రము. అన్నకు తీసిపోని జనార్దనమంత్రి యుగంధరుడాడవలసిన కథాంశమును ముందుగా నేర్పరచి విద్యానాథుని సాహాయ్యమున ముద్దుటుంగరము దెప్పించి పేరిగానిని కాకతీయ సామ్రాజ్య పీఠముపై నిలపి ప్రజలకు రాజు తమలో నుండిన ధైర్యమును గల్పించుచుండెను. యుగంధరుడు రామేశ్వరయాత్ర ముగించివచ్చి జరిగినయుదంత మెరింగి "నేను లేనప్పుడుగదా వీరు పట్టినారు? నేనెట్లు లేకపోదునో చూతునుగాక" అను సందర్భమున సుబ్బారావుగారి యభినయ వైఖరిలో కొండంతయూహలు, వింధ్యాచల స్థైర్యము, వలయుచో గరవాలమాడించి మ్లేచ్ఛుల రూపుమాపు రణోత్సాహము, మాయోపాయమున రాజును దేవలయు సమయజ్ఞత అన్నియు మూర్తీభవించియున్నవి. పిచ్చివాని వేసములో ఢిల్లీ పాదుషానెచ్చలియై చెఱనున్న కాకతీయవిభుని జూడ యత్నించుటయు రత్నపరీక్షార్థము రాజును ఓడమీదికి దెచ్చుటయు యుగంధరుని బుద్ధి వైభవముల

**109. గోవిందరాజుల సుబ్బారావు :** ప్రఖ్యాత రంగస్థల, సినిమా నటుడు. గొప్ప కారెక్టర్ యాక్టర్. తెనాలి రామ విలాససభవారి నాటకాలలో ముఖ్యపాత్ర ధారులలో ఒకరు. కన్యాశుల్కంలో గిరీశం, ప్రతాపరుద్రీయంలో యుగంధరుడు- పిచ్చివాడు పాత్రలను ధరించడంలో పేరు పొందారు.

నేర్పరచు తంత్రరాజమై యున్నది. ఢిల్లీ వీధులలో పిచ్చివానివలె నపస్మారచిహ్నంబు లొలికించుచు సంచరించెడి వైఖరి సుబ్బారావుగారు నిరుపమ పాత్ర సారూప్యమును ప్రకటించియున్నారు.

ఆంధ్ర నాటకరంగము సత్వరముగ వృత్తిలక్షణముల వీడి భావాభినయమునకును, రసోపన్యాసమునకును, కుదురగుచున్నది. డబ్బు పెంపున నేర్పడు అవకాశములు చిక్కకున్నను నాట్యకళాప్రపంచమునందు ఆంధ్రులు అనుదినము ముందడుగు వేయుచున్నారనుటకు సుబ్బారావు వంటి నటులే నిదర్శనము.

ప్రతాపరుద్రీయ సందర్భములో బందరు దేశీయ నాటకసమాజములోని వెంపటి వెంకటేశ్వరులగారిని[110] ప్రశంసింపవలసియున్నది. వీరు విద్యానాథపాత్రమును గైకొని గోదావరిలో మొసలికాటుకు వెరగంది భీతిమైనల్లాడు పేదబాపనిచంద మభినయించినరీతి మిక్కిలి స్వభావసిద్ధముగ నుండెను. వెంకటేశ్వరులుగారు చిత్రనళీయపరీక్షలో నల పాత్రమున కొసంగిన స్వర్ణపతకము సంపాదించిరి. పరీక్షలలో కృతార్థులగుటకు అన్ని లక్షణములు కొంచెముగా నొప్పుచు దోషములు లేకుండ పరీక్షనిచ్చినవారికి జయమొప్పునను సూత్రము వీరి విజయమందు నిదర్శింపబడినది. సంగీతము కొంత శాస్త్రకట్టుగా తెలియును. కాని యెక్కువ రసోద్రేకముదయింపజేయు గాత్రవైఖరి వీరికమరలేదు. రాజగాంభీర్యమొప్పెడి దేహమున్నదిగాని, సౌందర్యసూచనలందు కొంచెము కొఱఅయియున్నది. శ్రద్ధగా తెలుసుకొనిన అర్థజ్ఞానమున్నది. కాని, నాటకసంప్రదాయ మనుభవించెడి పాండిత్యమొప్పదు. అభినయపు టూహలున్నవి కాని వాని ముద్రించు నేర్పు చాలదు. కాని వెంకటేశ్వర్లు తన శక్తియుక్తులను చక్కగ గుర్తించి తనకున్న సాధనములో నెట్టి పోకడలందికొనగలడో వానినే చూపదలచెడివివేక మొప్పియున్నాడు. అందరాని దారుల కెగయజూడడు. ఈ వివేకముతో గుంభనగ నాడి నలపరీక్షలో కృతార్థుడయ్యెను.

---

**110. వెంపటి వెంకటేశ్వర్లు :** నేషనల్ థియేటర్ అని పేరు కలిగిన బుట్టయ్యపేట కంపెనీలో ఈవెన లక్ష్మణస్వామి గారికి శిష్యుడై ఆయన తరువాత ఆయన ధరించిన పాత్రలను అంతే ప్రతిభావంతంగా నటించిన నటుడు. నలుడు, దుర్గాదాస్, ఘమేర్‌సింగ్, విద్యానాధుని పాత్రలలో విశేషంగా రాణించారు.

ఈ వివేకము మరియొక తావున నిపుణతతో చూపజూచెడి యవకాశము నాకేర్పడినది. లక్ష్మణస్వామిగారి నిర్యాణానంతరము దేశీయ నాటకసమాజము వారు "నారాయణరావు వధ" నొకసారి ప్రదర్శించిరి. అందులో షుమేరుసింగు భూమిక ధరించిన వెంకటేశ్వరులు యొజ్జపేరును జంపివైచునని యెల్లరు దిగులొందుచుండ, తానభినయింపగలిగిన పట్టుల నుంచి మిగిలినవాని తుడచివైచి, యెంతో రసవంతముగ, గుంభనగ, నిర్వహించి నాటకము వెల్తిలేకుండ గాపాడెను. జీవితములోగాని, పరీక్షలోగాని చేసినతప్పుకన్న చేయనితప్పు తక్కువ హాని కలిగించును.

తెనాలి రామవిలాససభవారి రోషనార ప్రదర్శనములో మాధవపెద్ది వెంకటరామయ్యగారి[111] శివాజీ పాత్ర నిర్వహణ మవలోకించియున్నాము. రవివర్మ చిత్రించిన శివాజీ రూపము వీరి ముఖమందు సర్వాంగవిస్ఫూర్తితో విలసిల్లుచుండెను. శివాజీయొక్క ధీరోదారగుణములను పవిత్రస్వాంతమును వీరు నేర్పువైౖ చిత్రించి చూపిరి. రోషనార సమరాంగణంబున వ్రాలి యసువులనూదునపుడు శివాజీ ప్రకటించిన క్షణిక ప్రేమావేశము ధీరలక్షణముల నిగ్గులీను ముఖగాంభీర్యము చాటున నొక తెరవలె నెంతయో నేర్పొప్ప బ్రకటించిరి.

ఊరికొక నాటకసమాజము వెలసియున్న ఈకాలములో బరంపురము మొదలు చిత్తూరు బళ్ళారి వరకునుగల తెలుగుదేశములో ననేక నటశేఖరులు కళాసంచారధీరులై ఆయాప్రాంతముల నటరాజులై యుండుట సహజమే. మేము చూచిన నటులలో ప్రసిద్ధులగువాని నాటకాభినయచాతుర్య మీదళములో విమర్శించియున్నాము. మేము పేర్కొనని నటులు కీర్తిదూరులన నూహించలేదు. ఎందరో మేమెరుగని, విమర్శింపని, చూచియు కాలప్రచారమున మరచి విమర్శింపనలవికాని నటసత్తము లుండవచ్చును. నావలెనే నాటకాభిలాషులగు విమర్శకులు మరికొందరిట్టి నటవిమర్శనమున కియ్యకొని ఆంధ్రదేశపు నాట్యకళావైభవము నెల్లర కెరింగించెదరని కోరుచున్నాను. మనవైపుల అద్దంకి

---

**111. మాధవపెద్ది వెంకటరామయ్య :** వేసిన ప్రతిపాత్రకు ఉదాత్తను చేకూర్చిన నటుడు. తెనాలి రామ విలాససభలో దుర్యోధన, శివాజీ పాత్రలను ఉత్తమంగా నటించేవారు.

శ్రీరామమూర్తి, మద్దాలి శేషగిరిరావు[112], మున్నగు నటులు ప్రశంసింప బడుచున్నారు. కాని వారి ప్రదర్శనముల జూచిన జ్ఞాపక మేర్పడకుండుటచే సాధికారముగ విమర్శింపజాలకుంటిని. విశాఖపట్టణములో, శెట్టి లక్ష్మి నరసింహము ఆ ప్రాంతములనే వెదురుమూడి శేషగిరిరావు[113] మొదలగు నటులు పాత్రాభినయ మొనర్చి, యాంధ్రనాటకముల కావంత పరపతి నేర్పరచియున్నారు.

నటులవిఖ్యాతి కవులయొక్కయు, చిత్రకారులయొక్కయు శాశ్వత లక్షణము నొప్పునది కాదు. నాట్యకళాసిద్ధి దేహసౌందర్యపాటవములను, గాత్ర మాధుర్యమును, జ్ఞాపకశక్తిని అనుసరించియుండి చిరకాలము నిలుపనేరదు. కావున నాంధ్రనాటకాభిమానులు తమ ప్రసిద్ధనటుల భావాభినయములను, బయస్కోపు గ్రామఫోను రికార్డులలో స్థిరపరచి నిలుపుకొనుట అనుసరణీయాంశమై యున్నది.

## తాటిపత్రి రాఘవాచారిగారు[114]

రాఘవాచారిగారు తెలుగుదేశమునకు రూపకభిక్షమిడిన ధర్మవరం కృష్ణమాచార్యులవారి మేనల్లుడు. బి.యె.బి.యల్. పరీక్షలనిచ్చి స్వతంత్రముగ జీవించుచు సుమారిరువది యేండ్లనుండి యాంధ్రనాటక రంగమున గృషి యొనర్చిన మేటినటుడు. ఆగర్భశ్రీయుతుని యుదారశాంతవృత్తులు, చల్లని వినయ వివేకములు, దంభమెరుగని సరసము, చక్కనిదనుట కన్న సద్గుణాలయమనియు తేజోనిలయమనియు జెప్పదగిన ముఖసీమ నెల్లవేళల నలంకరింపు చుండును. వీరి బ్రహ్మవర్చస్సును గూర్చియు శాంతసౌందర్యమును గూర్చియు పలుమారు

**112. మద్దాలి శేషగిరిరావు :** రాజమండ్రికి చెందిన శేషగిరిరావుగారు మైలవరం బాలభారతి సమాజంలో ముఖ్యపాత్రలను సమర్థవంతంగా నిర్వహించారు.

**113. వెదురుమూడి శేషగిరిరావు :** కాకినాడ హిందూనాటక సమాజంలో నటజీవితాన్ని ప్రారంభించిన ఈయన కేవలం నటుడే కాదు. హిందీ, తెలుగు భాషలలో పండితుడు; రచయిత. ఆ రెండు భాషలలోను నాటకాలు రాశారు. ఆ తరువాత ఆంధ్రదేశంలోని పలు నాటక సమాజాలలో ప్రముఖ భూమికలు ధరించి రాణించారు.

**114. తాటిపత్రి రాఘవాచారి :** చూ. వివరణ 33.

ముచ్చటించియున్నాను. స్వరూపాంగములు పెద్ద వేషములకుచితముగ నుండి నాగరాజరావు, సూర్యనారాయణ, ప్రసాదరావు, నాగేశ్వరరావుల సుకుమార చక్కదనము లేకపోయినను లక్ష్మణస్వామిగారి గాంభీర్య సౌందర్య మొప్పుచుండును. నిగ్రహము స్వాతంత్ర్యము లోతుతలపుల మేటితెలివి వీరి విశాల నేత్రావలోకనములలో మెఱయుచుండును.

వీరు పెద్దచదువుల యవకాశములన్నియు గలిగి దేశసంచారమునను సత్సాంగత్యమునను పలుపోకడల వన్నెలెరిగి నాటకముల లక్ష్యలక్షణ పరిజ్ఞానమెల్ల సవిమర్శగ గుర్తించినవారు. షేక్స్పియరు నాటకములలో హామ్లెటు పాత్రమును, ఆటిలో మున్నగు నితర విషాదవేషములను, అయాగో[115] కౌటిల్యమును నేర్పుమై నభినయించినవారు. హామ్లెటు భూమిక ధరించినపుడు సర్ హెన్రీ ఇర్వింగు వేసిన రూపము కాలిన్సు సచిత్రసంపుటములో నున్న దానివలె నుండనోపునని వీరి ముఖకవళికయందగుపడుచున్నది. తెలుగులో వీరు సుప్రసిద్ధముగ పటాను, బాహుక, దశరథ, దుష్టబుద్ధి, శివాజీ, రామదాసు మున్నగు వేషములు ధరించి వానిని గూర్చి విపులమగు నభినయ వ్యాఖ్యానముల జేసియున్నారు. తెలుగు దేశములో నచ్చటచ్చట విద్యాధికులు నటవర్గమున జేరి, తమ సంస్కార సంపత్తిచేత యభినయాంశముల వృద్ధిపరచయత్నించుచున్నారు. ఇట్టివారిలో కొందఱకు లక్షణ పరిజ్ఞానమున్నను, ప్రయోగ వైదుష్య మలవడకపోవచ్చును. బందరు చిత్రకళాభివర్ధనిలో యభినయించుచుండిన హరినాగభూషణముగారి[116] కేర్పడిన యవకాశములు మరేరికిని లేవు. సంగీతమున మేటి, వేల్పువిద్దెల తెర వెరింగినవాడు. తెలుగున కైతలల్లెడివాడు. ఆంగ్ల సంస్కార మేర్పడినవాడు. కాని నాటకాభినయములో వీరి సంపదలన్నియు తోడురాకుండెను. రాఘవాచారి నాటకమునకు వలయు సంగీతమును శ్రావ్యమాధుర్యముగ గాకపోయినను

---

**115. ఆటిలో, అయాగో :** షేక్స్పియర్ రాసిన ఒథెల్లో నాటకంలో ప్రధాన పాత్రలు. ఆటిలో: ఒథెల్లో; అయాగో : ఇయాగో

**116. హరి నాగభూషణము :** బందరకు చెందిన ప్రముఖ గాయకుడు, వయొలిన్ వాదనలో నిష్ణాతులు. తొలి రోజుల్లో బాలభారత సమాజంలో పాత్రధారణ చేశారు కాని అంతగా రాణించలేకపోయారు.

సరసముగను, అర్థవాహకముగను, తప్పులేకుండను పాడగలవాడు. మనదేశపు విద్వన్నటులలో నింతకాలము పరిశ్రమజేసి, పాత్ర స్వభావము నూహించి, యభినయింప యత్నించిన సిద్ధనటులెందరో లేరు. రాఘవాచారికి సహజమగు నటప్రతిభ కలదనుమాట చెప్పకనే తెలియుచుండును. కాని వీరి పాత్ర స్వభావాభినయరీతులు జనసామాన్యమున కొందఱకు రుచింపకపోవచ్చును. నటునందు ప్రజలపేక్షించెడి గుణములు కొన్ని వీరియందమరకుండవచ్చును. కాని ఆంధ్ర నటవర్గములో మొదటితరగతిన జేర్పదగిన ప్రయోగసిద్ధియు ఆంధ్ర రంగోద్ధారకులలో నగ్రస్థానమీయదగిన కళాపరిజ్ఞానము వీరియందగుపడుచున్నవి. రామలింగరెడ్డి, ముట్నూరి కృష్ణారావు, కామేశ్వరరావు, శ్రీనివాసరావు, సూరిశాస్త్రి మున్నగువారు నాటకాభినయముల గూర్చియు గాథాకల్పనము గూర్చియు వెలుగింపు విమర్శన లీయగలరేగాని నాటకముల వ్రాసినవారు కారు, ఆడినవారు కారు. మనదేశములో ప్రాకృత జనవర్గమే విశేషముగ నాటకకళను పోషించు చున్నది. నాటకముల జూడవచ్చెడి విద్యాధికులలో కూడ నెక్కువమంది "బాగుంది–బాగాలేదు" మాటలకే, ముఖదృష్టి విమర్శనకే యధికారులు కాని లోతుగ కథాసంప్రదాయమును లౌకికానుభవమును మానసవ్యాపారరీతులను గుర్తెరిగి విమర్శించువారరుదు. సహజ ప్రతిభచే కొన్నిపట్టుల నతిమనోహరముగ నభినయింపగల నటసిద్ధులనేకులు ఎవ్విధమైన లక్షణ పరిజ్ఞానమొనగూడని వారలున్నారు. వీరి నాట్యవైఖరులొకప్పుడుచితములైనను బలుతావుల నవివేక దూషితములైయుండును. సరసమగు నాటకముల వ్రాయగలవారున్నారు. కాని ప్రయోగానుకూల్యత నెరింగి వ్రాయువారరుదు. గాథాలక్షణమును ప్రయోగోపయోగ్యతను పాత్ర స్వభావమును లౌకిక సందర్భరీతులను మానస సంచారపద్ధతులను లెస్సగ గుర్తెరిగి పనివడి విమర్శించి లోతుగ భావించి పాత్ర స్వరూపమును నాటకగాథను ఉచితరీతుల నభినయింప యత్నించెడి నటులెందరో దేశమునలేరు. అట్టివారిలో మొదటితరగతిలో జేర్పదగు సర్వాంగసౌలభ్యమొప్పెడి నటరాజు మన బళ్లారి రాఘవాచారి. నాటక లక్షణమెరుగని నటులకన్న విద్వన్నటు లెక్కువ గారవింపదగియుందురు. విద్వన్నటులలో నద్వితీయుడను బిరుదమున కీతడర్హుడగును.

స్వరూప సౌష్ఠవము, నాటక కళాపరిజ్ఞానము, చిరాభ్యాసము, ఆరని నాట్యానురక్తి, అభినయమందు నిసర్గ పాండిత్యము, నాటకాదర్శముల నూహించి స్వతంత్రించి దారిత్రొక్కెడి భావస్వతంత్రత – ఈ గుణములే చాలును రాఘవాచారికి తెలుగుదేశపు నటశేఖరులలో సర్వాంగ సౌలభ్యపరిగణనమున నగ్రస్థానమిచ్చుటకు. కాని వీనిలో నేగుణముకన్నను, అన్నిటి సమష్టిపుష్టికన్నను మిక్కిలి గారవింపదగిన రసోపాసన వీరియందున్నది. తెలుగుదేశమున బలువిషయములలో బలువన్నెల సిద్ధినొందిన నటరాజులెందరో కలరు; కాని రసోపాసన మొనర్చినవారు నేనెరిగినంతలో ఈవెన లక్ష్మణస్వామిగారొకరు – బళ్లారి రాఘవాచారి యొకడు. పాత్ర స్వభావమును గుర్తెరిగి గాథాసంప్రదాయ మారసి వివేకముతో నభినయించెడి నాగరాజరావు, లక్ష్మీకాంతము, గోవిందశాస్త్రి మొదలగువారిని రసోపాసకు లననేరము. ఉపాసకునకు ఉపాసితాంశమే మార్గదర్శకమై దానియందసమాన సంచార నైపుణ్య మేర్పడియుండును. లక్ష్మణస్వామి యుదారవీరగుణాభినయ మొనర్చుపట్టుల జూచినవారాతని దేశభక్తునిగ బరిగణింతురు కాని, వీరరసాభినేతయని యెంచరు. లక్ష్మణస్వామి దేశాభిమానము, ఉదారవీర రసోపాసనము ముందుగా నేర్పడి వీని విశుద్ధభావసంపోషణముచే ఆ రసముల యభినయమసమాన చిత్రసిద్ధి నొందినది. ఇటులనే రాఘవాచారి మంచి భక్తుడు. శాంతస్వభావుడు. నిత్యోపాసకుడు, యుదారగుణ సంపన్నుడు. లలితమర్యాద లెరింగినవాడు. శాంతభక్తిరసముల నిత్యోపాసి. అందుచే నిట్టి రసములరుదెంచు పట్టున నిరుపమానముగ పాత్ర సారూప్యమొందిన నటునివలెగాక పాత్రమే యనబరగి యభినయించును. కబీరువలె, రామదాసువలె, శివాజీవలె, సుమేర్సింగువలె నభినయించుట ఒక తెలివియే. ఇట్టి సాదృశ్య ఫలప్రాప్తి నటుని యభినయకౌశలమును తెలుపవచ్చును. కాని కబీరే, రామాదాసే వచ్చి తన జీవితాంశములను మరల మనయెదుట వెళ్ళబుచ్చినచో నెట్టి నిరుపమరససిద్ధి కలుగగలదో, అదియే లక్ష్మణస్వామి వీరరసాభినయమందును, రాఘవాచారి భక్తిస్వభావ వ్యాఖ్యానములందును గోచరించును. ఉపాసకుని యుపాసిత సస్వరూప ప్రాచుర్య మద్వితీయప్రతిభావిరాజితమై యొప్పుచుండెను. కాని ఇదియే నటస్వభావమగు నవరస నిర్వహణ మడ్డగించుచుండును. మానవుల కేమంచి గుణములుండునో, యేశక్తులేర్పడునో, అవియే వానిచెరుపునకును, లోపములకును

హేతువులగుచున్నవి. గర్వరాహిత్యము, ఔదార్యము, ఆదరణీయసద్గుణములై యొప్పువాడాగుణములవలననే లాఘవ మనుభవించుచున్నాడు. పట్టుదల, అహంకారము, విజయసాధనలై యుపకరించెడివాడాగుణముల వికార పరిణామముననే భీకరానభిగమ్యుడగుచున్నాడు. లక్ష్మణస్వామి, రాఘవాచార్యులు ఉపాసకబలముచే నుపాసిత రసాభినయమందద్వితీయులై రసోపాసకులు గావుననే నాట్యపద్ధతుల పూత మెఱపులలో కొంత జంకుచున్నారని చెప్పవచ్చును.

రాఘవాచారియభిప్రాయములో నటసిద్ధి పాత్రసారూప్యతను పొందుటవలన నేర్పడదు. పాత్రవే కావలెను. అనగా సంపూర్ణ తన్మయత్వమునొందవలయును. నాటకములో జీవితాంశములన్నియు "కొండ యద్దమందు కొంచమై" దోచినట్లు కాలనియమమున క్లుప్తముగ చిక్కగ గూర్పబడియున్నవనియు నటుడు నాటక ప్రయోగ కాలము 3 గంటలుగాక తన యావజ్జీవ పరిణామమున నూహించియు రంగస్థలమును రంగస్థలముగగాక తా సంచరించిన విశాలప్రపంచముగ భావించియు పాత్ర జీవించిన జీవితమునెల్ల ననుభవించుచు, రస సమాధినొంది, యభినయింపవలెనని రాఘవాచారి యభిప్రాయపడుచున్నాడు. ఇందులో లక్ష్మణస్వామి వీరితో నేకీభవించును. మనలో నటసిద్ధులగువారు, పనివడి విమర్శించి యభినయించువారు పాత్రము యొక్క రూపము, వయస్సు, భాషాచేష్టలు మొదలగువానితో సంపూర్ణ సాదృశ్యమొంది యభినయించవలెనని యూహించుచున్నారు. వీరి యభినయరీతి, భూమికాధారణము పాశ్చాత్యచిత్రకారుల యథారూపచిత్ర లక్షణములతో వెలుగుచుండును. అనగా శారీరక మానసిక లక్షణములను సవిస్తరముగ సూక్ష్మముగ ఔచితీస్ఖాలిత్యమొదవకుండ యథార్థముగ నభినయించుటయే వీరి యాదర్శము. నాగరాజరావు, లక్ష్మీకాంతము మొదలగువారు ఆంధ్రనటులలో యథారూప (Realistic), భావప్రకాశక (Impressionist) చిత్రకారులని చెప్పవచ్చును. రాఘవాచారి రంగోపయోగమునకీసాధన మంగీకరించియు నటుడు సంపూర్ణముగ పాత్ర సారూప్యత నొందనవసరములేదనియు పాత్రజీవితాంశముల అనుభవములో రససమాధినొంది తన యభిప్రాయమునను, లౌకికానుభవమునను పాత్రస్వభావమునకు అభినయ వ్యాఖ్యాన మొనర్చవచ్చుననియు నమ్ముచున్నాడు. యథారూప భావప్రకాశక నాట్యాదర్శముల ప్రయోగసిద్ధికి చారిత్రవిమర్శనము,

కావ్యచిత్రముల పరిచితి, సంప్రదాయభిజ్ఞత, కాలస్వరూప పరిజ్ఞానము, పరిస్థితుల అనుభవము లెస్సగ కావలయును. వీని వెలుగున పాత్రముల శారీరమానసిక లక్షణములారసి వానిని యథారూపముగను సందర్భోచిత భావవాహకముగను అభినయించుటయే ఇప్పటి పెద్దనటుల ప్రథానాదర్శమైయున్నది. రాఘవాచారి యూహలో పాత్రము యొక్క కాలము, పరిస్థితులు, శారీరక మానసిక లక్షణముల అంత లోతుగ నేర్పరచనవసరము లేదనియు, కథలో జేరిన పాత్ర జీవితాంశమును టూకీగా నెరిగి అట్టి జీవితమునే నటుడూహించి యా అవస్థలలో తాను జీవించునప్పుడు తన భావానుభవము లేగతినడచునో, తనకెట్టి రసోదయమేర్పడునో దానినే అభినయింపవలెననియు దేలుచున్నది. అనగా నటుడు ప్రదర్శించునది పాత్రగుణరూపముల యథారూపచిత్రము కాదు. పాత్ర స్వభావ ప్రకటనము కాదు. నాటక పాత్ర మనుభవించిన జీవితావస్థలలో తానెట్టి (రాఘవాచారి లేక నటుడు) రసభావ ప్రకాశము నొందునో దానినే రంగస్థలమున చిత్రింపదగునని వీరి నమ్మకము. యథారూపభావవాహకనాట్యాభినేతలలో నటుడు తన సత్వమును నిజస్వభావమును రూపమును సంపూర్ణముగ మరుగుపరచి పాత్రములో సారూప్యమొందును. రాఘవాచారి యూహించెడి యభినయరీతి హిందూ చిత్రకారుల స్వానుభవప్రకటనమువంటిది. పాత్రజీవితము, కథాసందర్భము అభినయించవలసిన పట్టుల నేర్పరచునవే కాని అభినయించెడి భావమంతయు, ప్రకటించెడి రసమంతయు నటుని స్వానుభవమె. అనగా నటుడు తన జీవితానుభవముల నుండి పాత్ర జీవితాంశములకు సర్వస్వతంత్రుడై రసవ్యాఖ్యాన మొనర్చును. యథారూపభావ ప్రకాశకనటులు తమ నిజసత్వమును సంపూర్ణముగ మరుగుపఱచి పాత్ర స్వరూపమునే వెలిబుచ్చ యత్నింపుచుండ రాఘవాచారి యుపాసక నాట్యరీతులు ఆధునిక వంగీయ చిత్రాదర్శములతో మెరయుచు (చిత్రము, ఫోటోగ్రాఫు కాదు, గుణసంకీర్తనముకాదు, చిత్రకారుని యనుభవ నివేదన, ఉపాసన ఫలితము అను సిద్ధాంతమున) నటుని స్వస్వభావమునే ప్రకాశింపజేయుచున్నది. అనగా ఉపాసక నాట్యరీతులలో నటస్వభావ మంతరించుటకు బదులు అదియే ప్రథానాంశమైయున్నది. నాట్యరంగమున జూపునది పాత్రముకాదు, ఆ కాలము కాదు, దేశము కాదు, ఆచారములు కావు. పాత్రము కొన్ని జీవితావస్థల, మానసిక రససందర్భముల నిదర్శించిన

సంకేతమేకాని, కొన్ని జగద్ధర్మముల నిరూపించు తాత్కాలిక సత్వమే కాని నిరంతర చిరంజీవి కాడు. పాత్రముయొక్క కాలము, దేశము, అవస్థానురూప గుణాచారములు అప్పుడే పోయినవి. వానిని యథారూపముగా ప్రకటించిన లాభమేమియు లేదు. కాని అట్టి జీవితాంశములు, అట్టి మానస ప్రబోధములు, అట్టి రససందర్భములు మానవనైజమై సర్వకాలములలో దేశములలోనుండి దేశకాలోచితరీతుల నావిర్భవించుచుండను. ఈకాలమున తెలుగుదేశపునటులు పాత్రజీవితాంశపు మానసిక రస లక్షణముల మాత్రమే మార్గదర్శకముగ గైకొని అట్టి యవస్థలలో తామొందిన స్వకీయానుభవమే అభినేయమని రాఘవాచారి యభిప్రాయము. చిత్రకారుడు అజంతాబిలాలయముల శివకేశవరూపములను మరలకాపీకొట్ట నవసరము లేదు. ఘూర్జర దేశ దుస్తులతో కృష్ణుని చిత్రింపనవసరము లేదు. ద్వాపరాచారములతో నలంకరింప నగత్యము లేదు. కృష్ణతత్వము ఈనాటి చిత్రకారున కేరీతి అనుభవమగునో ఎట్టి రూపాచారవిలాసములందు కృష్ణనామ సంకేత నిరూపితములగు జగద్ధర్మములు, రస విశేషములు తన నిత్యాధునిక జీవితమందు సాక్షాత్కరించునో అటులనే తాననుభవించినరీతినే యీనాటి చిత్రకారుడు చూపవచ్చును. విక్టరుహ్యూగో యేసుక్రీస్తును సృజించుచు నాధునికకాలోచితరూపమున క్రీస్తుతత్వమునకు జీన్వాల్జీను పాత్రమందు[117] స్వకీయ జీవితానుభవ వ్యాఖ్యానమొనర్చి యధునాతన క్రీస్తు రూపమును సృజించియున్నాడు. మాతృతత్వము నుద్బోధించు వర్జినుమేరీప్రతిమ బైజాంటియనులచే నొక రీతిగ చిత్రింపబడినది; రోమనులచే నొకరీతిగ చిత్రింపబడినది. ఆధునిక చిత్రకారుడొకడు ఆడుదాని బదులు మగవానినుంచి మాతృతత్వమునే "The motherless bairn" అను చిత్రములో యీనాటి పరిస్థితుల కనుకూలముగ నూహించియున్నాడు. ఈనాడు సుప్రసిద్ధకవులందును, చిత్రకారులందును గోచరించెడి స్వానుభవ నివేదనమే,

---

**117. జీన్వాల్జీన్ :** విక్టర్ హ్యూగో రాసిన 'లే మిజరబ్లే' నవలలో ప్రధానపాత్ర. దొంగగా జైలు శిక్షననుభవించి, విడుదల అయిన తరువాత ఆకలితో బాధపడుతున్న చెల్లెలి పిల్లలకోసం ఒక బిషప్ ఇంట్లో వెండి దీపపుకుందులను దొంగిలిస్తూ పట్టుబడి బిషప్ బోధలకు పశ్చాత్తాపం పొందిన వ్యక్తి. ఈ నవల నాటకీకరణ అనేక భాషలలోకి అనువదింపబడింది. ఈ పాత్రను పలువురు ప్రముఖులు పోషించారు.

నిజసత్త్వమును దాచుటకన్న ప్రకాశింపజేయు కోరికయే, అహంకారమును చంపుటకన్న రసోపాసకుని యహంకారప్రాచుర్యమే రాఘవాచారి నాట్యవర్గమున కుపదేశించెడి చిరానుభూత విమర్శితతత్త్వమై యున్నది. వీరి నాట్యాదర్శము లక్ష్మణస్వామిగారి వలెనే యుపాసక నాట్య లక్షణముకాని, స్వానుభవ ప్రతిపాదనముగాని, నటుడు పాత్రమునకొనర్చెడి యభినయ వ్యాఖ్యానముగాని, పాత్రము యొక్క యథారూపభావ ప్రకటన ఫోటోగ్రాఫు పద్ధతి కాదు. ఇట్టియూహలతో నుప్పొంగుచు వాని నాచరింప యత్నించి యథాశక్తి సిద్ధి నొందినవారు లక్ష్మణస్వామి, రాఘవాచార్యులిద్దరే నేను చూచినవారిలో మేటినటులు. వీరుపాసించెడి రసములందు వీరద్వితీయులు. కాని మిగిలినవానిలో కేవల పాత్ర సాదృశ్యమపేక్షించెడి నాగరాజరావు, గోవిందరాజుల సుబ్బారావు వీరల భావప్రకటనా వైదుష్యము, బహురసాభినయ సామర్థ్యము వీరియందగుపడకపోవచ్చును. మానసిక ప్రబోధములు ఆత్మప్రభావశాసితములై నిబద్ధవ్యాప్తిలో జిక్కుకొనియున్నవి.

నటునకు సంగీతమందు, కావ్యార్థజ్ఞానమందు, మిగిలిన లౌకిక విజ్ఞానమందు కొంతశిక్ష యుండవలెనని వీరియూహ. కాని కళాసంస్కారముకన్న, లక్షణావలోకమునకన్న, నాట్యశిక్షకన్న రవీంద్రనాథునివలె నిత్యజీవితమునే నాటకముగ భావించి సంచరించెడి సత్త్వము నాట్యసిద్ధికి ప్రధానాధారమని వీరియభిప్రాయము. నటవృత్తి నిత్యజీవితాంశముకాని యేనాడో ఒక నిమేషము తెచ్చిపెట్టుకొనెడి రసముల యతికింపు కాదు. అనగా నిత్యజీవితమందు నటుని సాక్షీభావము, ఔదాసీన్యము, రసభావానుభవము నిండారగ్రోలు సరసుడే నటనామమున కర్హుడని వీరివాదము. నటుడు నిత్యరసోపాసియై యుండి తానభినయింపదలచిన పాత్రగుణములలో రససమాధి యనుభవించుచు అట్టి సమాధిలోనే అభినయించదగునని వీరి యాలోచన. రాఘవాచారి తన సిద్ధాంతమును అవలంబించి జీవించునట్లే అగుపడుచున్నది. శివాజీ, రామదాసు వేషముల అభినయములో నేప్రధాన సర్వాంతర్గతతత్త్వముల బ్రకాశింపజేసెనో అవియే వీరి నిత్యవర్తనమందగుపడుచుండును. ఇందువలన రాఘవాచారి, పింగళి లక్ష్మీకాంతము, లక్ష్మణస్వామి యొకే నటవర్గమున జేరుచున్నారు. తమ నిత్యస్వభావమున కనురూపమయిన వేషముల గైకొనుచు దానిలో తమ

ప్రపంచానుభవము వెల్లడించుచుందురు. ఇది పెద్ద నటుల లక్షణము కానేరదనియు, నటుడు తాగైకొనిన పాత్ర స్వరూపమునే పొందవలెననియు కొందరు విమర్శకుల అభిప్రాయము. ఏమైనను తానుపాసించెడి రసతత్వముల బ్రకటించుటయే శ్రేయస్కరమును, ఫలవాహకమును అగును. నటునకు పవిత్ర సద్వృత్తియు, శీలసంరక్షణము అవశ్యమని వీరియభిప్రాయము. సత్సాంగత్యమునను గ్రంథావలోకనమునను, విశేషము అంతర్దృష్టిచేతను ఉపాసించవలసినది నాట్యవిద్యయని నమ్ముచున్నారు.

నలాభినయములో దమయంతిని విడచిపోవుతావున కలికలితుడై రాచధర్మములను, ప్రణయతత్వమును తిరస్కరించిపోవును గావున నాపట్టులో నలుడు రాగప్రకోపమును జూపకూడదనియు, ఏదో ఒక విపరీత నూతనావస్థ నవ్యావేశ ముదయించినట్లు నిశ్చేష్టితుడై వెడలవలెననియు, అప్పుడాతడదివర కుండిన నలుడు కాడనియు, రాగాదికములు వదలినవనియు, ప్రమత్తునివలె నభినయింపదగుననియు వీరి యభిప్రాయము. పటాను, ఆషాబీతో శృంగారము నిండుపొలుపున జూపవచ్చుననియే వీరివాదము. జీవితానుభవము లెప్పటివప్పుడివే కనుక నాటకలక్షణమైన విషాదతత్వము కాంతాసమాగమమున నుండకూడదని వీరియభిప్రాయము. పటాను కల్తీమనిషి, అశ్వత్థామ, రామదాసు, శివాజీ వంటివాడు కాడు. వీళ్ళకు నిజసత్వ మెల్లవేళల గోచరించును. పటాను సంకర స్వభావుడు గాన వీనిలో మొదటి నుండి తుదివర కొకేవిధమగు తత్వమగుపడనవసరములేదు: అని రాఘవాచారిగారి అభిప్రాయము. ఇటులనే చిత్రాంగి, దమయంతి, హిరణ్యకశిపుడు, ధర్మరాజు మున్నగువారి పాత్రాభినయమును గూర్చి వీరికి పెక్కులగు సహేతుకనాట్యాభిప్రాయములున్నవి. అభినయములో ప్రతిపంక్తిని అభినయించ నవసరములేదనియు, ఆపట్టున గల సామాన్యవిషయము బ్రదర్శించిన చాలుననియు విశ్వసించుచున్నారు.

ప్రస్తుత మాంధ్రదేశములో నాటకములు, కావ్యములు, శిల్పములు గూర్చి విశేష విమర్శనము జరుగుచున్నది. ఇట్టిదే యితర దేశములందు కూడ బుద్ధిమంతుల నాందోళనపరచుచున్నది. తమ ప్రస్తుత స్థితిని విమర్శించి కళాలక్షణము నూహించి ఆలంకార నియమములకును, జీవితానుభవములకును పలువురు కవులు చిత్రకారులు, నటులు, విమర్శకులు పాటుపడుచున్నారు.

అట్టివారిలో నాంధ్రనాట్యరంగమున విపుల పరిశ్రమ మొనర్చి నాట్యస్వభావమును నిర్ణయింప యత్నించుచుండిన బళ్లారి రాఘవాచారిగారు నటసిద్ధులలోనేగాక నాటకకళోద్ధారకులలో గూడ బ్రశంసనీయులై యున్నారు.

సీనరీ, దుస్తులు, సంగీతము మున్నగువాని తగ్గించుటలోను రసభావప్రకటన మభివృద్ధిజేయుటలోను నవీన విమర్శకులేకీభవించుచున్నారు. నాటకములను సాంఘిక దోషనివారణమునకును, దేశాభిమాన భావోజ్వలనమునకును, సద్వర్తన నిదర్శనమునకును విరివిగా నుపయోగింప వలెనని వీరియూహ. నాటకము కళలలో చేరినది. నాటకాంగములైన కవిత్వము గాథాకల్పనము, రంగప్రసాదనము, సంగీతము, అభినయము ఇవియన్నియు కళలే. ఇన్ని కళల సమావేశమున నుత్పన్నమై మెరయు కళామకుటము నాటకము. కళలు మానవుని యైహిక లౌకిక రాజకీయ సాంఘిక కార్యసంపాదనమునకు సాధనములుగా నుపయోగింపదగునా? ఉపన్యాసములు, యుద్ధములు, ధర్మ శాసనములు, తర్కములు ఉపయోగించెడి పట్టులకు రస స్వరూప నిరూపకంబులగు కళల నుపయోగింపవచ్చునా? నాటకమందు నీతిప్రబోధము, లౌకిక ఆందోళనము, వేదాంతోపదేశము ఎక్కువగా నుండవచ్చునా? ఉండకూడదని నా అభిప్రాయము. కళలు రసాత్మకుడగు భగవంతుని స్వస్వరూప ప్రకటన సాధనములేకాని మానవుని దేశకాలనిబద్ధమై యనిత్యదూషితములైన లౌకిక వ్యాపార ప్రాచుర్యమున కుపయోగింపకూడదనియె నా నమ్మకము. రసప్రధానమైన కళల కథాంశపు పరిణామమున ప్రేక్షకులు నీతిని గరవనీ, లేక విరాగులై దండకమండలముల దాల్చనీ, యుద్రేకపూరితులై కరవాలమెత్తి స్వాతంత్ర్య ధ్వజారోహణ మొనర్చనీ, కళలు మానవ మానసమం దుత్పత్తిజేయు నైతిక సాంఘికధర్మము లెవ్వియైనను ధర్మప్రతిపాదనోద్దేశ్యమునకు కళానైజమగు రససామ్రాజ్యమును భంగపరచకూడదు. కళలు రసపుష్టిచే వెలింగి రసప్రకటనమే సత్యముగను, హేతువుగను, ఫలముగను ఉండవలసిన పూజార్థములు అని నా అభిప్రాయము.

రాఘవాచారిగారు నాట్యవిద్యాభివృద్ధికి నటుల రాకపోకలు, సహకారము ఎక్కువ కావలయునని యుద్బోధించుచున్నారు. సర్వాంగ సౌలభ్యసంపదచే నాంధ్రనాటకలోకమున నగ్రస్థానమాక్రమింపదగిన రాఘవాచారిగారి అభినయరీతులను ప్రదర్శన విమర్శనములో విమర్శించెదను. ☸

## ఐదవ దళము

# ప్రదర్శన విమర్శనములు

## బెంగుళూరు ఆమెచూరు కంపెనీవారి

## శివాజీ, రామదాసు నాటకములు

బెంగుళూరు పురమున సుమారు మూడువందల సభ్యులను, ధనవిద్యావిరాజితుల నెంచుకొనగల "ఆమెచూరు డ్రమాటికసోసియేషను" నాటకకళాభివృద్ధికొరకు పూనికతో పనిచేయుచున్నది. ఇందు విదేశాటనమొనర్చి వచ్చిన విద్యాధికులెందరో కలరు. మహిసూరురాజ్యమున నున్నతోద్యోగముల నిర్వహించు అధికారులెందరోకలరు. ధనికులు, రసికులు, కళాప్రయోగచతురులు, అధికారులు, అనుభవజ్ఞులు అందరు నేకమై సభాకార్యముల గలసిమెలసి చెన్నపురి సుగుణవిలాససభవారి బోలెడి యైకమత్యముతో నిర్వహించుచున్నారు. ఆర్థికసంపత్తి, అంగబలము, విజ్ఞానసమృద్ధి యొప్పెడి యామెచూరు కంపెనీవారు కర్ణాట కాంగ్లేయ నాటకములనేగాక తెలుగునాటకములగూడ నాదరించి యభినయించుట ఆంధ్రలోకమున కెంతయు సంతృప్తికరముగ నున్నది. బళ్ళారి నాటకసమాజములు పాటవము తప్పినట్లగుపడుచున్నది. రాజమందిరములో లక్షరూపముల పెట్టుబడితో నిలిపిన చింతామణి సమాజము కాలవశమైనట్లు దోచుచున్నది. మైలవరపు రాజపోషణ నటజనసహకార మొదవక కలవరపడుచున్నది. మోతే, దుగ్గిరాల, తెనాలి, అల్లూరు సమాజముల ఆర్థిక స్థితి బాగుగనేయున్నది. కాని, ఇచ్చటి విజ్ఞానసమృద్ధియు నైకమత్యము మన సమాజములందు గానరాకున్నది. తొల్లి యనవేమారెడ్డి మరణానంతరము తెలుగు కైతలు కర్ణాటభూపాలకుల పోషణలో వర్థిల్లినటుల డబ్బులేకను, హంగులేకను, యైకమత్యమొదవకను నిలుకడచిక్కక

తెలుగుదేశములో కుప్పిగంతులిడు ఆంధ్రనాటకలక్ష్మి నిజమాధురీవిలాసములచే చెన్నపురి సుగుణవిలాససభను, బెంగుళూరు ఆమెచూరు సమాజమును వశపరచుకొని వారి పోషణలో పెంపొంది నవ్యవైఖరులదాల్చు కాలము రానున్నదేమో? వీరి యైకమత్యము సర్వాంగబలసమష్టియు నట్టి భావవిజయమునే సూచించుచున్నది.

ఈ నాటకసమాజములో నభినయించెడి నటులు చాలవరకు కర్ణాటకులైనను వారి యుచ్చరణ మెట్టి దేశీయవిభ్రంశతనొందినను జక్కగ మాటాడనేరనివారు పనివడి యత్నించి తెలుగులో రసవంతముగ నాటకములాడ గలుగుటయే వీరి పూనికను ఐకమత్యమును కార్యదీక్షను కొనియాడుచున్నది. వీరిలో నొక హాస్యాభినేత కైలాసమను[118] నాయన "డోలుగట్టి" "up to date అమ్మయ్యి" మున్నగు ప్రహసనముల వ్రాసి యున్నాడు. కజిన్సు, రామలింగారెడ్డి గారల అభిప్రాయములో హాస్యరసమున వీనికిమించిన రూపకములు దక్షిణా పథమున లేవట! వీరు నాట్యాదర్శములగూర్చి కొన్ని విమర్శనములచ్చొత్తించి యున్నారు. నటలోకమందలి విఖ్యాతపురుషుల రావించి ప్రసిద్ధనట సహకారమున నాంధ్రనాటకాభినయ పరిణామసౌందర్య మనుభవించెడి కోరికలీ సమాజమువారి కున్నటులగానుపించుచున్నది.

దేశమునందెల్లెడల బుద్ధిమంతులొకేవిధమగు నాట్యపరిణామ ముద్దేశించుచున్నారు. ఆదర్శములు ముందడుగు వేయుచు కార్యసిద్ధి యాదర్శసూచితమార్గములలో నల్లన నడచుచుండును. ఆదర్శ స్వరూపము ప్రకృతసిద్ధి యొక్క లోప బీజములవలన నంకురించి లోపములెంత విషప్రాయమైతే, అంత తీవ్రతతో నాదర్శముల భావోద్వేగ మేర్పడుచుండును. కర్నాటక నాటకములు అభినయమందు తెలుగువానికి జంకుననియు నీదేశమున నాటకసమాజపోషణకు పెక్కు లవకాశములున్నవనియు ముందు జెప్పియుంటిమి. ఇప్పుడు ఆమెచూరు కంపెనివారు తమ సాంఘికబలముతో ఆంధ్రనాటకాభినయరీతుల గైవశము చేసికొన యత్నించుచున్నారు. వీరి యాదర్శములు మన ప్రసిద్ధ విమర్శకుల తెరవుననే నడచుచున్నవి.

---

**118. కైలాసము :** టి.పి. కైలాసం. ప్రఖ్యాత కన్నడ నాటక రచయిత. ఆధునిక కన్నడ నాటక పితామహుడనదగిన వ్యక్తి.

బెంగుళూరి ఆమెచూరుకంపెనీవారి రామదాస నాటకము, శివాజీ నాటకము[119] చూచియున్నాను. ఇందులో బళ్ళారి రాఘవాచారి రామదాసు పాత్రమును శివాజీవేషమును ప్రశంసనీయముగ నిర్వహించియున్నాడు. తెనాలి రామవిలాససభవారి శివాజీ (రోషనార) ప్రదర్శనమును, నెల్లూరి సుగుణవిలాససభవారి రామదాసును కొలదిమాసముల క్రిందనే జూచియుండిన విమర్శకసౌలభ్యమిందున నుపకరించుచున్నది. ప్రధానపాత్రముల విమర్శించుటకు ముందు చిల్లర వేషముల గైకొని కొంత పర్యాలోచనము చేయవలసి యున్నది.

రామదాసు నాటకములో నాయకుడెవరు? రామదాసునకు రామమంత్ర ముపదేశించి కథాంశమునకు పాదుద్రవ్వి యావల తానేషాకు గోపరాజుగారి నిశ్చలరామభక్తిని నిదర్శించి చూపిన కబీరా? లేక ప్రవేశము నుండి తుదివరకు స్వభావభేదమేమియు గానరాక, భక్తిప్రవృత్తులలో మాత్రము రామనామామృతము క్రమవివర్ధ పారవశ్యముతో గ్రోలుచుండిన రామదాసా? లేక మ్లేచ్ఛుడగు తానేషాహియా? నిస్సంశయముగ గోలకొండనగాధిపుడే రామదాసు నాటకములోని కథానాయకుడు. కబీరు, అలంగీరు ఉత్తరహిందూస్థానమున నొడిగట్టుచున్న హిందూ మతద్వేషపాతకము సైపజాలక హిందూముసల్మానుల నొక్కగుమిగా గూర్పనెంచి యరుదెంచినవాడు. మహమ్మదీయులధికారులై స్థితివంతులై యహంకారపూరితులై యుండిరి. అదివరకే పరరాజసేవాదైన్యమున నలిగి చచ్చియుండిన హిందువులకు తారకమంత్రముపదేశించుట కబీరు జీవితార్థమై యుండదు. అధికారైశ్వ్యములచే మదించి యుండిన ముసల్మానుభూనాథులకు హిందూదైవతములందు విశ్వాసమేర్పరచుటయే కబీరుని ముఖ్యోద్దేశమై యుండును. ఈ నాటకాంశపు కర్ణధారి కబీరే. రామదాసాతని సాధనమాయెను. రామదాసు గుణములందుగాని, భక్తిజ్ఞాన వైరాగ్యములందుగాని, కథాక్రమమున నెట్టి మార్పులు గలుగలేదు. కలిగిన మార్పంతయు తానేషాహి తత్వమునకే చెందుచున్నది. తానేషా దుర్మార్గుడు కాడు. తుంటరి కాడు. అనవసరముగా హిందువుల ద్వేషించువాడు

---

**119. రామదాసు నాటకము :** ధర్మవరం గోపాలచార్యులుగారి ప్రఖ్యాత నాటకం.

**శివాజీ నాటకము :** 'రోషనారా' నాటకాన్ని ఈ పేరుతో కూడా పిలిచేవారు. రచయిత ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు.

కాడు. రామదాసు వ్రాసికొనిన అర్జీకి సామాన్యప్రభుధర్మములో సకాలముగ బ్రత్యుత్తరమిచ్చెడివాడే! కాని రామప్రభావముననో, కబీరుని సంకల్పబలిమినో, ఆ జాబు రామదాసునకు చేరలేదు. తానేషాకు రామదాసు నందు గౌరవమున్నది. అతని కార్యములు మహూదారసత్వ నిదర్శకములని గుర్తించు వివేకమున్నది. సితారాదేవి మాటలవలననో, ఆత్మప్రబోధ సంఘర్షణములచేతనో తానేషా చైతన్యమందు వింతలాలిత్యమొదవియుండెను. హిరణ్యకశిపుడు నారాయణ నామశ్రవణమును తేలుకాటుగా భావించువాడు. మహమ్మదు గజినీ, తిప్పుసుల్తాను, అలంగీరుపాదుషాహి హిందూ విగ్రహముల పగులగొట్టి, దేవళముల కూలద్రోసి మసీదులొనర్చిన పరమతద్వేషులు. తానేషా అట్టివాడు కాడు. రామదాసు నెక్కువ హింసించుటయు వాని యుద్దేశ్యముగా నగుపడదు. కాని నబాబుగారి కర్మవిపాక పరిణామముననో, కబీరు సంకల్పబలిమిచేతనో క్రమముగా నౌక చెంప గోపరాజునందు విశ్వాసాభివృద్ధియు, నొకచెంప అధికార దుర్మదాహంకారము పెచ్చుపెరుగుటయు సాగెను. మారువేషములతో, మాయోపాయములతో రామదాసు రామభక్తిని శిక్షించి పరీక్షించుచుండెను. అది సుస్థిరమైనందున తన అంతరాత్మయే నిజోద్యోగము నుండి మరలి రామప్రభావ మనుభవింపసాగెను. ఒక చెంప నధికార దౌర్జన్యమున గోపన శిరచ్ఛేదన మాదేశించుచుండెను. ఆత్మప్రవృత్తి యొకదారి, అధికారశాసన మొకదారి. ఇట్టి ద్వంద్వసత్వము మొదట నుండి తుదివరకు తానేషాహియందగుపడుచు, రామలక్ష్మణులు మొహరీలప్పగించి పోయినవెనుక, విగతగర్వుడై వారిని జూచు భాగ్యము లేకపోయినదను విచారమొకటియే బాధించు మానసము వ్యక్తమగుచు మహమ్మదీయుడు హిందూదైవముల ప్రభావమెరుంగటయు, రామభక్తుడగు సేవకునిపాదములపై దక్కను పరిపాలకుడు వ్రాలుటయు నీ నాటక కథాపరిణామమైనది. హిరణ్యకశిపునివలె తానేషా భక్తుని పీడించలేదు. భగవత్సాక్షాత్కార మగుపట్టున నైహిక జీవనము విడువలేదు. సావిత్రీదేవిని శిక్షింపవచ్చిన సమవర్తిచందమున నంత్యపరిణామ మెరింగి కపటనాటక మాడలేదు. కాని మానవ నైజానుకూలముగ కాలక్రమమున భక్తసద్గుణములను, భక్తనిలయుని మహిమాతిశయమును గుర్తించి విగతరోషుడై, నిర్మూలితాహంకారుడై చరితార్థుడైనవాడు. తానేషా లేనిదే వాని క్షణికాహంకార మొదవనిదే రామదాసున కిట్టి విఖ్యాతి గలిగియుండదు. రామదాసు

కబీరులుండనిదే, నిజాము రామభక్తుడు కాజాలడు. కాని ఆత్మస్ఫురణచే నాటుచుండిన భక్తిభావములు కాలక్రమమున వృద్ధియై తన్మయత్వమేర్పడుట తానేషాయందగుపడును. ఈతని స్వభావమొకటియే కథాక్రమమున ఫలప్రాప్తి నొందినది. కావున నీతడే రామదాస నాటకమునకు కథానాయకుడు. ఈతని యందగుపడు ఆత్మప్రబోధాధికారమదముల పరస్పర పోరాటము అంతర్గతమైయుండిన దయాసహన వివేకములు ఆమెచూరు కంపెనీలో నీపాత్రమును నిర్వహించినవారు బాగుగ జూపించిరి.

కబీరు పాత్రమును అల్లూరు రామిరెడ్డిగారు[120] మహాద్భుతముగ నిర్వహింతురని యాంధ్రులెల్లరు గొనియాడుచున్నారు. దాని జూచెడి భాగ్యమింకను నాకు కలుగలేదు. వారి వ్యాఖ్యానవైఖరి నే ననుభవించలేదు. నెల్లూరు సుగుణవిలాససభలో నీవేషమును ధరించిన జి. రాధాకృష్ణయ్య[121] మిక్కిలి రూపవంతుడు, యువకుడు, రంగసంగీతమును మనోహరముగ నాలపించగల వాడు. ఈతని పైచూపులు భక్తి పారవశ్యమును తద్దైకదీక్షను పూనికను కనుపరచుచుండెను. కాని చూపులోను దృఢకాయమందును అభినయ వైఖరులందును భక్తిపరవశుని అంగగ్లానికన్న కార్యనిర్వాహకునిపటుత్వ మెక్కువగుపడుచుండెను. అతని ముఖసౌందర్యముచూపు, వెలుగుపాటసొబగు, భక్తినిశ్చేష్టిత స్వరూపము సూక్ష్మాంశవిమర్శనకు యెడమీయలేదు. మొత్తముమీద పట్టుదల కొంత యగుపడుచుండెను. బెంగుళూరు ఆమెచూరులో కబీరు వేషమభినయించిన బి.యే. రాఘవాచారి[122] సుందరాంగుడు కాదు. రాధాకృష్ణయ్య వేషము బైబిలుబొమ్మలలోని పాత నిబంధన మహాత్ముల చిత్రముల బోలియున్నది.

---

**120. అల్లూరు రామిరాడ్డిగారు :** అల్లూరు రామచంద్రారెడ్డిగారు. నెల్లూరుకు సమీపంలోని అల్లూరులో శ్రీకృష్ణవిలాస సభను ప్రారంభించి రామదాసు నాటకానికి ఎనలేని ఖ్యాతిని తెచ్చారు. ఆ నాటకంలో కబీరు పాత్రను ధరించి దక్షిణ భారతంలోనే గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందారు.

**121. జి.రాధాకృష్ణయ్య :** చూ. వివరణ 70

**122. బి.ఏ.రాఘవాచారి :** బెంగుళూరు అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్‌లో స్త్రీ పురుష పాత్రలను సమానమైన ప్రతిభతో చేపట్టిన నటుడు. కబీర్ పాత్రకు కూడా గొప్పపేరు సంపాదించాడు.

బెంగుళూరు కబీరొకింత వయసుమించిన భారతీయ ఫకీరుల బోలియుండెను. ఈతని పాట కూడ మెచ్చదగినదే కాని రాధాకృష్ణయ్యకు తోడు కాదు. ఈతని అభినయమందు యోగుల కుండదగు ఔదాసీన్యము, అన్నియు నెరింగి కాలపరిణామమును సాక్షీభావమున వేచియుండిన అంటీఅంటని భావము బాగుగా నగుపడినది. "రాముడేమి చేయనున్నాడో" అనునప్పుడును, మారువేషముతో నగుపడిన తానేషాను గుర్తించునపుడును, రామదాసు ఆతిథ్యమంగీకరింపుమని వేడినప్పుడును తుదకన్నియు నెరింగి ప్రాయశః తన సంకల్పబలముచే కథాంశమునంతను జరిపించి తుదకు "అట్లాగా రాముడు భద్రాద్రి వైపుకు పరుగెత్తగా చూచితిని" అని యేమీ యెరుగనట్లు అభినయించినపుడను, ఈ నటుడు చాలా ఔదాసీన్యమును లోతును యోగినైజమును సిద్ధలక్షణమునగు ఆత్మప్రభావ మెరింగిన పసితనము (Simplicity) చూపియున్నాడు. మొదట కేవలము భక్తితో భద్రాద్రివాసుని సన్నిధి చేరవచ్చినపట్టున రాధాకృష్ణయ్య ప్రకటించిన భక్తిపారవశ్యము మాత్రము బెంగుళూరు రాఘవాచారియందగుపడలేదు. రామదాసు నాటకములోను, శివాజీ నాటకములోను, మహమ్మదీయ దుండగీడుల త్రాగుబోతుదనము, మదోన్మత్తవిహారములను, ఇతర చిల్లర వేషముల జాతీయలక్షణములను కొన్ని చూపిరి. ఇందు ముఖ్యముగా హాస్యాభినయ మొనర్చుచుండిన శ్యామన్న హాస్యవేషములందు తెలుగు హిందూస్థాని మున్నగుభాషలలో సహజముగ హాస్యదీపకంబుగ నభినయించి పాడగలవాడే. ఈతడు పరమానందుని వేషము, దావూద్ వేషము రమ్యముగ జేసియున్నాడు. కాని నెల్లూరు సుగుణ విలాససభలో తురుకపోకిరీవేషముదాల్చిన ఒక్క కుఱ్ఱవాని సౌలభ్యము ఇంకను శ్యామన్న కేర్పడలేదు. తోటలోని పాటకచేరీలో టి.పి. కైలాసము గవైపాటకుని భూమికలో గాత్ర మెక్కువ మాధుర్యముగ లేకపోయినను గజలీపాటకుని యొడుపులన్నిటిని జాతీయ సారూప్యసిద్ధితో వినోదముగ నగుపరచెను. మైసూరు రాజ్యములో కైలాస మొకవింతపురుషుడు. పెద్దకుటుంబములోనివాడు. నిత్యహాస్యముతో నిరంతర బాల్యచాపల్య మొప్పెడ తొట్రుపాటులతో వాసికెక్కుటయేగాక, హాస్యనాటకము లభినయించుటయేగాక, పరీక్షలన్నియు సత్వరమున గౌరవస్థానముల దాటినవాడు. ఇట్టి కాంబినేషనసాధారణమే కదా! ఆవల ఇంగ్లాండులో ననేక వత్సరములుండి వచ్చి

మంచి యుద్యోగములో నుండియు రామలింగారెడ్డిచే నపూర్వ ప్రతిభాసూచకములని కొనియాడబడిన నాటకముల వ్రాయుచు నాటకములలో పిల్లవానివలెనే కిచకిచలాడుచు అభినయించుచున్నాడు. అదృష్టము!

చిల్లర వేషములను కథాంశమును జరపుటలో వీరు ఏపట్టున కెట్టి గౌరవముచితమోదాని యథావిధిగ జూపుచుందురు. అన్నిటిలోను ఎక్కువ జాగ్రత్త, విమర్శన గోచరించును. మనదేశములో బ్రాహ్మణులు మంత్రముల జదివెడుపట్లు కొంత హాస్యప్రసంగముగ జూపబడుచున్నది. ఇక్కడ ఆ విషయములో ఔచిత్యము, ఆత్మగౌరవము, జాగ్రత్త మిక్కుటముగనున్నది.

శివాజీ నాటకములో[123] రోషనారావేషము అభినయించిన కె.ఎస్. వాసుదేవరావు[124] ఆ వేషమునకు (షాజహానునకు రసపుత్రవనితయందుద్భవించి పదునెనిమిది విద్దెలెరింగి రణనిపుణయై సౌందర్యరాశియై వెలింగిన రోషనారాదేవికి) అనుకూలమయిన విగ్రహము. రసభావసంస్ఫూర్తి యొప్పుచుండును. క్రిందటిరోజు గోపన కులపత్నిగా వెక్కిరించినట్లుండిన వాసుదేవరావు రోషనారావేషములో నిరుపమ పాత్రసాదృశ్య మొంది యమేయసౌందర్యముతో వెలుగజొచ్చెను. ఈతని కాయము, యేపు, తలకట్టు, కొంచెము మగకబళికయున్న నడవడి తెలుగుదేశపు టిల్లాలునకు విపరీతముగ నుండెను. కాని చక్కని మొగలాయి వనితాభూమికలో రోషనారాదేవి స్వభావశీలములలో యాపె విద్వచ్ఛూరలక్షణములలో వలయు ఆత్మనిగ్రహము, పౌరుషము, సంస్కృతోదార రసప్రకటనము మిక్కిలి ప్రశంసనీయముగ నచ్చినవి. ఈతడే బెజవాడలో రాఘవాచారి చెంతన ఆషాబీవేష మభినయించెనట. కాని ఆషాబీ రోషనారాయంతటి ప్రౌఢి కాదు. సుకుమారముగ్ధ. మహమ్మదీయ రక్తముండుటచే స్వాతంత్ర్యాభిలాష మెరయుటచే తుద కొకింతవీరరసము జూపట్టిన బాలిక. రోషనారా పెద్ద పుట్టుక కలిగి విద్యాసమృద్ధిచే రసావేశము సుష్ఠువడి, విద్దెలచే శూరగుణములు శాంతవడి, యన్నిట

---

**123. శివాజీ నాటకము :** చూ. వివరణ 119

**124. కె.యస్.వాసుదేవరావు :** బెంగుళూరు అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్‌లో బళ్లారి రాఘవ ప్రక్కన రోషనార, ఆషాబీ పాత్రలను ధరించిన నటుడు.

నౌచిత్యమెరింగి వివేకముతో సంచరించగల హిందూ మహమ్మదీయ గుణసంపర్క తేజంబుల మిశ్రితరూపమును జూపెడి ప్రౌఢాంగన. ఈ వేష లక్షణములకు వాసుదేవరా వెంతయు తగియుండెను. స్థానం నరసింహారావు ఇతనికంటె చక్కనివాడు. శివాజీపటమును జూచినప్పుడాతని నేత్రవికాస మీతని మించినది. కాని కథాక్రమములో మిగిలిన సందర్భములన్నిటిని యభినయించునపుడు, శివాజిని బెదిరించినపుడు, రామసింగును విదలించునపుడు, తురక పోకిరులను సుందోపసుందుల గావించినపుడు, తుదకు శివాజీ తనయందభిమానములేకగాక పరస్త్రీవర్జితుడై తన్ను నిరాదరించెనను వాస్తవమెరిగి యాతని యెడ మాతృభావోదయ మలవరచికొనినప్పుడు వాసుదేవరావు రోషనార యొక్క రసపుత్ర క్షేత్రమునకును, విద్వద్వీరసంస్కార సౌశీల్యమునకు చక్కని భావ ప్రకటన మేర్పరచి యున్నాడు. తెనాలివారాడిన యాటలో శివాజీ తిరస్కరించినపుడు రోషనారా కుదయించిన రోషద్వేషములు తుదివరకు పెల్లుబ్బి మహారాష్ట్ర సామ్రాజ్యమును తన ప్రాణేశ్వరుని కైవసము జేసెదనన్న ప్రతిజ్ఞను భంగపరచి రోషనారా వీరప్రతాప ప్రదర్శనములోను, విషాదాంతములోను బరిణమించినది. తనతో శత్రుపక్షమై పోరాడిన ఆమె తుదివలపు లొకింత శివాజీ కరుణావలోకనమున వీక్షింపవలసి వచ్చెను. ఈ పట్టు లామిరాబ్లాలో మరయసునకు తెనార్దియరుకూతునకు జరిగిన దానివలె నున్నది. శివాజీ రోషనారాదేవి ప్రణయ సూచనలందికొని వివాహమున కియ్యకొని యావల మోసగించిన యెడల రోషనారా ఒకవేళ మానవనైజమున నిట్టి దుర్మదకార్యాచరణమున కియ్యకొనవచ్చునేమో? కాని శివాజీ యేకపత్నీవ్రతుడై, మానసంరక్షణైకదీక్షితుడై, నిర్మల సచ్చారిత్రమును చాటుచుండ నభిజాతయగు రోషనార విద్యావివేక సంపన్న చిన్ననాటి నుండి పెంచిన ప్రేమవల్లరి ద్రుంచి మహాద్వేషియై భర్తృ పరాభవ మపేక్షించి సమరసన్నాహయై జెలరేగుట నుచితముగను, స్వభావవిరుద్ధముగను ఉన్నది. అందుచేత నామెచూరువారీకథను మార్చినారు. వనితలనెల్ల తల్లులుగ దలపోయు శివాజీని చిన్ననాటనుండియు ప్రేమించి గారవించి, పూజించి, సాన్నిధ్యమభిలషించిన రోషనారా వానికై డివాలీచంద్రకాంతముల, మొగలాయి జలయంత్రముల, షాలిమరు తోటల,

చల్లదనమును వీడి గులాబిచమనుల సౌరభాస్వాదనమేవగించి దక్షిణాపథపు దుర్గమ కర్కశారణ్యవీథుల నధివసింపవచ్చిన స్వార్థవిహీనప్రణయపయోధి రోషనారాదేవి శివాజీ యెడల మాతృభావ ముదయింపజేసుకొని విరాగియై యుండుటకన్న గత్యంతరమేమి న్యాయసమ్మతమగును? ట్రాట్‌స్కీ రచించిన పాలీను & గయవోనాలో[125] ఇట్టి పరిణామమే, విరాగసిద్ధియే కలిగి మిక్కిలి రమ్యముగ నున్నది. ఆమెచూరువా రీమార్పు గావించినందుల కెంతయు నభినందనీయులు. ఇందు రోషనారా తన పుట్టుకకు విద్దెకు తగిన పరిణామమందుటయేగాక శివాజీయెడల నేర్పడిన ప్రేమవాహిని నెండకుండ కాచుటయేకాక శివాజీతో చేరి మొగలాయుల నెదుర్చు అసమంజస కార్యము, తనవారిజేరి ప్రణయనిలయమును మార్కొను అన్యాయము తెలివిగా, సరసముగా నివర్తింపబడినవి.

ఆమెచూరు కంపెనీవారు విద్యావిత్త సహకార వైభవములతో క్రమాభివృద్ధిగాంచి, కర్ణాట నాటకముకేగాక తెలుగు నాటకములకు గూడ నాదర్శప్రాయులై మెలంగెదరని తోచుచున్నది. వీరి రామదాస ప్రదర్శనముకన్న శివాజీ ప్రదర్శనమెక్కువ గుంభనగను సుందరముగను ఉండినది. మన దేశములో సాంఘిక చారిత్ర నాటకములు పెక్కు లాడబడినవి. జనాభీష్టము మరల కూచిపూడి భాగవతుల సాంకేతికభావ ప్రస్తరణమునకును, యథారూప సంగీతనాటకుల భావాభినయమునకును నడుమగా సవిస్తరముగ గద్యములో నుచితప్రదేశముల గీతములుంచి రసాభినయ మతి విస్తారముగ జేయు నాట్యాదర్శము లేర్పడియున్నవి. బెంగుళూరు ఆమెచూరువారికి కూడ నట్టి యాదర్శములే కలవుగాని, నాటకములందు సాంఘిక చారిత్రవిషయముల నుద్బోధించు వేడుక ప్రబలముగ నున్నది. ఆంధ్రకూడలి రసవంతమగు కళయే పరమావధిగ గల నాటకము లపేక్షించుచుండ మనకన్నిటిలో వెనుకవడి యున్న కర్ణాటకులు మనము వదలుచున్న దారులంటబోవుచున్నారు.

---

**125. పోలీను & గయనోనా :** ట్రాట్స్కీ రాసిన ఆ పేరుతో ఉన్న సంగీత నాటకంలో నాయికా నాయకులు.

# చంద్రహాస[126]

ఇండియను డ్రామటిక్కు కంపెనీవారు చంద్రహాస నాటకమును ప్రదర్శించిరి. దేవరకొండ సుబ్బారావుగారు దీని నభినయించిన కాలక్షేపములో చంద్రహాస ప్రదర్శన ప్రథమపరిచయము నాకు గల్గినది.

"చంద్రహాస" శుద్ధ అసందర్భపు నాటకము. "తానొకటి తలచిన దైవమొకటి తలచు" ననియు "సురక్షితం దైవహతం వినశ్యతి (అరక్షితం తిష్ఠతి దైవరక్షితం) జీవత్యనాథోపి వనే విసర్జితః కృతప్రయత్నోపి గృహే న జీవతి" అనియు మానవజీవితము పేకాటవలె నదృష్టమయమై అవితర్కితపరిణామ పరిస్థితుల నొప్పుచుండుననియు ఈ మొదలగు జీవితానుభవములు చంద్రహాసలో బ్రకటింపబడినవి. అందుచే జీవితానుభవముల కిందు సాదృశ్యమేర్పడుచున్నది. కాని అదృష్ట స్వరూపమును చీట్లజూదములో కుక్కుటరణకూటములో పరీక్షింపవలయునే కాని, భావరాగరసరంగములగు నాటకములందీ యదృష్టతత్త్వమున కెడమీయగూడదు.

దుష్టబుద్ధి పుట్టిననాట నుండి యాతని లౌకిక జీవనాంతము వఱకు అన్యాపత్కాంక్షియై అన్నములో మన్నుపోయుచు, పరులసంపదల సైరింపనేరక తనకైనను పరులకైనను నిరంతరము కీడుదలంచు వికృతపుమానసి, ఒకవిధమైన దుర్నీతిగల పిచ్చివాడు. ఈతని చర్యలందు దుర్నయసమాధి యొకనిముసమైనను బహిర్గతమై దయాదాక్షిణ్యముల కవకాశము లిచ్చియుండలేదు. లోభము, రాజ్యకాంక్ష, క్రౌర్యము ఈతని మానసమున జెలరేగుచుండెను. ఇట్టివాడు లోభక్రోథయోగోపలబ్ధి భీకరాకృతితో నసహ్యముగ దోచుచు నమాత్యలక్షణంబగు నయవికాసముల నొప్పకుండును. కథా సందర్భమున తాననేక రాజుల బరిమార్చి గెలిచిన తెరంగు లభివర్ణించి యున్నాడు. కేవల పరాక్రమముచే జయము వాటిల్లదు. రాజ్యకార్య నిర్వాహకుడు "యస్యచాప్రియమన్విష్యేత్ తస్య కుర్యాత్ సదాప్రియం" అను నీతి ననుసరించి సంతోషముగ నుండవలెను.

---

**126. చంద్రహాస :** ధర్మవరం రామకృష్ణమాచార్యుల రచన. ఈ నాటకం అసలు పేరు "అభిజ్ఞాన మణిమంత నాటకము".

దేవరకొండ సుబ్బారావుగారు[127] దుష్టబుద్ధిని లోకక్రోధమాత్సర్యావేశ పూరితుడైన యలౌకికునివలె బ్రదర్శించియున్నారు. దుష్టబుద్ధి మంత్రి శేఖరుడైనందున తియ్యనిచూపులతో, కమ్మనినవ్వులతో, చన్నీటితో చంపువానివలె గోచరించుచు నేకాంతమున నేత్రస్ఫురణచేత దురుద్దేశ్యముల బ్రకటించుచుండ వలెను. అంతియెకాని ప్రకటముగ సర్వావస్థలలో నైజదుర్గుణము చాటింపకూడదు. అది వీని ప్రకృతియైన యెడల మహామంత్రి పదవి లభించియుండదు. అదికాక రాజ్యతంత్రజ్ఞుతల యాలోచనలు "ఫలానుమేయా ప్రారంభాః సంస్కారా ప్రాక్తనాఇహ" అనునట్లు గుంభితములై వాగ్రూపమున వెలువడక "నోరు దాటితే కోటదాటు" నను భయముతో నేకాంతమందైన గూఢస్వభావముతో నుండును. ఉల్టాసీదా చేయు దుర్మార్గులు తమ దుర్నయప్రచారమును వ్యంగ్యముగ జూపుదురేకాని ప్రకటముగ నభినయించరు. సుబ్బారావుగారు రాజ్యతంత్రజ్ఞుని స్వభావానుకరణమున క్రమశిక్షణనొందినట్లు లేదు. కాని దుష్టబుద్ధి దుష్ట స్వభావమును ఔచిత్యమెట్లున్నను ఆద్యంతములవరకభినయించిరి. మదనుని వలన చంద్రహాసుని మదనస్థితి నెరుంగలదచినపుడును "విషయ" వైధవ్యమూహించి నపుడును, చంద్రహాసునెడ తన క్రౌర్యము నిర్హేతుకమనియు, నిష్ఫలమనియు నెరింగినప్పుడును జరుగుపట్టులలో సుబ్బారావుగారు ప్రేమ, లోభము, స్వప్రయోజనదురంధరత్వమునకును, నిజమనీషావేశములకును గల వైరుధ్య మందముగ బ్రకటించిరి. దుష్టబుద్ధి బలము, ధైర్యము, ఉపాయము, నిజశక్తి పరిజ్ఞానము కలవాడు. పన్నుగడలెన్ని తెగినను గిరీశం వలె "డామిట్" అని ధైర్యము వహించు దుర్నయదీక్షాపరతంత్రుడు. మ్యాక్‌బెత్ వంటి నైజముకాని, హ్యామ్‌లెట్ వంటివాడు కాడు. సుబ్బారావుగారు దుష్టబుద్ధిని నిరుత్సాహియై, ఉపాయహీనుడై పిచ్చెత్తినవానివలె నటించెను. భావోన్మాద మెట్టిపాత్ర కుచితమో, ఎందున నసందర్భమో, యోజింపజాలమికి వీరి నధిక్షేపించిన లాభమేమియు లేదు.

---

**127. దేవరకొండ వెంకట సుబ్బారావు :** చూ. వివరణ **62 & 46.**

కృష్ణమాచార్యులుగారు[128] దుష్టబుద్ధిని పాడుచేయుటయేకాక, చంద్రహాసుని రాజ్యాభిషిక్తుడై జనామోద ముప్పొంగ బాలించువాని, ధర్మనీతు లెఱింగినవాని, ''దూతముఖః'' అను ప్రధానధర్మ మతిక్రమించి రాజమర్యాదావిధ్వంసకంబుగ దుష్టబుద్ధి పిలుపున నాతని వసతి కొంటిమై జనుదేరజేయుట అసంభవకల్పకమగుటయే కాక లౌకికపరిజ్ఞాన దారిద్ర్యమును కూడ వెల్లడించుచున్నది. ఎటులైనను చంద్రహాస ప్రదర్శనానుకూలమగు నాటకము కాదు.

## మంత్రి రాక్షసుడు[129]

రెండువేల మూడువందల సంవత్సరములకు పూర్వము నందులను రాజసత్తములు పాటలీపుత్రము రాజధానిగ రాక్షసామాత్య రక్షితులై మగధ సామ్రాజ్యమేలుచుండిరి. చాణక్య బ్రహ్మచారి మలయాచల సమీపమున గేరళ మభ్యసించి సంచారవశమున కుసుమపురమునకేగి యచ్చట విశ్వాసపాత్రులును, బుద్ధిమంతులును, ఆజ్ఞానువర్తనులునగు పలువురు ధీమంతులకు యొజ్జయై వెలుగుచుండెను. నందజుడగు మౌర్యుడాతని శిష్యవర్గమున జేరి నయప్రభావమున జగద్విఖ్యాత తంత్రజ్ఞుడగు కౌటిల్యుని యాశీర్వచన సంపదల నొందుచుండెను. నందులు మౌర్యుల జూడజాలక నాతని నిడుమల గుదుపుచుండిరి. చాణక్యునిగూడ పరిభవించిరి. చాణక్యచంద్రగుప్తుల విరోధస్థానమొక్కటాయెను. అంత నర్థవాఙ్మయవిధాత, భార్గవప్రతిమానదీక్షాప్రభావుడై పలువురు రాజులంగూర్చి సైన్యములజేర్చి, నందాన్వయము ద్రుంచి, మగధ సామ్రాజ్య సంపదల మౌర్యుని కైవసముచేసి, వానికి గేలూతయొసగి, సాహాయ్య మొనరించిన రాజపుంగవుల భావిభయభీతిచే రాక్షసామాత్య ప్రేరితములైన మౌర్యవినాశకారణములనే మడియింపజేసెను. ఈగతి చంద్రగుప్తు నిఖిలావనీనాథుగ నొనర్చియు రాజ్యధూర్వహసమర్థుడగు మంత్రిపుంగవునొకని జేర్చవలసి వచ్చెను. చాణక్యుడు బ్రహ్మచారి. లౌకికపంక సంసర్గవిద్వేషి. తపోవనమున జూపునిలిపి

---

**128. కృష్ణమాచార్యులుగారు :** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు. చూ.వివరణ **4.**

**129. మంత్రి రాక్షసుడు :** ముద్రారాక్షసం నాటకంలో ప్రధాన పాత్రలలో ఒకటి.

ప్రతిజ్ఞానిర్వహణదీక్షచే రాచకొలువును గైకొనినసన్యాసి. వీని మతమున నందప్రధానుడగు రాక్షసుడే మగధరాజ్యమును నడిపింపనేర్చిన ధీయుతుడు. రాక్షసామాత్యుడు నందాభిమానమునను, కులహీనుడగు మౌర్యుని సహింపజాలకయు, వానికి విరోధిపక్ష మవలంబించి ప్రవర్తించుచుండెను. కౌటిల్యుడెట్టకేలకు ముద్రాంగులీయక సాహాయ్యమున రాక్షసుని సాధించి చంద్రగుప్తుని ప్రధానశిరోమణిగ జేసి తా వనంబునకరిగె.

ముద్దుటుంగరపుబలిమిచే మంత్రిరాక్షసుని విరోధ తంత్రముల సాధించి మాగధాహితరాజన్యవినాశ మేర్పఱచి యనూనమేధాప్రభావసంపన్నుడగు రాక్షసుని మౌర్యసామ్రాజ్యకర్ణధారునిగ నియమించిన కౌటిల్య తంత్ర ప్రభావముల దెలుపు "ముద్రారాక్షసము" సంస్కృతమున విశాఖదత్తుడను కవిచే రచియింపబడినది. దీనిని తిరుపతి వెంకటేశ్వర కవులు తెలిగించిరి. ముద్రారాక్షసము వీరకరుణరసముల కాలవాలము. కౌటిల్యదీక్షానిర్వహణ మొక్కప్రక్కను, దైవవశమున పరమతిప్రభావమున, నిజసత్వభావాటంకమున, రాక్షసగర్వనిరోధ మొకప్రక్కను ఈ నాటకమున నీతినైపుణ్యముతో జూపబడినది. రాచకార్యములందు కుతంత్ర  ముపయోగింపునట్లు సద్గుణపుంజంబులుపకరింపవు. చాణక్యుడు మంచివాడే. రాక్షసుడంతకన్న మంచివాడు. ఇద్దరును గుణగ్రాహులు. ఇద్దరు సమర్థులు. కాని చాణక్యునియనుచరులుచిత కార్యనియంత్రులు, విశ్వాసపాత్రులు. చారుల నేర్పరచు నేర్పరి చాణక్యుడు. అనుచరుల శక్తియుక్తులెరింగి నియమించు ప్రోడ. రాక్షసుడన్ననో కరుణాంతరంగుడు. ధీరోదారగుణశీలుడు. కాని మానవస్వభావనిర్ణేత కాడు. అందుచే లౌకికవ్యాపారముల నిగూఢచింతనుడగు చాణక్యున కోడిపోయెను. ఈ యుభయుల గుణతారతమ్యముల జక్కగ గుర్తించి రసపోషణ ముచితముగ జేసినందున సంస్కృతనాటకములన్నిటిలో ముద్రారాక్షసము శీలవిన్యాసమున (Characterization) వన్నెకెక్కినది. ఇందు వనితావిలాసవిభ్రమానంద మేమియు లేదు. చంద్రగుప్తుడే నాయకుడు. రాక్షసామాత్యుడే నాయిక. కౌటిల్యతంత్రమే సంధాత. ముద్రయే కార్యసంపాదక సాధనము. భావోద్దీపనము మెండు. రసప్రచార మద్భుతము. పాత్రపోషణ ముత్కృష్టముగ నిర్వహింపబడినది. నేపథ్యరచన లంతగలేవు. అడవులు కాలుట,

పాములు గఱచుట, భోరున ఏడ్చుట, టింగుంరగుమను నాయికానాయక సంభాషణములు, హాస్య విష్కంభములు మున్నగు జనరంజక విధానము లీనాటకమున లేవు. దీని ప్రదర్శించుటలో నప్పటి చారిత్ర విషయముల జక్కగ నేర్వలయుటయేగాక యుత్తమాదర్శముతో నీచకార్యప్రవృత్తియు, నీచప్రవృత్తుల జిక్కుకొనిన యుదారమానస మేరీతిగ మెలంగునదియు దెలియవలయును. ప్రేక్షకులు కూడ మానససంచార విజ్ఞాతలై లలితరసావిర్భావరీతుల నెఱింగి యుదారగుణస్వభావముల శీలవర్తనమారసి యుండవలయు. ముద్రారాక్షసపు కథాస్వభావము నెరింగి చూచినచో తెలుగునగాని, సంస్కృతమునగాని యింత తెలివిగల నాటకము వేరొండులేదని స్పష్టమగును. కాని ప్రేక్షకులిద్దానిరస మనుభవింపదలచిన కోరికతో జాగృతతో పరిశీలింపవలయునుగాని హాస్యగీతాప్రణయ సందర్భముల నుదయించు లాఘవానంద మిందున నేర్పడదు. మెలకువతో నీ నాటక నియమముల నెరింగిచూచిన మిక్కిలి యందమైన ఆట యనుటకు సందియము లేదు. బందరులోని శ్రీముత్తరాజు సుబ్బరాయ మెమోరియల్ క్లబ్బువారీనాటకరాజమును మనోహరముగ బ్రదర్శించిరి.

మంత్రిరాక్షసుడు ప్రాచీన హిందూరాజ్యముల నలంకరించిన ప్రధాన శిరోమణులలో నొకడు. ఆ కాలమున నార్యావర్తము యవన చీన పారశీక సైన్యప్రవాహములచే దల్లడిల్లుచుండెను. హిమాలయ ప్రాంతరాజ్యాధికారులు పరరాజ్యాపహరణకాంక్షులై యన్యోన్యవైరములతో నల్లాడుచుండిరి. ఆర్యావర్తము ఏకచ్ఛత్రమున జేరలేదు. శత్రు ప్రచారముల నడ్డగింపుచు, నార్యావర్తభూజానుల స్వరాజ్యసంరక్షణాభిముఖులుగ నొక్కనీతిసూత్రమున బంధింపవలసివచ్చెను. ఈ రెండు కార్యముల ననుకూలింపదగు నైతిక, తాంత్రిక, క్షాత్ర, ప్రతిభావిశేషముల నొప్పి యశోక వివర్ధమానమై జగద్వ్యాప్తమై, బౌద్ధమతసిద్ధాంత విపులవ్యాపారకారణమై, జెన్నొందియున్న మగధ సామ్రాజ్యబీజమును మొలిపించి బాలారిష్టములు గలుగకుండ కాపాడి వన్నెకెక్కిన యపారధీయుతు డీరాక్షసుడే. పార్థపౌరుషము, రామప్రతాపము, భార్గవరాజ్యతంత్రము, సూతవిజ్ఞానము, రంతిదేవుని కరుణాంతరంగము, వైరోచనుని యౌదార్యము, భక్తి ప్రేమ విశ్వాసములు, ధ్రువప్రతిమాన దీక్షాపర్వతము నేకీభూతమై రాక్షసుని

యసమానరాజ్యధూర్వహ సమర్థునిగ నలంకరించియుండెను. రాక్షసుడు రణవ్యూహనిర్ణేత, రాజ్యతంత్ర స్వతంత్రుడు, వేదాంతి, పరతత్త్వ ప్రభావమును నమ్మువాడు, శ్రోత్రియుడు, ధర్మాభిజ్ఞుడు, విశ్వాసపరుడు, కర్మిష్ఠి, ప్రభుసేవారతడు. నిశ్చల ప్రేమానుబంధమున సుహృద్ధర్మముల నిర్వహించు మహాభిమాని. స్వార్థత్యాగ గుణాలంకృతుడు. ఆశ్రితపక్షపాతి. ఇట్టి సర్వశక్తివంతుడై రాజ్యకళాసంచారశీలుడైన యమాత్యశేఖరునకిట్టి లలితసద్గుణ సముదాయసంపత్తి యలవడుటే రాక్షసపాత్రమందలి మహావిచిత్రము. చాణక్యవాక్యమున నీతడు –

**గీ॥ మిగుల జాగ్రత్తగా నుండదగిన గొప్ప**
**పన్నుగడ లెన్నియేనియు బన్ని యీ మ**
**హానుభావుడుకాడె యాయాసపెట్టె**
**మౌర్య సైన్యంబు చాణక్యమతియుగూడ॥**

ఇట్టి గడుసరి, చారులవలన చాణక్యచంద్రగుప్తుల విరోధ మెరింగినపుడార్ద్రాంతరంగుడై చంద్రగుప్తున కట్టి దుర్జనవిరోధ మేరీతి బరిణమించునో యని చింతింపదొడగెను. రాక్షసుడు నిజప్రభావవివేకియయ్యును దైవసంకల్ప వైచిత్ర్యముల నెక్కుడు నమ్ముచుండెను. వీనియాశయములన్నియు దైవంచింతములై "నా మతియుం నీతియుగూడ మౌర్యునకె సంపాదించె శ్రేయోగతుల్" అనునట్లు పరిణమించుచుండెను.

నందు లంతరించిరి. రాక్షసుడు ధర్మాభిజ్ఞుడగుటచే మంచికులములోని క్షత్రియుడే నందరాజ్యమున కర్హుడని యోచించుచుండెను. చంద్రగుప్త మౌర్యసంజనన మాతని వంకరపనులు, ఈతనికి యసూయగల్గింపు చుండెను. నందవంశమున నెవరునులేకున్నను మలయకేతువునైన రాజ్యాభిషక్తుజేయదలచి నందుల పగదీర్పదలచి స్వామిభక్తిని నిలుపదలచి –

**గీ॥ శత్రువుల నెల్లఁ జంపిన, స్వర్గమేగి**
**యున్న యొడయందు ముదమొందునన్నయాశ**
**చేత నొరులకు దాస్యంబు సేయుచుండె**
**రాక్షసామాత్యుఁడును నీత్యపేక్షదవిలి ॥**

రెండవ యంకమున రాక్షసుడు తన వైరాగ్యమును నందకుల వినాశనమునకు వగపును, శత్రుసమ్మర్ధనమందనురక్తియు బ్రకటించుచు ప్రవేశించును.

ఆ సందర్భమున నీతడు శోకరసమగ్నుడయ్యు నుద్యోగభారమున ధైర్యము వహించియుండ నాతనితంత్రములెల్ల చాణక్యమతి దగ్ధమగుటయు, నీతనిమిత్రులు పురము నుండి వెడలగొట్టింపబడుటయు, మిక్కిలి నెచ్చెలియగు చందనదాసు పుత్రమిత్రకళత్రాదులతో కారాగారమున నుంచబడుటయు చారులవలన విని నిరుత్సాహుడైయుండె; ఆపట్టున శకటదాసు చాణక్యునివలని యపాయము తప్పించుకొని తన్ను జేరుటవలన నూతనాశావికాసములు రాక్షసుని నుత్సాహపరచెను. కైవసము దప్పినదనుకొనిన జయాకాంక్ష వానిడెందమున జిగురెత్తదొడగెను. ఈ యంకములోని రసక్రమమంతను లక్ష్మీకాంతముగారు చక్కగా పరిశోధించి యభినయించిరి. వీరి వేషరూపములు నానాపడినావీస్ మంత్రిపుంగవుని యపరబింబమో యనునట్లు యొప్పిదమై గన్పట్టుచుండెను. రాక్షసామాత్యుని గుణవిశేషములన్నియు వీరి యభినయప్రవాహమున ప్రకటితమై, బుధానందదాయకములై యుండెను. అంకాంతమున ధైర్యవిశ్వాసములతో దీక్షానిర్వహణనిరతుడై చాణక్యచంద్రగుప్తులకు పరస్పర విరోధము లేర్పడునను నమ్మకముతో నుప్పొంగుచు రంగస్థలంబును వీడునపుడు లక్ష్మీకాంతముగారి యభినయ సౌష్ఠవము మహామంత్రుల పోకడల నెఱింగినవారి కందఱకును స్వభావసిద్ధముగ దోచకమానదు.

మంత్రి రాక్షసుడు నందుల మంత్రి; జగద్ విఖ్యాత యశస్సంపన్నుడు. రాజాధిరాజు లాతని యనుగ్రహ మరయచుండిరి. స్వతంత్రుడు, విద్యావిభూతుల జెన్నొందు గృహపతి. తన ప్రభువులు చచ్చియుండిరి. చంద్రగుప్తుని కొలువు నాశింపలేదు. మౌర్యశిబిరమున నసహాయ్యుడై యరుదెంచి చాణక్యవంచితుడై నశించిన పర్వతేశ్వరుని తనూజుడగు మలయకేతు నుద్ధరింపనుద్యుక్తుడై, రాక్షసామాత్యుడు వానితో స్నేహభావమున మెలగుచుండెనుగాని, రాక్షసుడా రాకుమారుని సేవక జనంబుల జేరినవాడు కాడు. ఈ స్థితి నెఱింగి లక్ష్మీకాంతముగారు స్నేహప్రాయమైన సమవర్తనమున మలయకేతునెడ

నభినయించిరి. ఇది మిగుల సమంజసము. చాణక్య నియంత్రులై రాక్షసామాత్యుని విశ్వాసగౌరవాదరణముల బొంది యాతని వంచింపనెంచిన భాగురాయణప్రముఖ గూఢవర్తనులు నిర్దోషియగు రాక్షసునకు దోషారోపణము జేసి మలయకేతుని నమ్మించినపుడు రాక్షసామాత్యుడు ఆవంతయైన గింజుకొనక తన తంత్రసత్వమును ఋజువుపరుపయత్నింపక, నిర్లక్ష్యముగ నుండెను. ఈ సందర్భమంతయు శత్రు ప్రయోగమేయని నిశ్చయించియు మారాడక యూరకుండెను. కాని దైవ పరిణామమున కాతడొకింత కినిసియుండెను. ఆవల మలయకేతు వాతని నిరాదరింప రాక్షసుడాత్మనాశనమపేక్షించి మిత్రుడగు చందనదాసు నొకసారిచూచి మడిసెదనని కుసుమపురపరిసరోద్యానభూములజేరి యచ్చట తన పూర్వపోషకుల విహారవిలాస సంపదల సంస్మరించి కన్నీరు గ్రమ్మియు, విఫలమనోరథుడగుకతన నిర్విణ్ణుడై నిలచియుండెను. ఇట్టి సందర్భమునకు నైజమగు నిశ్చేష్టా స్వభావమును లక్ష్మీకాంతముగారు చక్కగ ప్రకటించిరి. ఆవల మిత్రార్థమై చావనెంచిన పురుషుని వృత్తాంత మారసి చందనదాసు మరణశిక్షాసన్నద్ధుడగుట నాలకించి రోషప్రబుద్ధసమరోద్యోగభీకరుడై కత్తి విప్పిన తెరఁగున కూడ లక్ష్మీకాంతముగా రతినైపుణ్యముగ జూపించిరి. చందనదాసుకడకేగి వాని నభినందించి యోదార్చు సమయమున చందనదాసుపై గురిపించిన గుణాభివర్ణనమే రాక్షసున కొప్పియుండెను. మిత్రవాత్సల్యమున నందవినాశనోజ్జ్వలితమై, యపకార పరంపరోద్ధూతమై, సజ్జనసన్మిత్రదుఃఖోజ్జ్వలితమైన కోపజ్వాలలెల్ల దిగమ్రింగి మిత్రావనోత్సాహియై, చాణక్యతంత్రజాలంబున జిక్కి, సేయునదిలేక తన యాత్మగౌరవమును, దీక్షాపరత్వమును, మౌర్యునియందసహ్యమును, కౌటిల్యునిపై గల యసూయతను ప్రణయప్రభావమున కర్పించి చంద్రగుప్తుని మంత్రిత్వ మంగీకరించి,

> **"నందుల ప్రేమవాయదు మనంబున; భృత్యుడనైతి విద్విష**
> **ద్బృందము సేయు మాయలకు; బెంచిన చెట్లనె త్రుంచినాడ నే**
> **మందు? ధరింతుగత్తి జెలిప్రాణము నిల్పుటకై, వశత్వమున్**
> **జెందకయుండరాదు విధిసేతలకున్ విధికైన నక్కటా!"**

అని సమ్మతించి చందనదాసును విడిపించెను. చాణక్యుని ప్రతిభావిశేషమున

కామంత్రిపుంగవుడచ్చెరువంది కొనియాడెను. మంత్రి రాక్షసుడు కరుణాంతరంగుడు, దయాళుడు, ప్రభుభక్తి, మిత్రవాత్సల్యము మున్నగు సుగుణములతో రాజిల్లు మేధావి, ఆరని యభిమాని, బుద్ధి పౌరుషసంపన్నుడు, కాని మిత్రకష్టమున కోర్చువాడు కాడు. వీని యుదారసాహసము, అసహాయ శూరత్వము, వ్రతస్థైర్యము రోషభీషణావేశములన్నియు మిత్రాపదాపనార్థమై కరిగిపోవుచు “నిండుమనంబు నవ్యనవనీత సమానము, పల్కు దారుణా ఖండల శస్త్రతుల్యము జగన్నుతవిప్రులయందు నిక్క” మను రీతి మెలంగి దైవోపహతుడై మౌర్యసేవాస్థితిని పొందవలసి వచ్చెను. లక్ష్మీకాంతముగారీ యుదార గుణభూయిష్ఠమగు పాత్రము నతినైపుణ్యమున నిర్వహించి, ముద్రారాక్షస కథా సందర్భవిజ్ఞాతలందరిని, ధీరోదార కరుణారస ప్రదర్శనాది దిదృక్షువులందరిని చక్కని భావ ప్రకటనాభినయమొనర్చి యానందింప జేసిరి.

## చారిత్రక నాటకములు

పందొమ్మిదివందల యేడవ సంవత్సరమున నాసేతు హిమాచలము విపులముగ దేశాభిమాన మంకురించినది మొదలు 1919లో గాంధిమహాత్ముని యాచారానుక్రమమున నిర్భయభావప్రకటనము మొదలిడువఱకును మన తెలుగుకవులనేకులు చారిత్రకరూపకముల ననేకముల వ్రాసిరి. కొందఱు భారతగాథల ననుసరించి వీరరసప్రధానముగను కొందఱు రసపుత్ర చరిత్రాంశముల గైకొనియు, కొందఱు బొబ్బిలి మున్నగు స్థానిక కథాసందర్భముల నందికొనియు నాటకములను వ్రాసిరి. దేశాదర్శముల ప్రాబల్యమున తొంటి భక్తి, శృంగార రసాత్మకములగు నాటకములకన్న నీ యైతిహాసికములే వన్నెకెక్కి దేశమందంతటను ఆడఁబడజొచ్చెను. దేశములో ప్రజలకు ఆంగ్లేయులమీదను వారి పరిపాలనారీతుల మీదను వారు అధికార సంస్థాపనారంభమున నేమి, కరగత రాజ్యసంరక్షణమున నేమి దుర్వార్యులై, నీతిదూరులై యొనర్చిన మహాపాతకముల మీదను న్యాయమైన ద్వేషాసూయములు ప్రజ్వరిల్లెను. కాని తమ పరితాపమును బహిరంగముగ వెల్లడించగల బంటుతనము లేమిచే నీ కోపమును మహమ్మదీయుల కాలమునకు త్రోసి పరిశోధన చాలకయో హిందూ మహమ్మదీయ పరస్పర ద్వేషానల పరిపోషణానురక్తతనో వికృతముగ వ్రాయబడిన

ఆంగ్లచారిత్రకుల ఇతిహాసముల ననుసరించియో తమ యావేశమును నిరపరాధులగు మహమ్మదీయులపై జూపుచువచ్చిరి. ఇట్లు చేయుటచే నాటకకవులు ప్రజలలో వీరదేశాభిమానవీచికల నుత్పత్తిచేసియు హిందూ ముసల్మాను సమ్మేళనమునకును హిందూదేశస్థుల సోదరభావ విభూతికిని కడలేని కీడొనర్చిరి. ముసల్మాను ద్వేషపోషకములగు నాటకముల నాడినంతకాలమందలి భావముల నెంతవఱకు ప్రకృతాశ్రయములయినను అందెంతటి యప్రస్తుత ప్రశంసాంశములున్నను ఆంగ్లప్రభువులు వాని బహిరంగముగ నాడనిచ్చిరి. ఆ భావములనే తమ యెడల యథార్థముగ ప్రకటింపు గాంధి నాటకము, స్వరాజ్యసోపానము[130] మున్నగువాని వెంటాడి దగిలి వానిని జేయుచున్నారు. మనవారు మాత్రము ఈ తత్వమును గ్రహింపజాలక ముసల్మాను దురంతముల దుర్ణయముగ దిట్టునట్టి దుశ్చారిత్రకథాంశములనే ఇప్పటికిని యభినయించుచున్నారు. ఇది మిక్కిలి శోచనీయమైన విషయము. ఇది ఇకనైనను మానదగినది.

హిందూ మహమ్మదీయ పోరాటముల ముచ్చటించుచు కొంతవరకైన తొల్లిటి యాంగ్లచారిత్రకుల అసమగ్రపరిశోధనల ననుసరించి వ్రాయబడి – ప్రస్తుతము తెలుగుసీమలలో జనామోదములై ఆడబడుచున్న నాటకములలో మహామహోపాధ్యాయ వేంకట్రాయశాస్త్రిగారి[131] ప్రతాపరుద్రీయము, కోలాచలము శ్రీనివాసరావుగారి రామరాజ్య[132] వినాశనము, ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారి

---

**130. గాంధీనాటకము :** "గాంధీ విజయ నాటకం", "స్వరాజ్య సోపానము" : ఈ రెండూ దామరాజు పుండరీకాక్షుడుగారి నాటకాలు. ఈ నాటకాల ప్రదర్శనల మీద బ్రిటీష్ ప్రభుత్వం నిషేధాజ్ఞలు విధించింది.

**131. వెంకట రాయశాస్త్రిగారు :** వేదం వేంకటరాయశాస్త్రిగారు. పండితులు. వ్యాఖ్యాత. నాటకకర్త. స్వయంగా ఆంధ్ర భాషాభిమాని సమాజాన్ని స్థాపించి తన నాటకాలకు దర్శకత్వం వహించి ప్రదర్శింప చేసిన వ్యక్తి. ప్రతాపరుద్రీయం, బొబ్బిలియుద్ధం, కాళిదాసు నాటకానువాదాలు ఆయన ప్రఖ్యాత రచనలు.

**132. కోలాచలము శ్రీనివాసరావు :** బళ్లారిలోని సుమనోరమ సభకు అధ్యక్షులు. ప్రఖ్యాత నాటక రచయిత. ఆంధ్ర చారిత్రక నాటక పితామహుడుగా పేరుపొందారు. ఫాల్ ఆఫ్ విజయనగర్ అనే పేరు గల రామరాజ్య వినాశనము, సునందినీ పరిణయము మొదలైన నాటకాల రచయిత.

రసపుత్రవిజయము[133] ముఖ్యములు. ఇందు శ్రీనివాసరావుగారి పొత్తము ఆంధ్ర చరిత్ర మంతలో ఘనతమమై సారస్వతసంబంధమున మఱపురాని విద్యానగర సామ్రాజ్య వినాశనమును దెల్పునది. కాన ప్రజాహృదయమున శోకనిర్భేదముల నెక్కువ జనింపజేయుచు నెక్కువ ఆదరింపబడుచున్నది. మఱియు నిందు నాటక ప్రపంచ చారిత్రకులైన[134] శ్రీనివాసరావుగారు తమ యాంగ్ల నాటక పరిచయ సంపత్తిచే షేక్స్పియరు కృతులలో హ్యామిలెట్ బ్రూటస్ పాత్రముల మనోవృత్తుల గొన్నిటిని తమ పటానుని అలంకరించినందున యీ నాటకమున రసోద్రేకము మిక్కుటముగ జేరియున్నది. మఱియు నాట్య చమత్కృతికి నవకాశములును మెండుగ నిందు గలవు. కథాంశము సకలాంధ్రావని రసికాదరణ యోగ్యమైనను శ్రీనివాసరావుగారు పలుతావుల చారిత్రకవిరుద్ధముగను, స్వభావవిరుద్ధముగను, శాస్త్రవిరుద్ధముగను ఈ నాటకమును రచియించిరి. కీర్తిశేషులై తప్పులు సవరింపనేరక తమకృతుల శాశ్వతకాలముద్రా సంరక్షితముగ జేసిన కవివరుల నిరపాయము నాక్షేపింపబూనినే వ్రాయుటలేదు. కాని నటులు కాలానుసారముగను, భావానుసారముగను, సత్యానుసారముగను నాటకములను సంస్కరించి యభినయించు స్వాతంత్ర్యముగలవారగుటచే ఇప్పటికైనను రామరాజ్య వినాశనమును న్యాయ్యముగ సవరించి యాడుదురను ఆశచేత ముగ్గురు పటానుల విమర్శనము బ్రచురింప నెంచితిని.

## ముగ్గురు పఠానీనటులు

నేను చూచిన పఠానులలో బళ్ళారి రాఘవాచార్యులగారు అందమైన విగ్రహముగల్గి యాషాబితోడి శృంగార రసఘట్టములందును తుట్టతుదకయిన బీభత్సప్రదర్శనమునందు చక్కగ నభినయించి యున్నారు. వీరి బ్రహ్మత్వము పఠానుదుస్తులచే మరుగుపడలేదు. రోషావేశము వీరియందంతగా నగుపడలేదు. సంగీతమును పాడుటయందును, రంగ రచనా నైపుణ్యముచేతను వీరిచే

133. **"రసపుత్ర విజయము" :** ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణరావుగారు రాసిన నాటకం. చూ. వివరణ 80.

134. **నాటక ప్రపంచ చారిత్రకులు :** శ్రీ కోలాచలం శ్రీనివాసరావుగారు ప్రపంచనాటక చరిత్రను ఆంగ్లంలో The Dramatic History of the World అనే పేరుతో రచించారు.

ప్రదర్శింపబడినయాట మిక్కిలి చక్కగ నుండెను. వీరితో నాడిన రామచంద్రుడును ఆషాబిపాత్రధారియు ఆ వేషమును ధరించిన విశ్వానాధరావను బాలుడును రాఘవాచార్యులవారి యభినయ సౌష్టవమున కెంతయు దోడ్పడిరి.

బందరులోని దేవరకొండ వెంకట సుబ్బారావుగారు విగ్రహమున పిన్నలై కొంత గాంభీర్యలోపము గల్గియుండినను, వారి నైజరూపవిలాసములు పఠానుని మీసగడ్డములమాటున మరుగుపడి శృంగార ఆటంకకరప్రకటనములు కల్గినను, రోషభీషణస్ఫురణ మానేత్రముల నుండి యంతగ వెలువడకుండినను, మన పఠానునకు నైజమైన గుణములనన్నిటిని నతిశ్రద్ధతో విమర్శించి చక్కగ నభ్యసించి ప్రవేశము మొదలు తుదివఱకు పఠానుని నైజస్వభావమును అతిస్వాభావికముగ ప్రదర్శించిరి. పఠానునకు భావసంక్షోభము గల్గినప్పుడును, ఆషాబిమానభంగ సమయముననను, నాటకాంతపుటున్మాదముననను వీరు శ్రీనివాసరావుగారి నాటకమునకు జేసిన రూపక వ్యాఖ్యానము మిక్కిలి జాగరూకతతో రసజ్ఞతతో విశేషాభ్యాసమున జగత్సువనీయముగ జేయబడినది. వీరును రాఘవాచార్యులవారును పఠానుగుణవిశేషములను పైజెప్పినరీతి విమర్శించినట్లు అగుపడదు. గ్రంథము నందలి కథాసరళి ననుసరించి యొక్కొక్క రొక్కొక్కరసమున నభినయ సౌష్ఠవమును జూపియుండిరి.

బందరులో కీర్తిశేషులైన ఈవన లక్ష్మణస్వామిగారు నాటక సాంప్రదాయములందును, భావవిమర్శనమునందును బహురసాభినయ ప్రకటనా ప్రౌఢియందును, నిసర్గసూరియని చెప్పవచ్చును. వీరు ఈ కథలోని యసందర్భములు గ్రహించియు, పఠానుని యుద్దేశ్యములకు ఘనోదారస్వరూపము గల్పించుటకును, కథాంశమును మార్చివైచిరి. పఠాను విజయనగరమునకు వచ్చి రాచకొలువునజేరి జంగపుకథ వినుటచే గల్గిన యసూయ ఆషాబీ పరాభవ సందర్భమున రోషావేశమహానలమై ప్రజ్వరిల్ల యాషాబియందెట్టి మోహావేశమును పొందకయే యాషాభిమానభంగమున మహమ్మదీయులకు గల్గిన యవమానమునకు పగదీర్ప సమకట్టెను. రాచకొలువును విడిచెను. గూఢచారుడను నెపమున నీతని ఖైదులో బంధించిరి. యాషాబిసహాయమున కారాగారవిముక్తుడై బీజాపురమునజేరి యచ్చట మహమ్మదీయుల పురిగొల్పి సమర సన్నద్ధులజేసి

తల్లి వలన తన జన్మవృత్తాంతముల నెఱింగియు మహమ్మదీయకుల గౌరవప్రతిష్ఠాపనమునకై దానొనర్చిన మహాశపథమును విడనాడక, క్రమ్మర విద్యానగరమునజేరి యచ్చట నాషాబిసహాయమున రహస్యముగ రిపువ్యూహ ప్రకాండముల గుర్తించి మహమ్మదీయ విజయమును సమకూర్చి, రామరాజుశిరమును ఆషాబిమానభంగమునకు విలువగ నర్పించి, ముద్గల నబాబుచెంతకు నామెను సురక్షితముగ జేర్చి, వీరప్రతిజ్ఞను నిర్వహించి, యావల తన పితృసంబంధ పాపచింతలో భీభత్సరసోద్రేకపూరితుడై, పితృఘాతుక మహాపాపమునకు, విద్యానగర నిర్మూలన సంజనిత పరివేదనాపారవశ్యమున తనకుచితమైన యాత్మహత్య శిక్షను బొంది వీరస్వరూపమును ప్రకటించుకొనియెను. లక్ష్మణస్వామిగారి ప్రతిభచే సంస్కరింపబడిన ఈ కథా సందర్భమునందలి భావగాంభీర్యమునకును ప్రస్తుత నటులభినయించు నీచోన్మత్త పఠాను పిశాచమునకును గల భేదము చదువరులు అతిసులభముగ నూహింపగలరు.

## తిమ్మరసు

("ముగ్గురు పఠాను" లను వ్యాసము వ్రాయునపుడు నాటకమందలి సలకము తిమ్మయ్యను సాళువ తిమ్మరసుగా పొరపడి ఈ క్రింది భాగమును వ్రాసి యుంటిని. ఇది తప్పు అయినను, ఎవరైనను ఆ పురుషుని ద్రోహచింతగలవానినిగా దలంచకుండుటకును, వ్యాసములోని మంచిపట్టును నిలుపుటకును, దాని నుదాహరింప బూనితిని.)

కోలాచలము శ్రీనివాసరావుగారు తల్లికోటయుద్ధమను "రామరాజ్య వినాశనము"లో జేసిన మొదటితప్పు తిమ్మర్సు నెడ జరిగినది. తిమ్మర్సు కృష్ణరాయలనిర్యాణమునకు బూర్వమే గతించెనని కొందరి యభిప్రాయము. గతింపకున్నను, రాయల మృతికాలమునకు మహాప్రాజ్ఞుడైన తిమ్మరసు కడు ముదుసలియై రాజ్యసంసారకాంక్షల విడనాడి, పరవిభూతల నరయుప్రాయం బొందియుండును. ఆ బాల్యము రాయల యాస్థానమున బ్రధానపౌరుడైయుండి, కర్ణాటరాజ్యరమాదురంధరుడై, సేనానీకనేతయై, నీతివిత్తముడై, పరనాగరక ప్రవాహసంక్షుభితభారతభూములందు హిందూపతాక సంస్థాపనమహోద్యమమును

నిష్కళంకముగ నిర్వహించిన తిమ్మరసు జితేంద్రియుడును, శమదమాది గుణాంకితుడును కాక వీలులేదు. జితేంద్రియుడుకాని ప్రజానాయకుడు కానేరడని మానవచరిత్ర తెలుపుచున్నది. బాల్య యౌవన వార్ధక్యములందు సదాచార పద్ధతులలవడిన తిమ్మర్సు, ముక్కాళ్లముదిమిని రాజ్యకాంక్షచే నాశాపిశాచపీడితుడై యుండనోపునా? "ఫణినసూనుకిణాదబాదరాయణసూత్రఫక్కి విద్వాంసు లుపన్యసిం"చు విద్యానగర రాజసభలలో జీవితమంతయు వెళ్లబుచ్చిన తిమ్మర్సునకు ముసలితనములో మూడుముక్కలు వేదాంతమైన పట్టుపడకుండెనా? మఱియు, కృష్ణరాయని బెంచి పెద్దఁజేసి, వింధ్యోదధి సమాక్రాంత మహీవలయ రాజ్యాభిషేకంబు జేయించి "అయ్యయని పిలువడితివి, నెయ్యంబున గృష్ణరాయ నృపపుంగవుచే" నని బ్రాహ్మణవిరోధి యగు భట్టుమూర్తిచే నభినందింపబడిన తిమ్మర్సు తుదకు రాయల వంశక్షయమునకు కారణభూతుడగునా? మఱియు విజయనగర సామ్రాజ్యము తురకలదాడినాపుటకై విద్యారణ్యులచే హిందూమత సంరక్షణమునకై నెలకొల్పబడినది. ఈ వంశమందలి బుక్కరాయలు, నృసింహరాయలు, కృష్ణరాయలు ముప్పురును హిందూమత సంరక్షణమే ప్రథానాశయముగ మన్నించి తురుష్క దోర్బలసమ్మర్దన గావించిరిగాని కేవల రాజ్యకాంక్షచే దిగ్విజయమొనర్చినట్లగపడదు. అట్టివారల మంత్రిపుంగవుడైన బ్రాహ్మణుడు వృద్ధాప్యములో తన చిరాభ్యస్తములగు నాచారాదర్శ సాంప్రదాయాభిమానముల విడనాడి, తన్ను బలురీతుల పరిభవించిన బీజాపూరు నవాబుల నెయ్యము నపేక్షించుననుట హాస్యాస్పదముకాదా? మఱియు సైన్యము లన్నియు తనవశములైయుండగ కోశాధీశత్వము తనయందుండ, నుద్యోగిజాల మంతయు స్వనియుక్తులై విధేయులైయుండ నీతికోవిదుడగు తిమ్మర్సు యొంటిమై వచ్చిన రామరాజునకు బెదరి, సైన్యాంగముల విడిచి, ధనరాసుల దుమ్ముచేసి, కోటకు నిప్పుపెట్టి, కాలికి బుద్ధిచెప్పెనను వృత్తాంతము లేశమైనను నమ్మదగినదా? తా గల్పించిన మహాసౌభాగ్యమును తానే నశింపజేయగలడా? ఇట్టి సంకల్పము రాగద్వేషపూరితమగు నిండుజవ్వనమున నుదయించిన నుదయింపవచ్చునుగాని, వృద్ధాప్యమున జనించనేరదు. మఱియు కార్యలేనస్, రాజా మానసింగు మున్నగు వారి నడతలజూచినచో ఇట్టి మాతృద్రోహము అమానుషమని తెలియుచున్నది. ఈ కారణములన్నిటిచేతను శ్రీనివాసరావుగారు తిమ్మర్సునకు లేనియపకీర్తి దెచ్చి

పెట్టిరని చింతింపవలసియున్నది. కాకతీయుల వెనుక మిన్నలై నిలువబడి తురుష్క జయధ్వజముల దక్షిణప్రాంతములంజేరకుండగాచి, ప్రాచీన హిందూసంస్కార లేశములనైనను దక్కనునందు నిలువజేయుటలో నెంతయు పాటుపడిన విద్యానగర సామ్రాజ్యమునకు వెన్నెముకయైన తిమ్మర్సు మంత్రి వయఃపరిపాకమున కుచితమైన గురుదక్షిణయా ఇది? ఇంతకు మారు అరసుల కుట్రచేత వెంకటాద్రి మరణించె ననియు సంస్థానమున నిందుచే గలిగిన కుటుంబకలహమును సహింపజాలకయు కృష్ణరాయుని మరణశోకమునకు గుందియు, తిమ్మర్సు రాజ్యభారమును వీడి తుంగభద్రాతటంబుల తపంబున కేగెను, అని చెప్పుట స్వభావముగను, మేలుగను నుండును. ఇంతకన్నను కృష్ణరాయలకు పూర్వమే తిమ్మర్సు గతించెనను వాదము నంగీకరించి యీ మహాప్రధాని యాత్మకు శాశ్వతానందశాంతుల సమర్పించుట మంచిపని.

## పఠాను రుస్తుం

ఇక పఠాను సంగతి విచారింతము. పఠాను రామరాజు కొలువున జేర నుద్యుక్తుడై విజయనగరమునకు వచ్చి వీధుల దిరుగుచు కథకులు హిందూసంస్థానాధీశుల గొనియాడుటయు మహమ్మదీయప్రభువుల దూలనాడుటయు విని యుగ్రుడై విరోధిజన నిర్మూలనము నచ్చుటనే ప్రతిజ్ఞచేసి రామరాజు చెంతకు జేరెను. అచ్చట నిండుకొలువున నాషాబీకి జరిగిన పరాభవమును వీక్షించెను. కోపోద్రేకమును కాలానుకూలముగ నడచికొని సమయమునకై వేచియుండెను. ఆషాబీ పరాభవ సమయముననే ఈతని కాపెయందు మనోభవవికారములు జనించినవి. ఆవల నుద్యానరంగమున వీరిరువురకును సమావేశమేర్పడినది. అచ్చట పరస్పరానురాగప్రకటన మేర్పడుటయేగాక హిందూసంస్థాన వినాశన మేర్పఱచుటయు, రామరాజును జంపుటయు, మహమ్మదీయ మానసంరక్షణము గావించుటయు పఠానునిచే నంగీకరింపబడినవి. అందుల కాషాబిని పరిణయింప నియ్యకొనెను. పఠాను రామరాజు కొలువున నుండి యతనికి తనపై విశ్వాసమొదవునట్లభినయించుచు, ద్రోహచింతతో నాతని నాశనము నపేక్షించుచు, హిందువుల ప్రవర్తనలకెల్ల ఉలుకుచు నుండెను. ఇంతలో బీజపురమున కేగు సందర్భ మేర్పడినప్పుడు అచ్చటి

నవాబులతో విజయనగర వినాశనమునకు పన్నుగడ జేసి తన యాధీనమునసున్న హైందవ సైన్యములతో మహమ్మదీయులకు సహాయమొనర్చెదననియు, రామరాజుకు సమీపవర్తియై విశ్వసితసేనానియై దానుంటజేసి వాని రణభూమిలో వంచించి చంపెదననియు వాగ్దానమొనర్చెను. ఆవల తన తల్లిని దర్శింపబోయి యాపెవలన దాను రామరాజున కుదయించిన విధమెఱింగి యంతటినుండియు డోలాయమానమానసాంతరంగుడై చేయ నేమియు దోపక పితృవాత్సల్యము, ప్రభుభక్తి, మాతృనిర్దేశము యీ మూడు నొకవంకను, ఆషాబీకి బీజపూరు సుల్తానులకు తాను చేసిన వాగ్దానములును ఆషాబీ సభాపరాభవ సంజనిత క్రోధానలంబులను, మహమ్మదీయ రాజ్యదైన్యవిచారమును యీ మూడును మఱియొక ప్రక్కను నూగించుచుండ నిర్వేదమును బొంది వృత్తిరహితుడై యుండు తరి యాషాబీ మఱల ప్రోత్సాహపఱచి వాని క్రూరద్రోహ ఘాతుకోద్యమమును బలపఱచి పంపెను. పఠాను రామరాజుచే సర్వసైన్యాధిపత్యమునందికొని వ్యూహక్రమముల విరోధులకు తెలియజేసెను. ఇదియునుంజాలక రణసీమలో విహితుడుగ చేరువ నుండి యేమరుపాటున రామరాజు గొంతు తెగ నరికెను. ఈ కృత్యమైన వెనుక, హిందూ సైన్యములు చెల్లాచెదరులై పారిన వెనుక మహమ్మదీయ చమూవిజయభేరులు మ్రోగిన వెనుక, కామోద్యోగతత్పరుడై యాషాబీకి రామరాజతలను కన్యాశుల్కముగ నర్పింపవచ్చి యామెను జూచుటతోడనే తన కృత్యమునకంతకును నామెయే కారణమని నిందించి పితృ మరణమున కెంతయు శోకించి విపరీత భీభత్సభావార్ణగర్భవీచికలలో మునుగుచు దేలుచు నున్మత్తునివలె నటించి యాషాబీని చంపి తన్ను దా పొడిచికొని మరణించెను. ఇది శ్రీనివాసరావుగారు రచించిన కథాక్రమములో ఆషాబీ పఠానుల కళ్యాణశుభ పరిణామమును వదలి బళ్ళారి నాటకులును ననుసృతముగ నందఱును ఆడుచున్న కథాసరళియై యున్నది.

ఇందున శ్రీనివాసరావుగారును, నటులందఱును పఠానుని ధీరోదాత్తనాయకునిగా జేసియున్నారు. నాటకాంతమునను యుద్ధమునకు పూర్వమునను పఠానునకు గలిగిన మనఃక్షోభము నభినయసౌకర్యమునకై, రసోద్వేగప్రదర్శనమునకై యుత్తమాదర్శముల పరస్పర సంఘర్షణముగ

బ్రదర్శించుచున్నారు. ఆషాబీ యెడల నున్న కామోద్రేకమును గణియింపకున్నను, పితృవాత్సల్యము, ప్రభుభక్తియు నొకచెంపను, స్వమతాభిమానము, వాక్పరిపాలనము మఱియొక చెంపను పఠానుని మానసము కలవరపరచునట్లును మహూదారస్వభావ ప్రవృత్తిచే పఠానుడు దురదృష్టవంతుడై తుదినొందెనని వీరలూహించి యట్లభినయించుచున్నారు. షేక్స్పియరు మహాకవి చిత్రించిన హ్యామ్లెటునకుగాని, భవభూతి విరచిత శ్రీరామునకుగాని, చంద్రమతిని చంపునెడ హరిశ్చంద్రునకుగాని గలిగిన యుత్తమాదర్శ సంక్షోభములు యీ మొండి పఠానునకు ఆరోపించి యభినయించుట తప్పు. పఠాను విజయనగరమును ప్రవేశించినది మొదలు హిందూరాజ్యవినాశనమునకే పూనియుండెను. అందుకే ప్రయత్నించుచుండెను. యుద్ధారంభ సమయమువఱకును రామరాజు తన తండ్రియని యెఱుంగడు. తండ్రియెడల పుత్రులకుండు ప్రేమసాంగత్యమువలనను పరస్పర సహాయానుభూతిచేతను సామాన్యస్నేహితుల కుండు తెరవుల నేర్పడునేగాని, సృష్టిక్రమమున ప్రపంచోద్ధరణమునకైన పరమధర్మముల ననుసరించి యేర్పడినదిగాదని జీవశాస్త్రములు వక్కాణించుచున్నవి. అసహాయులైన, నిరాధారులైన పసిబిడ్డలు జీవింపజాలమిచే నెక్కువ పోషణ వలసియున్న మానవజాతియందు పిల్లలపై ప్రేమ తల్లిదండ్రులకు అనివార్యమగు ప్రకృతిధర్మమై పుత్రేషణముగ పరిణమించినది. అదియు "ప్రాప్తేతు షోడశే వర్షే పుత్రం మిత్రవదాచరేత్" అను న్యాయమున కొంతకాలము సామాన్యసాంగత్యముగ మారుచున్నది. మహాకవులు కొందఱు యొకరి నొకరెరుగని తండ్రియు కొడుకును ఒకచో జేరినప్పుడు అంతఃకరణ ప్రవృత్తులచేతనే యొకరి నొక రెఱుగగలరనియు "సద్వేష్టి పితరం పుత్రః" యనియు నభిప్రాయపడుచున్నారు. వ్యాసుని వాక్యమే యధార్థమైనచో, తొంటినుండియు పఠానునకు రామరాజునందు ద్వేష మంకురింపజాలదు. మఱియు పఠానునిపై రామరాజు చూపిన ప్రేమాతిశయమువలనైన నీ తనూజ సందర్భమగు అంతఃకరణప్రవృత్తులు బలపడి రామరాజుపై గౌరవము లేకున్నను, వాని తప్పులకు జాలియైనను కలిగియుండును. అంతేగాని పఠాను నిజముగ రామరాజునకు జనియించిన వాడేయైనగాని, ఉత్తమగుణసంపన్నుడైన గాని దాను తన సేవకుడైనను వినయపూర్వకముగ నార్ద్రహృదయుడై రామరాజు తనయందు జూపెడు నాదరణకయినను కృతజ్ఞుడై

రామరాజుతో నతని దుర్నయమును మనవిచేసి యాషాబీని విడిపింప జూచునుగాని నాటకములో జూపిన దుర్మాత్సర్యమును పెంచుకొనజాలడు. ఇది కేవలము అమానుషముగ నున్నది. అట్లుగాక వ్యాసవచన మనృతమేని, పుత్రులకు తండ్రులపై గలుగు ప్రేమ కేవలము వ్యావహారికమే యగునేనియు, యుద్ధారంభమున తల్లి వచించిన సందర్భ విజ్ఞానమున మాత్రము నచిరకాలమునుండి రామరాజుపై పెరుగుచుండిన మతద్వేషము ఆషాబ్యభిలషితవస్తు సంపాదనానురక్తితో పెంపొంది తనతల్లిని చెరపట్టి చెఱచిన యభిమానముతో నుప్పొంగుచున్న పఠానుని క్రోధద్వేషములు ఒక్క నిమేషములో పితృప్రేమగ మారుట యసంభవము. కర్ణుని వంటి మహూదారగుణసంపన్నుడే కృష్ణునివలన తన జన్మవృత్తాంత మెరిగినప్పుడు సూతుని చేతికిం దొఱకి "సూతకళత్రముపాలు ద్రావి యాసూతుని యన్నమున్ గుడిచి సూతకులాంగనయందు నందనవ్రాతము గాంచి నేటి కొకరాజకుమారుడ నంచు దెల్ప నాచేతము సమ్మతించునె?" యని తనతల్లియగు కుంతిని అంగీకరింప డాయెను. మఱియు "కూటికిగుడ్డకై పరులకొంపకుజేరి త్రయోదశాబ్దముల్...... నేటికీమాట యటంచు దెల్పితివి మానిని! యాత్మహితంబుగోరి...... నాపై ప్రేముడి గల్గుపోలిక" యని కుంతితోజెప్పి పాండవబాంధవ్య మంగీకరింపడాయెను. ఇందుచేతనే ప్రకృతిధర్మానుసారము కాకుండుటచేతనే పుత్రునకు తండ్రిపై సాంగత్యమాత్రమున వ్యావహారికమైన ప్రేమ యుండునేగాని రామరాజు తన తండ్రియని విన్నంతమాత్రమున పఠానుని సుస్థిరమాత్సర్యము పితృవాత్సల్యముగ తటాలున మారనేరదు.

పఠాను ఉత్తమభావములు గలవాడైనచో, బజారున విన్నకథకు నలిగినచో, రామరాజుకొలువును ఆపేక్షించి యుండడు. వీరపురుషులైన మహాసేనానులు వీరప్రతాపముల చేతను తమవారికి మతోద్రేకము కలిగించియు, సైన్యముల గూర్చి శత్రువుల నోడింతురేగాని, గూఢచారులై విశ్వాసఘాతకులై, కృతఘ్నులై, తిన్నయింటికి ముప్పుదెప్పింప యత్నింపరు. గూఢవృత్తి బహునీచమయినది. పోనీ, బజారున విన్న కథవలన పఠానునకు హిందూరాజ్య వినాశ సంకల్ప మంతతీవ్రముగ నేర్పడకుండెననుకొనినను నిండుకొలువున నాషాబీకి జరిగిన మహాపరాభవమును వీక్షించిన వెనుక, రామరాజు దుర్నయమును జూచిన వెనుక

నుత్తముడైనచో తా నారాజువద్ద కొలువుండనేరడు. రాజాంతఃపురమున చెలికత్తెయయి యొంటినున్న నబాబుబిడ్డయగు ఆషాబి మానసంరక్షణ నిమిత్తమై దానచ్చటనున్న మాటయు కనుపడదు. ఆషాబీమీది మోహావేశమున నచ్చట నుండి యుండవచ్చును. రామరాజును జంప నుద్యోగించుట మహమ్మదీయ మానినీమానభంగమునకా? కామినీవిలాస సంతోషమునకా? లేక హైందవ రాజ్యోన్నతి మీది అసూయ చేతనా? 'All is fair in war and love' అను నీతి సూత్రమున నీతడు గూఢచారిగ వర్తించినను, ఉత్తముడే యనుకొందము. పఠాను విద్యానగరము ప్రవేశించినది మొదలు హైందవరాజ్య వినాశనమునకు బద్ధప్రతిజ్ఞుడై యుండెను. ఆషాబీ కొఱకు బుద్ధిపూర్వకముగ రామరాజును జంప సమకట్టెను. రామరాజు తన తల్లికొనర్చిన పరాభవమునకు, కొద్దికాలము క్రిందటివరకును రామరాజునకు, పఠానునకు నెట్టి సాంగత్యవాత్సల్యములును లేవు. రామరాజు యుద్ధారంభమున నిండుమనంబుతో దనీకరాళమునిచ్చి సేనాపాలన మొనర్చుమని యభిషేచించినప్పుడు నయితము నీకుమారుడనై జనియింతునని తనమారకోద్యమము వెల్లడించెను. అప్పుడైనను నుత్తముడైన, సేనాపతిత్వ మంగీకరింపక చల్లగజారి పరశిబిరమును జేరియుండును. అటుగాక తనయాధీనమయిన సైన్యముతో పరపక్షమును బూనిగాని, ప్లాశీయుద్ధమున మీర్‌కాశింవలె తటస్థముగ నుండి మహమ్మదీయ సైన్యములచే హిందూచమూవిదారణము జేయించిగాని యుండును. ఇట్లేమియుగాక తానే చేరువనుండి తుదివఱకు రామరాజును విశ్వసింపజేయుచు, మహాద్రోహియై, నీచుడై, యేమరపాటున రామరాజు కుత్తుక తెగవ్రేసెను. ఇది యంతయు ఆషాబీ మీది మోహాంధకారముచేతను, యామెకోరిన శుల్కము నర్పించుటకును జేసిన దొంగకూనీగాని, మహమ్మదీయ మతాభిమానముచేతను, వీరోదారభావములచేతను చేసిన మహాకార్యము కాదు. ఆషాబీ కొఱకు ఇట్టివనితా కామమదమాత్సర్య ప్రేరితుడై చేసియు తుదకు యాపెపై నీపాపకార్య కారయితత్వము మోపి యాపెను నిష్కారణముగ జంపివేసెను. ఆషాబి తన పరాభవశోకావేశమున రామరాజుతలను వాంఛించియుండును. తొల్లిట మతాభిమానముచే రామరాజ్య వినాశనమూహించు చున్న పఠాను కామోద్రేకముచే యాషాబీ కోర్కె దీర్చెదనని చెప్పియుండవచ్చును. కాని తన తండ్రియని తెలిసిన వెనుక దానుపడిన మనస్తాపము నిజమయినదో,

మహమ్మదీయ విజయమునకు మాత్రము తోడ్పడి, యాషాబీని చెఱవిముక్త చేసి, పరిణయోద్దేశమునుమాని, వీలైనచో, రామరాజు పెనుకొండకు బోవు వసతులేర్పఱచియుండును. అథమము తనచేతితోనైన రామరాజును చంపియుండకుండును. ఇట్టివేవియు చేయనందున పఠాను కేవలము కామోద్రేకుడై బుద్ధిహీనుడై తండ్రిని జంపి నిరపరాధియగు ఆషాబీని వధియించి యున్మత్తుడై యాత్మహత్య జేసికొనెను. ఆషాబీ ప్రేరేపింపక పూర్వమే పఠాను రామరాజును జంపు ప్రతిజ్ఞ గైకొనును. అందుచే అషాబిదోష మేమియులేదు. సాహసించి కామారాధనమునకై తండ్రినైనను జంపినవాడు, నాటక పరిణామమున నాషాబీని పరిణయించి కాముని ప్రభావ ప్రాబల్యముననైన నిలిపినవాడు గాకపోయెను.

పఠాను రుస్తుం ఉదారస్వభావుడు కాడు. మాతాపితరులయందాదరణ గలవాడు కాడు. శృంగారనియమముల నెఱింగినవాడు కాడు. నీచకార్యమున నెదిరించు నీతిగుణోపేతుడు కాడు. క్షాత్రధర్మమున నెదుర్కొని వృద్ధునైనను పోరాడువాడు కాడు. ద్రోహి. కృతఘ్నుడు. విశ్వాసఘాతకుడు. గూఢచారుడు. కుట్రమారి. దొంగపోటులవాడు. నీచుడు. ఇట్టి నీచనాయకునకు శ్రీరామ హరిశ్చంద్రాదుల కుండిన భావ సంక్షోభమును గల్పించి షేక్స్పియరు విరచిత హ్యామ్‌లెట్ ననుకరింత మనుయాశతో బుద్ధిమంతులు కూడ యీ నాటకము నభినయించుచున్నారు.

## కంచెర్ల గోపరాజుగారి భక్తి స్వభావము

తెలుగుదేశపు పరమభక్తుడు రామదాసుగోపన్నగారొకరే. రామచంద్రుని తనతోడ నాడుకొను వయస్కునిగ నూహించి, తనతో నిత్యసంచార మొనర్చు మిత్రునిగ భావించి, నిరుద్దేశ్యముగ ననివార్యబాల్యచాపల్యలక్షితమగు నిర్మలభక్తి ప్రభావమున రామనామకందుకముతో క్రీడించి రామనామమోదుక మనుభవించిన భక్తబాలుడు. బాల్యతత్త్వము వయసులో లేదు; మానసములో, ఆత్మలో నున్నది. రామదాసు సీతారాములను సాకేతమునుండియో, పాలకడలి పొట్టమరుగులనుండియో వికుంఠనగరీస్వర్ణసౌధముల నుండియో పెకలించుకొనివచ్చి భద్రాద్రి హెడుక్వార్టరుగా నేర్పఱచి ఆ తెలుగుసీమల పల్లెపట్టులను, గుడిసెమేడలను వ్యాపింపజేసెను. రామచంద్రుడు రాచబింకముల

విడిచి యందఱతో కలిసిమెలసి సంచరింపజేసినది కంచెర్ల గోపరాజుగారు. ఆంధ్రుల నిత్యజీవితములో సీతారాములకు సన్నిహిత మహోన్నత స్థాన మేర్పఱచిన దీభక్తపుంగవుడే!

ఈ భక్తబాలుని రామక్రీడలు రామదాసుచరిత్రలో వాసికెక్కి "పదము పద్దెముపట్టి" నిలిచియున్నది. ఎన్నో హరికథలు, ఎన్నో కీర్తనలు, ఎన్నో గాథలు రామదాసు రామతత్వానుభవ ముగ్గడింప నిటీవల కొందరీయాంధ్రభక్తుని జీవితాంశముల రంగప్రయోగయోగ్యముగ రచియించియున్నారు. ఈ నాటకము నెల్లూరు సుగుణవిలాససభవారభినయింపగ జూచితిని. అందు రాధాకృష్ణయ్య కబీరు పాత్రము ధరించెను. దొరస్వామి తానేషా, రామచంద్రయ్య సితారా, మరియొకరు రామదాసు, బెంగుళూరి యామెచూరుకంపెనీ వారితో తాటిపత్రి రాఘవాచారి రామదాసు స్వభావమును సంపూర్ణముగ విస్తరించి జూప జూచెడి భాగ్యమమరినది. ఇందు రామదాస పాత్ర మభినయింపబడు తెఱవు రాఘవాచారి శీర్షికలో వివరింపబడి యున్నది (ప్రసిద్ధ నటులు: బళ్ళారి రాఘవాచారి), మఱియు ప్రదర్శనవిమర్శనములలో శివాజీ రామదాసు నాటకములందు కూడ నుదహరింపబడియున్నది.

## బళ్లారి రాఘవాచారి : శివాజీ, రామదాసాభినయములు:

రాఘవాచార్యులవారి నాట్యసేవ పలుతావుల ముచ్చటించి యున్నాను. వీరి నాట్యాదర్శములు, నాట్యాభిమానములు, రూపభావాది లక్షణములు ప్రసిద్ధనటులలో వీరి నెంచిన తావున విస్తరించియున్నాము. కావ్య, శిల్ప, నాట్యాది కళలలో నారితేరిన సిద్ధహస్తులు కూడ తమ కల్పనలగూర్చి సవిమర్శగ జెప్పనేరరు. కళాసిద్ధి ఆత్మప్రబోధమున తనంతట తానే రసభావోచితముగు ప్రాచుర్యమొందుచుండును. కళలు రసానుభవశక్తిగల యాత్మప్రబోధములవలన నుద్భవించును కాని, కార్యకారణసంబంధమరయు శాస్త్రకోశము, విమర్శకక్షేత్రము, మానసరంగము నుండి వొడమజాలవు. శిల్పకులు తమ కళాదర్శములను, లక్షణములను గుర్తింపలేకపోవచ్చును. అథవా, అట్టి లక్షణాభిమానములున్నను, అవి వారి కళాఫలితమున ప్రకాశింపకపోవచ్చును. ఇప్పుడు తెలుగుదేశమునగాని, విజ్ఞానభారతమందెచ్చటగాని, బుద్ధిమంతుల నాట్యాది కళాదర్శములన్నియు

నొకేరీతిగ బరిణమించుచున్నవి. రూపకల్పన మాత్రము అచ్చటచ్చటి పరిస్థితుల ననుసరించి భిన్నవేగములతో భిన్నసిద్ధులతో నేర్పడుచున్నది. రాఘవాచార్యులవారి నాట్యాదర్శములు, వారి సిద్ధాంతనిర్వచనమందుకన్న కళాప్రకటనమందే మనకెక్కువ నిశ్చయముగ లభించును. మిగిలిన విషయములలో నీకాలపు ప్రధాన విమర్శకుల అభిప్రాయములతో నేకీభవించుచు, నాట్యము ఉపాసితానుభవమనియు, నటుడు పాత్రము యొక్క జీవితాంశములనుపాసించి, జీవించి, తన యనుభవములనే ప్రకటింపవలెననియు వీరి యభిప్రాయమని తెలిపియున్నాము. నాట్యప్రయోగమందుకూడ నీ సిద్ధాంతములే గోచరించుచుండును. లక్ష్మణస్వామి, లక్ష్మీకాంతములవలెనే, రాఘవాచారి కూడ తన యుపాసితాంశములకు తన నిజస్వభావమునకు సమీపించెడి పాత్ర స్వభావములనే నిరుపమానముగ చిత్రించుచున్నాడు. లక్ష్మణస్వామికొప్పెడి రౌద్రవీరరసములు రాఘవాచారికి సిద్ధించకపోవచ్చును. వీరి దేశాభిమానము, అహంకారము, నీతిసంపాదనాపేక్ష, విద్యావిస్తారమున విశాలలౌకికానుభవమున సాధుస్వరూపము దాల్చి యుండవచ్చును. కాని వీనిలో నీతడు లక్ష్మణస్వామితో సమాన తేజస్సుగల అభిమానములు, స్వాతంత్ర్యము కలవాడే; కాని అంతకన్న సాధుస్వభావము, లక్ష్మణస్వామి, లక్ష్మీకాంతము, నాగరాజరావు, గోవిందరాజుల సుబ్బారావు, సంబంధం మొదలియారు మున్నగు రసప్రవక్తల వర్గములోని వాడై వీరిలో నేయొకరికన్నను సర్వతోముఖముగ నభినయింప నేర్చినవాడు. నాగరాజరావు, లక్ష్మణస్వామి తమ భావములను సంపూర్ణముగ ముఖముద్రలో ప్రకటించుచు, భావమునకు విస్ఫుటాభినయమొనర్చు impressionist actors భావనటులు. రాఘవాచారి నాట్యాదర్శములు వంగీయ కళోపాసకరీతులంటినవి గాన వారి చిత్రములలో నగుపడు సాధుత్వము, కోరి యవలంబించినాడో లేక వారితో సమానమగు అభినయశక్తి లేదో చెప్పజాలము. నాగరాజరావు నల, హిరణ్యకశిప, దశరథ, పఠాను వేషము లభినయింప జూచినాము; రామదాసు, చాణక్యుడు, శకారుడు, షుమేర్సింగు, యుగంధరుడు అభినయింప జూడవలసి యున్నది. రాఘవాచారిని కూడ ఈ పాత్రములన్నియు నిర్వహింపజూచిన గాని నాగరాజరావు రాఘవాచార్యులలో నేరు మిన్నలో నిర్వచింపజాలము. ప్రస్తుతానుభవమునుబట్టి, నవీన నాట్యాదర్శముల కనుకూలముగ సర్వతోముఖముగ నన్నిరసములు నన్ని

సందర్భములు ప్రకాశింపజేయగల నటప్రముఖులు రాఘవాచారి నాగరాజరావులే. ఇందు నాగరాజరావు విస్ఫుటమగు యథారూప భావప్రకటన వైఖరులలో రసభావము లొప్పింపగలవాడు. రాఘవాచారియభినయమందు రసము లొకింత సాధుత్వము జెంది, నిజస్వభావమగు శాంతి భక్తిరసములెక్కువ గోచరించును. నాగరాజు పాత్ర సారూప్యమొందును. రాఘవాచారి పాత్రస్వభావమును గూర్చి తన వ్యాఖ్యానమును చిత్రింపనెంచును. సంగీతములో నాగరాజుకన్న రాఘవాచారియే మిన్న. వీరిరువురి నటులను బెజవాడ వంటి తావునకు రావించి, పది ప్రసిద్ధపాత్రముల భిన్నసత్వముగల వాని నభినయింపజేసి, మన నటులు, విమర్శకులు, నాటక కవులు వీరి నాట్యవైఖరుల బరీక్షింపవలసిన యవసరము మాత్రమున్నది.

రాఘవాచారి బాహుక, పఠాను, శివాజీ, రామదాస, దశరథాదిపాత్రములనేకముల నభినయించియున్నారు. వీనిలో పఠాను వేషాభినయమును గూర్చి యీ పొత్తమున బలుమారు ప్రశంసించియున్నాను. బెంగుళూరు ఆమెచూరుకంపెనీ వారి ప్రదర్శనములలో రోషనారానాటకమందు శివాజీ స్వభావ మభినయింపజూచితిని. రవివర్మ చిత్రించిన శివాజీ ముఖసాదృశ్యమును పొందుటలో మాధవపెద్ది వెంకటరామయ్యకు కలిగిన సిద్ధి రాఘవాచారి కేర్పడలేదు. గాత్రమంతయు, నడత, వైఖరి వెంకటరామయ్యకన్న బలు తెఱంగు లధికముగ శివాజీని స్మరియింపజేయుచుండెను. మొదటి నుండి తుదివఱకు భవానీ పదధ్యానము, తనమానసమునకు సందేహమొదమినపుడెల్ల విచారమౌఢ్యము గ్రమ్మనపుడెల్ల విశ్రాంతచేష్టితుడై జగన్మాతను లోలోన నొక్క నిమేషము స్మరియించి పరధ్యాన మభినయించుట, అదియే యలవాటైన స్వభావ ప్రకటనము, రాఘవాచారి చక్కగ నభినయించుచుండెను. శివాజీ దిశాంతభూవలయ మాక్రమింపనెంచిన రాజు కాదు. రాజసూయాధ్వరమారంభించి దిగ్విజయ మొనర్పబయల్వెడలిన క్షత్రియుడు కాదు. శత్రుసమ్మర్దన మపేక్షించి రణవ్యూహముల ద్రిప్పు మేటి వీరుడు కాదు. పవిత్రజీవనుడై, నీతిసత్తముడై, దీక్షాపరతంత్రుడై, గర్వాహంకారరహితుడై, స్వార్థదూరుడై, దయాసత్యశౌచముల కాలవాలమై, శమదమాది సద్గుణగరిష్ఠుడై, ముసల్మాను దుండగముల నలుగుచున్న

హిందువుల నభిమానించి న్యాయముకొఱకును, సమత్వముకొఱకును, మతభావస్వాతంత్ర్యము కొఱకును, ఆవేశపూరితుడై పాటుపడిన మహాభిమాని. లోభము, కామము, క్రోధము, మాత్సర్యము వీనియందేకోశమునను లేవు. అలంగీరు తనకు తానే హిందువుల మతస్వాంత్ర్యమంగీకరించి, ప్రజలందఱనొకేవిధముగ మన్నించియుండినచో, శివాజీ రేవాతీరమున తప మాచరించుచుండెడివాడే. శివాజీ మానసమున జగన్మాత భవానీ ప్రథమ గౌరవమందుచు గురురామదాసు, హిందూమతము, దేశాభిమానము, ప్రధానాదరణ విషయములై యొప్పుచుండెను. స్వధర్మనిర్వహణమే, ఉత్తమాదర్శములే అతని నెల్లవేళల గదలించుచుండెను. తంత్రమంతయు కార్యనిర్దేశమంతయు రామదాసు గురూజీ నడపుచుండెను. తల్లి గారవము నిలుపుటకై గురూపదేశమనుసరించి సంయమిమంత్రి యాదేశమున తన శూరప్రభావమును స్వార్థరహితుడై శీల క్రమమెఱింగి మెఱపించిన యసాధారణ ప్రతిభ శివాజీది. కావున అధర్మమును ధిక్కరించుటయందు, శీలమును కాపాడుటయందు తక్క మఱెచ్చటను ఈతని యహంకార మగుపడదు. ఇందునను తప్పనిసరిగా నలంగీరుదుర్నయములవలన తన నెత్తిమీదికి వచ్చిన రణవ్యాపారములందును నిజస్వభావమును మెఱయించుచు, అధికారమును ఝళిపించుచు, శూరత మించుచు మిగిలిన పట్టులన్నిటిలో పరాధీనుడై భక్తిభావమున గుర్వాజ్ఞ నతిక్రమింపని సాధుభక్తుడు శివాజీ చక్రవర్తి. ఈ తత్వమును రాఘవాచారి నిర్దుష్టముగ జూపగలిగెను. డిల్లీకి పోవలసినపుడు వీరబింకముల బరిఢవిల్లక, నీతిసూత్రముల బరిగణింపక, శత్రు నిలయమని జంకక, మొగలాయి మెప్పుల కాశపడక, దేశహితమగునని రామదాసు భావించిన కార్యమునకు నిరాడంబర భృత్యుభావముతో, విద్యాచరణశాంతవృత్తులతో వెడలిపోయెను. ఔరంగజేబుతో జరిగిన సంభాషణమందు అనవసరమగు వీరాడంబరము కాని (martyr), సంగరాహిత్య లక్షణములుగాని చూపక, నిశ్శంకమగు స్వాభిమానమును, నిశ్చలమగు సంకల్పమును మాత్రమే, మర్యాదదప్పక, శాంత స్వభావము, ధర్మనిరతి, యున్నతాదర్శములు దీపించునట్లు రాఘవాచారి యభినయించి, శివాజీతత్వమును ధ్రువపఱచెను. జీవన్ముక్తునైజమగు యదృచ్ఛోపపన్న ఫలస్వీకరణ మీతని యందగుపడుచు గీతార్థముల నాట్యచిత్రమై యుండెను. రోషనారాతో నేర్పడిన సందర్భములందీతని వైఖరి పరస్త్రీని

మాతృసమానముగ జూచెడిచూపులను, ధీరతతో ప్రకటించుచుండెను. ఈ సందర్భములో వెంకటరామయ్య వీరశీలమును పట్టుదలతో గాపాడుకొనుభంగి, రోషనారాతన్నంటుకొనునేమో యను భయము చూపసాగెను. రాఘవాచారి చూపులలో, నడతలలో, పరిశుద్ధచేతసురాలగు పతివ్రత నిశ్శంకమానసముతో నందఱుబిడ్డలవలె భావించి, మాతృరూపిణియై లజ్జాభయములు లేక సంతసమొప్పార నెట్టి పోకిరి చట్టమందైనను నవ్యాజనైర్మల్యశాంతరుచులతో సంచరింపగలదో అట్టి నిర్భయశీలస్వభావమును చూపించెను. అనగా రోషనారావేయు వలలు తన చుట్టు గ్రమ్ముకనపుడు, చతురోపాయముల నాయమ వాని పాణిగ్రహణ మొనర్చ యత్నించినపుడు, ప్రేయసియై వలచినపుడు, దీనయై వేడునపుడు, తుదకు మాతయై సన్నగిలినపుడు అన్నివేళలు నట్టి సుందరాంగి, కార్యసాధని, సంస్కారిణి, యభిజాత తన చెంతనున్నదను ప్రత్యేక భావోచితసంభ్రమముల నేమాత్రము ప్రకటింపలేదు, అట్టిదానినే చూపుచుండెను. రోషనారా మాతృతత్త్వ మవలంబించినపుడాయమమీది గౌరవము అంతయు పార్వతీదేవి సాక్షాత్కరించిన పగిది సర్వసమర్పణార్హమగు భక్తిగా బరిణమించినది. రోషనారా కదివఱకుండినవి – జగన్మోహనమగు రూపము, ప్రతివీరభయంకరమగు శౌర్యము – పండిత మాననీయమగు శాస్త్ర పరిచయము – సకల కళాప్రవేశము – పుట్టుక – బలము, లౌకికైశ్వర్యముల నగు సమస్త సౌభాగ్యములెక్కడో దాపరించిన కామినీ స్వరూపము రోషనారాది. స్త్రీరూప మంకురింపజేయు మోహావేశముతో భూలోక సౌభాగ్యములన్నియు శివాజీ నిజసత్త్వమును పరీక్షింపవచ్చిన ఆధ్యాత్మిక సంకేతమని కూడ రోషనారాను ఊహింపవచ్చును. మోహపరవశుడై శివాజీ వీనినెల్ల తన భోగ్యార్థములుగ గైకొనునా? కథా సందర్భమున నీతడవ్వాని స్వోపభోగమునకు తన దానిగ నంగీకరింపలేదు. అనగా శివాజీ యైహిక సంపదల భోగ్యవిషయములుగ నంగీకరింపలేదు. భోగ మాతనిడెందమున చూచాయగానైన లేదు. కాని లౌకిక విభూతులు తన్నుగాచుటకును, లోకము నుద్ధరించుటకును ధర్మమును, స్వాతంత్ర్యమును కాపాడుకొనుటకును సంకల్పించుకొన్న పోషక స్వభావ మొప్పెడి మాతృతత్త్వమున రాజిల్లినపుడును శివాజీ నిస్సంశయముగ వాని గైకొనును. విభూతుల పోషకముఖ్య లక్షణము శివాజీని సంతుష్టిపఱచునేకాని, వాని భోగ్యమోహమాతని కలవరపెట్టదు. ఈ తత్త్వ మేర్పడునట్లు కథాసందర్భమును

మార్చియు, నాయాపట్టుల శివాజీ సాధుసద్ధర్మశీలమును ప్రకటించియు రాఘవాచారి నటమాన్యుడై విలసిల్లుచున్నాడు. కొన్ని తావుల వీరరస మభినయింప వలసినపుడాయన నేత్రావలోకనము నాగరాజారావున కందరాని లక్ష్మణ రూపమున వెలుగుచుండెను.

రామదాసు పాత్ర మభినయించుటలో రాఘవాచారి ప్రచురించిన స్వభావవ్యాఖ్యానమును కథాక్రమమనుసరించెడి విధానము నీ దిగువ వివరించెదను. ఇందు విస్తరించిన పాత్ర స్వభావ నిర్వచనమెల్ల రాఘవాచారి యభినయ వ్యాఖ్యానమందలి గద్యాభివర్ణనమేయని తలపవలెను. అనగా రాఘవాచారి అభినయవైఖరులలో రామదాసు స్వభావమేర్పడిన రీతి వర్ణించుచున్నాను. రామదాసుగారి భక్తి స్వభావమును పై వ్యాసములో వివరించి యున్నాను. రాఘవాచారి సాధు స్వరూపక జీవన మాతని ప్రసిద్ధ నటవ్యాసమున వివరించినాను. ఈనాడు రాముని తలపోయు మంచి బ్రాహ్మణుడు ఆనాడు రాముని మెప్పించి బంటుగా నంపగలిగిన మహాభక్తునికి స్వభావ వ్యాఖ్యాన మొనర్ప జూచు భాగ్యము నాకబ్బినది.

(1) గుంపులుగాజేరి భజనసేయుచు, తమ లౌకికజీవనాశయముల విడనాడజాలక, భద్రగిరికేగుచుండిన యాత్రికులను గోపరాజువీధిలో కలిసికొనెను. వారిని చూచినంతనే యాతని స్వభావసిద్ధమగు రామభక్తి, సత్సాంగత్యకుతూహలము సత్కథాకర్ణనాపేక్ష, యుప్పొంగి మంచి సంస్కారుల కనువగుచిత్తశాంతితో మిక్కుటమగు సంబరము, తత్పరత్వము, సందడి యగుపఱచెను. యాత్రికుల సమావేశమున రామభక్తి యుదయించలేదు. అదివఱకే భక్త లక్షణములన్నియు నాతనియందగుపడుచుండెను. కాని, భక్తుల వేషదాంభికములు, వీరవ్రతులపిచ్చిపూనికలు వీరియందగుపడలేదు. భద్రగిరి బోవనెంచి యాత్రాసన్నాహమున రామదాసచ్చటికి రాలేదు. క్రీడాతురుడగు బాలుడు పదిమంది బాలకులాడబోవునపు డెట్టి కుతూహలముతో, నిశ్చింతతో, నిత్యసంతోషముతో వారిని గూడి ప్రక్కవీధికి బోవదలచునో, అట్టి బాల్యచాపల్యముతోడనే, బాల్యోత్సాహముతోడనే రాఘవాచారి యాత్రికుల వెన్నంటి పోవసాగెను. ఇంటిలో చెప్పిరమ్మని యాత్రికులాదేశింప “రామునిజూడ నేగునపుడొకరి నడుగనేల” యని జ్ఞానప్రకాశమొనర్చినపుడుకూడ ఏదో సమయస్ఫూర్తి వాక్యమువలె భావస్థిరమైన

యభిమానాభిప్రాయమును వెలిబుచ్చినట్లవలీలగ పలికెను. రాఘవాచారి ప్రథమ ప్రవేశములో వీరవ్రత లక్షణములు జ్ఞానవైరాగ్యము లలవడిన ముదురు ముంగి చూపులేక నిరాడంబరబాల్యసత్వముతో గూడి యుండెను.

(2) భద్రాచలస్వామి సన్నిధానమున కళ్యాణముహూర్తమెదురుజూచుచు గొలుచుచుండిన యాత్రికవర్గములో రామదాసన్నిట తానయై తొట్రుపాటెఱుంగని సంబరముతో వెనుకముందు లెఱుగని నిత్యసంతోషముతో మెలగుచుండెను. ఈ పట్టున రాఘవాచారి అభినయించిన పోలిక రామకళ్యాణ మీక్షింపవచ్చిన యాత్రికుల స్థలాక్రమణ సంగ్రామ వ్యాకులతగాక మండువేసవిని మధ్యందినబుభుక్షాకాంక్షగాక, సంపన్నయజమాని యేకపుత్రీ వివాహసమయమున నెట్టి సంబరముల గ్రోలుచుండునో అట్టి నిర్మలశాంతభావములను అంతట తానెయైన కార్యనిర్వహణోత్సాహము నిరహంకారముగ ప్రకటించుచుండెను.

కబీరు రాగానే వాని సత్వమెఱింగియో, లేకయో, అందఱు రాముని చూడవలెననెడి యాపేక్షచేతనో, ఎవరియందెట్టిశక్తి యున్నదో యను నూహచేతనో, సర్వసమత్వముననో చప్పున నాతని నాదరించి శ్రద్ధతో నాతని వినుచు జేరనీయని నంబిలోకమును ఎన్నోవిధముల మూఖాభినయమున బ్రతిమాలుచు తాను కబీరును విడచిపోజాలకయు, లోపలికిపోయెడి కుతూహలముప్పతిల్లను 'వారు రానీకపోయిరే, ఇతను రాకపోయెనే' యను దుఃఖమును అన్నిటిని రాఘవాచారి యేకపర్యాయము చూపించెను. గోపరాజుకు అంతా రామమయమేకాని ఆచార వ్యవహారములు, కట్టుబాటులు అతని విశ్వవ్యాప్తకరుణాంతరంగమును భంగపఱచలేదు. కబీరు ఉద్దేశ్యపూర్వకమగు భక్తిప్రచారకుడనియు, రామదాసు తన ఆత్మను భవబంధముల నుండి తప్పింపనెంచిన ముముక్షువనియు రాఘవాచారి యభిప్రాయము. కాని, అభినయములో రామదాసునకు మోక్షాపేక్ష కూడ లేదనియు, ఏమో రాముడనిన చెప్పజాలని యుత్సాహమనియు నేను విమర్శించిన పగిదినే ప్రకటించెను. దాశరథీ శతకమునకు, నితరశతకములకు ఈ భేదమే కనపడుచున్నది. "అదుగో భద్రాద్రి" అను కీర్తనలో నుండెడి నిరుద్దేశ్య నిర్మలబ్రహ్మానంద మితరుల కీర్తనలందెచ్చటైన గాననగునా? రామదాసు కేయాలోచనయు లేదు. ఎట్టి లాభాపేక్షయు లేదు. ఏ విశ్వాసమును లేదు. ఏ కోరికయు లేదు. రాముడు రాముడని సంబరపడుట యొకటే యున్నది. ఇట్టి

యనిర్వచనీయ భక్తిప్రవాహమును పిప్పి గంతులందును, గొంతురెంకెలందును వ్యభిచరించనీయక భక్తనటన నవలంబింపక ప్రశాంత నైజస్వభావముగ జూపించి రాఘవాచారి వినుతుడైనాడు. కబీరును రానిమ్మని వేడుటలో పసిబాలునివలె, చనువిచ్చు తల్లితండ్రుల బ్రతిమాలు డింభకునివలె, మఱియు నయమెఱింగిన సంసారివలె నభినయించెను. కబీరు మహిమ యెల్లరకు విదితమైన వెనుక రాఘవాచారి యామహాభక్తున కకుంఠిత పారవశ్యమున వినమ్రుడై యందరతోబాటు భక్తిభావము లర్పించెనేకాని "ఇదుగో చూచారా! నేను చెప్పలా! నామాట విన్నారూ?'' అనే అహంకారావలోకనము లెంతమాత్రము ప్రసరింపజేయలేదు.

(3) తరువాత రామమంత్రోపదేశ మందికొని భద్రగిరిలో స్వామి కైంకర్యమునకు వసూళ్లు చేయనారంభించినపుడు ఎంతో నిరాడంబరముగ, ఎంతో జాలిగ భక్తిపరత్వమును యెఱుగనివాని చందమున ప్రకటించుచు బ్రతిమాలుకొనెనే కాని తానొక జ్ఞానియైనట్లు ఇతరులెల్లర జ్ఞానకూపములో జిక్కి పాడగునట్లు ఈనాటి మతబోధకుల, ఆచారసంపన్నుల, భక్తినీతిప్రచారకుల నిజాంతరంగమాలిన్య సంరక్షకనాట్యోపాయగాంభీర్యముతో ప్రజల సంబోధించలేదు. రాముని కార్యము దానంతటదే సిద్ధించును. ఆశాబంధము, ఫలవైముఖ్యము ఆపట్టునందగుపడు చుండెను.

(4) రామదాసు తానెల్లపుడు రామసుధాప్రహృష్టుడై సంతసించుటయేగాక, తనచుట్టును ఆవేశప్రకోపమెఱుగని శాంతిప్రచారమున తన యనూనోత్సాహశక్తిని వ్యాపింపజేయగల సత్వసంపన్నుడు. జ్ఞానము, వైరాగ్యము, వీనిని సూచించు బడాయిలు ఈతని నిత్యానందభక్తిజీవనములో నగుపడవు. రఘురామునకు రామభజన గఱపుటలో సామాన్య గృహస్థులు పిల్లకెద్దేని తినిపించునపుడును, దీపావళినాడు టపాకుల గాల్పించునపుడును, వారి ముద్దు లాలించునపుడును ప్రకటించెడి సాధారణవ్యాపారవైఖరులనే చూపెనుగాని, ఏదో పూజాసమయ నియమమును వెల్లడించలేదు. రామదాసునకు రామస్మరణము, రామభజన నిత్య (అనగా నహర్నిశములు జరుగుచుండు) స్వభావమైనది కాని, మడికట్టుకొని లౌకికవ్యాపారబాహుళ్యమున సందుచేసుకొని, నిర్ణీతకాలములలో "యదహ్నాత్ కురుతేపాపం తదహ్నాత్ ప్రతిముచ్యతే'' అను ఆత్మవంచక, లోకవంచక

విభ్రాంతినొందుట కేర్పడినది కాదు. కబీరును ఆతిథ్యమంగీకరింపవేడినపుడు రాఘవాచారి ప్రకటించిన యవ్యాజవిశ్వాసానుబంధము వర్ణనాతీతము. గురువుతో తన కుమారుడు పోనున్నది ఎక్కడకో వెళ్ళునట్లూహించలేదు.

(5) కొడుకు చచ్చినవార్త వినినప్పుడు కూడ బాలుడేదుర్గమసీమల కరిగెనో యను భ్రాంతి నెంతమాత్రము చెందలేదు. రామదాసు భావములో రాముడెక్కడనో లేడు. వైకుంఠ మేదూరదుర్గమ వనరాశినడుమనో లేదు. తప్పిపోయిన పిల్లవాడు స్థితిమంతుడగు పెదతండ్రి యిల్లు చేరెనను వార్త తెలిసినపుడు, కన్నతండ్రి యెట్టి చూపుల "పోనీ అక్కడ చదువుకొని బాగుపడతాడులే" అని పెద్దన్నగారి యాదరణసామర్థ్యములందు విశ్వాసమును, పుత్రుని భద్రస్థునిగ నెఱింగిన సంతసము వెలిబుచ్చునో సరిగా నట్టి యభినయమొనర్చెను. రామదాసు సంసార కష్టముల తప్పించుకొనుటకు మరణమెన్నడును ఆశించలేదు. మానవ శరీరము నొక బంధికానగను, జీవితము నొక కష్టసాగరముగను అతడెన్నడును ఊహించలేదు. ఈ దేహములో, ఈ దేశములో, ఇచ్చటి మంచిచెడ్డలలో సర్వవ్యాపకముగ, నిత్యప్రత్యక్షముగ రాముని నూహించి, గుర్తించి సంతసించు ధర్మరతునకు మరణమువలన విడువనోపెడి కష్టములును లేవు. మరణము వలన సిద్ధింపదగు నూతన వికాసములు లేవు. ఈ స్వభావమున, నీపట్టున రాఘవాచారి వాక్యార్థ మొనర్చెను.

(6) ఈతని చెరబెట్టుటకు తలారులరుదెంచునప్పుడొక నిమేషము భార్యవంకజూచి యొకసారి రఘురాముని దాకి ఎట్టిమహాభక్తునికైనను దేహోపాధిలో నుండుతరి స్వభావమగు ప్రణయాంకురములను, వీక్షేమగుదురను భయమును, "విడిచి పోతానే" అనే దుఃఖమును విద్యుద్దీపము మిరిమిట్లుగొనినంత యల్పకాలములో కండకావరము బ్రకటించి, మరల తన జ్ఞానవిరాగభక్తస్వరూపమును, నిస్సంగతను అందుకొనెను. ఇట్టి మనస్థితియే చెరసాలయందగుపడును, కాని ఈ వ్యామోహతటిద్వ్యాపారము మెరపు మెరసినట్లుండును. దీపము గాలితాకున కొంచెమెగసి దిగబడి మరల యథారూపమున బ్రకాశించినట్లుండెను. అనగా, ఈ భావము ఆవేశించినపుడు సైతము రామదాసుగారిభక్తి, కాంతి పోలేదు. కలడో లేడో అను మీమాంస కలుగలేదు. రాముని సదుద్దేశ్యములను పరమకర్తృత్వమందు ఎడతెగని

యాశాబంధము రాఘవాచారి చూపుచుండెను. భక్తి, విశ్వాసము, ఆశానుబంధము.

(7) తానేషా యెదుట ఎంతో నిబ్బరము, స్వాభిమానము, నిశ్చయము, ధైర్యము, విశ్వాసము అవ్యాజస్వాభావిక శాంతరుచులతో నగుపఱచెను. ఇక్కడ ప్రౌఢభక్తుని ఆత్మనిశ్చయము, నిగ్రహము.

(8) రాఘవాచారి మిక్కిలి ప్రశంసనీయముగ నభినయించినపట్టు, రామదాసుగారి బంధికానబ్రతుకు. రోజులు గడచిపోవుచున్నవి. రాముడగుపడి ధన మెట్టులైన నిచ్చునని నమ్మినాడే! ఇంకను రాడాయెనే? మరణ మొకచింత కాదు. మంచిచెడ్డ లెఱుగని కఱకుతురుకబుణమున జావవలెనా? రాకేం? వస్తాడు. ఒకటిరెండుసార్లు ఆలుబిడ్డలు మతికెక్కిరిగాని ఎబ్బే! వారిసంగతెంత? రామునికేం చెవుడా? భక్తావనవ్రతము వదలెనా? జగదైకపాలకుడన్యవ్యాపారముల జిక్కియాలసించెనా? ఎన్ని సందేహములు! ఎన్ని ఆశాంకురోదయములు! రాముడే గొప్పవాడా? పిలిస్తే రాడేమి? ఇంత చిలిపితనమా? దశరథునితో చెప్పనా? ఆ, శపించుతా! ఆహా! రామదాసు రామునెంత చిన్నగా నొనర్చెను! ఎబ్బెబ్బె? రాముడేమి, ముప్పదిరెండు మహాగుణముల నడబావి, తన్నేల విడుచును? విడిచిననేమి, తన రాముడు కాకపోవునా? ముద్దుల యొయ్యారి కాడా? లచ్చికి మగడుకాడా? దుర్వీరనిర్మథన మహాసమర్థుడు కాడా? ఎబ్బె! చేస్తాడు. వస్తాడు. చెర నుండి తప్పిస్తాడు. రాముడున్నాడు. అడుగో! వాడే! రామా, నీవేనా! రామా! అనే అర్థము విపరీతభావసంక్షోభమున భక్తోన్మాదవైఖరులలో పరవశుడై స్వభావలాలిత్యమున మర్యాదవిభ్రంశ మేర్పడకుండ నభినయించుచు నల్లన మూర్ఛావస్థ జెందినపగిది నెంతయో భక్తిదీపకంబుగ రాఘవాచారి యభినయించినాడు. చావు దగ్గఱకు వస్తున్నది. కాని బ్రతుకెందులకు? మహిమ్నస్తోత్రములో, పుష్పదంతుడు వెలిబుచ్చిన యూహలో భగవద్ధ్యాన మొనర్చుటకే జీవనాభివృద్ధి కావలెనుకాని, మఱే యిత సాధనకు కాదు. మేల్కొని రామస్మరణలో ఉన్మాదుడై, నిశ్చేష్టితుడై, సమాధిగతుడై యుండెను.

(9) కబీరు వచ్చి బుద్ధి మరలింప జూచినప్పుడు మొదట గురువని భావించినవాడు “నీవు మా కబీరువు కావు పో” అని విదలించి మీది కెగయపోయినపట్టు విచిత్ర భక్తోన్మాదమును జూపించెను. తన ప్రాణమునైనను

వదలునుకాని, భద్రాద్రినొక ముసల్మానుమదరాసీగా నొనర్చ సమ్మతించడు. రామదాసు సర్కారుసొమ్మును రామకైంకర్యమునకు వినియోగించ పాపమెఱుగక పోలేదు. సొమ్మంతయు రామునిదే అనుకొన్నాడు. అర్పించవచ్చు ననుకొన్నాడు. కాని లౌకికవ్యాపార స్ఖాలిత్యమునకు తగిన భౌతికశిక్ష ననుభవించుట న్యాయమనియే తలంచెను. ఋణమైనను తీర్చవలెను. లేకుంటే రాజదండన మనుభవించవలెను. వేరే మార్గ మాశించలేదు.

(10) రాముడు వచ్చి పోయిన వెనుక కబీరు, తానేషా రామదాసున కీవృత్తాంతమును తెలుపవచ్చినపుడు రామదాసు "చూచావా రాముని ప్రభావము! భక్తుల మహిమ తెలిసికొంటివా?" అని తానేషాపై తన విజయాడంబరమును జూపలేదు! ఋణము తీర్చినాడా? విముక్తుడనా అని సంబరపడలేదు. నాభార్యయు బిడ్డలెట్లుండిరని యాతురుడై యడుగలేదు. రాముడేమి చేసెను? ఏమనెను? ఎందుపోయెను? అను కుశల ప్రశ్నలందు కాలయాపన మొనర్చలేదు. "ఏడీ రాముడు, ఎక్కడున్నాడు? నాకు కనిపించకుండా దాచినావని" చూపు నా రాముడిని చూపుమని బాలునివలె ఎంచరాని, చూచి మన్నించదగిన రసావేశముతో తన కదివఱకుండిన భక్తోన్మాదవైఖరులను, మూర్ఛాసమాధిని విడువక నేర్పుయై ప్రకటించెను. తానేషా రాముడు తప్పించుకొనిపోయెననియు, తాను మహాపాతక మొనర్చెననియు ఘోషించుచుండెను. తురక నవాబు, హిందూ భక్తుడు ఇద్దరు కలిసి ప్రసన్నుడైన రాఘవుని జూడకుంటిమని విలపించుపట్టున నిద్దఱికిని సాక్షీభూతుడై హిందూ మహమ్మదీయ సమ్మేళన మహోద్యమ ప్రవర్తకుడై, భద్రాద్రి కథాసూత్రధారియై, సంకల్ప ప్రభావమున నిన్ని వింత సందర్భములేర్పఱచి కృతార్థుడై నిస్సంగుడై వెలుగుచుండిన యోగిసత్తముడు కబీరొకడే. ఆ మత సమ్మేళనభక్తిజ్వాలలో నుదాసీనుడై, సాక్షియై నిలుచుండి "అదే నారాముడిట్లా పరుగెత్తగా చూచాను" అని చెప్పగలిగినాడు. రాఘవాచారి అభినయ సాధనచేనైన రామదాసుగారి నిర్మలబాల్యభక్తిని రామనామసంకీర్తనోత్సాహమును పొంది చరితార్థుడగుచున్నాడు. ఆంధ్రులాతని యసమాన నాట్యవైదుష్యమున ఆంధ్రలోకపు భక్తప్రధానుని జీవితానుభవముల జూచి యానందింపగలుగుచున్నారు.

☸

## ఏడవ దళము

# నాటక సమస్యలు

1916వ సంవత్సరములో బందరులోని ఆంధ్రనాటక పరిషత్తువారి కార్యదర్శిగ పనిచేయుచు నాటక విమర్శన మొకింత బయలువెడలించితిమి. అందుకు కోలాచలం శ్రీనివాసరావుగారిచే నొక ప్రణాళికను సిద్ధపఱపించి దానిపై నితర విమర్శకుల యభిప్రాయము లారసి కృష్ణాపత్రికలో నప్పుడప్పుడు ప్రచురించియుంటిమి. ఇందు కొందరియభిప్రాయముల సంక్షేపముగ గూర్చియున్నాను. ఆచంట బాపిరాజుగారు, శేషాద్రిరమణకవులు, వింజమూరి రంగాచారి, చల్లా సుబ్రహ్మణ్యం, ముత్తరాజు సుబ్బారావుగారు, వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మొదలైనవారనేకులు తమ యభిప్రాయములను వెల్లడించియున్నారు. ఇందు ముత్తరాజు సుబ్బారావుగారి యందలి గౌరవముచే వారి వ్యాసమును సంపూర్ణముగ ముద్రించియున్నాము. ఈ వెనుక కృష్ణాపత్రికలోను, ఆంధ్రప్రతిక సంవత్సరాది సంచికలలోను శ్రీపాద కామేశ్వరరావుగారు ఆంధ్రనాటక సంస్కరణముగూర్చి కొన్ని యభిప్రాయము లొసంగియున్నారు. వీనిని సంక్షేపముగ నిందు బొందుపఱచియున్నాను. పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు తమ 'సాక్షి' మొదటి వాల్యూములో నాటకములగూర్చి నాలుగుపన్యాసము లిచ్చియున్నారు. వానిలోని సారాంశమును సేకరించి ముద్రించుచున్నాను. ప్రస్తుతము ఆంధ్రనాటక సంస్కర్తల గలవరపెట్టుచున్న నాట్యసమస్యలన్నియు శ్రీనివాసరావుగారు, కామేశ్వరరావుగారు, లక్ష్మీనరసింహారావుగారు పొందుపఱచిన వ్యాసములలో జాలవరకిమిడియున్నవని చెప్పవచ్చును. వీరుముప్వురు నాట్యకళకు సంబంధించిన సమస్త విషయములలో

చిరానుభవ మేర్పడినవారు. అందుచే నా చిన్ని నాటకానుభవములందు వీరియభిప్రాయములకు ప్రధానగౌరవ మొసంగియున్నాను. ఈ విమర్శకులుకాక అనుదినము ఆంధ్రకృష్ణాపత్రికలలోను, మాసపత్రికలందును, ఆంధ్రనాటకముల కావ్యలక్షణముల గూర్చియు, అభినయవిశేషముల గూర్చియు, నాటక సంస్కరణ ముద్దేశించియు ననవరతము తమయభిప్రాయముల వెల్లడించుచున్నారు. బి.టి.నరసింహాచారి, దుగ్గిరాల రాఘవచంద్రచౌదరీ, బి.నరసింహారావు మొదలగువారనేకులు వ్రాయుచున్నారు. ఒక చెంప బయస్కోపుల మూలమునను, పాశ్చాత్యనటుల నాటక ప్రదర్శనముల చేతను పత్రికలందు, గ్రంథములందు విదేశీయుల నాటక కళాభివృద్ధిని తెలిసికొనుటవలనను, వంగ దేశీయుల నూతననాట్యవైఖరుల నీవిధముగనే గుర్తెఱుగుటవలనను మనదేశములో కొన్ని భావతరంగము లుత్పన్నమగుచున్నవి. మరియొక వంక భరతశాస్త్రముల యాదర్శముల ననుసరింపవలయుననెడి జాతీయాభిమాన మేర్పడి నటులను, నాటక కవులను, విమర్శకులను గలవరపెట్టుచున్నవి. ఈ భావసంక్షోభము హిందూదేశములో మిగిలిన భాగములందుకన్న మన ఆంధ్రదేశములో మిక్కిలి ప్రబలముగ నున్నది. ఇచ్చట నొక చెంప సుప్రసిద్ధమగు ప్రాచీనాభినయరీతు లలవడినభాగవతు లింకను జనామోద మనుభవించుచున్నారు. హైందవకళల సాంకేతికాధ్యాత్మికతత్వములు నవ్యభావోదయముతో నాంధ్రుల కంటియున్నవి. ఒక చెంప నీదేశము కలకత్తా బొంబాయి పట్టణములవలె భాగ్యవంతముగాక, పెద్ద పెట్టుబడులతో నేర్పడిన నాట్యమర్యాద లెఱుంగక, యాంధ్రవ్యక్తి ననుసరించి బలుతావుల చిన్నినాటకసమాజము లస్వతంత్రపరిణామముల నందుచున్నవి. ఆంధ్రనాటకములు కడచిన ముప్పది సంవత్సరములలో శతాబ్దముల కాలపరిణామ మనుభవించి వికసించియున్నవి. అన్నితరహాలు రుచిచూచి దేనిలోను చిక్కుకొనునంతటి దురభిమానములేక వెలుగుచున్నవి. పెద్ద పెట్టుబడులు కాని, చిరాభ్యస్తసాంప్రదాయములుగాని, అందఱిని దిగ్భ్రమింగు మహావ్యక్తులు (నటులు, నాటకకవులు) గాని లేనందునను, మనదేశములోని నాటకసమాజములు అన్నియు నైచ్ఛికములే యగునందునను, ఆంధ్రస్వకీయస్వతంత్రభావ సంచారమునను, మననాటకపరిణామము చక్కగా కాలోచితముగా నేర్పడుచున్నది. అయినను ప్రస్తుతము కొన్ని సమస్యలు విమర్శకుల నేతృత్వ మపేక్షించియున్నవి.

ఎందఱువ్రాసినను ఈసమస్యలే తోచుచున్నవి. కాన వానిని గూర్చి నాయభిప్రాయములు వెల్లడింప సమకట్టియున్నాను.

## నాటక పరికరములు :

తెలుగుదేశమున పెద్ద వర్తకస్థానములు, రాజధానులు ప్రస్తుత మేర్పడియుండలేదు. ముందెన్నడైన మన మొక ప్రత్యేక రాష్ట్రముగ గూర్పబడి రాజ్యస్థాన మొకటేర్పడినను అది బొంబాయి, కలకత్తా, మద్రాసులవలె రాజ్యస్థానము, వర్తక స్థానము, విద్యాలయము ఒక్కచోటనే గ్రిక్కిరిసియు నగరముగ నుండజాలదు. నవీనశిల్పకులయూహ లివికావు. ఆంధ్ర రాష్ట్రమునకు రాజ్యస్థానము బెజవాడ కావచ్చును. వర్తక నిలయము విశాఖపట్టణమై యుండవచ్చును. విద్యాలయములు హైదరాబాదు, అనంతపురము, రాజమందిరము, విద్యాలయములు హైదరాబాదు, అనంతపురము, రాజమందిరము, నెల్లూరులలో నాలు గేర్పడవచ్చును. అందుచేత ఇతివర కేర్పడిన రాజధానుల వంటి వికముందుదయించుననునాశ లేదు. లక్షలకొలది జనము కాపురముండి వర్తకాదివ్యవహారములకొఱకు అనుదినము కొన్ని వేల బయటియూరివారరుదెంచు ప్రధాన నగరములందు మాత్రమే నాటకములు వ్యాపారముగ లాభించుచున్నవి. స్వగ్రామవాసుల ప్రోత్సాహమునకన్న తాత్కాలికాగతుల సహాయమే పెద్ద పెట్టుబడు లవసరమైన నాటక సమాజములను నిలుపుచున్నవి. ఇట్టి పెద్దపట్టణము లాంధ్రదేశమున లేవు. ఇక ముందుండబోవు. అందుచేత ఇక్కడ నాటక సమాజములు పెద్దపెట్టుబడు లవసరమైన దారులలో విస్తరింపనేరవు. ఆ పురముల ఆదర్శములమీద దేశస్వభావమెఱుంగక యిచ్చుట నట్టివాని నెలకొల్ప యత్నించిన గున్నేశ్వరరావు, మైలవరం కంపెనీలు నానాటికి నడుగంటుచుండుట మన మెఱింగినదే. పెద్ద సమాజములుకాని, చిన్నవికాని ఎంతవఱకును పార్శీ, గుజరాతీ, బెంగాలీ వైఖరుల విస్తరింపనెంచి, విశేష ధనవ్యయముజేసి, పెద్దశాలలను, రంగపరికరములను, దుస్తులను సంపాదించి తుద కట్టిపద్ధతిలో నాట్యకళను, తమ విత్తమును సర్వము కోలుపోయి నష్టపడియున్నారు. పెట్టుబడి పెట్టగానే, దానిని రాబట్టుకొనవలసియుండును. ఇందుకు ద్రవ్యార్జనమే ప్రధానమై, నాటకకళ పామరజనానురంజకముగ బరిణమించి, నీచమార్గములంటి నడచును. ఇటుల గూడ తన్ను దా బోషించుకొనజాలకున్నది. అంతియేగాక, మిగిలిన వానినన్నింటిని

దిగద్రొక్కు నేపత్రిష్ఠాపనమైనను దేశమున కనర్థదాయకమే యగును. మన నాటకసమాజములన్నియు చిన్నవి పెద్దవికూడ దరిద్రములో తేలుచున్నవి. ఇందు మొదట రంగపరికరములమీద వారు పెట్టెడిసొమ్మే కారణము. తెరలు పాతగిలి నిష్ప్రయోజనమగుచున్నవి. దుస్తులు చెడుచున్నవి. నటులు జీతములను బహుమానములను సేకరించి విశ్వాసహీనులై తిరుగుచున్నారు. ఇందుచే ప్రతిసమాజము దుఃఖపరిణామ మొందుచు కాలక్రమమున సన్నగిలి చచ్చుచున్నది. నాటకములలో బాగుపడినవా డొక్కడును మన దేశములో లేడు. ఈ బాధక మవశ్యము దీర్చదగియున్నది. ఇందుకు రెండు ఆలోచనలు నాకుదగిలి జదువరుల కెరింగింప దగియున్నవి. పెద్దపట్టణములలో సైతము గ్రామమునకు రెండు నాటక సమాజములకన్న నెక్కువ యుండకూడదు. ఒకటే హాలు ఉండి అద్దె ఎక్కువగ పుచ్చుకొనుచు (నాటకాదాయములో నాల్గవవంతు) అట్లు సేకరింపబడిన అద్దెను రంగపరికరముల గూర్చుటలో వినియోగింపవలయును. హాలువారి స్వంత నాటకమైనను ఇతర సమాజముల నాటకములైనను వచ్చుబడిలో నూటికి రు. 25–0–0 రంగపోషణ కుపయోగింపబడవలెను. ఈ పని నిష్కర్షగ జేసినయెడల రంగములను తగినస్థితిలో నుంచదగుదుము. ఇది దుర్లభమైనచో నాట్యరంగములు తొల్లి చక్కగా నియమింపబడినను, అనతికాలమున జీర్ణమై అసహ్యకరమగుచున్నవి. ఇట్టి చింపిరిగుడ్డ పేలికలసందున అభినయించుటకన్న ఆరుబయట నాడుటయే యుచితము. మన సామాన్యనాటక సమాజముల సీనరీకథాసందర్భ మెఱుంగుటకు ప్రేక్షకుల కెంత తోడ్పడునో యూహింపజాలము. రాముడగుపడిన మేడముందరే రావణుడగుపడును. సాకేతరాజసభావిన్యాసమే లంకాపుర మందగుపడును. వనరంగములు కూడ నిటులనే యుండును. వీని చిత్రీకరణము ప్రకృతిని దీపింపజేయుటకు మారు పటలేఖకుని నామప్రకటనమునకును, చిత్రకళా దుర్వ్యాప్తికిని నిదర్శనములై భీభత్సముగ నున్నవి. కలకత్తాలోని ఆల్ఫ్రెడు కారింతియన్ కంపెనీలు, బొంబాయిలోని ఇంపీరియల్ పార్శీమండలి మున్నగు రంగములు పిడుగులుపడులు, రైళ్లుదొర్లుట, ఇండ్లు కాలుట మున్నగువింతలను జూపుచున్నవి. వీని జూపినవారి నైపుణ్యమును నేను అభినందించనేరను. చూచువారి రసజ్ఞతను మెచ్చజాలను. ఎందఱు మెఱపుల జూడలేదు? ఎన్నిమార్లు వర్షపతనశీతల మనుభవింపలేదు? మనుష్యుని బుద్ధిహీనతను,

క్రియాదౌర్బల్యమును ప్రకటించుట కుపయోగపడునేకాని, ప్రకృతియొక్క నిరంతరనవోన్మేష సౌందర్య ప్రభావిస్తారమును మానవకృత్రిమము లేవి యనుకరింపగలవు? ధనవ్యయము, రసభంగము, ఫలశూన్యమగు రంగపరికరములకు ధనవ్యయ మొనర్చుటచే పెట్టుబడి యవసరమై, ధనార్జనము వెనుకబడి, విరోధములు పుట్టి, నాటక సమాజము విచ్ఛిన్నమగుటయే సిద్ధించుచున్నది. కాని ఈ రంగపరికరము లధికముగ నుండటచేత కంపెనీలకువచ్చు ఆదాయ మెక్కువ యేమియు లేదు. అందుచేతను, ధనసంబంధ మెక్కువైనకొలది విరోధకారణము లధికమగును కావునను, ప్రేక్షకులభావన తగ్గించుగావునను, మనదేశములో నాటకము లైచ్ఛికసమాజములుగనే యుండుగావునను, రంగపరికరమెల్ల విసర్జించి, తెల్లని పరజాయెదుట నభినయించుటయె కర్తవ్యమని యూహించెదను. తెల్లపరదాయెదుటగాని, కొంచెము శ్యామవర్ణ మొందినదానిముందరగాని నటులుప్రవేశించి యాడినచో వారిరూపము లెక్కువ స్ఫుటముగా నగుపడుట కావంతయేనియు సందేహములేదు. రంగపరికరముల దగ్గించినకొలది నటులు తమ నాట్యశిక్షయందే రక్తికలిగింప నెంతురు. ఆంధ్రనాటకరంగమున బ్రస్తుత మవశ్యముగజేయదగిన మార్పు రంగపరికరబహిష్కారమే. విజ్ఞులెల్లరీ యుపదేశమును మన్నించి యవలంబించినచో తెలుగుదేశమున నెందఱో నాటకాభిమానులగు భాగ్యవంతుల దరిజేర్చినవారమగుదుము.

దుస్తులకు విపరీతముగ ఖర్చుపెట్ట నవసరములేదు. చరిత్రనాటకములలో ఆకాలపుతరహాల ననుసరించి దుస్తులమర్చవలెను. తెరలకు ఖర్చు పెట్టుసొమ్ములో నొకపాలు దుస్తులమీద వెచ్చించి, దేశీయుల కాయాకాలములనాటి రూపము లెరుగదెలుపవచ్చును. కుట్టు మాదిరిలోను అలంకారములలోను ఆకాలపు విన్యాసము జూపదగునేకాని బట్టయొక్క విలువయం దేమియులేదు. పూసల చొక్కాలు, చంకీ ఫసందులు నటుని రామునిగా మార్చుటలేదు. దుస్తులకన్న ప్రేక్షకులభావమే పాత్రసారూప్య మొందించుచున్నది. కావున ఆంధ్రరంగములో దుస్తులపై వెచ్చించు దుర్వ్యయమును తగ్గించి చక్కని పరిశీలనతో గూడిన వైఖరుల నమర్చవలెను. మఱియు రామాయణకాలమునుండి నేటివరకు గల దుకూలవర్ణనమందును, బౌద్ధయుగమునుండి నేటివఱకుండు శిల్పములందును,

విశేషమగుమార్పు లగుపడుట లేదు. శిల్పములు, చిత్రములు మనకు సాధనములై యున్నవి. వీనిలో నుత్తమపాత్రములు నగ్నముగ కొన్ని యాభరణములలో జూపబడియున్నవి. ఈ ఆభరణములను పూసలలో నేర్పఱచవచ్చును. చవుకగా ఎలెక్ట్రోప్లేటులో చేయించవచ్చును. సామాన్యపాత్రముల దుస్తులు కట్టులో భేదమే కాని ఇప్పటి నిత్యోపయోగమందలి వస్తువులతో గూర్పవచ్చును. కాన దుస్తులందు కూడ విశేషధనవ్యయమొనర్పనవసరములేదు. ఇప్పటినటులు ఖరీదునే ముఖ్యాంశముగ మన్నించుచున్నారు. కాని, ఔచిత్యమును బరిగణించుట లేదు. నాటక కళ యభివృద్ధిపొందవలసినచో నౌచిత్యమే, చారిత్రయాథార్థ్యమే ముఖ్యాంశమై వెలయవలయును.

## వేషరచన :

తరువాత మనమాడుకథలు హిందూదేశమునకు సంబంధించినవి. ఇచ్చుట ననేక వర్ణములవారున్నారు. మహారాజు లందరు తెల్లగ, పచ్చగనున్న జాడ దొరకకున్నది. అక్బరు చక్రవర్తి చామనచాయవాడు; కృష్ణరాయ లట్టివాడే. అక్బరు కోర్టులో తెల్లనివారు, నల్లనివారు, చామనచాయవారు, బొల్లివారు, పచ్చనివారు, అన్ని రంగుల అన్ని రూపములవారు నుండిరే కాని భాగ్యవంతులు సామంతులుకదాయని యందఱును తెల్లవడలేదు. రాజులందఱు పచ్చగా నుందురని, పేదవాండ్రందఱును నల్లగానుందురని భావించుట యొక వెఱ్ఱి, మన నటులు స్త్రీవేషములలో సావిత్రి, దమయంతి, సీతాదేవుల పద్మినీలక్షణము లొప్పించు సాముద్రిక మేర్పఱచుకొనలేరుగదా! మగవేషములలో కృష్ణునిచక్కదనము, రాముని బలగాంభీర్యములు, కర్ణునియుదారగరిమ చూపగల యంగవిస్ఫూర్తి నొందజాల కున్నారుగదా! పాట రవంతపాడనేర్చినయేమొగమో కృష్ణ నామమున వర్తిల్లునపుడు, భగవంతుడిచ్చినరూపమును మార్చలేనప్పుడు నైజశారీరకవర్ణ మేల మార్ప యత్నించవలెను? మనమొక యాంగ్లనాటకమాడి తెల్లనిపిండిమొగముల జూపవలసినచో తెల్లరంగుపూసికొనుట యుచితమై యుండును. అట్లు కాక మనదేశములోని ప్రాచీన చరిత్రపురుషుల రూపసాదృశ్య మొందదలచితిమేని వారిస్వరూప మెట్టిదియో ముందుగా గ్రహించి కొంచెమించుగా నాతనిబోలు నటుని సంపాదించి వాని ముఖలక్షణములను రబ్బరు, బొచ్చు సామానులతో మైనముతో అమర్చి తగిన వర్ణమువేసికొనవచ్చును. ఇవియన్నియు

లభించనప్పుడు నటుడు కృష్ణుడనుకొనుటకు పాత్రస్వీకరణవే తప్పు. వేరెట్టిసాధనయే లేనప్పుడు అనవసరముగా పాత్ర లక్షణమెఱుంగక చరిత్రకును హైందవనైజమునకును విరుద్ధముగ నందతిని పిండిబొమ్మలవలె రంగుపౌడరులతో నలంకరించుట శుద్ధవెట్టి. చేతనాయెనా, సహజముగ స్వాభావికముగ నమర్చుడు. లేదేని నైజవర్తనములలో మెలంగుడు. ఇంతియేగాని అనహ్యాముగు వెక్కిరింపుభూమిక లమర్చుటయందు ద్రవ్యమన్యాయముగ వినియోగింపకుడు.

## రంగరచన :

ఈ కారణములబట్టి ఆంధ్రనాటకరంగమునకు నే నుపదేశించు ప్రధానాంశ మెద్దియున రంగపరికరములలో తెరలు మొదలగు ప్రకృతియనుకరణములను సంపూర్ణముగ విసర్జించి తెల్లతెరయెదుట నాటకాభినయమొనర్చి ప్రేక్షకుల భావనకా రంగరూపమును విడువవచ్చును. "అహో! ప్రశాంత రమణీయతా, ఆశ్రమపరిసరస్య, "ఈ పురవైభవమెన్న నద్భుతము, కాపురమగు శ్రీకాంతకు సతతము," "అదుగో భద్రాద్రి గౌతమి యిదుగో చూడండి"– అను వాక్యముల వినునప్పుడుదయించు సంపూర్ణగిరివననగర విన్యాసరసానుభవము, సంపూర్ణసర్వాంగసుందర భావచిత్రము, గుడ్డపేలికలు యసంబద్ధచిత్రములందమరునా? వాక్యార్థము ప్రేక్షకులకే వదలినపుడు, వాని భావానుభావములకొలది రంగవైభవ మేర్పడును. ఎవరికే మేడ రుచించునో, యెవరి కేవనసీమ ప్రశాంతముగదోచునో, దానినే భావించి సంతసించుచుందురు. తాలూకా కచ్చేరీలో నాలుగుజాములు కలమాడించు పేదగుమాస్తాను సకల దిగ్దేశ రాజన్యపూజితుడైన రాజసూయాధ్వరాధిపునిగ భావించుశక్తిగల ప్రేక్షకులు, బక్కచిక్కిన యెండురొయ్యను రవిద్గీధితు లొలికించు కర్ణునిగ నెంచగలిగిన సరసులు వాక్యసూచన లందికొని వననగరరూపముల నూహింపజాలకుందురా? తెల్లతెఱ వొకదానితో కాలముగడపి యభినయసౌష్ఠవమున నాట్యకళాసర్వస్వమును బ్రకటించుటకుమారు కృత్రిమరంగ నిర్మాణకౌతూహలంబున భగవంతుని శిల్పినైపుణ్యమును అనుకరింపజాలని తెలివితక్కువనే బయట పెట్టుకొనుచున్నాము. ఈ రంగపరికరసంపాదనోన్మాదము వదలనిచో తెలుగుదేశమున నాటకము లెంతయు నభివృద్ధిలోనికి వచ్చును. తరువాత దుస్తులయం దౌచిత్య మెక్కువ పరిగణింపవలెను. ఇందునగూడ ధనవ్యయ మపారముగ జేయగూడదు.

వీలైనంతవఱకు హైందవనాటక మాడునపుడు, నటులు నిజస్వరూపముతో వచ్చి అభినయించుటకు సిగ్గుపడకూడదు. శ్రీపాద కామేశ్వరరావుగారు రంగపరికరములపట్ల నాయభిప్రాయమే గలిగియు తగుమాత్రపుధనముతో నేర్పఱచవలయునని వ్రాసియున్నారు. 'తగు' శబ్దమునకు ఆద్యంతములు లేవు. అందుచేత ప్రస్తుతరంగప్రసాధనము సంపూర్ణముగ బహిష్కరించి తెల్లతెరలతో నాడుటయే నామతము. రవీంద్రనాధుని శాంతినికేతనాశ్రమములో నారుబయటనే రసవత్తరములగు నాటకము లభినయించి జగద్విఖ్యాతి నొందుచున్నారు. ఇది ప్రతిచోట నలవిగాకున్నను శ్వేత పటలావలంబనముతో తెలుగునాటకముల దౌర్భాగ్యదేవత వదలి నూత్నసౌరభవికాసము లేర్పడుననియే నా నమ్మకము.

## పద్యములు, పాటలు :

నాటకములు ప్రకృతిప్రతిబింబములా? లేక కవికల్పితమైన ఆదర్శప్రపంచమును జూపునవియా? నాటకపాత్రముల భావములు, నడతలు, రసావేశములు, సంభాషణరీతులు, సామాన్యజీవితాంశముల, నిత్యవ్యవహారపద్ధతుల ననుసరించి యుండవలయునా? లేక యలౌకికకావ్య సృష్టియందలి కవికల్పిత, పటవ్యాఖ్యాయిత మార్గములం దుండవలెనా? ఈ సంప్రశ్నము మన విమర్శకుల కందఱికి గిలిగింత లిడియున్నది. దీని పర్యాలోచనలో నాటకమున గ్రామ్యగ్రాంథికముల ప్రయోగము, పద్యములు, పాటలు మున్నగువాని యౌచిత్యము, బరిపరి విమర్శింపబడియున్నది. విమర్శకులలో విశేషభాగము నాటకము జీవితాంశములప్రతిబింబమై యొప్పవలెననియు, స్వభావసహజముగ నుండవలెననియు, పాత్రస్వభావోచితమైన భాష, భావము, రసావేశము, చేష్టాభినయము, నాటకములందుండవలెననియు, పాటలు, పద్యములు అనుచితమనియు దేలుచున్నది. ఇప్పటి విఖ్యాత నటులు కూడ నీ యాదేశములనే మన్నించి, గద్యాభినయముల కెక్కువగౌరవ మొసంగుచున్నారు.

## స్వాభావిక, ఆదర్శక నాటకములు :

నాటకములు దశవిధరూపకముల నామాంతరములైయున్నవి. నాటకములు స్వాభావికములు, ఆదర్శకములు, సాంకేతికములు, వీని

సాంకర్యమున నేర్పడునవియు నై యున్నవి. ప్రబోధచంద్రోదయము సాంకేతికము. ఇది ప్రదర్శనమున కననుకూలము. ఏ భావముగాని, రసముగాని, శుద్ధ స్వరూపమున జూడ నలవికాదు. అన్నిటితో కూడియుండి యవస్థాభేదమున నొక్కొక్కభావము, రసము పొంగి తగ్గుచుండెడి ప్రకృతిస్వభావమునే చింతింపగలము గాని శుద్ధసత్వముల నెఱుగనేరము. అందుచేత సాంకేతిక నాటకములు నిరుపయోగములగుచున్నవి. స్వాభావిక నాటకములలో మృచ్ఛకటిక ముఖ్యమైనది. ఇందునగూడ శకారునంత పిచ్చివాడు, చారుదత్తునంత మంచివాడు, వసంతసేన వంటి వేశ్య సామాన్య స్వభావమున కతీతమైన వృత్తులతో మెలంగుచు ప్రకృతిలో గానరాకున్నారు. గిరీశమువంటివా రెందఱో యున్నను గిరీశమంతటి గడుగ్గాయిని చప్పున జూడనేరము. స్వాభావికములైన నాటకములు దుస్తులలోనే గాక, పాత్రములందేగాక భావములందుకూడ స్వాభావికముగనే యున్నచో మనుజులకు పేలవయిగ దోచకమానదు. ఇందువలన నీతిగాని రసోదయముగాని యేర్పడదు. మనవిమర్శకు లపేక్షించునంతటి స్వాభావికముగా నాటకము లుండినచో వీనిని డబ్బు పెట్టి జాగరణ చేసి చూచుటకుమారు మనయిండ్లలో, సంసారములలో, వీధులలో నేర్పడు నవరసభరితమైన నిత్యనాటకముల నవలోకించిన చాలదా? కేవలము స్వాభావికములైనవి ప్రహసననా మార్హములేకాని నాటకార్హములు కావు. ఆదర్శకములైనవి హరిశ్చంద్ర, సావిత్రి మొదలగునవి మహాద్భుత గుణవిభూతుల నేర్పఱచుచు సామాన్యమానవుల కందరాని యాదర్శ ప్రపంచ మేర్పఱచి నీతిదాయకములుగాకున్నవి. రాముడు లోకసంగ్రహణార్థము సీతను బరిత్యజించుట జనులెల్ల ఆశ్చర్యముగ నభినందింతురు. భీష్మునిప్రతిజ్ఞ కచ్చెరునవొంది గారవింతురు. కర్ణుని మేని వొలుపున దానపరిణామమును జూచి నిర్విణ్ణులగుదురు. హరిశ్చంద్రుని సత్యశీలత మెచ్చుదురు. కాని రామ, హరిశ్చంద్ర, భీష్మ, కర్ణాదుల సద్గుణముల కెంత సంతసించినను, వాని ననుకరించెడి యభిలాష యొక్కనికేనియు బొడమజాలదు. వారి జన్మలలౌకికములు. వారి బలపరాక్రములలౌకికములు. వారి గుణపుంజము లలౌకికములు. ఇట్టి యాదర్శకదివ్య మూర్తులను జూపునాటకములు, ఏకాదశీవ్రతకాలక్షేపముల కర్హములేగాని, సామాన్య మానవుల నీతివర్తనము లేర్పఱచుటకును, కరుణానుకంపితుల జేయుటకునుపయోగించవు. ఎవరో మహాత్మగాంధి వంటివారు ప్రహ్లాదుని చరిత్ర మవలంబించియుండలేదా?

మనమేల యట్టినాటకములజూచి నీతి విత్తములు గాకూడదు? అని ప్రశ్నింప వచ్చును. అట్టి యాత్మపరిపక్వ మేర్పడినవాడు నాటకములు చూడకయే మహాత్ముడు కాగలడు. ఆదర్శక పురుషలను జూపునాటకములు నిరుపయోగములనియే నా నమ్మకము. కాళిదాసుని అభిజ్ఞానశాకుంతలములో స్వాభావికమును, ఆదర్శమును జక్కగ మేళవించి గల్పించియున్నాడు. శకుంతల వంటి ముగ్ధబాలికాస్వభావము కలవారే మనకూతులందరు. ఎవరిపిల్ల అత్తవారింటికి వెళ్ళినను శాకుంతలలోని నాల్గవ యంకమే యనుభవించుందుము. తండ్రులందఱు కణ్వునివంటి వారే. కాని తండ్రులందఱిలో లేని సూక్ష్మవిభేద మెద్దియో కణ్వునియం దగుపడును. మన పిల్లలకు లేనిముద్దు లెవ్వియో శకుంతలయందు గాననగును. ఇట్టి స్వభావా దర్శనసమ్మిళితములగు నాటకముల జూచుటవలన మనమెఱింగిన ప్రకృతిరూపము లనుభవించుటయేగాక, మన మందికొని యవలంబింపదగిన సదాదర్శనములు కూడ నేర్పడును. ఇందుచే నిట్టి నాటకములే యెక్కువ స్వాభావికనిత్యజీవితమును, కొంచె మాదర్శస్వరూపమును జూపించుచు, కావ్యపరిణామమైన నాటకమునకు కాంతా సమ్మితధర్మదేశికత్వమును ఆపాదించుచున్నవి. అనగా నా సిద్ధాంతములో నాటకము కేవలము జీవితస్వభావ ప్రతిబింబమై యుండక, నిత్యజీవితమునకన్న కొంచెమెక్కువ భావము, రసము కలిగి ప్రకృతికి కవియొనర్చు స్వాదువ్యాఖ్యానమై యుండవలెను.

## నాటకములందు స్వభావానుకరణము :

కావ్యములందు, చిత్రములందు, నాటకములందు స్వభావానుకరణమే, ప్రకృతిప్రతిబింబనమే పరమోత్తమస్థితియని నా జీవితములో కొంతకాల మనుకొనుచుంటిని. కాని వీనిలోని విశేషము లనుభవించినకొలది, కావ్యరూపక చిత్రముల అర్థము "బ్రాంతిగ పైకొనఁవలెను" అను పెద్దన్నగారి యాదేశముతో నేకీభవించుచున్నాము. స్వాభావికముగనుండి కరుణానుకంపముల నేర్పఱచుచు, సులభముగ నర్థమగుదు నెద్దియో యొక యలౌకికస్ఫురణచే ననిర్వాచ్యమగు నిరంతరానందమును గల్పించుచుండవలెను. సముద్రతరంగములను చూచునపు డేరీతిగ నంతులేని భావప్రవాహ మూరుచుండునో, అటులనే కళానామ గౌరవార్హమగు కృతులన్నిటియందు ననంతమగు భావస్ఫురణ కలుగుచుండవలెను. ప్రకృతి యెంత దురవగాహమో, కళాసృష్టి కూడ అంత సుబోధకముగను,

అంతదురవగాహముగను నుండవలెను. ఇట్టిస్థితి యేర్పడుటకు కళలు ప్రకృతిలోని రూపరసభావసౌందర్యముల ప్రతిబింబించుటయేగాక, తమంతటతామే యందమైన కల్పనలై యుండవలెను. కల్పన యనగానే కవిస్వాతంత్ర్య మూహింపబుడచున్నది. మన ముదాహరించిన విమర్శకులు "నిరంకుశాః కవయః" అని చెప్పుచు కవుల కాలుసేతుల నిర్బంధించుచున్నారు. నాటకము జీవితావస్థల అనుకరణముగ నుపయోగించుటయేం నా మతము. మనుష్యులు సుఖదుఃఖముల అనుభవమొందినపుడు తా మారసములందుమగ్నులై, మానసిక యోగమొందక, ప్రపంచానుభవముల నీతిపాఠములను, ఆత్మశిక్షను సంపాదింపజాలకున్నారు. అట్టి జనసామాన్యమునకు నిశ్చలమానససుఖస్థితిలో జీవితానుభవముల జూపించి సంతసింపజేయుట యుచితమే. కాని యందు కొఱకు నాటకములు కేవలము స్వభావోక్తి ననుసరించి యుండకూడదు. అథవా స్వభావోక్తి ననుసరించినను అన్ని యవస్థలలో అన్ని రకములమానసము లొందు రసభావానుభవముల గుర్తించి చిత్రింపవలయును. సామాన్యసంస్కారముగల మనబోటి వాండ్రుకూడ నుదారభావముల దగిలి మాటాడునపుడు, వైరాగ్య మనుభవించునపుడు, భక్తిపరవశులవై యొప్పినపుడు, భీకరరమణీయసౌందర్య మూర్తుల బ్రశంసించునపుడు ఆయా సందర్భముల కనుకూలమైన భాషావిభేదము లొందుచునే యున్నాము. గద్యరచయితులు రసభావానుగుణ్యమగు కావ్యవిన్యాసములో వృత్తబంధముల పొలిమేర జేరుచున్నారు. నిత్య జీవనములో మన మెుక్కవిధమగు గ్రామ్యభాషనే మాటలాడుటలేదు. ఎంతటి యసంస్కారియైనను, రసభావానుకూలముగ తన కందిన వాఙ్మయములో నుచ్చరించుచుండును. అందుచేత స్వాభావికముగ వ్రాయదలచినను, గద్యమే యవలంబించినను చిత్రవైఖరులుండక తప్పవు. అట్టియెడ నాటకరచనమే కావ్యసిద్ధిగనెంచి, దాని నొక నిత్యసుందరమూర్తిగ నుద్దేశించి వ్రాయనపుడును, అందలి ఇతివృత్తము, పాత్రస్వభావము సామాన్యప్రపంచమునకు కొంచెము భేదముగ నుండవలసినపుడును మన విమర్శకులు గోరునంతటి స్వభావానుకరణము నాటకములందుండకూడదనియే నాయభిప్రాయము.

## గద్యాభినయము, పద్యాభినయము :

నాటకములందు మొదటనుండి తుది వఱకు హోరుమని పద్యములు

ప్రయోగుచుండుట నా కయిష్టము. గద్యములో నెక్కువ రసవంతముగ, నభినయానుకూలముగ జెప్పవలసిన పట్ల నుపయోగింపదగును. భావప్రవాహము విచ్చలవిడియై తోచునపుడు, భావసంక్షోభ మేర్పడి మానస మల్లకల్లోలముగ నూగునపుడు తత్తదవస్థానుకూలమగు గద్యవైఖరు లేర్పడవలెను. కథాంశము చాలవఱకు గద్యములో నడువవలయును. సంస్కృతమహాకవులయాదర్శ మవలంబించి, నీచపాత్రములకు అవస్థానుకూలమగు గ్రామ్యవైఖరులు వాడవలయును. ఉత్తమ పాత్రములుగూడ కొన్ని సందర్భములలో గ్రామ్యసామీప్యతను జెందుచుండవలెను. గద్యోచ్చరణమందు వీలైనంతవఱకు నటులు రంగోపన్యాసవాచకక్రమమును, అనగా తెచ్చిపెట్టుకొన్న నాటకపుయాసను వదలి సంభాషించుపగిది వాక్యముల స్వభావసహజముగ నుచ్చరించవలెను. నటుడు అర్థము తెలిసి వాక్యము నుచ్చరించినయెడల నెట్టి దీర్ఘసమాసమునైనను సుళువుగ నుచ్చరింపవచ్చును. వీరేశలింగము సుందరకుని వేష మభినయించుచు, వేణీసంహారములోని కురుక్షేత్ర సమరాభివర్ణనమందలి దీర్ఘసమాసముల నపశబ్దపద భ్రంశములేర్పడకుండ జక్కగ నర్థమగునట్లు, ప్రభుసన్నిధిని సేవకుడు నివేదించునట్లు విచ్చి సంభాషణస్వభావ మెప్పునట్లు చెప్పగలిగెను. నెల్లూరు నగరాజరావు, మైసూరు వరదాచారి ఈపద్ధతినే గద్యములుపన్యసించుచున్నారు. గద్యరచనలో వీలైనంత వఱకు రసభావములకు ప్రాధాన్యమొసంగి, వాగాడంబరము తగ్గించవలసియున్నది.

కథాసందర్భములో కొన్ని తావుల భావమునకు శాంతస్థితి యేర్పడి చేష్టోద్వేగము చల్లవడినపుడు చక్కని పద్యముల జదువవచ్చును. ఈ పద్యముల సంఖ్య నాటకసమష్టిలో పదిపండ్రెండుకన్న నెక్కువ ఉండవలసిన పనిలేదు. సంభాషణలో నిద్దఱునటులు తమ యభిప్రాయముల దెలుపుకొనినపుడు పద్యములకన్న గద్యములే ఎక్కువ భావవాహకముగనుండును. కాని నటులు తమలో తా మాలోచించుకొనినపుడుగాని, యెుండొరులతో నేదైన నుదారభావముపదేశించునపుడుగాని, ప్రకృతిని వర్ణించునపుడుగాని అర్థాంతరన్యాసమున భావభంగ మేర్పఱచునపుడుగాని పద్యములను వాడవచ్చును. ఈ పద్యములు చదువుటలో నటులు అర్థప్రధానముగ శ్రావ్యముగ జదువవలెను. పద్యవృత్తములు వీలైనంతవఱకు భావోచితముగ నుండవలెను. ఏ వృత్తములోనైనను

యేరాగములోనైనను అన్ని భావములు, రసములు కుప్పించగలమని కొందఱు చెప్పుచున్నారు. కాని నేనది విశ్వసింపను. ఉదారమైన భావముల వెల్లడించుటలో భైరవి, శంకరాభరణము మొదలైన రాగములు కొన్ని, శార్దూల మత్తేభవృత్తము లుపయోగించినట్లు మిగిలినవి యుపయోగింపవు. సీసము చెప్పినభావమునే నాలుగు మార్లు తిరిగి యుచ్చరించుట కుపయోగపడుచు, తుదకు పద్యార్థమంతయు నంత్యగీతమందిముడుచున్నది. ఈ పెనుపద్దెముల వాడి కాలయాపనము, కంఠశోష కలిగించుటకన్న, సీసార్థమంతను గీతములో చేర్చుటయే యుచితము. నాటకకవి వృత్తముల నిర్ణయించుటలో సంపూర్ణ స్వాతంత్ర్యము గలిగి, వీలైనంతవఱకు రసభావవాహకమగు వృత్తములనేరి వ్రాయుట యుచితము. పద్యములను గద్యమువలె చదువుటనే నామోదింపను. ఇట్టి ప్రక్రియ పార్శీ కర్ణాటక నాటకములలో కొంత వఱకుచూచియున్నాను. ఏమియురమ్యముగా లేదు. పాత్రమును పద్యములోనుండు లయగణయతి విశ్రాంతులనువదించు భావ విశ్రాంతి యేర్పడినపుడే పద్యముల జదువునెడల మన విమర్శకులూహించు బాధకము లేర్పడనేరవు. భావతరంగము లుప్పతిల్లి "కర్తుం నకర్తు మన్యథాకర్తుం" అను సందేహములలో మానసము డోలాయితమై, త్వరప్రచారమున నల్లాడునపుడును, గద్యములో చెప్పదగినభావములే దగిలినపుడును, పద్యముల వాడి వాని నిటు నటు పాడవలెను, చదువవలెను, అనుశంకలొందుటకుబదులు, తగినతావులనే పద్యములు వాడిన యెడల, నిన్ని విమర్శనల కవకాశముండ కుండుటయే గాక, నాటకమునకు రసము, సౌందర్యము చేకూరును. కవులు పద్దెమును వాడవలసిన తావులెఱుంగక నిచ్చవచ్చినట్లు పద్దెముల వెదజల్లి దుస్థితి కూర్చియున్నారు. తిరుపతి వెంకటేశ్వరులంతటి వారు కూడ ''ఎల్లి సూర్యోదయంబున నేగువాడ, నిటవసించెద విదురునియింట మాపు" అను పద్యమువంటివి అనేకములు తమ నాటకములలో గుప్పించియున్నారు. ఈ దురభ్యాసమును, సంపూర్ణముగ మాని పద్యములను తగినతావుల వాడి నాటకమునకు కళకాంతులు, అందచందము లేర్పఱుచుటయే నా యభిమతము. ఆంధ్రభాషకు నైజమైన కళకాంతు లొలికించు వృత్తములన్నియు, పూర్వకవులచే వెదుకబడి స్థిరపఱుపబడినవనియే నా నమ్మకము. హిందువుల మేధాశక్తి సూక్ష్మగణితాంశప్రస్తరణమం దసమానసిద్ధి నొందియున్నది. సంగీతస్వరముల

నెన్నివిధముల మేళవించి, యెన్ని రాగతాళ ప్రస్తరణ వైఖరు లేర్పఱచియున్నారో, ఆవిధముగనే గణప్రస్తరణమందుకూడ నిరంతరమగు ప్రస్తరక్రమముల నేర్పఱచి రుచిచూచి తెలుగుబాసకు నైజసౌందర్యమున నొప్పిదమగు వృత్తములనే యాంధ్రకవితాదురంధరు లాదరించిరని నా నమ్మకము. ప్రస్తుతము వాడుకలోనున్న వృత్తములు తెలుగు బాసకు సిద్ధములై నిలువగల సామర్థ్య మొప్పునవిగా నగుపడుచున్నవి. కొన్ని వృత్తములు లలితమైన భాష కుపయోగించుచు జనసామాన్యమునకు రుచించునవి కలవు. వానిని సామాన్య పాత్రలయెడ బ్రయోగింపవచ్చును. గద్యవైఖరు లెట్లు పాత్రోచితభాషలో గూర్పవలెనో, అటులనే వృత్తములను, కళికలను పాత్రోచితముగ నందుకు తగిన లలితగంభీరభాషా ప్రయోగమున గూర్పవచ్చును. కాని తెలుగుదేశపు గ్రాంధిక కావ్యములందుగాని జనసామాన్యపు గీతికాసారస్వతమందుగాని ప్రసిద్ధముగ నిలువని నూతనపద్ధతు లవలంబించుట నా కిష్టములేదు.

## సంగీతము :

పాటలు తెలుగుబాసకు నైజమగు సంగీతక్రమములలో నుండవలయును. ఇవియు భక్తిమున్నగు మిక్కిలి మానస విశ్రాంతిగల తావుల వాడదగునేకాని కథాక్రమములో నిచ్చవచ్చినతావుల వాడకూడదు. నాటకమునకు నాలుగైదు పాటలుండిన చాలును. నాటకము రెండున్నర లేక మూడు గంటలలో ముగియు కథాంశమైయుండి ప్రధానకథలో నాటకాలంకార లక్షణములు చక్కగా నేర్పడి విశేషము గద్యముగను, కొద్ది పద్యములు, అంతకన్నకొద్ది పాటలు సందర్భోచితముగ జేరియుండవలెను. సుమారేబది పేజీల డెమ్మీసైజు కథాంశమై, అందు 18 పద్యములు, 6 పాటలు నుండిన చాలును. ఇట్టి నాటకము రెండు గంటలకాలములో ప్రదర్శింపవచ్చును. అంకములమధ్య హాస్యప్రహసన మొకటి గల్పించిగాని నారదాదిపాత్రప్రవేశమునగాని యొకగంట సంగీతకాలక్షేపము కల్పించి పామరజనమునకును సంగీతాభిలాషులకును హాస్య సంగీతప్రసంగముల సంతుష్టి యొసంగవచ్చును. ఇందువలన ప్రజలు హాస్యసంగీతముల నానందించి యెక్కువగరాగలరు. సరసులు కథాంశమును అందలి రసభావ ప్రదీపనమును సలక్షణముగజూచి నాటకకళయొక్క ప్రథమప్రధానాదర్శమైన అభినయమును చూడగలుగుదురు. నాటకసమాజములు జనసమూహ సంతోషము కొఱకు రసికుల

నలయింపకూడదు. పండితసంతుష్టి కొఱకు జనసామాన్యపు భిన్నరుచుల దెగటార్పకూడదు. అందుకు ఇందుకు చెడకుండ నుభయుల దనియింపుచు నాటకకళ కభివృద్ధిగూర్చుచు నాడవలసిన పద్ధతి యిది యొకటియే తోచుచున్నది. రసికులు, విద్వాంసులు, నుద్యోగులువచ్చి ప్రోత్సహించవలెనన్న నాటకము లిప్పటికన్న చాల తక్కువకాలములో నాడబడి యెక్కువ రసవంతముగ నుండకతీరదు.

కావున నాంధ్రనాటక కవులకును, నటులకును, సమాజములకును, నే నొసంగెడి యుపదేశ సారాంశ మిదియే. ముందుగ రంగపరికరములన్నియు తగ్గించి శుభ్రమైన తెల్ల తెరలతో రంగ మమర్చవలయును. దుస్తులను, హిందూదేశపు నానాకాలముల చరిత్రశిల్పచిత్రములు చూచి తత్కాలోచితముగ, ప్రధానపాత్రలకు శుభ్రమైన చౌకగుడ్డలలో నమర్చవలయును. పెట్టెడిసొమ్మునంతను నటులకు శిక్షయొసంగుటయందు వినియోగింపవలయును. నటులకు శిక్షయొసంగుటయందు వినియోగింపవలయును. నటులకు కొంచెము అర్థ జ్ఞానము, కొంచెము గీతికావిశుద్ధత కలుగునట్లు తరిఫీదు చేయవలెను. నాటకములు చాలవఱకు గద్యములో వ్రాయబడి, యుచితమైన తావుల పద్దెములు, పాటలు కలిగియుండవలెను. నాటకములలో రెండు కథాంశములు జరుగుచుండిన బాగుండును. పామరజనులకు ప్రత్యేకసంతుష్టికలిగించుటకు, హాస్యసంగీత ప్రసంగములు విడిగానుండవలెను. నాటకము, హాస్య విష్కంభములు, మొత్తముమీద మూడుగంటలకాలముకన్న నెక్కువ పట్టకూడదు. ముందు నాటకములు వ్రాయువారందఱు ఈ పద్ధతిని వ్రాయవలెను. ఇదివఱకున్న ప్రసిద్ధనాటకములను సంగ్రహించి, రెండు గంటల కథాంశము, ఒక గంట హాస్యసంగీత ప్రసంగములు వీలగునట్లుగ గూర్పవలెను. నాటక సమాజములలో పెట్టుబడిపెట్టువా రొకరు, నటులు వారివద్ద జీతములు, బహుమతులు, అడ్వాన్సులు, పుచ్చుకొనునట్లుండకుండునటులను, భాగస్వాములుగ వారి తెలివియే మూలధనముగనిచ్చు Share-holders గ నియమించి కట్టుదిట్టములతో పనిచేయించినయెడల మేలగునని నా నమ్మకము.

☸

## ఎనిమిదవ దళము

# నాటక విమర్శనము

### శ్రీకృష్ణుడు

తెలుగు నాటకములలో మిక్కిలి పేరొందినదియు, తెలుగు పొత్తములలోనెల్ల విక్రయ బాహుళ్యమున మించినదియు లక్ష్మీనరసింహముగారి గయోపాఖ్యానమే! ఈ నాటకము సుమారిరువది సంవత్సరముల క్రిందట రచియింపబడినను, 1907 సంవత్సరమున ఆంధ్రదేశమునందు జాతీయోద్యమము అల్లికొనిన వెనుకనే జనరంజకమై, కడుదవ్వు ప్రాకినది. ఈ యుద్యమములోని ముఖ్యాంగము భారతవీరుల మహూదార చరిత్రముల దలపోసి వారిని పూజించుటయేగాన నట్టిచరిత్రముల బ్రకటింపు గయోపాఖ్యానము[135], పాండవవిజయము[136] వన్నెకెక్కుట సంభవించినది. ఈ రెండు నాటకములు శ్రీకృష్ణుని జీవితచారిత్రమును గూర్చి ప్రజల కదివఱకు గల్గిన యభిప్రాయములకు రసయుక్తమగు వ్యాఖ్యానముగ దనరుచున్నది. షేక్స్పియర్ మహాకవి పాశ్చాత్యపురాణములందలి గాథలను నాటకరూపమున రచియించుచు, పౌరాణికులకు దెలియనేరనియంశము లెట్లు ప్రకటించెనో, అటులనే ఆంధ్ర కవిపుంగవులగు లక్ష్మీనరసింహము, తిరుపతి వేంకటేశ్వరులు శ్రీకృష్ణుని దివ్యచరిత్రమును గైకొని నాటకరూపమగు వ్యాఖ్యానమును రచియించి పేరువడసిరి.

---

**135. "గయోపాఖ్యానము" :** చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి ప్రఖ్యాతనాటకం. 1940నాటికే లక్షప్రతులు అమ్ముడుపోయి రికార్డు సృష్టించిన నాటకం.

**136. "పాండవ విజయము" :** తిరుపతి వేంకట కవుల ప్రఖ్యాత నాటకం.

కృష్ణుని గూర్చి ప్రజలకు అభిప్రాయభేదములున్నవా? భారత భాగవతములు వీరి మానసప్రవృత్తి నేవిధముగ వర్ణించినవి? వీనినెట్లు సమన్వయముచేసి మనయాంధ్రకవులు మన్ననజెందిరి?

భారతభాగవతముల రెంటియందును శ్రీకృష్ణుని లౌకిక పారమార్థిక తత్త్వములు వర్ణింపబడియున్నవి. ఈతడు ఇతర మహాత్ములవలె తాను నివసించినకాలమందలి మంచిచెడ్డలను గనిపెట్టి, జనాదర్శముల గుర్తించి, క్రొత్తదారుల జూపుటలో తన శక్తియుక్తుల జక్కగ వినియోగించెను. వీరికి లేనిశక్తి యొకటి మాత్రము శ్రీకృష్ణునకు విశేష గౌరవము తెచ్చినది. ఆశక్తి వలన నీతడు ద్వాపరాంతమున దుర్యోధన, జరాసంధ, శిశుపాలాది మహాశూరపాలితమగు ధరామండలమున వన్నెకెక్కి జగన్నాటకసూత్రధారిగ నాచరింపగలిగెను. ఈ శక్తి ఆత్మానాత్మ వివేకమే. ఆత్మవివేక మెవ్వనికుండునో, వాడే జగత్పాలకులకు వలయు మేధాశక్తియు, బలసంపత్తియుగలిగి యొప్పుచుండును. దీనివలన కృష్ణుడు, యేసుక్రీస్తు, జూలియస్ సీజర్, మహమ్మద్, నెపోలియన్‌బోనపార్టు మున్నగువారివలె ప్రజల కైహిక సౌభాగ్యముల గూర్చి పెట్టుటయేగాక తన యోగప్రభావమున అనేకుల కాత్మానాత్మవివేకము కలిగింప గలిగెను. ఇందువల్లనే కృష్ణుడు తన జీవిత కాలమందు భగవంతుడుగ నారాధింపబడెను. ఈ మహాయోగీశ్వరునకు జయాపజయములు, లాభాలాభములు, సుఖదుఃఖములు, మంచిచెడ్డలు ఒక్కరీతిగ తోచుచుండెను. అట్టివాడు ప్రహ్లాదాది సిద్ధుల వలె సమభావమున వర్తింపక లౌకిక వ్యవహారములందు పాక్షిక భావమేలయవలంబింపవలెను? వీనిని గూర్చి సామాన్యమానవుల యెడ గర్వమగు గాథ లేకతమున నేర్పడెను?

శిశుపాలాది విరోధులు కృష్ణుని సామాన్యమానవునిగా నెంచుచుండిన చిన్నతనములో వెన్నముద్దలు దొంగిలించుటయు, చీరెల నెత్తుకొనిపోవుటయు, వలసినచో నబద్ధములు పలుకుటయు అందఱకును తెలిసిన విషయమే. కాళీయమర్దనము జరుగునెడ భోగిభోగపరివేష్టితుండైన కృష్ణుని గనుంగొని తత్ప్రభావంబు లెఱుంగక గోపబాలకులార్తరవంబుల బరితపించిరని భాగవతము తెల్పుచున్నది. సంగరహితుండైన కంసారి సంసారికైవడి విహరించుచుండెనట.

**కం॥ వారిజగంధులు తమలో**
**వారింపగరాని ప్రేమ వాదము సేయన్**
**వారిజనేత్రుడు నను దగ**
**వారిండ్లకు బనుపు నలుక వారింప నృపా ॥**

**కం॥ నిచ్చలు లోపలికాంతలు**
**మచ్చిక తనతోడ నాడుమాటలు నాకున్**
**ముచ్చటలు సెప్పు మెల్లన**
**విచ్చలవిడి దొడల మీద విచ్చేసి నృపా ॥**

భాగవతమునందే కృష్ణునిగూర్చి యిట్టి యభిప్రాయభేదములగుపడు చున్నవి. లక్ష్మీనరసింహముగారి గయోపాఖ్యాన కృష్ణుడు సామాన్యజీవితములో మనుష్యునివలె నాచరించుననియు, విషయసందర్భమున తన దివ్య ప్రభావము జూపించుననియు చెప్పుచున్నది.

**శ్లో॥ యదాదిత్య గతంతేజో జగద్భాసయ తేఖిలం ।**
**యచ్చాంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధి మామకః ॥**

అని కృష్ణుడు సూర్యున కర్ఘ్యప్రదానము గావింపుచు భంగము కలుగునెడ తపోనిష్ఠాగరిష్ఠుడగు మౌనిగతి గయునిపై నీర్ష్య వహించెను. ఎచ్చటనో, వైకుంఠపురప్రాసాదసౌధంబులపై, కడువేడ్క రమించుచు గజేంద్రుని కుయ్యాలించి, పరుగెత్తివచ్చిన విష్ణు తత్త్వమే కృష్ణుని యందుండిన యెడల, "సిరులిచ్చుకొలది నీసేవ జేయుటెకాని మానసంబున నిన్ను మఱచి యెఱుగ"నని వేయివిధంబుల మొరలిడు గయుని యార్తాలాపంబు లేల విననేరడు? గజేంద్రాంబరీషుల కిచ్చిన యభయమేల నీగయున కొసంగడు? "కేవలం స్మరణేనైవ పునాతిపురుషం" అను పూర్వార్జిత ప్రతిష్ఠ నేలకోలుపోవును? నిశ్చయముగా కృష్ణుడు యీ సందర్భమున సామాన్యమానవుల నతిక్రమించియుండలేదు. దేవకీసుభద్రలు, తన యర్ధాంగియగు రుక్మిణియు వచ్చి బ్రతిమాలినను అర్జునునిపై కోపము వదలడాయెను. అర్జునునితోడ పోరాడ నిశ్చయించి రణరంగమున మార్కొనుతరి షుమేర్ సింగ్ వలె బహువిధములగు శోకతాపముల ననుభవించుచు సామాన్యునివలె నాచరించెను. అర్జునుని చంపవలసివచ్చుటయు, ప్రతిజ్ఞాభంగమున మానహాని

కలుగుటయు వీని యంతరాత్మకు జంటబల్లెములై బీడింపుచుండెను. చతురోపాయములచే నర్జునుని మరలింపజూచి విఫలుడై యావేశము జెంది తన యోగప్రభావమున నాతని చంపజూచెను. కాని మరల కృష్ణుని మానవ నైజమే వెలువడెను.

తిరుపతి వేంకటేశ్వరకవుల పాండవవిజయములో కృష్ణుడు త్రికరణశుద్ధిగా సంధి కొఱకే పాటుపడినట్లు కనుపించును. భాగవతములో నీదివ్యపురుషుడు రాజన్యుల కన్యోన్యవైరంబులు కల్పించి భూభారమును దొలగింప నుద్యుక్తుడై యుండెననియు, రాయబార నివేదనము కపటకృత్యమనియు సూచింపబడియున్నది. ఇట్లనుకొనుట కృష్ణునియందు సాధుత్వము లేదనుటయే గాని వేరుగాదు. పాండవవిజయములో నీతడు సభాపరాభవము గల్గునని పూర్తిగ గుర్తెఱిగియు హస్తినకేగి లోభాంధుడగు ధృతరాష్ట్రునితోడను, మదోన్మత్తుడైన సుయోధనుని తోడను దీనునిభంగి సంధి మాటలు చెప్పి యెటులైనను కురుపాండవ సంగ్రామమహూత్పాతంబు వారింపజూచెను. ఇచ్చటనీతడు మహాసమర్థుడగు రాయబారివలె చతరోపాయంబుల బ్రకటించి లౌకికునివలె గానుపించెనుగాని, వాస్తవమున నీతని యంతరాత్మ సమరపరాఙ్ముఖమై యుండెననుట కావంతయు సందియము లేదు. మొదటి నుండి తుదివఱకు నీతడు మహాయోగివలె "యేమైతే నాకేమి?" అనునట్లు నటింపుచుండెను. మేనల్లుడు చచ్చినప్పుడుకూడ నీతడు ఎట్టివిచారమును పొందలేదు. కాని యవసరమైనప్పుడు,

**మ॥ తనసేవారతిచింతగాని పరచింతాలేశమున్ లేని స**
**జ్జనులన్ బాండుతనూజులన్ మనుచు వాత్సల్యంబుతో ద్రోణనం**
**దనుబ్రహ్మాస్త్రము నడ్డపెట్టబనిచెన్ దైత్యారి సర్వారిసా**
**ధననిర్వక్రము రక్షితాఖిలసుధాంధశ్చక్రమున్ జక్రమున్"**

కొన్ని సమయములందు ప్రతిజ్ఞాభంగమున కోర్చి యుద్ధములో జోక్యముకలుగజేసికొనెను. ఇట్టుల సందర్భానుసారముగ వర్తించుచు, లౌకికసాధనము లీడేరినప్పుడుమాత్రమే తన యోగప్రభావమును చాటించుచు హైందవచారిత్రము యొక్క పూర్వరంగమున సూత్రధారియై, విలసిల్లి జ్ఞానోపదేశముగావించి, శాశ్వతకీర్తిగణించి, యీ మహనీయుడు గతించెననియు,

నీతడు పరమహంసలవలె నెన్నడు సంకల్పశూన్యుడై యుండలేదనియు మన యాంధ్రకవీంద్రులలో మిన్నలగు లక్ష్మీనరసింహ, తిరుపతి వేంకటేశ్వరులు నిశ్చయించిరి.

## కర్ణుడు

తెనుగు నాటకకవులలో పెక్కులు కర్ణుని యొక మహాగర్విగను, మదాంధునిగను, వినయశూన్యునిగను, వాచాప్రగల్భునిగను నూహించియున్నారు. ద్రౌపదీస్వయంవరము[137], పాండవాజ్ఞాతవాసచరిత్రము[138], వేణీసంహారము[139] మున్నగునాటకములలో కర్ణుడు, శకునిదుశ్శాసనాది పరమనీచులతో తుల్యుడుగ చిత్రింపబడియున్నాడు. భారతకథాసారము విమర్శగ విచారింపనికతన నీమహాయోధునకు, నీమహూదారగుణ సంపన్నునకు దుష్టత్రయంబున జేరు నదృష్టము సంభవించినది. భారతసుధాపిపాసార్తులయి భారతవీరుల దివ్యచారిత్రముల నాటకరూపమున దెనిగించిన తిరుపతి వెంకటేశకవిధీరులకే కర్ణుని యాత్మప్రవృత్తి సంపూర్ణముగ గోచరించినది. వీరి నాటకములలో కర్ణుని మనోవికారములకు గల మూలకారణములు కథాసందర్భమున సూచింపబడుటయే గాక వాని యుదారభావములు చక్కగా వెలిపుచ్చబడినవి.

కర్ణునకు నెదుటివాని యభిప్రాయములందసహిష్ణుత తరుచుగ గోచరించును. దీనికి వాని యసమానపరాక్రమమే మూలకారణము. 'కర్ణుండేమి భుజశక్తింజూడ సామాన్యుడే' అని శ్రీకృష్ణునకే భయము జనించెను. ఎటులైనను

---

**137. "ద్రౌపదీ స్వయంవరము" :** హోతా వెంకట కృష్ణయ్యగారి నాటకం. 1904లో రాయబడ్డది. దీనిని గుంటూరు కంపెనీలు బహుళంగా ప్రదర్శించాయి.

**138. "పాండవాజ్ఞాత చరిత్రము" :** సుసర్ల అనంతరావుగారి నాటకం. రచన 1897. దీనిని రాజమండ్రి హిందూ నాటక సమాజం ఆడేది.

**139. "వేణీ సంహారము" :** భట్ట నారాయణుని సంస్కృత నాటకానికి వడ్డాది సుబ్బారాయుడిగారి అనువాదం. 1883లో రచన. దీనిని మొదట గోదావరిజిల్లా వేగాయమ్మ పేటలో స్థానిక సమాజం ప్రదర్శించింది. అదే సంవత్సరం వడ్డాదివారు ప్రారంభించిన "హిందూనాటకోజ్జీవక సమాజం" రాజమండ్రిలో ప్రదర్శించింది. ఆ తరువాత అర్ధ శతాబ్దం పాటు ఆంధ్ర నాటక రంగం మీద అజరామరమై నడిచిన నాటకం.

దేహసంరక్షణమే సేయవలయునను జనసామాన్యవాంఛ కర్ణునకెంతమాత్రము లేదు. ఇంద్రప్రస్థరాజ్యరమాసాంగత్యమందీతని కెట్టియాశయు లేకుండెను. సుప్రసిద్ధమగు క్షత్రియధర్మములే కర్ణునిమనోవీధి నలంకరించుచుండెను. ఇట్టి సందర్భమున పిరికిమాటల పలుకు వృద్ధవచనంబు లీతనిమనంబునకెంతయు హాస్యాస్పదముగ దోచుచుండెను. వాని నతడు ధిక్కరించుటలో నిష్కపటముగను, నిర్భయముగను వాదించుకతన నీతడు పొరుబోతని కొందరభిప్రాయపడక తప్పదు.

కర్ణుని రెండవ పొరపాటు బ్రాహ్మణులయందసూయ, తిరస్కారభావము నైయున్నది. "సూతుని చేతికిందొరకి, సూతకళత్రముపాలుద్రావి, యాసూతుని యన్నముంగుడిచి, సూతునిగా" పరిగణింపబడియున్నను, కర్ణుని నైజ భూపాల భావములుప్పొంగి వానినడతను ద్రిప్పుచుండెను. సూర్యుడు ప్రత్యక్షమగువఱకును తన జన్మవృత్తాంతము కర్ణునకు దెలియదుగాని, యాతని యాదర్శములు అభిలాషలుగ మాత్రము మహాక్షాత్రసంపత్తిచే వెలుగుచుండెను. తన్ను పరశురాముడు శపించుటయు, ద్రోణాశ్వత్థామలేగాక సర్వసముండగు భీష్మాచార్యులుగూడ నీచునిగ భావించుటయుఁ జూచి కర్ణుని యంతరాత్మ యోపజాలక దిట్టుచు గారులు గ్రక్కుచుండెను. ఇదియుంగాక, బ్రాహ్మణుల స్వార్థపరాయణత్వమును, అధికారాభిలాషయు భారతకాలముననే యంకురించినట్లగు పడుచున్నది. ఈకాలమున బ్రాహ్మణులు యితరజాతుల నజ్ఞానాంధకారమున బడద్రోసి వారి మౌఢ్యతవలనను, తమ విజ్ఞాన మహిమంబునను తామే దేశప్రముఖులుగను, దేశాధికారులుగను వర్తింప బ్రయత్నించుచుండిరి. ఇట్టి తరుణములో నితర జాతులయందొడమిన ధీమంతులును పరాక్రమశాలురును బ్రాహ్మణుల స్వార్థపరాయణత్వమును నిర్మించి తమ హక్కులను గాపాడికొనవలయునను పూనికతో పనిచేయుచుండిరి. అట్టివారిలో నగ్రగణ్యుడగు కర్ణుడు తన మహాప్రతాపముల బ్రాహ్మణులపై జూపనెంచుట యొకవింతకాదు.

కర్ణుని మూడవ లోపము ద్రౌపదీ స్వయంవరమున తనకు గల్గిన పరాభవము మఱువకుండుటయే. ద్రౌపది తన భార్య కాలేదనువిచార మీతనికి నుండినట్లుగాని, అందునకై పాండవాదులతోడి పోరుసల్పినట్లుగాని యగుపడదు.

శిశుపాలుడు కృష్ణునిపై పూనినపగవంటి యింద్రియమాత్సర్యము గానరాదు.

తిరుపతి వేంకటేశ్వరుల భారతనాటకములలో పైజెప్పిన దుర్గుణత్రయము హేతుయుక్తముగ సూచింపబడుటయేకాక, ఇవియు వాని నిర్వక్రమరాజభక్తిచే జనించినవిగ చెప్పబడి యున్నవి. ''చిన్నతనంబునుండి దయచేసి రమావిభవంబొసంగి నా యున్నతి కోరి నాపయి మహోన్నతి పూనినరాజున' కెట్టి పరాభవము గలిగినను, యనిష్టము వాటిల్లినను తనకేగల్గినరీతి భావించుచు ప్రభుచిత్తానుసరణవే పరమావధిగ యోచించుచుండెను. ధర్మమార్గానువర్తులకియ్యది యనావశ్యకమను ద్రోణాశ్వత్థామల నుడువుల నీతడు విశ్వసింపడు. ప్రభువే తన దైవము. ప్రభువాక్యమే తన శ్రుతిస్మృతులు. ప్రభుసేవయే మహామోక్షదాయకమగు పరమయజ్ఞము. ఇందుల కడ్డముగ పలుకవచ్చిన కృష్ణుడు సహిత మెవడో సామాన్యునివలె నిరసింపబడెను. కర్ణుడూరకుండిన దుర్యోధనుడు కదనప్రయత్నములు మానునని యనేకులభిప్రాయపడి రాజ్యకార్యధుర్యుండగు శ్రీకృష్ణుని నయభయాదులచే స్వాధీనపఱచి కచ్చియమాన్పయత్నించెనుకాని, దుర్యోధనుడు మదలోభక్రౌర్యాది దుర్గుణవిగ్దుడై యాత్మనాశముకయిన భీతిజెందక పాండవకులనాశనమే పరమావధిగ పనిజేయుచుండ కర్ణునిమాట యొక లెక్కయా? ఏమైనను దుర్యోధనుడు పోరాడుననుమాట కర్ణునకెఱుకయే. కృష్ణుని కార్యనిర్వాహశక్తియు, పాండవులే జయింతురనుమాటయుగూడ నతనికి విశదమే. తనకన్న ధర్మరాజే భూపరిపాలనమునకు తగినవాడను నంశముగూడ తెలిసియుండెను. ఇవన్నియుందెలిసి క్షత్రియవీర్యసంపన్నుడగుకతన స్వామి ఋణంబు దీర్పనెంచియు, నాత్మపరాక్రమమును పాటింపదలచియు, వీరస్వర్గమును బొందదలచియు ''సంధిపొసగింపవచ్చినశౌరితోడ, నడ్డదిడ్డంబులాడించి యంపివైచె."

కర్ణునకు కృష్ణుని మాహాత్మ్యము దెలియకపోలేదు. దుర్యోధనాదులవలె నీతడు కృష్ణుని వెఱ్ఱిగొల్లపిల్లడుగ నెంచలేదు. కాని యీతని విజ్ఞానము కేవలము మనస్సాక్షిగ వర్తించుచు నాత్మవివేకమును గలిగింపకుండెను. కర్ణుడు ప్రాపంచకుడు; లోకవ్యవహారి. ఇట్టివారీశ్వరతత్వమును నమ్మువారైనను ''అహంకార విమూఢాత్మాకర్తాహ మితి మన్యతే" యనునట్లు తామే ప్రబలసృష్టి కారణములుగ

భావించుచు నహంకారపూరితులై మోహాంధులయి ప్రవర్తింతురు. వీరికి ధర్మాధర్మ విచక్షణ లేదు. ఇహపరాది వ్యత్యాసములు గోచరించవు. తమ యాదర్శములే తారకమంత్రములని తలచి యితర మతముల నిరసించి లౌకికయశోభిలాషచే పారమార్థికమును విడనాడి యధోగతినిజెందు మహనీయులలో కర్ణుడు మొదటివాడు.

వీనిసౌందర్యవిగ్రహము, నిర్భయధీరత్వము, మహోదార భావములు అభినయించుట కెంతయు కష్టతరము. కర్ణవేషధారి చక్కగను, దారుఢ్యముగను, గాంభీర్యముగను, ఆత్మనిగ్రహము, ఆత్మగౌరవము, స్వాతంత్ర్యము గలవాడుగను నుండవలయును.

## నాటక నాయకులు

నాటకములలో నెక్కువ పార్టుకలవారు నాయకులని భూమికాధారులు భ్రమపడుచుందురు. లేక నాటకాంశమును జరిపించు ప్రధాన స్త్రీపురుషులే నాయకులనియు బొరపడుదురు. ఇట్టిపాత్రములను నాటకసమాజములోని తెలివిగల చక్కనినటులచే నభినయింపజేసి నాటకకథాఫలితమొందు నాయకభూమికను చక్కదనము, సంగీతము, అభినయకౌశలము, పాత్రౌచిత్యము లేని చిల్లరనటులచే నభినయింపజేతురు. ఇది నాటకాలంకార సూత్రములకు భిన్నము. నాటకకథాఫలితమెవ్వనిగూర్చి పరిణమించునో, యెవ్వనిచరిత్ర నాటకాంశమైనదో, వారే నాయకులు. కాని కథాంశమును జరిపించిన పాత్రసాధనము, పార్టు ఎంతపెద్దదైనను, నాయకనామమున కర్హము కాదు.

నేనీమధ్య చూచిన పాదుకాపట్టాభిషేకములో[140] సీతకు పార్టులేదుగదాయని యేదో మురికిచీర కట్టి లక్షణవిహీనుడగు నటునిచే నభినయింపజేసిరి. పార్టు ఉన్నను లేకున్నను సీత వేషము ఎల్లప్పుడును, సీతాదేవి యొక్క జగన్మోహనసౌందర్యము, సౌశీల్యము ఒప్పుచుండవలెను.

**140. "పాదుకాపట్టాభిషేకము" :** పానుగంటి వారి రచన. 1909లో ప్రచురితం. అంతకుముందే ధర్మవరం వాదిరి ప్రఖ్యాతం. ధర్మవరంవారి నాటకం 1890 నుంచీ ఆడుతున్నా 1914లో కాని ముద్రణ పొందలేదు.

ముద్రారాక్షసములో[141] చాణక్యుడే కథానాయకుడని కొందఱభిప్రాయ పడుచున్నారు. కథాంశమును జరిపించినది చాణ్యరాక్షసమంత్రులే కావచ్చును. కాని ముద్రారాక్షస నాటకకథాఫలము చంద్రగుప్తునకు చెందుచున్నది. నాయిక సర్వదా స్త్రీగ నుండనవసరము లేదు. నాయకునితో నెవ్వరు సంయోగమందుదురో, నాయకుడు పొందు ఫలమెద్దియో అదియే నాయిక. ఈ నాటకములో రాక్షసామాత్యుడు నాయిక. చాణక్యుడు నాయికకు విరోధముగ పనిచేసినను, నాయికానాయకులను సమావేశపరచినదూత లేక సంధాత. ముద్రసాధన, చంద్రగుప్తుడు నిఖిల భారతభూభారభరణుడగు చక్రవర్తిగా పరిణమించిన వాడగుటచే, నీతనికి పెద్దపార్టు లేకున్నను, ఈ వేషము ధరించు నటుడు రాజలక్షణము లొప్పుచుండవలెను.

ప్రహ్లాదనాటకములో[142] హిరణ్యకశిపునకు శాపవిమోచన మేర్పడినది. ప్రహ్లాదుడు వాంఛించు విష్ణు సాయుజ్యము కలుగలేదు. ఫలప్రాప్తి హిరణ్యకశిపునిదేగనుక అతడే కథానాయకుడు. రాక్షసరాజు, బ్రహ్మోపాసనాపరుడై నారాయణోపాసకుడగు ప్రహ్లాదునకు విరోధిగ వర్తించుట వేదవిరుద్ధము. హిరణ్యకశిపుడు రజోవికారములగు కామక్రోధములనుపాసించి యైహికైశ్వర్యముల బొంది మదోన్మత్తుడై యుండెను. ఇదియే బ్రహ్మోపాసన. ప్రహ్లాదుడు విష్ణుభక్తింజేసి "విద్యా బలైశ్వర్య జన్మకర్మంబుల గర్వముడిగి" సిద్ధుడై యున్మత్తజడుని చందమున సంచరించుచుండెను.

తెలుగుదేశపు నాటకరంగములో కొన్ని యసందర్భపు నాటకములాడబడు చున్నవి. వెనుక నిదివఱకు చంద్రకాంత[143]యను నాటకము ఒకటి ప్రదర్శింపబడు చున్నది. ఇందు నవయౌవనాంగియగు చంద్రకాంతకు అప్పుడే పుట్టిన బాలకునొకని బరిణయించి యాతడు పెద్దవాడగువఱకు నా బాలిక మాతృసేవ యొనర్చునట్లును,

---

**141. "ముద్రారాక్షసము" :** సుసర్ల అనంతరావుగారి అనువాదం మొదటిది. ప్రసిద్ధి పొందినది తిరుపతి వేంకట కవులది. దీనినే బందరు రాయల్ కంపెనీవారు ప్రదర్శించారు.

**142. "ప్రహ్లాదనాటకము" :** చూ. వివరణ 36.

**143. "చంద్రకాంత" :** మల్లాది అచ్యుతరామశాస్త్రి గారి రచన (1909).

ఆవల వానితో గూడి వైవాహిక సౌఖ్యమొందునట్లును చూపబడినది. ఇది చంద్రకాంతయొక్క పాతివ్రత్యలక్షణమును ప్రకటించినను మిక్కిలి యసమంజసముగ నసహ్యముగ నుండెను. ఇట్టి బాల్యవివాహములు కొన్నిపట్ల బాలికల యెడ జరుగుచున్నట్లు పత్రికలలో జూచుచు విసుగొందుచున్నాము. అట్టియెడ సధర్మనిరూపకంబగు నాటకములో బహిరంగముగ గసుగందు పెండ్లిండ్ల పరమాన్యాయమును చూపించుట యెంత మాత్రము తగదు. నాటకకవులు ప్రహసనమున కెట్టి యితివృత్త మవలంబనీయమో, నాటకమునకేది పనికివచ్చునో, విచారించి వ్రాయవలయును.

సారంగధరనాటకము[144] తెలుగురంగము నుండి బహిష్కరింపక తప్పదు. చాళుక్యచక్రవర్తికి, సకలసద్గుణభాగధేయునకు దుష్కార్యాచరణమాలిన్యము నాపాదించుటయే తప్ప, నాంధ్ర గౌరవమును చెడగొట్టుటయే తప్ప నీనాటకము చేయగల యుపకారమెద్దియు లేదు. పాపియగు చిత్రాంగి కథాంతమున శిక్షింపబడుటయు, సారంగధరుడు సుకృతియై మరల జీవించుటయు నీతిబోధకములనియు కొందఱనుకొనవచ్చును.

ఇది యెంతమాత్రము నీతిదాయకమైన గాథ కాదు. చిత్రాంగి సారంగధరుని మొదటి నుండియు వరించి వానిని పెండ్లాడదలచి తీసికొని రాబడినది. తన హృదయేశ్వరుని యందు తొల్లిటినుండియు ప్రణయావేశమున దెప్పరిల్లుచు తాను భర్తయని నమ్మినవాని జేరయత్నించినది. ఇందులో నామె చేసిన పాపమేమియు కనబడదు. కోడలుగ నేర్పఱచిన దాని వలచుటయు, ముక్కాళ్ళముదిమిలో తనకు గట్టికొనుటయు రాజనరేంద్రునిపాలిటి మహాపాపమే. ఇట్టి మహాపాతకము భారతాంధ్రీకరణనియోజకుడొడికట్టుకొనునని నమ్మజాలము. అథవా అట్లు చేసినను రాజే శిక్షనీయుడుకాని, చిత్రాంగీ సారంగధరులెంతమాత్రము శిక్షార్హులుకారు. ఇట్టి అన్యాయపు అసత్యపుచరిత్ర, విరోధపు నాటకమును తుది నొక సిద్ధుని వాక్యముల అంత్యనీతికొఱకై రంగస్థలమున నభినయించుట సమంజసము కాకున్నది.

---

**144. "సారంగధర" :** ధర్మవరంవారి "విషాదసారంగధర" తెలుగులో వచ్చిన తొలి విషాదనాటకం (1887). పానుగంటివారిది 1905లోను కాళ్లకూరివారి చిత్రాభ్యుదయం 1909లోను వచ్చాయి.

సంఘనీతికి చిత్రాంగి కట్టుపడి యుండలేదని అట్లుండవలయునని కొందఱూహింపవచ్చును. కాని దైవసంకల్పచోదితంబగు ప్రణయానుబంధములను ద్రుంచి యిచ్చవచ్చిన వెఱ్ఱి వియ్యములగూర్ప నెట్టి స్వాతంత్ర్యము, న్యాయము సంఘమునకు కలదో నిర్ణయింపజాలము. సంగధర్మ మన్యాయముగ నున్నప్పుడు వ్యక్తులందులకు భిన్నముగ నాచరించిన దోషమేమో తెలియజాలదు.

సారంగధరునికథలో సిద్ధుడు తెగబడిన కాలుసేతుల నతికించుచున్నాడు. హరిశ్చంద్ర[145]లో విశ్వామిత్రుడు, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు వచ్చి లోమితుని బ్రతికించి హరిశ్చంద్రునకు పూర్వచక్రాధిపత్యము నిచ్చుచున్నారు. గయోపాఖ్యానములో శివుడడ్డపడి నరనారాయణుల సమరసంరంభ సన్నాహమపనయించు చున్నాడు. ఈవిధముగ మనదేశములోని నాటకములనేకము లందు పాత్రములు నిజస్వభావపరిణామానురూపములగు సుఖదుఃఖముల పతనౌన్నత్యముల మంచిచెడ్డలనుభవింపక తుదకెద్దియో యొక యసంభావిత యచింతిత దైవికముచే[146] సత్ఫలమొందుచున్నారు. ముద్రారాక్షసములో మంత్రిరాక్షసుడు చంద్రగుప్తుని వినాశ మపేక్షించి పాటుపడియు తుదకు తన స్వభావనిరూఢమగు మిత్రసేవాపరత్వమున చావుకన్నను హీనమైన మంగలి నౌకరీకియ్యకొనెను. ఇందలి కథాఫలప్రాప్తి స్వభావపరిణామమున ఏర్పడినది. మృచ్ఛకటికలో రాజు మారి నూతన పరిపాలనము వచ్చినందున గుణరాశియగు చారుదత్తునకు, నలౌకికశీల సంపన్నయగు వసంతసేనకు కష్టకాలము గడతేరినది. శాకుంతలలో కూడ నుంగరము మంత్రకంకణము తెచ్చిపెట్టి హిందువుల నమ్మకముల కనురూపముగ కథాంశ మేర్పఱచినను కాళిదాస మహాకవి

**145. "హరిశ్చంద్ర"** : బలిజేపల్లి లక్ష్మీకాంతంగారి రచన.

**146. అసంభావిత అచింతిత దైవికము** : సూరిశాస్త్రిగారు కొన్ని నాటకాలలో కనిపించే అసంబద్ధమైన ముగింపును గురించి ఈ మాటలు చెప్పారు. సారంగధర, హరిశ్చంద్ర, గయోపాఖ్యానము వంటి నాటకాలలో కథానుగుణమైన నిజస్వభావ పరిణామానురూపములకు అనుగుణమైన ముగింపు జరుగక అకస్మాత్తుగా ఏ దైవిక ప్రేరణచేతనో నాటకాన్ని సుఖాంతం చేయడం జరుగుతున్నది. ఈ రకమైన ముగింపు ('దైవికయంత్రము' అంటే Divine machine ప్రేరణ వల్ల జరుగుతున్నది కాని స్వాభావికంగాను ప్రకృతిసిద్ధంగాను లేదని సూరిశాస్త్రిగారి విమర్శ.

నాయికానాయకుల నిజసత్వవిస్తారమున కథాంతమును చేరలేకుండెను. ఈవిధమగు దైవిక యంత్రము (Divine Machine), అసంభావితాంశసంభవము మన నాటకముల ప్రకృతివిరుద్ధముగను, అస్వాభావికముగను, నీతిబోధయందు అనుపయోగముగను చేయుచున్నవి. ఇట్టి పద్ధతులు మానవలసియున్నది. సకల జగములనిండి పిపీలికాది బ్రహ్మపర్యంతముగల బ్రహ్మాండమంతయు నాక్రమించి జగత్సంసారకార్యధురీణుడగు పరమేశ్వరుడొకమానవుని నిత్యజీవితాంశములలో కర్తృత్వమవలంబించుననుట హాస్యాస్పదముగ నున్నది.

నాయకులను ధీరగుణవంతులుగ జేసి వారి సంకల్పచారిత్రమున కెట్టి భంగపాటులు కలుగకుండ పోతపోసిన యుక్కుబొమ్మలవలె వంగకుండ జేసి తుదకు వారి గుణములను ప్రతిజ్ఞలను భావములను చెఱుపకుండ నొక యవితర్కితదైవికముచే కథను తేల్చుచున్నారు. ఇట్టి వంగని మానవస్వభావ నైజమగు గుణసాంకర్యమొదవని ధీరనాయకుల విసర్జించి, స్వాభావికమగు మంచిచెడ్డలు కలిసిన మానవమూర్తులను కథానాయకులుగ నంగీకరించుటచే నీ యిబ్బంది దాటగలము. కథానాయకులకు, మనకు సౌమనస్య మేర్పడును. వారి భంగపాటున నీతి వైరాగ్యములబ్బును. వారి విజయమున కార్యోత్సాహముదయించును. నాటకము స్వభావసిద్ధమై నీతివాహకమై మానవజీవితములోని నిత్యధర్మములగు సుఖదుఃఖములరెంటిని యథార్థముగ జూపును. ఆనందసిద్ధియే కావ్యాదర్శమనియు, కల్యాణఫలప్రాప్తిచే కాని యానందముదయించదనియు, నందుచే కథాంశమేవిధి జరిగినను తుదకెట్టులో సుఖసమాప్తి జేకూర్పవలెననియు, నందుచే కథాక్రమమునకు లోపము వాటిల్లకుండ దైవిక సమాగమనమూహింపబడినదనియు కొందఱు చెప్పుచున్నారు. పూర్వ సంస్కృతనాటకకవులు, ప్రస్తుతపు నాటకరచయితలు ఆనంద సంపాదనములో పెద్దపొరపాటు చేసియున్నారు. పెండ్లికలకల వలన, చచ్చినవాని బ్రతికించుటవలన నానంద మెంత మాత్రము ఏర్పడదు. ఆనందమనగ జయాపజయములు, లాభాలాభములు, సుఖదుఃఖములు సమముగ చూచుకొనగల మానసనిర్వ్యాపారనిశ్చింతస్థితికి పేరు. ఆనందమొందునపుడు మనిషి చప్పపడి నిస్సారముగ, నిర్జీవముగ, నిర్విణ్ణముగ రసభావానుభూతులన్నియు నశించి నిరామయముగ నుండునేకాని, లౌకిక కళ్యాణావలోకన సంతోషమున చంక

లెగురవేయడు. కథాంశమందలి సుఖదుఃఖముల వలన ప్రేక్షకులొందు మానసప్రబోధములు వారి తత్వమునుబట్టియే యుండునుకాని, కథ యందు నిరూపింపబడనేరవు. కళ్యాణముచూచి యొకడు విచారపడవచ్చును. మరణమును చూచి యొకడు సంతసింపవచ్చును. అందుచేత కళ్యాణాంతముగ నాటకముల నమర్చినందున సమకూరెడి ప్రజాసంతోష మేమియు లేదు. ఆనందమంతకంటెను సిద్ధించదు. జీవిత స్వభావమా చెడుచున్నది. పాత్రగుణపోషణవెల్ల భగ్నమగుచున్నది. సిద్ధించు సత్ఫలమేమియు లేదు. నాటకకళ నశించుచున్నది. అందుచేత నవితర్కితసంభవముల నెల్లను బహిష్కరింపవలెననియే నాయభిప్రాయము.

ఒకజాతినిగాని కులమునుగాని ఆక్షేపించు నాటకములు సంఘమున కనర్థకములై యున్నవి. హిందూ మహమ్మదీయుల పోరాటముల నభివర్ణించుగాథలు "అత్తమీది కోపము బిడ్డ మీద చూపించినట్లు" ఆంగ్లేయ ప్రభుత్వముతోడి యసంతుష్టిని, మనదేశములో శాశ్వతనివాస మేర్పఱచుకొని మన ద్రవ్యము నిచ్చుటి కళావిస్ఫూర్తి కుపయోగించి, మనదేవుల కొలిచి, మన పండితుల పోషించి, పల్లెపల్లెకు వ్యాపించి మనతో నొక్క సంఘమై మెలగుచున్న మహమ్మదీయులయెడ వెళ్ళబుచ్చుకొనుటెంతయు నీచముగ, నన్యాయముగ నున్నది. మహమ్మదీయ రాజ్యకాలములో విస్తరించిన రసపుత్రవీర కథాలాపము లవసరమైనచో, నాటకములందు దారగుణాంకితులైన మహమ్మదీయ పాత్రముల గొన్నిటి ప్రవేశపెట్టియు, నుత్తమపాదుషా గుణముల విశదీకరించియు నెవరో యొక మురకతురక మానవనైజమగు దుర్వర్తనములో జరించినట్లు చూపవచ్చును. రసపుత్ర విజయములో నలంగీరుపాదుషాను పిరికివానిగను, వెకిలివానిగను, దయాసత్యశౌచము లొదవని వానివలెను కొందఱభినయించుచున్నారు. దుర్గాదాస, రాజసింహుల దేశాభిమానప్రతాపముల పోషించుటకు అలంగీరునకిట్టి సన్యాసి గుణములొప్పించ నవసరములేదు. అప్పటి కారుతరముల భారతసామ్రాజ్య సంప్రదాయపు లలిత సద్గుణము లలంగీరునకుండకపోవు. ఇదివఱకు వ్రాయబడిన యిస్లాము ద్వేషక గాథలను జాదునాథసర్కారు మొదలగువారి నవీనచరిత్రలతో పరిశోధించి నాటకముల గూర్పువఱకు హిందూమహమ్మదీయ సందర్భములయాట లాడకుండుటయే మంచిది.

చింతామణి[147] నాటక మొకటి ఈమధ్య చాల ప్రబలమైనది. లీలాశుకుని చరిత్ర విషయమై పలువురు సందేహపడుచున్నారు. వ్యభిచారములో సంచరించుయువకుల తల్లితండ్రులకును, బంధుమిత్రాదులకును వేమన, లీలాశుకుడు, పుండరీకుడు మొదలగువారి బాల్యచరిత్ర కొన్ని యాశాంకురములు గల్పింపవచ్చును. కాని మనకు నిశ్చితమైన చరిత్రాధారముల లేని పట్టుల మహామహుల జీవితాంశములో దుష్కీర్తి చేర్చుటొక గౌరవమైనపని కాదు. లీలాశుకుని బాల్యచాపల్యమును తరువాతి గోవిందపదానురక్తిని చిత్రించుటకీ నాటకము రచింపబడినట్లగపడదు. వెలయాండ్ర దిట్టుటకును, వారిలోపముల వెలిబుచ్చుటకును, ఈ నాటకము ముఖ్యముగ గూర్పబడినది. వెలయాండ్రుండవలెనా? లేదా? యను సమస్య ప్రపంచములోని సమస్త నాగరిక రాష్ట్రములందు, మహామహులగు నీతివిత్తములచే, నాయుర్వేదధురీణులచే, ప్రభు సంఘములచే జర్చింపబడుచున్నది. లౌకికాధ్యాత్మిక కారణముల వలన నేకపత్నీసమాలంబనమే వైవాహిక ధర్మమై వెలయునపుడు పురుషులు 20–40 వయస్సులో నిశ్చలమగు యౌవనబలసమేతులై యుండి స్త్రీలు ప్రసవ ఋతుమరణ బాధల కెక్కువ గురియైయుండునపుడు, సాంఘికదైవిక కారణములచే దాంపత్య సానుకూలత దుర్లభమైనప్పుడు, దారిద్ర్య వ్యావహారిక హేతువులచే నవివాహితులగు పురుషులును సకాలపత్నీవియోగమున నొంటరిగ నున్నవారును పెక్కురుండ, వీరి శారీరకధర్మ నిర్వహణార్థము కొంత యేర్పాటు లవసరమనియే, వెలయాండ్రుండుట తప్పదనియే ప్రాచీనాధునిక ధీమంతులెల్ల రభిప్రాయపడియున్నారు. అదికాక స్త్రీలు మాతృమూర్తులై భార్యగను తల్లిగను వ్యవహరింపవలసిన వ్యవస్థ మానవసంఘపు సుస్థితికిని, పరోభివృద్ధికిని మూలకారణమై యున్నది. ఇట్టి యెడ మనుష్యుని కళాకుతూహలము నిర్విఘ్నముగ బండుటకు కళావంతులవసరమై యున్నారు. మన సంఘసంస్కర్తలు వేశ్యల జీవనము తప్పింపగలిగిరేగాని, మానవుల వ్యభిచారనైజమును మార్పలేకున్నారు. వెలయాండ్రపతనముతో వ్యభిచరణ మానలేదుగాని, కులభ్రంశము సిద్ధించుచున్నది. సంఘమునను, కులసంప్రదాయప్రతిష్ఠకును ఆధారమైన

**147. చింతామణి :** కాళ్లకూరి నారాయణరావుగారి రచన.

వెలయాంఁడ్ర నిష్కారణముగ నిందించి వారిపై ప్రజాద్వేషమును బొరలించి వేశ్యకులమును చంప యత్నించుచున్న సంఘసంస్కర్తలు నిజముగా సంఘమున కపకారమే చేయుచున్నారు. వేశ్యలకష్టములు, వారి శరీరబాధలు లోకవిదితమే. కాని మానవసంఘములోకెల్ల పరోపకారధురీణులు ముగ్గురనియే చెప్పవచ్చును. సాక్షాత్తు దేవతాసమానుడైన పాకీవాడు నగరములందు మానవసంఘము నివసించుటకు ప్రథమకారణమై యున్నాడు. వీని నిరుపమస్వార్థత్యాగమే నాగరికతకు మూలమగుచున్నది. చాకలివాడు మనుష్యుల బాహ్యపరిశుద్ధతకు హేతువై జనుల చెమటను, చీమును, మలమూత్రాదిదోషములను తన యొంటిపై జికిలించుకొనుచు ప్రజల పరిశుభ్రమునకై తన శుభ్రతను ఆరోగ్యమును ధారపోయు సమబుద్ధియై యున్నాడు. వెలయాంఁడ్రు పైజెప్పిన కారణములవలన మదోద్రేకపూరితులై సంచరించు పురుషుల మదమాలిన్యమును సంగ్రహించి మనుష్యుల నీతిదూరుల చేయుటకన్న సాత్త్వికులుగను, శాంతస్వభావులుగను, మదరహితులుగను జేయు జగదుపకారకులై యున్నారు. ఇట్టి గుప్త సంరక్షణము సంఘమునకే లేనియెడల నెన్ని సంసారములు విచ్ఛిన్నమగునో, యెన్ని కులములు గుంటాపూవుదొడగునో, యెంత ప్రజాసంక్షోభమేర్పడునో, యెట్టి దుశ్శీలత ప్రబలునో ఆవంతయేనియు యోచింపక వేశ్యాకుల నిర్మూలనోపదేశముల వెదజల్లు సంఘసంస్కర్తల నేమని యభినందింపగలము.

వేశ్యలు పురుషమదమును అడ్డగించి సంఘసుస్థితికి తోడ్పడ నేర్పడినజాతి. వారు తమ యిండ్లకు వెళ్ళినవారినే గవయగలరుగాని పురుషులను బలవంతపెట్టి యీడ్చుకొనిపోవరు. పురుషుడు వారి కందించు ధనాదులనందగలరేగాని యిండ్లను స్వాధీనపఱచుకొని, పొలముల నాక్రమించి, ధనాగారముల వశపఱచుకొని, పురుషుని మోది, తన్ని, ఫోర్జరీలు చేసి, వ్యాజ్యములు వేసి వాని సంపద లపహరించువారలు కారు.

అంతుబొంతునులేని పన్నులు విధించి దేశశల్యముల పిప్పిచేయు నాగరిక ప్రభుత్వముల దోపిడికన్న, వాది ప్రతివాదుల దీపములారువఱకు, కక్షచల్లారకుండ పెంచెడి న్యాయవాదుల ధనాకర్షణముకన్న, జూదరుల మాయలకన్న, దొంగల మోసములకన్న, వేశ్యకాంతల దుండగము లెక్కువ హానికరమైనవి కావు. పురుషుడు

మదనోన్మత్తుడై యొడలు తెలియక, నలసుడై తెలివితక్కువచే, మోహమాంధ్యముచే, తన సంసారమును పాడుచేసికొని, ఇల్లాలిని విదలించి, సంపదల సున్నజేసి, వారకాంతల పాదారవిందముల బూజించునంతటి దుశ్శీలుడై, బుద్ధిహీనుడై, వెఱ్ఱివాడై తిరిగి తెచ్చుకొనిన కష్టములకు వేశ్యలను, పడుపువృత్తిని నిందించిన న్యాయమేమున్నది! నిష్కపటముగ, నిష్పక్షపాతముగ, సంఘసంస్కరణ దురూహలవతలనుంచి యోచించిన యెడల చింతామణిదా తప్పు? లేక దానివెంట వెఱ్ఱికుక్కలై తిరిగిన సుబ్బిసెట్టి, భవానీశంకరము, బిల్వమంగళులదా? వేశ్య వలలో వేసికొని మోసం చేసినదట! మగవారు విధవలై యాడుదానివలలో నేల చిక్కుకొనవలెను? ఒడలెఱుంగక నేల వర్తింపవలెను? భోగమంత మగవారిదా? పూజ్యత అంతయు బిల్వమంగళునిదా? దూషణ తిరస్కారము, అల్లరి చింతామణికిని ఆపెకులమునకును జెందవలసినదా? ఇది చాల అన్యాయముగ, దుస్సహముగ, జాతిద్వేష సంజనకముగ నున్నది. చింతామణి నాటకములోని మేహవ్రణములకట్లుచూచి నీతివర్తులగువారు ఎవరులేరు! బిల్వమంగళుని భక్తిపరిణామ మూహించి మరియొక కృష్ణకర్ణామృతము తెలుగుదేశములో రచియింపదగిన తపస్సంపన్నులెవరీ నాటకములను చూడబోవుట లేదు? ఏకాదశీ మహాత్మ్యములో రుక్మాంగదుని వ్రతనిష్ఠ నరయబోవువారరుదు. మోహినియొక్క చపలాపాంగవిలాస సంపదల నవలోకించి మోహంపుతావుల నాస్వాదింప నరగువారనేకులు. అటులనే చింతామణి జూడబోవువారు ఆ నాటకములో మొదటి నుండి తుదివఱకు ప్రధాన కథాంశమైయున్న వేశ్యావిటసంయోగశృంగార సంరంభమును బోగపు కులమును తిట్టుటను జూడ నేగుచున్నాడేకాని బిల్వమంగళుని, లీలాశుకోత్తమగౌరవమును జూచుటకు వెళ్ళుటలేదు. లక్షప్రేక్షకులలో నొకడు అదివఱకె తనచెనటి నడతకు సిగ్గుపడి ఖిన్నుడై తప్తాంతరంగుడై జనదూషితుడై పరగతు లెఱుంగ నాయాసపడువాడు, ఏ లీలాశుకుని చరిత్రము, ఏ వేమన, ఏ తులసీదాసు, ఏ పుండరీకుని ప్రాయశ్చిత్తభాగ్యోదయమో విని చూచి మార్పొంది సన్మార్గముల జాడ ఎఱుగగలడు. అంతేకాని మిగిలిన ప్రేక్షక బాహుళ్యమంతయు భోగముదాని నడతల చూచుటయే కలుగుచున్నది. వీరందఱు అవకాశము చిక్కినయెడల సుబ్బిశెట్టి వలె "ఒక ఎలుగు ఎలిగిస్తాగా!" అనువారే!



విద్యార్థిగా సూరిశాస్త్రిగారు (కుడివైపు చివర)




**'నాట్య అశోకము' పుస్తక తొలి ప్రచురణ ముఖచిత్రము (1925-27)**

విద్యానిలయ కుసుమాంజలి— ౬.

# నాట్య - అశోకము.

పురాణం సూరిశాస్త్రి.

## విద్యానిలయము, బందరు.

బందరు, సుధర్మ ముద్రాక్షరశాలయందు,
ముద్రింపబడెను.

1925—1927

సర్వస్వామ్య సంకలితము [ వెల 1-8-0.

**‘నాట్య అశోకము’ లోపలి ముఖపత్రం**

# నాట్య అశోకము

## విషయసూచిక

### శ్రీరామ నాట్యలేఖలు*


1. రామదాసు.................................................. 220
2. హరిశ్చంద్ర ................................................ 229
3. నట ప్రకాశిక నాటకాలు ................................ 234
4. ఆంజనేయ నటేశము..................................... 246
5. కన్యాశుల్కము ........................................... 253
6. ప్రతాపరుద్రీయము ....................................... 260
7. షోరబు - రుస్తుము ...................................... 284
8. దొరస్వామి - దుష్యంతుడు .............................. 292
9. గంజాం నటులు........................................... 301
10. చంద్రహాస-నటలోక సంచారము ...................... 308
11. మృచ్ఛకటిక ............................................. 313


** "నాట్య అశోకము"లోని మొదటి మూడు అధ్యాయాలను సంస్కరించిన ఈ ప్రతిలో వదిలివేయడం జరిగింది. ఇందులో మొదటి అధ్యాయం "తాటాకులలో పచార్లు", సరస్వతీ మహల్ లైబ్రరీలో సూరిశాస్త్రిగారి అనుభవాలను, రెండవ అధ్యాయం "చెట్టుక్రింది ముచ్చటలు" ఆనాటి బందరు సామాజికుల అభిప్రాయాలను వెలువరించడం వల్ల ఆ రెండు అధ్యాయాలను ఇక్కడ పరిహరించడం జరిగింది. అలాగే మూడవ అధ్యాయం– "శ్రీరామ నాట్యలేఖలు" శీర్షికన వచ్చిన మొదటి వ్యాసం– కన్నడంలోని 'కబీరు' నాటకం మీద వ్రాయబడడం వలన దానిని కూడా ఇక్కడ వదిలివేయడం జరిగింది.*

# శ్రీరామ నాట్యలేఖలు

## రామదాసు

భక్తత్రాణపరాయణా! వేయికన్నుల చూచుప్రోడవు. నీ వెరుగనిదీ, విననిదీ, కననిదీ, యుండదు. నా కడుపులో గుటగుటలాడు భావభారాన్ని సడలించు కొనుటకు నే చూచిన మంచి సంగతులు నీకు రాస్తున్నాను కాని, నీకే కాదు నీపేరుగా యీ జాబులను చదివే తెలంగీలోకులకు కూడ, వీనివల్ల ఫలానా లాభం కలుగుతుందని చెప్పలేను. ప్రత్యక్షంగా అనుభవిస్తేనే నాట్యగీతాదుల సొబగు తెలియగలదుకాని, వట్టి మాటలతో యెంత అల్లుకొచ్చినా మనోజ్ఞవిషయాలను కన్నులగట్టినట్టు కూర్చిచూపలేము. అయినా, మాదేశంలో బుద్ధిమంతు లేయేకళల నేవిధి సాధించుచున్నారో విచారించు తెరవున నీకీ లేఖలు పంపుకుంటున్నాను.

మా తెలుగుదేశంలో యింతవరకు శాశ్వతసత్కీర్తి గలిగిన నాటకాలు ఫలానావి యేర్పడ్డవని చెప్పలేము. సాహిత్యప్రసక్తిలో, యిప్పటి నాటకాలేవి ముందునాటికి నిలుచునో కాని, నాట్యరంగాన మాత్రము మూన్నాళ్ళ ముచ్చటగ వొక వెలుగు వెలిగించి తరువాత వాసి తప్పుతున్నవి. గయోపాఖ్యానం, రసపుత్ర విజయం, పాండవ నాటకాలు, చింతామణి, తళ్ళికోట వీటన్నిటి సారమిగిరిపోయినట్టు కనిపిస్తున్నది. సావిత్రి, హరిశ్చంద్ర, చిత్రనళీయము, ప్రహ్లాద[1]

---

**1. గయోపాఖ్యానం :** చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి ప్రఖ్యాత నాటకం. ఇమ్మానేని హనుమంత రావు నాయుడిగారి హిందూనాటక సమాజం కోసం రాసినది. ఇందులో ఇమ్మానేని గయుడుగా, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులుగారు ముందు చిత్రరేఖగాను ఆ తరువాత అర్జునుడుగాను నటించారు.

**రసపుత్ర విజయం :** ఇచ్ఛాపురపు యజ్ఞనారాయణగారు రాసిన ప్రసిద్ధ చారిత్రక నాటకం.

మొదలైనవి కూడ వెనకటంత వొత్తిడిగా చూపరుల రాబట్టడం లేదు. ఇప్పుడు కొన్ని క్రొత్త ఆటలు తెలుగురంగాన చిందులాడుతున్నవి. కాని, యివి యెన్నాళ్ళు ముచ్చటించునో చెప్పలేము. సామాన్యంగా కావ్య నాటక సంగీతాలు పదిమాట్లు వింటే, గారెలు కనరెక్కినట్లు వెగటు పారుతవి. 'హరినామస్తుతి సేయు కావ్యము సువర్ణాంభోజ హంసావళీ సురుచిభ్రాజితమయిన మానస రసస్ఫూర్తిన్ వెలుగొందు"నని పోతన్న చెప్పినట్టు, యెన్ని పాటలు విన్నా "ఇకనైన నామొర వినరాదా" "ఏ తీరుగ నను కృప జూచెదవో ఇనవంశోత్తమరామా" వగైరా వాటిలో కనుపించే అందం, యే పల్లవిలోను, రాగాలాపంలోను కానరాదు. నాటకాల్లోకూడ నీ మహిమార్ణవతరంగములను చిత్రించు ఆటలే యెన్నిమాట్లు చూచిన వెగటొందని యందంపు ప్రోగులై జెన్నారుతున్నవి. ఇంతకూ, లలితకళలు రచించుట వాటిని చూచి ఆనందించుట, నిన్ను జేరు ముముక్షుసాధనలలో ఒక పద్ధతిగా కనిపిస్తుంది. మనుష్యుడి పెద్దకోర్కె, బాల్యం నుంచి ముదిమిదాకా నిలచే సర్వవయః సామాన్యసంకల్పము పరమసంతోషము, నీ దివ్యస్వరూప సౌందర్యాన్ని తెలిసికొను

---

**పాండవనాటకాలు :** తిరుపతి వేంకటకవులు భారతకథ ఆధారంగా రాసిన ఆరు నాటకాలు. ఇవి పాండవ విజయము (1903), పాండవాశ్వమేధము (1903), పాండవప్రవాసము (1908), పాండవజననము (1909), పాండవోద్యోగము (1911), పాండవరాజసూయము (1921).

**చింతామణి :** కాళ్లకూరి నారాయణరావుగారి నాటకం.

**తళ్లికోట :** "తళ్లికోట యుద్ధము" అనే పేరు "రామరాజ్య వినాశనము" లేదా "ఫాల్ ఆఫ్ విజయనగర్" అన్న నాటకానికి వాడేవారు. ఆ నాటకంలో తళ్లికోట యుద్ధం, రామరాజు మరణం ప్రధాన సంఘటనలు.

**సావిత్రి :** శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారి ప్రఖ్యాతనాటకం. ఈ నాటకాన్ని మైలవరం కంపెనీవారి కోసం ప్రథమంగా రాసినా ఆ తరువాత అనేక సమాజాలు ఆడి పేరు తెచ్చుకొన్నాయి

**హరిశ్చంద్ర :** బలిజేపల్లి లక్ష్మీకాంతకవి రచన. ఆంధ్రదేశంలోని కాస్తోకూస్తో పేరున్న సమాజాలన్నీ ఈ నాటకాన్ని ఆడాయి. ఆడుతున్నాయి.

**చిత్రనళీయం :** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి నాటకం. ఆయన స్వీయదర్శకత్వంలో ప్రదర్శించబడిన ఈ నాటకంలోని పద్యాలు 'పాడే' ఒరవడి వల్ల ఆ నాటకాన్ని ప్రథమ 'పద్యగాన' నాటకంగా పేర్కొనవచ్చు.

**ప్రహ్లాద :** ధర్మవరంవారి రచనే !

వేడుకగా కనిపిస్తుంది. ఈ కోర్కె కడుపులో మండుచుండుట చేతనే మనుష్యుడు కల్పించు మనోజ్ఞ కళలన్నీ నీపరంగా, నీ విశ్వధర్మాలను, లీలావిలాసాలను, రూపసంపదను, చూపునవిగ నున్నవి. రమ్య విషయానుభూతి, రమణీయ వస్తు సంకలనము, మోక్షాపేక్షతో నరుని మనోవృత్తులవలంబించెడి మార్గాలే.

**“నిను జింతించుచు బాడుచున్ బొగడుచున్ నీదివ్య చారిత్రముల్**
**వినుచున్ జూతురుగాని యితరాన్వేషంబులన్ జూతురే**
**ఘనదుర్జన్మపరంపరాహరణ దక్షంబై మహాయోగి వా**
**గ్వినుతంబైనభవత్పదాబ్జయుగమున్ విశ్వేశవిశ్వంభరా ॥**

సావిత్రి, హరిశ్చంద్ర, నాగానందం మొదలైన నాటకాలు ప్రాపంచిక ధర్మాలమీద ఆధారపడి వుంటవి. ధీర నాయకులందరిలో కొంత పట్టుదల, బిగింపు; లౌకికమర్యాదలను మానవధర్మాలను, వరప్రమాణంగా యెంచుకొని వాటికోసం పెనుగులాడే యహంకారము, – సంకల్ప ప్రవృత్తి కనుపడుతుంది. అంతేకాని “సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ । అహంత్యాంసర్వపాపేభ్యో మోక్షయిష్యామిమాశుచ ॥”

‘చిక్కడు వ్రతముల గ్రతువుల జిక్కడు దానముల శౌచశీల తపముల.... హరిభక్తి జిక్కిన భంగిన్ ॥”

అనేమాట వారిలో కనపడదు. ఇట్లాంటి యూహలు వదలుకొని స్థిరచిత్తులై, నిన్నే తలచుతూ, నీమీదనే దేహసంబంధమైన మనోవృత్తులన్నిటిని చూపుకొంటూ, ఆత్మతృప్తులై చరించు మహాభక్తుల జీవితాలను తెలిపే ఆటలు దరిలేని మరందసాగరములై, యనంత సౌందర్యరాసులై యున్నవి. మా తెలుగువాళ్ళు యీనాటికి వృధాచమత్కార కలుషితంబులగు నాట్యవినోదములతో విసుగొంది, నీభక్తకథల నాదరింప మొదలిడినారు.

హిందూదేశంలోకల్లా నీపేరు పెంపులు తెలుగుసీమలందే యెక్కువ నిలచియున్నవి. నీ గొప్పశక్తులు చాలవరకీ ప్రాంతాలలోనే వాడుకకువచ్చి, ప్రాచుర్యమొందినవి. నీ కష్టాలన్నీ యిక్కడనే వెళ్ళమారినవి. ఇంటింటా రామపటము. పూరిపల్లెలలో రామభజన. సరిగోలు జనానికి సీతారామ నామధేయాలు. పాటలన్నీ రామమయం.

ఆర్యకులప్రదీపకుడవై, రవివంశ ప్రభాభరితుండవై, యఖండైశ్వర్యముల ననుభవింపవలసియు, మాపుణ్యవశమున నెటులనో యీ ప్రాంతముల దిరుగ వచ్చితివి. తప్పిపోయిన సీతమ్మను ఒడిలో బెట్టుకొని యానాడే గాలితెరవున 'ఇదిగో జనస్థాన' మని చూపుచు ఒకపూటయిన విడిది సేయక, యెగిరిపోతివి. నిన్ను పట్టి, కట్టి, తెచ్చి, మాయందరి నడుమ నిలువజేసినది – యింటింట నీపేరు మ్రోగునట్లొనర్చినది – మా బైరాగిబంటు గోపన్న. వీని భక్తిప్రలాపాలే రామదాసు నాటకంలో కనపడేవి!

నేనీయేడు మూడు రామదాసు ప్రదర్శనాలు చూశాను. మోతేవారిదొకటి[2], నటప్రకాశిక శాస్తుర్లుగారు ఆడించినదొకటి[3], అల్లూరి కృష్ణవిలాస సభవారి[4] దొకటి. ఇందులో చెప్పదగిన పెద్దవేషాలలో అల్లూరు రామచంద్రారెడ్డిగారు[5], ఘంటసాల రాధాకృష్ణయ్యగారు[6] కబీరుగాను; కొచ్చర్లకోట రంగారావుగారు[7]

---

**2. మోతేవారి సమాజం :** ఏలూరు జమీందారులు శ్రీ మోతే నారాయణరావుగారి చేత ప్రారంభించబడి వ్యాపారనాటక సంస్థగా కొనసాగిన నాటక సమాజం. దీనిపేరు శ్రీ సీతారామాంజనేయ నాటక సమాజము.

**3. నట ప్రకాశిక శాస్త్రుల్లుగారు ఆడించినవి :** తెలుగునాటక ప్రదర్శనల మీద 'ఆంధ్రనట ప్రకాశిక' అనే గ్రంథాన్ని రాయడానికి పూనుకొన్న పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రిగారు తాను ప్రతి కంపెనీకి పోయి ఆయా నాటకాల, నటుల ప్రత్యేకతలను విమర్శించడానికి బదులు కొన్ని సమాజాల వారిని, లేదా కొందరు నటులను బందరుకు పిలిపించి అక్కడ నాటకాలు ప్రదర్శించారు. దానికి బందరు పెద్దలు చాలమంది శ్రమించారు. ఆయన దరిమిలా రాసిన గ్రంథం పేరు "ఆంధ్ర నట ప్రకాశిక".

**4. కృష్ణవిలాససభ :** నెల్లూరు దగ్గర ఉన్న అల్లూరులో ప్రారంభమైన శ్రీకృష్ణవిలాస సభ. దీనికి అధిపతి అల్లూరి రామచంద్రారెడ్డి. ఆయన కబీరు వేషధారణకు ప్రసిద్ధి.

**5. అల్లూరు రామచంద్రారెడ్డి :** చూ. పై వివరణ.

**6. ఘంటసాల రాధాకృష్ణయ్య :** నెల్లూరు ఆంధ్రసభలో కబీరు వేషధారి.

**7. కొచ్చెర్లకోట రంగారావు :** ఏలూరు సీతారామాంజనేయ నాటక సమాజంలో నటులు. 'రామదాసు' నాటకంలో తానీషా వేషానికి ప్రసిద్ధి. 'మృచ్ఛకటిక'లో శకారుని పాత్రను సమర్థవంతంగా నటించారు.

తానేషాగాను; యడవల్లి సూర్యనారాయణ[8], రామాయణం సర్వేశ్వరశాస్త్రి[9], అల్లూరు రామరెడ్డి[10] గార్లు భద్రాద్రి భక్తాగ్రేసరుని రూపులోను, చెప్పుకోతగినట్టుగా అభినయించారు.

నాట్యాంబుజంలో రామదాసు భక్తి స్వభావాన్ని విపులంగా విప్పి చెప్పాను. అందులో బళ్లారి రాఘవాచారిగారి అభినయ వైఖరిని తప్పీలుగా విడిమాటలకందు వరకు చిత్రించినాను. ఇప్పట్లో వీరి వ్యాఖ్యానమే ప్రమాణంగా తోస్తుంది. వీరి ఆటను బట్టిన్నీ, దాశరథీ శతకం, రామదాసు కీర్తనలు, భక్తియోగపు లక్షణాలు, చదివిన్నీ, నేను తేల్చుకొనిన స్వభావస్వరూపములోనే రామదాసు నాకంటికగు పడుతాడు.

ఈతని భక్తిస్వభావంలో బాలకచేష్ట లగుపడును. నిన్నొక వేల్పు పెద్దగ, నెక్కడనో పాలకడలి పాము సెజ్జపై బరుండి సుఖించు శ్రీపతిగ నూహించలేదు. వైకుంఠపురములోని మందార వనాంతరంబుల చలువరాతి యరుగులపై భక్తశ్రేణి గుమిగూడి నుతింప రమావినోదమున హాయిగ కాలము గడపు లీలాపురుషునిగ భావించలేదు. సాకేత నగరములో తమ్ములు గొలువ, నాంజనేయాది మహాబలులు దాసులై పరివేష్టింప, దుష్టభీకరంబుగ శిష్టజనానంద సంధాయకంబుగ భూశాసనమొనర్చు చక్రవర్తిగ నెంచలేదు. తనతో ఆడుకొను సైదోడువలె, తమ్మునివలె, ముద్దుల మరిదివలె, గొప్పగుణాల పెనురాశివలె, సకల సద్గుణ సంపన్నుడగు పరిచయస్తునివలె చింతించి యీ భావమునకు తగిన ప్రవర్తనతో రాఘవాచారిగారు రామదాసునడతలను చూపించిరి. రాముని కళ్యాణోత్సవములో చూపిన యుత్సాహము తన కూతురు పెళ్ళియైనట్టు కనుపరచెను. కబీరు వచ్చినప్పుడు వాని మహిమను చప్పున తెలుసికొనడంలో ఆదరించడంలో కూడ

---

8. **యడవల్లి సూర్యనారాయణ :** చూ. వివరణ (నాట్యాంబుజము) 5.

9. **రామాయణం సర్వేశ్వరశాస్త్రి :** విజయనగరంలోని విజయరామానాట్యమండలిలో ప్రధాన నటుడు. ఆ సంస్థకి దేశికుడు కూడా. అన్ని ప్రధాన పాత్రలలోను నటించి పేరు పొందారు.

10. **అల్లూరు రామిరెడ్డి :** అల్లూరు శ్రీకృష్ణవిలాససభ అధిపతి అల్లూరు రామచంద్రారెడ్డి. చూ.వివరణ : నాట్యాంబుజం 5.

నిట్టి యమాయక బాల్యోత్సాహమునే వెలిబుచ్చిరి. తరువాత తాశీల్దారీ పని రాకముందు భద్రాద్రి పౌరులను రామాలయము గట్టించుటకు డబ్బు వేడినప్పుడును, రఘురాముడు పిల్లవాండ్లతో రామభజన వేడుక జరుపునపుడు వెనుక నుండి వచ్చి 'పుత్రాదిచ్ఛేత్ పరాజయం' అను న్యాయ మీబుడుతని భక్తి విశేషములో సిద్ధించెనను గర్వానందముల బ్రకటించునపుడును, తానీషా వద్ద జరిపిన సంభాషణములోను, రాఘవాచారిగారి పోకడలు పైచెప్పిన స్వభావ నిర్వచనానికి అనుగుణ్యంగా వుండినవి. మొత్తంమీద వీరి అభినయంలో, రామదాసు మంచి గృహస్థుగాను, మూడు తరాల నుండి వంటబట్టి జీర్ణించిన రామభక్తి కుదిరిన వాడుగాను, అమాయక నిత్యానంద చిత్తవృత్తికలవాడుగాను కనపడ్డాడు.

జైలుసీనులో రసానేకముల బ్రకటించుచు, భావపరంపరల రేపుకుంటూ, నాస్తికపు అవిశ్వాసము మొదలు సర్వము రామునకు వశపరచిన చిత్తవృత్తివరకు గల వృత్తి భేదములను, రామునొక పెంకి చిలిపి వడుగుగ దలంచుట మొదలు, సకలకళ్యాణనిలయుమగు రమావిభునిగ దలంచువరకుగా ఏర్పడు మర్యాదక్రమములను, మీదుమిక్కిలి తానేషా వచ్చి రాముడగుపడి వెళ్ళెనని చెప్పినప్పుడు కలుగు నుత్కంఠ పరితాపములను, నిరుపమానంగా రాఘవాచారిగారు చూపించినారు. వీరి అభినయంలో సామాన్య మానవ స్వభావోచితమైన రసభావప్రకోపన మెక్కువగ కనుపించినది. కాని పై కలవరింపు చర్మమాత్రములుగ గోచరించెను. సర్వేశ్వర శాస్త్రిగారి జైలునడతలు వైరాగ్యమును, సాధుత్వమును, సంస్కారమును, చూపునవిగ నుండి మొత్తము మీద జనరంజకముగ నందముగ మాననీయముగ నుండెను. జైలుసీనులో సూర్యనారాయణగారు కైకమాట వచ్చినప్పుడు ఆచార్యులగారికంటే ఎక్కువ రసస్ఫురణకలిగించినారు. కాని దశరథుడితో చెపుతాను, శపిస్తాను మొదలైన పలుకులలో వెనుకపడ్డారు. మొదటి రంగాల్లో సూర్యనారాయణగారు సిద్ధభక్తి చూపించదలచి లోచూపు లమర్చుకొని కండ్లలో తెలివితేటలు, జీవసంచలనము కనుపించకుండ జేసెను. కబీరును కలిసికొనినప్పుడీతని వర్తనము బాగున్నది. కాని, గురుసాంప్రదాయపద్ధతిలో కబీరునకు స్వస్తి చెప్పిన సందర్భాన్ని కొందరభినందించలేదు. మొత్తం మీద రాఘవాచారిగారి తరహాలో యెక్కువచోట్ల

నీతడే యభినయింపగలిగెనని చెప్పవచ్చును. కాని, ఆ పద్ధతియే ప్రమాణమని వారి అభినయరీతులనే అనుకరించిగాని రామదాసు స్వభావము వ్యక్తపడనేరదని చెప్పజాలము. కొన్ని భక్తజన సామాన్యపరిమితులలో, కొన్ని లక్షణాలతో వుండి, నటులు తమతమ స్వతంత్రరీతులలో అభినయించవచ్చును. సర్వేశ్వర శాస్త్రిగారు జైలుసీనులో స్వతంత్రముగ సరసముగ వర్ణించి ప్రేక్షకులను తృప్తిపరచిరి. ఇటులనే మొదటిభాగములను అల్లూరి రామదాసు నిరాడంబరముగ సహజముగ, చక్కని యభినయ మర్యాదలతో మనోరంజకముగ నెరవేర్చెను. ఈ సమాజమువారు వీలైనంతవరకు రామదాసు కీర్తనల పాడుచు, నపూర్వరామణీయక మొనగూర్చిరి. మిగిలిన హంగు విషయములో బెంగుళూరు యామెచ్యూరు కంపెనీవారితో నెనయైనది యీ మూడు నాటక సమాజాలలోను కనుపించలేదు. తెలుగుదేశపు కూడలియందుండి, నిజాము రాజ్యానకతిదూరమున నుండి యీ యుభయ ప్రాంతముల సాంఘిక జీవనమును చూపవలసిన పట్టులను మన సమాజములు యింకెక్కువ నైపుణ్యముతో నిర్వహించి యుండవచ్చును. రామదాసులో సూర్యనారాయణగారు కొంత కౌశల్యమగుపరిచారు. కాని, యాతని రూపు రాజవేషాలకు తగినంత మెరుపుగా యుక్తంగా రామదాసు మున్నగు భక్తపాత్రల కొప్పదేమోయని సంశయించుచున్నాను. చక్కని అర్థజ్ఞానం, మంచి గాత్రము, రాచనడవడికి, పెట్టినపేరు, వొప్పియున్న నీతడు గద్యాభినేతల దారులంటక తనకు దైవమొసంగిన ప్రత్యేకశక్తి ప్రసాదములు విప్పారి రంజించునట్లుగ, ధీరోదార శృంగార నాయకవేషములను, దుర్యోధనాది రాజరాజభూమికలను ధరించి, యాంధ్రుల నెక్కువ సంతోషపెట్టగలరని యనుకొనుచున్నాను. సర్వేశ్వరశాస్త్రిగారు సహజముగ బ్రహ్మతేజంబొలికించు స్ఫురద్రూపి. ఆడంబరము, గందరగోళము లేక యుక్తముగ మంచి నిగ్రహముతో కథాంశములను జాగరూకతతో పరిశీలించి సందర్భోచితముగ అభినయించగల సమర్థుడు, వివేకి, తూకమెరిగిన మనస్వి. వీరు యేమూలనో వుండి ప్రస్తుత నాట్యలోకపు నడతలను గరవజాలకున్నారు. వీరిస్థితిగతులు కొంచమిరకాటపువైనను మహారాజుగారే యిట్టి నటులను అప్పుడప్పుడు యితర ప్రాంతములకు బంపి యచ్చటి నాట్యాభినయ విశేషములను జూచు అవకాశము లేర్పరచినచో, సర్వేశ్వరశాస్త్రిగారు తెలుగునటులలో పెద్దపేరు వహింపగలరని నా నమ్మకము.

అల్లూరి రామచంద్రారెడ్డిగారి కబీరు వేషమును గురించి యెరుగనివారు లేరు. వీరి విగ్రహము, గాత్రము, నడవడి, ప్రశంసాతీతమై ప్రథమ ప్రవేశమందు తక్కుడు నటులను, ప్రేక్షక సమాజమును, ఒకవిధమైన భక్తివారధిలో ముంచివైచును. ఈ పట్టులో నాటకకర్తయే కబీరునకు యెక్కువ యవకాశమిచ్చి యున్నాడు. అదియొకపాటకచేరీగా పరిణమిస్తూ, మిక్కిలి జాగుసేయుచున్నది. గానలోలురకిది యెంత మనోహరముగనున్నను, కథాసంవిధానమునకు అడ్డమువచ్చి, బండకొయ్యవలె కథతో అతుకని యడ్డంకి కలుగుచున్నది. రామదాసు, కబీరునకు ప్రణమిల్లు నవసరమున రామచంద్రారెడ్డిగారు కూడ రామదాసునకు వందనమొనర్చిరి. ఇది యితర కబీరు లెవరును చేయలేదు. శిష్యుడు కొంచెమించుమించుగా గురువంతవాడు అయినప్పుడే గురువు యొక్క మహిమాతిశయములు తనంతట తాను తెలిసికొనగలుగును. గురుశిష్యులొకరిశక్తి నొకరు తెలిసికొనినప్పుడే, వీరి మానసప్రవృత్తులొక్కరీతిగ నుండినప్పుడే పొందు కలియును. అట్టి గురుశిష్య సమాగము యేర్పడినప్పుడే, లోకోపకారంబగు మహాకార్యములు సిద్ధించుచుండును. ఈ విషయమును ప్రకటించి కబీరు వినయ సహృదయముల చూపినందుకు రెడ్డిగారిని మెచ్చుకొన్నాను. చివర భాగాలలో తానేషాతో మాటాడు సందర్భాల్లో, బెంగుళూరి రాఘవాచారిగారి అభినయమిప్పటికిని యుత్కృష్టముగ నెంచుచున్నాను. కబీరు, రామదాసునకు భక్తితాత్పర్యములు కలగుజేయుటకన్న మహమ్మదీయ ప్రభువుకు హైందవదేవతల మహిమాప్రభావములను చూపించి, భక్తుల తపశ్శక్తిని తెలియపరచి, హిందూమతమందాదరణ కుదర్చవచ్చిన సూత్రధారిగ భావించి, రాఘవాచారిగారు అభినయించారు. అదే సమంజసముగ తోస్తున్నది. ఈ అర్థమును రెడ్డిగారు సంపూర్తిగ మన్నించినట్లగుపడదు. ఘంటసాల రాధాకృష్ణయ్యగారి రూపరేఖావిలాసములు, గానమాధురి నాట్యాంబుజములో ముచ్చటింపబడినవి. వీరి అభినయము చాలావరకు, రెడ్డిగారి పోకడల ననుసరించి వుండును. మొత్తముగా వీరిద్దరు కబీరు వేషధారణ కుపయుక్తమగు అంగవిస్ఫూర్తిగలిగి, హిందీ కీర్తనల పాడుటలో మనోహరముగ స్వతంత్రించగలరు. ఈ నాటకంలో కబీరు సిద్ధభక్తుడై ప్రవేశించి, కథాంశములు యితన్ని అంటీఅంటకుండుటచే యిందులో నాతడు అభినయించాలిసిన భావవిపర్యము రసోద్రేకాలు వుండవు.

తానేషా వేషంలో కొచ్చర్లకోట రంగారావుగారు బహుబాగుగా చేసిరని విన్నవించుచున్నాను. వీరి నబాబు ముస్తాబు, నడవడి, గాంభీర్యము, పలుకుపదునులు, గోలకొండ ధరాధినాధునకొప్పిదముగ నున్నవి. గూఢచారిగ రామదాసును పరీక్షింప వెళ్లినప్పుడును, రామలక్ష్మణులు సొమ్ము చెల్లింపవచ్చినపుడును రంగారావుగారు చక్కని సందర్భశుద్ధిని రసపారవశ్యమును వెల్లడించిరి. నటప్రకాశిక శాస్త్రిగారి నాటకాల్లో రంగారావుగారు చిల్లరవేషాలు కూడ కొన్నిటిని అందముగ నాడి హాస్యప్రసంగములో కొంత సామర్థ్యమును చూపించెను.

చిల్లరవేషాలలో, బందరులో పెద్ద వేషాలు రాజపార్టులు అభినయిస్తూ నాట్యసంబంధమైన ప్రజ్ఞలు చాలా సంపాదించిన కృత్తివెంటి సుబ్బారావుగారు మంచి హాస్యనైపుణ్యమగుపరుస్తారు. తెలివితేటలకు తోడు నిగర్వము, యేవేషమిచ్చినా సంతోషంగా అందుకొని చక్కగా నేర్పుగా ఆడడం, కలిసికట్టు, యీతనిలో యెంచదగిన గుణాలు. పెద్దవేషాలలో మెప్పించగల సర్వాంగ శిక్షితులైన నటులు హాస్యభూమికల దాల్చుచు చిల్లర వేషములు వేసే యెడల నాటకమెక్కువ రక్తి కడుతుంది. భావభారమున్నచోట సంగీతాన్ని విసిరి రసాభినయాన్ని అడ్డపరచేకన్న, హాస్యప్రసంగాల్లోనే సంగీతానికెక్కువ యవకాశమివ్వలసి వుంటుంది.

తెలుగుదేశానికి పేరెత్తిన దివ్యమూర్తి భద్రాద్రినివాసుడొకడే. వానిపేరు పెంపులకు కారణమైనది, గోపన త్యాగయ పోతనాదుల భక్తి విశేషమే. అందుచేత మాదేశంలో నీ యుత్సవాలు జరిగినచోటల్లా రామదాసు చరిత్ర జనరంజకంగా పలువురాడేటట్టు నీవు ప్రసాదించవలెను. ఆడగల నటులు లేకపోలేదు. ఇదివరకు పేరెన్నిక లేకపోయినా నీయనుగ్రహాన నిన్ను మన్నించు మంచి ఆటలలో పెద్ద వేషాలు వేసి ముందుకు రాగలరు. తెలుగుదేశపు యూరిపల్లెలలో నీభజనలు, నీ నామసంకీర్తనము, నీ భక్తుల చరిత్రములు సర్వదా తాండవించునట్లు నీవే చేయ వలెను. "భవద్భక్తిమేన భవాన్దేహి మహ్యం భవానేవదాతా త్వదన్యంనయాచే" ॥

ఇట్లు ప్రార్థించు

**భవత్కటాక్ష చంద్రికా సంతృప్త ధీశ్చాతకంబు – సూరిశాస్త్రి**

# హరిశ్చంద్ర

## సర్వేశ్వరశాస్త్రి - హరిశ్చంద్రుడు

విభీషణవిభో! జానకీమనోహరా!!

మావూళ్ళో ఒక అపూర్వమైన నాటకమయింది. ఆట పాతదేకాని ఆడినరీతి క్రొత్తది. తెలుసుకొనేవాళ్ళకు దానిలో కావలసినంత తెలివగుపడ్డది. విజయనగరాన్నించి వచ్చిన ఒక బ్రాహ్మడు సత్యహరిశ్చంద్ర నాటకానికొక కొత్త అర్థము తెచ్చిపెట్టాడు.

రామాయణం సర్వేశ్వరశాస్త్రి స్వాభావికంగా మంచి సాధువు. పుటుకపరువు, కొంచెము సంస్కారము, సత్ప్రవర్తన, నియమపరిజ్ఞానము, చల్లనిమనస్సు, కొంతభక్తి వైరాగ్యసంపత్తి, యాతని నిత్యజీవనములోనే స్ఫురించుచుండును. మంచి బ్రాహ్మణుడు, స్ఫురద్రూపి, నిష్కపటమైన నిరాడంబరమైన మనస్సు, ఇదంతా, యీతని పరోపకార సంకల్పములన్నీ, చందమామవలె నగవుసొబగులతో ప్రకాశించు ముఖ మండలంబున తేజరిల్లుచుండును. ఇతను నా బుద్ధిలో విద్యానాథవేషము వేయడానికి తగిన తేజస్వి. పరాశరుడు, పరశురాముడు, అశ్వత్థామ మొదలైన బ్రాహ్మణ తపోధనులకితడు నిస్సంశయముగ పనికివచ్చునని నమ్ముతాను. నిజంగా విద్వత్ప్రదర్శనాలనాటి యావత్కాలములో సర్వేశ్వరశాస్త్రిగారే దయదలచి అడ్డుపడకుండిన నటప్రకాశికనప్పుడే క్రింద పెట్టియుందుము. ప్రసిద్ధనటులందరి వలె నీతను కూడ పాత్ర స్వభావమును, కథా సందర్భమును లోతుగ పరిశీలించి అభినయించువాడు. హరిశ్చంద్ర నాటకమున కీతడొసంగిన భావ వ్యాఖ్యాన మపూర్వమగుటయేకాక, అందీతని యభినయ రీతులు నవీనాంధ్ర నాట్యాభినయ

విజయములలో నొక్కటిగ నుండునని భావించుచున్నాను. ఈతని విగ్రహము కొంచెము కుదిమట్టపుదై షట్చక్రవర్తులలో మొదటి పేరుగ బరిఢవిల్లు సప్తద్వీపవిశాల భూభరణభార ధురంధరుని పెంపుపటిమల జూపకున్నది. ఈ విషయములో హరిప్రసాదరావుగారికి[11] చాలినవాళ్ళు మనవైపున లేరనేచెప్పవచ్చును. సర్వేశ్వరశాస్త్రి, గౌనులో కొంచెము మునిగిపోయినట్లు కనుపించెను.

సామాన్యంగా హరిశ్చంద్రనాటకం చూచేవాళ్ళకు ఆ కథ యీరీతిగా తోస్తుంది. రవికుల సంజాతుడగు హరిశ్చంద్రుడు సత్యశీలుడై పుడమి నేలుచుండెను. వనితాసందర్భములందుకూడ నితడు నిగ్రహము కలవాడు. ఇంద్రసభలో సత్యవంతుల ప్రశంస రాగా, రవికులపురోహితుడగు వసిష్ఠుడు హరిశ్చంద్రుని పేరు, వేల్పుకూడలిలో బాహాటముగ ప్రకటించెను. ఏనాటినుండో వసిష్ఠునిమీద పాదుగొనియున్న విరోధమును మనస్సులో పెట్టుకొని, విశ్వామిత్రుడు, హరిశ్చంద్రుని సత్యవ్రతము చెడగొట్టి చూపెదనని అసూయామాత్సర్యప్రేరిత మగు ప్రతిజ్ఞ బట్టెను. హరిశ్చంద్రుని పెక్కు కష్టములలో పరీక్షించి చూచెను. హరిశ్చంద్రుడు తనమాట నిలుపుకొనుటయందుగల పట్టుదలచేతనో, వసిష్ఠుని సంకల్పాశీర్వచన ప్రభావముననో, మాట తప్పకుండ చివరవరకు నిల్పుకొనెను. ఈతని సత్యదీక్షకు విశ్వామిత్రుడు లొంగిపోయెను. వసిష్ఠునిమాట చెల్లినది. ఈ కథాసంవిధానములో, సత్యవ్రతమును పట్టుదలతో నిర్వహించు పెంకితనములో "ఏకాతత్రవతం జగతః ప్రభుత్వం నవంవయఃకాంతమిదం వపుశ్చ । అల్పన్య హేతోర్బహుహాతు మిచ్ఛన్ విచారమూఢః ప్రతి భాసిమేత్వం॥" అనునట్లుగా, హరిశ్చంద్రుడు, లౌకికనీతి మర్యాదలలో నొకదాని సమర్థించుకొరకు తన్ను నమ్మియున్న ప్రజలను, తన్ను వరించి యాశ్రయించిన సామ్రాజ్యలక్ష్మిని విడనాడి యడవులబట్టిన పెంకెమతమగుపడును. ఈ కాస్తకు కథాంతమున త్రిమూర్తులరుదెంచు అవసరమగుపడదు. ఇదంతా యీ దేవతాసాక్షాత్కారము కథాంతమును సరసముగ కూర్చలేని కావ్యదౌర్బల్యముగ కనుపిస్తూవుండేది. దేవతలువచ్చి మానవవ్యవహార పరిష్కరణమందు పాల్గొనుట నాటకకవుల తెలితక్కువను జూపు తరుణోపాయముగ నెంచి యేవగించుకొనుచుంటిమి.

---

**11. హరిప్రసాదరావు :** చూ. నాట్యాంబుజ వివరణ : 11.

సర్వేశ్వరశాస్త్రిగారు యీకథకు ఒక దివ్యమైన అంతరార్థమును కల్పించుకొన్నారు. ఇతను మొదటి నుంచి చివరవరకు కథలోని అవస్థలను, భంగపాటులను, దశావిపర్యయములను లౌకికార్థమున మన్నించక, చిట్టచివరకు త్రిమూర్తులగుపడుదాని యాధ్యాత్మికార్థమును కథకంతకు పునాదిగచేసికొన్నారు. త్రిమూర్తులగుపడుటలో మోక్షసిద్ధిని యూహించెను. విష్ణుమూర్తి వైరాగ్యమునొసంగెడివాడు. గౌరీమనోహరుడు అష్టైశ్వర్యములను నిత్యసంపదలను ప్రసాదించువాడు. మొదటివేల్పు సాత్త్వికమైన బ్రహ్మాండ మొనగూర్చువాడు. వీరి ముగ్గురిలో నేయొకడు ప్రత్యక్షమై, వరమొసంగినా యేదో యొక రకపు సంపద గల్గియుండును. త్రిమూర్తులు ఒకేసారి వచ్చుటచే సచ్చిదానంద స్వరూపమగు పరమేశ్వరాంశము సాక్షాత్కరించి, గుణత్రయ సంపర్కమును వదలించి, సంపూర్ణమగు కైవల్య మొసంగెనను అర్థము తేలుచున్నది. ('త్రైగుణ్యవిషయా వేదాఃనిస్త్రైగుణ్యో భవార్జునా నిర్ద్వద్వోంనిత్యసత్యస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్'). ఈవిధమైన మానసిక శిక్ష మోక్షప్రాప్తికి సాధనముగ శ్రీకృష్ణభగవానుడాదేశించి యున్నాడు. హరిశ్చంద్రునకు కథాంతమున గల్గిన సుఖప్రాప్తి రాజ్యము, పెండ్లాము, కొడుకు తిరిగి హస్తగతమగుట కాదు. ఇన్ని కష్టాలు పడ్డ తర్వాత, యీ యైహికసంపదల పునఃప్రాప్తి కూడ వెగటుగనే యుండును. షేక్స్పియరు మహాకవి యిట్టి సందర్భాలలో నిత్యసుఖ మీ జన్మమందు లేదనుటకు కథానాయకులను చంపివైచెను. మన నాటకాలలో సాధారణంగా మరణాంత మేర్పడకున్నా, కష్ట పరంపరల దాటిన కథానాయకుడు సన్యాసాదితురీ యాశ్రమముల జేరుచుండును. హరిశ్చంద్రునికి లభించిన లాభము త్రిగుణాతీతమగు బ్రహ్మానందోపలబ్ధి – మోక్షము. దీనిని మనవారు తపస్సువలన సాధింపవచ్చునని చెప్పుచున్నారు. తపస్సంటే మంత్ర పునశ్చరణము కాదు. శిష్ట వేషధారణము కాదు. 'సత్యం తపశ్శాంతం తపః ఋతంతపః శమస్తపః దమసప్తః' మున్నగు శృతివాక్యములలో దానము, విద్య, సత్యము, శమదమాదులు, శాంతము మున్నగు మానసిక వ్రత విశేషములను మోక్షసాధకంబులగు, పరతత్వ నిరూపక సమర్థంబులగు, తపోవిశేషములగ నెంచి యున్నారు. సత్యతపంబున మోక్షము సిద్ధించగలదు. కాన అభ్యాసములో సత్యయోగి నిర్ద్వంద్వుడై యోగసిద్ధిని సంపాదింపవలెను.

అనగా సుఖదుఃఖములు, లాభాలాభములు; జయాపజయములు అనే విచక్షణ నశించవలెను. వీనిని సాధించుటకు ధన దార పుత్రాత్మకంబగు నీషణత్రయము సంపూర్ణముగ నశించవలెను. హరిశ్చంద్ర నాటకములో మునుమొదలు హరిశ్చంద్రుని ధనమంతయు కౌశికునకర్పింపబడినది. ఇందులో హరిశ్చంద్రుడు ధనేషణమును జయించినాడు. తరువాత చంద్రమతి లోహితాస్యుని అమ్ముకొనుటయేగాక పుత్రని మృత కళేబరముపై నిర్మొగమాటముగ శ్మశాన సుంకమును వసూలుచేయగల ధీరుడైనాడు. ఆవల పెండ్లాము గొంతు తెగనరుకు దండిగుండెను సంపాదించినాడు. ఈరీతిగ ధన దారాపుత్రరూపమున మనుష్యుల కర్మబుద్ధుల గావించు నీషణత్రయముల జయించుటచే, సుఖదుఃఖ సమీకరణముచే నియత కర్మానుష్ఠానముచే, హరిశ్చంద్రుడు సత్యతపస్సు మోక్షదాయకమైనది. ఊరికే 'నేనబద్ధమాడను' అను ప్రతిజ్ఞ పెట్టుకొని మొండిపట్టుతో పెనుగులాడినందువల్ల మోక్షము సిద్దించదు. అప్పట్టున సత్యవ్రతము కూడ రాజస సంకల్పములలో నొకటి యగును. సంకల్పమున్న తావున యోగసమాధి కుదరదు. సంకల్పము సద్విషయాశ్రితమైనా దుర్వ్యాసంగ ప్రేరకమైనా, సరే, కర్మస్పర్శ కలిగించక మానదు. ఈషణత్రయములను జయించుటకు ప్రేరణహేతువై, బుద్ధిని ద్వంద్వ విహీనముగ నొనర్చుటకు కారణమై, యుపచరించినప్పుడే యేవ్రతమైనా, యెట్టి నియతియైనా, తపస్సనిపించుకొనును. ఇట్టి తపస్సుచేతనే మోక్షము సిద్ధించును. హరిశ్చంద్రనాటకపు పరమావధి రాజసంకల్పమైన సత్యసంరక్షణము కాదనియు, నిర్గుణమైన మోక్షోపలబ్ధి అనియు, నాటకములో వచ్చు రాజ్యదానము దారాపుత్రవిక్రయము మున్నగు అవస్థలు ఒక మహారాజునకు దశావిపర్యయముచేత కాలవశమున యేర్పడ్డ యిక్కట్టులు కావనియు, నివియన్నియు నీషణత్రయమును జయించు యోగసాధనములనియు, శిబి, రంతిదేవ బలిచక్రవర్తి ఇత్యాదులు దానతపస్సుచే మోక్షమును సాధించినట్లు వ్యాసాదులు విద్యా తపస్సుచే కైవల్యమొందినట్లు – హరిశ్చంద్రుడు సత్యతపస్సుచే సంసారవారధి థరించి త్రిమూర్త్యాత్మకంబగు నిర్గుణబ్రహ్మ స్వరూప సాక్షాత్కారమును పొందెననియు, హరిశ్చంద్ర నాటకపు అధ్యాత్మికార్థమిదియనియు, సర్వేశ్వరశాస్త్రిగారు భావించి తదనుకూలముగ ప్రతి సందర్భములో నిర్ద్వంద్వ యోగసమాధిని,

అరిషడ్వర్గములను, ఈషణత్రయములను, వెలయించు సాధకవైఖరిని యగుపరచిరి. చిన్ననాట నుండి బాలివాలా మున్నగు ప్రసిద్ధనాటక సమాజాలు పెక్కింటిలో హరిశ్చంద్ర నాటకమును చూచుచుంటిని. ఇంద్రసభ, ఆటవిక రంగములు, అడవులు కాలుట, గంగదాటుట, శ్మశానవాటికల భీభత్సతామసాకారములు, విశ్వేశ్వరాలయము, నక్షత్రకుని వెకిలిగంతులు, విశ్వామిత్రుని క్రోధానల విస్ఫులింగములు, కలహకంఠిని 'అనేక శతభాండాని భిన్నానిమస్తకే' యనెడి సంసారతాపత్రయము, బడిపిల్లల చెలగాటలు, లోహితుని పాముగరచుట, రాజసభలకొలువు బడాయిలు, దండధరుల దుడుకుడాబులు, మున్నగు ప్రాసంగికరంగ ప్రదర్శనాలంకార సంపత్తితో నొకరినిమించి యొకరు కలకలలాడించుచుండిరేకాని, యీ నాటకపు ఆధ్యాత్మికార్థమును నాటకావస్థల వేదాంతసాధన సూచనలను, గుర్తించి వెలిబుచ్చినవారొకరైన కనుపడలేదు. ఈ మహత్కార్యమును క్రొత్తగా స్వతంత్రముగా భావించి యొద్దికపొందికలతో రమ్యముగ నిర్వహించి యభినయించిన మొదటినటుడు మన సర్వేశ్వరశాస్త్రియని దివ్యసన్నిధి కెరుకపరచు సాధువిధేయుడు,

**సూరిశాస్త్రి.**

# నట ప్రకాశిక నాటకాలు

హనుమద్గురో! కరుణానిధే!

మావూరొక చవిటిపఱ్ఱ. నీవు నివాసముగ నేర్పరచుకొన్న భద్రగిరీ ప్రాంతముల జెన్నొందు విచిత్రాద్భుత రమణీయ దృశ్యములు మా మాగాని గోతులలో కనపడవు. కొండల్లేవు, నదులు లేవు, చేరువుననున్న సముద్రమైనా, నూతుల్లో వుప్పు నీళ్ళు, యిండ్ల గోడలకు చవిటిబెత్తికలు కలిగిస్తున్నదే కాని సైకత వేదికాతలంబుల వెన్నెలరాత్రుల విశ్రమించి వినీలవీచికాపరంపరలను తరంగభంగ ముక్తాహార రామణీయకమును వీక్షించు భాగ్యమొసంగదయ్యె. బందరు వాళ్ళము చల్లగాలికి కూడ కరువు వాచాము. నీవు పదునాల్గేండ్లు అడవులపట్టి దిమ్మరిన దక్షిణాపథములో యీనాటికి నిలచియున్న హిందూరాజ్య మిదియొకటి అనే కాబోలు, నీభక్త సేవకుడు ఆంజనేయుని యునికిపట్టు లీసీమలని కాబోలు, మహిసూరు రాజ్యములో యింత వనారామసౌందర్యమేర్పరచి చల్లని పిల్లగాడ్పులతో, వచ్చీపోయే జల్లువానలతో, చక్కని పచ్చిక పట్టులతో, కమ్మని ప్రసూనసౌరభములతో, కండ్లకింపుగ వెలుగొందు సంజసొబగులతో, నలంకరించియున్నావు. ఈ గాలిలో యిచ్చటి పచ్చిక పూజొంపముల మనోహర పరిస్థితులలో చేతము చల్లపడి కలము కాకితము సందడించుచున్నవి. బందరులో దెండము గందళించు ప్రకృతి వైచిత్ర్యమగుపడకున్నను పౌరప్రధానుల యంతఃకరణములు వున్న గాలిలో తుప్పుపట్టి కళాప్రసంగములందు విముఖులై యున్నను, యీ యేడు మాయూర నాట్యకళాలలామ నిజరససూర్తితో తాండవమాడ జూచెడియవకాశము లేర్పడ్డవి.

ఎన్నేళ్ళనుంచో పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రుర్లు గారు[12] ఆంధ్రనాటక

**12.** **పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి :** చూ. వివరణ 3.

సమాజాలకు వుపయోగించే పెద్ద పుస్తకమొకటి రాయాలని అనుకుంటూ వుండేవారట. ఈయనకు కవిత్వంలో కొంత ప్రవేశముంది. సంగీతంలో కొంత నేర్పేర్పడ్డది. చిన్నప్పటినుంచి అనేక నాటక సమాజాలలో మెంబరుగా వుండి వేషాలు వేశారు. సమాజాలకు తర్ఫీదు యిచ్చారు. లంకాదహనం, రామరావణ సంగ్రామం, సావిత్రి మొదలయిన నాటకాలు వ్రాసి, అందులో ఆంజనేయ వేషాన్ని మెప్పుగా అభినయించారు. కొన్నాళ్లబాటు వీరి లంకాదహనం మావైపు నాట్యరంగాన్ని యేలింది. వీరు, నాటక సంబంధమైన సంగీత విషయాలు, భరతము, అభినయ సందర్భాలు, కావ్య లక్షణాలు పనివడి నేర్చుకొన్నట్టు తెలుస్తుంది. లక్ష్య లక్షణ సమన్వితంగా ఒక పెద్దబుక్కు వ్రాయాలనుకుంటూ, వుండగా నాట్యాంబుజ మొచ్చింది. కడుపులో నున్న భావాలన్నీ రగుల్కొని జ్వాలా ప్రతాపమున బయటపడ్డవి.

శాస్త్రుర్లుగారు తెలుగు దేశపు నాట్య చరిత్రమంతా తెలిపే నాట్య మహాభారతాన్ని వ్రాయ తలపెట్టారు. అందరి నటులను అన్ని ఆటలను చూడాలని, చూచి సమగ్రంగా రాయాలని అనుకున్నారు. చాలా పెద్ద ప్రయత్నం మొదలెట్టి పత్రికలన్నీ మోగించారు. నటులు, సమాజాలు యెవరికి తోచినసహాయము వారు చేయబూనారు. బందరులో చిట్టూరి నరసింహంగారు, తురగా నరసింగరావుగారు, వడ్డి రామయ్యగారు, వీరికి సంబంధించిన రామమోహన్, బాలభరత, దేశీయ నాటక సమాజాలు[13], నేను, వడ్లమన్నాటి కుటుంబరావుగారు[14] శాస్త్రిగారికి తోడుపడ్డాము. కాని, అనేక ప్రత్యర్థి వ్యవహారాలుదయించినవి. కాలమాన పరిస్థితులు వ్యతిరేకించినవి. శాస్త్రిగారు మంచినటులను బందరుకేరప్పించి విద్వత్ప్రదర్శనాలు ఆరంభించారు.

శాస్త్రుర్లుగారు కొంతవరకు పుస్తకం వ్రాసి, చేత్తో పుచ్చుకుని, ఆంధ్రదేశమంతా పర్యటనమొనర్చి, అక్కడక్కడ లెక్చర్లిచ్చి, తమ వుద్యమాన్ని

**13. రామమోహన్, బాలభరత, దేశీయ :** 1900-1925 మధ్యకాలంలో బందరులో పేరెన్నికగన్న నాటక సమాజాలు.

**14. వడ్లమన్నాటి కుటుంబరావు :** బందరులోని రామమోహన్ కంపెనీ అధిపతి. నాటక విమర్శకులు. పోషకులు.

తెలుపుకుంటూ, పోషకుల సంపాదిస్తూ, యెక్కడి నాటకాలను అక్కడ చూచి విమర్శించుకొంటూ వస్తే వీరి కార్యము సుళువుగా తీరేది. అచ్చు ఆలస్యమైనా పత్రికలకు వ్రాస్తే కొంత పేరు వచ్చేది. కాని అందరినీ బందరే రావించాలని సంకల్పించుకొని నాట్య విద్వత్ప్రదర్శనాలు మొదలెట్టారు. దేశమంతా గోడచీటీలంటించారు. పత్రికలలో మోగించారు. అడిగిన ప్రసిద్ధనటులంతా వుత్సాహంగా మాట తీసేయకుండా వచ్చారు. కాని యిక్కడ సరియైన సమాజము మిగతా వేషాలు వేయడానికి సిద్ధంగా లేదు. వచ్చిన నటులకు తోడు బలము లేక కొంత కష్టం తోచింది. ప్రయాణపు ఖర్చులు అమితంగా అయినయి. రామదాసు పెళ్లాన్ని బెంగుళూరు నుంచి తెప్పించారు. ఒక్క నెల్లూరు కబీరే మూడువందల చిల్లర పీల్చేశాడు. అంతకుముందు జి.ఐ.టి.[15], రామవిలాస[16] మొదలైన బయటవూళ్ల కంపెనీలు వచ్చి గ్రామంలోని డబ్బంతా వూదుకొనిపోయినాయి. ఎండలొచ్చాయి. వానలొచ్చాయి. అడ్డంకులొచ్చాయి. ఆటలు వాయిదాలు పడ్డయి. వూళ్లో యెన్నో ప్రత్యర్థి వ్యూహము లేర్పడ్డయ్యి. బహిరంగలేఖలు, కరపత్రాలు, ఆకాశరామన్న జాబులు, కుట్రలు, కోపాలు, పార్టీలు, వెక్కిరింపులు, పాలగిన్నెలో వుప్పెనపోటువలె జెలరేగాయి. ఏమైనా మాటయిచ్చిన వాళ్లము తలొకచెయ్యివేసి వీలైనంతవరకు శాస్త్రుర్లగారి ప్రయత్నాన్ని దరిజేర్చ చూశాము.

కాని, తిథి వారనక్షత్రాలు బాగుండని దుర్యోగంలో విషాద సారంగధరతో మొదలిడిన నటప్రకాశిక విద్వత్ప్రదర్శనాలు యెప్పటికప్పుడు దెప్పరిల్లి కడలబారి మరల యంతటితో చలువలుగమ్మి వ్రేలాడుచు వచ్చినవి. ఇప్పటికి శాస్త్రిగారు సుమారు వెయ్యి పేజీల గ్రంథము వ్రాసియున్నారు. ఇది మొదటి వాల్యూము. రెండవ సంపుట మింకొక పుట సహస్రకంబును మించి పెంపొందనున్నది. అచ్చు వేయించే పోషకులమరి యున్నారు. కాని యింతవరకు యే పని చిగురించలేదు. 'లక్ష్మీవిలాసా విదుషాంకటాక్షా వేంకటప్రభోః' అని పెద్దలంటున్నారు గనుక 'అరయన్ శంతనుపుత్రుపై విదురుపై నక్రూరుపై, కుబ్జపై,' వ్రాలి కరిఁజేని కుయ్యాలించి ప్రోచిన భవత్కృపారస మొకింత నటప్రకాశిక శాస్త్రుర్లుగారిపై రాల్చి

---

**15. జి.ఐ.టి :** ఏలూరులోని గ్రేట్ ఇండియన్ థియేటర్స్ అనే నాటక సంస్థ.

**16. రామవిలాస సభ :** తెనాలిలోని ప్రఖ్యాత నాటక సంస్థ.

వారి మహోద్యమ మచిరకాలమున దేశోపకారంబగు గ్రంథప్రసూనముల నీనునట్లు సర్వకారణముల కారణంబైన నీవే యనుగ్రహింపవలెను.

శాస్త్రుర్లుగారు ఆడించిన ఆటలైదు. సారంగధర, రామదాసు, హరిశ్చంద్ర, కృష్ణలీల, లంకాదహనము. నట సామాజికులను బందరు బాలభరత, దేశీయ సమాజం, రామమోహన్ సభ్యులనుంచిన్ని, మరికొందరు బయటవాళ్ళను చేర్చిన్నీ, అతికించినారు. సారంగధరలో బిట్రగుంట కాపురస్తులు రైల్వేగార్డు పనిలో నున్నవారు బి.వి. కృష్ణయ్యనాయుడుగారు[17] చిత్రాంగి వేషాన్ని, శ్రీకాకుళపు వాస్తవ్యులు ఉభయభాషా ప్రవేశలక్షితులు కళ్లేపల్లి కూర్మనాథకవిగారు[18] రాజరాజనరేంద్ర పాత్రాన్ని, యడవల్లి కనకసుందరంగారు[19] సారంగధరుడుగాను, రామమోహన్‌వారి గోవిందరావు నాయుడుగారు రత్నాంగిగాను, అభినయించిరి. కవిరాజ మల్లాది విశ్వనాథ శర్మగారు[20] యీ నాటక మహోత్సవాన్ని చూడవచ్చిరి.

---

**17. బి.వి.కృష్ణయ్యనాయుడు :** బిట్రగుంటకు చెందిన నటుడు. నెల్లూరు, అల్లూరు నాటక సమాజాలలో స్త్రీవేషాలకు ప్రసిద్ధి చెందారు. ముఖ్యంగా చిత్రాంగి వేషం ఆయనకు పేరు తెచ్చిపెట్టిన పాత్ర.

**18. కళ్లేపల్లి కూర్మనాథకవి :** స్వస్థలం విజయనగరం జిల్లా పాలకొండ. విజయనగరం నాటక సంస్థలలో నాయక పాత్ర ధరించేవారు. రాజరాజ నరేంద్రుడు పాత్రకు పేరు పొందారు.

**19. యడవల్లి కనక సుందరరావు :** గుంటూరుకు చెందిన ఈ ప్రఖ్యాత నటుడు పేరెన్నికగన్న అన్ని నాటకాలలోను ప్రధాన భూమికలను అతి నేర్పుతో ప్రదర్శించేవారు. బిల్వమంగళుడు, హరిశ్చంద్రుడు వంటి ఉదాత్త పాత్రలను ఎంత నైపుణ్యంతో ప్రదర్శించేవారో నక్షత్రకుడు వంటి హాస్యపాత్రలను కూడా అంతే నేర్పుతో ప్రదర్శించేవారు.

**రామమోహన్ గోవిందరావు నాయుడుగారు :** బందరు రామమోహన్ కంపెనీలో స్త్రీవేషధారి ఇందుపల్లి గోవిందరావు.

**20. మల్లాది విశ్వనాథశర్మ :** తెలుగునాటక ప్రగతికి కారణభూతులైన ప్రఖ్యాతులలో శర్మగారొకరు. శ్రీకాకుళంలోను, ఆ తరువాత మద్రాసులోని కళాశాలల్లోను ఆంధ్ర పండితులుగా పని చేశారు. సురభి నాటక సంస్థలకు దాదాపు **20** నాటకాలను రాశారు. విశ్వనాథ కవిరాజుగా ప్రసిద్ధులు. తెలుగులో హాస్యనాటికా రచనలో పేరెన్నికగన్న ముఖ్యులు. **1929**లో వనారస గోవిందరావుగారిని ప్రోత్సహించి ఆంధ్ర నాటక కళాపరిషత్తును స్థాపించడానికి కారకులైనారు. **1918** ప్రాంతాలలోనే తమ స్వగ్రామం "పాలాకి"లో నటసభ జరిపించారు. రెండేళ్లపాటు 'నాటక కళ' అనే పత్రికను నడిపారు.

కూర్మనాథ కవిగారు సారంగధర నాటకంలో తమ పార్టునంతను సంస్కృతాలంకార శాస్త్ర పద్ధతులతోను, భరత శాస్త్రానుసారంగాను, విమర్శించుకొని నోట్సు రాసుకొని యేపట్టున యెట్టి హావభావములు, నేత్రహస్తాలు చూపించాలో యేర్పరచుకొన్నారు. కాని ఆనాటి సారంగధర ప్రదర్శనంలో మూడు పాఠాలు పోటీపడి తంజావూరు దగ్గర రైలుబళ్ళ వలె పరుగులిడినవి. కొందరు నటులు బళ్లారి పాఠం[21] చదివారు. కొందరు పానుగంటివారి[22] శిష్యులు. మరికొందరు విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యంగారిని[23] అభిమానించారు. ఇక చిల్లరవేషాలు దాసీ కమల మొదలయిన వాళ్ళు స్వతంత్ర వాచాల ప్రభావమున విజృంభించారు. ఎట్లా వుండాలో అట్లా వుంది. సాయంత్ర మైదుగంటలదాకా ఆట పడేది, ఆగేది తేలలేదు. పదకొండు గంటలకు తెర యెత్తాము. దుస్తులు లేవు. అన్నిటికి వెతుక్కోడమే, కూర్మనాథ కవిగారు నిరుత్సాహులైనారు.

సరిగా బొబ్బిలికథలో బుగ్గమీసాల కథకుడివలె వీరి చాళుక్య సార్వభౌమ భూమిక తయారయింది. రాజు వేటకెళ్లే మొదటిసీనులు దీశారు. అవి వుంటే 'రార పోదాము యేటాకుయేగా, సేరీన మెజీవాలు పారాడిపోకుండ' మొదలైన ఆటవిక గీతికా వినోదముతో కొంత రక్తి కట్టి వుండేది. రాజమహేంద్రుడు కొమరునకు పట్టంబు గట్టనెంచెడి చెడి 'పోలగ రాజ్యము నేలుము తనయా( మొదలయిన సీను కూడా తీసేశారు. అది వుంటే రాజుకు కొడుకుపై గల ప్రేమ, సారంగధరుడి గుణగణము లెరిగిన మనస్థితి వెల్లడై, తరువాతి విషాద సందర్భానికి వెనుకపీటీగ రక్తి కట్టేది. ఇది లేకుండా ముందుగానే సారంగధరుడు పావురాయలాడుకొంటూ ప్రవేశించెను. తరువాతి రంగంలో చిత్రాంగి విరహవేదన, యింతలో పావురము వచ్చి వాలడం, ఆ తర్వాత సారంగధరుడు రావడం చూపించారు. భగ్నమనోరథయై కొమరుని యుపేక్షకు ప్రత్యపకారదీక్ష వహించి,

**21. బళ్లారి పాఠం :** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి "విషాద సారంగధర".

**22. పానుగంటి :** ఈయన రాసిన సారంగధర కోస్తా జిల్లాలలో ప్రాచుర్యాన్ని పొందింది.

**23. విష్ణుభొట్ల సుబ్రహ్మణ్యం :** విజయవాడకు చెందిన ఈయన రాసిన సారంగధరకు కూడా కొంత ప్రాముఖ్యం ఉంది. మిగిలిన రచయితలు రాయనన్ని పాటలు ఈయన తన నాటకంలో చొప్పించారు.

చింపిరి బట్టలతో పక్కనంటుకొని పడియున్న, గయ్యాళి చిత్రాంగి పడకగదిలోకి ప్రవేశించడమే రాజనరేంద్రుడి ప్రథమ దర్శనము. రేచీకటి పడకటింటిలో జొచ్చునపుడు, యేవస్తువెక్కడనున్నదో పరిశీలించు అవసరము వుండవచ్చును. రాజుకు చిత్రాంగి నెపుడు చూతుమా కౌగిట జేర్తుమా యను నుత్కంఠ ముండవచ్చును. పెద్దవాడగుటచే నడుగులు తడబడ వచ్చును. కాని వేటకరిగిన బంటు మానిసి. తాను చిన్ననాటి నుండి నివసించి తిరిగిన యింటిలో, కండ్లు తెలియని చీకటి కమ్మినను నిజగంభీరమనోద్ధతితో నడువగలడు. ఇటుకాక కూర్మనాథ కవిగారు శార్వలికుడు ముచ్చుతలపుతో చారుదత్తుని నట్టిల్లు జొచ్చినట్లు[24], తన యింట నతిథియై, తన్న ప్రేమించి గారవించెడి ప్రభుసత్తముండై, నిద్రించు డంకను భూపాలుని రాజ్యకాంక్షచే జంపవచ్చిన మాక్బెత్తు సేనానివలె[25] – ముచ్చిలి చూపులతో, అడుగడుగు సందేహాలతో, భయముతో, అనుమానముతో, నవవధూముఖ చంద్రకళావిలాస శోభితంబగు, చాళుక్యరాజ మహిషీ శయనాలయంబును ప్రవేశించెను. ఈ నటన సందర్భోచితంగా కనపడలేదు. తరువాత చిత్రాంగి సారంగధరుని పేరు తన్ను వంచించినవానిగ దెలిపినపుడు రాజు మూర్ఛిల్లిన యవస్థను కవిగారు బాగా చూపించారు. ఈ నాటకంతో వారూ సంతోషించ లేదు. వారితో ప్రేక్షకులూ తృప్తి పొందలేదు. నేను మాత్రం వీరు తెనిగించిన పుష్పబాణ విలాసంలో కొన్ని పద్యాలు, శ్లోకాలు వినుపించుకొని యానిందించాను.

## బి. వెంకటకృష్ణయ్య నాయుడు

చిత్రాంగి వేసిన వెంకట కృష్ణయ్య నాయుడు వెంకటగిరిలో కొన్నాళ్ళు నాట్యకళ నేర్చుకున్నారు. వరి కాయము పెద్ద యేపుగలది. ముఖము కూడ వయస్సుచేత కొంత ముదిరినది. వక్త్రముజూడ ముచ్చటగా కెంపారకున్నది.

---

**24. మృచ్ఛకటిక :** శూద్రకుని ప్రఖ్యాత సంస్కృత నాటకం. దీనికి తిరుపతి వేంకటకవులు చేసిన తెలుగు అనువాదం ఆధారంగా మోతేవారి కంపెనీ ప్రదర్శించి పేరు తెచ్చుకున్న నాటకం.

**25. మాక్బెత్తు సేనాని :** ప్రఖ్యాత ఆంగ్ల నాటకకర్త షేక్స్పియర్ రాసిన 'మాక్‌బెత్' నాటకంలోని నాయకుడు.

రైలుదిగి గడ్డము పెరిగి వాకిటవచ్చి నిలబడగానే సారంగధరుడు వచ్చెనేమోనని అనుకున్నాము. కాదు చిత్రాంగి అంటే, 'యిదేమిరా పూతకిని పట్టుకొచ్చి సారంగధర జారిణిగ చేయుచున్నారే' యని వెక్కసపడ్డాను. రెండోసీనులో తెర యెత్తారు. వేషముదాల్చి నిలబడ్డాడు. రంగంలో – మన ఆయశ్శకట సంరక్షకుడు. దూరానికి చూచేవాళ్ళకు యవన మహాశిల్పకుల వీనసు (రతీప్రతిమ) వలె, రవివర్మ హంస దమయంతి చిత్రమువలె నిరుపమరూప సౌభాగ్యముతో జవ్వని పొగరు లూడిపడ కన్నులగట్టెను. విరహావస్థలో నీతని యభినయము, సారంగధరుని ప్రతిమ చూచి యబ్బురపడు నవస్థలు, జాబు వ్రాయుట, తరువాత సారంగధరుని సంబోధించి వలపు మాటలు అందించుట, అతని సుబోధలను వేర్వేరురీతుల నర్థము చేసికొని, ఆశావిమోహితయై పలుతెరంగు లాలోచించుట, ప్రవరాఖ్యుని పొందదలచిన వరూధినివలె తన యాత్మ సంకల్పమును వెలిబుచ్చుకొనుట, ఆశాభంగమొంది సారంగధరునిపైగల ప్రేమను, సమర్పితచిత్తమును, మెల్లగ మరలించి, మాత్సర్యక్రియా సంకల్పములను రేపుకొనుట, వీనిలో పట్టరాని మోహమునకును, భంగపడిన మానాభిమానములకును, పొరలివచ్చెడి దుఃఖమునకును, సంకల్పించు దురాలోచనకును, నేర్పడిన భావ సంరంభమును మిక్కిలి చమత్కారముగ నభినయించి యున్నారు. వీరి నడతలు ఆంధ్రనాటకముల భావిస్థితిని సూచించునవిగ గారవించవచ్చును. ఒక చెంప భరత శాస్త్రాభ్యాసులగు వెంపటి వెంకటనారాయణ[26] మొదలైనవారు నాట్యాలంకార శాస్త్రయుక్తముగ విభావానుభవ సంచారీ భావములను విడదీసి పద్యమందలి ప్రతిపదార్థము తేటపడునట్లుగ నాట్యకళా ప్రసిద్ధమైన సాంకేతిక ముద్రలతో చిరంతన సాధనచే, భావ ప్రకటనానుకూలముగ స్వాధీనమైయున్న నేత్రహస్తాది యభినయములతో, నవసరములను వానిచే గల్గెడి మనోవృత్తులను ప్రకటించుచున్నారు. వీరి నటన శాస్త్ర సిద్ధము. భావరాగ తాళాభినయములలో విశేష పరిశ్రమ మొనర్చి సంపాదించిన వైదుష్యము. మరియొక చెంప సహజ జీవన ధోరణులలో పాశ్చాత్య నట పద్ధతులలో బయస్కోపు భావ ప్రకటన రీతులలో కామక్రోధాది మనఃవృత్తులను ప్రాకృత పాటవంబున వెలిబుచ్చుచు, నవీన నాటకములందు రక్తి కట్టించెడి

---

**26. వెంపటి వెంకట నారాయణ :** ప్రసిద్ధ కూచిపూడి నర్తకులు. 'అభినవ సత్యభామ' బిరుదాంకితులు.

నాగరాజరావు, రాఘవాచారి మున్నగు రసాభినేతలున్నారు. వీరి యభినయము, రంగ మర్యాదలు, కొంతవరకు లెస్సగ నాలోచించి, కథా సందర్భానుకూలముగ నేర్పరచుకొనబడినను, నిర్ణీత నియమములు లేనందున యేనాటికానాడు మారుతూ చిత్తవృత్తిని పరిస్థితులను అనుసరించి యుండును. వీరి అభినయము హృదయాహ్లాదియయ్యును, పెద్దపరువులదాల్చియున్నను, ప్రమాణ విహితమై నియమరహితమై, నిలుకడలేనిదై, యాంధ్ర నాటకాభినయరీతులను నటుల స్వేచ్ఛా ప్రవృత్తికి వదలివేయుచున్నది. ఇక వందలకొద్ది సామాన్యనటులు వాక్యార్థమును తెలుసుకోకుండా అభినయ మర్యాద లెరుగకుండా, సుసంగీతరీతులరయకుండా తమకు తోచిన రీతిగ తామనుకొను దారులలో రసాభాసముగ నాడుచున్నారు. మనకుగల భరతశాస్త్రమును వదలుకోజాలము. క్రొత్తగా ప్రవేశించు పాశ్చాత్య భావప్రకటన పద్ధతుల నుపయోగించుకొనక తీరదు. భాగవతాల్లో విసుగుపుట్టించే అత్యంత సూక్ష్మమగు భావాభినయమును కొంత తగ్గించి, సత్వరముగ, తెలివితేటలకన్న రసావేశమెక్కువ బయటపడునట్లుగ, భారతీయాభినయ పద్ధతుల సాధుపరచి, విపరీత భావ ప్రకోపమును చూపించు బయస్కోపు అభినయానికి సరససాధుత్వ మొనగూర్చి, స్వాభావికాభినయమును, సాంకేతికాభినయమును సమన్వయపరచి, నాటక పాత్ర స్వభావ ప్రదర్శనంబులకు కొన్ని పరిమితులను, నియమములను, లక్షణములను, మర్యాదలను నిర్ణయించి, వాని కనుకూలముగ నాడుచు, నాట్యకళకొక స్వరూప మొసంగెడి స్థితి భావికాలములో రాగలదు. ఇట్టి సమన్వయము నాయుడిగారి నడతలతో నవీన నాటకముల రసస్ఫూర్తిని త్వరితగతిని జూపించుచు సామాన్య జీవితానుభవములలో గోచరించు స్వాభావిక రస ప్రాచుర్యరీతుల నగుపరచుచు భరతశాస్త్ర సమ్మతమగు నొద్దికలతో జెలువార నభినయించిరి. వీరు చూపిన ప్రతిపోజు, చిత్రార్హముగ శిలా శిల్పిత పాటవంబున తన భావ సామంజస్యమేపార, నపూర్వముగ, స్వతంత్రముగ భావికళా పరిణామ సూచకంబుగ, పండితజనామోద వాహకంబుగ నుండెను. పూతకికి తగునని యనుకొన్న బిట్రగుంట రైలు గార్డులో నింతటి యపూర్వ కళాచాతుర్యము, నట విద్యాపరిజ్ఞానము, సాధన విశేషము గోచరించినవి. ఏ పుట్టలో యే పామున్నదో యెవరు తెలుసుకోగలరు? అగాధగర్తేషు మహార్ణవస్య సంత్యేవరత్నాన్యమిత ప్రభాణి। ఆఘ్రాణ యోగ్యాని యధాసుమాని వృధాభజంతే గిరగహ్వరాణి। నాగరాజరావుగారీ నాయుడుగారిని శిఫార్సు చేసి పంపినందులకు మూకను అలరించకున్నను,

నాట్యకళావిచక్షణులకు ప్రాచీన నవీన నాట్యమర్యాదల సమన్వయ స్వరూపమును చూపి నాయుడుగారు చిరస్మరణీయులై మాబోంట్ల యభినందన వాక్యాంజలుల కర్హులగుచున్నారు. రత్నాంగి వేసిన గోవిందరావు నాయుడు వేషము బాగానే వుంటుంది. అభినయం కూడ జాగ్రత్తగ నేర్పుగ చేస్తాడు.

రామదాసు నాటకానికి బయటనుంచి రామాయణం సర్వేశ్వర శాస్తుర్లుగారు, ఘంటసాల రాధాకృష్ణయ్యగారు, సరస్వతి రంగస్వామి అయ్యంగారు వచ్చియుండిరి. చిల్లర వేషాలలో రామమోహన్ తాలూకు కృష్ణుడనే కుర్రవాడు వేశ్యవనితా భూమికలోను, సితారాబేగము వేషంలోను, మాననీయ రూప లావణ్యముతో, మంచి చకచకతో జూడముచ్చటగ నుండెను. శిక్ష తక్కువైనదికాని, సీతారామస్వరూపానికీతను మిక్కిలి తగియుండి, తురుష్క జనానాలలోని గులాబీ సుమకోమల సుందరాంగుల రూప వైభవమున మెరుగారుచుండెను. రఘురాముని వేషముదాల్చిన గంపల సుబ్బారావు అను బాలుడు చాల కాలము నుండి బాలవేషములలో తర్ఫీదు పొంది ఆడుచూ, యీ వేషమును కూడ చక్కగా నిర్వహించెను. రంగస్వామి అయ్యంగారు[27] గోపరాజు పెండ్లాము కమలాంబపాత్ర మభినయించినారు. కాని వీరి శక్తి సామర్థ్యాలకు తగిన యవకాశ మావేషములో కనుపడలేదు. సర్వేశ్వరశాస్త్రిని గూర్చి రామదాసు మీది ప్రత్యేక లేఖలో ముచ్చటించి యున్నాను.

బందరు దేశీయ నాటక సమాజమువారు శ్రీ యజ్ఞనారాయణ శాస్త్రిగారు రచించిన లంకాదహనాన్ని ఆడివరుంబడిని నటప్రకాశిక కొసంగిరి. ఇందు పింగళి వీరయ్యగారు ఆంజనేయ వేషమును దాల్చిరి. వీరి వేషంలోను నడతలోను కనుపించిన ప్రత్యేక విషయమేమిటంటే, సామాన్యంగా నటులందరు ఆంజనేయులకోసం యేర్పడ్డ బొచ్చుచొక్కాను పెద్దతోకను ధరించుచుండ వీరయ్యగారు యిట్లాంటి వనేచరరూప సాదృశ్య మభిలషించక కొంచెము యీడు ముదిరిన బుద్ధిమంతుడివలె, రాయబారివలె, కొంచెమించుగా మానవునివలె కోతిరేని నగుపర్చారు. ఆంజనేయుడు నిజంగా కోతే అయిన యెడల నారద

**27. రంగస్వామి అయ్యంగారు :** సరస్వతి రంగస్వామి అయ్యంగారు. నెల్లూరు ఆంధ్రభాషాభిమాని సమాజంలో కందాడై శ్రీనివాసన్‌గారి ప్రక్కన స్త్రీవేషాలు వేయడంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తి.

తుంబురాదులతో ఢీకొని గాంధర్వ గీతికా ప్రపంచమొనర్చలేడు. నవ వ్యాకరణముల సాధించలేడు. రావణ సభాంగణంబున సద్ధర్మముల నుపన్యసించలేడు. ఈ ప్రతిష్ట కోతిరూపుతో సమన్వయ మొందదు. ఆంజనేయునకు మానవ సాదృశ్య స్వరూప మొసంగి కార్యభారమును వహించిన రాజ కార్యవ్యవహర్తగ, చూపినందుకు, వీరయ్యగారిని మెచ్చుకొంటున్నాము. ఈ ఆటలో సుసర్ల రామచంద్రుడను పిల్లవాడు సీత చేతలను మిక్కిలి రసవంతముగ నభినయించెను. వడ్డిరామయ్యగారి లంఖిణి కొందరు చూపరులను సర్వదా దనియించుచుండును.


నటప్రకాశిక కోసము మొదటిపట్టులో ఆడిన చివరి ఆట కృష్ణలీల. ఇందు నెల్లూరి నాగరాజారావుగారు కంస పాత్రను ధరించిరి. ఈ ఆట కృష్ణలీలయని పిలువబడినను నిజంగా కంస మోక్షమని చెప్పవచ్చును. ఇదియొక సీనికు నాటకము. కర్ణాటక దేశంలో కొన్ని సమాజాలు పెక్కుమంది పిల్లవాండ్రను చేర్చి విచిత్రమైన రంగపరికరములతో, పిస్తోలు పేలేటప్పటికి భ్రమదుజ్వల చక్రగర్భములో చక్కని బాలకృష్ణుడగుపడుట. స్టేజి మీదికు గుఱ్రపుబండీవచ్చుట, జైలుగోడలు విచ్చుకొనుట, యమున దారిచ్చుట, కాళియమర్దనము, బృందావన లతానివాసములలో గొల్లబొట్టెలగూడి 'అంగనామంగనామంతరే మాధవో' యన ముచ్చటలాడు ముద్దు కృష్ణుడు, విశ్వరూప సందర్శనాలు, కంసుని సభావేదిక, మొదలైన ట్రాన్స్ఫరు సీనులు విచిత్రంగా చూపుతారు. వుడిపీ పిల్లవాళ్ళు తీయని మందహాసముతో, వచ్చిరాని వయ్యారముతో, గోపబాలికా భూమికలలో తళతళలాడుచు, పకపకలాడుచు, ముచ్చటలీను మురిపెంపురాసులై మెరయుచుందురు. ఇంతటి రంగచమత్కారము, బాలక నటవర్గము, వస్త్రాభరణ సామగ్రి, లేనివారు కృష్ణలీల నాడకూడదు. కృష్ణపరంగా అయితే నేను చెప్పిన మాట నిజము. కాని ఈ నాటకము కంసవిమోచనమని తలచినయెడల కంసుని స్వభావమును, మనోవృత్తిని గుర్తించి యందలి తత్వమును గ్రహించి ప్రకటింపగల నటశేఖరులు దీని నొకింత రమ్యముగ జేయగలరు. బందరు కంపెనీల పేదహంగులో చింపిరి రంగములో నాగరాజారావు గారు ఈ నాటకాన్ని కొంత అర్థయుక్తముగ చేసిరి.

కంసుని స్థాయీభావము భయము. భయసాధనచే నైహిక బంధములు తెగినవారు.

**శా॥ కామోత్కంఠతగోపికల్ భయమునన్ గంసుండు వైరక్రియా**
**సామాగ్రిన్ శిశుపాల ముఖ్యనృపతుల్ సంబంధులై వృష్ణులున్**
**ప్రేమన్మీరలు భక్తినేము నిదెచక్రింగంటి మెట్టైన ను**
**ద్దామధ్యాన గరిష్ఠుడైన హరిజేరన్ వచ్చు ధాత్రీశ్వరా ॥**

కంసుడు నిజప్రాణసంరక్షణార్థము దేవకి సంతతిపై పగబూనెను. భాగవతాది పురాణాలలో యీతని దుశ్చేష్టలు, క్రూరోపాయములు దేవకీవివాహ సందర్భాన ఆకాశవాణి పలుకులు విన్న తర్వాత మొదలిడినట్లగుపడును. హిందుస్థాని ఫిలిమ్ కంపెనీ వారి కృష్ణజననం, కృష్ణలీల, కంసవధల ఛాయానాటకాలలో కంసుడు మొదటి నుంచి దుండగీడుగ, త్రాగుబోతుగ, సాధుద్వేషిగ, పితృద్రోహిగ, బంధువిరోధిగ, నున్నట్లును అల్లరిపడుచుల వెంటగొని తండ్రిని బంధించి గద్దెనెక్కినట్లును చూపుచు కంసునొక క్రూరరక్కసిగ జిత్రించియున్నవి. ఈ వృత్తాంతము పురాణాలలో కానరాదు. నాగరాజారావు పురాణఫక్కినే అవలంబించి, దేవకి కల్యాణాంతము నుండి భయావిష్టుడై తన మేలు చూచుకొను గృహస్థుడుగ కనుపించెను. హిరణ్యకశిపుని వేషమందువలెనే కంసభూమికలో కూడ చక్కని రాజలక్షణాలు, గృహస్థమర్యాదలు, మానవ నైజమైన సద్గుణస్ఫురణ చూపించారు. చివరకు శిక్షలన్నీ వమ్ముగచెల్లిపోయి కృష్ణుడు మధురానగరిలోని మల్లకూటమును ప్రవేశించగానే, వాటర్లూ సమరాంగణంబున నొక మాయా తమిస్రము నెపోలియనుధీరాగ్రేసరుని డెంద మాక్రమించునట్లు చావు నాటికి సీజరు చక్రవర్తియొక్క యునివేషబుద్ధి వైశద్య మహంకారపరివృతంబైనట్లు, కంసుని యుల్లమున చావు దరిజేరిన భయోత్పాత తరంగము లావిర్భవించి, భావనాశక్తికతీతమై, బుద్ధిమాంద్య మేర్పరచి, యల్లనమూర్ఛావస్థ దెచ్చి పెట్టుచుండెను. మాయాశిశువు మింటికెగయునపుడే చూపుల బరిభ్రమించెనో వానినే గ్రమ్మర బరపుచు నేయెడ నుండి కృష్ణుడరుదెంచునో, పీక పిసుగునో యను భ్రాంతితో చేయునది తోచక నల్లాడుచుండెడి పట్టులను మిక్కిలి విచిత్రముగ నెల్లూరి నటకేసరి చూపియున్నారు. భీభత్స భయానకాదుల కితని మించిన నటుడు కానరాడని విన్నవించు,

**భవత్కృపాపోషిత విమర్శన సామర్థ్యమున కులుకులాడు,**
**సూరిశాస్త్రి.**



సూరిశాస్త్రిగారి దస్తూరి ("ప్రసిద్ధ రంగములు - నటులు" అనే వ్యాసం నుండి)

# ఆంజనేయ నటేశము[28]

రామచంద్రా!

నటనన్నా, అభినయమన్నా, యేవోలేని భావాలు తెచ్చిపెట్టుకుని కళ్లూ, చేతులూ, వళ్లూ తిప్పుకుంటూ చూచేవాళ్లకు వొకవిధమైన భ్రాంతి కలిగించేపనికి యర్థమగుచున్నది. మామూలు సంసారంలో తటస్థించే అవస్థలను మించి, అసామాన్యంగా వుండే పెద్దపోకడలను తెచ్చిపెట్టుకొని, వాటిని రక్తిగా చూపగలవాడే మంచి నటుడనిపించుకొంటున్నాడు. ఇట్లాంటి యలౌకిక సందర్భాల్లో యెవరెక్కువ కొత్త తరహాలు చూపగలిగితే వాళ్లనే మహానటులంటున్నారు. నిజమే! తనకు లేనిది, సామాన్యంగా కనపడంది, తెలివిబలంచేత తెచ్చిపెట్టుకొని కనపడడం, అట్లా నటించడం, గొప్ప ప్రజ్ఞయే. కాదనను. కాని, మొత్తంమీద యెంత తెలివిగలవాడైనను తన స్వభావానికి, వుద్దేశ్యాలకు, మామూలు నడతలకు సరిపోయే పాత్రలనే మిక్కిలి వొప్పిదంగా అభినయించేట్టు కనిపిస్తుంది. మా తెలుగు నాటక సమాజాలు చాలావాటిల్లో వొక తెలివిగలవాడు పదిమంది కూళలను వెంటవేసుకుని మేళంకట్టి, అన్ని పెద్దవేషాలు తనేవేస్తూ, తన ప్రకృతికి భిన్నమైనపట్లలో రక్తికట్టించలేక, భంగపడుతూ వుంటాడు. ఇప్పుడిప్పుడు బయలుదేరిన వ్యాపారనాట్య సమాజాలలో పెక్కుమంది నటులుండి యుచితపాత్రధారణ కవకాశముంటున్నది. కాని అక్కడకూడా యేసంగీతమో, రూపసౌందర్యమో, పెద్దనటుడి ముఖ్యలక్షణమని తలచి యీ సంపత్తువున్నవారికే ప్రధానపాత్ర లిచ్చుచున్నారు. ప్రతివాడి నైజంలో, నిత్యానుభవంలో, కొద్దోగొప్పో కామక్రోధాలు

---

**28. ఆంజనేయ నటేశము :** ఆంజనేయుని పాత్ర ధరించడంలో సిద్ధహస్తుడనిపించుకొన్న సి.యస్.నటేశం - మదరాసులోని శ్రీకృష్ణవిలాస సభ అధిపతి.

చేరుచుంటవి. కనుక యేదోవిధంగా శృంగార వీర రసాలను కొంచమనుభవ సిద్ధంగా చూపగలరు. శోకరసం కూడా జీవుల నిత్యానుభవమైన దుఃఖంవల్ల యేర్పడుతూ, సామాన్యంగా స్త్రీవేషధారులందరు శృంగారాభినయము తరువాత చులకనగా, రక్తిగా, చూచువారి కడుపులు తెగిపోవునట్లు ప్రకటించగలిగియున్నది. కాని భక్తిరసం సామాన్య నిత్యానుభవంలోనిది కాదు. దీనిని లౌక్యులు తెచ్చిపెట్టుకొనుట కూడా కష్టము. దాని అనుభవము కలవాళ్ళే దాని నభినయింప యోగ్యులు. అట్టి అనుభవసిద్ధమైన భక్తిరసాభినయములో ఆంజనేయనటేశము తన నిత్య ప్రవృత్తిని వెల్లడించుకొంటూ యొరుల కవలీలగా నందరాని తెరవుల విప్పొందుచున్నాడు.

నటేశము చిన్ననాటి నుంచి సహజంగా రామభక్తిగల వుపాసకుడు. 1911లో పచ్చయప్ప పాఠశాలలో చదువుతూ, తొలిసారి ఆంజనేయవేషము దాల్చినప్పుడే యీతడాపాత్రను వేషధారియై నటించడం లేదనిన్నీ, నిజభక్తి పారవశ్యమును వెల్లడించుకొంటున్నాడని స్పష్టమైనదట. తరువాత 13లో మైసూరు పండితులు, అరసులు, యెదుటనాడినప్పుడు ప్రత్యక్షంగా యొక పెద్దకోతి, చుట్టూ గోడలు తలుపులు బిగించివున్న నాట్యరంగంలో ఆవిర్భవించి, 'ముఖ్యప్రాణదేవరు' సాక్షాత్కరించెనను విశ్వాసమెల్లరకు గలిగించి యదృశ్యమైనదని వినికిడి. ఈవింత చూచియున్న మంత్రసిద్ధుడు ఒకడు నటేశంగారి యోగ్యతను గమనించి యాంజనేయ మంత్రముపదేశించెను. దానిని యధావిధిగా జపించుకొంటూ, చక్కని భక్తిశ్రద్ధలతో నియమాలతో నడుచుకొంటూ, నటేశము కలిగయుగాంజనేయులను సార్థకబిరుదమును వహించి, దానపరుడై, ఆర్ద్రచిత్తుడై, నీకృపామహిమచే, సామాన్యంగా ఆశ్రయించినవాళ్ళని గుల్లచేసి దివాలా తీయించే నాట్యకళలోనే, దినదినాభివృద్ధి పొందుతూ సుఖించుచున్నాడు. తిరుపతి వెంకటేశ కవిశేఖరులీతని యాంజనేయాభినయముజూచి యిది నాటకవేషము కాదనియు, సీతమ్మగారి వరప్రసాదాన చిరంజీవుడై నిలచియుండి, వాయు తనయుడు, యీనాటి రైలుకూతలకు ఫ్యాక్టరీపొగలకు, కలిబుద్ధులకు బెదరకుండా, ముల్లోకములు తిరుగుచుండునట్లు నటేశకంపెనీవారి యాటలవల్ల రూఢియైనదనియు, పద్యరూపంగా ప్రశంసించి యున్నారు.

నటేశము అనుభవభక్తుడు. అందులో ఆంజనేయోపాసి. ఈ వేషము వేయుటలో నీతడు యథార్థంగా తాను రామకార్యముల సాధింప నియుక్తుడైన దొల్లిటి కోతి రేడుగ దలచుకొనెనే కాని, రామునిగుణవిభూతలకు మెచ్చి మొదటి చూపులోనే భక్తిప్రేమ విశ్వాసప్రవృత్తులు పులకరించి పెల్లుబ్బ దాసుడై, నిష్కారణంబుగ, నిరపేక్షగ, తనచిత్తమున శ్రీరామ పాదారవింద సంసేవన కర్పించిన సాధుత్వమును, తన్మయత్వమును కనపరచునేకాని, ఆకుపచ్చ బొచ్చుచొక్కాయిలో కుప్పిగంతులు, వెకిలిచేష్టలు, కోతివేషాలు, చూపనేర్చిన నాటకనటునివలె యగుపడదు. ఇతను లంకాదాహనంలో సాధక హనుమంతుడి ప్రవృత్తిని, గరుడ గర్వభంగంలో సిద్ధభక్తుల యోగిలక్షణాలను, సందర్భోచితమైన యీషద్భేదాలతో ప్రకటించగా చూచియున్నాను. లంకాదహనంలో ఆంజనేయులు సుగ్రీవునికి పట్టము కట్టించడము, వాలిని చంపించడము, తరువాత సీత కోసము వెతకడము, లంకాధీశునకు తన రాక నెరింగించుటకు లంకలో కొంత యల్లరి చేయడము, తరువాత అమ్మవారిని దర్శించడం, రావణరాజసభలో రాయబారము, లంకాదహనము మొదలైన లౌకిక వ్యవహారములనన్నిటిలో అప్పుడప్పుడే మొలకెత్తి అతితీవ్రముగ సంక్రమించి ప్రాకుచుండిన రామసేవా పరత్వము, వుత్సాహము, భజనకీర్తనాది రాజసోపాసన వైఖరుల దేలుచుండును. అప్పుడప్పుడు భక్తిపరవశుడై యొడలెరుంగని యావేశముతో నగుపడియు, లంకాదహనములోని యాంజనేయ భక్తి స్వభావము లౌకికరాజ సక్రమంబులనుసరించి యుండును. దీనిలో కూడ నటేశము చాల నిగ్రహము, ఔచితి, పారవశ్యము కనుపరచుచు, చేతలవలనకన్న పాటలవలనకన్న, మూక సూచనలచే నెక్కువగ తన రామసేవా పరాయణత్వమును, రామకార్య దురంధరత్వమును చూపించుకొనెను. సామాన్య నటులు మట్లమీద సంగీత ప్రసంగాన్ని చలాయిస్తూ, ఆంజనేయపాత్రనంతను ఒకవిధమైన నాట్యసంగీత ప్రదర్శనావకాశముగ నెంచి, యప్పుడప్పుడు కోతిచేష్టల నతిశయించుచూ, అల్లరితో, పాటలతో, తను వేషవిధి నెరవేర్చుచుందురు. నటేశ మింతకన్న నెక్కువ భక్త లక్షణములగుపరచెను. అశోక వనములో రాక్షసస్త్రీ పరివృతయై, జానకి 'విషవల్లీభిః పరీతేన మహోషధిః' వలె, చింతాకుల నడుమ మిణుకులాడు ఖద్యోతమువలె, తొలుదొల్త కనుగట్టినప్పుడు ఆంజనేయుని యుల్లమున మొలకెత్తు తలపుగుత్తులను నటేశము చమత్కారంగా చూపించారు.

దక్షిణాది అడవులు తిరిగి తిరిగి యెచ్చటను సీతను పొడగాంచనేరక, నిర్విణ్ణులై, యలసి సొలసి, ప్రాయోపవేశమొనర్చి, కంఠగత ప్రాణులై, యావల సంపాతిపలుకులాలించి, తెప్పరిల్లి, రామనామోచ్చరణ శక్తిచే దధి లంఘించి, లంఖిణి మొదలగు రక్కసి బంటుల గెలచి, యక్షమాయల ధరించి తుదకు సీతను గనుగొన్న సంతసము, యిదియు రక్కసి సేతలేమోనను భ్రాంతియు, విరోధి రాజ్యమున నొంటరిగానున్న సీతకు తన యుదంతమెరింగించి ప్రత్యయగౌరవ మొందుటయు, మున్నగు భావములు అప్పట్టున నాంజనేయుని బాధించుచుండును. వీనినన్నిటిని నటేశము చక్కగా చూపినాడు.

గరుడగర్వ భంగములో ఆంజనేయుడు త్రేతాంతమున రామావతారము ముగిసినది మొదలు ప్రాణాపానముల గట్టి పెట్టి యోగారూఢుడైయున్న తెరవును చూపించును. ఈ నాటకంలో సత్యభామ తనంతటి భక్తిప్రేమ లింకొకరికి లేవనియు, బలరాముడు తనంత బలశాలి లేడనియు, గరుత్మంతుడు తనంతటి హరిసేవాపరుడు లేడనియు గర్వపడుచుండిరి. ఇది నారదునికి విచిత్రంగా తోచింది. కృష్ణుడు కూడ వీరి గర్వాల కచ్చెరువొందు చెండెను. శ్రీకృష్ణ నారదులు ఆలోచించి గరుత్మంతుని వలన బలరాముని బలగర్వమణచి ఆంజనేయుని వలన వీరిరువురికి వినయసౌశీల్యముల యమేయ ప్రభావమును నిదర్శింపదలచిరి. ఇప్పట్టున సర్వసంగ పరిత్యాగియై, సంకల్పశూన్యుడై, నిరహంకారుడై, యోగసమాధిలో నిలిచియున్న ఆంజనేయుని రావింపవలసి వచ్చెను. నారదుడు వెళ్లి యెన్ని విధముల స్తవించినా కదలడు, విష్ణుస్మరణ చేసినా యులికిపడడు. చివరకది యుపాయము కాదని రామమంత్రమును బిగ్గరగా జపింపమొదలిడును. ఆంజనేయుడు యోగారూఢుడై యుండియు, రామనామోచ్చరణ వీచికలు వీనుల సోకగానే, దానిలో నిస్సంకల్పముగ జేరి, నామమందుకొని, యింకనూ మైమరచియే, అదివరకు అంతర్భావమున ధ్యానవీధిలో నిరంతరావర్త మొనర్చుచుండిన రామమంత్రమునకు వాక్ప్రకాశమొసంగి, నారద భజనలో లయమొంది పాల్గొనును. నిస్తబ్ద సమాధిలో నుండి నేమియు వినక స్థిరచిత్తుడై స్తంభించిన ఆంజనేయుడు క్రమముగ, నిస్సంకల్పముగ దాని నుచ్చరించుటయు, దురిత సంభరితమగు కలికాల మాసన్నమగుచున్న ద్వాపరాంతమున గూడ రామస్మరణ మున్నదాయని యచ్చెరువొందుటయు, నయ్యది వీనుల దాకునందున

పరమానంద పరవశుడగుటయు, నీ ప్రవృత్తులన్నియు, మానసకోశమందు దయించిన వ్యభిచారీ భావక్రమంబునగాక, బుద్ధివ్యాపారమే నశించిన యాత్మ ప్రవృత్తివలన, జగన్మయమైన బ్రహ్మానంద సంపర్కమున, నేర్పడినట్లునూ, నటేశము చక్కగా యోగరహస్యమెరింగిన నేర్పుతో నభినయించి చూపెను. లంకాదహనములో కన్న గర్వభంగములో నీతని తత్వ పరిజ్ఞానము, అభినయ సామర్థ్యము యెక్కువగా కనపడ్డది. తరువాత గరుత్మంతునితో గినుకులాడు సందర్భమున కూడ లంకాదహనములో లంకిణిని యులికించు దానికెంతయో భిన్నముగ జూపించెను. నిజంగా కలియుగాంజనేయుడను బిరుదీతనికే చెప్ప నొప్పియున్నది.

ప్రహ్లాద నాటకంలో నటేశము హిరణ్యకశిపు వేషాన్ని వేశాడు. రాక్షస ప్రభువుగా వూహించి అభినయించినను, మంచి రాజదర్జా, నిగ్రహము చూపించి పూర్వపుకత్తులో మేటి నటుడనిపించుకొన్నాడు. ఇందులో నాగుమణి అనే నటీతిలకము ప్రహ్లాదవేషమును రసవంతంగా ఆడెను. ఈవిడ సీత వేషంలో కూడ బాగున్నది. సాధుత్వము, సౌశీల్యము, భక్తి, నెమ్మది చూపవలసిన వేషాలకీమెరూపము, నడతలు, చూపులు, యొద్దికలు మిక్కిలి యొప్పిదమగుచున్నవి.

నటేశం కంపెనీవారు దశావతారమనే నాటకాన్ని ప్రదర్శించారు. దీనికి కథాసంధి యేమీ యుండదు. ఒక్కొక్క అవతారము ఆవిర్భవించుటకు పూర్వము జరిగిన సందర్భములు చూపబడి విష్ణుమూర్తి ఋషులకు దేవతలకు సాక్షాత్కరించి, యవతరించి, భూభార మడంచెదనని చెప్పి తరువాతనే తదవతారపు నిమిత్త కారణంబైన కథాంశము చూపబడును. 'వేదానుద్ధరతే జగన్నివహతే భూగోలముద్బిభ్రతే దైత్యాన్ దారయతే, బలింఛలయతే క్షత్రక్షయంకుర్వతే । పౌలుస్త్యంజయతే, హలంకలయతే, కారుణ్యమాతన్వతే । మ్లేచ్ఛాన్ మూర్ఛయతే దశాకృతికృతే కృష్ణాయ తుభ్యం నమః' అను వరుసలో మత్స్యాది కృష్ణపర్యంతముకల దశావతారములను సందర్భోచితముగ జూపించిరి. ఇందలి పద్యములు చాలవరకు పోతన భాగవతము నుండి సేకరింపబడినవి. కీర్తనలు కృతులు, పాటలు, సామాన్యంగా తెలుగు లోకాన వాడుకలో నుండు గీతికాజాలము నుండి సంగ్రహింపబడినవి. ఇందుచేత నాటకము మొదటినుండి తుదివరకు మిక్కిలి మనోహరమైన పద్యగీతములతో నిరుపమలావణ్య మేపారియుండెను. వచనము

మాత్రము కవి కల్పితము. కాని యిది బహుతక్కువ. మొత్తము మీద నిది పోతరాజును నాట్యరంగ మెక్కించెనని చెప్పవచ్చును. ఆంధ్రుల జాతీయగీతముల పాడుచు సుప్రసిద్ధ మహాకావ్యములలోని పద్యరత్నముల జిలికించుచు ప్రాచీన పౌరాణికకథలకు సంబంధించిన తెలుగునాటకములు కూర్పబడవలెననియు, అందుచే మన కావ్యములకును, పాటలకును నవ్యజీవన ప్రచారమొసంగి కుప్పతిప్పలుగ ఖండకావ్యాలు బయలుదేరెడి యీ కాలములో టెక్ట్సు బుక్కుల చదువజాలని యల్పబుద్ధులకు ప్రాచీనాంధ్ర మహాకవుల కావ్యగీతికలను నాట్యవినోదమూలమున నందించవచ్చుననియు, నమ్మెడివారిలో నేనొకడను. ఇట్టి ప్రయత్నము నటేశం కంపెనీవారి దశావతారమున కొంతవరకు సిద్ధించినది. ఇందు నటేశము హిరణ్యకశిప వేషమును, ఆంజనేయవేషమును, బలిభూమికను, మరికొన్నిటిని దాల్చి యభినయించెను. బలి వేషములో మిగుల ప్రశంసనీయముగ నాడెను. మోహినీరూపములో నాగుమణి యతులిత చాకచక్య మగుబరచెను. తెలుగుకవులందరిలో పోతరాజు చంచల ప్రవృత్తుల జిత్రించుటయందసమానుడు. అందు మీదు మిక్కిలి అమృతమథన సందర్భమందు దేవదానవులు కవ్వపుకొండ నెత్తిడివిధమును, మోహిని నడకలను యసదృశవైచిత్రమున వర్ణించి యున్నాడు.

**సీ॥ పాలిండ్లపైనున్న పయ్యెదజారించు**
**జారించి మెల్లన చక్కనొత్తు**
**దళ్కుదళ్కనుగండఫలకంబు లొలయించు**
**మెలయించి కొంగేల నుజ్జగించుఁ**
**గడు మెరుంగులు వారు కడకన్నులల్లార్చు**
**నల్లార్చి తెప్పల నండగొలుపు**
**సవరని దరహాస చంద్రిక జికిలించుఁ**
**జికిలించి కెమ్మోవిఁ జిక్కుపరచు**
**తే॥ ధలితధమ్మిల్ల కుసుమ గంధమ్మునెరపు,**
**గంకణాది ఝణంకృతుల్ గడలుకొలుపు**
**నొడలికాంతులు పట్టులే కులుకఁబారు**
**సన్న వలిపంపుబయ్యెద సౌకళింప ॥**

నటేశ సమాజపు నటీతిలక మీపద్యార్థమును ప్రత్యక్షరార్థ శోభితంబుగ నభినయించి మెరిపించినది. మరల నీమె పరశురాముడుగను, ప్రహ్లాదుడుగను, సీతగను ప్రవేశించి మిక్కిలి సామర్థ్యముతో నిర్వహించెను. జమదగ్ని వేషధారి కూడ ప్రశంసనీయుడే. నటేశ కంపెనీలో నటులందరు కడుంగడు నిగ్రహముతో ఆడనేర్చినవారలే.

కొంచెము నిగ్రహవిహీనమైన నటన వినోద రత్నాకర పి. రంగనాయకులు నాయుడుగారి హాస్యాభినయమం దగపడును. ఈయన వొకవిధమైన యిమిటేషను ఆచారి బౌద్ధావాతారాన్ని స్ఫురింపజేయు ముఖ కవళికతో, కడుంగడు విప్పారిన కాయపుష్టి కలవాడు. భరతశాస్త్రపు నడకలు, సంగీతము, తాళ ప్రశంస, రాగపరిచయము, అభినయము, బయస్కోపు వైఖరులలో ముఖాంగ ముద్రలందు నవరసములను, సర్వభావములను ప్రకటించు నేర్పు, హాస్య నటనయేకాక, వీర గంభీర భయానకాది స్వరూపముల జూపు తెలివి, మున్నగు ప్రజ్ఞలెన్నిటినో సంపాదించి హాస్యవైఖరిలో వీనినన్నిటిని చూపగల ప్రౌఢ. నిగ్రహము లేదని కొందరాక్షేపించెదరు. కాని 'ఏకోహిదోషో గుణసన్నిపాతే నిమజ్జతీందోః కిరణేష్వివాంకః' అన్నట్లు యీ లోపమును సైచి బందరులోని రసజ్ఞశేఖరులు, యిన్ని ప్రజ్ఞలు గల హాస్యనటకుని చూడలేదని మెచ్చుచు దుబ్బి వీరన్నగారి కొప్పిదమైయున్న 'వినోద రత్నాకర' బిరుదమాతనికి స్వర్ణపతకసమేతంగా సమర్పించినారు.

ఇట్టు సమర్పించుకొను నాట్య వృత్తాంత విలేఖరి

**పురాణం సూరిశాస్త్రి**

# కన్యాశుల్కము[29]

లీలావినోదా! రామచంద్రా!

అప్పారావుగారు యెట్లాంటి నాటకరత్నాన్ని కల్పించాడని మనవిచేయను! చూడడానికి పెద్ద నవలవలె వుంటుంది కాని, ఆడవచ్చేసరికి కన్యాశుల్కంలో కనుపించే పోకడలు, స్వభావాలు, ప్రత్యేక వికాసాలు, తళుకు సొబగులు, మరెక్కడా కనపడవు. పేరునుపట్టి విచారిస్తే కథంతా లుబ్ధావధానుల వ్యవహారం, అగ్నిహోత్రావధానుల కన్యావిక్రయ వ్యాపారం మటుకే వుండవలసి వుంటుంది. ఇందులో గిరీశం చేసేపని యేమీ కనుపించదు. మధురవాణి, రామప్పపంతులు, కరకటశాస్త్రి పన్నిదానికి, తెలిసియు, తెలియకను, తోడ్పడుటకు అవసరమయి యుండవచ్చును. కాని అక్కడకూడ పిల్లను కొనుక్కొనే ముసిలిలోభికి గలుగవలసిన శాస్తి, దుష్పరిణామము చూపించడానికే వీరు చేసిన కథాభాగము జతయైనది. గిరీశం వృత్తాంతమంతా కన్యాశుల్కగాథకు సంబంధించిలేదు. కాని అప్పారావు యీయొక్క ఆటలో అనేక రకాల సాంఘిక దుర్నీతులను చూపించ నెంచాడు. ఒకచెంప గిరీశం కొంచెమింగ్లీషు నేర్చి, దొరల తరహాలు పట్టించుకొని, చదువెక్కువ అంటకపోయినా, డబ్బు దుగ్గాణి, పేరు పెంపు, వుద్యోగము, సద్యోగము యేమిలేకపోయినా, పెద్ద చదువరివలె, ధనికుడివలె బింకాలు నరుకుతూ, పోజులపట్టే, నవీనవిద్వత్సోంబేరుల దుర్లక్షణాలను కనుపరుస్తాడు. వీని మాటలలో దేశాభిమానం నేషనల్ రిఫారమ్ మొదలయిన పెద్దపోజులు కనిపిస్తూ బుద్ధులు మాత్రం నీతివిహీనంగా వుంటవి. బ్రతుకనేర్చినవాడు. గడుగ్గాయి. సమయము

**29. కన్యాశుల్కము :** 'మహాకవి' గురజాడ అప్పారావుగారి రచన. తెలుగువారు గర్వించే అజరామరమైన నాటకం.

గుర్తించి నడువ నేర్చిన లోకసంచారి. శృతి పాండిత్యానికి, వచ్చిన నాల్గు ముక్కలను పెళపెళ వాయించడానికి లోటు లేదు. అడ్రెస్సు, ఆ నడక, ఆ చుట్టపీల్చుడు, ఆ యొడుపులు, ఆ పలుకులు మనదేశంలో మరే వేషానికి యొప్పి యుండలేదు. కాని గిరీశం అడ్డంకుల దప్పించుకునే యుక్తి కలవాడైనా బండబారిన దుశ్చింతకలవాడు. కొన్ని సందర్భాల్లో పిరికితనము, బెదురుపాటు, తన తెలివికి తానే సంతోషించుకొను లేతబుద్ధి కలవాడు. ఈ గడుగ్గాయి కెదురుగా వెంకటేశాన్ని అమర్చాడు – మామిత్యాల సరములుగూర్చే మేటికోవిల. చదువుకు పట్నాలు జేరి పల్లెటిపొలాలలో గేదెలుకాచే బుద్ధిమాంద్యమింకా వదలక, బాగోగులేమి తెలియక, పోజులుపట్టే పెద్దవాళ్లసాంగత్య మభిలషించుచూ, మంచికన్న చెడ్డను లీలగా నలవరచుకొను మూఢవిద్యార్థులలో వెంకటేశం వొకడు. ఇప్పటి రౌడీ పరిభాషలో పల్లెటిగబ్బిలాయి. గబ్బిలాయి కూడ కాదు. కోటులేకుండా, ధోవతి లోపల మడచిన షర్టు మీద వంకరగా ఫరంగీ కంఠాభరణ పీలికను ధరించు వాడుకాడు. కాని వట్టి యవివేకి, విశ్వాసి. తెలివి లేమిని సర్వదా సర్వత్రగనపరచు జడసత్వము. గిరీశ మెంతపోకిరీజాణయో వెంకటేశ మంతటి ముగ్ధచేతస్కుడు. బుచ్చమ్మ కూడా వట్టి ముగ్ధయే. వీళ్ళిద్దరు అంతనిర్ధూమధాముడు గడుసుబొంద అగ్నిహోత్రావధానుల కడుపున పుట్టిందే మహావిచిత్రము.

తెలివితేటలలో వెంకటేశాన్ని వెనుకపీటికగా చూపినట్లే. పోకిరితనంలో మరియొక రకపు పాత్రాన్ని గిరీశానికి భిన్నంగా నిలువపెట్టాడు. రామప్పపంతులు నియోగి; కాదా, వ్యాపారి. గిరీశం వైదికపువాళ్ళల్లో తప్పబుట్టినవాడు. రామప్పపంతులు ప్రైవేటు వృత్తిలో సంపాదించుకొంటూ, తన లౌకిక ప్రభావానికి తన పంతులు వేషానికి, తన సంపాదనకు వొకచంప నెరవారుచున్న మీసంపుటందమునకు, తనవలపు షోకులకు, పొంగిపడుతూ తనయంతటి రసికుడు, వ్యవహర్త, రూపసి లేడనుభావముతో సంచరించువాడు. నాల్గింగ్లీషు ముక్కలు లేకపోయినయిగాని ఆ గిరీశం వెధవని తలయెత్తనిచ్చేవాణ్ణా, అని మధురవాణిదగ్గరి ప్రతాపాలు తెగనరికిన కోతగాడు. బుద్ధిలోనేకాదు, యెత్తుల పోటీయందునే కాదు, బలపరాక్రమాల్లో కూడ, ధైర్యసాహసాల్లో కూడ నసహాయశూరుడనని పొక్కిపొరలెడి చవిటిబుద్ధి. గిరీశం కనిపిస్తే పలకెక్కేస్తానే

మేటిబంటు. అతడు యేమరుపాటున ప్రవేశించగానే యీ మాటలు వాడి చెవినపడలేదు గదా, అని తత్తరపడుచు మంచంక్రింద శరణుజొచ్చెను. రామప్పపంతులు తన రూపసంపదల ప్రభావముల విశ్వసించి, వెలయాలిచేతలను తీరుగా గుర్తింపనేరక, డబ్బు తగలేసుకుంటూ, తావలచినది తనను గూడ వలచునను భ్రాంతిలో దేలువాడు. ఒక్క చిటికెలో కరకటశాస్త్రి రామప్పపంతులెదుట మధురవాణికి కన్నుగీటి, పంచకవటుని యీడు తెగిన కోమలాంగిగ జరిపి, కంటిలో మన్నుపోసి, లుబ్ధావధానులిచ్చిన కన్యాశుల్కంలో చిల్లిగవ్వైనా పంతులకందకుండా తప్పించుకొని, యింత పెద్ద ప్రైవేటుపంతులుకూ దబాలున డుంకీయిచ్చి 'దొబ్బేశాడు.'

తుదకు సౌజన్యారావుగారు వొకవిధంగా గిరీశం యొక్క దేశాభిమాన సంఘసంస్కరణ మిధ్యాడంబరమునకు సౌశీల్యవిరాజింతబగు వెన్నుపట్టిగ వర్తించుచున్నాడు. మధురవాణి కూడ గిరీశము యొక్క దుశ్శీల దుర్విదగ్ధమానస మౌఢ్యమునకు, జీవితానుభవములలో మంచిచెడ్డలు తెలిసికొని బుద్ధి తెచ్చుకొనే సుస్వభావాన్ని చూపుతున్నది. బుచ్చమ్మను లేవదీయు ప్రయత్నము భంగమైనాక "డామిట్ కథ అడ్డంగా తిరిగింది" అని చివాలున సౌజన్యారావు చెంత ఉండి మరలిపోవుటే కాని బుద్ధిని త్రిప్పుకొను దారులరయడు. రామప్పపంతులు, వెంకటేశము, సౌజన్యారావు, మధురవాణి యీ నలుగురు గిరీశము స్వభావాన్ని అట్టి తెరవులలో భేదంగా సంచరించే వివిధ ప్రవృత్తులను చూపడానికి కల్పించబడ్డ కూడలి.

అగ్నిహోత్రావధానులు వ్యాజ్యాలకోరు. రేయింబగళ్ళు ప్రక్కయింటివాని పెడకప్పు పీకించ నుంకించుచుండును. కడులోభి. ఆచారపరాయణుడు. వీరేశలింగం పంతులుగారి రాజశేఖర చరిత్రలో భోజనపు సమయానికి యువతరించిన సోమయాజుల వంటివాడు. దర్భాసనపు కట్టతో, దేవతార్చనమూటతో, మూడుకోర్టులూ తిరిగివచ్చే లౌకిక వైదిక మర్యాదాసమన్వేత, శుద్ధలోభి. కూతుల నమ్ముకొని సొమ్ము జేసెడి పంద. గిరీశానికి ఆవునెయ్యి, గేదెపెరుగులతో శలవరోజులన్నీ విందు సేయడానికి వొప్పుకోక పోయేవాడే. కాని గిరీశం మోహనాస్త్రమంటే యేమిటో తెలిసినవాడు. పాలిటిక్సులో మెదిగిన

చెయ్యి. 'నీవు అన్నమాట మహాబాగుంది' అనే సమ్మోహనవాగ్బాణ ప్రయోగసామర్థ్య మెరిగి వర్తించెను గిరీశము. అగ్నిహోత్రావధానులు తన వ్యాజ్యాలలో గిరీశము తోడ్పాటు నాశించియుండెను. కొడుకు చదువుకు కుండలలో గుర్రాలు తోలేవాడైనా, కోర్టు వ్యవహారాలలో మాత్రము వెనుకతీయడు. అక్కడకూడా వీలైతే చవుకగా మంచి ప్లీడరును కొట్టెయ్యాలని ఆశపడతాడు. పల్లెటి వైదికులలో అగ్నిహోత్రావధానులది వొకవిధమైన ప్రకృతి. లుబ్ధావధానుల దింకొకటి. నలతమనిషి. డబ్బుకు గింజులాడే స్వభావం. యెంతవరకూ చేతిపైసా వదలకుండా మంచి లాభం వెతుకుచూ కొద్దికర్చులో బంగరు మేల్బంతిని కట్టికొనచూచువాడు. వీరిద్దరు యెవరిదారిలో వారు చాదస్తులే. పల్లెటి బ్రాహ్మణుల తృతీయ ప్రకృతి కరకట శాస్త్రి యందు మూర్తీభవించియున్నది. ఇతను తగని గడుగ్గాయి. మంచి లౌక్యుడు. యుక్తాయుక్తము మంచిచెడ్డలు లాభనష్టాలు తెలిసినవాడు. శిష్యులుండుటచేత చదువుకొన్నవాడని యూహింపవచ్చును. ప్రాయశః కావ్యనాటక విలాసపరిజ్ఞాత. ఇవి వుంటూ సమయానుకూలమగు కార్యసాధన గలయ జూచినవాడు. బహుశా చీట్లాడగలడు. వేశ్యాప్రసంగంలో ఆరితేరిన తెరువరి. ఈ మూడు స్వభావాలు వెంకటేశంతో సహా పల్లెటిజీవులవయో ప్రకృతి భేదములను చూపుతున్నవి.

ఇక ఆడవేషాలలో మధురవాణి పణ్యవనితా విచిత్రవైఖరులగరచిన మేటిసాని. కాని యీమెలో కూడ కొంతమంచితనము, స్వజాతి విరుద్ధమైన విశ్వాసము, చివరకైనా పడుపుబ్రతుకుల బేలతనము గుర్తించి బుద్ధి మరలించుకొను ఆత్మశక్తియు గోచరించును. బుచ్చమ్మ ముగ్ధలలో ముగ్ధ. గిరీశంగారు గొప్పవాడనుకుంది. ఆయన చెప్పిన మాటలు నిజమనుకొన్నది. పునర్వివాహము దోషముకాదని నమ్మినది. అందుకులోబడ్డది. మీనాక్షి బాలవితంతువే. కాని మధురవాణివలె వేశ్యాంగన కాదు. బుచ్చమ్మవలె సద్గతి విచారించునదియు కాదు. తన యింటనేయుండి రహస్యముగా పడచుపొగరును ద్రెంచుకొనజూచు దుశ్శీల. ఈ మూడు రకాల స్త్రీ స్వభావాలను యీ నాటకంలో కూర్చినాడు.

పట్నాల్లోను, పల్లెలలోను వుండే విపరీత స్త్రీ పురుష స్వభావాలను, రెండు మూడు కథా వ్యూహములను ఒక్క కుదురున జేర్చి దేనికది చక్కగా విప్పార,

నిజప్రవృత్తినగుపరచి, రసపుష్టితో రాజిల్లునట్టుగ, నతికించగలశక్తి అప్పారావుకే చెల్లినది. మరియొకరైతే కథాంతానికి యేదో భక్తిజ్ఞాన వైరాగ్య మేర్పరచి, నీతిబోధకు గడంగి యుందురు. గిరీశం చేత డామిట్ అనిపించుటలోనే యప్పరాయని యసాధారణ ప్రతిభా సామ్రాజ్య మగుపడుచున్నది. తివాచులలో రేఖా సంస్ఫూర్తిగల చిత్ర విన్యాసములకన్న యందులో నుండి సగము ముప్పాతిక రూపములతో నగుపడుచు మరల నటులనే యావలికొనయందు నిష్క్రమించు పూలపొట్టెములు యెక్కువ యందగించినట్లుగా, కన్యాశుల్కంలో చూపబడ్డ గిరీశచరిత్ర అదివరకు లెక్కకు మించి జరిగిన సాహసాలలో యిది యొకటియనియు, దీని భంగపాటుతో చిత్తవైకల్యమొందక, రణవీరుని పగిది మరియొకపోరుతో తొల్లి చేజారిన విజయఫలమును పొందెదనను అహంకారమును సూచించుటయే మిక్కిలి నేర్పుగా తోచుచున్నది. సుగుణములు, అనంత పారంపర్యములో వచ్చుచుండును. కాని చప్పున మొలకెత్తి చివాలున వాడిపోవు, పుర్రెకు పుట్టినబుద్ధి పుడకలతో గాని యంతరించదు.

తెనాలి రామవిలాస సభవారు బందరులో యీ నాటకాన్ని ముచ్చటమీర నాడి చూపారు. ప్రదర్శనంలో కన్యాశుల్కపు యసామాన్య ప్రదర్శనౌచిత్యము బయటపడినది. ఇందులో నామద్దింపుమీద రామప్పపంతులై అభినయించిన తంగిరాల ఆంజనేయులుగారికి ఫస్టు మార్కులు చేరుచున్నవి. తరువాత స్థానం నరసింహారావుగారి మధురవాణిన్ని, కరటకశాస్త్ర్లయిన పులిపాక వెంకటేశ్వర్లుగారునూ మన్నింపదగిరి. బుచ్చమ్మ, మీనాక్షి వేసిన జక్కుల కుర్రవాడు, అగ్నిహోత్రావధానులు, వెంకటేశము కూడ మొదటితరగతిలో ప్యాసు అయినవారే. డాక్టరు గోవిందరాజుల సుబ్బారావుగారి నటన విషయమై చెప్పవలసిన ముచ్చటలేదు. గిరీశపు వ్యవహారాలన్నిటిని మిక్కిలి చక్కగా నిర్వర్తించారు. కాని వేషంలో బిడ్డల తండ్రివలె గృహస్తోద్యోగివలె కనుపించెను గాని గిరీశము యొక్క యిర్రెస్పాన్సిబిలిటీ, పలుగాకితనము, షోకు డంబములు చూపించే యిరువదిరెండు, యిరువదిమూడేండ్ల ప్రాయాన్ని సుబ్బారావుగారు చూపలేకపోయిరి. అనగా వేష సౌష్టవము, పాత్రౌచిత్యము కొరవడినవి. అభినయానికి లోటు లేదు.

సుబ్బారావుగారి వొద్దికలు కొన్ని శారదలో కన్నుల గట్టినవి. మొదటిరాకడ – బెత్తం ఆడించుకొంటూ, చుట్టపొగ దులుపుకుంటూ, 'యిక యీవూరులో వుంటే ఆబోరుదక్కేటట్టు లేదు' అని ఆలోచిస్తూ, జేరవచ్చిన యునికి అప్పుడే ఓడదిగి వచ్చిన హాఫ్ యింగ్లీషుయెర్ వెళ్ళబోస్తూ వుండింది. తరువాత 'యేమోయ్ మైడియర్ షేక్స్పియర్ మొహం వేళ్లాడేసావ్' అని పితృవాత్సల్య సూచకమగు నౌదార్యముతో వెంకటేశమును పలుకరించు పట్టుకూడ విచిత్ర స్వాభావిక రామణీయక మొదవియుండెను. ఆ వెనుక యొంటరిగా బుచ్చమ్మను తలచి, 'నీదు మోము బ్రైటటా మూనులైటు వైటటా టాటాటా' అని మున్నగు వెూహావేశ ప్రబోధితాశుకవితా వ్యాపారమందు వలపుల నారబోయు పట్టులతివిచిత్రముగ నుండెను. పాలిటిక్సు దెబ్బలు వుపదేశించాలసినపుడెల్ల గిరీశము యొక్క సర్వజ్ఞత్వాన్ని, వెంకటేశానికి నిజమైన యెద్యుకేషను ప్రసాదిందవలె ననెడి వ్యాజాభిలాషను దిట్టముగ బ్రకటించెను. మొత్తముమీద సుబ్బారావుగారి అభినయ వ్యాఖ్యానంలో గిరీశం సంప్రదాయాలు లెస్సగా బయటపడ్డవనే చెప్పవచ్చును.

తంగిరాల ఆంజనేయులు బహు సమర్థుడైన నటుడు. ఖుస్రూ వేషంలో మహమ్మదీయ రాజకుమారుల సారాయి భంగు నిషాలను ముద్రించినట్లగుపరచెను. రామప్పపంతులు భూమికలో దరిలేని పంతులు తరహాలనన్నిటిని వెళ్ళబోసెను. రామప్పపంతుల గుణాలు యెట్లాంటివో పైన విన్నవించుకొన్నాను. ఆంజనేయులు ఈ వేషానికొసంగిన నాట్యవిలాసము చూస్తేనే మా చదువరులు తెలుసుకోగలరు. కాని మాటల యల్లికతో విప్పి చూపలేము. ఇక కరటకశాస్త్రి నత్తివాగుడుతో, దయ్యాలపోతువలె, మంత్రోపాసివలె, నరుదెంచి పులిపాక వెంకటేశ్వర్లు చూపిన తెలివికి మేరయే లేదు. తన శిష్యుడికి పడుచుపిల్లల వేష మతికించి రామప్పపంతులు సహాయాన లుబ్ధావధానులకు అంటకట్టదెచ్చి బేరములాడు తరుణములో, మధురాణి నిజవృత్తాంత మెరింగి, కన్నియ మగతనము గుర్తించి, యచ్చెరువంది జూడ నొక్క చూపులో వెంకటేశ్వర్లు ఆమెను వారించి సద్దుపరచి యామెతో పాలు కుదర్చుకొని పైగా నామెతో పూవిల్తు సయ్యాటలకు వలయు సంధాన మమర్చుకొనెను. ఈ చూపుకు వేయి వరాలిచ్చినా ఋణము తీరదు. వెంకటేశ్వరుల మొగము స్ఫోటక విలుంఠనముతో కొంత గొగ్గరు వోయినను స్త్రీ పురుష ప్రధానపాత్రల ధరించ యోగ్యుడు. చక్కని మొగము. విశాలమయిన

నే(త్రములు. గొంకువారని కంఠమాధుర్యము. నాటక విషయాల్లో ఆరితేరిన (ప్రతిభ. ఇన్ని చాకచక్యాలు కలిగియు, సుందరాంగుడై విలసిల్లియు, చకుముకి, కరటకశా(స్త్రి మొదలయిన హాస్య (ప్రసంగాలలో కడుంగడు నేర్పు వహించి యాడగల్గుచున్నాడు. స్థానం నరసింహారావు కులటవనితా వేషధారణమున నత్యంత మనోహరముగ, యొప్పారు మెళుకువతో (ప్రవర్తించెను. రామవిలాససభవారి మేళము, సర్వవిధములా కూర్పువడి మిక్కిలి తెలివితో ఆలోచనతో శక్తితో నేర్పుతో మంచి నాటకాలభినయింపగలిగిరని విన్నవించు,

**నాట్యకళా వైదుష్య సంకీర్తనోత్సాహుడు, భవత్పాద సేవకుడు**
**పురాణం సూరిశా(స్త్రి**

# ప్రతాపరుద్రీయము[30]

భక్తవత్సలా, దశరథరామా!

మా నాట్యరంగాన భారతీయ మహావీరుల సాహసాలను చూపించే చరిత్ర నాటకాలు చాలా ఆడుతున్నారు. కాని, తెలుగుదేశపు వీరచరిత్రాలు రెండు మాత్రమే యిప్పటికి గద్దెనెక్కినవి. ఇందులో శ్రీనివాసరావుగారి[31] రామరాజ్య వినాశనము– ఆంధ్రుల రాజనీతి, క్షాత్రపౌరుషము, బంటపదునులు, సన్నగిల్లి గ్రుంకిపోయెడి విషాద సందర్భాన్ని చూపిస్తున్నది. వెంకటరాయ శాస్త్రుర్లుగారి[32] ప్రతాప రుద్రీయములో మాత్రము ఆంధ్రుల రాజ్యతంత్ర ప్రభావము మహోన్నత విజయ మొందిన సంగతి తేటపడుచున్నది. వేగినాటి యడవులందు శ్రీకాకుళ విభుండవై నీవవతరించి, విశుంభాదుల దునిమి, యాంధ్ర రమానిలయ మేర్పరచినది మొదలు యెన్నేసి వీరవృత్తాంతములు, రాజ్యప్రతిష్ఠాపనలు, దేశారాధన జీవనములు, మా తెలుగుసీమలలో లోకఖ్యాతి నొందవలసిన మేటిపట్టు లేర్పడినవి. కాని, తెలుగుదేశపు బడిపిల్లలందరూ, నెపోలియనేనాడు పుట్టెనో, రిషిలో రాజ్య

---

**30.** ప్రతాపరుద్రీయము : తెలుగుతేజాన్ని, మేధా వైశిష్ట్యాన్ని చాటే చారిత్రక నాటకం. వేదం వేంకటరాయ శాస్త్రిగారి రచన.

**31.** రామరాజ్య వినాశనము : 'ఫాల్ ఆఫ్ విజయనగర్'గా ప్రసిద్ధి పొందిన కోలాచలం శ్రీనివాసరావుగారి చారిత్రక నాటకం.

**32.** వెంకటరాయశాస్త్రిగారు : వేదం వేంకట రాయశాస్త్రిగారు. కళాప్రపూర్ణులు. సాహితీ సమ్రాట్టులు. వ్యాఖ్యాతృ చక్రవర్తి. ప్రతాపరుద్రీయ, బొబ్బిలి నాటక, ఉషానాటక రచయితలు. కాళిదాసు నాటకాల అనువాదకులు. స్వయంగా ఆంధ్ర భాషాభిమాన సమాజాన్ని స్థాపించి తన నాటకాలకు తానే దర్శకత్వం నెరపిన దేశికులు.

తాంత్రికుడెట్టి కౌటిల్యమర్యాదలవలంబించెనో, ఆగిన్కొర్టు రణకూటమున నెందరాంగ్లసైనికులు మడసిరో, పాశ్చాత్య విజయ వైభవంబు లేసీమల నేగతి నేమహనీయ జీవిత సమర్పణంబున సిద్ధించినవో, జిహ్వాగ్రమున ధరించి, తప్పీళ్లతోవప్పజెప్ప గలిగి యుండ, – సత్సంస్కార విరాజితులగు నాంధ్ర విద్యాధికులలో కూడ నూటికొకరయిన విద్యానగరమేనా డెవరిచే బ్రతిష్ఠింప బడియెనో, మనుమసింహ మహీపాలు డేపురంబున వశించెనో, వోరుగంటి విజయతోరణము లెవరు కట్టిరో, పోతన గోపనాదు లేప్రాంతముల నధివశించి భక్తి తాత్పర్యముల వెల్లడించిరో, అమరావతి దయ్యాలదిబ్బలందెట్టి శిల్పరత్నములస్మృతనిద్ర నొందుచున్నవో లెక్కింపకున్నారు.

ఆంధ్రచరిత్ర గాథలను నాట్యరూపమున ప్రదర్శించినచో జన సామాన్యమునకు తమ దేశవృత్తాతము తెలియగలదు. కవులు, చిత్రకారులు, వీనియందలి రసవత్సందర్భముల గుర్తించి వర్ణింపగలరు. నాట్యరంగాన చూచినదానిని భావప్రపంచములో నెంచి చిత్రాకారులు చిత్రించుటవల్ల మరల నాట్యాభినయమునకు, రంగవిరచనమునకు, సంస్కార మొదవును. ఈ ఆచార మితర దేశాలలో జరుగుచున్నది. కళ లన్యోన్య సహకారమున నభివృద్ధి నొందవలెను. చారిత్రరూపక ప్రదర్శనంబున దేశాభిమాన ముజ్జ్వల విస్తరణ మొందుటయే కాక, పూర్వ సాంప్రదాయము లెరుకపడుటయేకాక, కావ్యచిత్రాదుల కమేయ ప్రోత్సాహమేర్పడును. వీటివలన నాట్యకళ విచిత్ర రమ్యవైఖరుల విప్పొందగలదు. అందుచేత ఆంధ్రచరిత్రమంతా నాట్యరంగానికెక్కవలసి యున్నది.

ప్రతాపరుద్రీయమును కూర్చుటలో వెంకటరాయశాస్త్రిగారు అసాధారణ ప్రతిభా విశేషాలను చూపించినారు. హిందూదేశంలో చరిత్రనాటకాలు సామాన్యంగా 1905లో జాతీయోద్యమ మంకురించిన తరువాత యేర్పడ్డవి. ఇవి చాలమట్టుకు రసపుత్ర మహారాష్ట్రవీరుల స్వాతంత్ర్య సంరక్షకారంభములను దెల్పుచూ – సాధుపతనము, మ్లేచ్ఛ విజయము, దేశ స్వాతంత్ర్య నిర్మూలనము, యుద్ధములు, చావులు, బొబ్బలింతలు, దేశాభిమానభరితమైన యుపన్యాసములు మొదలగు గగ్గోలుతో నిండియున్నవి. ప్రస్తుత రాజకీయ దురవస్థల అనుభవములు పూర్వచరిత్రగాథల కతికింపబడ్డవి. అందుచేత యివన్నీ ఒకే కత్తులో వుంటవి.

ప్రతాపరుద్రీయము, జాతీయోద్యమంకురించుటకు చాల వెనుక గూర్పబడ్డది. పాత్రోచితమయి గ్రామ్యభాష నుపయోగించుటలో కూడ సమకాలిక సాహితీసిద్ధాంతములను మించి ముందంజవేసినది. వెంకటరాయ శాస్త్రి, యుభయభాషా వ్యాకరణ పారంగతులయ్యును, నిర్దుష్ట ప్రయోగకుశీలురయ్యును, బహుజనంబులు చూచి, విని, బోధపరచుకొని, యానందించవలసిన రూపక కవిత్వమందు, వాడుకభాష నొప్పియుండెడి సరస పటిష్టతను గుర్తించి, బెదరక వాడియున్నారు. కథాకాలపు దేశావస్థనే వర్ణించినదిగాని, యీ కాలపు భావాలను వెనక్కునెట్టి అతికించలేదు. అందలి దేశాభిమానులు తమ చర్యలచే పట్టుదలచే స్వామిభక్తిని, స్వాతంత్ర్యనిరతిని చూపుకొనిరిగాని, వృథోపన్యాస వాగాడంబరమున దేశాభిమానము వెళ్ళబుచ్చలేదు. పాత్రస్వభావాలు స్వభావసిద్ధంగా పోషింపబడ్డవి గాని నాయక నాయికా లక్షణము లెదుట బెట్టుకొని పెంచబడ్డవికావు. అద్భుతమైన రాజ్యతంత్రము, పక్కలు పెగిలించు హాస్య ప్రసంగము, పేక పడుగులవలె, యల్లిక సొబగులమర, జక్కగ గూర్పబడినవి. సాంఘిక మర్యాదలను దెలుపు, నవీనరూపక పద్ధతులకు దారిజూపుచున్నది.

ఇటీవలి చరిత్ర నాటకములు వ్రాసినవారు ప్రధాన నాయకులకు మహోదార వీరస్వభావములను ఆపాదించి యున్నారు. పురాణకథాత్మకమైన ఆటలలోని పాత్రలు నిర్ణీతాలంకారిక స్వభావమొప్పుచు, లోకోత్తరముగ స్వభావేతరముగ నగుపడుదురు. శ్రీరామహరిశ్చంద్రాదుల స్వభావంలో మనకు భక్తివిశ్వాసాలు కుదిరిపోయినవి. అభ్యాసంగా వాళ్ళని మన్నిస్తాము. అంతేకాని వారిచేష్టలను, ప్రవృత్తులను, లక్ష్యమర్యాదలను, లౌకికానుభవ ప్రమాణమున విమర్శించ జూడము. ఇట్టి భక్తివిశ్వాసములు నవీన చారిత్రవీరుల పట్ల అలవరచుకొనజాలము. చరిత్రలు లౌకికకథాంశముల విప్పిచెప్పునేకాని యలౌకిక సందర్భముల గల్పించవు. చరిత్రనాటకాలు సాంఘిక స్థితికిని లౌకిక సంసారమునకును చేరువగనుండవలెను. ప్రతాపరుద్రీయము వీరగంభీర ప్రతిజ్ఞార్భాటములతో నుల్లముదల్లడింపజేయక, సాంఘిక చారిత్రక రూపకంబుల కనువగు స్వాభావిక సామాన్యత గలిగి హాస్యరసాయన మొలికించుతున్నది. దీని పాప్యులారిటీ చూస్తే ఆంధ్రులు వాడుకభాషలో జాతీయ చమత్కార మేర్పరచు

ఆటలజూడనుంకించుచున్నారని విశదమగును. రాజ్యాలు నిలుచుటకు ప్రజలందరు, రాజసేవకులందరు సంకల్ప పరిశుద్ధతతో యేకముఖమున వర్తించవలెననియు, నైకమత్యమున నెంతటి కార్యమైనా సాధించవచ్చుననియు తెలుపుచున్నది.

ప్రతాపరుద్రీయము యీనాటి తెలుగునాటకాలన్నిటిలో మిక్కిలి ప్రేక్షణీయమై పండితపామరులను సమానంగా సంతోషపెట్టుతున్నది. ప్రతాపరుద్రుడు, యుగంధరుడు, విద్యానాథుడు, చకుముకి, పేరిగాడు, యెల్లి, ఖుస్రూ మొదలైనమూర్తులు ఒక్కొక్కరొక విధమైన పాత్ర స్వభావాన్ని విపరీత స్వాభావికచాతుర్యంతో చూపుచున్నారు. ఈ నాటకంలో వసతిగలవారు పెక్కు రమ్యరంగములను ప్రదర్శింపవచ్చును. నాటక భారము పలుపాత్రల మీద పరచబడి విసుగొందవకుండ నిర్వహింపబడ్డది. పాత్రస్వభావ పోషణలో అనౌచిత్య మెక్కడాలేదు. నాయికలరుదెంచి వలపుతెరవుల కులుకకున్నను రక్తికొరవడలేదు. తెలుగువారి ప్రస్తుతాశయముల నన్నివిధముల దనియించుచు, తళుకుసౌరుల నతిశయించుచు, నసామాన్య రామణీయక మొందియున్నది.

కాని, యిందులో సంధినియమాలేవీ కనుపించవు. ప్రతాపరుద్రుని తురకలు యెత్తుకొనిపోవుటవల్ల నాటకబీజమేర్పడ్డది. రాజును విడిపించి దెచ్చి కాకతి రాజ్యలక్ష్మి వియోగమును బాపి భద్రముగ సింహాసనారూఢుని గావించుట యిందలి ముఖ్యాంశము. నిదురలో మైమరచియుండిన రాజును వంచించి చెరగొనిన తురక సర్దారుల శిక్షించుటయు, దేశమును అరాజకము గాకుండ గాపాడుటయు, తురక సుల్తానునకు హిందూ తంత్రజ్ఞుల యుదారమర్యాదలను తెలియబరచుటయు, తరువాతి సమస్యలైనవి. రాజును విడిపించుటకు రత్నాల వర్తకులు కారణమైరి. ఖుస్రూవల్లీల జంపించుటకు చకుముకి పాటుపడెను. రాజు దేశములోనే యున్నాడని వెల్లడించి ముద్రికాసహాయమున వ్యవహారముల నడిపించుటకు జనార్దన విద్యానాథులల్లినపన్నిదము తోడుపడినది. సుల్తానునకు హిందూమర్యాదలను యుగంధరామాత్యుడు పడవలో నెరుకపరచెను. ఈ నాల్గు ప్రత్యేక సమస్యలను నిర్వహించుటలో కల్పన సౌష్టవము దిట్టముగా నున్నదిగాని నివి యొకదానితో నొకటి సంబంధించి యుండలేదు. ముఖ్యాంశము రాజును

విడిపించుట. అందుకు సాధనము రత్నాల వర్తకులు. మిగిలిన కథలు యీ ప్రస్తుతాంశానికి సంబంధించి లేదు, తోడ్పడలేదు. ఆ కాలపు కాకతిచరిత్రములో రాజ్యధూర్వహులు నిర్వహించిన నాలుగు ప్రత్యేక కార్యములను పరస్పర సంబంధము లేని వానిని కూర్చినందున దృశ్యరూపమున నొక యితిహాసమును రచించినట్లయినది. కాని సంధిసంబద్ధమైన నాటకము కాలేదు. విద్యానాధుడు ముద్దుటుంగరమును దెచ్చుటయు, పేరిగానిని గద్దెనెక్కించుటయు, ప్రధాన కథాంశమగు ప్రతాపరుద్రబంధవిముక్తికి ఏవిధంగానూ జతపడవు. అరాజక నివారణము మేమూహించిన సంగతికాని, పాత్రసంభాషణలో తేలిన అంశము కాదు. విద్యానాథుడొనర్చిన పనిలో రాజును ఢిల్లీకి తురుకలెత్తుకొనిపోయిరను నిశ్చయవృత్తాంత మొకటియె నాటక కథా విన్యాసమున కుపయోగించునదియై యున్నది. ఖుస్రూవజీరుల జంపించుటకూడ ప్రధానకథకు సహకారమైన అవసరమైన విషయం కాదు. వాళ్ళు బ్రతికియున్ననూ రాజును తప్పించడానికి యాటంకము లేదు. శాస్త్రిగారు ఈ అతుకులన్నీ తీసివేస్తే కథ చాలా చిన్నదౌతుందని, స్వారస్యంగా నుండదని, ఆలోచించిపెట్టారు. ఇంత ఆక్షేపించినా, పేరిగాడి సీను తప్ప మిగిలినవి తీసివేయమని మేము చెప్పము.

ఈ నాటకంలో మిక్కిలి ప్రీతికరములగు పట్లు, పేరిగాడి సారాశెంబుసీను, యుగంధరామాత్యుని బిచ్చంబు, బైరాగి చేష్టలు. ఇవి రెండూ కథా సంవిధానానికి తోడ్పడవు. నిష్ప్రయోజకములు, నీచప్రసంగభరితములునై, పైపెచ్చు అసంభావ్యత నేర్పరచుచున్నవి. పేరిగాడు గద్దెనెక్కిన సంగతి ఆనాటి కాకతి ప్రజలెరుంగరు. తురకలు యెత్తుకొని పోయినది పేరిగానిననియు, ప్రతాపరుద్రుడు సుఖముగ నిజరాజ్యస్థానమందున్నాడనియు, జనార్ధనవిద్యానాధు లేర్పరచిన పుకారు కాకతి రాజ్యసంరక్షణకవసరమే! మంత్రుల జాగరూకత ప్రశంశనీయమే! కాని పేరిగాడు యెన్నడూ కాకతిప్రజల కగుపడలేదు. రెక్కలు మూసిన పల్లకీలో గాయపడిన రాజు, రామావధానుల యింటినుంచి, నిజాంతఃపురంబున కరుదెంచినట్టు చూపిరి. అప్పటి నుంచి, ప్రతాపరుద్రుడు తిరిగివచ్చుదాక, రాజనామకుని యంతిపురమందే దాచియుంచిరి, సారాసెంబుసీనులో కూడ చకుముకీత్యాద్యమాత్య నియుక్తపరి జనంబులే కవిగాయకభూమికల దాల్చియరుదెంచిరి. కాలక్షేపమైన వెనుక నీ వెట్టివెంగళప్పను బహిరంగసభలోకి జేరనీయకూడదని జనార్దనుడు నిశ్చయించెను.

పేరిగాడి పొందిక, వోగము పట్టించుకొను పట్టుననే వెల్లడైనదికనుక, వాడి సారాసెంబు సీను నాటకపల్లికకు జతగాచు కనుక, ఈ సందర్భాన్ని ప్రయోగించ వలసిన అవసరము లేదు. ప్రజలకు తెలియడానికి ఎల్లితో చెప్పినమాటలే చాలును. తా ఎరగొనినది పేరిగాడని సుల్తానునకు తెలియకూడదు. తెలిస్తే, సుల్తాను ఆత్మగౌరవసంరక్షణార్థ మీయుదంతమును గోప్యముగ నుంచి, బిడాలోపాఖ్యానము లోని, జమీందారు తాబట్టినవి పులి పిల్లలే యని డాబినట్లు పైకి ప్రతాపుని చెరగొంటిమని చెప్పుకొంటూ రత్నపరీక్షా సమయానికి వాడిని వెంటగొనిరాడు. లేక, రాచవేసాన మోసపుచ్చి, యిభవపురంబున రాజమర్యాదలందుకొనెనను అవమానముచే, ఖైదీని దండించవచ్చును. ఈ రెండు వ్యవస్థలు అనిష్టములే. కనుక ఈ సంగతిని సుల్తానునకు తెలియజేయడు. అందుచేత యీ వృత్తాంతము బహిరంగంగా చూపవలసిన అగత్యం లేదు. నాటక ప్రేక్షకులు కథాకాలములతోనూ, కథావస్థతోనూ తాదాత్మ్యతన్మయత్వమొందుదురు. పొందినగాని రసగ్రహణశక్తి యేర్పడదు. ప్రేక్షక సమాజము ఆనాటి కాకతిప్రజలగుచున్నారు. వారు యెరుగనది వీరెరుంగకూడదు. రత్నాలపంపిణికి యుగంధరుడు పిచ్చివాడై యిభపురంబున గంతులిడవలసిన అవసరమగుపడదు. వృధాచమత్కారం తప్ప ప్రాకృత జనరంజనం తప్ప వేరొండు ప్రయోజన మీ పట్టులలో కనుపడదు.

కథాభారాన్ని నిర్వహించింది బ్రాహ్మణామాత్యులు. వీరి నిత్యధర్మములగు అహింసాసత్యాదులకు భంగము వాటిల్లకుండ గల్పించుటలో వెంకటరాయశాస్త్రి యమేయ కౌశలమగుపరచియున్నారు. చకుముకి, యుగంధరుడు తాము తలచిన పని సూచిస్తూనే కార్యము సాధించారు. కథావ్యవహర్తలు తంత్ర ప్రయోగమున వైరివీరుల నొండొరులచే మడయింపజేసిరి కాని తమ చేతుల రక్తకలుషితంబుల జేయలేదు. ఈ హాస్యప్రసంగానికి ప్రయోజనౌచిత్యములు లేకపోగా శ్రీ శాస్త్రిగారు సమకాలికాయిష్టకవిజనంబులపై తమకున్న భావములిందున వెల్లడించిరను మాటకూడ కలుగుతున్నది. నాటకపాత్రలన్నిటిలో చకుముకి విచిత్రముగ పోషింపబడ్డాడు. యుగంధరునకు యెక్కువ ప్రాముఖ్యమగుపడదు.

ఈ నాటకంలో కథాబీజము విపరీతముగ గూర్పబడ్డది. సామాన్యంగా రూపకాలన్నిటిలో ప్రధాన నాయకుల (అనగా కథాఫలితాన్ని అనుభవించే స్త్రీ

పురుష పాత్రముల) మనోవాక్కాయ కర్మలవలన నేర్పడి వారిపట్ల వర్తించును. ప్రధాన కథావిస్తరణము నాయికా నాయకుల ప్రవృత్తుల జరుపబడును. ప్రతినాయకులు వ్యతిరేక ప్రచార మొనర్చుచుందురు. ఈ నాటకంలో ప్రతాపరుద్రుని తురకలు యెత్తుకొనిపోవుట వలన కాకతి రాజ్యలక్ష్మిని భూధవునకును గలిగిన వియోగమే కథాబీజము. ఇది ప్రతాపరుద్రుని గుణములవల్ల చేష్టలవల్ల జరుగలేదు. సుల్తానుకు బుద్ధికుదిరి భావవిపర్యాసమేర్పడి, అందువల్ల ప్రతాపరుద్ర బంధవిముక్తి కలుగలేదు. దీని నేర్పరచిన తురకలు రాజును చెరగొనుటతప్ప వేరొండు వ్యతిరేక వ్యవహార మవలంబించలేదు. బంధవిముక్తుడై నిజరాజ్యలక్ష్మిని మరల కలియుటయే కథాఫలము. ఇది ప్రతాపరుద్రుని ప్రయత్నమువల్లగాని గుణవిపర్యయము వల్లగాని సిద్ధించలేదు. రాజానుచరులు తురక లెత్తుకొనిపోయినట్లే యేమరుపాటున రాజును యెత్తుకొనివచ్చిరి. ఇందుచేత బీజస్థాపనమందుగాని, ఫలసిద్దియందుగాని, కథావిన్యాసమందుగాని, నాయక ప్రతినాయకుల స్వభావ చారిత్ర వికాసమేమియు నగుపడదు. తురకల అజాగ్రతను, నీచస్వభావమును ఆంధ్రుల తెలివితేటలను, సద్గుణంబులను, వెలిబుచ్చునేకాని కథావిన్యాసమందు అచించితావస్థలను, కాకతీయ ఫలప్రాపులను, మానవ స్వభావ వికాసములను, ప్రమాదములను, భంగపాటులను, వక్రగతులను, విరోధాభాసలను జూపట్టదు. బీజస్థాపకులొకరు, ఫలభోక్తలింకొకరు. కథార్థ సంధాతలు మరియొకరు. పాత్ర ప్రాధాన్యము నిర్వాహకులదే యైనది. కథలో మిగిలిన సంక్షోభమంతా జనార్దనుని తాకి, ఫలప్రాప్తికి వలయునుపాయముల నాతడే సిద్ధపరచినందుననిందులో ప్రధాన పాత్రము జనార్దన మంత్రియని చెప్పవచ్చును.

ఈ యేడు మావైపు నాట్యరంగాన ప్రతాపరుద్రీయము మొదటి గౌరవము మొందినదని చెప్పవచ్చును. మోతేవారి ప్రదర్శనము చూడలేదుకాని యేలూరు గ్రేటు ఇండియన్ థియేటరువారు, తెనాలి రామవిలాససభవారు, బందరు మత్తురాజు సుబ్బరాయ మెమోరియల్‌వారు, దేశీయనాటక సమాజమువారు దీన్ని ప్రదర్శించగా చూచినాను. ఇందులో ప్రత్యేక ప్రశంసార్హముగ పాత్ర నిర్వహణము గావించిన మేటినటులు తమతమ పాత్రలకొసగిన యభినయ తాత్పర్యమును దిగువ విశదపరచెదను.

## – ప్రతాపరుద్రుడు –

ప్రథమ ప్రవేశ మరణ్యమధ్యమున నిద్రావస్థ యందు కూర్చబడినది. తురకలు సంకెళ్ళు తగిలించిన వెనుక రాజు మేల్కొనును. అతులిత బలాఢ్యుడు – అసహాయశూరుడు – కాని, నిరాయుధుడై కాలుసేతుల సడలింపజాలక, యేమరుపాటున చెరగొనిన తురుష్కుల నీచసాహసమున కులికిపడుచు, పొంగి పొరలెడి ప్రతాప వాహినీతరంగముల ద్రొక్కిపెట్టుచు, కోపమును, పరితాపమును, క్షాత్రపౌరుషమును, నిస్వతంత్రదురవస్థను, స్వీయసామ్రాజ్య వియోగమున రగుల్కొనెడి శోకభారమును, తురకల నీచ వర్తనమున కసూయయును, వొక్కమారు ప్రకటించి చూపును. జి.ఐ.టి.ఆచార్యులగారి[33] ప్రతాపరుద్రవేషమాంధ్ర సామ్రాజ్యధూర్వహణ సమర్థమై, నిండారవిప్పొందిన రెడ్డివెలమ రాజపురుషుల మూర్తీపటిష్టతను జూపుచుండెను. వీరీభాగమును చక్కగ నిర్వహించిరి. తెనాలివారి చలపతిరావుగారి[34] ముఖసౌందర్యము మేటి రసపుత్ర వంగడమున జనించి నీడలో చల్లగ పెరిగిన సుకుమార సుందరరేఖా విన్యాసమున రాజిల్లుచుండును. ప్రతాపరుద్రుని యుంకించు భావసంక్షోభమీతని కోమలాకారమున సంస్కృత సాధుత్వమొంది స్ఫురించుచుండును. కాని నేజూచిన నటులెవ్వరు తమకీయవస్థ చిరకాలముండదనియు, వేయికన్నుల గాపాడు మంత్రివరులెట్లేని సాయపడి బంధవిముక్తు జేతురనియు, మంత్రులపై విశ్వాసమును భావికళ్యాణమందాశా భంగమును చూపులలోగాని, పలుకులలోగాని, చేతలందు గాని వెలువరించలేదు. మంత్రులకు రాజునందెంత భక్తి విశ్వాసములున్నవో రాజునకు గూడ, మీదు మిక్కిలి – సరసాగ్రేసరియగు ప్రతాపరుద్రునకు మంత్రుల నేర్పు పెంపుల యందంత నమ్మకముండుట మానసధర్మమై యున్నది. ఈ సంగతిని ప్రతాపరుద్రీయ రచయితలుగాని యభినేతలుగాని గ్రహించినట్లగుపడదు. కాళిదాస శూద్రకాది మహాకవులిట్టి సందర్భమున భావిప్రయత్న పరిణామ సూచనలందించక మానరు.

---

**33. జి.ఐ.టి.ఆచార్యులుగారు :** అస్పష్టం : ముక్తేవి రామానుజాచార్యులుగారు అయివుండవచ్చు.

**34. తెనాలి చలపతిరావు :** పెద్దభొట్ల చలపతిరావు. తెనాలి రామవిలాససభలో ప్రముఖనటులు. ప్రతాపరుద్రీయంలో పేరిగాని పాత్రకు ప్రసిద్ధులు.

రెండవరంగము నౌకాగర్భమున జరుగును. నిజంగా పడవ కడుపులోనే ప్రతాపరుద్రుని గూర్చుండబెట్టుటవల్ల నియ్యెడ ఆచార్యులగారి యభినయవైఖరి రేచీకటిలో మరుగుపడిపోయెను. విద్యానాధుడు తన కావ్యరత్నమును ఓరుగల్లునకు గొంపోయి రుద్రునకందించి మెప్పొంద నుంటినను సందర్భమును వెల్లడించినప్పుడు రాజునకు గల్గెడి పరితాపమును, ఆశక్త్యౌదార్యమును చలపతిరావుగారు హృదయవిదారకంబగు శోకస్థలభిత 'కాకు' గౌరవముతో నభినయించిచూపిరి.

రత్నాలవర్తకులు సుల్తానునకు నగలమ్మ జూపెడివేళ మనరాజు మూడవసారి నాట్యరంగాన వెలయును. మూల్య నిర్ణయార్ధ మాతని చేతికందింపబడిన దొడవుదినుసుల గాంచి నంతనే యవి తన యంతఃపురంబు నుండి దేబడినవిగను వర్తకులు తన్ను విడిపించుకొరకరుదెంచిన కృత్రిమోపాయులుగను గ్రహించి లోని తలపుల వెలికుబుకనీయక మంత్రుల సేవాపరత్వమున కచ్చెరువంది సంతసించుచు, సభాసదుల అనుమానము రేపకుండ తన సన్నిహిత బంధవిమోచనౌత్సుక్యమును బ్రాకటముగ పొక్కనీయక, నొకచూపుమెరుపులో యథార్ధ వివేకమును, కృతజ్ఞతను, సంతోషమును వర్తకుల కెరింగించును. కాకతీయప్రధాని వెంగలియై ఢిల్లీవీధుల దిరుగుచుండెడివార్త రాజెరుగునో లేదో కాని, యిది అంతా అతని విశాల మానసారామమున మొలకెత్తి విప్పారినయుపాయవల్లరి యనియే రాజు గుర్తించియుండును. పైజెప్పిన చూపుమెరపులొకవంక దలజూపుచు స్వకీయదీనావస్థలో సర్వమును మరచిపోయిన చీకటి మొగమును దాల్చి రత్నార్థనిర్ణయ ప్రవృత్తిలో తదేకధ్యానమున నవధానియై నిస్సంగమూకీభావమున వర్తించు రాజచేష్టలన్నియు చలపతిరావుగారి నెమ్మొగంబున యథారసముగ దేజరిల్లినవి.

సుల్తాను పరివారములో చేరి పడవలోని కరుదెంచుతరి ఆచార్యులుగారు, చలపతిరావుగారు, అడుగులలో అడుగులు వేసుకుంటూ నతశిరస్కులై – భావిగతి యెట్లు పరిణమించునో తెలియక పరలోక స్వభావమును గుర్తింపనేరక కఫవాత జర్జరితంబగు నైహిక కళేబరంబును విడువనాయాసపడెడి జీవుని భంగి ఛిలానుకోట ఖైదీపలికిన I left the prison with a sigh అను మాట లభినయించునట్లు

నడుచుచుందురు. ఇప్పట్టున వీరి యాంగికవిన్యాసము మానవస్వాభావికముగ నున్నది. ఇంతలో దారినడుమ పిచ్చివాడగుపడును. సుల్తాను తమాషాకొరకు వానిని పడవలోనికి రానిచ్చును. దొంగబైరాగి సందుదొరికెనని పరిజన మాలికాంతమున జేరును. రాజూ మంత్రీ దగ్గరకు వత్తురు. చిరకాలవియోగముచే రెప్పలార్పక జేవురించిన నిద్రిత రాజాపహరణ దుష్కర్మలగు తురుష్కులపై దీండ్రించియలసిన – కన్నుంగవ నొకసారి రాజుపై మరల్చెను. ఈ వీక్షణ సంస్ఫురణమందుకొని రాజు తానదివరకు దేలుచుండిన దివాస్వప్నవీచికల నుండి దెప్పరిల్లి యుగంధరుని బోల్చిన కృతజ్ఞతాభినందనముల నొక్క వీక్షణస్ఫురణమున జిలికించి యథాపూర్వమెరుగనివానివలె నడచిపోవును. ఇచ్చట ఆచార్యులుగారంతభావద్యోతకంబుగ నిర్వహింపలేదు. చలపతిరావుగారీ యెడ తన్నుదామించిరని చెప్పవచ్చును.

## – పేరిగాడు –

జి.ఐ.టి. కందుకూరి అంబయ్యగారు[35] కమ్మసంస్థానాల్లో మషాల్జీ పనుల మీద జీవించు చాకలినాయకుల రూపులో పేరిగాని వేషమును దాల్చిరి. ఇదే మాకు రుచించింది. చలపతిరావుగారి వేషము దీని తరువాతది, పేరిగాడు మూఢుడు. లోకజ్ఞానశూన్యుడు. అల్పసంతోషి, విశ్వాసి, రాజరికానికి తన యునికికిగల వ్యత్యాస మెరుగునుగాని పెద్దలు వోగంపట్టునని చెప్పినందున నిజమని భ్రమించినాడు. రాజరికము అబ్బితే అనుభవించాలని కోరువాడు. రాచనడకల కులకజూచును. మంత్రినిర్దిష్ట నియమముల నవలంబింప యత్నించును. కాని స్వజాతీయస్వభావము నతిక్రమించి నవ్యావస్థానురూపమగు భూధనలక్షణంబుల మెప్పించుకొనలేదు. సారాశెంబు తాడెంతలాగినా, జనార్దనుడురిమి చూచెనా, పేరిగాని సాకలిపుట్టక పెల్లుబ్బిపొక్కుచునే యుండును. పేరిగాడమాయకుడు. వెర్రిబాగులవాడు. కాకతి సామ్రాజ్యనికేతనములో, లలితకళాంగన భువనైకమోహనంబుగ నాట్యమాడిన ఓరుగల్లులో, తాంబురామొగమెరుగని పౌరులుండుట యసంభవము, అసహజము; కాని కవి

---

**35. కందుకూరి అంబయ్యగారు :** ఏలూరు జి.ఐ.టి.లో పేరిగాని పాత్రను ధరించిన నటులు.

వ్రాసిన తెరవు అంబయ్యగారి అభినయంలో స్వాభావిక వికాసమొంది మిక్కిలి వినోదకరముగనుండెను. జ్యోస్యునకు పుర్రచెయ్యి అందించినప్పుడును యెల్లితోడి జగడమును తనప్రాకృత ప్రణయకోపమును విప్పిచెప్పుటయు, యోగము పట్టించుకొనుటయు, చక్కగ నిర్వహింపబడ్డవి. ఈ రంగములో చలపతిరావుగారు యుగంధరాదులకు పంకా విసురుచు, కుర్చీలు మున్నగు సభాలంకారము లదుడుచుచు, పేరిగాని నిజోద్యోగ పారతంత్ర్యమునునొకింత వెల్లడించిరి. ఈ పని అంబయ్యగారు చేయలేదు. పేరిగాడి ఘట్టములో యోగ స్వీకరణరంగమే ప్రీతికరముగ నుండును. అందు చలపతిరావుగారు మంత్రి సమాగమంబున మౌనముద్ర వహించు తత్తరపాటులో ప్రాకృతలోకోక్తిననుసరించి ముఖస్పష్టంబుల కరద్వయంబున మూసికొనిరి. ఈ విపరీత స్వభావాభినయాన్ని, తరువాతి సారాశెంబురంగములో చలపతిరావుగారు వాడినకొన్ని యసాధుపదములను కొందరు ప్రేక్షకులామోదించలేదు. మొత్తము మీద అంబయ్యగారి నిర్వహణము చలపతిరావు గారికన్న నెక్కువ స్వభావోచితముగ నున్నది.

### – విద్యానాథ మహాకవి –

ఇంతవరకు నేను చూచిన విద్యానాథులు సంతృప్తికరముగ లేరు. పదునెనిమిదేండ్లలో నష్టాదశ విద్యలను సాధించిన శేముషీవైభవము, ప్రతాపరుద్రీయ సరస ప్రబంధమును గల్పించిన రసజ్ఞత, దీర్ఘబ్రహ్మచర్యమున సిద్ధించు తేజస్స్ఫూర్తి, హయమును చూచినంతనే రాజస్థితి నెరింగిన సూక్ష్మవిచక్షణ, ముద్దుటుంగరము చేజిక్కినంతనే రాజ్యసంరక్షణోపాయముల నూహింపగల రాజ్యతంత్ర ప్రవీణత, శత్రుశిబిరమున సమయానుకూలముగ వర్తించుట, నిజోద్యోగమును సాధించు కార్యనైపుణ్యము, చకచక, మెళుకువ, తెలివి, నేర్పు, తపః పాండిత్య సంపత్తి, నిగ్రహము, సమయస్ఫూర్తి మున్నగు మేధావిభూతి విద్యానాథుని ఫాలప్రదేశమున చెప్పక దెలియుచుండవలెను. ఇదిగాక సాహిత్య పరిజ్ఞానము, అర్థానుభవము, నిర్దుష్టగానకౌశలము వీనిలో నగుపడవలెను. ఇవియన్నీ సిద్ధించిన విద్యానాథ నటులగుపడలేదు. జి.ఐ.టి. వారి లక్ష్మీనారాయణ గారి ముఖకవళిక అందముగ బ్రాహ్మణ సాధుత్వములో నుండెను. కాని పాత్ర నిర్వహణమంతగా నాకు రుచించలేదు. తెనాలి కంపెనీలో అబ్బూరి

లక్ష్మీనారాయణగారు పడవరంగములో ప్రీతికరముగ వర్తించలేదు; గాని యోగపురంగమున జనార్దనాదుల యాంతరంగికుడై యుండియు, నోరుగల్లునకు క్రొత్తగ విచ్చేసిన పరదేశపండితునివలె నచ్చటి పరిస్థితులెరుంగని వానివలె జ్యోస్యమహిమచే నుద్యోగుల గుట్టుమట్టుల వెలిబుచ్చుపట్టున లక్ష్మీనారాయణగారు వలసినంత నిగ్రహమగుపరచిరి. పడవ సీనులో వెంపటి వెంకటేశ్వర్లుగారికి సాటియగు వారరుదు. ఉంగరమును సంగ్రహించి వచ్చిన తరువాత, గోదావరిని దాటించిరిగదా తురకలు మహారాజును, అను సందర్భమున ఓరుగల్లున కేర్పడిన కష్టములను, ఓరుగంటి మెట్టలో సాకేత పాలన విధాన మవతరించినట్లు, ప్రజల నేర్పుమై బాలించు రసిక రాజాగ్రణి కేర్పడిన కష్టములను చింతించుచు రాజును విడిపించుటకను, రాజ్యమును భద్రపరచుటకును పన్నవలసిన యల్లికయంతయు తనపైబడిన తెరంగున వెంకటేశ్వర్లుగారు శోకము, ధైర్యము, కార్యశూరత, వుపాయాన్వేషక నైపుణ్యము, మనోనిశ్చయము, నొక్కసారి ప్రకటించిరి. రామావధానుల మాట యిక్కడ చెప్పకూడదు. భావసంజనితమైన కార్యమునకే నాటకస్థితి యొప్పిదమగునుగాని, కేవల భావప్రచురణ మంతరసవంతముగ నుండదు. కార్యాకార్యపర్యాలోచన మేర్పడి విరోధిభావతరంగములు జెలరేగి డీకొనుసందర్భమున భావప్రకాశ మొప్పిదమగును. ఇచ్చట విద్యానాధుని యూహలు ప్రతిపక్షబాధితములు కావు. గాన నీపన్నిదమును విప్పి జెప్పకయే మంత్రికూటమున తంత్రఫలమును జూపించుట మంచిదని మన్నించెదను.

## – చకుముకి శాస్త్రి –

ఆంధ్ర నాటకపాత్రలలో చకుముకికి సరియగు వ్యక్తి కానరాదు. ఆంధ్ర నటవర్గములో సర్వాంగసామర్థ్యమున పులిపాక వెంకటేశ్వర్లుగారిని[36] సమీపించువారరుదు. వేషవాచిక గీతికాసౌష్టవములందు నాయక భూమికల దాల్చగలిగిన సామర్థ్యముండియు, చక్కని హాస్యఖేలనమొనర్చగలడు. ఔచిత్యము, నియమము, నిగ్రహము, పాత్ర స్వభావ పరిజ్ఞానము, అవస్థావివేకము, సందర్భోచిత

---

**36. పులిపాక వెంకటేశ్వర్లు :** ఈయన ఇంటిపేరు పులిపాటి. తెనాలి రామవిలాససభలో ప్రముఖ నటులు. అర్జునపాత్రకు ప్రసిద్ధి. నాయకపాత్రలతో పాటు హాస్యపాత్రలను కూడా సమానమైన ప్రతిభతో నటించినవారు.

విజృంభణము మున్నగు సిద్ధ నటలక్షణము లీతనియందగుపడును. బందరు దేశీయ నాటక సమాజపు మహోన్నతదశలో హాస్యవేషముదాల్చుచుండిన భావరాజు నారాయణమూర్తిగారు చకుముకి వేషమపారకౌశలముతో నిర్వహించిరి. కాని, వారి దేహచ్ఛాయలు బ్రాహ్మణేతర పాత్రల కొప్పిదమగునంతగ బ్రాహ్మణభూమికల కనుకూలించలేదు. మరియు వారు ప్రయత్న పూర్వకంబగు కౌటిల్యవృత్తిని ప్రకటించుచుండిరి. వెంకటేశ్వర్ల చకుముకి నిజోద్దేశ్యము లప్పుడప్పుడు తలజూపుచుండినను, ఆరితేరిన గూఢచారుల కనువగు గోప్యము సమయాను వర్తనము యథార్థభ్రాంతి గలిగించుచుండెను.

చకుముకి ప్రవేశముతో ప్రతాపరుద్రీయ మత్యంత ప్రేక్షణీయత నొందుచున్నది. ఈతని నడవడి దూతప్రపంచమునకు మార్గదర్శకమగుటయేగాక, షెర్లాకుహోమ్సును దుమ్కీకొట్టు గూఢచారీ నైపుణ్య మగుపరచుటయేగాక, సింహపురీ మహోపాధ్యాయుని కల్పనాచాతుర్యమునఖండ కీర్తివైభవ మొనగూర్చుచున్నది. ప్రథమ ప్రవేశంలో వెంకటేశ్వర్లుగారు చకుముకి గడుగ్గాయితనమునంతా వెళ్ళబోసిరి. రొమ్ము యెండిన పేదబాపడువలె కనుపడినను, యీనాటిదుష్టాన్వేషక భటవర్గములోని సుప్రసిద్ధ డిటెక్టివులవలె పలువిద్దెల గరచి దేహసాధనజేసి మిక్కిలి బలవంతుడై యుపాయశాలియై మానసవ్యాపారవిజ్ఞాతయై పలుతెరంగుల నడువ నేర్చి ప్రభ్వాజ్ఞకెదురుజూడకయే స్వయం నేతృత్వమున వర్తించి కార్యసిద్ధి నొందగల తంత్ర స్వతంత్రుడు. చకుముకి మంత్రిని యోగముననే దేశాభిమాన సద్భావములచేతను, అపేక్షారహితమగు స్వామి భక్తిచేతను, వర్తించినట్లగుపడును. నవీన డిటెక్టివులవలె నీతడు కూడ స్వకీయ కౌటిల్యవ్యాపారము నొక లలితకళగ భావించి దాని నాచరించుటలో, రత్యానందముల బొందుచుండెనని చెప్పవచ్చును. విద్యానాథుని వర్తనమందుదార నిస్సంగ సద్భావము లగుపడును. చకుముకి కిట్టి మానసస్థితి యున్నను, భేదోపాయప్రవర్తనమందు జనించు కులాసాయే ప్రధానలక్షణముగ కన్పించును.

## – జనార్దన మంత్రి –

అన్నగారు దక్షిణతీర్థముల సేవింప దూరదేశమున కేగియుండిరి. రాజు, మంత్రిసత్తముల యానమీరి కొద్ది పరివారముతో నెచ్చటనో యడవుల

వేటాడుచుండెను. తురక సర్దారులు నిశాప్రయాణము నొనర్చివచ్చి నట్టింట విడసిరి. కాకతీయదళంబులు సంసిద్ధముగ లేవు. ఇట్టి సమయములో నేమరుపాటున రాయబారినెపమున తురక సర్దారు లోరుగంటి సభాంగణంబున నభిముఖులై నిలచినప్పుడు జనార్దునునిపై నెంచరాని వ్యవహారభారము పిడుగుపాటువలె వ్రాలినది. అన్నగారు వూరలేని సంగతి దాచలేదు. కాని, యావలించిన పేగులు లెక్కగొను బుద్ధివైశద్యముతో భావికార్యముల నూహించి సత్వరముగ, తురకలు గోదావరిని దాటకుండు నుపాయములను తురక శిబిరమున భేదానల మంకురింపజేయు చకుముకి తంత్రమును, అన్నగారిని రావించు ప్రయత్నములను, ప్రవర్తింపజేసెను. తురక సైన్యముల నౌట్‌ప్లాన్కు జేసి కాకతిసీమలలో నిర్మూలన మొనర్చ నాలోచించెను. మహామంత్రుల యాలోచన ద్వికర్ణికము. ఎట్టి సంక్షోభమొదవినను, మనస్థైర్యము, భావగోపనము, నిశ్చంచల గూఢాలోచనమును, వీరరస ముఖముద్రలను, ప్రదర్శింతురేగాని లోని తలపుల వెలుపలి కుబకనీయరు. వీరి నడతలు ధీరగాంభీర్యభరితమై, దిట్టమై, దట్టమై, యమేయమై, యపారమై కనుపడుచుండును. మొదటి రంగమున మొలకెత్తు భావభారము, వ్యాతిథ్యము, తంత్ర ప్రావీణ్యత, ఏలూరు కంపెనీలో జనార్దనభూమికను దాల్చిన పి.వి. సుబ్బారావుగారి[37] నడతలయందు జక్కగ గోచరించెను. ఇప్పట్టున పిల్లలమర్రి సుందరరామయ్యగారు[38] కొంత మనశ్చాంచల్యమును తత్తరపాటును వెలిబుచ్చిరి.

ద్వితీయ ప్రవేశము యుగంధరుడరుదెంచిన తరువాత విద్యానాథ సహకారమున పేరిగానికి రాజయోగమును పట్టించు రంగమైయున్నది. ఇందు సుందరరామయ్యగారు తానేదో పెద్ద తప్పుచేసిన వానివలె పరీక్షాఫలితములు వెలువడిననాటి విఫలవిద్యార్థివలె తలవంచుకొని కూర్చుండును. జనార్దనుడు అప్పటిలో జేయదగిన ప్రయత్నములన్నీ లోటు లేకుండ నేర్పరచినవాడే. అన్నగారి పెద్దరికమునకు వినమ్రుడై యుండవలసినను తన యేర్పాటుల నన్నగారు

---

**37. పి.వి.సుబ్బారావు :** పెమ్మరాజు వెంకట సుబ్బారావు. ఏలూరులోని గ్రేట్ ఇండియా థియేటర్స్‌లో నటుడు. ప్రతాపరుద్రీయంలో జనార్దన మంత్రి వేషాన్ని ధరించేవారు.

**38. పిల్లలమర్రి సుందరరామయ్య :** తెనాలి రామవిలాససభలో ముఖ్య నటుడు. ప్రతాపరుద్రీయంలో జనార్దనుడి వేషాన్ని వేసేవారు.

ఆమోదించినందుకు జనార్దనుని చూపులో నొకింత సంతసము, ఆత్మగౌరవము, హెచ్చరిక కనపడవలెను. దీనిని సుందర రామయ్యగారూహించినట్లగుపడదు. ఏలూరు జనార్దనుడే యిచ్చటగూడ నెక్కువ నాట్యవిచక్షణ మగుపరచెను.

సారాశెంబుసీనులో జనార్దన విద్యానాధుల నడుమ కొంత మూకాభినయము జరుగుచుండవలెను. మూఢ ప్రభుసేవలో నాయాసపడు కుశాగ్రబుద్ధుల యేవగింపులు, దృక్సూచనలు, గుసగుసలు బాహ్యావినయము, సభ్యవర్తనము, వ్యాజగౌరవము, మున్నగువస్థల ముఖముద్రలందు జిత్రించుటకీ రంగమున నెన్నేని యవకాశముల కలవు. నటులీవిషయమును గుర్తించి వర్తింపవలెను.

## - యుగంధరుడు -

ఏలూరివారిలో ముంజులూరి కృష్ణారావు, తెనాలివారిలో గోవిందరాజుల సుబ్బారావు, మెమోరియల్ తరపున నెల్లూరి నగరాజరావు, యుగంధర వేషమును దాల్చియభినయించిరి. కాకతీయప్రధాని రామేశ్వరం నుండి తిరిగివచ్చునప్పటికే జనార్దనాదులు సామ్రాజ్య సంరక్షణకు వలయునుసాయముల బన్ని పేరిగానిని భద్రపరచి యుంచిరి. విద్యానాధుడు ఆగంతుకముగ గోదావరిలో రాజున్న పడవను చూడలేదనియు, నీతడు జనార్దనుని పంపున రేవులగాపాడ నేగిన నాయకులలో నొకడనియు దోచుచున్నది. భోజనమును తీసుకొని పొమ్మనుటలో జనార్దనునిచే విద్యానాధునకు కర్తవ్య మెరింగించి యుండును. విద్యానాధుడు నిజంగా పరదేశముల నుంచి వింశద్వర్ష సంచారమొనర్చి వచ్చినవాడైతే గుఙ్ఞమును బోల్చడు. ఆభరణాదులవల్ల రాజహాయముగ దలంచినను అది ప్రతాపరుద్రునిదనియు, నాతనికేదో ముప్పువాటిల్లియుండుననియు, నూహించుటయసంభవము. ఆ మాత్రానికి నీటిలో దుమికి పడవనందుకొని, లోని సంగతుల నరయదలచడు. గౌడజోస్య మభ్యసించినవాడైనను, ప్రశ్నముల్లమందున మొలకెత్తినగాని యథార్థము స్ఫురించనేరదు. పడవలో వాక్రుచ్చినట్లు ప్రతాపరుద్రీయ లక్షణకావ్య మారాజునకందించనరుగుచుండినచో చిత్తమారాజు నందేనిలచి సందర్భములు నెమ్మనంబున గోచరించవచ్చును. కాని ప్రస్తుత సందర్భముల బట్టి చిత్తాగ్రతకల్గి వర్తించెనని చెప్పలేము. అందుచేత,

విద్యానాధుడు చకుముకివలె జనార్దన నియుక్తమైన గూఢచారియనియు, నంతకుముందు చేసుకొనిన యేర్పాటు చొప్పున, సభలో నభ్యాగతునివలె బ్రవేసించెననియు తోస్తున్నది. దీని వాస్తవమెట్లున్నను సభాంగణము ప్రవేశించు లోపల నీతడు యుగంధరాది మంత్రివర్గముతో సంప్రదించి యుండును. కాని, రాజు వేటలో దెబ్బతిని రామావధానుల యింట నుండెనను కింవదంతి సభాసదుల కెరుకపడి యోరుగల్లులో వెల్లడియగుటకు యుగంధరుడు విద్యానాధుని క్రొత్తగా నరుదెంచిన మహావిద్వాంసునిగ గారవించి ప్రశ్న చెప్పించి లేఖను దెప్పించి వాని జోస్య ప్రభావమును పేరిగాడు మున్నగు ప్రేక్షకులకు విశదపరచెను. పేరిగాడు రుద్రసింహాసనమధిష్టింప సమ్మతించడు. వెరగొంది వెనుకపడును. కావున, దీనికి యోగముపట్టునను భ్రాంతి కలిగించవలసియుండెను. ఇందుకు యుగంధరుడు విద్యానాధునుపయోగించెను. భక్తి విశ్వాసములు గతానుగతికముగ గలుగును గాన ముందుగా ప్రభుత్వోద్యోగముల గుట్టుమట్టులను బయటబెట్టించి అందుచే పేరిగానికి విద్యానాధునిపై గురికుదిర్చెను. ఈ సందర్భమున గోవిందరాజుల సుబ్బారావుగారు ప్రశంసనీయమగు నటనైపుణ్యమగుపరచిరి. విద్యానాధుని తేరబారజూచుటయు, సోదరుడుగ గ్రహించుటయు, తేజస్విగను, మంత్ర రక్షకుడుగను, జనార్దనునకు దెల్పుటయు తల్లివద్దకు దీసికొని పొమ్మనుటయు, స్వాభావిక రసపటిష్టతతో నిర్వహింపబడినది. విదేశ విద్వాంసుని విద్యాగరిమ నన్వేషించు నుదారదృష్టిని వీరు చక్కగ జూపించిరి. నిజముగ తమ్ముడేయను భ్రాంతిజనించు నట్లభినయించిరి. ఇందున ముంజులూరు క్రిష్ణారావుగారు కూడ నిట్టి యవస్థాపరిజ్ఞానమునే రసస్ఫూర్తినే కనుపరచిరిగాని వీరి నడవడిలో నొకింత తొందరయు ముఖకవలికయందొకింత హాస్యస్ఫురణయు నగుపడెను. సుబ్బారావుగారి సభాప్రవేశము, వర్తనము మిక్కిలి గుంభనగ గాంభీర్యముగ నుండును. లోని కలవరమావంతయేని వెలికుబుక లేదు. అన్ని యోచనలు కడుపులో నిడుముకొని కర్తవ్యమెరింగిన విస్ఫుటమేధావిభూతి నీతడగు పరచెను. నాగరాజరావుగారి యభినయములో దీర్ఘాలోచనము, చింతాక్షుభితమానసము, పనివడిగప్పబడిన భావసంక్షోభము యీ సందర్భమున దెల్లమాయెను. తమ్ముని సంబోధించి "యేలజొరంగ నిచ్చితివి" యీ తురకన్ మనరాజధానిలో నని వితర్కించిన పలుకులు విషాదాత్మకములుగాని, నిగ్రహార్ధకములు కావు.

యుగంధరుడప్పుట్టున తమ్మునిపై ధార్ష్టికమును జూపుట లేదు. తమ్ముని జాగ్రతకు లోన సంతసించుచుండెను. ఈ పట్టున క్రిష్ణారావు స్థానికాధికారుల యజాగ్రత్తనొకింత నధిక్షేపించినపగిది యభినయించెను. సుబ్బారావు నేజెప్పిన యర్థములో జనార్దనుని చూచి చూడనట్లే వాక్యములనుడివిరి. నాగరాజరావు కించిదావతాననంబుతో తిర్యగ్ముఖంబుగ తన్నుదాప్రశ్నించుకొని నట్లగుపడిరి. రంగారంభమున వ్రాసుకొనుచున్నట్లు చూపించిరి. ఇందు నాగరాజరావుగారి మూకాభినయము మిక్కిలి స్వాభావికముగ నుండెను. తొడవులదాల్చుటలో సభానుకూలవర్తనములో నెల్లూరు, తెనాలినటులు సమానసంస్తవ మొందగలరు. క్రిష్ణారావుగారి వేషము, వర్తనము సభారంగమున పైవారితో తులదూగలేదు. వీరి నరములు నిరంతరభావ చాంచల్యమున కనిపించుచుండును. కృష్ణరాయబారములో వీరి చాకచక్య మవసరమగును. రాయబారములో కృష్ణుడు "ననుదూతగ బంపిరి. సంధిసేయ మీ బిడ్డలు బాపలు... పెంపు వహింపగ" అని సంధి పొసగింపవచ్చిన సాధుసంకల్పములు వెలిబుచ్చుకొంటూ, లోపల స్వయంపాక మూహించుతూ, శత్రుకూటములో బరస్పర విరోధములు బురికొల్పి, నల్వురి మనోవృత్తులను గనిపెట్టి, సహస్రాక్షుడై చరింపవలసియుండును. అక్కడ కృష్ణారావుగారి తెలివి తళుకులు నిండారదేజరిల్లుచుండును. కాకతీయ మంత్రికూటమున జూపవలసినది మంత్రగోపనము, యుపాయశీలత, అదురుబెదురు లెరుంగని భావ గాంభీర్యము. ఇవి కృష్ణారావుగారి చురుకునడకలలో విజ్ఞప్రేక్షకామోద సంధాయకంబుగ నగుపడలేదు.

పేరిగాడు యోగము పట్టించుకొనుపట్టున వాని నొక్కసారి పరిశీలింపనరుదెంచి నాగరాజరావుగారు అపూర్వవీక్షణ చాతుర్యముతో నొక చూపు వానిపై బరపుచు రంగస్థలమున వెనుక ప్రక్క నవతరించిరి. వీరి చూపులో పన్నుగడకు సంతసము, పేరిగాని పొంగుపాటునకు నగవు, "కనకపుసింహాసనమున శునకము గూర్చుండ బెట్టి' యను పద్యార్థము, తమరెంత తర్ఫీదు చేసినా రజక ప్రకృతి సమయానికి బయటపడునను పరిణామ వివేకము మిక్కిలి రసవంతముగ స్ఫురించెను. ఈ అభినయ విశేషమును నాగరాజరావొక్కడే చేసి చూపెను. అంతిపురకాంతలకు యుగంధరుడొసగిన సమాశ్వాస వాక్యములను కృష్ణారావుగారు

సందర్భోచిత రసప్రదీప్తితో వెలిగింపజేసిరి. ఈ పట్టున "నేనెట్లు లేకుంటినో చూచెదరుగాక' అను వాక్యముల నసమాన నటసిద్ధియొదప భావిప్రయత్న సూచకంబుగ సుబ్బారావుగారు వెలిబుచ్చిరి. ఈవిచిత్రాభినయవైఖరి శారదాచిత్రమందు ఆంధ్రులకు చిరపరిచితమై యున్నది[39].

పిచ్చిబైరాగి వేషములో సుబ్బారావు సోక్రటీజు మున్నగు జ్ఞానిసత్తములవలె పిచ్చిచేతలకన్న వేదాంత తత్వమెక్కుడు గోచరించునట్లు తమవేషాభినయముల నిర్వహించిరి. వెర్రిచేతలలో వీరతిశయించలేదు. నాగరాజరావు ఢిల్లీ సుల్తాన్ పట్టుకపోతాన్' అనుచు మున్మొదలు బ్రవేశించినప్పుడు మాత్రమద్వితీయాంగిక విన్యాసమగుపరచిరి. తరువాత వీరి నడవడి బాగుండలేదు. వీరిరువురిలో నొకరియందు యుగంధరుడొక జ్ఞానివలెను, మరియొకరి యందు నిక్కంపు దివానావలెనూ గోచరించెను.

ప్రతాపరుద్రుని యోడమీదికి గొనివచ్చువేళ నాగరాజరావు రాజునకందించిన స్మారకవిలోకనమపూర్వాభినయ ప్రజ్ఞావిరాజితంబై సామాజికుల మెప్పువడసినది. ఇచట కృష్ణారావుగారు కూడ నట్టిచూపునకే యింతటి రసవంతముగను చూపిరి.

ఈ నాటకములో యుగంధరుడు నిర్వహించవలసిన యభినయ వ్యవహారము సభారంగమునకన్న ఢిల్లీవల్లకాడులలో నెక్కువ గూర్పబడినది. ఇందు మంత్రివర్యుడు తురుష్కగూఢచారుల నేమార్చుచు వారికి నిక్కంపు దివానావలె నగుపడుచు నిజచారులకు రహస్య సంకేతములందించుచు కర్తవ్యమాదేశించుచూ ద్వంద్వ ప్రవృత్తిలో సంచరింపవలెను. చూచువారికి యోగ సిద్ధుడుగను పిచ్చివానిగను, స్వర్ణవిద్యారహస్యవేత్తగనూ, యెవరి కోర్కెల చొప్పున నెవరి యూహల చొప్పున వారికగుపడు పిచ్చిపాటల కలవరించుచు, తన మంత్రాంగమును కొనసాగించుకొనవలసియున్నది. ఇందుకు తగిన రూపము, నడతలు, చేష్టలు, పలుకు తెరవులు, సర్వతోముఖనైపుణ్యమున సందర్భౌచిత్య

**39. శారద పత్రిక :** శారద మాసపత్రిక బందరు నుంచి వెలువడేది. గోవిందరాజుల సుబ్బారావుగారి వేషం మీద ఫొటోలు ఆ పత్రిక 1924 ఫిబ్రవరి (2 సం.6వ సంచిక)లోను, జూన్ 1924 (3 సం॥ 2వ సంచిక)లోను ప్రచురింపబడ్డాయి.

మతిశయింప కృష్ణారావుగారి వేషాభినయములలో సంపూర్ణ వికాసమనుభవించెను. ఈ నాటకంలో యుగంధరుడు ప్రధాన కార్యవ్యవహర్తకాడు. పిచ్చి రంగపు వుపయోగమును మేము గమనించము కాని కవి రచించిన యర్థములో యితర నటులు వేర్వేరు పట్టుల నతిశయించుచుండ మొత్తము మీద ముంజలూరి కృష్ణారావుగారే యుగంధరాభినయ వివేకమొప్పిన నటసిద్ధుడని మన్నించగలము.

**– ఖుస్రూ –**

చకుముకిది యెంత చురుకు తెలివో, ఖుస్రూది అంత మందబుద్ధి; వీని తెలివితక్కువ, ఆవలింపులు, జేవురింపులు, గాభరాలు, అసూయలు, అతివిశ్వాసము, హ్రస్వదృష్టి మున్నగు లక్షణాలన్నీ తెనాలివారి తంగిరాల ఆంజనేయులు పొలుపార జూపినాడు. మాధవపెద్ది వెంకటరామయ్యగారి[40] స్వరూపం వల్లీ పాత్ర నిరూపణానికెంతో తీరుగనుండింది.

**– పిచ్చివాడు –**

"ఎందుకో ఎక్కడకో పోతాను, మాసంకేతములు గల చారులవలన తరువాతి యోచన నెరుగవలెను. అని చెప్పి యుగంధరుడు ప్రతాపరుద్ర బంధవిముక్తి నేర్పరచుటకు ఢిల్లీ పురంబున కేగును. ఏడు మాసములున్మత్త భూమికను దిరుగుచుండెను. యుగంధరుడువంటి తెలివిగల మంత్రి "వేసిందే ఒకరాయి, పడిందే ఒక పట్టి" అన్నట్టు సరిగా యోచించి ఫలించదగిన పన్నిదమేవేయునుగాని నాలుగయిదు వుపాయాలు ప్రవర్తింపచేయడు. వేసిన పన్నుగడ రత్నాల వర్తకులది. ఇది నెరవేరుటకు సుల్తానును గురించి రెండేసంగతులు తెలియవలెను. అతనికి యేవస్తువులందు ప్రీతిమెండు? అనేది ఒకటి – ఇష్టంకాని వస్తువులయితే మోహపడి చప్పున పడవలోకి రాడు. రెండవది తనపాయాకు సరియైన వర్తకులు, వుమ్రావులు, మున్నగు వారియిండ్లకు సుల్తాను వచ్చునా? రాని వాడైతే ఈ పతకము కుదురదు. అందుకోసము వర్తకపు పన్నిదానికి ఈ రెండు సంగతులెరింగిన చాలును. ఇక రత్నాభరణమూల్య నిర్ణయార్థము

40. **మాధవపెద్ది వెంకటరామయ్య :** జగమెరిగిన నటమూర్ధన్యుడు. తెనాలి రామవిలాససభలో ప్రముఖ నటుడు. పాండవనాటకాలలో దుర్యోధనుడుగా, రోషనారలో శివాజీగా ప్రసిద్ధులు.

ప్రతాపరుద్రుని పిలిపించుట ఆంధ్ర వర్తకులందిడిన సూచనను బట్టి, వారి అదృష్టవశమునను, సుల్తాను తెలివితక్కువచేతను జరిగింది. దీని నిశ్చయమును యుగంధరుడు పరిగణించియుండడు. ఏ వస్తువులిష్టము? నగరి వెడలి యరుదెంచునా? అను రెండు సంగతులు తెలిసికొనుటకు యుగంధరుడేడు మాసములు, దివానాయై తిరుగ పనిలేదు. ఈ మాటలెవరివల్లనైనా యెక్కడ నుండియైనా తెలుసుకోవచ్చును.

"ఢిల్లీ సుల్తాన్ పట్టుక పోతా" అని బహిరంగంగా చాటుతూ, తురుక లవలంబించిన నీచవంచక రీతులలో గాక, బాహాటధీరత్వమున రాజును విడిపించి దెచ్చెదనని యీ పని చేసెనా? తుదకు బంధవిముక్తి రత్నవిక్రేతల వంచక ప్రవృత్తి వల్ల గలిగింది. ఇందు ధీరోన్ముఖత్వమేమి అగుపడదు. దివానాబింకాలకునూ వర్తకుల వ్యవహారానికినీ సంబంధం లేదు; కార్యకారణ సందర్భం లేదు. అదికాక కాకతీయమహీధవుడు బంధితుడై, తమపురంబున నుండుటజేసి సుల్తాను నౌకరు లతిజాగ్రత్తతో విదేశీయుల నరయుచుందురు. ఈ సంగతి యుగంధరుడెరుగును. ప్రమాదభూయిష్టములు అనుమానాస్పదములైన దారుల నీ మంత్రిపుంగవు డవలంబించునా?

రాజు నిజసామ్రాజ్య విభూతినంతయు వదలి, మ్లేచ్ఛాధీనమున జిక్కి వంతల గుందుచుండెనని తానును రాజువలె నిజోద్యోగ వైభవంబును వదలి, నిద్రాహారముల వర్జించి, స్వామి భక్తి పరాయణత్వమున, తన తమ్ముని యజాగ్రత్తచే 'ఏలచొరంగనిచ్చితివి యీ తురకన్ మన రాజధానిలో' నింతటి ప్రమాదము ప్రభువనకు వాటిల్లెనను పశ్చాత్తాపముచే యుగంధరుడు పిచ్చి బిచ్చగాని రూపున రాజున కత్యంత సాన్నిధ్యమున దిరుగుచుండవచ్చును. అనగా రాజుమీది ప్రేమచేత రాజున్న తావున రాజువలె తానును దీనదశలో గాలము గడుపదలచి యుండవచ్చును. లేక, తమ్ముని యేమరపాటునకు ప్రాయశ్చిత్త తపంబొనరించు చుండవచ్చును. పడవలోనికి ప్రతాపరుద్రుడు రాగానే తానగుపడి యింత ఘనకార్యమును నేను చేసినానని వెల్లడించుకొను నపేక్షయు; నందుకాతని కృతజ్ఞతాభినందనముల నందికొను వేడుకయు యుగంధరునివంటి ధీమంతున కుండవు. గంగాయమున తటంబుల కాకతి సైన్యములను, కటకవీరులను, నిలపి

యోడను గాచు నేర్పాటుల గావించుటకు యుగంధరుడు ఢిల్లీలో నుండనవసరము లేదు.

జోస్సులుభాయి అదివరకే తురకలలో కలసి ఢిల్లీలో తురకసర్దారుల స్నేహవిశ్వాసము లనుభవించుతూ తిరుగుతూనేవున్నాడు. ఇట్టి సందర్భంలో తెలియవలసిన సంగతులల్పమై పన్నవలసిన యెత్తు లతిసులభమై యుండునపుడు ఫలానుచితంబగు దీర్ఘోపాయముల యుగంధరుడవలంబించునని నమ్మనేరము. పిచ్చివాని వేషమా యమాత్యశేఖరుని నీతి వైశద్యమగుపరచనేరదు. పైగా మంత్రభంగమున కవకాశమొదవవచ్చును. ఎప్పటికప్పుడు జారీచేయవలసిన జరూర్ హుకుములునూ కనపించవు. కొంతదూరాన వుండి చారులవల్ల తంత్రము నడిపించవచ్చును.

ముద్రారాక్షసములో రాక్షసామాత్యుడు నిజప్రతిభా వైభవంబున "మౌర్యసైన్యంబు చాణక్యమతిని గూడ" నాయాస పెట్టుచుండెను. అచ్చట నాయకుడు, ప్రతినాయకుడు, మహాధీమంతులు. కౌటిల్య మొకప్రక్కను సద్గుణ గణాలంకృతంబగు బుద్ధిచాతుర్యమొకప్రక్కను, యెత్తుపై యెత్తులతో బోర్లపడుచుండెను. ఇచ్చట నమేయమేధా విభవోన్నతులగు బ్రాహ్మణామాత్యులు – సారాయి భంగు నిషాలతో, వెలయాలి కౌగిలింతలలో, మైమరచి యావలించెడి తురుష్క ప్రభువుల నేమార్చి, స్వకార్యమును సాధింప వలసియున్నది. ఈ పనికి యుగంధరుడు పిచ్చివాని వేషము ధరింపవలసిన యగత్యమగుపడదు. ఇది పేరిగాని రంగముల వలెనే కొంత దృశ్యచమత్కారములను గల్పించి చూడవినోదముగ నగుపడినను, కథాసంవింధానములో నిరుపయోగముగను, బలహీనముగను, వెకిలిగను స్ఫురించకమానదు. యుగంధరుడు పాడిన పాటలలో ద్వ్యర్థిసూచనలు ధ్వనించుచుండిన యెడల కొంత బాగుండెడిది. పిచ్చివాని జూడవచ్చిన ఢిల్లీ సోమరుల కొకరీతిగను, నిజవృత్తాంత మెరింగిన కాకతీయ గూఢచారుల కొకరీతిగను, రెండర్థములు స్ఫురించు పలుకుటల్లికలతో నాపాటలు గల్పింపబడిన కొంత సమంజసముగ నుండెడిది. కాని యివి యంతగ కనుపించవు. ఇట్లాంటి కారణాలన్నిటిచేతా పిచ్చివాడి పార్టు వ్యర్థంగా తోస్తుంది. అనగా కథాంశ నిర్వహణానికి నిరుపయోగమని నా అభిప్రాయము. హాస్యవినోదంగా యెంచుకుంటే

తకరరు లేదు. కథా సందర్భానిపట్టి పిచ్చివేషమే అవసరం లేదనవలసి వస్తుంది. కనుక దాన్ని ఎట్లా అభినయించాలో నిర్ణయించనేరము.

**- ముద్దుటుంగరము : విద్యానాథతంత్రము -**

ముద్రారాక్షసములో కథాదియందు పాములవాడు చందనదాసు నింటికడ నాడుకొనుచుండిన రాక్షసతనూజుని వినోదపరిచి రాక్షసుని ముద్దుటుంగరము సంపాదించిన సంగతి ప్రకటింపబడినది. ముద్రాసాధనమున చాణుక్యుడొక లేఖను సృష్టించి దాని మూలమున రాక్షసునకును, మలయకేతునకును, మనస్పర్థ లేర్పరచెను. రాక్షసుడు నందు లంతరించినను, క్షత్రియుడెవ్వరైన మగధసామ్రాజ్య మధిష్టింపవలయునను పూనికతో మలయకేతును జేరదీసెను. మంగలివాడైన - చంద్రగుప్తుని నందస్థానమాక్రమింప నీయకూడదనియు, నుత్తమక్షాత్రకుల సంభూతు నాపదవియందుంచవలెననియు మంత్రి రాక్షసుడాపేక్షపడి యందుకైపాటు పడుచుండెను. ముద్రారాక్షసనాటకపు ఆధికారిక వృత్తాంతము రాక్షసుని చంద్రగుప్తరాజ్యధూర్వహునిగావించుటయైనను, యిది చందనదాసు మరణశిక్షను తప్పించు నవసరంబున సాధింపబడినను దీనికి ముఖ్యాంగము రాక్షసుని క్షత్రియ పక్షపాత నిర్మూలనమాయెను. ఇందుకు ముద్దుటుంగరము తోడ్పడినది. ప్రతాపరుద్రీయములో ముద్రాసంగ్రహణము ప్రధాన సమస్య సాధనమున కుపయోగించలేదు.

**- విశేషాంశములు -**

ఈ నాటకంలో రాజనీతి సామాన్యనీతి మర్యాదలతో మేళవించబడ్డది. ముద్రారాక్షసంలో కుటిలో పాయతరంగములు చెలియలి కట్టలను దాటి దుముకుచుండును. నందవిధ్వంసి, తక్కిరి దొంగల వెంటగొని, గడుసరిచేతల నతిశయించి సద్గుణగణాలంకృతుండగు రాక్షసామాత్యునిమాయా ప్రచారమున నోడించి మంగలి దొరకు మగధ సింహాసనమిప్పించెను. అందుకు కూడ స్వాభిమానసంజనితమగు నందద్వేషమే కారణము. కాకతీయ పురోహితులు నిస్స్వార్థమైన ప్రభుభక్తితో తామవలంబించిన ప్రచార మెరుగనేర్చిన వాదికెరుకపడునట్లు, అహింసాసత్యదీక్షలు వాసిదప్పనటుల, జక్కని నేర్పుతో

నడిపించుకొని వచ్చిరి. ఇదంతా వాళ్ళు చేసారో లేదో? వారి కారోపించబడ్డ తెలివంతా శాస్త్రిగారి ప్రతిభాసంజనితమేగదా! చకుముకి యుగంధరాదు లెక్కడివారు? తెలుగు జాన్సను పుర్రెలోనంకురించిన ప్రజ్ఞాప్రసూనములే?

సామాన్యంగా యీనాటి చరిత్ర నాటకాలలో విషాద పరిణామ మేర్పడుతున్నది. నాయకదుర్మరణము, అంతిపురమచ్చకంటుల సహగమనము, వంశవినాశనము, నగరోన్మూలనము, సామ్రాజ్య విచ్ఛేదనము మొదలగు జాతీయపరాభవప్రాప్తిని సూచించకుండ, రాజును చెరగొనిన తురక సర్దారు లిరువురనే జంపించి, కోశక్షయముగాకుండ, సైన్యవిదారణ మేర్పడకుండ, ధర్మభ్రంశమెుదవకుండ, శతృభూపాలునకు సైతమాంధ్రామాత్యకార్య నైపుణ్యమందమేయగౌరవ మేర్పడునట్లుగా నీతిమై వర్తించి, రాజును వదలించి, రాజ్యధరారమణుల వియోగభార మవలీలగా మాపి, కాకతిప్రాభవమష్ట దిగంతరాళముల వెలుగింప, నంజనాసుత గిరీవిజయతోరణాలంకార వైచిత్ర్యమందాంధ్ర శిల్పక నైపుణ్యమతిశయిల్ల, నాబాలగోపాల మఖిలసద్ర్వజములా నందమున మున్గి నతిశయిల్ల, కళ్యాణాంతముగ, సరసముగ, దుష్కరసమస్యల జిక్కుదీసిన, నీతిసత్తములు, స్వార్థదూరులు, ప్రభుసేవా పరాయణులు, సద్గుణమహోదధులు, పరమదేశాభిమానులునగు నమాత్యశేఖరుల జిత్రించి వెంకటరాయశాస్త్రియమేయ నాట్యకవితా నైపుణ్య మగుపరచియున్నాడు.

ప్రతాపరుద్రీయము మొత్తముమీద మిక్కిలి మనోహరమై, ప్రదర్శ నానుకూలమై, విచిత్రాపూర్వ రమ్యదృశ్యంబుల నొనగూర్చుచు, నసాధారణ ప్రతిభాసంకలితంబుగ నెంచదగియున్నది. దీనిలోని కల్పనలోపములను కార్యైక్య విహీనతను, స్వభావేతర మానస ప్రవృత్తులను, విమర్శనవశంబున నుచితరీతి మన్నించియున్నాను. వెంకటరాయశాస్త్రి గారి ప్రతిభావిశేషము చారిత్రరూపకము నుద్దేశించి యాంధ్రచరిత్రలోని కథాంశమును గైకొనుటలోనే వెల్లడియగుచున్నది. వీరీ నాటకమును వ్రాయునాటికి భారతీయుల జాతీయోద్యమ శంఖారవములు మాతృమానసమందైనబులకరించి యుండలేదు. వందేమాతర గీతికాస్రవంతి 'యానందమఠ' పుఠంబులో నజ్ఞాతసంచార మొనర్చుచుండెను. లోకమంతకు కాకవెట్టిన కాకతీయుల కదనపాండితి చీకిపోవని చేవ మాటల చేర్చి పాడవె

తుమ్మెదా!" యను పరాకుకూత లాంధ్రుల వీను తెరవుల జేరియుండలేదు. ఆంధ్రచరిత్రాంశములు కవిజీవిత ప్రస్తావనములందును చెన్నైతంజాపురంబుల తాటాకుకవెళులందును మరుగుపడి చూచువారును, వినువారు లేక జిక్కియుండెను. అట్టికాలములో నాంధ్ర సామ్రాజ్య సంపోషకుల వీరోదార చరితముల నుగ్గడింపసమకట్టి ప్రతాపరుద్రీయ రూపకరత్నమును గల్పింపనేర్చిన, మేటిమతి, మాతృవైభవసంతోషి, వీరజనార్చకుడు, సింహపురీమహోపాధ్యాయుడేయని తమ దివ్యచిత్తమున కెరుకపరచుకొను విద్వద్విధేయుడు,

**సత్కలారసపిపాసి**

**సూరిశాస్త్రి**



**"విద్యానిలయము" - సూరిశాస్త్రిగారి స్వగృహము**

# షోరబు : రుస్తుము[41]

అరిభయంకరా! కరుణానిధే!

బందరులో రామవిలాససభ[42] వారు షోరబు–రుస్తుముల అజ్ఞాత విరోధాన్ని, సమరసందర్భాన్ని తెలిపే నాటకమాడారు. ఇంగ్లీషు కవిమౌళి మాథ్యూఅర్నాల్డు రచించిన పద్యకావ్యాన్ని ఆధారపరచుకొని ద్విజేంద్రలాలురాయి[43] బెంగాలీ భాషలో ఈ నాటకాన్ని వ్రాసారట. దీన్ని శ్రీపాద కామేశ్వరరావుగారు[44] తెనిగించారట. అర్నాల్డు, పారసీకకవి ఫర్దూసీ రచించిన షానమా అను మహాకావ్యము నుంచి ఈ కథావృత్తాంతాన్ని యేరుకొని తన కావ్యమేర్పరచాడు. ఆనాటి పారశీక వీరమర్యాదలు, తార్టారుబుద్ధులు, యెట్లుండెనో, మనము, మన

---

**41. షోరాబు - రుస్తుం** : ఫిరదౌసి పారశీక భాషలో రాసిన షానామాలోని ఒక భాగం ఆధారంగా మాథ్యూ ఆర్నాల్డ్ 'దిలైట్ ఆఫ్ ఏషియా' అనే పద్యకావ్యం రాశాడు. దాని ఆధారంగా ద్విజేంద్రలాల్ రాయ్ రాసిన నాటకానికి శ్రీపాద కామేశ్వరరావుగారి తెనిగింపు.

**42. రామవిలాససభ** : తెనాలిలో భాగవతుల రాజగోపాలం గారి నేతృత్వంలోను, త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారి దేశికత్వంలోను ప్రఖ్యాతికి వచ్చిన నాటక సంస్థ. అనేక ప్రముఖ నటులకు మాతృ సంస్థ.

**43. ద్విజేంద్రలాల్‌రాయ్** : ప్రఖ్యాత బెంగాలీ నాటక కర్త. ఈయన చారిత్రక నాటకాలు భారతదేశంలోని అన్ని భాషలలోకి అనువదించబడినట్లుగానే తెలుగులోనికి కూడా అనువదించబడి ప్రఖ్యాతిగాంచాయి.

**44. శ్రీపాద కామేశ్వరరావు** : భారతీయ భాషా నాటకాలను తెలుగువారికి పరిచయం చేసిన అనువాదకుడు, నాటక విమర్శకుడు, దర్శకుడు. రాజమండ్రి అమెచూర్స్ సంస్థను ప్రారంభించారు. ద్విజేంద్రలాల్‌రాయ్ నాటకాలనే కాక ఆయన రాసిన "నాటక విమర్శ"ను కూడా తెలుగులోకి అనువదించారు.

సంప్రదాయాలతో యీ కాలంలో గ్రహించలేము. కాని, యిది మనదేశపు అభిప్రాయాలకేకాక పాశ్చాత్య నాటకకవుల ఆచారాలకు కూడ భిన్నంగా వున్నదని మాత్రము చెప్పగలము. తండ్రికొడుకుల పోరుగల్గుట, అందు నొకనిచే నొకని సమయించుట, నాటకకవులంగీకరించిన పద్ధతి కాదు. యూరిపిడీస్[45] నాటకాలొకదానిలో మాత్రము కొడుకు తెలియక తండ్రిని చంపిన యుదంత మగుపడుచున్నది. సామాన్యంగా తండ్రికొడుకులు అపరిచితులైనను యొండొరుల సమీపించినపుడు "అనేన కస్యాపి కులాంకురేణ స్పృష్టస్య గాత్రేషుసుఖం మమైవ" అనునట్లు ఒకవిధమైన గగుర్పాటు, సందడింపు, గందరగోళము పుట్టి యంతటిలో నొకరినొకరు తెలిసికొనుటకుగాని మారకప్రయత్నమంతరించుటగాని కవిసమ్మతమైన పద్ధతిగా నుండినది. పాండవాశ్వమేధంలో ప్రమీళాతనుజుడు బభ్రువాహనుడు తండ్రియగు విజయునెదుర్కొని చంపినట్లును, ఆవల దేవగణంబుల సాయమున నర్జుననిశిరము మొండెమున కతుకుపడి యాతడు తెప్పరిల్లినట్లును నొక కథ గలదు. ఇందు పుత్రుడు తండ్రికన్న బలపరాక్రమ సమన్వితుడుగ చిత్రింపబడియున్నాడు. కుశలవుల చరిత్రములో (ఉత్తర రామాయణము, రాఘవాశ్వమేధము, లవకుశ మొదలైన నాటకాలలో) కుశలవులు పినతండ్రులాదిగాగల యోధవరుల నోడించి, తండ్రిని దాకవచ్చిన వృత్తాంత మగుపడును. అందు పుత్రుల వీరసామర్థ్యము బేలపడకుండ, రాముని జగదేకవీర బిరుదమునకు భంగము వాటిల్లకుండ, రామసంకల్పాను కూలంబుగ సర్వారిసాధన సమర్థమగు రామబాణము పూలమాలయై తనయుల గళ ప్రాంతముల గారవించి యుద్ధతవీర మర్యాదల నందించెను. "పుత్రాదిచ్ఛేత్ పరాజయం" – తండ్రుల మర్యాదలు, తెలివితేటలు, శౌర్యప్రతాపములు, కొమరులయందు మిక్కుటముగ బెంపొంది నవ్యకాలోచిత వైఖరుల దాల్చి దేశకాల పరిస్థితుల కనుకూలముగ వికసించి, యగుపడుటయే లోకస్థితికిని, సృష్టిప్రచారమునకును కారణమగుచున్నది, నవ్యసంతతులు, ప్రాచీనప్రతిష్టాపనల సంప్రదాయబలముచే వాసికెక్కియు వానిని అంతరింపజేసి, క్రొత్త పరిస్థితుల కనుకూలమైన నవ్యరూపములతో, నూతన

**45. యురిపిడీస్ :** ప్రఖ్యాత గ్రీకు నాటక కర్త. ఎస్కిలస్, సాఫోక్లిస్‌ల తరువాత కాలంలో నాటకాలు వ్రాసినవాడు. 'మెడియా' ఆయన ప్రఖ్యాత నాటకం.

మర్యాదలతో, నవోన్మిళిత పాటవంబున విగతధీరుల పదవినాక్రమించి లోకవ్యవహారమును సాగించుచుందురు. 'The old order changeth yielding place to new. Lest one good custom should corrupt the world' అని మిల్టను[46] తత్వజ్ఞుడుపదేశించినట్లున్నూ "వాసాంసిజీర్ణాని యథావిహాయ నవానిగృహ్ణాతి సరోపరాణి" అని శ్రీకృష్ణభగవాను డానతిచ్చినట్లున్నూ, జీవవాహిని, యెప్పటికప్పుడు బలవయస్సంపన్నమగు నవ్యదేహముల నాశ్రయించి సృష్టి ప్రచారమును నిరంతరాయముగ సాగించుచూ, ప్రాచీన జీర్ణాశ్రయముల వదలుచుండును. ఇది ప్రకృతిధర్మము; లోకస్థితికి కారణము; దీనిననుసరించియే కవి నియమము లేర్పడ్డవి. కళాన్యాయము లమర్పబడ్డవి. రాముడు రాగానే పరశురాముని ప్రభావ మస్తమించినది. బౌద్ధావతార ముదయించినంతనే శ్రీకృష్ణవ్యాస భట్టారకాదులచే నిరూపింపబడిన మత నియమములు వాసిదప్పినవి. కుశలవులు రామునిమించు పరాక్రమ సంపన్నులగుట ధర్మసిద్ధము, ప్రకృతి సమ్మతము, న్యాయానుసరణము. అర్జునుడు తనయునిచే మడయుటకూడ లోకవ్యవహార సూత్రములను దర్శించునదై యున్నది. రుస్తుము, షోరబు చేతిలో చచ్చిగాని, విజితుడైగాని, తన వీరవ్రతమును పుత్రునకందించి, దిగ్విజయము కన్న నుత్కృష్టమగు నాత్మవిజయమును అపేక్షించి, అధ్యాత్మిక సాధనపై తన మనోనిశ్చయమును వ్యాపిపంజేసిన యెడల కథాసరళి బాగుండెడిది. షోరబు రుస్తుముచే జచ్చుట లోకవిరుద్ధము, ధర్మదూరము, అస్వాభావికము, అన్యాయము. అదికాక పోరులో వలసి మూర్ఛిల్లిన ప్రతివీరుని పొడిచి చంపుట వీరధర్మమునకు విరుద్ధముగనున్నది. రుస్తుము యావజ్జీవము ఉదారగుణసంపన్నుడై ధర్మరక్షకుడై సత్యవ్రతుండై యుండియు, ముక్కాళ్ళముదిమిలో తన చిరాభ్యస్త సద్ధర్మముల విడనాడి దయావిహీనుడై సత్యభ్రంశుడై చరించుట యావీరుని చరితమున కెన్నటికిని మాయని మాసిక నేర్పరచుచున్నది. ఈ కారణములన్నిటిచేతను, పతాను మర్యాదలు హిందూ సభ్యులకపరిచితములగుటచేతను, ఈ నాటకము మొదటి నుండి తుదిదాక క్రూర భీభత్స భయానక భరితమై, నసహ్యాముగ నుండును.

46. **The old order changeth yielding place to new...** ఇది మిల్టన్ చెప్పిన మాట కాదు. టెన్నిసన్ రాసిన 'మార్ట్ డి ఆర్థర్' అనే పద్యంలోని ప్రఖ్యాత పాదం. చూ. లార్డ్ టెన్నీసన్ రాసిన 'మార్ట్ డి ఆర్థర్'లో 407వ లైను.

ఇందులో కలానియమమగు రత్యుదయము, ఆనందము పులకరించలేదు. విషాదనాటకాలకు ముఖ్యనియమమైన యుత్తమ విషయ సంరక్షణము, ఇందలి పోరునకు కారణము కాలేదు. రుస్తుము బాల్యాది తాను గెలిచిన శతసమర విజయములకు సంతృప్తినొందక బలాహంకారచోదితుడై యాత్మ ప్రాగల్భ్యము కొరకునూ పరౌత్కృష్ట్య మొప్పుకొనజాలకనూ, దీంద్రించిన నీచాహంకారప్రవృత్తు లగుపడునేకాని వేరొండు ఉదారసంకల్పము లీతని చర్యలందగుపడవు. సభ్యులకు రుస్తుము చర్యలందు జాలి గౌరవము కలుగలేదు. షోరబు చర్యలందు దోషమగుపడలేదు. ఇట్టి సంవిధానంలో షోరబు దుర్మరణమొందుట కావ్య న్యాయమును సంపాదించలేదు. అందుచే యీ నాటకము నిజమైన విషాద నాటకము కాదనిన్నీ క్రూర భీభత్స భరితమనిన్నీ ఆడచెల్లదనిన్నీ మనవి చేసుకొంటున్నాను. ఇందున గల్గు నీతిబోధయు కానరాదు. పరతత్వ ప్రభావ సూచకంబగు సందర్భము లేమీ లేవు.

పారసీక భీమసేనుడగు రుస్తుము, అడేరుబైజాను దేశపు అడవులలో వేటాడబోయి, యలసి, యొకచెట్టుక్రింద నిదురించుచుండ, నాదేశపు వీరు లీతని గుర్తించి, తమ రాజువద్దకు గొంపోయి సకలాతిథిత్యమర్యాదలనొసంగిరి. అచ్చట నుండు కాలములో సమాన్గానురాకొమర్తె టేమినే యను నాపె రుస్తుమును వరించి యాతని పొందు ననుభవించెను. ఇంతలో రుస్తుము కార్యాంతరములచేతను, సమరోత్సాహముచేతను, అత్తవారింట మర్లుగుడిచెడి సోమరిబ్రతుకునందు సంతసింపకనూ, విజయాభిలాషియై వెడల సమకట్టెను. అప్పటికి టేమినే గర్భివతియై యుండెను. పురుషుడుదయించిన యెడల కబురంపవలసినదనియు, తాను వచ్చి తీసుకొని పోయెదననియు పుత్రిక గల్గెనేని తనకు అవసరము లేదనియు చెప్పి ప్రణయ స్మారకంబుగ తన కవచమును టేమినే కొసంగి, సమరారంభదీక్షితుడై రుస్తుము దేశాంతరంబుల దిరుగవెడలెను.

షోరబు పుట్టి యిరువది సంవత్సరములైనది. పుత్రుని గొంపోవునను తలంపున టేమినే భర్తృ వియోగ మత్యంతముగ పీడించుచున్నను, పుత్రోదయ వృత్తాంతమా బాటుసింగమున కెరుకపరచకుండెను. ఈమెకు రుస్తుముతోడి శస్త్రోపజీవన వ్యాపార మొనర్చుచు ద్రిమ్మరుట కిష్టము లేదు. తండ్రి యింట

సుఖముగా కొమరుని చూచుకొనుచు, రాజ్యోపభోగముల ప్రశాంతముగ ననుభవించుచు, నుండదలచెడి బుద్ధి ఈమెది. షోరబు శస్త్రవిద్యల జక్కగ గరచి, బలరూప ప్రతాప ప్రభావమున తండ్రి జతయై మెలగుచుండెను. తన తండ్రి పేరు చెప్పుమని పలుమారు వేడగా తుదకామె జరిగిన వృత్తాంతమును పుత్రునకెరింగించెను. అందుమీద షోరబు తల్లి యనుమతి వడసి, స్మార కవచమును గైకొని, తండ్రి తెరవరయుచు, తండ్రికి తన వీర్యస్థైర్యముల నెరుకపరచదలచి పయనమాయెను.

పోవుదారిలో షోరబు ఒక రాజుకోటను ముట్టడించనెంచును. ఆ రాజునకు అఫ్రీద్ అను కుమార్తె కలదు. హజీర్ అను సేనాపతి ఈ కోటను గాపాడుచు, అఫ్రీదును వలచి, పరిణయింప జూచుచుండెను. కాని అఫ్రీదు హజీరును ప్రేమించలేదు. ఇంతలో షోరబు దాడివచ్చిన సందర్భ మేర్పడ్డది. హజీరు శత్రు సైన్యమునకు గుట్టందించి కసిదీర్చుకొన యోచించుచుండెను. ఒకనాడాకోట పరసరంబుల షోరబు ఒంటరిగా తిరుగుచుండ నొక యువకుడు వచ్చి 'నీవేనా షోరబు' అని యడిగి, తనతో జంట పోరునకు రమ్మని సవాలుచేసి కత్తి దూసెను. షోరబు యువకుని దెబ్బ తప్పించుకొని మరల తన కరవాలమును విసర, నది యువకుని శిరముపై దగిలి, ముఖాచ్ఛాదనమును తొలగించి, నవవయోవిలాసిని యగు యువతీ ముఖాంబుజమును తేటపరచెను. అందుపై షోరబు ఆ వనిత సాహసమును మెచ్చుకొని వలపుపలకు లందించి, తన్ను పరిణయింప వేడును. అఫ్రీదు కూడ తన మోహమును తెలుపుకొని తండ్రి యనుమతి వడసి పెండ్లాడెదనని చెప్పి పోవును.

ఇంతలో హజీరు షోరబు శిబిరముజేరి, హెచ్చరించి, మరుగుదారుల జూపి, నిశీథసమయమున కోటను దొమ్మిజేసి, లోన బ్రవేశపెట్టును. కోటనాక్రమించెడి సందడిలో షోరబు పొరపాటున నజ్ఞాతవశమున అఫ్రీదు తండ్రిని పొడిచివైచును. ఈ సంగతులన్నీ తెలిసికొని యావీరకుమారి, రాజద్రోహమునకు హజీరును, తండ్రిని జంపినందుకు షోరబును, చావజూచి తాను దుష్ప్రణయ పరిణామముగా బొడుచుకొని చచ్చెదనని ప్రతినకట్టును. కట్టి, పైకి షోరబు చెలిమి నటించుచు, వాని శిబిరములను మరియొక రాజుపై బుత్తెంచును. షోరబు రుస్తుము

కుమారుడనిన్నీ, రుస్తుమును గలియవచ్చెననిన్నీ, రుస్తుము ఆ రాజు సైన్యములో నుండెననిన్నీ, అఫ్రీదెరుంగును. ఈ సంగతి హజీరుకు కూడ తెలుసును. కాని, రుస్తుము చేత షోరబును చావనిచ్చి, యాఫ్రీదును తానే పెండ్లాడవలెనని హజీరనుకొనుచుండెను. ఆఫ్రీదు హజీరులు, షోరబునకీ సంగతి తెలియనీయక పారసీక శిబిరముల జూపునపుడు సయితము రుస్తుము అచ్చట లేడను భ్రాంతి గలిగించిరి. ఆ ఉభయ సైన్యములు సమరాభిముఖులై నిలువగానే షోరబు తన్ను డీకొనజాలు ప్రతివీరులెవరైన నుండిన యెడల జంటపోరుకు రాజెల్లునని సవాలు చేయును. బహుశా హజీరు మొదట కలవరంలో ప్రగ్గెననుకుంటున్నాను. సవాలందికొని రుస్తుము–సేనాని యయ్యును, నిజోద్యోగలాంఛనంబుల వీడి, ప్రచ్ఛన్న వేషమున వొంటియై షోరబును మార్కొనవచ్చును. షోరబు నీ పేరు చెప్పమని యెన్ని విధములనో బ్రతిమాలుకొనును, రుస్తుము చెప్పడు. చెప్పక కయ్యము మానుమని పిరికి పలుకుల నుపదేశించును. షోరబు వినడు. ద్వంద్వ యుద్ధము భయభీకరముగ రెండు దినములు జరిగెను. రుస్తుము నేలగూలెను, అప్పటి సమరాచారము లనుసరించి షోరబు పతిత వీరుని పొడువ బోవ రుస్తుము రేపు మరల పోరాడెదమని చెప్పెను. మూడవనాటి కయ్యము మరింత హెచ్చరికతో జరిగి పర్యవసానమున రుస్తుము వ్రేలాడు సూచనలగుపడుచుండ, నాఫ్రీదు యావలి ప్రక్క నుండి బలే రుస్తుము అని కేక వైచును. షోరబు వులికిపడి తిరిగి చూచును. ఇదే సమయమని రుస్తుమా యువకుని పొడిచి నేలద్రోయును. 'ఇప్పటికైనా పరాజయమొప్పుకొను' మని రుస్తుము దబాయించెనుగాని, 'రుస్తుము తప్ప నన్నోడించగల ప్రతివీరుడీ పుడమిలో గానరాడ'ని షోరబు గర్జించుచుండెను. అందుమీద రుస్తుము యోధబాలుని మర్మంబు లదరబొడిచి వైచెను. మరణాయాసములో తల్లితండ్రుల పేరెత్తి కలవరించుచు షోరబు తన నిజస్థితి నెరింగించుకొనును. రుస్తుము కూడ తన సంగతి చెప్పుకొని కవచనిదర్శనంబున నిక్కముగా తాను పొడిచినది తన్ను అన్వేషించవచ్చిన పితృ పూజారతుండగు నిజతనూజుడని గుర్తించి, నిర్విణ్ణుడై, పొడుచుకొనెను. ఇవ్విధమున పారశీక వీరమార్తాండుడస్తమించెను. ఇదే ఈ నాటకపు కథ.

తెనాలి రామవిలాససభవారి ప్రదర్శనములో మాధవపెద్ది

వెంకట్రామయ్యగారు రుస్తుము, స్థానం నరసింహరావు గారు టామినే, యేలేశ్వరపు కుటుంబశాస్త్రిగారు షోరబు, గోరంట్ల కేశవరాజు ఆఫ్రీదు, పులిపాక వెంకటేశ్వర్లుగారు హజీరుగ నగుపడి తక్కుంగల సహకార నట సామంజస్యముతో పొలుపార నభినయించిరి. క్రొత్త ఆట మొదటిసారి చూచుటవల్ల, చూచి చాలకాలమైనందువల్ల, అందే సందర్భాలందు ఎవరెట్లు అభినయించిరో యే పాత్రానికెవరే యర్థ వ్యాఖ్యాన మొనర్చిరో విప్పుగ చెప్పజాలను. కాని మాధవపెద్ది వెంకట్రామయ్యగారు, 'ఆత్మధర్మక్షమందేహంక్షాత్రో ధర్మ ఇవాశ్రితః" అన్నట్లు, రూపమందు, కాయపుష్టియందు, సమర భీకరాకారమందు, ధైర్యోన్నతులందు, రుస్తుము వేషానికి మిక్కిలి తగియుండిరని చెప్పవచ్చును. ప్రథమ ప్రవేశంలో ఆ మహావీరుని బలోద్ధతిని, తుదిరంగమందు వయః ప్రాప్తిచే నస్తమించుచుండిన శక్తులను, చక్కగ ముద్రించి చూపిరి. ముసలితనమువల్ల బలపరాక్రమములు పటిమదప్పుటయేగాక, (ప్రొద్దుగ్రుంకెడివేళ సూర్యబింబము మధ్యాహ్న నిర్మలరజతదీధితుల వేడి వెలుగుల గోల్పడి రాగకలుషితంబై యగుపడినట్లు) విశుద్ధనైతిక నియమములు కూడ వీడి జరాజీర్ణమై చల్లపడి, రాగద్వేషమాలిన్య మనుభవించి యుండును. పడుచుతనములో నుండెడి దేహబల మగుపడదు సరిగదా! ముసిలివారల నీతిసత్వములు, ధైర్యస్థైర్యములు చివరకు, భక్తి, పరచింత, మున్నగు మనోవృత్తులు కూడ దేహపటుత్వముతో బాటు జీర్ణించి, యస్తమించుట లోకవిదితమే. "అనాకృష్టస్య విషయైః విద్యా నాంపారదృశ్యసః తస్యధర్మరతే రాసీత్ వృద్ధత్వంజరపావినా." దేహాద్యభిమానములు లేని పరచింతాపరుల దేహము జరా జీర్ణమయ్యును, వారి మానస ప్రవృత్తులు నిండు బలమున దేజరిల్లు చుండును. ఇది భీష్మ, దిలీపాదులపట్ల రుజవగు సంగతి. రుస్తుము లౌకికపద గౌరవాతిశయముల గారవించెడి యహంకార ప్రవృత్తి, ఈతని ముసలితనము, ధృతరాష్ట్రుడి వలె, 'మాటకూడ నాకు గుడ్డిదయ్యె' అనునట్లు దేహమును మనస్సును, ఆత్మను అన్నిటిని, క్రుంగదీయున దాయెను. ఈ స్థితిని గురించియు, అస్తమిత ప్రభావముగల మహాపురుషులందు, (యింగువకట్టిన గుడ్డ కొంగుకు పట్టియుండెడి సౌరభమువలె, సూర్యాస్తమయాంతమున గగనసీమల వెలిగించు నుజ్వలరాగవల్లరివలె) నిలిచియుండు, పూర్వప్రతాపసంస్ఫురణముల నెరింగియు,

వెంకట్రామయ్యగారు చివరపట్టులో రుస్తుము స్వభావాన్ని నేర్పొప్ప నభినయించి చూపారు. కన్యాశుల్కంలో కరటకశాస్త్రి శిష్యుడై కన్యక వేషమును దాల్చి రాజు మంచి తెలివితేటలను చూపించెను; షోరబు రుస్తుములో అఫ్రీదు రాకొమరితె రూపుదాల్చి యత్యంత మనోహరంబుగ వర్తించెను. గోరంట్ల కేశవరాజు కడుంగడు చాకచక్యము గలవాడు. ఈతని యాఫ్రీదు వేషానికి చాలా సంతోషించినాము. కాని మరుపు తగిలినందున వివరముగా వర్ణించలేము. షోరబు వేషము ధరించిన కుటుంబశాస్త్రి గారు వలసినదానికన్న నెక్కువ సాధుత్వ మగుపఱచిరి. ఇందు, వెంకటేశ్వర్లుగారు హజీర్ భూమికను వహించిరి. కథాంశము రమ్యమైనదే కాని, కవిపోషణ రసవంతమే కాని, భావాభినయావకాశములున్నవి కాని, చూచుటకు ఘోరముగ నుండి, యుత్తమ నీతులనుగాని, సద్ధర్మములగాని ప్రతిపాదించనిదై నీ సాధుజనావనపారతంత్ర్యమును వితర్కించునదై భారతీయ నాట్యరంగాలకు అనుచితంగా కనుపిస్తున్నది, అని మనవిచేయ సాహసించు,

నీ పద ధ్యానోప లబ్ధ వివేకసంపన్నుడు,

**సూరిశాస్త్రి.**

# దొరస్వామి[47] : దుష్యంతుడు

రామచంద్రా!

5-12-24 రాత్రి నెల్లూరు టౌనుహాలులో శాకుంతల ప్రదర్శనము - దొరస్వామి దుష్యంతుడు - పాఠము వెంకటరాయ శాస్త్రుల్లుగారిది![48] ఏనాటి నోములో యీనాడు తలవని తలపుగ కలసివచ్చినవి. చెన్నపట్నంలో కన్నయ్య దశావతారాన్ని, రాఘవాచారి యముడ్ని, వదలివచ్చినందులకు శాకుంతల ప్రదర్శనావలోకనమైనా సిద్ధించెనని సంతసించాము.

చిన్నప్పుడు యెప్పుడో ఎడ్వర్డు పట్టాభిషేక సమయాన బందరు బుట్టయ్యపేట కంపెనీవారు, దాసు నారాయణరావు గారి[49] పాఠంతో శాకుంతలమాడగా చూచాను. అప్పటి నుంచి మళ్ళా యీ నాటకాన్ని చూడలేదు. తరువాత చదివిచూస్తే వడ్డాది సుబ్బారాయుడు, వీరేశలింగం పంతులు, వెంకటరాయశాస్త్రి, నర్సయ్యశాస్త్రి మొదలైన పండితకవులు సంతరించిన శాకుంతల పాఠాలన్నిటికంటె దాసు నారాయణరావుగారిదే చక్కగా వున్నట్లు తోచింది. అంటే - పాకము, నడక, మార్దవము మాట చెపుతున్నా. అప్పటిలో పసుపులేటి సుబ్బారావు శకుంతల వేషాన్ని రూపలావణ్య మేర్పడ మనోహరంబుగ

**47. దొరస్వామి :** దొరస్వామి అనే వాడుక నామధేయంకల నెల్లూరు నటుడు కందాడై శ్రీనివాసన్.

**48. వెంకట్రాయ శాస్త్రులుగారు :** చూ. వివరణ 32.

**49. దాసు నారాయణరావు :** కొంతకాలం బందరు దేశీయ నాటక సమాజ అధ్యక్షులు. నాటకకర్త. కృష్ణాపత్రికను కొండా వెంకటప్పయ్యగారితో కలిసి 1902లో ప్రారంభించారు.

నాడుచుండెను. ఇక పల్లెవాడి వేషంలో భావరాజు నారాయణమూర్తిని మించిన స్వాభావిక వైచిత్ర్యము దుర్లభము. మళ్లా యీయాట నాడమని యెంతవేడినా బుట్టయ్యపేటవారు సాహసించరు. నారాయణరావుగారి వ్రాతప్రతిని అచ్చొత్తించరు. ఒక అమూల్యాంధ్ర రూపకరత్నము మరుగుపడనున్నదని విచారింపక తీరదు.

మావైపుల హరిప్రసాదరావుగారు, యడవల్లి సూర్యనారాయణ, జొన్నవిత్తుల శేషగిరి మొదలైన నటులు ప్రసిద్ధంగా దుష్యంతవేషాన్ని వేస్తున్నారు. కాని వాళ్ళను చూచే అవకాశము నాకు యేర్పడలేదు. ప్రస్తుతము నెల్లూరు ఆంధ్రభాషాభిమానీ సమాజంలో కందాడై శ్రీనివాసఅయ్యంగారు (దొరస్వామి) దుష్యంతభూమికను, రామదాసు అయ్యంగారు కణ్వుడుగను, సరస్వతి రంగస్వామి అయ్యంగారు శాకుంతలగా అభినయించారు. పల్లెవాని వేషం వేసినాయన బాగానే చేశారుగాని పేరు జ్ఞాపకం లేదు. అనేక సమాజాలు దీని నాడగా చూడలేదు. కనుక యిందలి నటప్రాశస్త్యమును అనుషంగిక విమర్శన పద్ధతులతో నిర్ణయింపలేను. నెల్లూరులో శాస్తుర్లుగారి ఆటలను వారి తర్ఫీదు, అనుమతి లేకుండా ప్రదర్శించకూడదు. పద్యార్థములను (వెంకటరాయశాస్త్రి కృతి వెంగలిమూక కెరుంగ శక్యమే) చక్కగ విరచి చెప్పి, సందర్భానుకూలమైన అభినయ మలవడినదాక ప్రదర్శింపనీయరు. అందుచేత నటులంతా సుశిక్షితులనే చెప్పవచ్చు.

తింటేగాని రుచి తెలియదు. నాట్యరంగాన ప్రదర్శించినగాని నాటకాల నాట్యయోగ్యత తేటపడదు. శాకుంతలలో వుండే అందము ముప్పాలు కాళిదాసు కవిత్వమందున్నది. ఆ సొగసు సంతరింపులో నెన్నటికిని కుదురనేరదు. ఈ ఆటను చూడవచ్చే వాళ్లు చాల మట్టుకు విద్యాధికులు, విద్యార్థులు. దీని అభిమానులంతా సంస్కృతమూలమును గుర్తెటింగిన వారై యుందురు. కాళిదాసు రచించిన సరసకోమల గీర్వాణపాకము పుర్రెకుపట్టి పిశాచమువలె వెంబడించుతూ యెట్టి చక్కని యనుకరణమైనా అందగింపనీయదు. ఏదో లోపం కనపడుతునే యుంటుంది. తరువాత కాళిదాసు తెలివియంతా ముందురాబోయే కథాంశాలను, యిటుక మీద యిటుక పెట్టి మేడకట్టినట్లుగా చక్కని సూచనలతో, ధ్వనులతో నల్లుకొనిపోవుటయందున్నది. ఈ అల్లిక బిగిని పూర్వోత్తర సందర్భాలను వెతుక్కుంటూ చల్లగ కూర్చుండి చదువుకునేటప్పుడు విశదమైనట్లుగా నాటకము

చూచెడి హడావిడిలో బోధపడదు. వ్యంగ్యార్థము, భాషా సౌకర్యము, చదువుటకునూ, వినుటకునూ, అందగించినట్లుగా ఆడుటకుపయోగించదు. రంగస్థలాన మెప్పొందే ఆటలందు రసము కన్న భావమెక్కువగను, సూచనకన్న అభినయార్థము నెక్కువగను, ఆధికారిక ప్రాసంగిక వృత్తములనేకములు చేరియు, నాయక ప్రతినాయకుల విరోధప్రచారములతో గలవరించియు పెక్కు పాత్రల ప్రవేశపెట్టియు, అవస్థానేకమును స్వభావానేకమును విస్తరించియు నుండవలెను. ఇది శాకుంతలో లేదు. లేళ్ళ గుమిపై విలుసాచి దుమికెడి మొదటిరాక మొదలు మరీచాశ్రమంలో భరతునకు మంత్రకంకణము తొడిగేదాక కథాభారము దుష్యంతుడొక్కడిమీదనే నిలచియున్నది. శాకుంతలము యొక వ్యక్తి వివిధావస్థల నభినయించెడి వ్యవహారమైనది. ఎంత తెలివిగా ఆడినా కొంత విసుగు పుట్టక మానదు.

శాకుంతల ఋషిప్రాయులగు నాయకుల సరసజీవన మర్యాదల చూపించునేగాని, బయస్కోపు బిగింపుల కెదమీయదు. చప్పున కొట్టవచ్చినట్లు రంగుమీరి రక్తి కట్టదు. అవస్థావైపరీత్యకల్పనమందు కన్న జీవితావస్థలకు సాధు సంస్కృత రసస్ఫూర్తి నేర్పరచుటలో కాళిదాసు వన్నెకెక్కిన వాడు. కథాచమత్కారంలో కన్న అల్లిక సొబగులందునూ పలుకుటందములందునూ, జాణతనము చూపుకొన్నాడు. ఈ ఆటను అభినయించేవాళ్లు సంకెళ్లు తగిలించుకొని ఆడినట్లు కాళిదాసప్రయుక్తములైన సాధురసములనులౌకిక రాజసానుభవములకు భిన్నంగా నూహించి కడుంగడు నిగ్రహముతో నడువవలెను. చదివి యానందింపవలసిన కావ్యరూపమునకు పనివడి, ప్రయోగరామణిక మేర్పరచవలసి యుండును. శాకుంతల మాడి మెప్పించుట కష్టము. చూపరులు కదలబారి యొకింత కలవరించుచుండుడకిదే కారణము.

నటి శిశిర ఋతువు మధ్యలో గ్రీష్మ ఋతువును వర్ణించు గీతిక పాడును. మామిడిపళ్ళతో, మల్లెపూలతో, చల్లని తెల్లని రేవెలుంగులతో, కమనీయమైన తలపున కెంతరుచికరంబుగనున్నను నటీ సంభాషణమందు అప్పట్టున గ్రీష్మఋతువర్ణనము కాలౌచిత్య మెరుంగనిదై యుండెను. నాటకకవులు యేదోవొక ఋతువును వర్ణించి వదలుటకన్న అనుబంధములో షడ్రుతువర్ణనములను రచించి

నటులకందించినయెడల కథా సందర్భానికి, అభినయకాలానికి, అనుకూలమైన దానిని పాడగల్గుదురు.

కణ్వులవారి వేషము ధరించిన రామదాసు అయ్యంగారు పలుచగ పొడుగుగ వేష సౌష్టవ మమరి 'ఊర్ధ్వరేతామహాభాగో భగవాన్ లోకపూజితః, చలేద్ధి వృత్తాత్ ధర్మోపివచలేత్సంశితవ్రతః' అను భారతవాక్యముల కనురూపముగ నుండెను.

శకుంతలను విడుచుట కడుంగడు దుఃఖకరమైనను, ధర్మనిరతుడై "నారీణాం చిరవాసోహి బాంధవేషు నరోచతే, కీర్తిచారిత్ర ధర్మఘ్నః తస్మాన్నయత మాచిరం" అను తలపుతో, శాకుంతల ప్రయాణమును సంకల్పించిన తెరంగున, తాను వలపుతెరవు లెరుగని బ్రహ్మచారియయ్యును, యువతీజనంబులకు మధ్య వచ్చిన ముద్దుల మగనిపై నుండు వ్యామోహమును గుర్తించినవానివలెను, తన యాశ్రమ గౌరవము నత్తవారింట శకుంతల నిలువవలెననడి యౌత్సుక్యమును, రామదాసయ్యంగారు రసవంతముగ చూపించిరి.

యాశ్యత్యద్య శకుంతలేతి "పట్టున" ప్రేక్షకులు తన్మయత్వమొంది కన్నీళ్ళ దాచుకొనుచుండిరి.

మొదటి ప్రవేశములో శకుంతల (రంగస్వామి అయ్యంగారు) వల్కలాజనములో నాతిమనోహరంబుగ నుండెను. చెట్లకు నీళ్ళు పోయునపుడు, తుమ్మెద పోటులకు వెరగంది కలతపడునప్పుడు, వీరి యభినయము, అంగవిన్యాసము, కొంచెము మోటుగా నుండెను. తరువాత గౌతమి పిలచినదని యావలకు వెళ్ళునప్పుడు, శకుంతలయొక్క కన్నియ డెందంబును, విశుద్ధాశ్రమ పరిసరంబుల భూతసేవలో, నిర్మలప్రవృత్తులతో బెరిగిన ఋషికన్యమానసవీధిలో మదనవికారము తొలుదొల్త బులకరించిన తెరంగును అయ్యంగారు ప్రశంసార్హముగ చూపించిరి. శకుంతల బూతుపాటలు వినలేదు. నరముల గదలించు నవలలు చదువలేదు. నాటకాలు బయస్కోపులు చూడలేదు. తోడివారివల్ల ప్రణయ రహస్యములు గఱవలేదు. వయస్సంపన్న యయ్యును పూలమొక్కల బెంచుచు, లేడిపిల్లల నాడించుచు, విశుద్ధనియమ వ్రతంబున కాలము గడపుచుండెడి

ముగ్ధవనిత. తుమ్మెద దుడుకులకు నిజముగ భయపడ్డదిగాని, రాజు నాకర్షించుటకు మురిసిన వలపుటక్కులుగావు. అనసూయ ప్రియంవదల మాట లెత్తిపోటులని అనుకొనెను గాని వాటిలోని యర్థమును అనుభవించినది కాదు. నాలుగైదేండ్ల ప్రాయంపు నీచబాలురు బూతుమాటల నుచ్చరించియు వానియర్థ మెరుంగనియట్లు శకుంతలకు ప్రణయ వాచకముల అంతరార్థ మననుభూతమై యుండెను. దుష్యంతుని చూచినప్పుడు ముందుగా గౌరవము గల్గినది. తరువాత యేదో అనిర్వచనీయమైన అభిమానమేర్పడ్డది. లక్ష్యము కుదిరింది. మనస్సంతా గగ్గోలు పడుతున్నది. కాని ఈ గౌరవము, లక్ష్యము, కలవరము, తాపము, పురుష సాంగత్య మాశించెడి వనితాప్రవృత్తిగ ప్రణయ లక్షణముగ నింకను శకుంతల తెలుసుకొనలేదు. తన అవస్థ తనకే అర్థము కాకున్నది. కాని శృంగార ప్రసంగమున పరిణమించవలసిన యీ మనశ్చాంచల్యము, భీతిని, కంపనమును కల్గించుటకు మారు ప్రీతికరమగు నిర్మల సాధుత్వమును ప్రశాంతవీక్షణ సంస్ఫురణమును పుట్టించెను. ఓర మొగమును బెట్టుకొని, రాజుపై క్రీగంటిచూపు నిలుపుచు మోమున చాంచల్యమును, అర్థముకాని గందరగోళమును జూపుచు శకుంతల నిష్క్రమించిన పద్ధతి చిరస్మరణీయముగ నుండెను. తరువాత ప్రయాణసన్నద్ధయై వెడలువేళ రంగస్వామి అయ్యంగారు దుస్తుల మార్చి రవివర్మ జిత్రించిన వాసవదత్తవలె మనోహరరూప సౌభాగ్యమున నగుపడిరి. పిమ్మటి పట్టులలో వీరి యభినయమందు ప్రత్యేకముగా చెప్పవలసిన నాట్యోద్ధతి కనపడలేదు.

శకుంతలను వెన్నంటివచ్చిన ఋషికుమారులలో నొకడు అంటీయంటని నిర్విణ్ణ భావముతోను, మరియొకడు ముని నైజముగు సులభ కోపముతోను మునిజనుల యందగుపడు రెండు విధముల ప్రకృతులను చక్కగ నగుపరచిరి.

## దొరస్వామి

మొదటి ప్రవేశంలో లేళ్ళను తరుముచు, మాతల పురస్సరుడై, యధిజ్యశరాసనుడై, దుష్యంతుడు సత్వరంబున బ్రవేశించును. పౌరవుడనంతసత్త్వుడు, ఆసముద్ర క్షితీతలంబును భుజసీమల దాల్చువాడు – లేళ్లను వెన్నంటి దరుముచు, క్రూరవనేభముల మర్దించుచు, భీకర శార్దూలముల

బరిమార్చుచు, నలసియు, నాటవిక సంచారమునడస్సియు, బలోద్ధతిచేత క్షాత్ర పౌరుషముచే ముందుకురికెడి మూర్తితో నీయెడ నగుపడును.

దొరసామి సేలమంచు పట్టుధోవతికట్టి, పార్సీతరహా యోధక కవచమును ధరించి, తలకొక పట్టుపాగ రసపుత్ర ఫేటా మాదిరిగ చుట్టి, విల్లుచేగొని సమరభీకరంబుగ వేటయంతయు మూర్తీవిన్యాసములో దీపించునట్లుగ రంగ మధ్యమున వచ్చి నిలచెను. దుష్యంతుని బాహుబలమంతా నారిబిగింపులో దెల్లమగుచుండెను. ముఖ కవళిక మాత్రము వయసుదిరిగి వలపుచేతల కంత అనుకూలముగ నుండలేదు. వైఖానసుడు ప్రవేశించి 'వలదు వలదు కూలన్వైవ నీచిన్నిజింకన్' అను పదములుచ్చరించు లోపలనే – మాయాసింగమును చూచినప్పుడు దిలీపుని విలుసారింపు గట్టువడి విలాశిల్పితమూర్తివలె నాతడు నిలువడినట్లు – దొరసామి, యాశ్రమ పరిసరంబుల తపఃప్రభావమును తెలియబరచునట్లుగ, మంత్రస్థంబిత కృష్ణోరగంబువలె చేష్టావిహీనుడై, మునిజనుల దేర బారిజూచుచు నిలువబడెను. వారి వాక్యములు పూర్తి యగులోపల నిస్సంకల్పముగ జారినట్లు అతని యాకృష్టధనుస్సు చల్లగ దిగజారెను. ఈ అభినయము, తొల్లిటి మహోగ్రమృగయా నిబద్ధమానసమును ఆశ్రమ మర్యాదానుకూలముగ (తెచ్చి పెట్టుకున్న ధూర్త వినయమువలె గాక దుష్యంతుని రాజర్షి సంప్రదాయములు సంపర్కవశమున బయట కుబికినట్లుగ) చల్లపరచి జూపినపుడునూ, దొరసామి అయ్యంగారు మిక్కిలి మెచ్చుకొనదగి యున్నారు.

ఆశ్రమంలో ప్రవేశించునప్పుడు తలపాగను దీసివైచి తలకు ధరించిన యుంగరాల విగ్గుతో ఆయుధమును వదలి ప్రవేశించును. ఆయుధ విసర్జనము, శిరోభూషణమును పరిత్యజించుట, ఆశ్రమమందు దుష్యంతునకు గల గౌరవాతిశయమును వినయ విధేయతలను జూప నెంచబడినది. ఇది దుష్యంతుని పట్ల మాననీయ ప్రవర్తనమే కాని యాశ్రమవాసులు పౌరవుని యుత్తమ భూజానిగౌరవంబును మన్నింప సంసిద్ధులై యుండ నిట్టి బాహ్యవేష విపర్యాస మవసరము లేదని తలచెదము.

శకుంతలను మున్మొదలు చూచునప్పుడు, తరువాత మునికన్నియల యాతిథ్య మంగీకరించి యరుగుపై గూర్చుండునపుడు, శకుంతలా సంభవ

వృత్తాంతమును వినునపుడును, మొదట గలిగిన యనుమానములు చల్లగ ముసురువిచ్చినట్లు కరగిపోయి వలపుతలపులు మొలకెత్తునపుడునూ, సార్థకంగా అభినయించి సరసంగా చూపించారు. తుమ్మెదను తరుముటకు దుముకునప్పుడుకంటె తరువాత నెమ్మదిగా కూర్చుండి ప్రణయ ప్రబోధముల జీర్ణించుకొనుచు చప్పరించెడిపట్ల నీతని యభినయము వాసిమీరి యగుపడెను.

విదూషకునితో తన ప్రణయ వృత్తాంతమును చెప్పుకొనునప్పుడునూ ఆశ్రమంలో యింకా కొన్నాళ్ళు యేపేరు పెట్టుకొని కాలము గడుపుదునాయని యోచించినప్పుడునూ దొరసామిగారి యభినయవైఖరి చూచితీరవలసి యుండును. మొత్తము మీద ముఖకవళికచేనేమి వయస్థితిచేనేమి, వలపుతళుకుల గురిపించు పట్టుదలందుకన్న, భావగాంభీర్యము, పర్యాలోచనము, మున్నగు గభీరావస్థలను జూపు నవకాశములు గల్గినపుడు దొరసామి యసాధారణ క్రియానైపుణ్య మగుపరచియుండిరి. అనగా నటసిద్ధి మాననీయమే. కాని వయఃపరిపాకమున గల్గు వేషలోపములు మాత్రము వీరిలో నగుపడుచుండును. దుష్యంతవేషమును నిర్వహించుటలో వీరు చూపిన యభినయ పద్ధతులను బట్టి వీరి హిరణ్యకశిప, బాహుక వేషములను చూడవలెనను ముచ్చట గల్గింది. శకుంతల వచ్చునప్పటికి రాజు వేత్రవతితో మాటాడుచు నిజసభాంగణంబున నిలుచుండి యుండెను. ఇప్పట్టున దొరసామిగారు రాజవేషమును దాల్చి యొకింతసేపును, ఆవల నంగీ తీసివేసి వట్టి లాల్చీతో కొంతసేపును కనపడిరి. శకుంతల చెప్పిన కథ స్మరింపనేరక చేసుకొన్న దాన్ని విడుచుట పాపమా? లేక గర్భవతియైన పరకాంతను గైకొనుట పాపమా? ఇందులో యేది యెక్కువ తప్పు అని యోచించి శకుంతలా బహిష్కారమును నిశ్చయించు పట్టును బాగా చూపించిరి.

తుదిరంగంలో దుష్యంతుడు మరల సమరసన్నాహియై యగుపడును. మొదటిరంగంలో రాజపురుషుల దుర్వ్యసనంబగు మృగయావినోదమున నదిరిపడుచు తన బలపరాక్రమములను వన్యసత్వముల హింసించుటలో ప్రకటించుకొనుచు యౌవన బలోద్ధతితో ప్రవేశించును. తుదిరంగాన ఆ బలపరాక్రమములనే దేవకార్య నిర్వహణమున కుపయోగించిన సద్వృత్తిలో జూపించుచు ప్రవేశించును. మొదట తన క్షాత్ర ప్రభావమున యాశ్రమనివాసులకు

మనస్తాపము గలిగెనేమోయను సంశయముండెను. ఇప్పుడు తన వీర్యసంపత్తి దేవకార్యముల సాధించుట కుపచరించెనను సంతసమున్నది. మొదటిరంగంలో దుష్యంతుడు రాగప్రపూర్ణుండై శకుంతల యొక్క వయఃప్రౌఢిమకు యుప్పొంగి ప్రాకృత శృంగార పద్ధతిలో యాపె యొక్క యాశ్లేష సౌఖ్య మాశించెను. ఆ ప్రణయము, రాగోద్ధతమయ్యును స్వార్థపరము దైహిక వాంఛాకలుషితము, శారీరసుఖా న్వేషకము. ఇట్టి ప్రేమ చిరకాలముండునది కాదు. భంగపాటులకు గురియగుచు కంటకావృతమై శాశ్వతానంద సంధాయకముగానేరదు. అందుకు తగినట్లే శకుంతలా దుష్యంతులకు వియోగ కష్టమేర్పదినది. జీవితానుభవములలో బుద్ధి తెచ్చుకొని జ్ఞానవంతుడై మనుష్యుడు తన దేహమనోబలములను సిరిసంపదలను సామ్రాజ్య విస్తరణమునకుకాక, ద్రవ్యసంపాదనమునకుకాక నైహిక వాంఛాసంతృప్తి కొరకుగాక బలైశ్వర్యప్రదర్శనంబునకుకాక పారమార్థిక దైరకార్యముల సాధించుట కుపయోగింప నేర్చి 'శాంతేయగమిష్యసీవదం పునరాశ్రమేస్మిన్' అను కణ్వ వచనముల సిద్ధింపజేయు మనోవృత్తుల లవరచుకొన్నప్పుడు ప్రణయప్రవృత్తులు మరియొక తీరుగా మారును. తుదిరంగములో దుష్యంతుడు శకుంతలను చూచి చప్పున కౌగిలించుకొనలేదు. చిన్ననాటి మోహముచే నేర్పడ్డ వివాహపరిణామము భరతుడైనాడు. మోహప్రణయము పుత్రరూపమైన పారమార్థిక స్నేహముగ బరిణమించినది. పుత్రునిమీదుగా భార్య నెరింగి గార్హస్థ్యధర్మ నిర్వహణార్థ మామెను స్వీకరించును. ప్రణయవల్లరి వలపుకత్తెలో మొలకెత్తి పుత్రుని యాధారపరచుకొని కుటుంబమున కెగప్రాకి జాతిమతాది పరిధులమించి జగద్వ్యాప్తమై సకలజీవులను సర్వలోక విధాతయగు పరమేశ్వరుని యాశ్రయించును. తనయుని ప్రేమించు శిక్షతోడనే మోహము పారమార్థికమగు ప్రణయస్వరూపమును దాల్చును. ఈ మనస్థితి యేర్పడిన వెంటనే భార్య స్పర్శసౌఖ్య మొసంగు నుపాయముగ గాక సద్ధర్మచారిణిగ నగుపడును. ఇట్టి మనోవృత్తిని దుష్యంతుడీ పట్టున వెలిగించవలెను. దొరసామి దీనినంతా చక్కని సందర్భశుద్ధితో కనపరచియున్నారు.

తెలుగులో స్వతంత్రనాటకాలు ఆంగ్లగీర్వాణ రూపకములతో నెనయైనవి యింకా పుట్టలేదు. ఆంధ్ర నాటక మహాకవి యుదయించలేదు. సాధారణంగా

అన్ని దేశాల వాఙ్మయచరిత్రలోను స్వతంత్రకావ్యకల్పనము తనంతటతాను మొలకెత్తదు. విదేశ సారస్వతరూపము లశేషముగ సంతరించి వాడుకలోకి వచ్చు వేళలందే వీనికిని, స్వకీయజాతీయ పద్ధతులకును, సమన్వయ మేర్పరచి నడిదారి త్రొక్కి కవులు చక్కని స్వతంత్ర కావ్యాలను వ్రాయుచుండిరి. తెలుగు నాటకరంగాన రూపక ప్రపంచములో ముఖ్యంగా సంస్కృత భాషలోని యుత్తమ నాటకాలు యింకా కొన్నిటిని బ్రదర్శింపవలసియున్నది. నాటక సమాజము లీపని జేయునట్లు నీవే ప్రసాదించవలెను.

భవత్పాదసేవకుడు,

**పురాణం సూరిశాస్త్రి**



**స్వాతంత్ర్యోద్యమంలో తోటి సహచరులతో సూరిశాస్త్రిగారు (కుడివైపు కూర్చున్నవారు)**

# గంజాం నటులు

మనోనాధా! దాశరథే!

నీ కృపా మహిమ యెంత శక్తివంతము? నిన్నుదలచి రెండు గ్రంధదళముల విసరినంతనే దేశమందెట్టియనురాగ మేర్పరచి మదీయ విమర్శక వ్యాపారమునకు అవకాశము లమర్చుచుంటివి? యావజ్జీవము నీ సాధులోకముల నారాధించు సుచరిత్రుల కెట్టి యపారలౌకికా ముష్మికసంపద లొసంగి పెద్దసేతువోగదా? 'సుకృతందుష్కృతంచైవ గచ్ఛన్త మనుగచ్ఛతి' అను వాక్య మిహమందే సిద్ధించునట్లు నేను వెళ్లు సరికే గంజాము మండలములో నాయందపార ప్రేమాతిశయముల వెలిబుచ్చు మిత్రులను కూర్చియుంటివి. ఈ గారవమంతా నీకుగాక నాకుచెల్లునా? రాయించేదీ నీవే, చదివేదీ నీవే! మెచ్చుకొనేది నీవే! మెప్పునీవే! మేమంతా నీచేతి పనిముట్లము! నీవాడించు కీలుబొమ్మలము!

చుట్టపుచూపుగా గంజాము మండలము తిరుగవచ్చాము. కొన్నేళ్ళక్రింద చిల్కాసరోవరపు రామణీయక మవలోకించి రమ్యదృశ్యాలనే పలుకుబొమ్మలలో నివేదించియున్నాను. మళ్లా యీనాటికి గంజాం మండలపు శిశిరభాగ్యమును చూడగల్గితిని.

మెట్టగట్టులన్నీ చిక్కని, నల్లని, యడవిచెట్లతో – కొండవాగుల రక్తనాళములతో – పాకుడుబట్టిన బండరాళ్ళతో – వనలతలల్లికొన్న తరుస్కంధములతో – వరుసలు దీరి – గుమిగూడి చేరువకరుగుచూ, దవ్వునకేగుచూ, నగరంగపరంపరల తెరచిచూపుతున్నవి. లోయలలో చిన్నగుంటలు, పెద్దచెరువులు, చల్లగాలిలో తవతవ లాడుతున్నవి. పొలాలన్నీ పైడిరేకులు పరచినట్లు పండిన వరిచేలతో పచ్చగించియున్నవి. వెండిరేకులవలె

చెరువులు విప్పారి తళుకుమీర; బంగార మారబోసినట్లు పంటచేనులు అందగింప; ముఖుమలుటోపీల వలె దూరపుకొండలు నునుపుమీర; పూరిగుడిసెల కెగ్రబ్రాకి గుమ్మడితీగెలు పూత సొబగుల జాటుచుండ; బ్రహ్మదండికంచెల కల్లుకొని గిరమల్లెకలు విరియబూయ; కళ్లముల చుట్టు మూగి గోమహిషశాబకంబులు నవగ్రాసబుభుక్షాకుతూహలులై సందడించ; కోతవనితల ప్రాకృతగీతకానినాదములతో వినువీధి ఝుంకరింప; పులుగుకూతలు పల్లెటిబాలకుల యాటకోలి కలకలముతో మేళవించ; బంతిపూవులు సొంపుమీరి పండువకళ లేర్పరచుచుండ; బాతుజంటలు రెక్కలగొరుకుచు గ్రీవాభంగమున జెన్నారి కోనేటినీటిపై విశ్రాంత యానము సలుపుచుండ; సెలయేళ్ళ బులపాటములతో; నుభయసంధ్యల విచిత్రోజ్వల గగనవిన్యాసములతో; వెన్నెలనిశల మంచుసొగసులతో; గంజాముమండల మత్యంత ప్రేక్షణీయమై, పలుకులకందరాని యందంపురాసియై చూడ కన్నులు జాలనట్లున్నవి.

గంజాములో ప్రస్తుతము వుత్కళాంధ్రసమస్యలు మనుష్యులను కలవరవెట్టుచున్నవి. వాదప్రతివాదాలు నీవెరుగనివికావు. కానీ, నాట్యాదికళాసేవలో అభిప్రాయభేదాలేమీ కనుపించవు. జిల్లాలో జమీందారులు జాస్తి. రైతుబలం తక్కువ. అందుచేత జమీందారులు పోషించే సంస్థాపనలు తప్ప ప్రజాపోషితమైనవి అంతగా వృద్ధిపొందకున్నవి. కాని అన్నిటిలో ముందంజవేయు ధీరధీనిధులనేకులున్నారు. ప్రాచీన సాంప్రదాయాభిజ్ఞులగు పండితసింహము లొకప్రక్కను, సంప్రదాయ నిర్బంధముల విదలించుకొని పరుగులిడు నవ్య విద్వత్సంతతు లొకప్రక్కను, గంజాం, విశాఖమండలములలో కనుపడుచుందురు. జమీందారు లుండుటచేత వీణ మొదలైన దేశీయగాన సాధనములందాదరణ, మంచి రాచమర్యాదలు, ప్రజలందరికి యలవడి వుంటవి.

ఈ ప్రాంతాల్లో గృహస్తులు వీణ పాట నెక్కువ మన్నించి సాధించుచుందురు. తెలుగుపద్యాలను, సంస్కృతశ్లోకాలను విచిత్ర తాళగతులతో మనోహర రాగవిలసనముతో జదివెడి నేర్పు మావైపున లేదు. ఈ పద్ధతులు మనవారు గరపవలసి యున్నవి. పర్లాకిమిడి కళాశాలలో సంస్కృతోపాధ్యాయులుగ నున్న మల్లయ్యశాస్త్రిగారు యీ ఫక్కీలో పురాణశ్రవణ మాదరణీయముగ జేయుచుందురు.

అవడాని కొక చిన్న కొండ జమీందారేకాని, పరుంబడి సాలుకారులక్షలను మించవుగాని, పర్లాకిమిడి రాజు తనయూరిలో స్వదేశ సంస్థానాధీశుల రాజనగరులలో నగుపడు విద్యాపోషక సంస్థాపనలన్నింటిని నిలపి పోషించుచున్నాడు. నిజంగా మావైపు జమీందారులు స్థానిక రాష్ట్రీయ పురములందలి న్యాయవాదుల మోటారుబడాయిలను పోషించుటకు తమ బొక్కసమును గుల్లసేయక, తమతమ ప్రాంతములలో జనోపకారమగు సంస్థలను నెలకొల్పి పోషిస్తే, ఎంతో బాగుండును. పర్లాకిమిడిరాజు సంస్కృతాంగ్లేయ యువతీ విద్యాలయములతో బాటు నొక చక్కని నాట్యశాలను కట్టించి యుత్కళనాట్యసమాజ మొకదానిని పోషించుచున్నారు.

ఈ ఓఢ్రనాటక సమాజమువారు కృష్ణలీల ఆడించి నాకు తమదేశపు నాటక గానాభినయపద్ధతులను చూపించినారు. ఇందులో బాలురను బహుజాగరూకతతో తర్ఫీదు చేయుచున్నారు. నాట్యశిక్షకుడైన అప్పనఫరుచా పిల్లవాండ్రకు పాట నేర్పుటయేగాక యేసందర్భాన యెట్టి ముఖాంగ విన్యాసమును పెట్టుకొనవలెనో చక్కగ జూపించి, అది యలవడువరకూ సాధన చేయించుచున్నారు. మావైపు వ్యాపార సమాజాల్లో కూడ ముందు పద్యాలు, గద్యవాచకాలు వర్ణించిన తరువాత రిహార్సలులో అభినయమును శ్రుతిసమ్మేళనమును అలవరచుచుందురు. మొదటి ప్రయోగాల్లో నటులు యిచ్చటా అచ్చటా కూర్చుండి తమ పార్టులు ఒప్పజెప్పుచుందురు. అప్పనఫరుచా మొదటినుండి రంగస్థలంబున నాటకమును ప్రదర్శించినట్లే ప్రతిపాత్రను ఉచితస్థాన మాక్రమింపజేసి, ప్రయోగార్హమగు గానాభినయములతో నటులను తర్ఫీదు చేయుచున్నాడు. అందుచేత నటులు ప్రదర్శనమునాడు క్రొత్తగా ఫోజులు తెచ్చిపెట్టుకొనవలసిన అవుసరం ఉండదు. వాచకము మనోగతమైనట్లే అభినయం కూడ మొదటినుంచి అలవాటై ప్రమాదరహితముగ చిరాభ్యస్త సరససంస్కృత మార్గములనంటి నడచును. ప్రత్యేక నటుల నీవిధి శిక్షించుటయేకాక రంగస్థలాన నిలువవలసిన వ్యూహక్రమంబును కూడ మొదటి నుండి యలవాటుచేయును. అనగా పాఠము మొదలుపెట్టిననాడే సీరియస్సుగ నాటకమాడడము కూడ మొదలెట్టుచున్నారు. ప్రాంప్టింగు చేయునపుడు అప్పనఫరుచా అప్పటిపోజును

తానే పట్టి చూపుచుండును. అందుచేత ఈ సమాజములలో ప్రతి నటుడు అభినయించెడి రీతియంతా వొక్క మేధస్సు నుండి, యొక సూత్రధారుని నిర్ణయము నుండి, యుత్పన్నమై కళాలక్షణ మొప్పుచున్నది. శాంతనయా[50] మున్నగు నవీన నాట్యకళావిమర్శకులు నాటకమొక కళ కదానిన్నీ వొక బుద్ధినుండి వెలువడిన రసప్రకటనమే కళాభిధేయమున కర్థమగుననియు నాట్యవిద్య కళాగౌరవ మొందుటకు సూత్రధారుని నేర్పు నిర్ణయముల ననుసరించి నడువవలెననియు చెప్పుచున్నారు. అప్పనఫరుచా యిట్టి సర్వనిర్ణాయక సూత్రధారీ ప్రచార మవలంబించెనని చెప్పవచ్చును.

వినడానికి యుత్కళభాష ప్రాకృతమువలె నున్నది. సామాన్యంగా అర్థమవుతూనే యుంటుంది. సింగలీభాషంత మార్దవముగ లేదు. బెంగాలీలో నుండు వర్ణభ్రంశము కటూచ్చకణములు లేవు. వీటిరెండింటికిని నడుముగ నడుస్తుందని చెప్పవచ్చును. గద్యోపన్యాసాలు నొక మాదిరిగ నున్నవి. పాటలు బెంగాలీ తెలుగు పద్ధతుల ననుకరించుచూ వినసొంపుగనున్నవి.

పర్లాకిమిడిలో తెలుగుకంపెనీ వొకటి ఉండేది. ఇందులో చిలుకూరి బుచ్చన్నపంతులు అన్నాపంతుల రామమూర్తి మొదలైననటులు అభినయిస్తూ వుండేవారు. ఇప్పుడీ సమాజం పని చేయడం లేదు. అందలి నటులు మాత్రము తమ తమ పార్టులను కొన్ని చదివి పాడి వినిపించారు. ప్రస్తుతము గంజాం జిల్లాలో టెక్కలి గ్రామమందు ఆంధ్రకళాప్రచారక సంఘమున్నది. శ్రీకాకుళపు యామెచ్యూరు కంపెనీవారు దయచేసి నాకొఱకొక నాటకాన్ని ప్రదర్శించిరి. కాని కోరుకొండ యాటజూచు నలసటచే నీ యవకాశమునుపయోగించుకొన జాలకుంటిని.

పైజెప్పిన నటులుగాక టెక్కలి ఆంధ్రప్రచారక సంఘమువారు ప్రహ్లాదను, పూర్తిగాను, కుశలవ, సావిత్రి నాటకములలో కొన్ని రంగములను చూపించిరి. ప్రహ్లాదలో జయంతి వెంకటజగన్నాథరావుగారు బి.ఏ.యల్.టి. గారు హిరణ్యకశిప వేషమును వేసిరి. వీరి విగ్రహము కొంచెము పొట్టి. సంగీతము కూడ ఎక్కువనే చెప్పవచ్చును. కాని హిరణ్యకశిప పాత్రానికి నాగరాజారావొసంగిన లౌకిక సంపన్న

**50. శాంతనయా :** జార్జి శాంతాయన. అమెరికన్ వేదాంత శాస్త్రవేత్త.

గృహస్థుడనే అర్థమును స్వతంత్రముగా నూహించుకొని యీ అర్థంలో "లోకములన్నియున్ క్షణములోన జయించిన వాడ వింద్రియానీకము చిత్తమున్ గెలువనేరవు" అనే భావముతో కథాసందర్భములన్నీ కొంచెమించుమించుగా నాగరాజరావువలె అభినయించి చూపారు. పైకి యెంత కోపం నటిస్తున్నా పుత్రనియందారని ప్రేమను సంతోషమును మధ్యమధ్య వెళ్ళగ్రక్కుతూ బాలభక్తాగ్రణి నారాయణస్మరణ మొనర్చునప్పుడు ద్వేషముకన్న అసహ్యమెక్కువ చూపుచూ సరససాధుత్వముతో చిత్రార్థముఖముద్రలతో నిర్వహించిరి. "ముంచితివార్ధులన్" అను పద్యములో చివరకు 'చావడిదేమిచిత్రమో' యనునప్పుడు జగన్నాధరావుగారు తమ చూపుల మింటిపైబరపి పరమార్థ సంస్ఫురణ ముదయించినట్లొకనిమేష మగుపరచి యంతలో వినమ్రులై 'ఇన్ని లౌకికశక్తులు భక్తి ప్రభావానికి చాలవ'న్నట్టు చూపించి యంతలో చివాలున యహంకారప్రవృత్తిని గ్రమ్మరనందుకొనెను. ఇచ్చట నాగరాజరావు నిర్వేదమగుపరచెను. మరునాటియాటలలో జగన్నాధరావుగారు కొన్ని హాస్యభూమికలదాల్చిరి. వీరి యాటతెరవుల జూడ దుష్టబుద్ధి, యుగంధరుడు, సుబ్బిశెట్టి పాత్రల నభినయింపదగుదురని తోచుచున్నది.

ప్రహ్లాదలో వినుకొండ జోగారావుగారు లీలావతి వేషాన్ని వేశారు. మరునాటి సావిత్రిలో నీతడు సత్యవంతుడుగను, కుశలవలో సీతగను కన్పించెను. ఈతని రూపు నడత సంగీతము అభినయ నైపుణ్యము చెప్పుకోవలసినదే. మావైపున యుండినయెడల ఈపాటికి వీరికొరకు నాటక సమాజాలు పోటీపడి సంచులందించుచుండెడివారే. తన పార్టు జరుగునపుడే కాక మిగిలిన పాత్రలభినయించు సమయమున కూడ సందర్భోచితమైన మూకాభినయ మొనర్చుచూ రసానుభవమగుపరచుచుందురు. లీలావతి పుత్రునకు సదూపదేశముల జేయ యత్నించుచూ భర్తను వారింపజూచుచూ తండ్రి కొడుకుల వైరము వొక విచిత్ర తారుణిక దుర్యోగముగ భావించుచూ చివరకు ప్రహ్లాదుడు విషము తాగిన పట్టుల తాను మూర్ఛిల్లు సందర్భాన్ని చక్కగా చూపించినారు. వీరు ఆడిన సావిత్రిలో సత్యవంతుడు వేటకరగి వనమధ్యమున పులివాతనుండి సావిత్రిని దప్పించి యాపెయొక్క కృతజ్ఞతా పరిణామముగ నాపె వలపులందికొని మొదట సంశయించి యావల తాను కూడ వలచనేర్చును. ఇందులో సత్యవంతుడు

అప్పటికి ముగ్ధనాయకుండని చెప్పవచ్చును. వలపుజాడ లెరుంగడు. పితృసేవాపరుడై ధనుర్విద్యాదుల నభ్యసించుచూ నుత్తమధర్మముల గరచుచూ జీమూతవాహనునివలె 'ఏవం నింద్య మపీడ మీప్సితఫల ప్రాప్త్యై భవేద్యావనం, భక్త్యాయాతియదీత్థమే వసితరౌ శుశ్రూషమాణస్యమే" అనుమాటల స్మరింపజేయుచు కాలము గడుపుచుండినవాడు. అడవిలోనుండగా తండ్రి నగరిని శత్రుదళములు ముట్టడించెనను వార్త తెలిసినది. ఇట్టి సందర్భములో పితృభక్తి, శత్రు సమ్మర్దనోత్సాహము, తా నడవులనుంటినను విచారము బుద్ధి నూగించుచుండ సావిత్రి ప్రణయప్రసంగముల నందించ నరుదెంచును. అదివరకున్న తలపులలో కామమర్మమెరుంగని వనవలుపుటుల్లముతో చీకాకుపడుచు మెల్లగ శృంగారప్రసంగములందికొన నేర్పు సందర్భాన్ని జోగరావుగారు చక్కగా చూపించిరి. యముడుసీనులు ముచ్చటించవలసిన ప్రత్యేక సందర్భమేమియు లేదు. సీత వేషంలో లక్ష్మణుడు విడచిపెట్టి వెడలబోవునపుడు రామునిపై యారని ప్రేమవిశ్వాసములంతర్వాహినిగ స్ఫురించుచుండ తాత్కాలిక వియోగశోకమును సరసముగ చూపించిరి.

టెక్కలిలో నొక విచిత్రమైన కళింగ వైశ్య కుటుంబమున్నది. టంకాల సాంబయ్యగారు స్త్రీపురుష వేషాలు వేసేవారు. వీరి తమ్ములొకరు హార్మోనీ వాయిస్తూ యింకొకరు తపలా మోదుతూ మరియొకరు ఇంద్రుడు మొదలైన వేషాలు వేస్తూయున్నారు. సాంబయ్యగారి కొడుకులిద్దరూ బాలకపాత్రల నభినయిస్తారు. వీరల వుచ్చారణ, సంగీతము, కులనియమముల నతిక్రమించి యసాధారణ విస్పష్టమాధుర్యములతో చెన్నారుతున్నది. అపశబ్దమెక్కడా రాదు. ఇందులో పెద్దవాడు, శశిభూషణరావు ప్రహ్లాదలో మూడవ ప్రహ్లాదుడుగను, కుశలవలో కుశుడుగను సావిత్రిలో సావిత్రిగను అభినయించెను.

చిన్నతనంలో దేవరకొండ వెంకటసుబ్బారావుగారి వలె స్త్రీ పురుషవేషాలు సమాన సౌష్ఠవముతో శశిభూషణునకొప్పుచున్నవి. ఇతని యొద్దికలు, పోకడలు, నడతలు, స్వతంత్రంగా, రసవంతంగా ముచ్చటగా వుంటాయి. అభినయమందు సహజప్రతిభ కన్పట్టును. కుశభూమికలో రామవీర్యసంజాతుని చాకచక్యము, వీర్యస్థైర్యములు, భ్రాతృవాత్సల్యము, సాంద్రహృదయము, మాతృభక్తి, మొదలైన

గుణాలను నిర్దోషముగా చూపించాడు. సావిత్రిలో వలపుపట్టులందును యముని అనుసరించునపుడునూ ఇతని ఆట బాగా అందగించింది. ముఖ్యంగా అలసి శిరోవేదనముచే జెమటలు గ్రమ్మి, మూర్ఛిల్లియున్న సత్యవంతున కుపచారము సేయుచు, భర్తృసేవా పరాయణత్వమున, నారదవాక్యముల గడవువచ్చెనను భయమును కూడ భావించలేక, తాదాత్మ్యచిత్తయై, విసరుచు, తుడుచుచు కూర్చున్న సమయములో నొక ప్రక్క నుండి యముడావిర్భవించిన సందర్భాన శశిభూషణుని చూపులందును, అంగములందును, శంభుదాసుని వర్ణన నతిశయించురీతిగ యమరూపమగుపడెను. పతాను నాటకంలో నాగరాజారావు మూర్తి యందు రామరాజ పిశాచ మేగతి స్ఫురించెనో, అట్లే శశిభూషణుడు –

"కనియెం గోమల నీలమేఘ విలసత్కాలాంజనాకారు..................
జగజ్జన సంత్రాసకు నొక్కదివ్య బటు ప్రాశ ప్రౌఢ హస్తోద్ధతిన్"

అను పద్యార్థమును తనరూపులో క్రమోద్ధత భయానకానుభవముతో జూపించెను. ఒక్కమాటు వులికిపడక, సన్నిహిత విపత్తును క్రమాభినయములో నవబోధించి చూపుటలో నీతని ప్రతిభ యపూర్వముగా తోచింది. తగిన శిక్షతో ప్రస్తుతం చదువుచున్నరీతిగా తెలుగూ సంస్కృతము సంగీతము, ఇంకా కొన్నాళ్ళపాటు చెప్పుకొని, ప్రసిద్ధనటులను చూస్తూ, అభినయసాధన మొనర్చుచూ, జాగ్రత్తగా వ్యవహరిస్తే శశిభూషణరావు, తెలుగు నాట్యరంగాన రాగల పెద్ద చేతులలో జేరడాని కభ్యంతర మగుపడదు. వైశ్యులలో ఇట్టి ప్రజ్ఞ సామాన్యం కాదు. ఏమోబాబు! ఏయగాధసాగర గర్తాంత రాళమున నెట్టి యుజ్వల మణిరాజముల దాచియుంచితివో? నీ జగత్సంతానముల యనంతవిభూతి నీవెరుగుదువుగాని మాకరయదరమా?

**ఇట్లెరుక**
**పరచుకొను,**
**విధేయ నాట్యసంజయుడు,**
**సూరిశాస్త్రి.**

# చంద్రహాస[51] - నటలోక సంచారము

దశరథరామా!

బందరులో ముత్తరాజు సుబ్బారావుగారనే బ్రహ్మణ్యులుండేవారు. ఇంగ్లీషులో యమ్.ఏ. ప్యాసు అయి తెలుగులో కవిత్వంచెపుతూ, "శ్రీకృష్ణ తులాభారం" మొదలయిన మంచి యాటలు రచించి, చల్లనిచూపుతో నాటక సమాజాలన్నిటికి ప్రాపును ప్రోపును దానయై బందరు పాలెటిక్సువీనుల జేరనీయక, నేర్పుమై మెలగుచుండెను. పేదరికంలో పెనుగులాడుతూ, వితరణశీలుడై విద్యార్థి కల్పవల్లియై, సద్గుణ వారాసియై, నిరాడంబర నిష్కపట కరుణాప్రపూర్ణ సచ్చరిత్రమున దినములు గడపి, 'సుకృతిర్గతాయుః' అనునట్లు మిసిమిలూరెడి లేతవయస్సులో రాఘవాశ్వమేధ రచనమునకు పారితోషిక మందికొన నీచెంత జేరిన సంగతి నీవెరుంగనిది కాదు!

సుబ్బారాయుడు నీ పాదసాన్నిధ్యమున నిత్యానంద మనుభవించుచుండ, భవబంధముల సడలింపనేరని కొందరు మిత్రులు వారు నడుపుచుండిన చిత్రకళాభివర్ధనినే వారిపేర ప్రవర్తింపజేసిరి. బయటి నటులను రావించి బందరులో నాడించి పారితోషికము లొసంగి, నాట్యకళా వైదుష్యమును విస్తరింపజేసి, సుబ్బరాయని కుటుంబమునకు కొంత యుపపత్తి నేర్పరచి యావల నటసభను రావించి, నాట్యకళ కమేయ సంస్కార మొనగూర్చిరి. ఈ యుద్యమమునకు ప్రాణపోషకులై, బందరు చవిటిలో సన్మిత్ర లక్షణంబుల రుజువుపరచిన చిట్టా సాంబయ్యగారు, ఆంజనేయులుగారు, కష్టపడి ప్రతాపరుద్రీయము,

**51. చంద్రహాస :** ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారి నాటకం. కోలాచలం శ్రీనివాసరావు గారు కూడా ఈ ఇతివృత్తంతో నాటకం రాశారు.

ముద్రారాక్షసము, చంద్రహాస, హరిశ్చంద్ర, చిత్రనళీయము, రామరాజ్య వినాశనము, పాదుకా పట్టాభిషేకము మొదలైన మంచి ఆటలు పెద్ద నటులభినయించగా జూచెడి యవకాశమేర్పరచిరి. నాటక పరిషత్తు వీరి ప్రోత్సాహ ప్రయాసమువలననే జనించినది.

ప్రతాపరుద్రీయములో యుగంధరుడు, పాదుకలో దశరథుడు, తళ్ళికోటలో పతాను వేషాలను నాగరాజారావు నిర్వహించిన తెరవు యిదివరకే ముచ్చటించియున్నాను. వీరు దుష్టబుద్ధి వేసిన నాడు రొంపిగొని చూడబోజాలకుంటిని. చూచిన వారు దీనిని మిక్కిలిగా ప్రశంసించినారు.

చిత్రనళీయములో హరిప్రసాదరావు గారు నలుడైనారు. రాజవేషాల కీయన పెట్టినపేరు. ఆ రూపు, ఆ వొడుపు, ఆ కులుకు, ఆ చూపు, ఆ తీరు, ఆ డొలు, ఆ హొయలు, ఆ వగలు చెక్కుచెదరని బింకముతో జెన్నారియున్నవి. ఏనాటి ప్రసాదరావు? యేనాటి కృష్ణమాచార్యులు? కాల మభినవ కళాప్రసూన శోభలతో జిలుకారుచూ, యెప్పటికప్పుడు కొత్త రుచుల జవిజూచుచున్నది. ప్రసాదరావు పెద్దవాడైనాడు. కాని నలచక్రవర్తి రూపుదాల్చి, నాట్యరంగాన అడుగిడగానే, 'వితత నవద్వయీ ద్వీపనానావిధ శ్రీసమాశ్లిష్ట భుజుడు, దమయంతీ మనోహరుడు, బుట్టయ్యపేట గ్రీన్ రూములో గ్రమ్మర నవతరించినట్లు దోచుచుండెను. దౌత్య సందర్భాన ప్రసాదరావిప్పటికి మాననీయాభినయ మొనర్చుచున్నాడు. ఈ సందర్భంలో చిరప్రతిష్టగల కోపల్లె హనుమంతరావుగారు దమయంతి వేషం కట్ట, నీ వృద్ధదంపతులిరువురు దేవియున్ దేవర వోలె నుండి, నాట్యజగతీ పితృత్వ గౌరవ మందికొనిరి. ఈ నాటకములో 'పాముకాటుకు రూపు మాయునా' యను సందియ మడుగంట బెకలించు రూపవిపర్యయ మగుపరచి బాహుక చరిత్రమును అపూర్వరస వైభవముతో – నలగుణంబుల పూర్వపరిచితి కునికిపాట్లవలె నప్పుడప్పుడు దెప్పరిల్లి తలజూప – నాగరాజారావు చూడవలసిన నేర్పు గొప్పతో నభినయించిరి.

నేజూచిన నట సభవారి చంద్రహాసలో చంద్రకళా సంపూర్ణశోభను మ్రింగివైచెడి కపటహాసముతో దుష్టబుద్ధిని మరగుపరచి కుంభీనసస్వభావమును నేర్పుమై బ్రకటించుచు నట వృద్ధకేసరియనదగు నటలోకమాన్యుడు వెదురుమూడి

శేషగిరిరావుగారు ప్రధాన పాత్రమును చమత్కారముగ నిర్వహించిరి. వీరియాటలో దుశ్చింతలు చక్కని గోపనమొంది భ్రూభంగములవల్ల స్ఫురించుచు యెప్పటికప్పుడు బాలకసహజమగు అమాయకపు నగవులో మరుగుపడి సందర్భానుకూలమగు రసవదభినయ విలాససంపద లగుపడుచుండెను. పెద్దలై తరచుగ నాట్యరంగాన జిందులాడ నొప్పుకొనకున్నారు గాని నాట్యకళను నాటకార్థములను సరసముగ గుర్తించి వాచికాంగికగానాభినయ వైఖరులందు కొన్ని యభిమాన సిద్ధాంతముల నేర్పరచుకొని తమ భావములకు ప్రయోగ నిదర్శన మొసంగగల కొద్దిమంది తెలుగు నటులలో వీరెంచదగియున్నారు. వీరొసంగిన కుంభీనస వ్యాఖ్యానము సర్వజనాహ్లాద సంజనకమై, రసవంతమై, నిర్దుష్టమై సరసకోమలమై సిద్ధచాతుర్య మగుపరచుచుండెను.

వస్తారు వస్తారు అంటూ చివరకు వచ్చారు. పదేళ్ళ నుంచి బెజవాడలో మైలవరం వాళ్ళని[52] చూచియెరుగని బందరు పౌరులెందరోకలరు. తెలుగుదేశపు మేటి నాటక మేళాన్ని చూస్తాముగదాయని యువ్విళ్లూరుతున్నారు. రంగపరికరాలు రెండు వాగనులలో దిగినవి. కాళీమేస్త్రీలు వేదికాముఖాన్ని పగులగొట్టి హార్మోనీతపలాలకు కుదురు లేర్పరచారు. నూనె గుడ్డలతో మసివారిన యాంత్రికులు వచ్చి తీగెదివ్వెల నమర్చారు. బయస్కోపులలో పూర్వపరిచితములైనను నాట్యరంగాన విద్యుద్దీపికలు తళుకులీన మావారు చూచియుండలేదు. నటవర్గము రైలుదిగి పేటలో విడిశారు. లెక్కకుమించి టిక్కెట్లమ్మినారు. నాలుగువందలు వచ్చేహాలు రూప్య సహస్రమునకు మించి సంపాదించింది. ఆడేది సావిత్రి. 'స్త్రీ యేసం సంజియరావు గారేస్తారంట – గురజనాయుడు యముడంట – యమలోకం సూపిస్తారంట. అందులో కోమటిపీనుగ బలేగల్లంతు చేస్తాడట' అని యనుకొనుచువచ్చిరి ఆటను జూడ అందరు పౌరులెల్లరు. జనము కిటకిటలాడి, త్రోసికొని, తబ్బిసలాడి, కామూష్, నోరుముయ్యి, సైలెన్సు, హెచ్చరింపులతో కూతలిడి, యీలలు వేసి, పోరాడి, పెనుగులాడి, గింజుకొని, చించుకొని, యుబికి యుప్పొంగి, యొకపెట్టున వుప్పెనయలపోటువలె పెల్లుబ్బి 'సెల్లెలికట్టలను దాటి సీమలముంచెన్' అన్నట్లు రంగస్థలములోకి దుమికి పక్షప్రదేశములేకాక

**52. మైలవరం వాళ్లు :** మైలవరం బాలభారతీ నాటక సమాజం నటులు.

గర్భాలయము కూడ యానకట్టి పరచుకొన్నారు. పల్లేరుకంపలో కాలుబాట పడినట్లు యొకమూరెడు వెడల్పున నిలువుగా దారియుండెను. ఇందులోనే రామనాథశాస్త్రి సత్యవంతుని పార్టును, సంజీవరావు సావిత్రిని, నాయుడుగారు యమార్భాటమును జూపవలసి వచ్చింది. బజారులో పట్టుపీలిక నడికట్టుదాల్చి దాలుడవాలిచేగొని 'భళిభళీ మాతాత విల్లంబునేబూని పుల్లాకు తూటుగా బొడిచినాడు', మొదలైన కథలు జెప్పే పంబలవినోదులవలె, బోనులోని సింగములవలె, గొల్లభాగవతాల రాజవేషాలవలె మైలవరపు నటశేఖరులు బృందావనపు సంకుచిత నాట్యరంగములో ముందు వెనుక కూగులాడవలసివచ్చెను.

రామనాథశాస్త్రి సత్యవంతుడుగ చూపిన నేర్పు విచారించెదము. ఇతనికి విగ్రహపుష్టి తక్కువ. ముఖమందు బాల్యచాపల్యము, సుకుమార యౌవనవిలాసములు, వక్రాంతమున లేనగవు పులకరింపులు, కనుపడుచుండును. పాటలో మనసార మెప్పించగలడు. మరీ, మైలరవంవారి మట్టుమెట్టులను దుమికించుటలో నీతనికి శక్తి కెంపారుచున్నది. పద్యంలో కంటే మట్ల ఝుళిపింపులలో, దరువుల బెదరింపులలో, స్వరాల ముక్తాయింపులలో, నీతని గాత్రము నిరాఘాటసంచార సమర్థమై హాయిమనుచున్నది.

మైలవరంవారి తులాభారము చూచినాము. అందులో గోవిందరాజుల వెంకట్రామయ్యగారు శ్రీకృష్ణ వేషమును దాల్చి మనోహరంగా వేషగానాభినయ సౌష్టవ మొప్పార ప్రేక్షక నివహమానందించి యుప్పొంగ నభినయించినారు. ఇందులోనే సంజీవరావు సత్యభామయై అసూయాహంకార సమన్వితంబగు మోహస్వరూపమును చక్కగా ముద్రించి చూపినారు.

విశాఖపట్నంలో విజయనగర వాస్తవ్యులగు ఆనానపురపు గోపాలరావుగారి వాణీవిలాస సభవారు కుశలవ నాటకమును ప్రదర్శింపజూచినాను. ఇందులో గోపాలరావు రాముడు. చొప్పా సూర్యనారాయణ లక్ష్మణుడు. తాతావారి బాలుడొకడు కుశుడు. గోపాలరావుగారు చూపునకు కొంచెమించుమించుగ బళ్లారి రాఘవాచార్యులగారివలె నుందురు. దేహపాటవము, ముఖగాంభీర్యము, ధీరనాయక వేషముల కనుకూలముగ గన్పించును. పాడగలరుగాని, గుంటూరుబావిలో చేదలాగినట్లు, రైలుయింజెను పయనమైనట్లు,

వొకమాదిరిగా వుండును. కాని అభినయంలో కథాసందర్భాలను గ్రహించి ప్రకటనానుకూల ముఖముద్రలను వహించుటలో వీరినేర్పు మన్నింపదగినది. వీరి యభిమాన పాత్రము హిరణ్యకశిపుడు. నేను చూచింది రాముడు. మొదటిపట్టున సీతపైబడిన యపవాదమును ఆకర్ణించి కర్తవ్యమాలోచించుచు, ఉత్పత్తి పరిపూతాయాః కిమస్యాః పావనాంతరైః' – 'స్నేహందయాచసౌఖ్యంచయుదినా జానకీమపి ఆరాధనాయలోకానాం ముంచశోనాస్తిమేవ్యథా' 'వియోగో ముగ్ధాక్ష్యాః సఖలురిపుఘాతావధిరభూత్ కథంతూష్ణీంనహ్యో నిరవధిరిదానీంతు విరహ' మున్నగు నుత్తర రామాయణభావములన్నియు, సాగరసంకాశ సహజ గాంభీర్యములో వెలువడురీతి నత్యంత సామర్థ్యముతో బ్రకటించిరి. కుశలవుల నెదుర్కొనునప్పుడు కూడ వీరి నటన ప్రేమను, ఆశ్చర్యమును, ఔదాసీన్యమును గనుపరచుచు రసవంతముగనుండెను.

**ఇట్లు,**

**నటలోకవార్తా ప్రచురణ కుతూహలుండగు,**

**నీపాద సేవకుడు,**

**పురాణం సూరిశాస్త్రి.**

# మృచ్ఛకటిక [53]

ఈ రూపకమును దొలుదొల్త గీర్వాణ ప్రాకృతంబుల రచించిన మహాకవి, శూద్రకుడను భూపాలుడు. ఈతడు కాళిదాసునకు పూర్వుడని కొందరు పండితోత్తము లభిప్రాయపడుచున్నారు. దరిద్రచారుదత్త మనుపేరిట బరగు భాసకవి కృతి నొకదాని మాతృకగ గైకొని, పెంచి, సర్వజనాహ్లాద సంజనకంబుగ మార్చి, రచించినట్లగపడును. దీనిని గీర్వాణాలంకారికులంతగ గొనియాడకున్నను, పాశ్చాత్యపండితులపూర్వ ప్రతిభావిరాజితంబుగ నెంచుచున్నారు. హెచ్. హెచ్. విల్సను, మున్నగువారు దీని నాంగ్లభాషలోనికి గద్యపద్య సమన్వితంబుగ సంతరించి ప్రాచ్చరూపకములలో నెల్ల ప్రశస్తమగు దానిగా నుగ్గడించిరి. హిందీ, కర్ణాటకాది భారతీయ దేశభాషలలో దీనియనువాదముల రచించి ప్రదర్శించుచున్నారు. తెలుగున తిరుపతివెంకటేశ కవిపుంగవులిద్దాని[54] సరసముగ నైజరసస్ఫూర్తి నిండు వెలుగున రాజిల్లునట్లు రచించి యాంధ్రుల కృతజ్ఞతకు బాత్రులైయున్నారు.

## రూపక ప్రాశస్త్యము

మృచ్ఛకటిక భారతీయ నాటకములన్నిటిలో బ్రదర్శనానుకూలమై సకల సామాజిక సంతోషదాయకంబై, నిరుపమానమై, యపూర్వమై పాశ్చాత్యరంగాలంకారభూతంబులగు నుత్కృష్టరూపక రత్నములతో నెనయగుచు పండితపామర జనంబులచే సమానగౌరవంబున మన్నింప దగియున్నది. ఇతర నాటకములలో నెద్దియో యొక ప్రధానరసము మొదట నుండి తుదివరకు

---

**53. మృచ్ఛకటిక :** శూద్రకుని ప్రఖ్యాత సంస్కృత నాటకం.

**54. తిరుపతి వేంకటేశ్వరులు :** చూ. నాట్యాంబుజ వివరణ - 57.

కథాభారమును దాల్చుచుండ, నచ్చటచ్చట నలంకార లక్షణ సంతృప్తికొరకు నవతరసస్ఫురణ గిలికింపబడుచుండ మృచ్ఛకటికలో నవరసములు సమానప్రపత్తి నొందియున్నవి. భాసకృతులు కోమల సద్భావభరితములై లలితపదాలంకృతములై సాధురసముల లేతతళుకులతో, జంద్రునినావరించు పరివేషమందగుపడెడి మొత్తెంపువెలుగు జిలుకులతో, జెన్నొందుచు, పాఠకులకెంతయు బ్రీతికరముగ వినబడుచుండును. కాళిదాసు నాటకములలో పనివడి మెరుగుపెట్టి కావ్యశిల్ప మగుపడును. భవభూతిలో గరుణాభయానకంబులు దారభావవిస్పష్టతతో పొగలిడి పొక్కుచుండును. వేణీసంహార ప్రసన్న రాఘవాదులందుద్భటపద పటిష్ఠత భారతీయ మహావీరులదండిగుండెను జాటుచున్నది. కాని వీనియన్నిటిలో నేడోయొక గాథ ప్రధానమై తక్కుంగల వృత్తాంతమును మ్రింగివైచును. ఈ సందర్భమే మనదేశమందాడబడు నాటకములన్నిటి నావేశించి యున్నది. ధీరనాయకులగైకొని వారిని కష్టపరంపరలో దేల్చి దూర్చి తుదకు ధీరత్వముచేవారు కంటక శతంబుల దాటి మిన్నలై నిజసత్వమును సమర్థించి, యీప్సితార్థమును సంపాదించిన యుదంతములు భారతీయ నాటకకవులభిమానించుచుందురు. కథాసరళిలో గొన్ని భిన్నవ్యక్తులగుపడినను వీరందరు ఆధికారిక వృత్త పరిణామమునకే దోడ్పడుచుందురు. కథాంశము నాయికా నాయకుల సర్వస్వమని చెప్పవచ్చును. అందు శాకుంతలోత్తరరామచరిత్ర రత్నావళి హరిశ్చంద్ర ప్రహ్లాద సావిత్రీ నలాదినాటకములు కూర్పులో నెంత సమంజసముగ నున్నను ప్రదర్శనమందొకింత విసుగొందించుచుండును.

## ఫలబాహుళ్యము

మృచ్ఛకటికలో వసంతసేనా చారుదత్తుల ప్రణయ వృత్తాంతమేయాధికార కథాంశమయ్యును – జూదరియై, తప్పుదారుల నడుగుజారుచు దీనదశంజిక్కిన సంవాహకుడు పశ్చాత్తాపమొంది బౌద్ధాశ్రమమూని ద్యూతక్రియా నైజమగు మనశ్చాంచల్యమును వదలి సుస్థిరమగు భక్తి విశ్వాసములు అలవరచుకొని భూతదయాసిద్ధుడగుటయు; సద్వంశ సంభూతుడై పండితాశీర్వచన ప్రాపుడై పలువిద్దెల ప్రోడయై యల్లరిచిల్లరి సంగ డీడులతో దిరుగనేర్చిన శార్వలికు డాపత్కాలమున దనమిత్రుడగు నార్యకుని బంధవిముక్తు గావించి గద్దియ నెక్కించి

యుదార స్నేహస్వరూపమును బ్రకటింప గల్గుటయు; గొల్లడై పుట్టిన ఆర్యకుడు రాజధానిలో విశ్వాసపాత్రులగు మిత్రుల సంపాదించి వారితోడ్పాటున రాచరికమొంది, యిట్టి యచించిత మహర్దశాప్రాప్తి గల్గిన వెనుక కష్టకాలములో గేలూత నెసంగిన వారిని మఱవకుండుటయు – మొదలగు ఫలము లీనాటకములో నగపడును. ఫలసిద్ధిచారుదత్త వసంతసేనల దొకరిదే కాదు – సంవాహకుడు బుద్ధుడైనాడు; శార్వలికుడు మదనిక పొందుగెలచి, తన మిత్రుడగు ఆర్యకునకు రాచరిక మేర్పరచెను; ఆర్యకుడు రాజ్యాభిషిక్తుడాయెను. చారుదత్తునకు గల్గిన లాభము వసంతసేన కాదు. కథారంభము నుండి కథాంతము వరకు వసంతసేన వానిదే. శకారుని జీర్ణోద్యానమున వసంతసేన ప్రాణాపాయమునకు బాలైనను, ప్రధమ ప్రవేశము నుండి శకారునిచే దరుమబడినను, వసంతసేనా చారుదత్తులకు వియోగమెన్నడును కలుగలేదు. నిరపాయముగ నిరాటంకముగ తమ వలపు పొగరులను దీర్చుకొను నవకాశము జిక్కుటయే వీరి శృంగార కథాంశపు పరిణామము. వియోగము చారుదత్తునకును, నాతని గృహలక్ష్మికిని గల్గెను. కథా ఫలితముగ జారుదత్తుని గృహలక్ష్మి మరల నాతనిచెంత జేరినది. శకారుడు పరమనీచుడై యబలామారకుడై శిక్షార్హుడయ్యును, క్షమాఫలమొంది సంతసమున గంతులిడగల్గెను. ఈ పాత్రములన్నియు తొలుదొల్త లోపభూయిష్టములై జిక్కులబడినను భక్తి విశ్వాస సుహృల్ల క్షణాది సద్గుణంబుల కుదురులై కథాంతమున నిజస్వభావ ప్రభావమున సద్గతి నొందియున్నారు. నల్గురైదుగురు పాత్రలకు వేర్వేరు ఫలసిద్ధులమరుటయు, వీరి భిన్నవృత్తులు ప్రత్యేక కథాంశములు నాటకాంశమున జేరి యుండుటయు నీ నాటకములోని ముఖ్యవిశేషము.

## – కాల్పనిక వైచిత్ర్యము –

ఇంతకన్నను గొప్ప సంగతి యేమన వీరందరు నాయికా నాయకులకు సంబంధించినవారు కారు. వీరి ప్రవృత్తులు ప్రయత్నములు ఆధికారిక కథాసందర్భమున జనించినవి కావు. దానికి తోడ్పడుటకుగాని, దాని నడ్డగించుటకుగాని సంకల్పింపబడినవి కావు. సంవాహకుడు, శార్వలికుడు, ఆర్యకుడు, చందనకుడు, సూతుడు మొదలగువారెవరిగోలలో వారుండి తమ తమ కార్యముల నయముగ నిర్వహించుటలో నధికారిక వృత్తాంతమునకును,

పరిణామ కళ్యాణమునకును, తలవని తలపుగా దోడ్పాటులైరి. చారుదత్తుని మహనీయ సద్గుణములందాదరణయు, బ్రతినాయకుండగు శకారుని వెకిలిచందముల కేవగింపు తప్పవేరొండు సామాన్యసంఘీకరణ సందర్భము లిందున గానుపింపవు. ఆధికారిక వృత్తాంతమున కుపాంగములుగ గాక, దానికి దోడ్పడు నుద్దేశ్యముతోగాక, స్వకీయమనస్సంకల్పముల గొనసాగింపజూచు తెరవున నాచరించుచు నీప్సితార్థముల బడయుచు నిజచరిత్ర విభ్రంశములోకూడ, సదాచార పాతివ్రత్యములో గూడ నుదారస్వభావముల బ్రకటించుకొనుచు నాటక పాత్రలు వేర్వేరు తెరవుల వర్తించి, కాకతాలీయముగ బ్రధానకథాసంతోష సమాప్తికి నిస్సంకల్పముగ దోడ్పడిరి. వసంతసేన బ్రతుకుటకు సంవాహకుని సన్న్యాస మాధారమాయెను. చారుదత్తుడు మరణదండనను తప్పించుకొని, జీవించి, భాగ్యోపేతుడై, క్రమ్మర వెలుగొందుటకు, ఆర్యకుని రాజ్యాధికార సంప్రాప్తి హేతువాయెను. ఇందుకు శార్వలికుడాదిగాగల సంగడీడుల సుహృల్లక్షణములు సహాయభూతములాయెను. ఈ కారణములచే మృచ్ఛకటిక నాటక ప్రపంచములో నెల్ల కల్పనచాతుర్యమందును, కథా పాటవమందును, నిరుపమానమైయున్నది.

## – ప్రదర్శనానుకూల్యత –

శకారునివంటి విపరీతపాత్రము ఎందునను గానరాదు. వాని వెకిలితనము, పిరికితనము, మేకపోతు గాంభీర్యము, కత్తి ఝళిపింపు, నీడల కులికిపాటు, నీచశృంగారము మున్నగు భగినీభగభాగ్యసంభూత వైభవసహజంబులగు దుర్నయ దుర్నీతి ప్రచారములన్నియు నసామాన్యముగ, నసాధారణముగ, నవ్వుబాటుల కునికిపట్టులై, చదివినవారిని జదువనేరని లేత మనస్సులను ప్రక్కలుబ్బ నవ్వింపజేయును. దొంగలొస్తారు, జూదరులొస్తారు, ముండలముతాకోరులొస్తారు, కోర్టుసీను వస్తుంది, వురి దీయడం, వానకురియడం, మేడల మీద నుండి దూకడం, సంకెళ్లు తెంచుకోవడం, కన్నాలు వేయడం, డప్పులు బాదడం, పాడుగుళ్లు, పేదయిళ్లు, రాజభవనాలు, పాతతోటలు, నవ్యానేక సుమాలంకృతంబులగు విహారోద్యానములు, బండ్లు, పోలీసులు, రాజ్యాలు తల్లక్రిందులవడం, వున్నవారికి లేకుండ పోవడం, లేనివారికి రావడం, మైత్రేయుడి ఆవలింపులు, అబ్బో! యివ్వన్ని యెంత చిత్రంగా, యెంత తమాషాగా, కొత్తగా

షోకీగా ఒక్కచోట, ముత్యాలపేరులల్లేరత్నాలు పొదిగినట్లు కూర్చబడ్డాయి. రెప్పవాల్చుటకు, ఆవలించుటకు, కిల్లీ సిగరెట్టులనైన నాస్వాదింప బయటకుపోవుటకు వీలొసంగనికల్పనచాతుర్య మీనాటకమున విలసిల్లి ప్రేక్షకులందరిని మంత్రనిబద్ధ భుజంగంబువలె గట్టి వైచెడి నేర్పు పెంపు లీరూపకమున నగపడు చుండును.

## – పాత్ర స్వభావ వైపరీత్యము –

ఇందలి ప్రధానపాత్రలందరిలో విరోధాభాస మగపడుచుండును. 'దారిద్ర్యదోషో గుణరాసినాశీ' అని పెద్దలు చెప్పుచుండ దరిద్రపీడితుడైన చారుదత్తుడు మంచి తలపుల పుట్టయై మహోదార స్వభావ సంపదలెల్లవేళల దోడ్పడుచుండ గీర్వాణరూపక నాయకులలో నిస్తులధీరుడై వాసికెక్కుచున్నాడు. తనయింట దొంగలుపడి వసంతసేనయాభరణముల దొంగిలింప నీసంగతి తెలిసినచో యామె రత్నాలపేరును స్వీకరింపదనునూహతో జూదములో తాను బోగొట్టుకొంటిననియు ప్రతిఫలముగ రత్నమాలికను గ్రహింపవలెననియు బంపెను. శార్వలకుడు, చతుర్వేదపారంగతుడగు నప్రతిగ్రహితుని పుత్రుడై యొజ్జల గొలిచి యోగాది విద్యలనార్జించి "సషాహసన్తిచరుదన్తిచ విత్తహేతోః విశ్వాసయన్తి పురుషం నతం విశ్వసంతి, తస్మాన్న రేణ కులశీలసమన్వితేన వేశ్యాః శ్మశానసుమనాయిన వర్జనీయాః' మున్నగు ధర్మముల నెరింగియు రండకోసము దొంగతనమూని దానిలో తన యోగమహిమను, చౌర్యక్రియానైపుణ్యమును, వెల్లడించి మదనికాస్వాతంత్ర్య సంపాదనమునకు వలయు ధనమును దొంగిలింప సాహసించెను. ఆపెమీద మోహమింతటి యస్వాభావిక కార్యనియంత్రునిగజేయ సమర్థమైనను యిన్ని చిక్కులబడి మదనికను సంపాదించుకొనినను, మిత్రుని యావద్వృత్తాంతమును వినినంతనే నవవధూసమాగమ సౌఖ్యాలాపముల వర్జించి మిత్రావనదీక్షితుడై నెచ్చలి జేరనరిగెను. చారుదత్తుని కూర్మిచెలికాడు, మైత్రేయుడు, సదుద్దేశములతో, నారని భక్తి ప్రేమలుండియు, తత్తరపాటున నవివేకియై, పెక్కుచిక్కుల దెచ్చి పెట్టుచుండును. వసంతసేన నగలు చోరగ్రస్త మగుటకును, అధికరణుని వద్ద నిస్సంశయమగు సాక్ష్యమును చారుదత్తునకు ప్రతిపక్షముగ గూర్చుటకును, ఈతని యవివేకము అమాయకము, తొందర, ప్రేమాతిశయము కారణమైనవి. శకారుని విటుడు, దుస్సాంగత్య కలుషితుండయ్యును మంచి వివేకి,

పెద్దచిన్నలను, యుక్తాయుక్తము లెరింగి, సదుపదేశముల నొసంగెడివాడు. ఇట్టి విరోధాభాస స్వభావములీనాటకమున గన్పట్టుచున్నవి.

**– కథాంశము –**

ఉజ్జయినీ పురంబున చారుదత్తుడను బ్రాహ్మణుడు దయాస్యాది సద్గుణాలంకృతుడు, వణిగ్వ్యాపారమున నఖండైశ్వర్య మనుభవించినవాడు, అర్థిజనంబుల కల్పవల్లి. కాలవశంబున దొలకరి జల్లుచే సన్నగిల్లిన యంబుదములవలె పేదయై యిడుముల గుడుచుచుండెను. నాటకారంభమున నీతని దారిద్ర్యము, జీర్ణ గృహము, పేదరికమున ననుంగు చెలికాడగు మైత్రేయుడు కూడ ఆనదప్పుటయు జూపబడినవి.

ఆయూరిలో వారాంగనామకుట భూషణంబును, అత్యంత భాగ్యోపేతయు, సుకుమార తన్వంగియునగు వసంతసేన కామోత్సవ సందర్భమందు చారుదత్తుని మనోహరాకృతిని గాంచి వానిగుణముల వీనులలర నాకర్ణించి, బద్ధానురాగయై యుండెను. ఆయూరి రాజు యొక్క యుంపుడుకత్తెతమ్ముడు, శకారుడను వాడు వసంతసేన పొందునపేక్షించి యామెకై దిరుగుచుండెను. వసంతసేన వీని వెకిలి వలపు లంగీకరింపలేదు. మైత్రేయుడు బలి నొసంగబోయెడి నిశాసమయమున వసంతసేన శకారునిచే దరుమబడి చీకటిలో నిజదాసీజనంబులు గానరాకుండిన దత్తరపడుచు దరిగానక భయార్తయై శకారుని దుండగముల నసహ్యించుకొనుచు, తిప్పలు పడుచుండ, శకారుడు నిజస్వభావోచితంబుగ తెలివితక్కువగ నామెకు చారుదత్తుని యిల్లు చూపించును.

వసంతసేన విటశకార సంభాషణాంశముల విని యప్పుడే బలిప్రదానమునకై రదనిక వెంటరా, దలుపు తెరచుకొని మైత్రేయుడు వెలువడ చారుదత్తుని యింటిలోనికి దూరెను. ఈ రంగమున కథాజీజము నెలకొల్పబడినది.

**– జటుడు, శకారుడు –**

విటుడు మృచ్ఛకటిక పాత్రములోనెల్ల సమంజసబుద్ధికిని, కావ్యధోరణికిని, నెంచదగినవాడు. 'రత్నముతో గలియక గాజు రాతితో గలియునా?' యని వసంతసేన కొప్పిదముగ నీతడు పలికిన మాట లీతనిపట్లనే వర్తించుచున్నవి.

వసంతసేన చారుదత్తుని వరించినదని తెలిసినంతనే విటుడామెపై నత్యంత గౌరవమొంది యామెను గావదలచెను. శకారునితో జీకటిరాత్రులందు దుష్టవనితాన్వేషక సంచార మొనర్చువాడయ్యు నొరుల గుణముల దలచి సంతసించు వివేకి. దాని మెచ్చుకొనజాలు గుణజ్ఞుడు. గుణి.

గీ: మండువేసంగిలోన, సమస్త జంతువులకు నీరిచ్చి యెండిన కొలనుపగిది, రిక్తులను బ్రోవనతడు దరిద్రుడయ్యె, గాని యైశ్వర్యమదమునగాదు చూవె." ఇతని ప్రపంచ జ్ఞానమపారము. మర్యాదల విటజనాసాధారణము.

శకార పాత్ర స్వభావము సంపూర్ణముగ జూపబడినది. రాచరికములేని రాచపోకడలు, సంపదలేని డంబము, ధైర్యమొదవని దుడుకుదనము, శీలనిగ్రహము లెరుంగని యధికారము, నిలుకడలేని యుత్సాహము, వలపు జాడలరయని మోహవర్తనము, నీతిలేని తంత్రము, పిరికితనము, క్రౌర్యము, నైచ్యము మున్నగు కాపురుష గుణంబు లన్నియు, రాజనామకుల కుండనోపెడి దుర్గుణంబులన్నియు రాశీభూతమై శకారుని యందవతరించి, హాస్యఖేలనా వైదుష్య సామ్రాజ్యమున జిందులిడినవి.

మూడవరంగమున వసంతసేనా చారుదత్తుల సమావేశమమర్చబడినది. కామదేవాలయములో మొదటిచూపున మొలకెత్తి గుణశ్రవణముచే బల్లవించిన వసంతసేనాప్రణయ ప్రసవంబు లీరంగమున విప్పారి రాగపూరితములై రాజిల్లదొడగెను. సెలవుగైకొని స్వగృహంబున కేగుతరి వసంతసేన దారిలో విటతస్కరాదులవలన మోసముదలంచి తన నగలను చారుదత్తున కొప్పగించి మైత్రేయపురస్కృతయై చనెను.

రెండవ యంకపు మొదటిరంగమున వసంతసేన చెలికత్తెలతో వరగుణనికరంబు నుగ్గడింపుచుండ సంవాహకుడు శరణు శరణిమ్మని భయార్తుడై ప్రవేశించి తాను తొల్లి చారుదత్తునకు సంవాహకుడై యుపచరించినదియు గాలక్రమంబున దుస్సంగతిచే దురోదరానురక్తుడై చెడుదారుల ద్రిమ్మరి సర్వస్వమును గోల్పడి జూదరి సైదోడులచే తన్నులు తిని తరుమబడినయుదంతమును తెలుపుకొనెను. వసంతసేన యాతని బాకీదీర్చి

విడిపించి కృతార్థుని జేసెను. అంత నీతడు దుస్సాంగత్యమును వదలి బౌద్ధాశ్రమము నవలంబించెను.

వసంతసేన వద్ద మదనిక యను దాసి యొకతె కలదు. ఆ కాలమున దాసీలను వెలకు గొనుచుండిరి. క్రయధనమును వాపసుచేసిన గాని దాసికి మరల స్వతంత్రమేర్పడదు. శార్వలికుడను బ్రాహ్మణ యువకుడు మదనికను మోహించి ఆపె సేవాబంధమును విడిపించి యామెతో స్వేచ్ఛోపభోగముల ననుభవింపదలచి దాస్యవిమోచనమునకు వలయుద్రవ్యమన్యథాతేజాలక నెవరింటనైన ముచ్చిలి దాని సంపాదింపబూనెను. ఈతడు రాత్రివేళ చారుదత్తుని ఎరుగడు. ఆ సమయమున చారుదత్తుడింటలేడు. వసంతసేన విడిచివెళ్ళిన ఆభరణములు మైత్రేయుని చేతికి ఒప్పగించి తాను బయటకు వెళ్ళెను. అందుచేత శకారుడు వెంబడించిన ప్రథమాంకకథ సందర్భము మొదలు శార్వలికుడు కన్నము వేసిన కథవరకు జరిగిన వృత్తాంతమంతా ఒక రాత్రిలోనే కడచెనని తలచవచ్చును. లేనియెడల ఆ నగలు మైత్రేయుని యొంటిమీద నుండవు. వసంతసేనను నిజావాసమునకు భద్రముగజేర్చి తిరిగి వచ్చి వెంటనేగాని, యా మరునాటి యుదయమేగాని చారుదత్తుడు న్యాసద్రవ్యములనే పెట్టెలోనో, గోతిలోనో, వీభూది బుట్టలోనో భద్రపరిచియుండును. శార్వలికుడు యిటునటు వెదకులాడుచుండ మైత్రేయుడు తనకొప్పగించిన నగలను జాగ్రత్తగా కాపాడవలెననుతలపు అదే ఆలోచనగ పుర్రెను గదలింపనిద్రలో కలవరించుచు దొంగయే చారుదత్తుడనుకొని నగల నాతనికందించెను. వీటిని పుచ్చుకొని శార్వలికుడు మరునాటి యుదయమో, సాయంత్రమో మదనికను కలసి దాస్యవిమోచనమూల్యమును సంగ్రహించి తెచ్చితినని చూపించెను. ఆమె వెంటనే అవి తన యేలిక తొడవులుగ దెలిసికొని శార్వలికుడు వానిని చారుదత్తునింటనుండి దొంగలించెనని చెప్పును. ఇందు కాతడు మిక్కిలి చింతిల్లి యుత్తర కార్యోపాయముల నడిగెను. ఈ నగలను వసంతసేనవద్దకు దీసికొనిపోయి చారుదత్తుడిమ్మన్నాడని చెప్పి యామె కర్పించమని మదనిక తెరువుజూపెను. చాటుననుండి వసంతసేన వీరి సంభాషణము వినుచుండెను. శార్వలికుడు ప్రియాదిష్టముగ చేసెను. సరసురాలగు వసంతసేన మదనికా శార్వలికుల సత్ప్రవర్తనకు సంతసిల్లి వీరినిర్ధన ప్రణయానుబంధములకు

గరుణించి చమత్కారముగా "ఈ నగలు నెవరిచేపంపెదరో వానికి మదనిక నిచ్చి గారవించెదనని చారుదత్తునితో చెప్పియున్నాను. గాన మదనికను నీవు గైకొను" మని సేవావిముక్తగావించి వారిరువురిని పంపివైచెను. వీరు పోవుచుండగా నార్యకుని బంధించి పాలకభూపాలుడు చెరనుంచెననువార్త శార్వలికునకు వినబడెను. వినినంతనే మదనికపొందు విడిచి మిత్రుడగు నార్యకుని రక్షింపబరుగిడెను.

దొంగతనము జరిగిననాటి రాత్రో, మర్నాడో చారుదత్తుడు మైత్రేయుడొనర్చిన తప్పు తెలిసికొని తన యింట వసంతసేన నగలు పోయినందుకు చింతించి యీ సంగతి నామెకెరుకపరచకుండ జూదములో నగల నోడితిననియు, వానికి బదులీ రత్నాలహారమును గైకొనుమనియు, తన కంఠాభరణమును మైత్రేయుని కిచ్చి యావేశ్యలలామ కందించెను.

కొండొకనాడు వసంతసేన చారుదత్తుని యింటి వద్దకు వచ్చినపుడు రదనిక యొక మనోహరాకారుడగు బాలుని నాడించుచుండెను. ఆ బాలుడు దాసి యొసంగిన మట్టిబండికి (మృచ్ఛకటము) సంతసింపక బంగరుబండి తెమ్మని పట్టుపట్టి యేడ్చుచుండెను. ఈ బాలుని చారుదత్తతనూజునిగ నెరింగి వసంతసేన తన సువర్ణాభరణముల దీసి దాసికిచ్చి యొక బంగరు బండి తెచ్చి పిల్లవానికిచ్చి తనియింపుమని యాజ్ఞాపించెను. ఈ వృత్తాంతము నాటక సంవిధానములో నొక ముఖ్యాంశము కాకున్నను దీనినిబట్టియే యీ ప్రకరణాభిధేయ మేర్పడినది. చారుదత్తునికెప్పుడో కాళ్ళు పిసికిన సంవాహకుని గారవించి ఋణబాధావిముక్తు గావించిన వసంతసేనకు చారుదత్తునిపైగల ప్రేమాభిమానములను ఈ సందర్భమతిశయంబుగ వర్ణింపనేరదు. కాని సామాన్యముగ వేశ్యలు విటజనంబుల సర్వస్వమును పీల్చి పిప్పి చేయుచుందురు. విటులు మహాధనికులను ప్రతీతియున్నచో వారిని మెప్పించు కొరకు వేశ్యలు కొన్నిపట్ల వారి దాసదాసీజనంబులను మన్నించి పారితోషిక మొసంగుచు వారి పిల్లలకు మోదకఫలాదుల బంపు వాడుక కలదు. తాము వెచ్చించిన దానికి పదిమడుంగులు హెచ్చుగ స్వీకరించెడియాశతో నీపని చేయుచుందురు. కాని యీయెడ చారుదత్తుడు నిరుపేదయనియు గ్రమ్మర భాగ్యశాలియగు నాశ లేదనియు వసంతసేన

యెరుంగును. వేశ్య లితరకారణములచే నొక పేదయువకుని జేరదీసి వానితో జిత్తసంభవక్రీడల దేలుచు ద్రవ్యార్జనకు యే సుబ్బిశెట్టినో చేరబెట్టి కాలము గడుపు సందర్భములు తరుచుగ గోచరించును. కాని వసంతసేన యిట్టి మదననివారణోపాయముగ చారుదత్తుని వరించలేదు. కులకాంతలను వెక్కిరించు చిత్తనైర్మల్యముతో సర్వసమర్పితబుద్ధితో నాతని వరించెను. ఇట్టి నిర్మలప్రణయానుబంధమును యీ పట్టు చాటుచున్నది. అందుచేతనే మృచ్ఛకటమును తొలగించి బంగరుబండి నొసంగిన కథాంశమును బట్టి నాటక నామమేర్పరచబడ్డది.

ఇంతలో ఒకనాడు సాయంకాలము చారుదత్తుడు తన పాతబండిలో నెక్కి యచటికో బోవుచుండెను. ఆర్యకుడు శార్వలికాదిసమిత్ర సహాయమున బంధవిముక్తుడై తప్పించుకొని పరారగుచువచ్చి రాజభటులు వెంటదరుమగా తలదాచుకొనుటకు చారుదత్తుని బండిలో ప్రవేశించి శరణు వేడెను. చారుదత్తుడు బండిరెక్కలు మూసి లోన నాడు వారుండినట్లు చెప్పెను. చందనకుడు ఆ బండి చారుదత్తునిదనియు, నందులో ఆడంగులున్నారనియు, దానిని వెదుక గూడదనియు, తక్కుడు రాజోద్యోగుల వారించి నిజ మెరింగియు నార్యకుని యసువుల గాపాడెను. ఆర్యకుడీరీతిగ సురక్షితుడై పాలక భూజాని బారి తప్పించుకొని పోయెను. ఆ కష్ట సమయములో చందన చారుదత్తు లొనర్చిన మేలు మరువలేదు.

శకారుడు తొల్లి కబురంపిన రీతిగ చారుదత్తునెటులయిన భంగపరిచి వసంతసేన పొందు గెలువవలెనని యోజించుచుండెను. ఇట్లుండ దైవవశమున నొకనాటిరేయి వసంతసేన తనయిల్లు వెడలి భర్తృనివాసమున కేగవలసినదై వాన గురియుచున్నందున చారుదత్తుని బండిలో పోవలసి వచ్చెను. ఆ సమయమున బండివాడీ బండిని కొంచెము దూరముగ నిలుపుటయు, వసంతసేన వాకిట ప్రమాదవశమున శకారుని బండి వచ్చి నిలుచుటయు దటస్థించెను. చీకటిలోని మార్పు తెలిసికొనలేక వసంతసేన పొరపాటున దానిలో కెక్కినది. బండివాడు శకారుని జీర్ణోద్యానమునకు దోలుకొనిపోయెను. వీనిపేరు సంస్థానకుడు. జీర్ణోద్యానములో శకారుడు విటసమేతుడై బండికొరకు గాచియుండెను. దానిలో

వసంతసేనను చూచి యామెను దొల్లి దయ్యముగ నెంచి యావల రక్కసిగ దలంచి తుదకు చిరవాంఛితయగు వేశ్యకామినిగ గుర్తించి వలపుచేష్టల నతిశయించి లాతివారలుండిన సిగ్గుపడునని విట సంస్థాపకుల దొలగిపొమ్మని యాజ్ఞాపించి అప్పటికీ వసంతసేన యాతని పొందు నేవగించి దవ్వున బరిభ్రమించుటచే విసిగి యామె గొంతు పిసికి వైచి యొంటిమీద యెండుటాకుల గప్పి నిజగృహంబున కేగెను. సంస్థానకుడు మరుగుపాటున నీయుదంతమెల్ల గాంచుచుండెను. వీనిచే మంత్రబలగము వాటిల్లునని యెంచి శకారుడు తన రథసారధిని బంధించి తన మేడ మీది గోపురాంగణమందుంచెను. ఉంచి వెంటనే నధికారకులయొద్ద చారుదత్తునిపై నగల కొరకు వసంతసేనను జీర్ణోద్యానమునకు మోసగించి తెచ్చి మడియించి నగలపహరించినట్లుగ నేరము మోపి చర్యజరిపెను. చారుదత్తుని రాజసభకు పిలిపించిరి. శకారుడు సాక్షిబలమును గూర్చి నేరారోపణ స్థిరపరచెను. ఇంతలో మైత్రేయుడు చారుదత్తుడు రాజసభకేగెనను వృత్తాంతమారసియాతని నన్వేషించుచునచ్చటకు జేరెను. అంతకుముందు చారుదత్తుడు బంగరుబండికై వసంతసేన బాలకున కొసంగిన యాభరణములను మైత్రేయునకిచ్చి వసంతసేన కీయవలసినదిగ యేర్పరచెను. ఈ నగలను చంకబెట్టుకుని వచ్చుదారిలో రాజసభ జేరి యచ్చటి యన్యా విషాదసందర్భమున కులికిపడి తత్తరపాటున నగలమూటను జారవిడిచెను. చారుదత్తుని నేరమును గూర్చి సంశయించుచుండిన యధికరుణుల కిందుమూలమున నిక్కంపు రుజువేర్పడినది. చారుదత్తుడు డిఫెన్సు పెట్టుకోలేదు. అధికారులు మరణశిక్ష విధించి తలారులకప్పగించిరి. వారు చారుదత్తుని తప్పిదము జాటుచు వీధుల వెంట నేగుతరి శకారమందిర గోపురాంతము నుండి సంస్థానకుడీ యన్యాయ సందర్భమును గాంచి నిక్కమెరుక పరచదలచి సంకెళ్ళుల సడలించుకొని క్రిందికి యురికి తలారుల వెంబడించెను.

ఇంతలో తొల్లి వసంతసేన శరణమొసంగ దురోదర దుర్వ్యాసంగమును వీడి బౌద్ధాశ్రమ మవలంబించి దిరుగుచుండిన సంవాహకుడు విధివశంబున జీర్ణోద్యానములో సంచరించుచు యెండుటాకు ముసుగులో, గురగురలాడుచుండిన జీవుని బొడగాంచి కదలించిజూచి వసంతసేనగ గుర్తించి ప్రత్యుపకార మొనర్చునవకాశ మొదవెనని సంతసించి యోషధీప్రయోగమున బ్రతికించి

వెంటగొని వచ్చుచుండెను. వీరును, దారిలో చారుదత్తుని మరణశిక్ష సంగతి విని దండ స్థానమునకేగిరి. ఇంతలో శార్వలిక చందనకాది మిత్రులతోడ్పాటున నార్యకుడొక పెద్ద తిరుగుబాటు జెలరేపి పాలక భూపాలుని స్థానభ్రష్టుగావించి రాచపీటనెక్కెను. రాజ్యాధికారము గైవశమైనంతనే యార్యకుడు చారుదత్తుని దుస్థితి నెరింగి క్షమాపణసందేశమంపెను. అందరూ కొరతకొయ్యచెంత మూగిరి. కళ్లార చారుదత్తునిచావు జూడదలచి వేడుకతో వచ్చి సంబరపడుచున్న శకారుడు కూడ నచ్చటనే యుండెను. నిజము బయటపడ్డది. ఆర్యకనరపాలుడు చారుదత్తుని విపులైశ్వర్యసంపన్నునిగ జేసెను. వసంతసేన దాదాపు పోయిన యసువుల మరల దెచ్చుకొని నిరాటంకముగ విపులైశ్వర్యవిరాజితుండగు సద్గుణానీకభూషితుండగు మనోహరునితో యథేచ్ఛాసంభోగ సుఖలాలసముందేల గలిగెను. శార్వలికుడు మదనిక గూడి రాజోద్యోగ గౌరవమనుభవించుచు సుఖింపగల్గెను. చందనదాసాది భృత్కటకంబెల్ల నెత్తునడియ నాబాలగోపాల మఖిలసద్భ్రజము నానందమున ముగ్ని యతిశయిల్ల' మృచ్ఛకటికా ప్రదర్శనపు తుదిరంగము ముగియుచున్నది.

## – మోతేవారి ప్రదర్శనములు –

20–9–24 శనివారము రాత్రి ఏలూరులో శ్రీ సీతారామాంజనేయ నాటక సమాజము వారీయాటను తొలుదొల్త బ్రదర్శించిరి. దీనిని బ్రదర్శింప జూడవలెనని యాంధ్రకోవిదులువిళ్ళూరుచుండ, నింతవరకు దీని ప్రాశస్త్యమెరింగి రంగస్థలంబున జూపిన సామాజికులు కానరాకుండిరి. నాట్యకళ పాలిటి కృష్ణరాయలనందగు శ్రీ మోతేనారాయణరావుగా రీ[55]యపూర్వ ప్రాచీన రూపకము నభిమానించి బ్రదర్శింపజేసినందున కెంతయు మెచ్చుచున్నాము. జిడ్డు లింగయ్యగారిని[56], శ్రీరాముల సత్యానందశాస్త్రిగారిని[57] సామాజికులకు నిర్దుష్టమగు శిక్ష నొసంగి

**55. మోతే నారాయణరావుగారు :** ఏలూరులోని శ్రీ సీతారామంజనేయ నాటక సమాజ అధిపతులు. నాటకరంగ పునర్వికాసం కోసం కృషి చేసిన జమీందారు.

**56. జిడ్డు లింగయ్య :** ఏలూరులోని మోతే నారాయణరావుగారి సీతారామాంజనేయ నాటక సమాజంలో దేశికులు.

**57. శ్రీరాముల సచ్చిదానంద శాస్త్రిగారు :** సతీ సావిత్రి నాటక రచయిత. సీతారామాంజనేయ నాటక సమాజంలో నటులకు తరఫీదునిచ్చేవారు.

సర్వాంగసుందరమగు ప్రదర్శన మేర్పరచినందుకును, రంగపరికరాదుల గడుంగడు నేర్పుతో, సమకూర్చినందుకు శ్రీ సీతారామాంజనేయ నాటక సమాజశిల్పకులను బహుభంగుల నుతింపవలసియున్నది. ప్రదర్శనమందు శ్రీ కొచ్చర్లరోట రంగారావుగారు శకారపాత్రమును, లక్ష్మీనారాయణగారు చారుదత్తభూమికను, ఆరణి సత్యనారాయణగారు వసంతసేనగను, పట్టాభి రామయ్యగారు మైత్రేయుడుగను; ఆంజనేయులుగారు విటుడుగను; నేర్పొప్ప నభినయించిరి. ముంజలూరి కృష్ణారావుగారు చందనకద్యూతకారుల భూమికల దాల్చిరి. ఆచార్యులుగారు శార్వలికవేషమును దొడగిరి. తెనాలి రామవిలాససభవారు కన్యాశుల్క ప్రదర్శన మెట్టి నిర్దుష్ట సర్వాంగసామర్థ్యమున రసికోల్లాస ముప్పొంగ నిర్వహించిరో, అట్టి శిక్షా సౌష్టవమును, స్వాభావిక రామణీయకమును, పాత్ర సహకార సౌకర్యమును కళానైపుణ్యమును, మృచ్ఛకటికా ప్రదర్శనమందీ మోతేనటులారబోసిరి. రంగపరికరములు, దుస్తులు, సింహాళ నాట్య మందిరములందువలె చిత్ర సామంజస్య మేపారగూర్చబడినవి: మరల జనవరి 25వ తేదీన గుంటూరు నందీ నాటకమాడజూచితిని. ఇందే నటులు తమ నిర్దిష్ట పాత్రముల నేగతి నిర్వహించిరో వ్యాసక్రమంబున దెలియగలదు.

ఈ కథాసరళిని బట్టి చారుదత్తుడు, శకారుడు, మైత్రేయుడు, విటుడు, శార్వలికుడు, చందనకుడు, సంవాహకుడు, సంస్థానకుడు, రదనిక, మదనిక, వసంతసేన మున్నగు నాటక పాత్రముల స్వభావములు స్పష్టపడును. కథాక్రమము లోని రసవత్సందర్భములు విశదమగును. ఈ ఆటలో బాల్గొను రకరకాల ప్రకృతులు, చూడబడెడి వివిధరంగములు తేటపడును. ఇందే సందర్భమున నెవ్వరేరీతి నభినయించిరో వాగ్రూపమున జదువరియుల్లమలర జిత్రింపజాలము. మోతేవారి నటులు మిక్కిలి పాటుపడి యేవేషమునకు తగిన నటునాభాగమునకు నియమించి సాధనకాలములోనే విద్వద్విమర్శక సహాయము బడసి జాగరూకతతో నభినయించిరని చెప్పగలను. వీరి నటన గుంటూరు ప్రదర్శనములో పరిణత నట సిద్ధిమొందినది. శకారుని పార్టు చాలా పెద్దది. వాని స్వభావము విపరీతమైన వెకిలితనముతో లోకమందెక్కడను గానరాని దుర్గుణసాంకర్య విదూషితమై యసామాన్య హాస్యఖేలనా వైచిత్ర్యమున నుండును. కాని యిట్టిదగుట చేతనే

దాని నభినయించు రీతులను, నియమములను, సంభావింప దరము గాదు. రంగారావుగారు మహాద్భుతముగ నిర్వహించిరి. కాని వీరు దాల్చెడి వేషములన్నిటిలో పాత్ర స్వభావ పరిజ్ఞానము, భావాభినయ సామర్థ్యము విశదమగుచున్నను, కొంతనిగ్రహ మింకను అలవడవలసి యున్నది. నిగ్రహమందే యౌచిత్య పరిగణనందే, సామాన్య జీవితావస్థల పేలవపు పట్టులకు కావ్యనాటకాది సత్కళాలక్షణంబగు సరససాధుత్వములు సిద్ధించుచున్నవి. కళల సౌందర్యమంతయూ నిగ్రహముతో గూడిన స్వభావప్రకటన మందేర్పడుచున్నది. శకార సందర్భములో సరసనిగ్రహ మెట్లుండవలెనో నిర్ణయించజాలము. కాని ఆటంతా చూచి వెనుక ఆంజనేయులుగారి నడక తెరవులందీ కళాసంసిద్ధి యనుభవించినాము. ఆరణి సత్యనారాయణగారు కొన్ని తావుల చిత్రసౌందర్య మేర్పడినపట్టులు చూపియుండిరి. ముఖ్యంగా చారుదత్తునితోడి ప్రథమ సమావేశమందున సంవాహకుని యుదంత మాకర్ణించునపుడును, శకారుడు తరుమ మొన్మొదలుపరుగెత్తి వచ్చునపుడును సందర్భానుకూలముగ ముచ్చటగనాడిరి. కాని వీరి వేషము వసంతసేన యొక్క నవలావణ్యవయో విలాసముల నందకుండెను. జూదరుల భాగము నాకు రుచించలేదు. ఇందు కనకయ్యగారొక్కరే కొంత గురజపోకడలు చూపినారు. కాని తక్కుడుద్యూతకారులు స్వభావచమత్కారముతో వర్తించలేదు. మొత్తము మీద మోతేవారు మృచ్ఛకటికా ప్రదర్శనమందు వన్నెగనిరనియే చెప్పవచ్చును. తెలుగురంగాన నీక్రొత్త రూపకమును ప్రవేశపెట్టి రసికజనంబుల కృతజ్ఞతకు పాత్రులైనారు. గీర్వాణ నాటకములలో మిగుల ప్రదర్శనీయమై బయల్పరచు విజ్ఞులు లేక గుందుచుండిన మృచ్ఛకటికా ప్రకరణ మీనాడు సీతారామాంజనేయ సామాజికుల రసికోత్సాహముచే వీధుల నెక్కినది. రత్నావళీ మాలతీ మాధవము మున్నగు ప్రశస్తగీర్వాణ నాటకములు మరికొన్ని చక్కగా నాంధ్రీకరిపంబడినవి కలవు. వాటిని గూడ సత్వరముగ గద్దెకెక్కించి యపూర్వనాట్య సేవా ప్రసిద్ధులై మోతేవారు చెన్నారనీశ్వరుడనుగ్రహించుగాక!

☸



స్వాతంత్ర్యోద్యమంలో తోటి సహచరులతో సూరిశాస్త్రిగారు (మధ్యలో కూర్చున్నవారు)

*Nātyāmbujam* and *Nātya Asōkam* : a compilation of Sri Puranam Suri Sastry's critical works on early Telugu theatre, edited with notes and introduction by Prof. **M. Nagabhushana Sarma**

---



తెలుగు నాటకరంగ తొలి చరిత్రకారుడు **పురాణం సూరిశాస్త్రి**. విస్తృత ప్రాచ్య, పాశ్చాత్య నాటక సాహిత్య పరిచయం, విజ్ఞాన శాస్త్ర అధ్యయనం నేర్పిన విశ్లేషణా పద్ధతుల అవగాహన, కళాపారమ్యం ఎరిగిన విచక్షణశీలత – ఈ లక్షణాలు ప్రాతిపదికగా శాస్త్రిగారు ఆరు విమర్శనా సమీక్షా గ్రంథాలను రచించారు. అందులో రెండు గ్రంథాలు – "నాట్యాంబుజము", "నాట్య అశోకము" – తెలుగు నాటక విమర్శకు మార్గదర్శకాలైన తొలి రచనలు. ఆ రెండింటిలోను 1890–1923 మధ్యకాలంలోని తెలుగు నాటకాలు, నటులు, సమాజాలను గురించిన విస్తృత చర్చ, తులనాత్మక పరిశీలన కనిపిస్తాయి. ఈనాటి నాటకాభిమానులకు ఒకనాటి తెలుగు నటులను, రచయితలను, నాటకాలను గురించి విమర్శనాత్మకంగా వివరిస్తాయి. సమకాలీనమైన తాత్కాలిక వాదోపవాదులను పరిహరించి, అవసరమైన చోట్ల అథోసూచికలను, వివరణలను చేర్చిన ఈ రెండు గ్రంథాల సంస్కరణప్రతి నాటక విద్యార్థులకు, విమర్శకులకు, అధ్యాపకులకు, నాటకాభిమానులకు స్ఫూర్తినిస్తుందని మా ఆశ.



ఈ నాటక గ్రంథాల సంపాదకులు **ఆచార్య మొదలి నాగభూషణ శర్మ**. నాటక రచయితగా, విమర్శకునిగా, దర్శకునిగా, అధ్యాపకునిగా లబ్ధప్రతిష్ఠులు. ఉస్మానియా, కేంద్ర విశ్వవిద్యాలయాలలో నాటక విభాగ అధిపతిగా పనిచేశారు. ఆంగ్లంలో 15 గ్రంథాలను, తెలుగులో 20 గ్రంథాలను రచించడమే కాక, సంస్కృత, భారతీయభాషా, పాశ్చాత్యభాషా నాటకాలను అనువదించి దర్శకత్వం వహించారు. "ప్రజానాయకుడు ప్రకాశం", "అనగనగా ఒక రాజు", "కాయితం పులి" వంటి ఉత్తమ నాటకాలను ఆంధ్రదేశంలోనే కాక భారతదేశంలోని పలు పట్టణాలలో ప్రదర్శించారు. తెలుగు వారి జానపద కళారూపాలమీద విస్తృత క్షేత్ర పరిశోధన చేసి పలు గ్రంథాలను వెలయించారు. భారతీయ శాస్త్రీయ నృత్యరీతులను వివేచించి, సమీక్షించే "నర్తనం" అనే ఆంగ్ల త్రైమాసిక పత్రికకు సంపాదకులు. భారతీయ నాటక, నృత్య, జానపద కళలకు సంబంధించిన పలు జాతీయ సంస్థలలో సభ్యులు.

---

**A Kalatapasvi Creations'** Publication, 2011 వెల: రూ. 200/-